# రాయప్రోలువారి
# రచనల పరిశీలన - తత్త్వవివేచన

యం. లావణ్యా సరస్వతి,
M.A; M.Phil.

పర్యవేక్షకులు :
ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు,
M.A, Ph.D.
తెలుగు శాఖాధ్యక్షులు,
హైదరాబాదు విశ్వవిద్యాలయము

హైదరాబాదు విశ్వవిద్యాలయమువారి Ph. D. డిగ్రీకై
సమర్పించిన సిద్ధాంతవ్యాసము

జూన్, 1982

# D E C L A R A T I O N

I, M. Lavanya Saraswathi declare that this thesis entitled 'A critical study of Rayaprolu's works and his philosophical outlook' (రాయప్రోలువారి రచనలు పరిశీలన – తత్త్వవివేచన ) is prepared by me on the basis of my own independent research work done under the guidance of Professor K. Veerabhadra Rao, Head, Department of Telugu, University of Hyderabad and that this thesis has not previously formed the basis for the award of any other degree or diploma to me.

Date:

M. Lavanya Saraswathi

(M. LAVANYA SARASWATHI) 5.7.82

# CERTIFICATE

Dr. K. VEERABHADRA RAO,
M.A, Ph.D,
Professor & Head,
Department of Telugu,
University of Hyderabad.

Date: 7-7-1982

This is to certify that this thesis entitled 'A critical study of Rayaprolu's works and his philosophical outlook' (రాయప్రోలువారి రచనల పరిశీలన - తత్త్వదర్శన) submitted for the award of Ph.D degree is a record of research work done by M. Lavanya Saraswathi during the period of her study as a research student under my supervision.

K. Veerabhadra Rao.

RESEARCH SUPERVISOR



తమ ౯౧వ జన్మదినోత్సవంలో
ఆచార్య రాయప్రోలు సుబ్బారావు గారు.

శ్రీ బాపుకి,
అలా కృష్ణ, నిజంగా
లోకప్రసిద్ధ సత్కవికి
ఆశీః ప్రసాదం.

తనుల నెంత రాయనను
చూడని గానుమనన్న
హృది నీళ్ళ లేని మల్లె
మనసు [illegible]
[illegible]
[illegible]

[illegible]
10-7-1981

# ముందుమాట

ఈ సిద్ధాంతవ్యాసంలో రాయప్రోలువారి కావ్యపరిశీలనతోపాటుగా వారి తాత్త్వికదర్శనాన్ని వివేచించే ప్రయత్నం చేశాను. పరిశోధనా ప్రణాళికలో అనువాదరచనలను చేర్చలేదు. కాని ఇంగ్లీషు మూలాన్ని అనుసరించిన 'లలిత', 'అనుమతి' కావ్యాలకు ప్రణాళికాబద్ధమైన వీరి రచనలలో ప్రత్యేక స్థానం ఉండడంవల్ల వాటిని గ్రహించాను. వారి తత్త్వప్రతిపాదన దృష్ట్యా రూపనవనీత నాటకానికి విశిష్టస్థానం ఉంది. ఇదేకాక కావ్యపరిశీలన అన్నపుడు దృశ్య, శ్రవ్య కావ్యాలు రెండూ చేరే అవకాశం ఉంది కనుక రూపనవనీతాన్ని కూడా ఇతరకావ్యాలతో సమంగా పరిశీలించడం జరిగింది.

సుబ్బారావుగారి కావ్యాలను పరిశీలించినపుడు కొత్తదనం, తెలుగుదనం ప్రస్ఫుటంగా కనిపించే లక్షణాలు. అందువల్ల 'కావ్యపరిశీలన' విభాగంలో ఆ రెండు లక్షణాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది.

ఉక్తివైచిత్ర్యాన్ని గూర్చి చెప్పిన సందర్భంలో వ్యాసపరిమాణానికి అంతరాయం అన్న అనుమానంవల్ల విశిష్టప్రయోగాల ఉదాహరణలను కొన్నింటిని మాత్రమే చూపాను. వెకటను మిక్కిలిగా ఉన్న ఆ ప్రయోగాలను ఒకటవ అనుబంధంలో చేర్చాను. ఈ విధంగా ఇది కావ్యపరిశీలనను సంబంధించిన అనుబంధం కాగా రెండవ అనుబంధం వీరి తత్త్వవివేచనను సంబంధించింది.

రాయప్రోలువారి తత్త్వచింతనను గూర్చి కొందరు పెద్దలను కలుసుకుని ప్రశ్నించడం జరిగింది. వారి రచనావిధానాన్ని గూర్చి చాలా సాహిత్యవ్యాసాలు వెలువడ్డాయి కనుక పరిచితులను ప్రశ్నించే

ఒప్పుడు ఎక్కువ భాగం తాత్త్విక విషయాలకు ప్రాధాన్యం ఇవ్వబడ్డది. విషయం సమగ్రంగా ఉండటం కోసం వివిధ రంగాల వారిని ముఖాముఖి కలిసి అభిప్రాయాలు సేకరించాను. వీరిలో సన్నిహితంగా మెలగిన స్నేహితులు, సమీప బంధువులు, పరిచితులు, పండితులు, విమర్శకులు, తరువాత కాలపు కవులు, వీరి సాహిత్యంలో మాత్రమే పరిచయం ఉన్న వ్యక్తులు - ఇలా అన్ని రకాల వారిని ఈ పరిధిలో చేర్చడం జరిగింది. వీరి అభిప్రాయాలలో ఉపకరించిన భాగాలను ఉల్లేఖనాల రూపంలో వ్యాసంలో ఉపయోగించాను. వారి భావాల సారాంశాన్ని సంక్షిప్తంగా రెండవ అనుబంధంలో ఇచ్చాను.

వ్యాసరచనలో వ్యావహారిక భాష ఉపయోగించాను. ఒకసారి ఉల్లేఖించిన పద్యం, లేక విషయం దాని ప్రాధాన్యాన్నిబట్టి, పరిశీలించే దృష్టి వైవిధ్యాన్నిబట్టి దాన్నిచోట్ల తిరిగి, తిరిగి ఉల్లేఖించక తప్పలేదు. 'తరువాత కవులపై రాయప్రోలు వారి ప్రభావం' విస్తృతంగా చెప్పదగ్గ విషయం - అయితే పరిశోధనా పరిధిని దృష్టిలో పెట్టుకుని సందర్భానికి తగిన విధంగా దానిని చాలా క్లుప్తంగా ముగించవలసివచ్చింది.

అధస్సూచికలలో గ్రంథం లేక వ్యాసం పేరు, గ్రంథకర్త లేక వ్యాసరచయిత పేరు మాత్రమే ఇవ్వబడ్డాయి. రచయితల పేర్లకు ముందు వెనుకల డిగ్రీలు, బిరుదులు, గౌరవవాచక పదాలు చేర్చలేదు.

సిద్ధాంత వ్యాసంలో ఉల్లేఖించిన ఆధునిక కవుల కావ్యాల పేర్లు మాత్రమే 'ఉపకరించిన గ్రంథాలు' సూచికలో ఇవ్వడం జరిగింది. ఇతర కావ్యాల పేర్లు ఇవ్వలేదు. పరిశీలించిన సంస్కృత గ్రంథాలు అతిప్రసిద్ధాలు కావడం వల్లా, అవి ఎన్నో వ్యాఖ్యానాలలో చాలామార్లు అనేకులచే ప్రచురింపబడడం వల్ల, కేవలం గ్రంథనామం, గ్రంథకర్త పేరు మాత్రమే సూచికలో ఇచ్చాను.

నా పరిశోధనా కృషి వెనుక ఎందరిలో సహకార ప్రోత్సాహాలు అండగా నిలిచాయి. వారికి కృతజ్ఞతలు తెలియచేయటం నా కర్తవ్యం.

నాకు ఈ పరిశోధనకు అవకాశాన్నిచ్చి సహకరించిన తెలుగుశాఖాధ్యక్షులు, నా పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు గారు ప్రాతఃస్మరణీయులు. ఈ వ్యాసం లోని మెరుపు వంటి ప్రతిభావం వెనుక వారి భావస్ఫూర్తి అదృశ్యంగా ఉంది. వారి సహాయం మాటలకందనిది. తమ అమూల్యమైన కాలాన్నెంతో వెచ్చించి ఈ వ్యాసరచనలో నా సందేహాలను తీర్చి, నాకెన్నో సలహాలనిచ్చి సహకరించిన ప్రేమమూర్తులైన మా గురువర్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

నన్ను కుమార్తెగా ఆప్యాయతతో ఆదరించి, నాతో సహకరించి వార్ధక్యాన్ని లెక్కచేయక గంటల తరబడి నాకు విషయవివరణ చేసిన శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారికి ప్రత్యేకంగా నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈ అక్షరరూపంగా వారికి పాదాభివందనాలర్పిస్తున్నాను. ఆప్యాయతానురాగాలను పంచిన శ్రీమతి రాయప్రోలు వరలక్ష్మమ్మగారికి నమస్కారాలు.

ఏవేళలో నేను వెళ్ళినా నాతో సంపూర్ణంగా సహకరించి నాకు ప్రోత్సాహమందించిన శ్రీమతి కొత్తపల్లి లలితగారికి (రాయప్రోలు సుబ్బారావు గారి రెండవ కుమార్తె) నా కృతజ్ఞతాభివందనాలు.

సమావేశానికి అవకాశానిచ్చి 'ప్రశ్నావళి'కి ఓపికతో సమాధానాలిచ్చిన పెద్దలకు, నేను హఠాత్తుగా వెళ్ళినా ఓర్పుతో ప్రశ్నలకు సమాధానాలిచ్చిన వృద్ధులకు నా కృతజ్ఞతలు.

అప్పుడప్పుడు చిన్న చిన్న చర్చలలో తమ సునిశిత విమర్శనా దృష్టితో నా భావాలు స్పష్టపడేందుకు సహకరించిన డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం

గారికి కృతజ్ఞతలు. నాకు సహాయపడిన డా॥ పి. ఆనందారామం గారికి కృతజ్ఞతలు.

మేలుప్రతిని వ్రాసి ఇచ్చిన శ్రీ M. హనుమంతరావు గారికి కృతజ్ఞతాభివందనాలు. శీర్షికలు చిత్రించి ఇచ్చిన చి॥ M. అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు

నావల్ల కలిగిన ఇబ్బందులు లెక్కచేయక నా పరిశోధనా వ్యాసంగంలో నాతో సంపూర్ణంగా సహకరించిన నా కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు

అవకాశాన్నిచ్చిన కేంద్రవిశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధికారులకు; ఆర్థికసహాయాన్నందించిన University Grants commission అధికారులకు; పుస్తకాలను పోస్టులో పంపి సహకరించిన వేటపాలెం సారస్వతనికేతనం అధికారులకు; సహాయం చేసిన ఇతర లైబ్రరీల అధికారులకు; ప్రోత్సహించిన మిత్రులకు, సన్నిహితులకు, బంధువులకు కృతజ్ఞతలు.

# విషయసంగ్రహం

## పూర్వరంగం

1 **తెలుగు కవిత తత్త్వచింతన:**

A **ప్రాచీనాంధ్రసాహిత్యంలో తత్త్వచింతన.**

ప్రాచీనాంధ్రకవిత్వంలో మతపరమైన తత్త్వచింతన ప్రతిబింబించిన విధానం - నన్నయ భారతాంధ్రీకరణ, వైదికమత పునరుద్ధరణ - వీరశైవతత్త్వం - లింగధారణ - షట్‌స్థలజ్ఞానం - వీరశైవసాహిత్యం - మతకల్లోలాలు - తిక్కన హరిహరనాథ తత్త్వప్రతిపాదన - వైష్ణవసాహిత్యం - రాయల యుగంలో వైష్ణవ సాహిత్యపోషణ - తాళ్ళపాక కవుల సాహిత్యం - వేమన, పోతులూరి సాహిత్యాలలో తాత్త్వికదర్శనం - ముస్లిం ప్రభువుల తెలుగుసాహిత్యపోషణ - ఆంధ్రసాహిత్యంలో క్రైస్తవమత తాత్త్విక దర్శనం - ప్రాచీనాంధ్రకవిత్వంలో వైదిక సంస్కృతీ సంప్రదాయాలు.

B **ఆధునికాంధ్ర సాహిత్యంలో తత్త్వచింతన:**

తెలుగులో వెలువడిన బౌద్ధసాహిత్యం - ఆంధ్రసాహిత్యం, ఇస్లాం తత్త్వం - తెలుగు సాహిత్యంలో నాస్తికభావాలు - సర్వమానవసమానత్వం, ఆధునికుల దృష్టి - కుల, మత, వర్ణవ్యవస్థలు, ఆధునికుల దృక్పథం.

2 **ఆధునికాంధ్రకవుల తత్త్వచింతనపై ప్రభావాలు:**

A 19వ శతాబ్దిలోని సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు:

ఇంగ్లీషు విద్యావిధానం ప్రవేశపెట్టడం - ఇంగ్లీషు ఉద్యోగులలో సాన్నిహిత్యం - అవ్యవహితపూర్వకాలంలో తెలుగు సాహిత్యం - సాంఘిక, రాజకీయ, మత పరిస్థితుల వల్ల కలిగిన మార్పులు.

B **ఇంగ్లీషు కాల్పనిక కవితోద్యమం:**

పోప్ యుగపు సాహిత్యలక్షణాలు - ఇంగ్లీషుభాషలో రొమాంటిక్

(Romantic) అన్న పదానికున్న అర్థచ్ఛాయలు - కాల్పనిక కవిత్వ లక్షణాలు - ప్రకృతి ప్రీతి - ప్రణయతత్త్వం - అద్భుతత్వం - నవవైభవ పునరుద్ధరణ - సాహస ప్రియత్వం - ఆత్మాశ్రయత్వం.

3 భావకవిత్వం:

భావకవిత్వ పర్యాయపదాలు - నిర్వచనం - భావకవిత్వలక్షణాలు - ఖండ కావ్య ప్రక్రియ - వస్తువు - శైలి - ఆత్మాశ్రయత్వం - భావకవిత్వ శాఖలు భావకవిత్వయుగంలో రాయప్రోలు వారి స్థానం - యుగకర్త - ఇతరకవులపై రాయప్రోలు వారి ప్రభావం - సభ్య శృంగార వర్ణనలపై ప్రభావం - అమలిన శృంగార సిద్ధాంతం - శృంగారాన్ని గూర్చిన ఆలోచనలను ఇచ్చిన ప్రేరణ - ఏకవీర, తృణకంకణాల సామ్యం.

కావ్య పరిశీలన.

4 రాయప్రోలు వారి దృష్టిలో కవిత్వతత్త్వం:

'నవ్యాంధ్ర సాహిత్య వీధి' - ఇంగ్లీషు లిరికల్ పొయిట్రీ ఇచ్చిన ప్రేరణ - ప్రాచీన భారతీయాలంకారికుల ప్రభావం - రమ్యాలోకము; 'నవ్యకవుల మేనిఫెస్టో' - కవి సామర్థ్యం - శబ్దానికున్న అర్థశక్తి - వ్యంగ్యార్థ ప్రాముఖ్యం - భాషా సారళ్యం - శ్రవణ సుభగత్వం - ఆనందోత్సాహాలను కలిగించే వస్తువు - కరుణ, శృంగారాలు రెండే ప్రధాన రసాలు - విప్రలంభ శృంగారం ఆదరణీయం - కావ్యంలో ఆనంద ప్రాధాన్యం.

5. సామాజిక దృక్పథం:

తెనుగు తోటలో ధ్వన్యాత్మకమైన ప్రబోధం - స్నేహలతలో వరకట్న దురాచార స్వరూపం - కులమత ద్వేష వైముఖ్యం - అంటరానితనం - ధనవ్యామోహం, అవినీతి, లంచగొండితనం, - ఆంధ్రదేశ సమైక్యభావం - ప్రజలందరికీ తిండి, బట్ట, జ్ఞానం - ఆశావత్త్వం - శుభం శుభానికి

కారణం - ఉత్సాహం మహోన్నతికి సోపానం.

6 <u>రచనా వైశిష్ట్యం - ఉక్తి వైచిత్ర్యం.</u>

వస్తువు - కావ్యనామాలు - పాత్రల పేర్లు - విషాదారంభం - ధ్వన్యాత్మక పూర్వకవి స్తుతి - పద్యపాద పునరుక్తి - భావాభివ్యక్తి - ప్రాచీన భావాలకు నవ్యతా స్ఫూర్తి - ఒక భావవ్యక్తీకరణ పదబంధాలకు ఇతర భావాభివ్యక్తిలో ప్రయోగం - చింత సూచక శబ్దప్రయోగం - నవ్యభావనారీతి - వాత్సల్య స్ఫోరక ప్రయోగాలు - ఉపమాన వైశిష్ట్యం - ఉపమాన ప్రాధాన్య ఉపమేయ లోపం - కావ్యభాష - విశిష్ట పదబంధాలు - వైదిక పదాలు - ఆనంద, అమృత శబ్ద వైశిష్ట్యం - ఛందో వైశిష్ట్యం - భజగోవింద శ్లోకపు ఒరవడి - వియోగినీ వృత్త ప్రయోగం - సంప్రదాయ ఛందోరీతులలో రాయప్రోలు వారు చూపిన ప్రత్యేకత - మాత్రా ఛందస్సు.

7 <u>తెలుగుదనం</u>

తెలుగు భాషాభిమానం - తెలుగుదేశ ప్రకృతివర్ణన - గృహ పరిసరాలు - గ్రామవాసుల ఆలోచనా విధానం - జీవన విధానం - కట్టు బొట్టు - ఆభరణాలు - ఆటపాటలు - పండుగలు - సంక్రాంతి - తద్దె పండుగ వేడుకలు - వరలక్ష్మీ, గౌరీ పూజలు - నోములు - ఆహారపు అలవాట్లు - తెలుగు రాష్ట్రాభిమానం - ఆంధ్రుల గతవైభవం - యశోగానం.

## తత్త్వవివేచన

8 <u>రాయప్రోలు వారి తత్త్వచింతనపై ప్రభావాలు</u>

A <u>వైదిక వాఙ్మయ ప్రభావం:</u>

వేదోపనిషత్ అభిమానం - పరబ్రహ్మ తత్త్వం - ఆనందస్వరూపం - ఆనంద ప్రాధాన్యం - అగ్ని ప్రాముఖ్యం - ఓంకార పావిత్ర్యం - జన్మ కర్మ సంప్రదాయం - ధేను దైవత్వం - శివశక్తుల సమ్మేళనం - స్త్రీ పుంస యోగం

B <u>ప్రాచీన కవుల ప్రభావం</u>:

వాల్మీకి రామాయణాభిమానం - భవభూతి ఉత్తరరామచరిత - సుమానుష ప్రేమ - స్నేహ ప్రాముఖ్యం - సౌందర్యవర్ణన - కాళిదాసుపై అభిమానం - రఘువంశంలోని అజవిలాపఘట్ట ప్రభావం - అనుభూతి ప్రాధాన్య వర్ణనా విధానం - పద్యపు ఎత్తుగడ - వాగర్థప్రణయం - నన్నయ స్త్రీపుంస యోగసృష్టి - అక్షరరమ్యత.

C <u>వ్యక్తుల ప్రభావం</u>:

I <u>పినతల్లి</u>: ఆలోచనా విధానానికి ప్రేరణ - వస్తు నిర్ణయం - రచనల్లో పినతల్లి సృష్టి.

II <u>మేనమామ</u>: పాండిత్యసురుచి - ఆశుకవితా ధారణకు ప్రోత్సాహం

III <u>రవీంద్రుడు</u>: రవీంద్రుని పట్ల ఆకర్షణ - భావసామ్యం - దేశభక్తి గేయాలకు ప్రోత్సాహం - రవీంద్రగీతాల అనువాదం - గీతాంజలి ప్రభావం - రవీంద్రునిపై గౌరవాభిమానాలు.

IV <u>శ్రీ అరవిందులు</u>: శ్రీ అరవిందుల సందర్శనం - మహాయోగిగా అరవిందులపై గౌరవం - భావసామ్యం - మాతృవాత్సల్య ప్రాధాన్యానికి ఆధ్యాత్మిక ఆధారం - మహాశక్తి స్వరూపం - దివ్యమాత ప్రాశస్త్యం - భరతమాతలో జగన్మాత.

V <u>ఇతర పరిచితులు</u>: తిరుపతి వేంకటకవులు - అవధాన పద్యాలు - చెళ్ళపిళ్ళ వారిపై గౌరవం - వారి ఆశీర్వాదం - చిలుకూరి వీరభద్రరావు - అత్తిలి సూర్యనారాయణ - కం.టి లక్ష్మన్న పంతులు - కొమ్మరాజు లక్ష్మణరావు శాంతినికేతనంలో మేధావుల సాన్నిహిత్యం - దుగ్గిరాల గోపాలకృష్ణయ్య - కట్టమంచి రామలింగారెడ్డి.

9 <u>కర్మ - జన్మ సిద్ధాంతాలు</u>

జన్మ భగవదనుగ్రహం - మానవ సంస్కృతి బహుజన్మ పుణ్యఫలం - పాపపుణ్య విశ్వాసం - విధి బలీయం - ఆత్మ శాశ్వతం - పునర్జన్మ నమ్మకం - 'భావ స్థిరాణి జననాంతర సౌహృదాని' - వైదిక కర్మల ప్రస్తావన - అర్ఘ్యం - సంధ్యా వందనం - ఆచమనం - నిహారోదకం - మంగళస్నానం - దేవపూజ - ప్రాతః స్తోత్రం - పాద్యం - స్త్రీల వ్రతాలు - పేరంటాలు.

10 <u>భగవత్తత్త్వం:</u>

A <u>రాయప్రోలు వారి దృష్టిలో అద్వైతం:</u>

పరతత్త్వం అందనిది - ప్రకృతి సన్నిహిత లక్ష్యం - భవబంధ విముక్తి కంటె ప్రేమ బంధం ప్రధానం - కవికి ఆస్తికునికి కయ్యం - కళాస్రష్టలకు ద్వైతం - పరతత్త్వ మీమాంస అప్రధానం - ప్రేమయోగ దర్శనం ప్రధానం.

B <u>భక్తిమార్గం:</u>

జ్ఞానమార్గం శూన్యమార్గం - 'భక్తిరేవ గరీయసీ.'

C <u>సగుణారాధన తత్త్వం:</u>

దేవతా ప్రస్తావన - సరస్వతీ స్తుతి - ఈశ్వరుడు - బుద్ధుడు - శ్రీకృష్ణుడు - రాధ - కాలదేవత.

D <u>దేవీతత్త్వం</u>

దేవీ ప్రాశస్త్యం - దేవీపూజా విధానం - వాక్-శక్తి - పృథివి, ఓంకార ప్రాశస్త్యం - ఆదిశక్తి ప్రాముఖ్యం.

E <u>ప్రకృత్యారాధనా తత్త్వం</u>

ప్రకృతి ముఖంగా భగవదారాధన - ఆదిశక్తి; ప్రకృతి - 'తండ్రి జాడ తెలియ దానికి తల్లి తానగు.'

F  <u>దేశభక్తిలో ఆధ్యాత్మిక చింతన:</u>

'వందేమాతరం'- ఇష్టదేవతగా దేశసంకీర్తనం - దేశభక్తి గేయాలలో భాషా మాధుర్య సారళ్యాల వెనుక పవిత్రభావాలు - దేశం మట్టికాదు మంగళ దేవత.

11  <u>స్త్రీతత్త్వవర్ణనం:</u>

A  రాయప్రోలువారి తాత్త్విక దృక్పథంలో స్త్రీ:

గృహిణిగా స్త్రీ గౌరవం - ప్రబంధ, క్షీణప్రబంధ యుగాల సాహిత్యంలో స్త్రీ వర్ణన - స్వరూపవర్ణనను స్వభావవర్ణనగా రాయప్రోలువారు చేసినమార్పు.

B  <u>స్త్రీగుణవర్ణన:</u>

'లలిత' లో స్తుతి - తృణకంకణ నాయిక ప్రేమార్ద్రహృదయం - వకుళమాల మిత్రానభిద్రోహం - స్నేహశీలి స్నేహలత - వాత్సల్యవతి స్వప్నసుందరి - స్త్రీలోని కారుణ్యం - వివేకం - త్యాగశీలత - విధినిర్వహణలో గృహిణి. ప్రేయసి ఆరాధన - స్త్రీహృదయం కళానిలయం.

C  <u>స్త్రీసౌందర్యవర్ణన:</u>

ప్రబంధాలలో స్త్రీసౌందర్యం - రాయప్రోలువారి కావ్యనాయిక సహజ సౌందర్యం - నాయికపట్ల సానుభూతికై స్వరూపవర్ణన - సద్భావావరణంలో సౌందర్యవర్ణన - సజీవచైతన్యం.

12  <u>అమలినశృంగారతత్త్వం:</u>

A  <u>వైష్ణవసంప్రదాయంలో భక్తి</u>

భక్తిరసవిభాగాలు - ముఖ్యభక్తిరసాలు - గౌణభక్తిరసాలు - ముఖ్యభక్తిరసాల అంతర్భాగాలు - మధురభక్తివైశిష్ట్యం - ఆండాళ్ - మీరాబాయి - అక్కమహాదేవిలోని మధురభక్తి - వైష్ణవభక్తి, అమలినశృంగారాల సామ్యం.

B ప్లేటో (Plato) ప్రతిపాదించిన ప్రేమతత్త్వం:

సిద్ధాంత ప్రతిపాదన - రాయప్రోలు, ప్లేటో ఆలోచనా విధానంలో వైరుధ్యం- సిద్ధాంత ప్రయోజనాలలో భేదం - వివాహవ్యవస్థ - పిల్లల పెంపకం - స్త్రీ గౌరవం - స్త్రీ పురుషుల స్నేహం - సౌందర్యారాధన - ప్రేమభావనలలో భిన్నత్వం.

C అమలిన శృంగార సిద్ధాంతం:

I శృంగారశబ్ద విస్తృతి - శృంగారం, ప్రేమ సమానార్థకాలు - ప్రేమయొక్క కల్పనం - రతి స్వరూపం - స్నేహస్వభావం - వాత్సల్యమాధుర్యం - 'అమలిన' విశేషణ సార్థక్యం.

II రచనలలో వాత్సల్య చిత్రణ

III స్నేహ చిత్రణ

IV దాంపత్య చిత్రణ

V స్వీకరించిన ఇతివృత్తాలలో ప్రేమ సమస్యలు

13 సింహావలోకనం:

## విషయసూచిక

### పూర్వరంగం


1 తెలుగు కవిత తత్త్వచింతన ........................ 1-21

ప్రాచీనాంధ్రసాహిత్యంలో తత్త్వచింతన ........................ 1

ఆధునికాంధ్రసాహిత్యంలో తత్త్వచింతన ........................ 17

2 ఆధునికాంధ్రకవుల తత్త్వచింతనపై ప్రభావాలు ........................ 22-48

19వ శతాబ్ది సామాజిక సాంస్కృతిక పరిస్థితులు ........................ 22

ఇంగ్లీషు కాల్పనిక కవిత్వోద్యమం ........................ 32

3 భావకవిత్వం ........................ 49-86

నిర్వచనం ........................ 49

భావకవిత్వలక్షణాలు ........................ 53

భావకవిత్వశాఖలు ........................ 61

భావకవిత్వయుగంలో రాయప్రోలువారి స్థానం ........................ 81

తరువాత కవులపై రాయప్రోలువారి ప్రభావం ........................ 82


### కావ్యపరిశీలన


4 రాయప్రోలువారి దృష్టిలో కవిత్వతత్త్వం ........................ 87

5 సామాజిక దృక్పథం ........................ 107

6 రచనావైశిష్ట్యం - ఉక్తివైచిత్ర్యం ........................ 124

7 తెలుగుదనం ........................ 161


### తత్త్వవివేచన


8 రాయప్రోలువారి తత్త్వచింతనపై ప్రభావాలు ........................ 185-241

వైదికవాఙ్మయ ప్రభావం ........................ 185

ప్రాచీనసాహిత్య ప్రభావం ........................ 200

వ్యక్తుల ప్రభావం ........ 209

పినతల్లి ........ 209

మేనమామ ........ 213

రవీంద్రుడు ........ 215

శ్రీ అరవిందులు ........ 223

ఇతర పరిచితులు ........ 229

9 కర్మ - జన్మ సిద్ధాంతాలు ........ 242-258

వైదికకర్మల ప్రస్తావన ........ 250

10 భగవత్తత్త్వం ........ 259-292

రాయప్రోలు వారి దృష్టిలో అద్వైతం ........ 259

భక్తిమార్గం - రాయప్రోలు వారి దృష్టి ........ 264

సగుణారాధన తత్త్వం ........ 266

దేవతా ప్రస్తావన ........ 266

దేవీ ప్రాధాన్యం ........ 270

ప్రకృత్యారాధనా తత్త్వం ........ 278

దేశభక్తిలో ఆధ్యాత్మిక చింతన ........ 286

11 స్త్రీతత్త్వదర్శనం ........ 293-333

రాయప్రోలు వారి తాత్త్విక దృక్పథంలో స్త్రీ ........ 293

స్త్రీ గుణవర్ణన ........ 301

స్త్రీ సౌందర్యవర్ణన ........ 321

12 అమలిన శృంగార తత్త్వం ........ 334-408

వైష్ణవ సంప్రదాయంలో భక్తి ........ 334

ఆండాళ్ ........ 347

మీరాబాయి ---- 350

అక్కమహాదేవి ---- 352

ప్లేటో ప్రతిపాదించిన ప్రేమతత్త్వం ---- 356

అమలిన శృంగార సిద్ధాంతం ---- 365

రచనలలో వాత్సల్య చిత్రణ ---- 384

స్నేహచిత్రణ ---- 391

దాంపత్యచిత్రణ ---- 398

స్వీకరించిన ఇతివృత్తాలలో ప్రేమసమస్యలు ---- 405

13 సింహావలోకనం ---- 409

అనుబంధం - 1 ---- 1-18

అనుబంధం - 2 ---- 19-58

అనుబంధం - 3 ---- 59-65

ఉపకరించిన గ్రంథాలు ---- 6-82

మొదటి భాగం

# పూర్వరంగం

# తెలుగు కవిత
# తత్వచింతన

①

# ప్రాచీనాంధ్ర సాహిత్యంలో తత్త్వచింతన

రమణీయమైన శైలీ సౌందర్యాలతో పాటు తాత్త్విక దర్శనాన్ని కూడా కలిగి ఉన్న కవిత్వం ఉన్నతస్థాయిని పొందే అవకాశం ఉంది. సమర్థవంతుడయిన కవి తన తాత్త్విక దృక్పథాన్ని కళాత్మకంగా తీర్చిదిద్దుతూ దానికి ప్రచారాన్ని తెస్తాడు. ప్రాచీనాంధ్ర సాహిత్యాన్ని పరిశీలిస్తే కొందరు కవులు తాము నమ్మిన తాత్త్విక సత్యాలను ఆలంబనం చేసుకుని కావ్యరచన చేసినట్లు తోస్తుంది. అయితే ప్రాచీనాంధ్ర సాహిత్యంలోని తత్త్వచింతన అధికభాగం మతపరంగానే కనిపిస్తుంది.

వివిధ మతాలూ విశ్వశ్రేయస్సునే ఆకాంక్షించినా ఆ మతావలంబకులలోని విభిన్న దృక్పథాలు భిన్నమతస్థుల మధ్య అభిప్రాయభేదాలను కల్పించే అవకాశం ఉంది. కాలక్రమంగా మతస్థుల శ్రద్ధాసక్తుల వల్ల కొన్ని మతాలు ప్రాభవాన్ని పొందడం, ప్రజల అలసత్వం వల్లకాని, ఇతరమతాల ప్రాబల్యం వల్లకాని కొన్ని మతాలు కొంత ప్రాముఖ్యాన్ని కోల్పోవడం సహజం. అటువంటి సందర్భంలో క్షీణిస్తున్న మతం పట్ల అభిమానం కల కవులు ఆ మత పునరుద్ధరణను, మతప్రచారాన్ని దృష్టిలో పెట్టుకుని సాహిత్య సృష్టి చేయడం కనబడుతుంది.

ఆదికవి నన్నయ భారతాంధ్రీకరణను కూడా ఇటువంటి మతపరిస్థితులు ప్రేరణనిచ్చినట్లు తోస్తుంది. రాజరాజనరేంద్రుని కాలంలో బౌద్ధ, జైన మతాలు ప్రాభవంలో ఉన్నట్లు తెలుస్తున్నది. అవైదికాలయిన బౌద్ధ జైనమతాలు

వైదిక ధర్మాన్ని, కర్మాచరణను క్షీణింపజేసినట్లు కనబడుతుంది. ఈ మతాలు అధికంగా ప్రచారం పొందడంవల్ల ప్రజలలో సనాతనధర్మం పట్ల ఆసక్తి, అభిమానం సన్నగిలి ఉండవచ్చు.

'పార్వతీపతి పదాబ్జ ధ్యాన పూజా నిరతు'డైన రాజరాజు వైదికాభిమానంతో విద్యాపీఠాలను నెలకొల్పి వేదవిద్యలను పోషించినట్లు తెలుస్తున్నది. వైదిక మతానుయాయులయిన విప్రులకు అగ్రహారాదులు దానాలిచ్చి ఆదరించినట్లు కనబడుతుంది. అయినప్పటికీ ఆ మహారాజు వైదికాభిమానం ఇతరమతాల ప్రాబల్యానికి ప్రతిబంధకం కాలేదు. వైదికేతర మతాలు సహితం రాజాదరణ పొందుతూనే ఉండేవని చెప్పుకోవచ్చు.

ఆనాడు అధిక ప్రచారంలో ఉన్న బౌద్ధ, జైన మతాలు అహింసా తత్త్వం ప్రాతిపదికగా కలవి. 'అహింసా పరమో ధర్మః' అన్నది వేదోపనిషత్ ప్రోక్తమే అయినా అహింసావ్రతం వల్ల రాజ్యరక్షణకు అత్యంత ప్రధానమయిన పరాక్రమప్రతిష్ఠ క్షీణించే అవకాశం ఉంది. అధర్మం మీద విజయం సాధించి ధర్మప్రతిష్ఠ చేయడానికి యుద్ధం లాటి హింస అప్పుడప్పుడు తప్పకపోవచ్చు. 'క్షుద్రం హృదయదౌర్బల్యం' అన్నది క్షత్రియ ధర్మం. కనుక పౌరుషప్రధానమూ, వైదికధర్మప్రతిపాదకమూ అయిన సాహిత్యం ఆనాటి సమాజానికి అవసరం అని రాజరాజు భావించి ఉండవచ్చు.

'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని....'

కాని యాదినది మహాభారతం. దీనిలో వైదికధర్మనీతి తత్వాలు సామాన్యులకు సహితం సుబోధకంగా కథోపాఖ్యానాల ద్వారా చెప్పబడి ఉన్నాయి. అటువంటి గ్రంథం దేశభాష అయిన తెలుగులోకి అనువదించడం వైదికమతోద్ధరణకు సహాయపడగలదని రాజరాజు తలచి ఉండవచ్చు.

ఇక నన్నయ 'అవిరళ జపహోమ తత్పరుడు, బ్రహ్మాండాది నానా పురాణ విజ్ఞాన నిరతుడు'. ఈయన వైదిక మతాభిమానంలో సనాతనధర్మ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని పంచమ వేదంగా ప్రసిద్ధి పొందిన మహాభారతాంధ్రీకరణకు పూనుకొని ఉంటాడు. సనాతన తత్త్వచింతన, వైదికధర్మం ప్రజాబాహుళ్యానికి తెలియ చేయవలెననే కోరిక నన్నయ భారతాంధ్రీకరణకు దోహదం చేసి ఉండవచ్చు. తెలుగుజాతిలో క్షీణిస్తున్న ధర్మనిరతిని, వైదికాభిమానాన్ని మహాభారతం పునఃప్రతిష్ఠిస్తుందనే ఆశయం భారతాంధ్రీకరణలో కొంతవరకు ఉందని అనుకోవచ్చు.

12వ శతాబ్దిలో ఆంధ్రదేశంలో మతవిప్లవం చెలరేగింది. శైవం కర్మప్రధానమయిన వైదికాన్ని వెనుకకు నెట్టింది. శైవం చాలా ప్రాచీనకాలం నుంచి ఉన్నట్లు భావింపబడుతోంది. దీనిలో పాశుపత సంప్రదాయం చాలా పురాతనమయింది. లాకులశైవం, కాపాలికా శాఖ, గోరక్షనాథ సంప్రదాయం కూడా పాశుపత సంప్రదాయంలోనివిగానే చెప్పబడుతున్నాయి. ఇవికాక కాలాముఖ శైవశాఖ కూడా చాలా కాలం నుంచి ఉన్నట్లు తెలుస్తున్నది.[1]

1 శ్రీ పండితారాధ్యచరిత్ర - పాల్కురికి సోమనాథకవి ప్రణీతము పరిష్కర్త:— చిలుకూరి నారాయణరావు. P 274 to 277.

ఇన్నిశాఖలు అతిప్రాచీనకాలంనుంచీ ఉన్నప్పటికీ తీవ్రమైన మత కల్లోలాలకు అవి కారణం అయినట్లు కనబడదు. వీటిలో వీరశైవం లోని తీవ్రత ఉన్నట్లు తోచదు. బసవేశ్వరునిచే కర్ణాటకంలో ప్రచారానికి వచ్చిన వీరశైవం ఆంధ్రదేశంలో కూడా విశిష్టస్థానాన్ని విశేషప్రచారాన్ని పొందింది. 'గురుకరోదర జనితులయిన' ఈ వీరశైవుల తత్త్వం కొంత తీవ్రత కలది.[1] వైదికకర్మలను

---

1. "గురుడు హస్తమస్తక సంయోగమున శివకళాన్యాస మొనరించి ఆణవ, కార్మిక, మాయామలములను వేధా మంత్ర క్రియాత్మక త్రివిధ దీక్షలచే దగ్ధమొనర్చి భౌతికశరీరమును లింగశరీరముగ జేసి ప్రసాదించిన ఇష్టలింగమును స్థూలశరీరమున కంఠమునగాని శిరమునగాని భుజమునగాని వక్షమునగాని ధరించుచు సూక్ష్మ కారణశరీరముల నిష్ఠితమయిన ప్రాణ భావ లింగములలో దానికవినాభావముగ నైక్యానుసంధానము నలవరించుకొనుచు హస్తాంబుజ పీఠము నందుంచుకొని యనన్యచిత్తములో నర్చించుట ప్రణవ సహిత శైవ పంచాక్షరీ మంత్రము వినా మరియే యితర మంత్రములను మననము చేయకుండుట, ఇష్టలింగార్చనకన్న భిన్నములయిన కర్మములనెల్ల బహిష్కరించుట, శరీరమునుండి యిష్టలింగము ప్రమాదపతితమయినను వెంటనే ప్రాణత్యాగ మొనరించుట, లింగైక్యమైనపుడు సాధకుని యిష్టలింగము నాతని హస్తాంబుజ పీఠముననే యుంచి యర్చించి యాతనితో ఖనన మొనరించుట వీరశైవలక్షణము."

బసవపురాణము - పాల్కురికి సోమనాథ ప్రణీతము:
శ్రీ బండారు తమ్మయ్యగారిచే పరిష్కృతము. P8 ఉపోద్ఘాతము.

వేద ప్రమాణాన్ని, వర్ణవ్యవస్థను వ్యతిరేకిస్తూ శివభక్తికే అధిక ప్రాధాన్యాన్నిచ్చింది వీరశైవం. వీరి దృష్టిలో శివుడే పరదైవం. రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు అనే ముగ్గురే జగత్కర్తలు. వీరశైవులకు జ్ఞానం అంటే పశు పాశుపతి జ్ఞానం. జీవులు పశువులు, ప్రకృతి వికృతి సంబంధము పాశము, శివుడా రెండింటికి పతి.

జీవులనేరులు పశువులు
భావింపగ ప్రకృతి వికృతి - బంధము పాశం
బావృతములయినం బశువులు
నీవా రెంటికిని బతివి - నిరుప మహేశా![1]

వీరశైవులకు జంగముడు ఉత్తమోత్తముడు. లింగ శరీరమే జంగమ శరీరం. అతడు చరలింగం.

జంగమ లింగంబగు భ
క్తుం గని పూజింపజేని గోటి విధములన్
లింగార్చన చేసిన వృథ
జంగమ ముత్తమము గాక స్థావరము నకున్.[2]

వీరికి షట్‌స్థల జ్ఞానం ముఖ్యమయింది.[3] వర్ణభేదం వీరికి లేదు.

---

1. 24 శివతత్త్వసారము - మల్లికార్జున పండితుడు
2. 153 శివతత్త్వసారము - మల్లికార్జున పండితుడు
3. "భక్తుడు తాననుష్ఠింపవలసిన ధర్మములలో గూడియుండడము భక్తస్థలము. కేవల సహజ దాననిష్ఠాపరుడై శివతత్పరుడై బ్రహ్మాది స్థాన విముఖుడై ఉండేవాడు మాహేశ్వరుడని పిలువబడుతాడు. భక్తి వైరాగ్యము వెనుకటి అయి స్థిర వివేకము కలవాడే మాహేశ్వరుడు. అట్టి మాహేశ్వర ధర్మమును పరిపాలించడమే

శివభక్తే ప్రధానం. అంత్యజులయినా శివభక్తులై వీరశైవదీక్షను గ్రహిస్తే వారు పూజార్హులే. లింగధారణ అత్యంత ప్రధానమైనది. వీరశైవులు వేదప్రమాణాన్ని అంగీకరించరు. వైదికమైన చాతుర్వర్ణ్య వ్యవస్థను వీరు నిరసించారు. ఈ విధంగా వీరశైవం వైదికధర్మాలకు కొంత దూరం అయింది. వీరు మత తీవ్రత వల్ల కులవ్యవస్థను నిరసిస్తూనే వీరశైవులనే ఇంకొక కులాన్ని ఏర్పాటు చేసినవారయ్యారు. తమ తాత్విక దృక్పథానికి ప్రచారం ఇస్తూ విశేషంగా సాహిత్యసృష్టి చేశారు వీరశైవులు. సామాన్యులకు సహితం అవగాహన అయ్యే విధంగా జాను తెనుగు భాషలో శివభక్తి ప్రాధాన్యాన్ని శైవ మత ప్రాశస్త్యాన్ని బోధించడమే వీరశైవ కవుల సంకల్పం. మత ప్రచారానికి వీలుగా, గానయోగ్యమయిన

---

మాహేశ్వర స్థలము. లింగనిష్ఠాది భావములో పాపబంధములను ధ్వంసము చేసి మనః ప్రసాదము కలిగిఉండడమే ప్రసాద స్థలము. లింగము చిదాత్మకమైన బ్రహ్మము. దాని శక్తి ప్రాణరూపిణి. అట్టి రూపము గల లింగమును తెలుసుకున్నవాడు ప్రాణలింగి. ప్రాణలింగ ధర్మము ననుష్ఠించడమే ప్రాణలింగ స్థలము. అంగ, లింగ జ్ఞానము కలిగి తాను సతి అని భావించి పతి అయిన శివుని ధ్యానించి, ఆ ధ్యాన సౌఖ్యములో ప్రవేశించినవాడు శరణుడు. శరణ భావము కలిగి ఉండడము శరణ స్థలము...... ప్రాణలింగాది యోగము చేత సుఖాతిశయము ననుభవిస్తూ శరణుడు శివునిలో ఐక్యమును కల్పించుకొనడము ఐక్య స్థలము".

పండితారాధ్య చరిత్ర - పాల్కురికి సోమనాథుడు

పరిష్కర్త: చిలుకూరి నారాయణరావు. ఉపోద్ఘాతము P311, 312

దేశి ఛందస్సును వీరు అధికంగా అభిమానించారు. అంతేకాక దేశీయమైన శివభక్తుల గాథలను కావ్యవస్తువులుగా స్వీకరించారు.[1] సాహిత్యాన్ని వీరశైవులు తమ సిద్ధాంత ప్రతిపాదనకు చక్కగా వినియోగించుకున్నారు. వీరి మత తత్త్వ చింతనను ప్రాధాన్యమిస్తూ వీరశైవ వాఙ్మయం విశేషంగా వెలువడింది.[2]

దాదాపు ఇదే కాలంలో రామానుజస్థాపితమైన విశిష్టాద్వైత వైష్ణవం కూడా ఆళ్వారులవల్ల అధికప్రచారం పొందింది. ఇదికూడా భక్తిప్రధానమై వర్ణవ్యవస్థను వ్యతిరేకించేదే. జ్ఞానం కంటె భక్తి ముఖ్యమని, వర్ణవిభేదాలవల్ల ప్రయోజనం లేదనే విషయాలలో వీరశైవ వైష్ణవాలకు భేదం లేదు. కాని ఈ మతాలలోని ఉపాస్యదైవం విషయంలో, వేద ప్రామాణ్యం విషయంలో వీరశైవ వైష్ణవ మతాల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. తాత్త్విక విషయాలలోని భేదం కంటె సాంఘిక విభేదాలు ఆధిక్యం వహించాయి. రెండు మతాలు భారతీయమైనవే అయినా పై భేదాలు కాలక్రమంగా వీరిమధ్య ద్వేష వైషమ్యాలను

---

1. బెజ్జమహాదేవి కథ, కన్నప్ప, నిమ్మవ్వ, ముగ్ధశివ్వ గుడ్డవ్వల గాథలు, సురసానమ్మ కథ, చిరుతొండ నంబి కథ మొదలైనవి బసవపురాణంలో వర్ణింపబడ్డాయి.

2. శివతత్త్వసారము, లింగోద్భవగద్యము, రుద్రమహిమ, గణసహస్ర మాల, అమరేశ్వరాష్టకము, బసవపురాణము, పండితారాధ్య చరిత్రము, అనుభవసారము, వృషాధిప శతకము, బసవోదాహరణము వంటి రచనలు వీరశైవ తత్త్వాన్ని విస్పష్టంగా ప్రదర్శిస్తాయి.

పెంచాయి.

'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అన్న సత్యం వీరి స్పర్థలలో మరుగున పడింది. విశ్వశ్రేయస్సు నాకాంక్షించే సాహిత్యంలో 'శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే' అనే మతతత్త్వం ప్రతిఫలించడానికి బదులుగా వారి దూషణ, తిరస్కారాలు చోటు చేసుకున్నాయి.[1]

---

1. "భవి కృపాతరంబ సంభవ ధ్యాన నిచయ
భవి నిరీక్షణ రసపాక విలాస
భవి హస్తగత ఫల పత్ర శాకాది
భవి గృహ క్షేత్రాంఘ్రి పథన వర్జితుడ
భవి జనదర్శన స్పర్శ నాలాప
వివిధ దానాదాన విషయ దూరగుడ"

(పాల్కురికి సోమనాథుడు - పండితారాధ్య చరిత్ర. దీక్షా ప్రకరణము P15)

"శివభక్తుల యెడ భయమును
శివునెడ పతివ్రత గుణము శీలంబుల యం
దవి కల్పంబగు చలమును
భవి యెడ రోతయును వలయు భక్తుల కెందున్."

(పాల్కురికి సోమనాథుడు. అనుభవసారము)

ఈ భేదం భార్యాభర్తల్లో కూడా చోటు చేసుకుంది. భార్య శివభక్తురాలై భర్త శివభక్తుడు కానిచో భార్య భర్తను నిరసించ వచ్చునంటాడు పండితారాధ్యుడు.

"పురుషుడు శివభక్తి విరహితుడేనిఁ
బురుషుని వీడుట తరుణికిఁ బథము"

(శివతత్త్వ సారము. P 231-234)

సమాజంలోని మతస్వరూపం ఇంత తీవ్రంగా ఉండి సాహిత్యంలో సహితం ఆ తీవ్రద్వేషాలు ప్రతిఫలిస్తున్న తరుణంలో తిక్కన సాహిత్యసీమలో ప్రవేశించాడు. ధార్మికనిష్ఠను పెంచి మత విషయంలో ఉదారతను తేవడానికి ప్రయత్నించాడు. తిక్కన 'మహేశ్వ రాంఘ్రికమల ధ్యానైక శీలుడ' నని స్వయంగా చెప్పుకున్నాడు. కేతన తిక్కనను గూర్చి 'హరిచరణ కమలోపాస్తి కృత స్వస్తి' అన్నాడు. దీనిని బట్టి తిక్కన హరిని హరుని ఇరువురిని ఆరాధించినట్లు తోస్తుంది. 'పరతత్త్వము గాన్పైద నిష్టసిద్ధికిన్' అంటూ పరతత్త్వాన్ని కాంచే తిక్కనకు హరి అయినా హరుడయినా ఒకటే కావడంలో ఆశ్చర్యం లేదు. దీనిని బట్టి తిక్కన హరి, హర భేదాన్ని పాటించని అద్వైతిగా తోస్తుంది. భారత రచనా కాలానికి హరిహరనాథోపాసన గావించి

"కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా పరిష్క్రియాయాం
బహుమన్యసే త్వమ్
కిం కాలకూటః కిము వా యశోదాస్తన్యం తవస్వాదు
వద ప్రభో మే."

అని ప్రశ్నించాడు. హరిహరనాథుడు తిక్కన భావనారాధ్యుడు. అనే విషయం మీద భిన్నాభిప్రాయాలున్నాయి. హరిహరనాథతత్త్వాన్ని నూతనంగా స్థాపించినా లేక పునఃప్రతిష్ఠ చేసినా ఆ సమయానికి సమాజంలోని మత కల్లోలాలను దృష్టిలో ఉంచుకుని హరిహరనాథ స్వరూపానికి ప్రాధాన్యమిచ్చి సంకీర్తనం చేసినవాడు తిక్కన. శివకేశవాభేదాన్ని స్పష్టం చేయడానికి తన భారత భాగాన్ని తాను నమ్మిన హరిహరనాథునికి అంకితం చేశాడు. అంతేకాక తరువాత కవులకు ఈ తత్త్వంలో మార్గదర్శకుడయ్యాడు.[1]

1 నాచన సోముడు, ఎఱ్ఱన, దూబగుంట నారాయణకవి కూడా హరిహరనాథుని స్తుతించారు.

తరువాత కాలంలో వైష్ణవం కొంతవరకు అధికప్రచారాన్ని పొందింది. శైవమత సాహిత్యం కూడా వెలువడుతున్నప్పటికి వైష్ణవ సాహిత్యం ఎక్కువ కనబడుతుంది. దీనికి ఆనాటి ప్రభువులు సహితం వైష్ణవాభిమానులు కావడం కొంతవరకు దోహదం చేసి ఉండవచ్చు. విజయనగర సాళువ, తుళువ వంశపు రాజులూ, నాదెళ్ళ వారు, నంద్యాలవారు, రాయసంవారు, అరవీటి వారు, సిద్ధిరాజు వారు మొదలైన సామంత కుటుంబాల వారు వైష్ణవాన్ని అభిమానించినట్లు కనబడుతుంది.

శ్రీకృష్ణదేవరాయలు రచించినదిగా ప్రసిద్ధికెక్కిన ఆముక్తమాల్యద విష్ణుపారమ్యానికే ప్రాధాన్యం ఇచ్చింది. వైష్ణవమత ప్రచారాభిమానంలో ప్రసక్తానుప్రసక్తంగా వర్ణించిన ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానము, యామునాచార్య చరిత్ర, మాలదాసరి కథ వంటి వైష్ణవభక్తుల గాథలు విష్ణుమహత్యాన్ని ప్రకటిస్తాయి.

వీరశైవ కవుల వలెనే సాహిత్యాన్ని మతప్రచారానికి చక్కని సాధనంగా వినియోగించుకున్నవారు తాళ్ళపాక కవులు. అన్నమాచార్యుని రామాయణము, పెదతిరుమలాచార్యుని హరివంశము, చినన్న ఉషాపరిణయము, అష్టమహిషీ కల్యాణము, పరమయోగి విలాసము మొదలైన రచనలు విష్ణుసంబంధి గాథలను వర్ణిస్తూ వైష్ణవ దివ్య తత్త్వ ప్రచారదృష్టి కనబరుస్తాయి.[1] మతాన్ని భక్తిని దృష్టిలో పెట్టుకుని

---

1. "శైవ వైష్ణవ కవులిరువురి కవితయును భక్తియే జీవము. ఆవేశమిరువురకును సమానము. భక్త్యావేశము తరువాత వీరశైవకవుల రచనలలో కవిత్వకళ యుండియు పాండిత్యగౌరవమే అధికముగా గానవచ్చును. కాని తాళ్ళపాక కవుల రచనలలో భక్త్యావేశముతో బాటు కవిత్వకళయు, పాండిత్య గౌరవము రెండును సమాన స్థాయిలో గోచరించును. వీరశైవకవీశ్వరులు

ప్రచారానికి అనువుగా వివిధ సాహితీ ప్రక్రియలను ఆధారం చేసుకుని వైష్ణవ సాహిత్యాన్ని వెలయించారు తాళ్ళపాక కవులు.

ఆ తరువాతి కాలంలోని వేమన, పోతులూరి వీరబ్రహ్మం వర్ణవ్యతిరేక భావాలకు సాహిత్యంలో స్థానం కలిగించారు. వీరశైవ వైష్ణవాలు సహితం వర్ణవ్యవస్థను వ్యతిరేకించాయి. కాని వేమన, పోతులూరి వారి వర్ణవ్యతిరేకత దీనికి కొంత భిన్నమయింది. ఏ కులం వారయినా శైవభక్తి కలిగివుంటే చాలునని శైవులు, విష్ణుభక్తులయితే చాలునని వైష్ణవులు ప్రచారం చేశారు. వారి దృష్టి ప్రధానంగా భగవద్భక్తికి సంబంధించినది. కాని వేమన, పోతులూరి భక్తిపరంగా మోక్షసాధన దృష్టిలో కాక సామాజిక అసమానతను దృష్టిలో పెట్టుకుని వర్ణవ్యవస్థను ఖండించారు. కులవ్యవస్థ మానవులలో అంతరాలను కలిగించకూడదని నమ్మారు. కుల ప్రాతిపదికపై సమాజంలోని కొందరు వ్యక్తులు అధికులుగా కొందరు అధములుగా భావింపబడకూడదని వేమన, పోతులూరి వారి తత్త్వం. వేమన అస్పృశ్యతను సహితం ఎదిరించారు.

కులము చేతబట్టి గుంపించనేటికి
పాలు ఉనుబోటు ప్రబలు విత్తు

---

తాళ్ళపాక మతప్రచారకులుగను పిదప పండితులుగను ఆ పిదప కవులుగను సాక్షాత్కరింతురు. వైష్ణవ తాళ్ళపాక కవీశ్వరులట్లుగాక ఒక యాకళింపుననే మతప్రచారకులుగాను కవులుగాను, పండితులుగాను దర్శనమిత్తురు". తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు. వేటూరి ఆనందమూర్తి. P 129-130

ఏటి కులంబింక ఎక్కడి ద్విజుడయా....
కులములన్నీ ఒక్క కులముగా తెలియుడీ.....
మాలవాని నేల మరిమరి నిందింప
ఒడలనున్న మాంసమొకటి గాదె[1]

గుణాంవల్ల అగ్రజాతిగాని జన్మవల్ల కాదని వీరు ప్రచారం చేశారు. వేదాది విద్యలకందరూ అర్హులేనని వీరబ్రహ్మం భావించాడు. తన ఆశ్రమంలో శైవ వైష్ణవ దేవతాభేదాలను హిందూ మహమ్మదీయ మతభేదాలను పాటించలేదు.[2] వేమన కానీ వైదిక కర్మలను, నమ్మకాలను సహితం వ్యతిరేకించాడు. మరణించినవారికి పిండాలు పెట్టడం, తిథి వార, నక్షత్ర ముహూర్తాల మీద నమ్మకం వంటి వాటిని నిరసించాడు. వీరిద్దరూ తాము నమ్మిన ఈ సత్యాలను తమ సాహిత్యం ద్వారా ప్రచారానికి తెచ్చారు.[3]

---

1. 'ప్రజాకవి వేమన'. N. గోపి. P186, 254 లో ఉల్లేఖింపబడినవి
2 దూదేకుల సిద్ధయ్య వీరబ్రహ్మం ప్రియశిష్యుడు కావడం దీనికి చక్కని నిదర్శనం
3. "అట్టి సన్నివేశములలో అనగా తురక, క్రైస్తవుల విజృంభణ కాలములో ఆంధ్రదేశమును రక్షించినది రాజులు కారు. తత్త్వబోధకులే రక్షించినవారు. దేశమంతటా వేదాంతులు బయలుదేరి గేయాలలో మతావేశమును కలిగించుచు సంఘలోపాలను సంస్కరించుచు వచ్చిరి. అట్టివారిలో ముఖ్యులు వేమనయోగి, పోతులూరి వీరబ్రహ్మంగారు".
ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి. P391

దాదాపు ఇదే కాలంలో ఆంధ్రులకు సన్నిహితంగా వచ్చిన మతాలు మహమ్మదీయ మతం, క్రైస్తవమతం. మహమ్మదీయులు అంతకు పూర్వం చాలాకాలం క్రితం నుంచి భారతదేశంలో కొంత భాగాన్ని పరిపాలిస్తూ వచ్చారు. క్రమంగా ఆంధ్రదేశంలో కొంతభాగం సహితం కొంతకాలం మహమ్మదీయుల పాలనలోకి వచ్చింది. కొందరు మహమ్మదీయ పాలకులు కూడా ఆంధ్ర భాషాభిమానంతో, సాహిత్యాభిలాషతో తెలుగుకవులను పోషించి, ఆంధ్రసాహిత్యసేవ చేశారు. గోల్కొండ పాలకుల పోషణలో తెలుగుకవులు కొందరు తమ కావ్యాలను కొన్నింటిని మహమ్మదీయులకు అంకితం కూడా చేశారు. హిందువులకు ఉన్నత పదవులను ఇచ్చి ఆదరించారు గోల్కొండ నవాబులు.[1] అయితే మహమ్మదీయుల పాలనా, వారి భాషతో సాన్నిహిత్యం ఆనాటి తెలుగు సాహిత్యం మీద కొంత భాషాపరమైన ప్రభావాన్ని మాత్రం చూపాయి- కాని మహమ్మదీయ మత ఆత్మిక చింతనను గాని, వారి మతపరమైన విషయాలను గాని ప్రాధాన్యం ఇచ్చే తెలుగుసాహిత్యం ఆ కాలంలో

---

1 భక్తి సాహిత్యంలో ప్రముఖస్థానాన్ని పొందిన 'రామదాసు కీర్తనల' కర్త కంచర్ల గోపన్న నవాబుల కొలువులోని వానిగా ప్రసిద్ధి. అద్దంకి గంగాధరకవి ఇబ్రహీం కుతుబ్‌షా ఆస్థానంలో ఉండి తన 'తపతీసంవరణం' కావ్యాన్ని ఆ ప్రభువుకు అంకితం ఇచ్చాడు. కందుకూరి రుద్రకవి కూడా అతని ఆస్థానంలోని వాడేనని తెలుస్తున్నది. పొన్నిగంటి తెలగనార్యుడు ఇబ్రహీం కుతుబ్‌షా సేనాధీశ్వరుడైన అమీన్‌ఖాన్‌కు "యయాతిచరిత్ర"నంకితం చేశాడు. సారంగు తమ్మయ్య కూడా ఆ కాలంనాటి కవే.

తెలుపబడినట్లు కనబడదు. కనుక మహమ్మదీయప్రభువుల ఆదరణలో తెలుగుకవిత్వం తెలుపబడినా వారి తాత్త్వికచింతనా ప్రభావం సాహిత్యం మీద పడలేదనవచ్చు.

కాని క్రైస్తవమతప్రభావం దీనికి కొంత భిన్నంగా ఉంది. క్రైస్తవ మతం తెలుగుదేశంలో అంతగా ప్రచారం పొందక పూర్వమే క్రైస్తవసాహిత్యం తెలుగులో ప్రారంభం అయింది. క్రైస్తవమతప్రచారదృష్టి దీనికి కొంత ప్రోత్సాహం ఇచ్చి ఉండవచ్చు. పింగళి ఎల్లనార్యుడు, మంగళగిరి ఆనందకవి, క్రీస్తుకు ప్రాధాన్యం ఇస్తూ తోబ్యా చరిత్ర (సర్వేశ్వర మహాత్మ్యం) వేదాంత రసాయనం ప్రబంధ ఫక్కీలలో రచించారు.[1] సువార్తలు, బైబిలు వంటి రచనల అనువాదాలు క్రైస్తవకీర్తనలు తెలుగుసాహిత్యంలో ప్రవేశించాయి. క్రైస్తవ మతంలోని ఉదాత్త ఆశయాలవల్ల ప్రభావితులయిన ఆంధ్రులు

---

1 "ఆనందకవి కృష్ణాజిల్లాకు చెందినవాడు. 1750 నాటికే మధుర నుండి వచ్చిన జెసూటు మిషనువారు ఇచ్చట ప్రచారము చేయుచు నుండిరనుటకు ఆధారములు గలవు. పింగళి ఎల్లనార్యుడు కూడా కృష్ణా జిల్లాకు చెందినవాడే. వీరిరువురి పైని వీరి కృతులకు భర్తలయిన వారిపైని క్రైస్తవమతప్రభావము పడుటకు ముఖ్యావకాశము ఆ కాలములో జెసూటు మిషనరీల ప్రాంతమున కృషి చేయుటచే కలిగినదనవచ్చును"

"తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము".

కొత్తపల్లి వీరభద్రరావు P. 97.

క్రైస్తవులయినా కానున్నా క్రైస్తవ ఇతివృత్తాలతో రచనలు చేశారు.[1] ఈ విధంగా క్రైస్తవమత తత్త్వం తెలుగుసాహిత్యంలో ప్రవేశించింది.

బౌద్ధ, జైనమతాలు అతిప్రాచీనాలు. అవి కొంతకాలం అధిక ప్రాభవంలో కూడా ఉన్నాయి. అయినా ఆ మతపరమయిన తెలుగుసాహిత్యం ప్రాచీనకాలంలో వెలువడినట్లు కనబడదు. 'కవిజనాశ్రయ' కర్త రేచన జైనుడనే అభిప్రాయం ఒకటి ఉన్నప్పటికీ జైనమత తత్త్వరచన చేసినట్లు తెలియడంలేదు. బౌద్ధమతం మధ్యకాలంలో క్షీణించినా పూర్తిమరుగున పడిపోలేదు. అంతేకాక బుద్ధుడిని శ్రీమహావిష్ణువు అవతారంగా గ్రహించి పూజించడం కాకతీయుల కాలానికే కనిపిస్తుంది.[2] అయినా ఆకాలంలో సహితం బుద్ధునిగూర్చిన సాహిత్యం తెలుగులో వెలువడినట్లు కనబడదు. విష్ణువుకు అధికప్రచారాన్నిచ్చిన వైష్ణవ

---

1 పురుషోత్తమ చౌదరి, పులిపాక జగన్నాథము, కందుకూరి వీరేశలింగం పంతులు, మంత్రిప్రెగడ భుజంగరావు మొదలైనవారు కొందరు అటువంటి రచనలు చేశారు.

2 "కాకతీయుల యుగమునందు ఆంధ్రదేశమున.... బౌద్ధమత స్థాపకుడగు గౌతమబుద్ధుని శ్రీమహావిష్ణుని దశావతారముగా నంగీకరించి పూజించుట ప్రారంభించుటవలనను క్రమక్రమముగ బౌద్ధులు ప్రాచీనమగు హీనయాన బౌద్ధమును విస్మరించి మూర్తి పూజాదికములకు నాచారములతో నిండిన మహాయానమును నవలంబించుట చేతను బుద్ధధర్మము క్రమముగ హిందూ ధర్మములో లీనమయ్యెను." 'ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి'. ఖండవల్లి లక్ష్మీరంజనం, ఖండవల్లి బాలేందు శేఖరం. P228

సాహిత్యంలో కూడా బుద్ధునికి ప్రాధాన్యం ఇచ్చినట్లు గాని బౌద్ధమత ప్రసక్తి గాని ఉన్నట్లు లేదు.

ఏదియైనా ఈ విధంగా ఉన్న ప్రాచీనాంధ్ర సాహిత్యం అధికభాగం వైదికమత తత్త్వానికి సంబంధించినదని చెప్పవచ్చు. అది ఎక్కువగా పరబ్రహ్మ తత్త్వాన్ని పారలౌకిక సత్యాలను అన్వేషిస్తూ, అవలంబనం చేసుకుంటూ సాగింది. ఆ సాహిత్యంలో చతుర్విధ పురుషార్థాలలోని ధర్మ మోక్షాలకు అధిక ప్రాధాన్యం లభించిందని చెప్పుకోవచ్చు. శ్రుతి స్మృతి పురాణేతిహాసాల లోని ధర్మబోధను నైతిక విలువలను అధికంగా ఆదరించి ప్రచారానికి చేయడానికి ప్రయత్నించింది. కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలను, సనాతన వైదిక సంప్రదాయాలను, భక్తి తత్త్వాన్ని అవలంబనం చేసుకున్నది. షోడశ కర్మలవంటి వైదిక సంస్కారాలను, అర్ఘ్యపాద్యాది సత్కారాల వంటి సంప్రదాయాలను ప్రాచీనాంధ్ర సాహిత్యం ప్రతిబింబింపజేసింది. ఆ సాహిత్యంలో ఏదో ఒక దైవానికి ప్రాధాన్యమే గాని నాస్తికభావ ప్రాధాన్యం దాదాపుగా లేదనే చెప్పవచ్చు.

---

# ఆధునికాంధ్ర సాహిత్యంలో తత్త్వచింతన

క్రమపరిణామంగా ఆధునిక సాహిత్య తత్త్వచింతనలో కొంతమార్పు వచ్చింది. కవులు వ్యక్తిగత భావాలకు ప్రాధాన్యం ఇస్తూ ఆత్మాశ్రయ సాహిత్యసృష్టి చేయడం వల్ల వస్తువులో తత్త్వంలో వైవిధ్యం ఏర్పడింది. నవ్యకవిత్వం వివిధ తత్త్వాలను వెలువరించింది. కవుల మానసికప్రవృత్తిలో వచ్చిన చైతన్యం సాహిత్యంలో రూపుదిద్దుకుంది.

బౌద్ధమతానికి సంబంధించిన సాహిత్యం 20వ శతాబ్ది ప్రారంభంలో అధికంగా కనబడుతుంది. జాతీయోద్యమం బలపడడం అహింసాసిద్ధాంతానికి ప్రచారం రావడం కొంతవరకు కారణం కాగా, బుద్ధునిగూర్చిన సాహిత్యం ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో అధికంగా వచ్చి ఉంటుందని అనుకోవచ్చు. అహింసావాది అయిన గాంధీజీ సిద్ధాంతాలు దేశంలో విశేషప్రచారం పొందసాగాయి. బౌద్ధంలో ప్రధానమైన కరుణకు ఆ సమయంలో ప్రచారం వచ్చింది. గాంధీజీ సిద్ధాంతాలకూ గౌతమబుద్ధుని సిద్ధాంతాలకూ గల సాదృశ్యం ప్రజల దృష్టి బౌద్ధసాహిత్యం వైపు ప్రసరించడానికి దోహదం చేసి ఉండవచ్చు.

ఇంగ్లీషు భాషలోని లైట్ ఆఫ్ ఏషియా (Light of Asia) ఆధారంగా 19వ శతాబ్ది చివరిభాగంలో తిరుపతివేంకట కవులు 'బుద్ధచరిత్రము' వ్రాశారు. వారి 'శ్రవణానందము' కూడా బౌద్ధమత సంబంధి రచనే. పింగళి కాటూరి కవుల 'సౌందరనందము' జంధ్యాల పాపయ్య శాస్త్రి 'కరుణశ్రీ', సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి 'జాతక కథాగుచ్ఛము' వంటివి కూడా బౌద్ధమత సంబంధమైన ఆంధ్ర

సాహిత్యంలో ప్రసిద్ధి పొందాయి.

20వ శతాబ్దిలో మొట్టమొదటిసారిగా మహమ్మదీయ మత తత్త్వానికి ప్రాధాన్యం ఇస్తూ ఉమర్ అలీషా, మహమ్మద్ ఖాశింఖాన్ వారి రచనలు చేశారు. ఉమర్ అలీషా సూఫీ వేదాంతదర్శనము, ఇలాహత్ కుల్బా ముసద్దాక్ అలి వంటి రచనలలో ఇస్లాం తత్త్వం ప్రధానం. మహమ్మద్ ఖాశింఖాన్ ఖురాన్‌కు తెలుగు అనువాదాన్ని వ్రాశారు. ఇస్లాం తత్త్వాన్ని ప్రతిపాదించే మొట్టమొదటి తెలుగు సాహిత్యంగా ఈ రచనలను పేర్కొనవచ్చు.

ఆధునిక కాలంలోని సాహిత్యంలో గోపరాజు రామచంద్రరావు, త్రిపురనేని రామస్వామి చౌదరి లవణం వంటి వారి రచనలలో కొంత నాస్తికత ఉంది. నాస్తికభావాలు కల వ్యక్తులు ఏ కాలంలో అయినా ఉండవచ్చు, కాని నాస్తికభావాలను ఆలంబనం చేసుకున్న సాహిత్యం ఆధునిక కాలంలోనే వెలవడినట్లు చెప్పుకోవచ్చు. నాస్తికభావప్రధానంగా సాహిత్య సృష్టి ప్రాచీనసాహిత్యంలో ప్రత్యేకంగా కనబడదు. ఆధునిక కవుల స్వేచ్ఛ దీనికి కొంత దోహదం చేసి ఉంటుందని ఊహించవచ్చు.

ఆధునిక సాహిత్యంలోని ప్రధాన తత్త్వం సమానత్వం. పారలౌకిక ఆధ్యాత్మిక చింతనల కంటె లౌకిక జీవిత సత్యాలకు ఈ సాహిత్యం ప్రాధాన్యనిచ్చింది. అగోచరమయిన పరబ్రహ్మ తత్త్వం, మరణానంతరం జీవుని స్థితి, స్వర్గనరకాలు, మోక్షమార్గం వంటి చర్చలు, మీమాంసల కంటె, మానవుడు తన జీవితంలో అనునిత్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమార్గాన్వేషణ ముఖ్యమని ఆధునికులు భావించినట్లు కనబడుతుంది. ప్రాచీన సంప్రదాయమార్గంలో భారత, భాగవత రామాయణాలు వంటి రచనలు సహితం వెలువడుతున్నప్పటికీ అధిక

భాగం సమాజంలోని మానవజీవన తత్త్వాన్ని అన్వేషిస్తూ సాగింది.[1] సామాన్య సంఘటనలలో, సర్వసాధారణ వస్తువులలో మానవతా ధర్మాన్ని అధికంగా ఆదరించారు నవ్యకవులు. 'మానవ సేవే మాధవ సేవ' వంటి సూక్తులు ప్రాచీనమయినవే అయినా ఆ మానవత్వానికే ప్రాధాన్యం ఇచ్చిన సాహిత్యం ఆనాడు ప్రసిద్ధంగా వెలువడలేదు. మాధవుని భక్తిలో కాంతిని సాధించే ముక్తికంటె లోటి మానవుని సాంఘిక అసమానతా బంధవిముక్తి ప్రధానం అని భావించిన సాహిత్యం ఆధునికకాలంలో కొంత అధికంగా కనబడుతుంది.

బ్రహ్మ సమాజం వంటి ఉద్యమాలు ఏకేశ్వరోపాసనను ప్రచారం చేశాయి. ఇతర మతస్థులలో సాన్నిహిత్యం వల్ల కవులకు ఆ మత సిద్ధాంతాలలో పరిచయం ఏర్పడింది. దీనివల్ల ఇతరమతాల మంచి చెడుల అవగాహనను అవకాశం కలిగింది. భగవంతుడు ఒకడే అనే భావన ప్రాచీనమయినదే అయినా అది కొంత విస్తృతి పొందింది అని

---

1. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి - శ్రీకృష్ణ భారతము, భాగవతము, రామాయణము
వావిలికొలను సుబ్బారావు - ఆంధ్ర వాల్మీకి రామాయణము
జనమంచి శేషాద్రి శర్మ - రామాయణము, బ్రహ్మాండ పురాణము, లలితోపాఖ్యానము, తాండవ కృష్ణ భాగవతము
వడ్డాది సుబ్బారాయుడు - భక్త చింతామణి
దాసు శ్రీరామకవి - దేవీ భాగవతము
ముదిగొండ నాగవీరయ్య శాస్త్రి - శివపురాణము
పిసుపాటి చిదంబర శాస్త్రి - పద్మపురాణము
విశ్వనాథ సత్యనారాయణ - రామాయణ కల్పవృక్షము - వంటివి ప్రాచీన మార్గంలోని వాని రచనలు.

మతాల దైవం ఒకటే అనే భావప్రచారానికి కృషిసాగింది. ఏ మతం అయినా ఏ పేరుతో కొలిచినా దేవుడొకడే అనే అభిప్రాయం స్థిరపడాలని కవులు భావించడం కనబడుతుంది. వ్యక్తిగతంగా ఏదేవుని నమ్మినా, ఏదేవుడిని కొలిచినా ఇతర మతస్థులను, వారి దేవతలను నిందించడం కొంత తగ్గి మతపరమైన ఉదారతను ఆధునికులు కనబరచసాగారు.

ఆధునిక జీవనవిధానంలో ప్రాచీన వైదికకర్మాచరణ విధానం కొంత మారింది. నిత్యాగ్నిహోత్రాలవంటి వైదికకర్మ నిష్ఠ కొంత సడలసాగింది. "పూర్వ సంప్రదాయాల మీద, ఆచారాల మీద ప్రత్యయము చాలా సడలినది. అభిప్రాయ స్వాతంత్ర్యము ఎక్కువైనది. అపనమ్మకము ప్రబలినది."[1] వర్ణవ్యవస్థ వృత్తి ప్రాధాన్యాన్ని బట్టి ఏర్పడిందనే భావం అధికప్రచారానికి వచ్చింది. కొందరు కవులు జాతిమతవర్ణ భేదాలు సమాజ పురోగమనానికి అవరోధం అని సూచిస్తూ మానవులంతా ఒకటే అనే భావప్రచారానికి కృషి చేయసాగారు. పారిశ్రామిక విప్లవప్రభావం వల్ల మానవుని మేధాశక్తి మీద, శక్తిసామర్థ్యాల మీద విశ్వాసం పెరిగింది. ప్రతి చిన్న విషయానికి భగవంతుడే కారణమనే తత్త్వం కొంత తగ్గసాగింది. విమర్శనాత్మక పరిశీలన, హేతువాదదృష్టి ఈ భావనను ప్రోత్సాహాన్నిచ్చి ఉంటాయి.

ఈ విధమైన భావవిస్తృతి సామాజిక తత్త్వదర్శనం ఆధునికాంధ్ర సాహిత్యంలో చోటుచేసుకున్నాయి. ఈ వైవిధ్యానికి

---

1. నవ్యాంధ్ర సాహిత్య వీధులు - కురుగంటి సీతారామయ్య.
ప్రథమ భాగము - ద్వితీయ ముద్రణ 1942. P62

దోహదం చేసినవి 19వ శతాబ్దిలోని పరిస్థితులు. ఆ పరిస్థితుల ప్రభావం ఆధునికకవుల తత్త్వచింతనపై పడి విస్తృతపరిధిలో నవ్యకవిత్వం వెలువడింది. నవ్యకవిత్వతత్త్వం మీద అధికప్రభావాన్ని చూపిన 19వ శతాబ్దిలోని సాంఘిక, రాజకీయ, మత, సాహిత్య పరిస్థితులను కొంత వివరించడం అవసరం.

# ఆధునికాంధ్రకవుల
# తత్త్వచింతనపై ప్రభావాలు

౨

# 19వ శతాబ్ది సామాజిక సాంస్కృతిక పరిస్థితులు.

19వ శతాబ్దిలోని పరిస్థితుల కారణంగా 20వ శతాబ్దిలోని తెలుగు సాహిత్యం - ప్రధానంగా కవిత్వం నూతనమార్గాలలో సాగింది. నవ్యకవిత్వం ఒక ఉద్యమమయి సాగింది. అయితే ఈ ఉద్యమం ఒక్కసారిగా వచ్చిందికాదు. క్రమపరిణామంగా వచ్చిన భావవిప్లవం. ఈ భావవిప్లవానికి దోహదం చేసిన పరిస్థితుల్లో రాజకీయ పరిస్థితులు కూడా ప్రముఖపాత్ర వహించాయి.

పాశ్చాత్యపరిపాలన భారతీయుల్లో రాజకీయచైతన్యం కలిగించడానికి కొంత తోడ్పడింది. రాజకీయకారణాల వల్ల ప్రజలలో స్వాతంత్ర్యాభిమానం బలపడింది. పరాయిపాలనలోని కష్టనష్టాలను తోటి వారికందరికీ తెలియజేసి దేశభక్తిని పెంపొందించాలనే కోరిక కొందరు యువకవులలో కలిగింది. ఉద్యమప్రచారానికి వీలుగా, ఛందోబద్ధంగా, పాడుకొనడానికి అవకాశం ఉన్న గేయకవిత వ్యాపించింది. ప్రబోధాత్మకమైన దేశభక్తిపూరితమైన రచనలు ఎక్కువగా వెలువడ్డాయి. తరువాతకాలంలో ఆధునికాంధ్రకవిత్వంలో ఒక ప్రత్యేకశాఖగా వింగడింపబడ్డ దేశభక్తికవిత్వానికి ఆనాటి రాజకీయపరిస్థితులే ముఖ్యకారణమని చెప్పవచ్చు.

హిందూమతసంస్కరణోద్యమాలు నవకవులలో విశాల దృక్పథాన్ని పెంచడానికి కొంతవరకు తోడ్పడ్డాయి. సంఘసంస్కరణోద్యమాలు సమాజంలో సంచలనం కలిగించి ఆదర్శభావాల వ్యాప్తికి దోహదం చేశాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రత్యేకస్థానం పొందిన ప్రముఖులలో చాలామందిమీద ఈ సంస్కరణోద్యమాల ప్రభావం ఉన్నట్లు కనబడుతుంది. వీరేశలింగం పంతులు, వేంకటరత్నము నాయుడు, చిలకమర్తి, వేంకట పార్వతీశ్వరకవులు, కృష్ణశాస్త్రి, ముట్నూరి కృష్ణారావు వంటివారు బ్రహ్మ

సమాజపు ఆదర్శాలను నమ్మినవారు. ఇటువంటి ఉద్యమాల ఆదర్శాలతో సంఘసంస్కరణ కవిత్వం వెలువడ్డది.

పత్రికలు విద్యాధికులు విభిన్నవిషయాలమీద తమ అభిప్రాయాలను వెల్లడించడానికి అవకాశం కలిగించసాగాయి. పత్రికల్లో ప్రచురణకు వీలుగా ఉండే చిన్న చిన్న రచనలకు ప్రోత్సాహం లభించసాగింది. దీనివల్ల కవులు ఖండకావ్యరచనను అధికంగా ఆదరించారు. ఇది వస్తువైవిధ్యానికి దోహదం చేసింది.

నవ్యకవుల ఆలోచనావిధానంపై అధికప్రభావాన్ని చూపిన ఆనాటి పరిస్థితులలో ఇంగ్లీషు విద్యావిధానమూ, పాశ్చాత్యులతో సంపర్కమూ ప్రధానంగా చెప్పదగ్గవి. ఆనాటి నవ్యకవులలో చాలామంది పాఠశాలలో, కళాశాలలో ఇంగ్లీషు విద్యను అభ్యసించినవారేనని చెప్పవచ్చు. పాశ్చాత్య పండితులు తెలుగుభాషాసాహిత్యాలకు చేసినసేవ, వారితో సంపర్కం చాలామందిలో హేతువాదవైఖరి లాంటివి పెరగడానికి కొంతవరకు దోహదం చేశాయి. అవ్యవహిత పూర్వకాలంలోని తెలుగుసాహిత్యం ఈ పరిస్థితులకు లోనయింది. నవ్యకవుల మానసిక పరివర్తనను స్పష్టంగా చూపడానికి ఇంగ్లీషు విద్యావిధానం, పాశ్చాత్యులతో సంపర్కం గూర్చిన వివరణ కొంత సహాయపడగలదు.

## ఇంగ్లీషు విద్య - పాశ్చాత్యసంపర్కం

పాశ్చాత్యపరిపాలనా కాలంలో ప్రవేశపెట్టబడిన ఇంగ్లీషు విద్యావిధానం విద్యావంతులకు ఇంగ్లీషు సాహిత్యపరిచయాన్ని కలిగించింది. ఇంగ్లీషు సాహిత్యపరిచయం భారతీయసాహిత్యంలోని ఎన్నో మార్పులకు ప్రేరణనందించింది.

ప్రాచీన కాలంలో భారతదేశంలో ఉన్న విద్యావిధానం నేటి ఇంగ్లీషు విద్యావిధానానికి పూర్తిగా భిన్నమయింది. ప్రాచీన సాహిత్యం, వ్యాకరణం, తర్కం, న్యాయం, తత్వశాస్త్రాల అధ్యయనం, మతగ్రంథ పఠనం, గణితం వంటివి ప్రాచీన భారతీయ విద్యావిధానంలో భాగాలుగా ఉండేవి.

ఆ విధానంలో విద్యనార్జించిన విద్యావంతులు, ఇంగ్లీషు భాషా పరిచయం లేకుండడం వల్ల పాశ్చాత్యదేశ పరిస్థితులను అధికంగా అవగాహన చేసుకోవడం సాధ్యమయ్యేది కాదు. ఆ కాలంలో పాశ్చాత్య దేశాలలో పారిశ్రామిక విప్లవం అనేక మార్పులు తెచ్చింది. మానవుని జీవన విధానంలో నూతనశకం ప్రారంభమయింది. ఆ శాస్త్ర పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకోవడానికి అవసరమైన సైన్సు వంటి శాస్త్రాల పఠనానికి ఇంగ్లీషు భాషా పరిచయం, ఇంగ్లీషు విద్యాభ్యాసం అవసరమయింది.

ఈ ఇంగ్లీషు విద్యావసరాన్ని గుర్తించిన రాజా రామ మోహన్ రాయ్ వంటి భారతీయులు ఈ దేశంలో యూరోపియన్ భాషలు సైన్సు వంటి శాస్త్రాలు బోధించే విద్యావిధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలనే కోరిక కనబరిచారు. దానికై కంపెనీ పాలకులను వత్తిడి చేయసాగారు. పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ కమిటీ (Public Instruction Committee) అధ్యక్షుడైన థామస్ బాబింగ్టన్ మెకాలే (Thomas Babington Macaulay) మినిట్ (Minute of Dissent 2-2-1835)[1] వలన ఇంగ్లీషు విద్యావిధానం సాధికారంగా భారతదేశంలో ప్రవేశపెట్టబడింది. 1844 లో ఇంగ్లీషు భాషాపరిచయం ఉండి

1 'భారతీయ పునరుజ్జీవనము' - D. రామలింగము . P30.

పాశ్చాత్య విజ్ఞానశాస్త్రం చదువుతున్నవారికి ప్రభుత్వోద్యోగాలకు అవకాశం ఇస్తున్నట్లు ప్రకటించిన తీర్మానంలో ఇంగ్లీషు చదువులు దేశవ్యాప్తం అయ్యాయి. 19వ శతాబ్ది మధ్యకాలానికి పాఠశాలలు కళాశాలలతో పాటు విశ్వవిద్యాలయాలు కూడా స్థాపింపబడ్డాయి.[1] ఇంగ్లీషు విద్యాభ్యాసం అధికం కావడంలో విద్యావంతులకు పాశ్చాత్య నాగరికత సంస్కృతులతో పరిచయం ఏర్పడింది. ఇంగ్లీషు సాహిత్యంలో పాశ్చాత్యవిజ్ఞానంతో పరిచయం ఏర్పడింది. ఇంగ్లీషు సాహిత్యపఠనం విద్యావంతులలో నూతనభావాలకు బీజాలు వేసింది. భాషా సంబంధమైన ఏకీకరణ విద్యావంతులు తమతమ అభిప్రాయాలను పరస్పరం అవగాహన చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

బ్రిటిషు అధ్యాపకులకు ఉద్యోగదృష్ట్యా దేశంలోని వివిధ భారతీయ భాషల పరిచయం అవసరమయింది. క్యాంబెల్ విలియం బ్రౌన్ (William Brown), సి.పి. బ్రౌన్ (C.P. Brown) మొదలైన పాశ్చాత్యపండితులు ఆ విధంగా తెలుగు భాషాధ్యయనం చేసిన వారు. తెలుగునేర్చిన పాశ్చాత్య పండితులు తెలుగు సాహిత్యానికి ఎంతో

---

1. "1841 ఏప్రిల్ 14వ తేదీని మద్రాసు యూనివర్శిటీ అను పేర నొక విద్యాసంస్థ స్థాపింపబడెను. ఈ విద్యాసంస్థయే తరువాత ప్రెసిడెన్సీ కాలేజీగా మార్పుబడింది (1855). ఇప్పుడున్న మద్రాసు యూనివర్సిటీ 1857లో కలకత్తా, బొంబాయి విశ్వవిద్యాలయములతో పాటు స్థాపింపబడెను."
తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము
కొత్తపల్లి వీరభద్రరావు P 244, 248

సేవ చేశారు. తెలుగుసాహిత్య చరిత్రలో వీరి కృషికి ప్రత్యేకస్థానం ఉంది. వీరి కృషి మూలంగా ఎన్నో తాళపత్ర గ్రంథాలు ముద్రణ పొంది వెలుగు చూశాయి. వీరి కృషిలో కొందరు దేశీయ పండితులు వారికి సన్నిహితు లయ్యారు. పాశ్చాత్య పండితుల సంపర్కం వల్ల వారికి పరిశోధనాదృష్టి అలవడింది. పరిశీలనాత్మక అధ్యయనానికి, హేతువాద వైఖరికి ఈ పాశ్చాత్య పండితుల సేవ దోహదం చేసింది. బ్రౌన్ దొర తన నిఘంటువులో వ్యావహారిక పదాలకు స్థానం ఇచ్చి గ్రాంథిక పదాలతో సమాన గౌరవాన్ని కల్పించారు. తదనంతర కాలంలో వచ్చిన వ్యావహారిక భాషావాదానికి ఇది కొంత దోహదం చేసింది. సాహిత్యంలో కవి హృదయ స్పష్టతకు భావవ్యక్తీకరణకు రసస్ఫురణకు సాధారణ విద్యావంతులకు సహితం సులభగ్రాహ్యమయిన వ్యావహారిక భాష సమర్థవంతమే అనే అభిప్రాయానికి ఆధునికులకు ఇది బలాన్నిచ్చింది. ఈ భావచైతన్యప్రభావంగా ఆధునికాంధ్ర కవిత్వంలో ప్రజల దైనందిన వ్యవహారంలోని సజీవభాషకు ప్రాముఖ్యం పెరిగి, మారుమూల నిఘంటువులలో నిద్రించే పదప్రయోగం తగ్గుముఖం పట్టింది.

ఇంగ్లీషు సాహిత్యాధ్యయనానికి కొత్త విద్యావిధానం తోడ్పడింది. పాఠ్య గ్రంథాలలోని ఇంగ్లీషు కవుల రచనలు విద్యావంతులైన యువకులకు ఇంగ్లీషు సాహిత్య పఠనాసక్తిని పెంపొందించాయి. మిగిలిన విషయాలలో లాగానే ఇంగ్లీషు సాహిత్య ప్రభావం కూడా ముందుగా వంగదేశం మీదనే పడింది. వంగదేశం దీర్ఘకాలం పాశ్చాత్య సంపర్కం పొంది ఉండటం వల్ల ఇంగ్లీషు సాహిత్యప్రభావం ముందుగా దానిని సోకి ఉండవచ్చు. ఆ ప్రభావంలో నవీనసాహిత్య లక్షణాలను సంతరించు కొనడం వంగభాష ఇతర భారతీయభాషలను దాటిపోయింది. బెంగాలీ

సాహిత్యం నుంచి అనువాదాలు ఇతర భారతీయ భాషలలో వెలువడసాగాయి. ద్విజేంద్రలాల్ రాయ్ నాటకాలు, బంకించంద్రుని నవలలు, రవీంద్రుని, శరత్ రచనలు తెలుగులోకి అనువదింపబడ్డాయి. బెంగాలీ సాహిత్యం తెలుగు కవుల రచనలలో కొంత మార్పు తెచ్చింది.

తెలుగు సాహిత్యంలో నవ్యమార్గాలలో ప్రయోగాలు చేసినవారిలో దాదాపు అందరూ ఇంగ్లీషు సాహిత్యంలో పరిచయం కలిగినవాళ్ళే అని చెప్పుకోవచ్చు. ఇంగ్లీషు సాహిత్య పరిచయం వల్ల నవ్యకవులలో ఒకవిధమైన చైతన్యం భావవిప్లవం చోటు చేసుకున్నాయి. టెనిసన్ (Tennyson) వర్డ్సువర్తు (Wordsworth) షెల్లీ (Shelley) కీట్సు (Keats) వంటి ఇంగ్లీషు కాల్పనిక కవుల రచనలు విద్యార్థులలో నూతనోత్తేజాన్ని కలిగించాయి. ఇంగ్లీషు సాహిత్యపరిచయం తెలుగులో నూతన సాహిత్య ప్రక్రియలు, ఛందోరీతులు, ప్రవేశించడానికి సహాయపడింది. ఏకాంకిక, కథానిక, వ్యాసరచన, నవల వంటి సాహిత్య ప్రక్రియల మీద ఇంగ్లీషు సాహిత్య ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. విషాదాంత రచనలకు కూడా ఇంగ్లీషుసాహిత్యం దోహదం చేసింది. కొంత స్వేచ్ఛ, సాహసం పెరిగి ఇంగ్లీషు రచనలవంటి రచనలు తెలుగులో కూడా చేయాలనే కుతూహలం ఆధునిక కవులలో కలిగింది. ఖండకావ్య ప్రక్రియ తెలుగు భాషకు పూర్తిగా కొత్తది కాకపోయినా ప్రాచీన సాహిత్యంలో దానికి ఆదరణ గౌరవం కొంత తక్కువగానే ఉండేదని అనవచ్చు. కాని 20వ శతాబ్దిలో నవ్య కవిత్వోద్యమంలో వస్తువైవిధ్యంలో ఖండకావ్యం అధికప్రచారం పొందింది. దీనికి పత్రికా వ్యాప్తితో పాటు ఇంగ్లీషు సాహిత్య పరిచయం కూడా దోహదం చేసింది.

---

## అవ్యవహిత పూర్వకాలంలో తెలుగు సాహిత్యం.

17 వ శతాబ్ది ప్రారంభం నాటికి తెలుగు సాహిత్యం - ప్రధానంగా కవిత్వం కొంతవరకు క్షీణదశలో ఉన్నదని చెప్పవచ్చు. కవులు తమ పాండితీ ప్రకర్ష ప్రదర్శనకై ద్వ్యర్థి, త్ర్యర్థి, నిరోష్ఠ్యాల వంటి నియమాలలో కావ్యరచన చేయసాగారు. గర్భ, బంధ, చిత్ర కవిత్వాల సంఖ్య వృద్ధి పొందింది. శ్లేషార్థ పోషణకు, ఆశించిన చమత్కృతిని సాధించడానికి నిఘంటువులలోని మారుమూల పదాల ప్రయోగం అధికమయింది. రసపోషణ, శయ్యాసౌభాగ్యం కథాచమత్కారం క్షీణించసాగాయి. పదకాఠిన్యమే మేటి కవితకు యోగ్యతా పత్రంగా భావించి కవులు కావ్యాలను పండితులకే పరిమితం చేయసాగారు. వీరేశలింగం పంతులు వంటి సంస్కర్తలు సహితం నిరోష్ఠ్య కావ్యాల రచన సాగించారంటే ఆ కాలంలోని పాండిత్య ప్రదర్శనా ప్రభావం ఎంత ఎక్కువగా ఉండో తెలుస్తుంది. తరువాత తనకు తానే ఆ మార్గం తగినది కాదని గుర్తించిన పంతులుగారు 'సరస్వతీ నారద సంవాదం' వంటి రచన చేశారు. ఆ కాలపు రచనలలో వ్యర్థపదాడంబరం హెచ్చి కవిత్వం నిస్సారం కావడం కనిపిస్తుంది. స్త్రీ అంగాంగ వర్ణన, అసభ్య శృంగార వర్ణనలు కావ్యాలలో చోటు చేసుకోసాగాయి. క్షుద్ర శృంగార కావ్యాలు తెలుగు సాహిత్యంలో ప్రవేశించాయి.

ఈ విధమైన సాహిత్యం యువకవులలో అసంతృప్తి కలిగించింది. వాళ్ళు సాహిత్యంలో నవ్యతను, మార్పును ఆశించారు. ఆ స్థితిలో ఇంగ్లీషు సాహిత్య పరిచయం వారి ఊహలు క్రొత్త మార్గాలలో పయనించడానికి తోడ్పడింది. కనుకనే ఇంగ్లీషు సాహిత్యంలోని నవ్యరీతుల పట్ల వాళ్ళు సులభంగా ఆకర్షితులయ్యారు. ఈ విధంగా తెలుగులో నవ్యకవితోద్యమానికి అవ్యవహిత పూర్వకాలంలోని తెలుగు

సాహిత్య స్థితిగతులు కూడా కొంతవరకు దోహదం చేశాయి.

ఈ విధంగా మత, సాంఘిక, రాజకీయ సాహిత్యస్థితులలో తీవ్రమైన సంచలనం దాదాపుగా ఒకేకాలంలో సంభవించింది. సాహిత్య తత్త్వంలో మార్పు వచ్చింది. ఈ 19వ శతాబ్దిలో సామాజిక, సాంస్కృతిక పరిస్థితులవల్ల ప్రభావితమైన సాహిత్యదృక్పథంలోని మార్పులను ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

ముద్రణాయంత్రం, పత్రికల వంటి వాని సహాయంతో తెలుగుసాహిత్యం ప్రజలలో వ్యాప్తిపొందింది. ప్రాచీన గ్రంథాల సేకరణ, ముద్రణపట్ల ఆసక్తి పెరిగింది. నిఘంటు నిర్మాణం, భాషాచరిత్ర, పరిశోధన వంటి విషయాల పట్ల నూతన దృక్పథం, శ్రద్ధ, ఆసక్తి ఏర్పడింది. జన వ్యవహారంలో ఉన్న వ్యావహారిక భాషకు కావ్యభాషాగౌరవం దక్కింది. జాతీయతాభావం పెరిగి జాతి, మత, వర్ణ వ్యవస్థల పట్ల భేదాభిప్రాయాలు కొంత సన్నగిల్లాయి. ఛాందసదృష్టి కొంత తగ్గి సర్వమానవ సౌభ్రాత్రము, సమానత్వము అనే భావాల ప్రచారం పెరుగసాగింది. అనేక నూతనసాహిత్య ప్రక్రియలు తెలుగుసాహిత్యంలో ప్రవేశించాయి. సంఘంలోని దురాచారాలు మూఢనమ్మకాలు నిర్మూలించాలనే దృష్టి ఏర్పడింది. ఇది ఒకవిధంగా సంధియుగంగా చెప్పదగినకాలం. "సాంఘికరంగమున సంస్కరణాభిలాష, సాహిత్యరంగమున నవ్యసృష్టి, భావనారంగమున విశృంఖల విహారము, సంప్రదాయరంగమున వ్యవస్థితవస్తుతిరస్కారము, రచనలో భాషాసౌలభ్యము అనునవి ఈ సంధియుగమున ధర్మపంచకము."[1]

ఈ విధంగా అనేక

---

1. "తెలుగుసాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము"
   కొత్తపల్లి వీరభద్రరావు P.257

రంగాలలో సంచలనం కలిగించిన ఈ సంధియుగం యువకవులలో తమ మనోగత భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే సాహసానికి ఉద్దీపకం అయింది. ఈ పరిస్థితుల కారణంగా నవ్యకవిత్వం క్రమ పరిణామరూపంగా వచ్చిందేగాని ఒక్కసారిగా ఏదో ఒక్క కారణంలో వచ్చింది కాదు.[1]

"ఆంగ్ల భాషా ప్రభావము ఆంధ్రభాషపై మొట్టమొదట పడి నూతనపదజాలమును కల్పించెను. క్రమక్రమముగా ఆంగ్లసాహిత్య ప్రభావము ఆంధ్రసాహిత్యముపై పడినది. ఇది పరిణామ రూపమున వచ్చినదేగాని హఠాత్సంభవమైనది కాదు".[2]

ఈనాడు అధికప్రచారాన్ని పొందిన నవీనవృత్తాలకు నూతన కావ్యరీతులకు ఈ పరిస్థితులు ప్రేరణనిచ్చాయి. నవ్యకవులు కావ్యవస్తు గ్రహణం, భావవ్యక్తీకరణ విధానం, భాషాప్రయోగాల వంటివాటిలో కొంత స్వాతంత్ర్యం వహించారు. సాహిత్యం కాలక్రమాన పరివర్తన పొందుతుండడానికి నవ్యకవిత్వ ఆవిర్భావం

---

1. 'నవ్యకవిత్వము ఒక్కమాటుగా ఘటిల్లినది యౌవనము వలె వచ్చిపడలేదు.--- సాంఘిక రాజకీయ భాషా స్థితిగతుల ప్రోద్బలములో మాగి మాగి వెలువడిన మహాప్రయోగము.'
'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగములు'
C. నారాయణరెడ్డి. P 162
2. 'తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము'
కొత్తపల్లి వీరభద్రరావు P 219

నిదర్శనంగా నిలబడుతున్నది.

ఇలా వెలువడిన ఈ నవ్యకవిత్వం దాదాపుగా ఇంగ్లీషు కాల్పనిక కవిత్వపు అడుగుజాడలలో నడిచింది. నవ్యకవిత్వ తత్త్వస్పష్టతకు నవ్యకవులను (ప్రోత్సహించి) వారిపై అధికప్రభావాన్ని చూపిన ఇంగ్లీషు కాల్పనిక కవిత్వవివరణ కొంత సహాయపడగలదు.

---

## ఇంగ్లీషు కాల్పనిక కవిత్వోద్యమం.

తెలుగుదేశపు విద్యావంతులు ఇంగ్లీషు కావ్యాలను పాఠ్యభాగాలుగా పాఠశాలల్లో, కళాశాలల్లో చదివి వాటిపట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఆనాటికి ఇంగ్లీషు కవిత్వంలో ప్రత్యేకస్థానాన్ని పొందిన కాల్పనిక కవిత్వం తెలుగు నవకవులను ఆకర్షించింది.

తెలుగు సాహిత్యంలో నవ్యకవిత్వావిర్భావానికి అవ్యవహిత పూర్వంగా ఉన్న క్షీణ ప్రబంధ యుగపు కవిత్వానికి, ఇంగ్లీషు కాల్పనిక కవిత్వోద్యమానికి అవ్యవహిత పూర్వంగా ఉన్న పోపు యుగపు (classical Age) కవిత్వానికి కొన్ని పోలికలు కనబడతాయి. ఈ రెండింటిలో కూడా భావానికంటె రీతికి, శైలికి ప్రాధాన్యం ఇవ్వడం ఉంది. కవిత్వంలో సహజత్వం, భావనాశక్తి లోపించి చమత్కారం, అలంకార వ్యామోహం కృత్రిమమైన జిలుగులు చోటుచేసుకున్నాయి. పాండిత్య ప్రదర్శన పట్ల ఆకర్షణ పెరిగింది.

ఇంగ్లీషు, తెలుగు భాషల్లో రెండింటిలో కూడా తత్పూర్వ కవిత్వాలలో పైవిధంగా ఉన్న లక్షణాలపట్ల విముఖత్వంతో దానిమీద కొంత తిరుగుబాటు ధోరణిలో కవులు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ప్రకటించుకొని నవ్యమార్గాలను అవలంబించారు. కనుక ఇంగ్లీషు కాల్పనిక కవిత్వానికి అవ్యవహిత పూర్వంగా ఉన్న పోప్ యుగపు కవిత్వలక్షణాలు సూక్ష్మంగా పరిశీలిస్తే కాల్పనిక కవిత్వపు విశిష్టత స్పష్టపడుతుంది.

### పోప్ యుగపు కవిత్వలక్షణాలు.

ఐతిహాసికయుగానికి (classical Age) ప్రతినిధిగా పోప్ సృష్టించ

ఉన్నారు. పోప్ భావంలోగాని ఆవేశంలో గాని నూతనత్వం స్వతంత్రం కనబడవు. ఈ ఐతిహాసిక యుగం లోని సాహిత్యంలో హేతువాదనకు వాస్తవికతకు ప్రముఖ స్థానం ఉండేది. పాండిత్యానికి ధీశక్తికి ప్రాధాన్యం ఉండేది. ఈ యుగపు కవులు భావనకు (imagination) ప్రాధాన్యమివ్వలేదు.[1] భావన - స్ఫూర్తింపు లేకపోగా, అపహాస్యం పాలయింది. కవిత్వంలో ఆవేశం గర్హించబడింది. ఆవేశప్రధాన రచన నిరసన పొందింది. నూతన విషయాల కల్పన కంటె నడవడిని కట్టుదిట్టపరిచే నైతిక సూత్రాలనే రచయితలు, పాఠకులు కూడ ఆదరించారు. వీరి దృష్టిలో కవి తాను "చూసినవాటిని, వాస్తవికంగా ఉన్నవాటిని అందంగా, అలంకారికంగా వ్యాఖ్యానించే వ్యాఖ్యాత మాత్రమే. అంతేకాని నూతనకల్పనలలో సత్యాన్ని సృష్టించే స్రష్ట కాదు.[2] విమర్శలో కూడిన అధిక్షేపాత్మక కవిత్వం అధికంగా ఉండేది.

## కాల్పనిక కవిత్వం.

(మానవ స్వభావంలోని నవ్యతాప్రీతి కొత్త పద్ధతుల ప్రారంభానికి ప్రోత్సాహమిస్తుంది. సాహిత్యంలో సహితం కాలక్రమంగా కొంతమార్పు రావడం

---

1. "If we wish to distinguish a single characteristic which differentiates the English Romantics from the poets of eighteenth century, it is to be found in the importance which they attached to the imagination and in the special view which they held of it."
2. "For them the poet is more an interpreter than a creator".

1 & 2 'The Romantic Imagination' By C. M. Bowra P. 1

సహజం. ఇంగ్లీషు సాహిత్యంలో ఆగస్టను యుగపు సాహిత్యానికి కొంత విరుద్ధంగా కొన్ని విశిష్టలక్షణాలతో కాల్పనికోద్యమం (Romantic Movement) ప్రారంభం అయింది (కాల్పనికోద్యమం మొట్టమొదట జర్మనీదేశంలో ప్రారంభమై తరువాత ప్రపంచవ్యాప్తం అయినట్లు తెలుస్తున్నది.

ఇంగ్లీషు భాషలో 17వ శతాబ్ది మధ్యభాగానికి రొమాంటిక్ (Romantic) అనుపదం ఇప్పటి ప్రచారంలో ఉన్న అర్థానికి భిన్నంగా కొంత చెడు అర్థంలో కనబడుతుంది. 18వ శతాబ్దిలో కొంత కించపరచే ధోరణిలో ప్రయోగించబడుతున్న ప్రకృతి దృశ్యాల వర్ణనల్లో, అటువంటి ప్రయోగాలలో చేదు.[1] డా॥ జాన్సన్ (Dr. Johnson) రచనలలో ఈ పదం మంచి, చెడు అర్థాలు రెండింటిలో వాడబడింది. రొమాంటిక్ పదం మొదట వాఙ్మయానికి

1 Like the terms 'gothic' and 'baroque', therefore 'romantic' started in a bad sense. The shade of meaning indicated by romantic at this stage of its development is clearly evinced by the other words with which it was usually coupled, words such as 'chimerical', 'ridiculous', 'unnatural', 'bombast'.... side by side with deprecatory use of the word in relation to the events and sentiments of the old romances, romantic came to be used also to describe scenes and landscapes similar to those described

సంబంధించిందయినా, తరువాత ప్రకృతిలోని ఉగ్రత, తీవ్రత, విహారస్ఫూర్తులను ప్రేమించే తత్త్వానికి వ్యక్తపరిచే అర్థంలో ప్రయోగానికి వచ్చింది.[1] 1776లో ఫ్రెంచ్ రచయితలు (Latourneur, The Marquis de Girardin) అనుభూతిని సహితం వ్యక్తపరిచే శక్తిగల పదంగా 'రొమాంటిక్' ను గ్రహించారు. వీళ్ళదృష్టిలో ఆ పదం ఈవిధంగా ఉంది. "Romantic describes not only the scene but the particular emotion aroused in the person who contemplates it".[2] కాల్పనిక కవితా సిద్ధాంతకులనిగా పరిగణింపబడుతున్న 'రూసో' (Rousseau) ఈ పదాన్ని కూడా ఈ విధంగా అభిప్రాయపడ్డాడు. "'Romantic' is a subjective character, like 'interesting', 'charming', 'exciting', which describe not so much the property of the objects as our reactions to them, the effects which they arouse in an impressionable onlooker".[3]

ఎల్. పి. స్మిత్ (L.P. Smith)

---

in them, and, this time without any note of scorn. 'Romantic Agony' By Praz. Introduction. P12

1. "The adjective has gradually ceased to retain its connexion with the literary genre (the romances) from which it was originally derived, and has come to express more and more the growing love for wild and melancholy aspects of nature."

1, 2, 3 - 'Romantic Agony' By Praz. Introduction P 12, 13

సాహిత్యం, కవిత్వం అనే ముసుగులో నుంచి చూస్తే కనుపించే ప్రకృతి అంతా రొమాంటిక్ అని అన్నారు. తరువాత తరువాత ఈ పదం అద్భుతత్వం, ఉపదేశాత్మకం, గతస్మృతుల భావసముదాయానికి సంబంధం కలిగిన పదంగా, వ్యక్తీకరణకు అసాధ్యం అయిన మానసిక స్థితికి సంబంధించిందిగా ప్రయోగం పొందింది.

"The word 'Romantic' thus comes to be associated with another group of ideas, such as 'magic', 'suggestive', 'nostalgic' and above all with words expressing states of mind which cannot be described, such as the German 'Sehnsucht', and English 'wistful'.[1] రొమాంటిక్ పదానికున్న ఈ అర్థచ్ఛాయలన్నీ ఆంగ్ల కాల్పనిక కవుల (English Romantic Poets) రచనల్లో కనబడతాయి.

కాల్పనిక కవులు[2] ఐతిహాసికమయిన కవులకు భిన్నంగా తాము ప్రత్యేక నమ్మకాలలో రచనలు సాగించారు. వీళ్ళ దృష్టిలో కవికి ప్రధానమైనది భావన (Imagination). భావనాశక్తిని వీళ్ళు గొప్పవరంగా భావించారు. భావన లేనిదే కవిత్వమే లేదని వీళ్ళ అభిప్రాయం.[3] "One power alone makes a poet: Imagination, the Divine Vision". The imagination

---

1. 'The Romantic Agony' By Praz. Introduction P12,13
2. Blake, Coleridge, Wordsworth, Shelley Keats మొదలైన వాళ్ళు ఆంగ్ల కాల్పనిక కవులలో ప్రముఖులు.
3. "For the Romantics imagination is fundamental, because they think that

uncovers the reality masked by visible things."[1]

దృగ్గోచరాలైన వస్తువుల వెనుక కనబడని సత్యాలను చూపే సృజనాత్మక భావనాబలం కవులకు ముఖ్యమని వీళ్ళ నమ్మకం. వస్తువులలో అగోచరాలైన అంతస్సత్యాలను దర్శించడంలో భావనాశక్తి ఇమిడి ఉంది. దీనికి మనోనేత్రాలతో దర్శించగలిగే అంతర్దృష్టి (insight) అవసరం. అంతర్దృష్టి, భావనాబలం పరస్పరం ఒకదానికొకటి తోడ్పడేవి. వీళ్ళ దృష్టిలో కవి భావనాశక్తితో ఊహాలోకాలను సృష్టించగల స్రష్ట (creator). ఈ కవులు ఊహాశక్తి మీద ఆధారపడి కవితావేశాన్ని సంపూర్ణసత్యంగా విశ్వసించారు.

కాల్పనిక కవులు హేతువాదానికంటె అనుభూతికి ప్రాధాన్యమిచ్చారు. అనుభూతి వలన కలిగే ఆనందం

---

without it poetry is impossible..... for coleridge the imagination is of first importance because it partakes of the creative activity of God. This is a tremendous claim and it is not confined to Blake and coleridge. It was to some degree held by Wordsworth and Shelley and Keats. Each was confident not only that the imagination was his most precious possession but that it was somehow concerned with a supernatural order."

"The Romantic Imagination" By C.M. Bowra P1,4

1. "The Romantic Imagination". By C.M. Bowra. P1,4)

హేతువాదం వలన నశిస్తుందని వాళ్ళ అభిప్రాయం. ఉద్వేగానికి, ఆవేశానికి ప్రాధాన్యానిచ్చి హేతువాదాన్ని తిరస్కరించినవాళ్ళలో షెల్లీ (Shelley), బ్లేక్ (Blake), కీట్సు (Keats) అగ్రగణ్యులు. అనుభూతి వల్ల కలిగే కవితావేశం కవిత్వానికి ముఖ్యం అని వాళ్ళ నమ్మకం. వర్డ్సువర్తు (Wordsworth) జనపదాల దృశ్యాల్లో పొందిన ఆకర్షణ, కాలరిడ్జి (Coleridge) గమనించిన నిద్రా జాగ్రదావస్థల్లోని అద్భుతమైన భేదాలు షెల్లీ భావోద్రేకం, కీట్సు సృజనాత్మక కృషిలో పొందిన తన్మయత్వం దాదాపుగా వాళ్ళ ముందరి కవులెవ్వరూ పొందలేదనవచ్చు![1]

ఇంగ్లీషు కాల్పనిక కవుల్లో వర్డ్సువర్తు, కాలరిడ్జి మొదటితరానికి చెందినవాళ్ళు. ఈ మొదటితరం కవులు సంప్రదాయం పట్ల కొంత అభిమానాన్ని చూపారు. బైరన్ (Byron), షెల్లీ రెండవ తరానికి చెందినవాళ్ళు. వీళ్ళు ముందుతరం కవులకంటె కొంత ధైర్యంగా సాహసంతో ముందంజ వేశారు.

కాల్పనిక కవులు తమ భావావేశాలను వ్యక్తం చేయడానికి అనుగుణమైన ఛందోమార్గాలను ఎన్నుకొన్నారు. పోప్

---

1. "It would be hard to think of another man who combined, as Blake did an extraordinary power of vision with the tenderest compassion for the outcast and the oppressed, or who, like Shelley, used his Platonic musings to unfold an enormous scheme for the regeneration of the world."

"The Romantic Imagination". C. M. Bowra. P1-4

ఆ యుగం లోని భాషను కృత్రిమమయిందని తలచి దానిని వదలివేశారు. స్వచ్ఛమైన కవిత్వం నిరాడంబరమైన సామాన్యపదాల్లోనే ఉంటుందని వర్డ్స్‌వర్త్ అభిప్రాయం. ఈయన సామాన్యభాషలో సామాన్యవిషయాలను గూర్చి కవిత్వం చెప్పారు. ఏన్షెంట్ మారినర్‌లో (Ancient Mariner) లో కాలరిడ్జ్ రమణీయపదజాలంలో మరెవరికీ సాధ్యంకాని విధంగా శబ్దసౌందర్యాన్ని సాధించాడు. వర్డ్స్‌వర్త్ సామాన్యపదాలను వాడితే కాలరిడ్జ్ ఆ పదాలలో వైచిత్ర్యాన్ని కళాత్మకంగా ప్రదర్శించాడు. కాల్పనిక కవులు నూతనపదాలను నూతన అర్థాలలో ప్రయోగించి కవిత్వానికి నవ్యత్వాన్ని తెచ్చిపెట్టారు.

వీళ్ళు కావ్యవస్తువులో కూడ స్వాతంత్ర్యంలో కొత్తదనం చూపారు.[1] కవితావస్తువు బాహ్యంగా కనిపించే వస్తువుల ఉనికి ముఖ్యం కాదని వీళ్ళ నమ్మకం. పోప్, డ్రైడెన్ (Dryden), మిల్టన్ (Milton), స్పెన్సర్ (Spenser) లకంటె కాల్పనిక కవులు వాళ్ళ కవితావస్తువుల వల్ల సామాన్య జీవితానికి సన్నిహితంగా ఉన్నారు. సామాన్యప్రజాజీవితానికి పరిచయం అయిన విషయాలను కావ్యవస్తువులుగా గ్రహించడం వల్ల వీరి ఊహాప్రపంచాలు అసంగతాలు కావని సామాన్యుడికి నమ్మకం ఏర్పడింది. ఈ విషయంలో వీళ్ళు జర్మన్ కాల్పనిక

---

1. వర్డ్స్‌వర్త్‌కు సామాన్యమైన నీటిజంతువులను జలగలను ఏరి జీవించేవాళ్ళు (Leach gatherer), ముసలి వేటగాళ్ళు (Old huntsman), చిన్నపిల్లలు (small girls) బుద్ధిహీనుడు (Idiot boy) కూడా కవితా వస్తువులే.

కవులకు కొంత భిన్నంగా ఉన్నారు.[1]

భావావేశం, వ్యక్తిత్వ ప్రకటన, విషాదం పట్ల ఆసక్తి, కాల్పనిక కవులకు ప్రత్యేక లక్షణాలు. జాన్సన్ యుగంలో (Johnson Age) కవులు కొందరు కొన్ని కొత్త పద్ధతులను ప్రవేశపెట్టారు. వాళ్ళు తమను కాల్పనిక కవులుగా భావించలేదు. కాని వాళ్ళ కవిత్వంలో కాల్పనికకవిత్వ లక్షణాలుగా చెప్పబడే కవిత్వచ్ఛాయలు కనబడతాయి. కాల్పనికకవులకు వీళ్ళ రచనలు కొన్ని కొంత మార్గదర్శకాలు అయ్యాయి. ఇంగ్లీషు కాల్పనిక కవిత్వ విశిష్ట లక్షణాలైన ప్రకృతి ప్రీతి, ప్రణయ తత్త్వం, అద్భుతత్వం, గత వైభవ పునరుద్ధరణం, ఆత్మాశ్రయత్వం, సాహస ప్రియత్వాలు ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలో ప్రతిబింబితంగా ఉన్నాయి.

## ప్రకృతి ప్రీతి.

కాల్పనిక కవులకు ముందు కవులు నాగరిక జీవనచిత్రణపట్ల చూపిన శ్రద్ధ ప్రకృతి వర్ణనల పట్ల చూపించలేదు. ఎవరైనా ఒకటి రెండు చోట్ల ప్రకృతివర్ణన చేసినా అవి కాల్పనిక కవులలాగా అనుభూతి ప్రధానాలు

---

1. "The Romantics certainly created worlds of their own, but they succeeded in persuading others that these were not absurd or merely fanciful. Indeed, in this respect they were closer to earth and the common man than some of their German contemporaries."
"The Romantic Imagination". By C. M. Bowra. P4

వాళ్ళు. మొట్టమొదటిసారిగా ప్రకృతిని ఉపాసించిన కవి స్కాట్లాండు (Scotland) దేశానికి చెందిన అలన్ రాంసే (Allan Ramsay)[1]. ప్రకృతిలోని సౌందర్యాలను వైవిధ్యాలను ఆధారంగా చేసుకొని జేమ్సు థామ్సన్ మొదటిసారిగా సుదీర్ఘ కావ్యాన్ని 'సీజన్సు (seasons)' పేరిట వ్రాశారు. థామ్సన్ ప్రకృతిలో దైవత్వాన్ని దర్శించి సమగ్రరూపంలో వర్ణించారు. అయితే కాల్పనిక కవులలాగా తన భావాలను ప్రకృతికి ఆపాదించక తన వ్యక్తిత్వాన్ని మరుగుపరచుకున్నారు. విలియమ్ కౌపర్ రచనలో ప్రకృతి పట్ల ప్రేమ కన్పిస్తుంది. ఇతడు తనకు ప్రశాంతతను ప్రసాదించిన ప్రకృతికి కృతజ్ఞతలు ప్రకటించడంలో లేక్ కవుల (Lake Poets) ను తలపింప చేస్తాడు.

అయితే కాల్పనిక కవులు స్వానుభవంలో ప్రకృతిలో తాదాత్మ్యం పొంది ప్రకృతిని దేవతగా ఆరాధించారు. ప్రకృతి ఉపాసన కాల్పనిక కవుల ప్రత్యేకత.

"In nature all the Romantic Poets found their initial inspiration. It was not everything to them but they would have been nothing without it"[2].

ప్రకృతి కవిగా (Nature Poet) ప్రసిద్ధి పొందిన వర్డ్స్‌వర్త్ ప్రకృతికి సమీపంగా ఉండడానికి నగరజీవితాన్ని తిరస్కరించారు.

---

1. "ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు ప్రయోగములు" C. నారాయణరెడ్డి. P 189.
2. "The Romantic Imagination" By C.M. Bowra P.13

ప్రకృతిలో అందరి మెప్పు పొందని విషయాలను ఈయన కవితావస్తువులుగా గ్రహించాడు. జార్జి క్రాబ్ (George Crabbe 1754-1832) సామాన్య ప్రజల పట్ల సానుభూతి చూపి, సామాన్యుల జీవితంలోని బాధలను చిత్రించి వర్డ్స్‌వర్త్‌కు కొంత మార్గదర్శకుడయ్యాడు. వర్డ్స్‌వర్త్ దృష్టిలో ప్రకృతిలో సహజసిద్ధమైన కొండకోనలు, చెట్లు చేమలు, నదీనదాలు సజీవాలు. ప్రకృతి సందర్శనం కవిలో కలిగించిన భావసంచలనాన్ని వర్ణించాలన్నదే వీళ్ళ ధ్యేయం. సజీవంగా కనిపించిన ప్రకృతి ఎన్నోవిధాల వర్డ్స్‌వర్త్‌ను ప్రోత్సహించింది.

"To every natural form, rock, fruit or flower,
Even the loose stones that cover the highway,
I gave a moral life, I saw them feel
Or linked them to some feeling, the great mass
Lay bedded in a quickening soul, and all
That I beheld respired with inward meaning."[1]

ప్రకృతిని భగవత్ సాక్షాత్కారంగా వర్డ్స్‌వర్త్ భావించాడు. ప్రకృతిలో ప్రతి అణువు ఏదో సత్యాన్ని బోధిస్తున్నట్లుగానే ఈ కవి భావించాడు.

## ప్రణయ తత్త్వం - సౌందర్యారాధన

కాల్పనిక కవుల ప్రణయ తత్త్వానికి ప్లేటో ప్రేమసిద్ధాంతం కొంత ప్రోత్సాహాన్నిచ్చింది. వీళ్ళు స్త్రీని కామైక దృష్టితో చూడలేదు. స్త్రీలో మాతృమూర్తిని దర్శించి గౌరవించారు.

'You were a Mother! That most holy name
Which heaven and Nature bless[2].... (coleridge)

---

1. 'The Starlit Dome' By W. Knight P.2
2. Quoted in 'The Starlit Dome' By W. Knight P.110

మాతృమూర్తి పరమ పవిత్రం అని నమ్మారు.[1] భార్యను కూడ కామదృష్టితో కాక అభిమానంతో ఆదరంతో జీవితభాగస్వామిగా తలచారు.

"A Promise and a mystery,

A pledge of more than passing life."[2] (Coleridge)

కాల్పనిక కవులు వియోగానికి విషాదానికి కొంత ప్రాధాన్యం ఇవ్వటం కనిపిస్తుంది. మానవుని బాధకు సౌఖ్యానికి విడదీయరాని సంబంధం ఉందని వీళ్ళలో కొందరి నమ్మకం. విషాదం మధురమనే భావం కనిపిస్తుంది.

'Our sweetest songs are those that tell of saddest thought' అనిన షెల్లీ విషాదంలో కూడ ఆనందాన్ని చూడటం కనిపిస్తుంది.

సౌందర్యాన్ని కాల్పనిక కవులు ప్రత్యేకదృష్టితో గమనించారు. సౌందర్యం పట్ల వీళ్ళ దృష్టి వీళ్ళకే ప్రత్యేకం. అందరిలో సౌందర్యవంతాలని అంగీకరించబడిన వస్తువుల విషయాలు మాత్రమే అందంకలవని వీళ్ళు అనుకోలేదు. సృష్టిలో దాదాపు ప్రతి వస్తువులో వీళ్ళు అందాన్ని చూశారు. ఇతరికి అందానికి ఏ మాత్రం ఆస్కారంలేని భయంకర, జుగుప్సాయుత విషయాల్లో కూడ వీళ్ళకు అందం కనిపించింది.[3]

---

1. "A mother is 'the holiest thing alive' (The three graves) the human and divine blend."
'The Starlit Dome' By W. Knight. P 110
2. Quoted in 'The Starlit Dome' By W. Knight. P 110.
3. For the 'Romantics beauty was enhanced by exactly those qualities which seem to deny it, by those objects which produce horror; the sadder, the more painful it was the more intensively

"Oh! what delight! what woe! I cannot turn
My looks from her sweet piteous countenance
How strangely does a single blood-red line,
Not broader than the sharp edge of a knife,
Adorn her lovely neck."

(Beauty of Medusa - Shelley)

కీట్స్ రచన 'ఇసబెల్లా ఆర్ పాట్ ఆఫ్ బాసిల్ (Isabella or Pot of Basil) లో కూడ భయానక విషయంలో అందాన్ని ప్రేమించటం కనిపిస్తుంది. మనకు కనబడే వస్తువుల వల్ల మనం తెలుసుకునే సత్యమే సౌందర్యం అని కీట్స్ అభిప్రాయం! షెల్లీ ప్రేమ తత్త్వం కేవలం స్త్రీ పురుషులకే పరిమితం కాదు. మానవత్వాన్ని మొత్తాన్ని ప్రేమించాడు. షెల్లీ మానవతావాదం 'ప్రామిథియస్ అన్ బౌండ్ (Prometheus unbound) లో పరిపూర్ణంగా కనిపిస్తుంది. షెల్లీ ప్రేమ తత్త్వం మానవులకు మాత్రమే కూడ పరిమితం కాక జీవకోటి కంతటికీ వ్యాపించింది. జంతువులు, పుష్పాలు, పంచభూతాలు కూడ అతని ప్రేమతత్త్వంలో పాలు పంచుకున్నాయి.

---

they relished it."

"The Romantic Agony' By Mario Praz P. 27

1. "The Romantics thought that beauty is a final quality of reality revealed through visible things."

'Romantic Imagination' By C. M. Bowra. P283

## అద్భుతత్వం.

కాల్పనికోద్యమాన్ని అద్భుతత్వ పునరుద్ధరణం (Renaissance of wonder) అని అన్నారు.[1] జీవితంలోని వాస్తవిక సత్యాలనుండి ఎక్కడికో ఏ లోకాలకో ఎగిరిపోవాలని కాల్పనిక కవుల కోరిక. మనకు తెలిసిన ఈ ప్రపంచం కంటె సంతృప్తికరం, సంపూర్ణం అయిన దానిని దేనినో పొందాలనే ఆరాటం, తపన వీళ్ళ కవిత్వం మీద అధిక ప్రభావాన్ని చూపాయి. కాలరిడ్జి ఏన్షెంట్ మారినర్ (Anciant Mariner), క్రిష్టబెల్ (Christabel) కుబ్లాఖాన్ (Kubla Khan) వంటి రచనలు అద్భుత ప్రియత్వాన్ని ప్రదర్శించేవే. ఏ కవిత్వంలో అయినా అద్భుతం ఆశ్చర్యం, ఆనందం ఇవ్వడం సహజమే, అయినా కాల్పనిక కవులు అద్భుతానికి అధిక ప్రాధాన్యాన్నిచ్చారు. మన పరిసరాల్లో మనకు తెలిసిన వస్తువుల్లో ఆశ్చర్యాన్ని, అద్భుతాన్ని చూడాలంటే పసిపాపల మనస్తత్వం అవసరం అని వర్డ్స్‌వర్తు, కాలరిడ్జిల అభిప్రాయం. ఇమ్మార్టల్ ఓడ్ (Immortal Ode) లో వర్డ్స్‌వర్తు అభిప్రాయంలో ఏకీభవిస్తూ కాలరిడ్జి "The poet is one who carries the simplicity of childhood into the powers of manhood, who, with a soul unsubdued by habit, unshackled by custom, contemplates all things with the freshness and wonder of a child."[2] అని అన్నాడు.

షెల్లీ కూడ డిఫెన్స్ ఆఫ్ పొయిట్రీ (Defence of Poetry) లో దాదాపు ఇదే అభిప్రాయాన్ని ప్రకటించాడు.

---

1,2. "The Romantic Imagination". By C. M. Bowra. P 285, 286

## గతవైభవ పునరుద్ధరణం

పోప్ యుగంలో హేతువాదంలో నమ్మకం వల్ల ప్రాచీన పురాణగాథల ప్రాముఖ్యాన్ని కొంత పోగొట్టుకున్నాయి. అయితే కాల్పనిక కవులు హేతువాదాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల, అద్భుతత్వాన్ని ఆదరించడం వల్ల ప్రాచీన పురాణగాథలు వీళ్ళ దృష్టిలో తిరిగి విలువను సంతరించుకున్నాయి. కాలరిడ్జి పురాతనగాథలను నూతన వాతావరణంలో సృష్టించాడు. రాబర్ట్ సదీ (Robert Southey 1774-1843) ముఖ్య లక్ష్యం పాత గాథలను చిత్రించడమే అనవచ్చు. వాల్టర్ స్కాట్ (Walter Scott-1771-1832)కు సహితం ఇటువంటి కథలపట్ల ఆసక్తి హెచ్చు. వర్డ్స్‌వర్త్ ఎక్స్‌కర్షన్ (Excursion) షెల్లీ ప్రామిథియస్ అన్‌బౌండు (Prometheus unbound), కీట్స్ హైపీరియన్, ఎండిమియన్ (Hyperion, Endymion) వంటి రచనలకు కూడ గ్రీకు పురాణగాథలు ఆధారం అని చెప్పవచ్చు.

## సాహసప్రియత్వం

None but the Brave
None but the Brave
None but the Brave deserves the Fair

అని అలెగ్జాండర్స్ ఫీస్ట్ (Alexander's Feast) లో డ్రైడెన్ మాటల్లోని భావం కాల్పనిక కవుల దృష్టిలో ప్రాముఖ్యాన్ని వహించింది. కాల్పనికోద్యమంలో వీరగాథలు ఆదరణ పొందాయి. బైరన్ చైల్డ్ హెరాల్డ్స్ పిల్గ్రిమేజ్ (Childe Harold's Pilgrimage) డాన్‌జువాన్ (Don Juan) లోని ఐల్స్ ఆఫ్ గ్రీస్ (Isles of Greece) లలో సాహసప్రియత్వం కనిపిస్తుంది. స్కాట్‌కు వీరుల కథలంటే అభిమానం హెచ్చు. లోకిన్‌వార్ (Lochinvar) ఇతడి వీరగాథాప్రియత్వానికి మచ్చుతునక. వీరరసపోషకంగా యుద్ధవర్ణనలను

ఇతరత్ర ఇతరేతరాలని అనేకవిధంగా వర్ణిస్తారు. ఇతర కవిత్వంలోనే కాక నవలల్లో కూడ సాహసప్రియత్వం అధికంగా కనబడుతుంది.

కాల్పనిక కవులలో కనిపించే స్వాతంత్ర్యప్రియత్వానికి బైరన్ రచన ప్రిజనర్ ఆఫ్ షిల్లాన్ (Prisoner of Chillon), షెల్లీ రచనలు రివోల్ట్ ఆఫ్ ఇస్లాము (Revolt of Islam), ప్రామిథియస్ అన్ బౌండ్ (Prometheus unbound), స్కైలార్కు (Skylark), ఓడ్ టు వెస్ట్ విండ్ (Ode to West wind) లను బలమైన నిదర్శనాలుగా చెప్పవచ్చు.

## ఆత్మాశ్రయత్వం.

కాల్పనిక కవుల రచనలలో దాదాపుగా అంతటా కన్పించే లక్షణం ఆత్మాశ్రయత్వం. వస్తు హేతువాదాన్ని నిర్లక్ష్యం చేసి అనుభూతులకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ లక్షణానికి కారణ ప్రేరకం చేసింది. బైరన్ ది జియర్ (The Giaour) ది బ్రైడ్ ఆఫ్ ఎబిడాస్ (The Bride of Abydos) ది కార్సైర్ (The corsair) లారా (Lara), ది సీజ్ ఆఫ్ కోరింత్ (The siege of corinth), పారిసినా (Parisina) లలో తన జీవితాన్నే చిత్రించుకున్నాడు. బైరన్ రచనల్లోని కథానాయకుడు బైరనే అని అనిపిస్తాడు.

చైల్డ్ హెరాల్డ్ (childe Harold's Pilgrimage) లో

"And I have loved thee, Ocean! and my joy
of youthful sports was on thy breast to be
Borne, like thy bubbles, onwards: from a boy
I wanton'd with thy breakers - they to me
were a delight; and if the freshening sea
Made them a terror - 'twas a pleasing fear,
For I was as it were a child of thee,

And trusted to thy billows far and near

And laid my hand upon thy mane - as I do here'

అని భావావేశంలో తన అభిప్రాయాలను చెప్పినది చైల్డ్ హెరాల్డ్ మరెవరో కాదు బైరనే అని విమర్శకుల అభిప్రాయం. 'Keats' Ode to a nightingale tells us more about Keats than the nightingale'[1] అను మాట వీళ్ళ రచనల్లోని ఆత్మాశ్రయత్వాన్ని స్పష్టంగా చెప్పింది. ఈ విధంగా వీళ్ళ కవిత్వంలో అంతటా కవుల వ్యక్తిత్వాలు కనబడతాయి.

ఈ విధమైన కాల్పనిక కవిత్వ విశిష్ట లక్షణాలు కేవలం ఇంగ్లీషు భాషలోనే కాక ఇంచుమించుగా అదే కాలంలో దాదాపు యూరోప్ భాషలు (European languages) చాలావాటిలో కనబడతాయి. ఇంగ్లీషు భాషా ప్రభావం వల్ల కొంత ముందు వెనుకలుగా భారతీయ భాషా కవిత్వాల్లో ఈ లక్షణాలు చూడవచ్చు. తెలుగు నవ్యకవులలో చాలామంది ఇంగ్లీషు కాల్పనిక కవిత్వ ప్రభావంలో రచనలు చేయడంవల్ల ఇంగ్లీషు కాల్పనిక కవిత్వ లక్షణాలన్నీ దాదాపుగా తెలుగు నవ్యకవిత్వంలో ప్రతిఫలించాయి.

ఈ విధమైన ప్రభావాలకు ఎన్నిటికో లోనై అతి విస్తృతంగా వెలసిన నవ్య ఆంధ్ర కవిత్వ తత్త్వ చింతనలోని వైవిధ్యాన్ని స్పష్టంగా చూపడానికి నవ్యకవిత్వ లక్షణాలను, శాఖలను కొంత వివరించవలసి ఉంది.

---

1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు C. నారాయణరెడ్డి P 193 లో ఉల్లేఖించబడింది.

# భావకవిత్వం

3

# భావకవిత్వం

నవ్యకవిత్వం, ఆధునికకవిత్వం అనువి దాదాపు ఒకే అర్థంలో వాడబడుతున్న పదాలు. ఆధునిక కవిత్వం అన్నపదం కాలాన్ని బట్టి ఆధునికకాలంలో వచ్చిన కవిత్వాన్నంతటినీ తెలియజేస్తుంది. నవీనగుణాలతో క్రొత్తగా వచ్చిన కవిత్వాన్నంతటినీ నవ్యకవిత్వం అనవచ్చు. 20వ శతాబ్ది ప్రారంభంలో వచ్చిన భావకవిత్వాన్ని నవ్యకవిత్వంగా ఆనాడు పేర్కొనడం జరిగింది. అభినవకవిత, నవ్యసాహిత్య పరిషత్తు, అభినవ కవితా క్రాంతి వంటివి అనేమాటల వల్ల భావకవిత్వాన్నే నవ్యకవిత్వంగా భావించినట్లు తెలుస్తున్నది. ఆ కాలంలో భావకవిత్వం, నవ్యకవిత్వం అనే పదాలు రెండూ భావకవిత్వానికే వాడబడ్డాయి. కాని భావకవితోద్యమం తరువాత వచ్చిన అభ్యుదయ కవిత్వం, విప్లవకవిత్వం వంటివి కూడా నవ్యకవిత్వంలో భాగాలే. భావకవిత్వం అనేది నవ్యకవిత్వశాఖల్లో ఒకటి మాత్రమే కాని నవ్యకవిత్వం అంటే భావకవిత్వం మాత్రమే కాదు. కవిత్వలక్షణాన్ని బట్టి భావకవిత్వం అనే పేరు వచ్చింది. లిరికల్ పొయిట్రీ (Lyrical poetry), కాల్పనిక కవిత్వం, రొమాంటిక్ పొయిట్రీ (Romantic poetry) అనువి అన్నీ భావకవిత్వానికి పర్యాయపదాలే.

భావకవిత్వంపై ఆంగ్లకాల్పనిక కవిత్వప్రభావం బాగా ఉన్నప్పటికీ భావకవులు భావకవిత్వంలో భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబింపజేస్తూ తెలుగుదనాన్ని నిలిపారు.

## భావకవిత్వ నిర్వచనం

"కాల ధర్మానుగతమై జగత్ప్రవృత్తి
మారునపుడు వాఙ్మయము మారు నిజము"[1]

---

1. రమ్యాలోకము P.10. రాయప్రోలు సుబ్బారావు.

అనువిధంగా ఎన్నో పరిస్థితులలో ప్రభావితమై భావకవిత్వం ఉద్యమంగా వచ్చింది. భావకవిత్వం అంటే ఏమిటి? దేనిని భావకవిత్వం అనాలి? అనే ప్రశ్నలకు సమాధానాలుగా భావకవిత్వాన్ని ఎందరో ఎన్నోవిధాలుగా నిర్వచించారు.

విశ్వనాథ సత్యనారాయణగారు "కవి యొక్క ఒక అవిస్పష్ట వాంఛాంతరము, ఒక అంతర్నిగూఢ తాపము, ఒక ఖండకావ్యములో ఊరక బడినచో"[1] అది భావకవిత్వం అన్నారు. దీనిని బట్టి కవి మనస్సులో అస్పష్టంగా ఉండే భావాలకు ప్రాధాన్యాన్నిస్తూ చేసే రచన భావకవిత్వం అని విశ్వనాథవారి అభిప్రాయం అని తెలుస్తోంది. దాదాపు ఇదే భావాన్ని స్పష్టం చేస్తూ పంచాగ్నులవారు 'ఏదో ఒక భావాన్ని ఆధారం చేసికొని అల్పావకాశంలో పూర్ణంగా రససిద్ధిని చేకూర్చే యత్నం'[2] నవ్యులు చేస్తారని అన్నారు. ఖండకావ్యంలో రససిద్ధిని చేకూర్చడానికి కవి చేసే ప్రయత్నాన్నే భావకవిత్వం అని వీరన్నారు. అయితే ఒకే భావాన్ని ఆశ్రయించుకొని ఉండే భావకవిత్వంలో రససిద్ధిని గూర్చి విశ్వనాథవారు 'కావ్యములు రసప్రధానములు, ఖండకావ్యములు భావప్రధానములు. కావ్యములందు ప్రతి పద్యమునందు భావము ఉండవచ్చును. కాని కావ్యము సమష్టిమీద రసాభిముఖముగా పోవును. ఖండకావ్యములందును భావములు రసవ్యంజకములు కావచ్చును. కాని ఖండకావ్యములు ప్రధానముగా ఒకభావమును ఆశ్రయించియే యుండును. అందుచేత దీనిని భావకవిత్వము అనవచ్చును.'[3] అని అన్నారు.

1. 'లిరికల్ గాయత్రి' వ్యాసం. భారతి; అక్టోబరు, 1939.
2. నవ్యసాహిత్య పరిషత్ అధ్యక్షోపన్యాసము. ప్రతిభ. ధాత వసంతము
3. 'ఆంధ్రపత్రిక' 1938, జనవరి, సంచిక 5.

భావకవిత్వాన్ని గూర్చి వివరణలు నిర్వచనాలు కనపడతాయి. కవి ఆలోచన అనుభూతుల వల్ల కవిలో కలిగిన భావానికి ప్రాధాన్యమిస్తే అది భావకవిత్వం అని కొందరు భావించారు.[1] భావనాపటిష్ఠతతో పాటు స్వేచ్ఛాప్రియత్వం కూడా ఉంటేనే భావకవిత్వం అని మరికొందరి అభిప్రాయం.[2] కవి తన

---

1(a) 'కవి ఆలోచనచే మథించి, గ్రహించి, దర్శించిన ఒక రసమయగోళము భావము. ------ భావము ముఖ్యాంశముగా పెట్టుకునే కవిత్వాన్ని భావకవిత్వమన్నారు'.

'నవ్యాంధ్ర సాహిత్య వీధులు' - కురుగంటి సీతారామయ్య, పిల్లలమర్రి హనుమంతరావు - P 216

(b) 'భావము యొక్క కవితా స్వభావము భావకవిత్వము'

'భావకవిత్వము' వ్యాసం - సారస్వత వ్యాసములు 4

కవికొండల వెంకటరావు - P 355.

2(a) "'Romantic Poetry' అంటే భావనాపటిష్ఠమైన స్వేచ్ఛాప్రియ కవిత్వం" - కవికోకిల దువ్వూరి రామిరెడ్డి

కవికోకిల దువ్వూరి రామిరెడ్డి జీవితమూ, సాహిత్యమూ - K.V. రమణారెడ్డి - P 105.

(b) "ఎట్టి అడ్డంకులు లేక స్వేచ్ఛగా సంచరింపగల స్వచ్ఛమైన కవిత్వము భావకవిత్వము. Winchester అను పాశ్చాత్య విమర్శకుడు భావకవిత్వము అతిస్వచ్ఛము అతిసులభము (Lyrical Poetry is the purest and simplest) అని పేర్కొనెను. భావకవిత్వము నిరాడంబరము నిసర్గమధురము."

"ఆంధ్ర సాహిత్యము - అభిరక్ష మహారథులు' వ్యాసము

'శారదా విపంచి' వ్యాస సంపుటి. M. పాండురంగారావు - P 276,277.

అనుభూతి వల్ల పొందిన రసస్థాయిని పాఠకునిలో ఆవిష్కరించ కలిగేది భావకవిత్వం అని వేరొకరి ఉద్దేశం.[1] కవి మనస్సులో తాత్కాలికంగా ఉదయించిన ఒక భావాన్ని తన పరిసరాలలోని ప్రకృతిలో సమన్వయపరచి పరవశత్వంలో చెప్పేది భావకవిత్వం అని ఇంకొకరన్నారు.[2]

ఈ విధంగా భావకవిత్వంలో ఉండే విశిష్టలక్షణాలలో

---

1. "హృదయాలను, మానసాలను కలవరపరుస్తూ అల్లకల్లోలంగా ఘూర్ణిల్లే ప్రమాద ప్రాంతరాలలో కవికి నిరాఘాటంగా విహరించే అధికారం కలదు. అట్టి అతని సంచారాలలో ఏ సన్ముహూర్తానైనా కావ్యగీతం ఒకటి మెరుగులు తీరిన విలక్షణరచనాధోరణిలో వెలుగుచూస్తుంది. ఆ గీతం కవి అనుభవించిన రసస్థాయిని సమగ్రంగా పాఠకునిలో ఆవిష్కరించ గలుగుతుంది. ఉత్కృష్ట భావగీతానికి నా నిర్వచనం ఇది." శ్రీశ్రీ అభిప్రాయం

మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారి లేఖనుండి- భారతి, జూన్, 1934.

2.(a) "ఈ చిరుకృతులు ఖండకావ్యములు. ఇందు కవి తన మనస్సునందు తాత్కాలికముగా నుదయించిన యొక భావమును మాత్రము తనచుట్టు పట్లనున్న ప్రకృతిలో సమన్వయపరచి పలుకును.... భావకవిత్వమునకు పరవశత ముఖ్యలక్షణము"- 'కృష్ణపక్షము'- వ్యాసము

నిడమర్తి సత్యనారాయణ - భారతి 1926 ఫాల్గుణమాసము.

(b) 'భావకవిత్వమనగా వస్తుభావ రచనలలో భావమునకు ప్రాధాన్యమిచ్చిన కవిత్వమని చెప్పవచ్చును.'

ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు ప్రయోగములు

C. నారాయణరెడ్డి. P. 306.

ఒకొక్క లక్షణానికి ప్రాధాన్యమిస్తూ ఒకొక్కరు భావకవిత్వాన్ని నిర్వచించడం జరిగిందనవచ్చు. ఎవరికి సమంజసంగా తోచిన వివరణను వాళ్ళు గ్రహించారు. వీళ్ళ నిర్వచనాలలో ఏదో ఒకటి నిర్వచనం వల్ల సంపూర్ణంగా భావకవిత్వ సమగ్రరూపాన్ని దర్శించడం సాధ్యపడక పోవచ్చు. భావకవిత్వ విశిష్ట లక్షణాలన్నీ ఒకటి నిర్వచనంలో ప్రతిబింబించక పోవచ్చు. కాని ఈ అందరి నిర్వచనాల సమన్వయరూపమే భావకవిత్వం అనుకోవచ్చు. అందుకనేనేమో మాక్సింగోర్కీ "Several definitions of Romanticism have been brought forward, but till now no precise or exhaustive definition has been evolved that will satisfy all historians of literature" అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.[1]

## భావకవిత్వ లక్షణాలు

భావకవిత్వం తాని విశిష్టలక్షణాల వల్ల నవ్యత్వాన్ని పొందింది (1) కావ్య పరిమాణం (2) వస్తువు (3) శైలి (4) ఆత్మాశ్రయం వంటి లక్షణాల్లో ప్రాచీన

---

(c) "వీరి కవితను భావం ప్రధానం.--- కవి ఒక విషయం గురించి ఎంత ఎక్కువగా భావించగలిగాడనేదే అక్కడ ముఖ్యం. వస్తువును మనస్సులో భావించుకోవడం వల్ల వచ్చిన ఆలోచనకే ప్రాధాన్యం కలిగింది. అంటే కల్పనాప్రతిభకు. అందుకే దీనిని కాల్పనిక కవిత్వం అని కూడా అంటున్నాం."

'వీరేశలింగం నుండి భావకవిత్వం వరకు' వ్యాసం

కుందుర్తి ఆంజనేయులు. ఆంధ్రప్రదేశ్ దర్శిని P. 869

1. కవిసేన మేనిఫెస్టో - గుంటూరు శేషేంద్రశర్మ - P130. లో ఉల్లేఖింపబడి

కవిత్వానికి కొంత భిన్నంగా ఇది కనిపిస్తుంది. అయితే ఈ లక్షణాలు పూర్తిగా ప్రాచీనకవిత్వంలో లేని నవ్యగుణాలు కావు. కాని భావకవిత్వంలో వాటికి కొంత ప్రత్యేకత ఉంది.

## ఖండకావ్యప్రక్రియ.

ఆధునికకాలంలో కవులను ఆదరించి ప్రోత్సహించే పాలకులు లేకపోవడం మహాకావ్యాల సంఖ్యను కొంత తగ్గించింది. ఈ కాలంలో కవిత్వం కవుల జీవనభృతికి తోడ్పడలేదు. కవులు తమ జీవనోపాధికి వేర్వేరు ఉద్యోగ వ్యాపారాల్లో ఉండి వృత్తిధర్మనిర్వహణకు భంగం రాకుండా తీరిక సమయాల్లో కవిత్వరచన సాగించారు. అందువల్ల మహాకావ్యరచనకు కావలసిన దీక్ష, తీరిక వీళ్ళలో కొరవడ్డాయి. అంతేకాక పాఠకుల్లో కూడా అధికశాతం త్వరజీవనానికి అలవాటుపడ్డవారు కావడం వల్ల మహాకావ్యాలను చదివి, ఆకళింపు చేసుకొని ఆనందించే తీరిక కోరిక కోల్పోయారు. దీనికి తోడు భావకవులు ఆంగ్లసాహిత్యంలో పరిచయం వల్ల ఆ సాహిత్యంలో అధికంగా ఉన్న ఖండకావ్యాలు సమర్థవంతంగా పాఠకుడికి రసానుభూతిని, ఆనందాన్ని కలిగించి పాఠకుల మెప్పు పొందడం గమనించారు. ముఖ్యంగా కవిత్వ ప్రచురణకు ప్రోత్సాహాన్నిచ్చినవి పత్రికలు. పత్రికల్లో ప్రచురణకు వీలుగా ఉండడం చేత సహజంగానే ఖండకావ్యాలకు ఆదరణ లభించింది. ఈ కారణాలన్నిటివల్ల భావకవిత్వంలో ఖండకావ్యరచన అధికం అయింది.

అయితే ఖండకావ్యం అనేది తెలుగు సాహిత్యానికి పూర్తిగా క్రొత్తది కాదు. ఉపకావ్యాలని, లఘుకావ్యాలని, ముక్తకాలని, ఖండకావ్యాలని పేర్కొంటూ వీటి అస్తిత్వాన్ని సంస్కృత కావ్య

భేదాల్లో ప్రాచీన లాక్షణికులు చూపుతున్నారు.[1] సర్గబంధం లేని చిన్నకావ్యాలుగా 'ఘటకర్పర కావ్యం', 'బిల్హణకావ్యం' వంటివి పేర్కొనబడ్డాయి. కాళిదాసుని 'మేఘసందేశ' కావ్యం కూడా ఖండకావ్యంగానే చెప్పబడ్డది. అయితే ఈ కావ్యప్రక్రియ ప్రాచీనమైనదే అయినా దానికి ఆనాడు ఉత్తమకావ్యాలకుండే గౌరవం లేదనవచ్చు. భావకవులు ఈ ప్రాచీనప్రక్రియను తమ భావప్రకటనకు సమర్థవంతమని తలచి దాన్ని అధికంగా ఆదరించారు. ఈ ప్రక్రియను గూర్చి

"ఇపుడు చిన్న చిన్న పొత్తములు వెడలుచున్నవి. వీనిని ఆంగ్లమందలి 'లిరిక్'(Lyric) కావ్యములననుసరించి భావగీతములని పిలుచుచున్నారు. ఇది కేవలము మనవారెఱుఁగని పంథా కాదు. లాక్షణికులు వాకొనిన ఖండకావ్యము ఇట్టిదే.... పండితులు వీనిని కేవలము విజాతి భాషా సంప్రదాయ ఖండము నుండి మన సారస్వత వనమునందు దింపరాబడినవని నిరసింపనక్కరలేదు. పూర్వలక్షణములందును ఒకానొక కావ్యాంగమునకే ఇపుడు పుష్కలవికాసము ప్రాప్తించినదని సమరసించుట యొప్పు."[2] అన్నారు రాయప్రోలు వారు.

---

1. "'అసర్గబంధమపి యదుపకావ్యముదీర్యతే' - 'అసర్గబంధం సూర్యశతకాది' ప్రతాపరుద్రీయము. విద్యానాథుడు.
'ఏకార్థప్రవణైః పద్యైః సంధి సామగ్ర్య వర్జితం
ఖండకావ్యం భవేత్ కావ్యస్యైక దేశానుసారిచ'
'యథా మేఘదూతాదిః'
'సాహిత్య దర్పణం' - విశ్వనాథుడు."
నేటికాలపు కవిత్వం P. 144 లో ఉల్లేఖించబడినవి - అకిరాజు ఉమాకాన్త పండితులు.

2. 'ఆధునికాంధ్ర సాహిత్యము'. వ్యాసము. రాయప్రోలు సుబ్బారావు సారస్వత వ్యాసములు-2. P80, 81

## కావ్యవస్తువు.

పూర్వకవులు సాధారణంగా పురాణాలు ఇతిహాసాలు మొదలైనవాటినుంచి ఉదాత్తగాథలను కావ్యవస్తువుగా ఎన్నుకునేవాళ్ళు. సామాన్యమానవునికి పరిచయం తక్కువగా ఉండే వ్యక్తులు నాయకులుగా, విషయాలు కావ్యవస్తువులుగా ఉండటం జరిగింది.

భావకవిత్వంలో వస్తువుకు ప్రాధాన్యం ఎక్కువగా లేకపోయినా భావకవిత్వం వస్తురహితం కాదు. భావకవిత్వంలో కథ ఉండాలనే నియమం లేదు. కథ ఉన్నా కథాకథన శిల్పంలో అది పరిణతి పొందే అవసరం లేదు. కథానియమం లేకపోవటంవల్ల కవి తాను వ్యక్తం చేయాలనుకున్న భావాలను ఏదో ఒక పాత్ర ద్వారా పలికించే అవసరం లేకపోయింది. స్వేచ్ఛగా కవి తన అభిప్రాయాలను ప్రకటించుకునే అవకాశం లభించింది.

భావకవిత్వంలో కవి అనుభూతే కావ్యవస్తువు. సామాన్య జీవితవిషయాలు, విశేషాలు, సాధారణ సంఘటనలు, మానసిక పరివర్తనలు, నిత్య జీవితంలో కవికి కనిపించే సమస్త వస్తువులు కావ్యవస్తువులే. సామాన్యపాఠకునికి అధికంగా పరిచయం ఉండే సాధారణ మానవులే నాయికానాయకులు. 'కృష్ణపక్షము', 'మృణాకంకణము', 'వనకుమారి', 'పూర్ణమ్మ', 'యెంకిపాటలు' వంటి ఆధునికుల కవితల్లోని పాత్రలు సర్వసాధారణంగా అందరికీ పరిచయమైనవే.

ఈ విధంగా ప్రాచీనకవులకు భిన్నంగా భావకవులు సామాన్యులను కావ్యనాయకులుగా చేసి వస్తువులో వైవిధ్యాన్ని, నవ్యతను సృష్టించారు. "We insensibly imitate what we habitually admire."[1] అని కాలరిడ్జ్ అన్నట్లు భావకవిత్వంలో వస్తువైవిధ్యానికి వీళ్ళకు ఆంగ్లసాహిత్య

---

1. 'తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము' కొత్తపల్లి వీరభద్రరావు P 498 లో ఉల్లేఖింపబడింది.

భిమానం కొంత దోహదం చేసింది.

## శైలి

ప్రాచీనకవులు నిఘంటువుల్లోని కొన్ని మారుమూల పదాలు, ప్రౌఢపదాలు, దీర్ఘ సమాసాలు అధికంగా వాడారు. ప్రాచీనకవిత్వంలో కొంత పాండిత్య ప్రదర్శన కనబడుతుంది. లాక్షణికులు పదకవితను త్రోసిరాజన్నారు.[1] అక్కడక్కడ పుష్పాపచయనం వంటి వర్ణనల్లో మాత్రాఛందస్సును ఉపయోగించినా మార్పు కోసం వాడినట్లు తోస్తుంది. పదకవిత నిరసనపాలైంది.[2] తంజావూరు నాయక రాజుల కాలంలో పదకవిత ఆదరణపొందినా సంగీతప్రాధాన్యంవల్ల దానికి ప్రాముఖ్యం వచ్చి ఉంటుందని అనుకోవచ్చు.

చెవులకు ఇంపుగా ఉండడం కవిత్వానికి అవసరం కాని యతిప్రాసల వంటి నియమాలు, 'ఛందోబందోబస్తులు' అప్రధానం అని భావకవుల అభిప్రాయం. అర్థం లేని వ్యర్థపదాలతో అయినా యతిప్రాసలను సాధించడం వ్యర్థమని వీళ్ళు అనుకున్నారు. యతిప్రాసలను గౌరవించి సాధారణంగా వాటి నియమాన్ని అతిక్రమించని రాయప్రోలు సుబ్బారావుగారు సహితం యతిప్రాసల నియమాన్ని వదిలి 'మాతమత్తేభము' వ్రాశారు.

---

1. "చిత్రమైన ఒక నాగరికతకు అలవాటైన మనరసికులు పాటలను ఆదరింపరైరి.... ఎంత నీరస నికృష్టమైనదైనను పద్యమునకు గౌరవముద్ర పడినది. ఎంత రసోత్కృష్టమైనదైనను పదమునకు నిరాదరవైముఖ్యములు కానినది..... సారస్వతము వెదజల్లు భావములు ప్రజాహృదయములందు ప్రవేశింపవయెను. ఆ ప్రజాహృదయప్రవేశమునకు గీతి సాధనమైనట్లు పద్యము కానేరదు."

1, 2. 'ఆధునికాంధ్రసాహిత్యము' - వ్యాసము - రాయప్రోలు సుబ్బారావు.
సారస్వత వ్యాసములు - 1 P. 81, 83

భావకవులకు భావవ్యక్తీకరణ ప్రధానం. తాము చెప్పేది చదువరికీ అర్థం కావడం ముఖ్యం అనుకుని వీళ్ళు భాషాసారళ్యాన్ని ఆదరించారు. భావాన్ని సమర్థవంతంగా వ్యక్తం చేయగల చిన్న చిన్న పదాలు, జాను తెనుగు పదాలు, వ్యావహారిక పదాలు, సామెతలు, భావకవిత్వంలో ఆదరణ పొందాయి. పూర్తి వాడుకభాషలో 'యెంకిపాటలు' వంటి రచనలు కూడా వచ్చాయి.

భావకవులు పదప్రయోగంలో నవ్యత కనబరిచారు. పదాలు, వాటి అర్థాలు ప్రాచీనమైనవే అయినా వాటి సన్నివేశనంలో గ్రథనంలో క్రొత్తదనం ఉంది. ఉపమ వంటి అలంకారాలు పాతవే అయినా ఉపమానాలు, వాటి ప్రయోగాలు నవ్యాలు.[1] రచనా విధానంలో నవ్యత్వాన్ని చూపి భావకవులు తమ శైలిలో ప్రత్యేకతను నిలుపుకున్నారు.

## ఆత్మాశ్రయకవిత్వం.

తెలుగులో ఆత్మాశ్రయ కవిత్వం (subjective poetry), వస్త్వాశ్రయ కవిత్వం (objective poetry) అనే విభాగం పాశ్చాత్య ప్రభావం వల్ల వచ్చిందని చెప్పవచ్చు. ప్రాచీనకవిత్వంలో వస్త్వాశ్రయ కవితా రీతి అధికంగా ఉంది.

1. 'ఇప్పటి కావ్యాలలోనూ ఉపమాది అలంకారాలు లేకపోలేదు. కాని వాటిని చెప్పే విధానము క్రొత్తగా ఉండవచ్చు. .... మాటలూ, అర్థములూ పూర్వపువే అయినా కూర్పు నేర్పు వల్ల కావ్యాలను నవ్యములుగా చేయవచ్చునని సాహిత్యవేత్తలన్నారు'... (ఇంద్రగంటి - భారతి 1939 మార్చి) 'నవ్యాంధ్ర సాహిత్యవీథులు'- (కురుగంటి సీతారామయ్య) లో ఉల్లేఖింపబడింది. P594.

వస్తువులేని కవిత్వమే ఆత్మాశ్రయకవిత్వమనే భావం ప్రచారంలో ఉంది. కాని కవి తనదృష్టికోణంలో నుంచి వస్తువును పరిశీలించి తనభావాలకు ప్రాధాన్యం ఇచ్చిన కవిత్వాన్ని వస్తువు ఉన్నప్పటికీ ఆత్మాశ్రయ కవిత్వం అనవచ్చు. అంటే ఆత్మాశ్రయ కవితారీతిలో కవివస్తువును తన భావవ్యక్తీకరణకు సాధనంగా ఉపయోగించుకుని, వస్తువుకు ప్రాధాన్యాన్ని ఇవ్వక తన భావాలకే ప్రాధాన్యాన్నిస్తాడు. కనుక వస్తువు ఉన్న కవిత్వం వస్తువు లేని కవిత్వం కూడా ఆత్మాశ్రయ కవిత్వం కావచ్చు.[1] ఒక కావ్యంలో కవి తన అనుభూతిని కావ్యవస్తువు చేసినా, లేదా పేరుకి ఒకకథ ఉన్నా తన అనుభూతిని ప్రధానంగా చెప్పడానికి ఆ కథను వినియోగించినా ఆ కావ్యం ఆత్మాశ్రయరీతిలో ఉన్నదనవచ్చును. 'నేను' అనే కర్తృవాచకం స్పష్టంగా ఉండే రచనలు మాత్రమే ఆత్మాశ్రయములు మిగిలినవి కావు అనడం సరికాదు.[2] భావకవిత్వంలో కవులు తమ భావవ్యక్తీకరణకే ప్రాధాన్యాన్ని ఇవ్వడం వల్ల భావకవిత్వంలో ఎక్కువ భాగం ఆత్మాశ్రయరీతి కనిపిస్తుంది. "ఉత్తమమైన వ్యక్తిపరమైన కావ్యంలో ఉన్నంత కవిత్వలావణ్యము మరొక కావ్యంలో ఉండదు. చూపినచోట అది చూపినంత మరొకటి చూపదు."[3] అని భావకవుల నమ్మకం.

---

1. 'తృణకంకణము', 'పూర్ణమ్మ' వంటి రచనలు వస్తువు ఉండి ఆత్మాశ్రయమైనవి. 'కృష్ణపక్షము' వంటి రచనలు వస్తువులేని ఆత్మాశ్రయ రచనలు.
2. 'తెలుగులో కవితావిప్లవాల స్వరూపం' వెల్చేరు నారాయణరావు, P.122
3. 'పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వము.' వ్యాసము. దేవులపల్లి కృష్ణశాస్త్రి భారతి. రజతోత్సవ సంచిక. జనవరి 1949.

ఆవిధంగా భావకవిత్వం కావ్యపరిమాణంలో, వస్తువులో, శైలిలో ఆత్మాశ్రయతలోనూ నవ్యత్వాన్ని నింపుకుంది. అయితే భావకవిత్వం పూర్తిగా నూతనం అనీ, ప్రాచీనకవిత్వంలో భావకవిత్వం అసలు లేనే లేదనే అనడానికి వీలు లేదు![1] అక్కడక్కడ ప్రాచీనకవిత్వంలో కొన్నికొన్ని భాగాలలో

---

1. "భావకవిత్వమనేది చాలా ప్రాచీనమయినది. అది మన వాఙ్మయంలో చిరకాలం నుండి వుంటున్నది. శిశు, దేవ, జడ, ప్రకృతి విషయమైన ప్రేమ విషాదాదులు సాహిత్యశాస్త్రంలో భావసంజ్ఞను పొందుతున్నది.... భగవంతుని మీద, గురువులమీద, తండ్రి మీద, మిత్రుడి మీద వుండే ప్రేమను భావమని పేరు. అది వ్యక్తమయ్యే కావ్యం భావాత్మక కావ్యం, భావకావ్యం, భావధ్వని అని వ్యపదేశం పొందుతున్నది.... ఈ భావకావ్యాలు ఖండాఖండ భేదంలో (మహాకావ్యమని, ఖండకావ్యమని భేదంలో) ఉదాత్తకావ్యకోటిలోనే భారతీయ సాంప్రదాయాన్ని అనుసరించి చేరుతున్నవి.... భావనావిభుత్వంలో విశిష్టమైన కవిత అంతా రొమాంటిక్ కవిత అని సాహిత్యవేత్తలు అభిప్రాయమన్నారు.... ఉత్తరరామచరిత కంటె రొమాంటిక్ కవి ఎవ్వరు? యూరోపు ఖండ సాహిత్యదృష్టి ప్రకారం వాల్మీకి, వ్యాసుడు, భవభూతి ఇట్లాటి కవులందరు రొమాంటిక్ కవులే అయివున్నారు. అయితే వారి భావసరణులు వేరుగా వచ్చును..... పాశ్చాత్యరమణీయతా ప్రకారమైన ఈ రొమాంటిక్ కవిత భారతవర్షదృష్టిప్రకారం సాధారణంగా కొంచెమెచ్చు తక్కువగా భారతవర్షసాహిత్యంలో మహోత్కృష్ట వ్యంగ్య కోటిలో చేరుతున్నది."
'నేటి కాలపు కవిత్వము'. అక్కిరాజు ఉమాకాన్తపండితుడు
P 147, 148, 212, 250, 252.

భావకవిత్వ ఛాయలు కనబడతాయి. కాళిదాసు మేఘసందేశము, తిక్కన భారతంలోని సంజయరాయబార ఘట్టం, పోతన గోపికాగీతలలో భావ కవిత్వ ఛాయలు ఉన్నాయనవచ్చు. కృష్ణకర్ణామృతం, సౌందర్యలహరి, ఋతు సంహారం, సూర్య శతకం, మూకవిరచితమైన మూకపంచశతి, ధూర్జటి కాళహస్తీ శ్వర శతకం, పాదుకాస్తవం (తామందూరి కృష్ణమాచార్య) భక్తచింతామణి (వడ్డాది సుబ్బరాయకవి) ఇవన్నీ కొంతవరకు భావకవిత్వ లక్షణాలున్నవే.[1] అయితే వాటిలోని భావకవిత్వ ఛాయలు అస్పష్టంగా, అప్రధానంగా ఉండి పోయాయి. నవ్యకవుల భావకవిత్వంలో భావానికి విశేషప్రాధాన్యం లభించింది. విమర్శకులు భావకవిత్వాన్ని విషయాన్ని అనుసరించి కొన్ని శాఖలుగా విభజించారు.

## భావకవిత్వ శాఖలు

(1) ప్రణయ కవిత్వం (2) ప్రకృతి కవిత్వం (3) దేశభక్తి కవిత్వం (4) సంఘసంస్కరణ కవిత్వం (5) భక్తి కవిత్వం (6) స్మృతి కావ్యాలు అనే ఆరు శాఖలు ప్రధానాలు.[2]

ప్రణయకవిత్వం: భావకవిత్వంలో ప్రముఖస్థానాన్ని పొందింది ప్రణయ కవిత్వం. భావకవులు ప్రేమను గాలివీచినంత సహజంగా ప్రకృతిధర్మంగా భావించారు.

సౌరభము లేల చిమ్ము పుష్పవ్రజంబు?
చంద్రికలనేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను? (కృష్ణపక్షము - దేవులపల్లి కృష్ణశాస్త్రి)

---

1. 'నేటి కాలపు కవిత్వం' - అకిరాజు ఉమాకాన్త పండితులు. P 212.
2. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు
   C. నారాయణరెడ్డి P-301

స్త్రీ కేవలం విలాసవస్తువనే దృష్టిని తిరస్కరించింది ప్రబంధ, క్షీణప్రబంధ కాలాల నాటి సాహిత్యం. ఈ విషయం భావకవులను బాధించింది. 'కవి కుమారి వర్ణనలలో అలంకృతము కాకపోతే కాంతాసౌందర్యము రూపు కట్టునా?'[1] అనే భావం వీళ్ళ ప్రణయకవిత్వానికి దోహదం చేసింది. వీళ్ళు స్త్రీ శరీర సౌందర్యాన్ని కాక ఆత్మసౌందర్యాన్ని దర్శించి ఆరాధించారు. అలౌకిక సౌందర్యవర్ణన చేశారే కాని దైహిక మోహాన్ని రెచ్చగొట్టే వర్ణనలు చేయలేదు. వీళ్ళ ప్రణయకవిత్వంలోని శృంగారవర్ణనలు సభ్యతను దాటలేదు. స్త్రీలోని వాత్సల్యానికి అమృతగుణాలకు భావకవిత్వంలో ప్రాధాన్యం లభించింది. కొందరు భావకవులు స్త్రీని దేవతగా కూడా ఆరాధించారు.

"దైవతము నీవు నీకు ప్రత్యక్షమునకు
గడియ వెంబడు నుండు భక్తుడను నేను".[2]

వీళ్ళు సంయోగ శృంగారం కంటె వియోగ శృంగారాన్ని అధికంగా ఆదరించారు. విషాదంలో మాధుర్యాన్ని దర్శించారు.

సరస సాంగత్య సుఖవికాసముల కన్న
దుస్సహ వియోగభరమె మధురము సకియ![3]

నాకు నిశ్వాస లాఘవంబులు కలవు
నాకు కన్నీటి సరుల దొంతరలు కలవు
నాకమూల్యమపూర్వమానంద మొసగు
నిరుపమ నితాంత దుఃఖపు నిధులు గలవు.[4]

---

1,3 తృణకంకణము - రాయప్రోలు సుబ్బారావు - పీఠిక; P.16

2. సౌభద్రుని ప్రణయ యాత్ర - నాయని సుబ్బారావు P62

4. కృష్ణపక్షము - దేవులపల్లి కృష్ణశాస్త్రి - P60

అంటూ విషాదాన్ని సంపదగా ఊహించారు.

'కోకిలమ్మ కోయని యేడ్చె గొంతునెత్తి' అని తీయని కోయిల పాటలో కూడా విషాదం గోచరించింది కృష్ణశాస్త్రి గారికి. ఇటువంటి రచనలు భావకవులు విషాదాన్ని ఎంతగా ప్రేమించారో చూపుతాయి.

ఈ విధంగా స్త్రీ అంతరంగ సౌందర్యవర్ణన, వియోగశృంగారాన్ని, విషాదాన్ని ప్రేమించడం వంటి లక్షణాలవల్ల భావకవిత్వంలో ప్రణయ కవిత్వశాఖ ప్రత్యేకతను సంతరించుకుంది.

<u>ప్రకృతి కవిత్వం:</u> సాహిత్యంలో ప్రకృతివర్ణనలు ప్రాచీనకాలం నుంచి ఉన్నాయి.[1] ప్రబంధాల్లోని అష్టాదశవర్ణనల్లో ప్రకృతివర్ణనలు కూడా ఉన్నాయి. కనుక ప్రకృతికవిత్వం అనేది పూర్తిగా కొత్తదని చెప్పడానికి వీలులేదు. కాని ప్రాచీనసాహిత్యంలోని ప్రకృతివర్ణనలకంటె భావకవుల ప్రకృతివర్ణనలు

---

1. "వాల్మీకి, కాళిదాసు, భవభూతి వంటి కవులు పట్టణాలను దూరాన వదలి అరణ్యసీమలనే తమ కవిత్వానికి ఆలవాలం చేశారు. తైత్తిరీయారణ్యకం, బృహదారణ్యకం అని ఈ పేరున విజ్ఞానానికి సయితం అరణ్యసంబంధం భారతీయ సంప్రదాయం ఎనిపిస్తున్నది. వాల్మీకి కవితను మూడు పాళ్ళు అరణ్యమే సీమ. కాళిదాసు కుమారసంభవాన్ని కొండలు, అడవులు వీటి వర్ణనలో ఆరంభిస్తాడు. శాకుంతలాన్ని కవి అరణ్యంలో ఆరంభించి అరణ్యంలో అంతం చేస్తాడు. యక్షుడి కథ కొండల్లో ఛాయాతరువుల్లో ఆరంభమవుతుంది. విక్రమోర్వశీయ, మాళవికాగ్నిమిత్రాలు కాళిదాసు వనప్రకృతి ప్రేమను స్ఫుటంగా వ్యక్తపరుస్తున్నవి."

'నేటికాలపు కవిత్వం'. అక్కిరాజు ఉమాకాన్త పండితులు. P237.

కొంత ప్రత్యేకమైనవి. ప్రాచీనసాహిత్యంలో ప్రకృతివర్ణనలున్నాయి కాని వాటిలో ఆ కవుల వ్యక్తిత్వము లేదు. ప్రబంధకవులు స్పష్టమైన భావంకంటె, క్లిష్టమైన కల్పనకు ప్రాధాన్యనిచ్చారు. ప్రకృతి యథారూపవర్ణన చేసారుగాని ప్రకృతిలో సాంగత్యాన్ని అనుభవించి వర్ణించలేదు. పైగా ప్రబంధాల్లోని ప్రకృతి వర్ణనల్లో కొంత కృత్రిమత్వం వచ్చింది. "సాల రసాల హింతాలములను వదలి నిమ్మ దానిమ్మలను వర్ణనోజ్జీవితము చేస్తే ప్రకృతి రామణీయకం పుంజుకోదా? వైకుంఠికములయిన లతాపుష్పములను విడిచి నిత్యసాంగత్యసుందరములయిన తీగె పందిళ్ళనూ, పూలపాదులనూ చిత్రిస్తే ఆవరణ సౌందర్యము అనుసంధానము కాదా?"[1] అని ప్రశ్నించుకుని భావకవులు తమకు సన్నిహితంగా ఉండే ప్రకృతిని వర్ణించారు. నిత్యపరిచయాలైన చెట్లు చేమలలో స్వభావసిద్ధంగా ఉన్న ప్రకృతిని వర్ణించారు భావకవులు.

ప్రకృతిదర్శనం వల్ల కవిపొందిన అనుభూతి, కవిలో చెలరేగిన భావపరంపర భావకవిత్వంలోని ప్రకృతివర్ణనల్లో ప్రాధాన్యం వహించింది. ఇది ప్రాచీనసాహిత్యం లోని ప్రకృతివర్ణనలకు భావకవిత్వంలోని ప్రకృతివర్ణనలకు ప్రధానమైన భేదం.

"వెనుకటి గ్రంథాలన్నిటిలో ప్రకృతివర్ణనలు ఉన్నవి ఉన్నట్లు చెప్పడమే గాని వాటిలో ఉండే అంతరార్థమూ, వాటికీ కవికీ ఉండే పరస్పర సంబంధమూ, వాటివల్ల కవి నేర్చుకుని పాఠకులకు విప్పిచెప్పే ఉపదేశమూ, వాటికి అంతర్గతమైన తత్త్వము, ఆ తత్త్వాన్ని జీవితానికి సమన్వయించ డమూ మొదలైన విషయాలు వెనుకటి కవులు పరామర్శించలేదు. అంతే

---

1. 'తృణకంకణము' నివేదన - రాయప్రోలు సుబ్బారావు. P4.

గాకుండా ప్రకృతికి కళావస్తుత్వము సంబంధింపజేయడమూ వెనుకటి కవులందరూ చేసినపని కాదు."[1]

ప్రకృతిలోని కొన్ని భాగాలను, సూర్యోదయం, చంద్రోదయం, మలయానిలం వంటివాటిని వర్ణించాలనే నియమం భావకవులకు లేదు. దానివల్ల దారిన ఉన్న గడ్డిపువ్వులో సహా తమ హృదయాన్ని ఆకర్షించి ఆకట్టుకున్నవాటిని దేనినైనా స్వేచ్ఛగా భావకవులు వర్ణించారు. అంతేకాక ప్రకృతిలో వాళ్ళు అంతర్లీనమై తన్మయమవడం కనబడుతుంది.

"ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై ఈ యడవి దాగిపోనా
పగడాల బసరాకు తెరచాటు తేటినై
పరువంపు విరిచేడె బిన్నారి సిగ్గునై
ఈ అడవి దాగిపోనా.[2]......"

తాను ప్రకృతిలో భాగంగా మారిపోవాలని వాంఛించారు. అది ప్రకృతిలో లీనం కావాలని ఆశించిన భావకవి కోరిక.

భావకవికి ప్రకృతి ప్రణయానికి ఉద్దీపనగానే కాక తాపానికి ఉపశాంతిని కలిగించేదిగా కూడా కనబడింది. ప్రాచీన కావ్యాలలో వియోగంలో విషాదంలో ప్రకృతిని దూషించడం కనబడుతుంది. ప్రబంధాలలో మలయానిల దూషణము, చంద్రోపాలంభము వంటివి ఉన్నాయి. కాని భావకవులు వియోగంలో విషాదంలో ప్రకృతిని నిందించక

---

1. 'నవ్యాంధ్ర సాహిత్యవీధులు'. కురుగంటి సీతారామయ్య, పిల్లలమఱ్ఱి హనుమంతరావు. P 210
2. కృష్ణపక్షము – దేవులపల్లి కృష్ణశాస్త్రి P 1

స్నేహాన్ని చూపారు. చంద్రుడు, మేఘాలు, గాలులు తమకు ఆప్తమిత్రులని భావించి వాటితో తమ వ్యథను వెళ్ళబోసుకుని ఉపశాంతి పొందారు.

" విరిసిన పూలవెన్నెలల వెల్లువఁ జక్కఁదనాల హంసవై
యరిగెదు నిన్ను జూచి నిశలందున నాకగు బాష్పశాంతి.[1]
ఓయి సంధ్యాసమీరణా, రేయి లోఁడఁ
గాఢ చీఁకటి లోఁడ దుఃఖమ్ము కూడ
పరువు పరువున నాకాంక్ష కరుగుదెంచు
నీవు నునువేఁడి రెక్కల మీఁద వైచి
నెత్తుకొని పోవరాదె నన్నెచటికేని.[2] "

అంటూ ప్రకృతితో సాన్నిహిత్యాన్ని అభిలషించి తమ కష్టసుఖాలను చెప్పుకొని ఉపశాంతి పొందారు.

" చిత్రరూపంబు చూపుచోఁ జేలగట్లు
కలికి తూర్పుండె మూక సఖానుభూతి
పైరు తలవంచు భారంబు పంచుకొనగ
ప్రాణసఖులట్లు కవులకు ప్రకృతి తోడు.[3] "

అంటూ తనకు ప్రకృతిని తోడుగా భావించాడు భావకవి. ప్రకృతిని ఆరాధించి ఉపాసించడం కూడా భావకవులలో కొందరు చేశారు. పృథ్విని దేవతగా భావించారు రాయప్రోలు వారు. విశ్వనాథవారి 'కోకిలమ్మ పెండ్లి', 'కిన్నెరసాని పాటలు' వంటి కావ్యాలలో ప్రకృత్యుపాసన కనబడుతుంది.

---

1. 'సుధాకరా!' 'దీపావళి'. వేదుల సత్యనారాయణశాస్త్రి. P78
2. కృష్ణపక్షము - దేవులపల్లి కృష్ణశాస్త్రి P57
3. 'కవి కోకిల గ్రంథావళి' వ్యాసములు - దువ్వూరి రామిరెడ్డి. P212

కావ్యాన్ని ప్రకృతికే అంకితం ఇవ్వడం భావకవుల ప్రకృతిప్రీతికి నిదర్శనం.[1]

ఈ విధంగా అనుభూతి ప్రధానంగా ప్రకృతిని వర్ణించడం ప్రకృతిలో తాదాత్మ్యాన్ని ఊహించుకోవడం ప్రకృతిలో లీనం అయి ప్రకృతిని వర్ణించడం వంటి విశిష్ట లక్షణాలు ప్రకృతి కవిత్వంలో కనబడతాయి.

<u>భక్తికవిత్వం:</u> ఇతర విషయాల్లో లాగానే ఆత్మాశ్రయ కవితారీతిలో భగవంతుని గూర్చి రచన చేయడం వల్ల భక్తికవిత్వంలో కవుల వ్యక్తిగత భావాభివ్యక్తి అధికంగా కనబడుతుంది. భగవత్తత్త్వాన్ని గూర్చిన కవి అంతర్భావ ప్రకటనకు దీనిలో ప్రాధాన్యం వచ్చింది. ప్రాచీనాంధ్రసాహిత్యంలో శతకసాహిత్యంలో కొంతవరకు ఆత్మాశ్రయపద్ధతిలో భక్తిభావాలను వెల్లడించడం కనబడుతుంది. ఈ శతకసాహిత్యాన్ని మినహాయిస్తే ఇతర స్థలాలలో కవి వ్యక్తిగతమైన భక్తిభావం స్పష్టంగా గోచరించే ఘట్టాలు ప్రాచీనాంధ్రసాహిత్యంలో తక్కువ అని చెప్పవచ్చు. అందుచేత భక్తుల గాథలనో, భక్తుడి పాత్రనో ఆలంబనం చేసుకుని కవి, తన భక్తిభావాన్ని వెల్లడించవలసి వచ్చేది. ఈ విధంగా పాత్రల అవసరం లేకుండా తమ భక్తిని వ్యక్తం చేశారు భావకవులు.

వీరు తాము దర్శించిన సత్యాన్ని భక్తి పారవశ్యంలో ప్రత్యక్షం చేశారు. భగవంతుని అన్వేషిస్తూ తమ ఆర్తిని అల్పత్వాన్ని ప్రకటించారు. భగవంతుని గుణాలను, మహిమలను తమకున్న స్వేచ్ఛలో తాము ఊహించిన విధంగా వర్ణించారు. నిత్య పరిచయ వస్తువులో తాము దర్శించిన పారమార్థిక సత్యాన్ని ప్రదర్శించారు.

---

1. రాయప్రోలు వారు 'తృణకంకణము' 'నీరసుత'కంకితం ఇవ్వడం దీనికి చక్కని ఉదాహరణ.

"గుసగుస చెప్పెదు గునిసి యాడెదవు
నీలోన వెలిగెదు నిర్మల జ్యోతి
వెలి కొత్త బోరాటం బెట్టుచున్నది యొ!"[1]

అని గరికవంటి అల్పవస్తువులో మానవాతీత దివ్యశక్తిని దర్శించాడు భావకవి.

"ఆమె పదసన్నిధాన దివ్యస్థలాన
భక్తి నమ్రుడనై నిలంబడిన యపుడు
తలపునకు వచ్చె నా పేదతనము నాకు...
ఆమె పదసన్నిధాన దివ్యస్థలాన
నాక కల్గినదీ పదన్యాసమునకు
దర వినతమైన హరజటాభరము వారె
నతుడనయ్యు మహో మహోన్నతి వహింతు."[2]

ఈ విధంగా ఒకరు గరికలో దివ్యతేజస్సును దర్శిస్తే 'మరొకరు ప్రేయసి సాన్నిధ్యంలో దివ్యత్వాన్ని భావించి భక్తులై ఆరాధించారు. ప్రేయసి దివ్యపదసన్నిధానంలో నిలబడడమే మహోన్నతిగా భావించారు.

భగవంతుని పరిపూర్ణత్వాన్ని అధికత్వాన్ని స్తుతిస్తూ తమ అల్పత్వానికి విచారించారు. అల్పుడయిన భక్తుడు విశ్వవ్యాప్తుడయిన భగవంతుని దృష్టిలో తనను గుర్తింపు రావాలనే ఆరాటాన్ని

---

1. గరిక - దువ్వూరి రామిరెడ్డి - వైతాళికులు P 204
2. ఆరాధన - దీపావళి - వేదుల సత్యనారాయణ శాస్త్రి P.69.

వ్యక్తం చేసాడు.

"నాదు రక్తంబు నీ రక్ష బాధకుండు
కటికి వేయును రేపు చక్రముల నుండి
అచటి బహుజన రక్త బిందువుల యందు
నాది యిదని గుర్తింప కన్పడును స్వామి?"[1]

ఇది భగవంతుని రక్షచక్రాల క్రిందపడిన భక్తుని ఆర్తి. తాము పాపాత్ముల మనే భావంలో పశ్చాత్తాపాన్ని, వైరాగ్యాన్ని ప్రదర్శించారు కొందరు భావకవులు.

ప్రకృతిరహస్యాలు సృష్టికర్త విలాసాలని భావించారు. పూలలో రంగుకు, తేనెకు సహితం దివ్యశక్తి అదృశ్యహస్తం కారణమని ఊహించారు. భావకవులు భగవంతుని తాము భావించిన విధంగా భగవంతుని చిద్విలాసాలను తమ అనుభూతికి అనుగుణంగా మలచారు.

వైష్ణవ భక్తి సంప్రదాయంలోని మధురభక్తి మార్గంలో తమను రాధగాగాని, గోపికగాగాని భావించుకుని భగవంతుని సాన్నిధ్యానికై పరితపించడం భావకవుల భక్తికవిత్వంలో కనబడుతుంది. ఈ మధురభక్తి సంప్రదాయం ప్రాచీనమే అయినా ఈ మార్గాన్ని ప్రధానం చేసుకున్న తెలుగుకవిత్వం భావకవిత్వకాలంలో కొంత అధికంగా వెలువడిందనవచ్చు. భావకవులు భక్తిని మధురభావాన్వితంగా ప్రదర్శించడంలో కొంత విశిష్టతను కనబరిచారు. ప్రేమకు భక్తికి ఒక అనుబంధాన్ని, ప్రేమ భక్తిగా పరిణమించడాన్ని మధురభక్తిపరమైన ఖండికలు ప్రదర్శిస్తాయి. జగదీశ్వరుని బాంధవ్యదృష్టిలో, ప్రేమ భావనలో ప్రేమించిన భక్తుని ఆర్తిని, అన్వేషణను పరమోన్నతంగా కొందరు భావకవులు చిత్రించారు.

---

1. 'నీ రక్షము' - విశ్వనాథ సత్యనారాయణ - వైతాళికులు. P 265.

"ఆకలైన నెరుంగ నైతి నేమయ్య
ఆరగింపగ వేళాయెనయ్య రాకయ్య....
విరిదండ మెడలోన వేయుటే కాని
కన్నార నీ మూర్తిఁ గాంచనే లేదు
ప్రణమిల్లి యడుగుల బడుటయే కాని
చేతులారంగ సేవ చేయనే లేదు?..![1]

భగవంతుడు ఆకలివేళ కూడా మరచినట్లు తలచి ఆరగింపుకు ఆప్యాయంగా ఆహ్వానించే వాత్సల్యాన్ని ప్రదర్శించాడు భక్తుడు. తలపులో పూజలో తడబాటున్న మనసులో, తెలివిలో మరపును, భక్తిలో పూజలో భ్రాంతిని కలిగించి మాయచేసే ప్రియునిగా జగదీశ్వరుని ఊహించాడు. తన ప్రేమ తన్మయత్వంలో స్వామి దివ్యమంగళ విగ్రహాన్ని సరిగా చూడను కూడా చూడలేక పోయినందుకు చింతించాడు. తాను ప్రాణేశునిగా భావించిన భగవంతుని కనులనిండుగా చూసుకోవాలని, ప్రేమ తీరగ పలుకరించాలని, చేతులారగ సేవ చేయాలని భక్తుడు పొందే తాపాన్ని మనోహరంగా ప్రదర్శించింది 'ఏకాంతసేవ'.

రాయప్రోలు వారి - 'రాధపిలుపు', 'ప్రవాస రాత్రికి'; కృష్ణశాస్త్రి- 'అన్వేషణము', 'నటరాజు', 'మహతి'; బసవరాజు- 'గోపికాగీతములు', 'హాంగ'; వేదుల - 'నిరీక్షణము', 'ఉత్కంఠ', 'ఆశాగానము', 'రాధ', 'ప్రభూ', 'మురళి' వంటి రచనలు ప్రేమనాలంబనము చేసుకుని భగవంతునికై భక్తుని నిరీక్షణను వెల్లడిస్తాయి.

<u>దేశభక్తి కవిత్వం</u>: 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్న సూక్తి అతిప్రాచీనమైనదే. కాని అంతరాంతరాల్లో ఉండే దేశాభిమానం ప్రస్ఫుటంగా

---

1. ఏకాంతసేవ - వేంకట పార్వతీశ్వరులు. వైతాళికులు. P250, 251

ప్రకటితం కావడానికి పరిస్థితులు కొంత కారణం అయ్యాయి. బ్రిటిష్ పాలనలోని భారతదేశం స్వాతంత్ర్యం పొందాలనే కోరిక భావకవిత్వంలోని దేశభక్తి కవిత్వానికి ప్రాకారం చేసింది. తెలుగులోని దేశభక్తి కవిత్వంలో రాష్ట్రాభిమాన కవిత్వం కొంత ఎక్కువగా ఉంది.

స్వాతంత్ర్యోద్యమాన్ని ఆధారం చేసుకుని సాగిన దేశభక్తి కవిత్వం అనేక విషయాలను వస్తువులుగా చేసుకుని వెలువడింది. ఆంగ్లేయ పరిపాలనా విధానాన్ని, దానిలోని లోటుపాట్లను చెప్పే రచనలు, భారతదేశ పూర్వవైభవాన్ని చాటి చెప్పే రచనలు కొన్ని ఉన్నాయి. ఇవేకాక స్వాతంత్ర్యోద్యమం మీద, రాట్నం మీద, గాంధీ మీద, జెండా మీద, జైలు కష్టాల మీద చాలా రచనలు వచ్చాయి. అంతేగాక

"మాతృపూజా ధ్యాన తత్పర
మతి పవిత్ర సాధుడవునై
విశ్వమందిర పుణ్యభూమికి
వెడలి రావోయ్!"[1]

అంటూ ప్రబోధ రచనలు వెలువడ్డాయి. దేశభక్తిని, జాత్యభిమానాన్ని ప్రబోధించడానికి కొందరు భావకవులు భారతదేశ పూర్వప్రశస్తిని భారతమాత ఔన్నత్యాన్ని కీర్తించారు.

"వేదశాఖలు పెరిగె నిచ్చట
ఆదికావ్యం బందె నిచ్చట
బాదరాయణ పరమ ఋషులకు
పాదు సుమ్మిది చెల్లెలా!"[2]

---

1. జాతీయ గీతాలు-(సంపాదకుడు. గురజాడ రాఘవశర్మ) - రాయప్రోలు సుబ్బారావు P.8 లో ఉల్లేఖింపబడింది.
2. ఆంధ్రావళి - రాయప్రోలు సుబ్బారావు. P.27

కర్మభూమి అయిన భారతదేశంలో జన్మించడం ఎంత పుణ్యఫలమో భరతభూమిని కీర్తించి తెలియపరచారు. భారతీయుడనని చెప్పుకోవడమే గర్వకారణం అనే భావాన్ని వ్యక్తపరచారు.

"లేదురా ఇటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి పౌరులింకెందు".[1]

భావకవులు ఈ విధమైన రచనలవల్ల ప్రజల్లో నిద్రాణమై ఉన్న దేశాభిమానాన్ని జాగృతం చేశారు. దేశంలోని అడవులు, నదులు, దేశసంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, మొదలైనవాటిని సన్నుతించి తమ తమ దేశాభిమానాన్ని వ్యక్తంచేశారు. ఈ విధంగా దేశసంకీర్తనలవల్ల జాతీయతాభావాన్ని పెంపొందించడానికి ప్రయత్నం చేశారు. భారతదేశ గతవైభవాన్ని కీర్తించి ప్రజల్లో ఉత్సాహాన్ని కలిగించారు.

"గోలకొండ నీ రత్నకోశమట
కోహినూరు నీ జడలో పూవట
తాజమహలు నీ దివ్యభవనమట".[2]

ఇటువంటి రచనలు దేశవైభవాన్ని కనులముందుంచుతాయి. భారతదేశ ఔన్నత్యాన్ని వైభవాన్ని చాటి చెప్పినవి కొన్నిరచనలయితే, భారతదేశపు ఆనాటి స్థితిని పరాయిపాలనలో కష్టనష్టాలను తెలియచేసే రచనలు కొన్ని వచ్చాయి.

"భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పిదుకుచున్నారు మూతులు బిగియగట్టి".[3] (చిలకమర్తి)

---

1. 'జన్మభూమి' - ఆంధ్రావళి - రాయప్రోలు సుబ్బారావు : P 21

2,3 'జాతీయగీతాలు' (సంపాదకుడు : గురజాడ రాఘవశర్మ) P 57; పీఠిక P 20

"మాట నలుబడి నాలుగు నాటికి తగిలింది

మాటలాడవద్దంటాడు మమ్ము పాటపాడవద్దంటాడు."[1] (గరిమెళ్ళ సత్యనారాయణ)

"పొద్దు పొద్దు చేసి పనుల దుడ్డి పిల్చుకు మండెరా

మాడగొట్టి ప్రజల నామ్ము ఓడనెక్కించారురా."[2] (గరికపాటి మల్లావధాని)

దారతనం పరిపాలనా విధానాన్ని గూర్చిన ఇటువంటి ప్రచార గీతాలు, బసవరాజు అప్పారావు, కాండా వెంకటప్పయ్య వంటి రచయితలు గాంధీజీని గూర్చి చేసిన రచనలు అధిక ప్రచారం పొందాయి. ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేస్తూ కర్తవ్యాన్ని ఉపదేశించాయి. ఈ విధంగా భావకవులలో చాలావరకు అందరూ స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశభక్తి కవిత్వం వ్రాశారు.

అదే కాలంలో రాయప్రోలు, కాటూరి, జాషువా, తుమ్మల వంటివారు ఆంధ్రాభిమానాన్ని తమ రచనల్లో చూపారు. దీనికి ఆంధ్రరాష్ట్రోద్యమం కూడా కొంత దోహదం చేసింది.

"నా జాతి - నా దేశము - నా భాష

అను అహంకార దర్శనమందు మోంద్ర."[3]

అని అంటూ ఆంధ్రజాతి, ఆంధ్రదేశము, ఆంధ్రభాష అనే అభిమానాన్ని పొందాలని ప్రబోధించారు రాయప్రోలు వారు. వీరి 'ఆంధ్ర', 'ఆంధ్రమాత' 'ప్రబోధము', 'తెనుగుతల్లి', 'తెనుగుమాన్యము', వంటి రచనలు వీరికి ఆంధ్రదేశం, ఆంధ్రజాతి, ఆంధ్రభాషల పట్ల ఉన్న అభిమానాన్ని స్పష్టంగా చూపుతాయి.

---

1, 2 'జాతీయగీతాలు' - (సంపాదకుడు - గురజాడ రాఘవశర్మ) P256, P286

3 'ఆంధ్ర' - ఆంధ్రావళి - రాయప్రోలు సుబ్బారావు - P33

విశ్వనాథ 'ఆంధ్రపౌరుషము' తుమ్మల 'రాష్ట్రగానము', రాయప్రోలు వారి 'ఆంధ్ర' లలో ఆంధ్రుల శౌర్యప్రశంస గావించారు. ఆంధ్రజాతిని గూర్చి చెప్పేటప్పుడు వారి కళలను గూర్చి కూడ ప్రశంసించటం కనబడుతుంది.

"నాదధేనువు పిండి నవనీత మందించె
త్యాగరాజస్వామి తన్మయుండు
లీలాతరంగిణీ తూల తీర్థానందు
డయ్యె నారాయణు డద్భుతమూర్తి
శ్రీకృష్ణ కాళిగజ్జెల మ్రోతల లయించె
పదముల క్షేత్రయ్య పాడువాడు
వాక్య మాంగల్య రేఖారుచుల్ మెఱుగార్చె
మల్లినాథ విదగ్ధ వల్లభుండు
సృష్టి మాయు సంగీత సాహిత్య కలల
నుగ్గు బాలతో దుత త్రావి యుమిసి రాంధ్రులు[1]...."

ఇక ఆంధ్రుల సంపద, ఐశ్వర్యం, వైభవం కూడా భావకవుల కవిత్వంలో చోటు చేసుకున్నాయి. ఆంధ్రభాషపై కూడా అభిమానాన్ని రాయప్రోలు వంటి భావకవులు కొందరు ప్రకటించారు.[2]

ఈ విధంగా భావకవులు తమ దేశభక్తిని, ఆంధ్రదేశ, భాషలపై అభిమానాన్ని ప్రకటించి అనేక ఖండికలను రచించారు. భావకవిత్వంలో ప్రణయకవిత్వం తరువాత దేశభక్తి కవిత్వశాఖలో ఎక్కువ రచనలు వెలువడ్డాయి.

---

1. 'ఆంధ్ర' - ఆంధ్రావళి - రాయప్రోలు సుబ్బారావు. P.31
2. 'తెనుగు మాన్యము' - ఆంధ్రావళి - రాయప్రోలు సుబ్బారావు P.39.

**సంఘసంస్కరణ కవిత్వం :** కందుకూరి వీరేశలింగం పంతులుగారు తలపెట్టిన సంఘసంస్కరణోద్యమం ఆనాటి విద్యావంతులలో ఒక విశిష్టమైన సంచలనం కలిగించింది. ఈ ప్రభావంతో ప్రేరితులై సంఘంలోని దురాచారాలను మూఢనమ్మకాలను నిరసిస్తూ ఆధునికులు చాలా రచనలు చేయసాగారు. వితంతు వివాహాలు, బాల్యవివాహాలు స్త్రీ విద్యా స్వాతంత్ర్యాలు వీటికి కవితా వస్తువులయ్యాయి. కన్యాశుల్కం వరకట్నం వంటి ఆచారాల పట్ల నిరసనను తమ కవితల్లో వ్యక్తం చేయసాగారు. వర్ణవ్యవస్థలోని లోపాలు కులమత వైషమ్యాల పట్ల తీవ్రమైన అసంతృప్తిని కనబరచసాగారు. వీటికి తోడుగా గాంధీజీ సిద్ధాంతాల ప్రభావం వల్ల హరిజనోద్ధరణ, మద్యపాన నిరసన వంటి విషయాలు కూడా భావకవిత్వంలో చోటుచేసుకున్నాయి.

"పొత్తిళ్ళలో నున్న నెత్తురు కందుల
పెండ్లిండ్లు సేయ భావించు వారలు.....
అమ్మ తాత యత్తయును తాకుచు పల్కవే
పలుకలేని చిన్నిపాపలకును
రామరామ మున్ను రానున్న దెంచక
చెనటి యగుచు బెండ్లి సేయువారకందు"[1]

అంటూ బాల్యవివాహాల వికృత స్వరూపాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నించారు. చిన్నవయసులో వివాహం చేయడానికి తోడుగా వితంతువులకు వివాహ యోగ్యత లేకపోవడం బాధాకరమైన విషయమని కొందరు భావించారు. వితంతు పునర్వివాహాన్ని దృష్టిలో పెట్టుకున్న ఆధునిక కవి 'పునర్వివాహమున్ జరుపుట ధర్మమంచెవరి శాస్త్రమునన్ గలదయ్య'[2] అని

1. 'బాలవితంతు విలాపము' - మంగిపూడి వేంకటశర్మ P. 89
2. 'విధవా విలాపము' - భాగరాజు నారాయణమూర్తి. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక 1911

ప్రశ్నించారు. మంగిపూడి వేంకటశర్మ రచన 'బాలవితంతు విలాపము' బాల్యవివాహాలలోని అక్రమాన్ని, వితంతువుల దీనావస్థను సమర్థవంతంగా ప్రదర్శించిన రచన.

కొన్ని రచనల్లో కన్యాశుల్కాలు, వరకట్నాల వంటి ఆచారాలు వ్యక్తులనేవిధంగా బాధిస్తున్నాయో నిరూపించే ప్రయత్నం జరిగింది. ధనానికాశపడి బాలికలను వృద్ధులకిచ్చి వివాహం చేయడాన్ని నిరసిస్తూ గురజాడవారి 'పూర్ణమ్మ' వెలసింది. ఈ విధమైన రచనల్లో ఇది చెప్పుకోదగిన రచన. హృదయాలను కదలించే విధంగా సాగి కవి భావించిన సమస్యను స్పష్టం చేయగలిగింది 'పూర్ణమ్మ'. భోగరాజు నారాయణమూర్తి 'పండుగకట్నము' వరకట్న సమస్య ఇతివృత్తంగాగల రచన. రాయప్రోలు వారి 'స్నేహలత' కూడా వరకట్నాచారంలోని దుష్ఫలితాలను చక్కగా చూపింది. ఇది యదార్థగాథే అయినా రసవత్తరమైన రచనావిధానం. ఆ ఆచారం వల్ల రాగల దారుణ పరిణామాన్ని సమర్థవంతంగా ఎదుట నిలిపింది.

స్త్రీవిద్యను, స్త్రీస్వాతంత్ర్యానికి సంబంధించిన రచనలు కూడా కొన్ని ఆకాలంలో వచ్చాయి. బాలురకు ఉన్నట్లే బాలికలకు ఉన్నతవిద్య కావాలని, యువకులకు లాగానే యువతులకు స్వేచ్ఛ ఉండాలని వాంఛించారు మంగిపూడి వేంకటశర్మ వంటి కవులు. వీరి 'నీతికథామంజరి', 'స్త్రీధర్మబోధిని', 'అబలావిలాపము' వంటివి స్త్రీవిద్యను, స్త్రీస్వాతంత్ర్యాన్ని ఉద్దేశించిన రచనలు.

వర్ణవ్యత్యాసాలు పోవాలనీ, కుల, మత భేదాలు తొలగాలనీ కొందరు వాంఛించారు. జాషువా రచన 'గబ్బిలము', త్రిపురనేని రామస్వామి చౌదరి 'సూతపురాణము' వర్ణవ్యవస్థలోని అసమానతలను స్పష్టం చేయడానికి ఉద్దేశించిన రచనలు. నిమ్నజాతుల ఉద్ధరణను

సూచించే గేయాలు చాలా వెలవడ్డాయి. కాని ఖండికలలో అస్పృశ్యతా నివారణ, హరిజనుల సమస్యలు కవితాంశాలయ్యాయి. కాటూరి వేంకటేశ్వరరావు 'గుడిగంటలు', జాషువా 'ఖండకావ్యం' హరిజనుల సమస్యలను ప్రదర్శించాయి.

"మంచి చెడ్డలు మనుజులందున
ఎంచి చూడగ రెండె కులములు
మంచి యనునది మాలయైతే
మాలనే యగుదున్."[1]

అని అంటూ కులం ప్రాతిపదికగా 'మాలల'నడ్ల భేదాన్ని చూపడాన్ని కొందరు నిరసించారు. 'మాలలు' దేవుని మెడలో పూమాలల'ని వారిని ప్రశంసిస్తూ కుల హీనులుగా వారిని పరిగణించడం హేయమని ఆధునిక కవులు కొందరు భావించారు. వారికి దేవాలయ ప్రవేశార్హత కలగాలని కొన్ని కవితల్లో తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. వారి భక్తి ప్రపత్తులను కీర్తించారు.

"కులవర్ణములు పెంచు కుళ్ళింతవేని
మత పిశాచంబుల మనుగడవేని
- - - - - - - - - - - - - -
దైన్యరేఖలను నాశారంబు వేసి..."[2]

జీవప్రమాణ సృష్టి జరగాలని తుమ్మల సీతారామమూర్తి చౌదరి వంటి కవులు కొందరు ఆశించారు. ఈ విధంగా వర్ణవ్యవస్థను వ్యతిరేకించడం మతాలన్నీ సమానమేనని బోధించడం, మానవులంతా ఒకటేనని ప్రబోధించడం భావకవిత్వంలో కనబడుతుంది. మద్యపానం కూడదని బోధిస్తూ

1. 'మాలలు' - గురజాడ అప్పారావు - జాతీయగీతములు P395లో ఉల్లేఖింపబడినది.
2. 'పంచమాభివందనము' - కావ్యకుసుమావళి, ప్రథమ భాగము
వేంకట పార్వతీశ్వర కవులు

చాలా గేయాలు వెలువడ్డాయి. గరిమెళ్ళ సత్యనారాయణ, మంగిపూడి పురుషోత్తమ శర్మ, తుమ్మల సీతారామమూర్తి వంటి వారెందరో ఇటువంటి రచనలు చేశారు.

<u>స్మృతికావ్యాలు:</u> ఆప్తుల మరణానికి దుఃఖించి కవితల్లల్లడం శ్రీనాథుడు, పెద్దనలలో కూడా కనబడుతుంది. కాని శ్రీనాథుడు 'కాశికా విశ్వేశుఁ గలిసె వీరారెడ్డి రత్నాంబరము లేరాయఁడిచ్చు', అనే పద్యాన్ని తన కష్టకాలంలో వ్రాశాడు. కష్టాలలో తనగత జీవితంలోని వైభవాన్ని తలుచుకుంటూ ఆయా వ్యక్తుల ప్రస్తావన చేశాడేగాని కేవలం వారి మరణం పట్ల సంతాపంతో స్మృతి ప్రధానంగా దాన్ని రాశాడనే అవకాశం తక్కువ. ఇక పెద్దన కృష్ణరాయల మరణానంతరం వ్రాసిన 'ఎదురైనచో తన మదకరీంద్రము డిగ్గి కేలూత యొసగి యెక్కించుకొనియె' అనే పద్యం కొంత స్మృతికావ్యాలను పోలి ఉండవచ్చు. ఇటువంటి రచనలు ప్రాచీన సాహిత్యంలో అక్కడక్కడ ఏ ఒకటో గాని ఎక్కువ లేవు. ఆధునిక కాలంలో ఆప్తుల మరణానికి సంతాపాన్ని వ్యక్తపరచే స్మృతికావ్యాల రచన అధికంగా సాగింది.

స్మృతికావ్యాలు కొంత

పాశ్చాత్యసాహిత్య ప్రభావంతో ఆధునిక కవిత్వంలో ప్రవేశించాయనవచ్చు. పాశ్చాత్యసాహిత్యంలో ఎలిజీ (Elegy) (స్మృతికావ్యం) ఎక్కువగా దేశ నాయకులను, మిత్రులను ఉద్దేశించి వెలువడ్డది. ఎలిజీని గూర్చి The New Encyclopaedia Britanica క్రింది విధంగా వివరించింది: Elegy, meditative lyric poem lamenting the death of a public personage or of a friend or loved one; by extension, any reflective lyric on the broader theme of human mortality. In

classical literature an elegy was simply any poem written in Elegiac metre (alternating lines of dactylic hexameter and pentameter) and was not restricted as to subject...... In English literature since the 16th century, an elegy has come to mean a poem of lamentation. It may be written in any metre the poet chooses." ఆప్తులైన ఎవరి మరణాన్ని గూర్చి వ్రాసిన గేయాన్ని గాని, కావ్యాన్ని గాని ఎలిజీ అని వ్యవహరించవచ్చునని దీనివలన తెలుస్తుంది.

రాయప్రోలు 'రవీంద్రుని అస్తమయము', 'స్మృతి' (గిడుగు రామమూర్తి పంతులుగారిని గూర్చి) గోపాలకృష్ణగోఖలే గూర్చి చేసిన రచనలు దేశప్రముఖుల స్మృతికి సంబంధించినవి. దేవులపల్లి (గురజాడ గూర్చి) బసవరాజు అప్పారావు (దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గూర్చి) తుమ్మల (కాశీనాథుని నాగేశ్వరరావును గూర్చి) జాషువా (గాంధీజీ) గూర్చిన రచనలు కూడా ఇటువంటివే. వీటిలో వాళ్ళ మరణానికి విచారించడం వాళ్ళ సద్గుణాలను కీర్తించడమే కాక ఆ గుణాలనాదర్శంగా పెట్టుకొని తరువాతి తరం వారు ముందుకు సాగడానికి ప్రబోధం కూడా ఉండవచ్చు.

వావిలాల వాసుదేవశాస్త్రి 'రుక్మిణీ స్మరణము', వద్దాది వారి 'సతీస్మృతి' భార్యావియోగ దుఃఖాన్ని గూర్చి రచించిన స్మృతికావ్యాలు. విశ్వనాథ వారి 'వరలక్ష్మీ త్రిశతి' సతీస్మృతి కావ్యాలలో ప్రధానంగా చెప్పదగ్గది. దువ్వూరి వారి 'భగ్నహృదయము', బాలాంత్రపు వెంకటరావుగారి 'విరహసంగీతము' కూడా ఈ కోవలోవే.

వద్దాది వారి 'సుతస్మృతి', దువ్వూరి వారి 'శిశువియోగము', బసవరాజు అప్పారావు
గారి 'నిర్యాణానుశయము', నాయని వారి 'విషాదమోహనము', రాయప్రోలు వారి
'నందా' వంటివి సుతాదిక స్మృతిప్రధాన రచనలు.

ఇక తల్లిదండ్రులను గూర్చి
సోదరీ సోదరులను గూర్చి, మిత్రులను గూర్చి వచ్చిన స్మృతి కావ్యాలలో
వావిలాల వాసుదేవశాస్త్రిగారి 'పిత్రారాధనము' నాయని సుబ్బారావుగారి 'మాతృ
గీతాలు', పెనుమర్తి వెంకటరత్నం గారి 'రత్నాపహారము', మోటూరి వెంకటరావు
గారి 'ఆహుతి', ఓ చెల్లీ (తండ్రిని, సోదరిని గూర్చి), దువ్వూరి వారి 'సోదరీ
స్మృతి' వంటి రచనలు ప్రముఖమైనవి.

ఈ విధంగా ప్రకృతి, ప్రణయం, దేశభక్తి
సంఘసంస్కరణ, స్మృతి వంటి జీవనతత్త్వ వివేచనా శీలమయిన విషయాలను
ఆధారం చేసుకుని అతివిస్తృతమైన వస్తువైవిధ్యంతో భావకవిత్వం వెలువడింది.

ఈ భావకవిత్వశాఖలన్నిటికి సంబంధించిన కవిత్వం
రాయప్రోలు సుబ్బారావు గారి రచనల్లో కనబడుతుంది. అంతకుముందు ఒక
మార్గంలో పయనిస్తున్న కవిత్వాన్ని వేరొక మార్గానికి మళ్ళించిన అభినవ
కవి రాయప్రోలు సుబ్బారావుగారు. కనుకనే కొందరు సాహిత్యవిమర్శకులు
భావకవిత్వరచనకు వారిని ఆద్యులుగా పరిగణించి యుగకర్తగా పేర్కొన్నారు.

---

## భావకవిత్వయుగంలో రాయప్రోలు వారి స్థానం.

తమకు ముందున్న సాహిత్యానికి కొంత భిన్నంగా నూతనమార్గాలను అవలంబించి, తమ తరువాత కాలంలోని కవులను ఉత్తేజాన్ని కలిగించి వారిని ప్రభావితులను చేసిన కవులను యుగకర్తలుగా పేర్కొనడం జరుగుతుంటుంది. నవ్యకవిత్వానికి గురజాడ, రాయప్రోలులలో ఎవరు యుగకర్తలనే విషయంలో భిన్నాభిప్రాయాలు కనబడుతున్నాయి. వీరిద్దరి రచనలు కొత్తమార్గాలలో సాగినవే. కొంత ముందు వెనుకలుగా ఇద్దరూ తమ ప్రభావాన్ని తరువాతకవులపై చూపినవాళ్ళే. కనుకనే సాహిత్యవిమర్శకులలో కొందరు గురజాడ అప్పారావుగారు నవ్యకవిత్వానికి యుగకర్త అని అభిప్రాయపడితే మరికొందరు రాయప్రోలు సుబ్బారావుగారు యుగకర్త అని భావించారు. కొందరు సమన్వయ ధోరణిని చూపి ఇద్దరూ యుగకర్తలే అని నిర్ణయించారు.

విశ్వనాథ సత్యనారాయణగారు[1], నోరి నరసింహశాస్త్రిగారు[2] శ్రీశ్రీ[3]గారి వంటివారు కొందరు గురజాడవారు యుగకర్త అని అభిప్రాయపడ్డారు. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారు[4], రమాకాంతాచార్యులుగారు[5], తురుగంటి సీతారామయ్యగారు[6] వంటివారు కొందరు రాయప్రోలువారు యుగకర్త అనే

---

1. 'నవ్యసాహిత్య పరిషత్తు సప్తమ వార్షిక అధ్యక్షోపన్యాసము'
   భారతి - ఏప్రిల్ - 1940.
2. 'నవ్యకవిత్వము-దాని ఉద్దేశ్యము' - ప్రతిభ - జనవరి 1938.
3. 'గురజాడ ఆధిక్యానికి కారణాలు' (వ్యాసము) పుస్తకముపేరు 'గురజాడ'.
4. 'నీరాజనం' - తృణకంకణం రజతోత్సవ సంచిక
5. పీఠిక - లలిత
6. నవ్యాంధ్ర సాహిత్య వీధులు - ద్వితీయ భాగము - P222.

అభిప్రాయం వ్యక్తం చేశారు.

అభినవ కవిత్వంలో రెండు శాఖలకు (దేశి - మార్గ) క్రమంగా గురజాడ, రాయప్రోలు మార్గదర్శకులని మరికొందరు సమన్వయ ధోరణిని కనబరచారు. గిడుగు సీతాపతిగారు, కొత్తపల్లి వీరభద్రరావుగారు, C. నారాయణరెడ్డిగారు ఇద్దరూ యుగకర్తలేనని భావించారు.[1] P.V. రాజమన్నారుగారు 'అప్పారావుగారు ముత్యాల సరాలలో నీలగిరి పాటలలో క్రొత్త దారి తొక్కినవారైనను రాయప్రోలు వారి కావ్యాలలోనే భావకవిత్వం ప్రారంభమైనదని చెప్పక తప్పదు'[2] అని అన్నారు.

ఏమైనా భావకవిత్వవిధానానికి ఒక రూపుదిద్దిన కవిగా రాయప్రోలు వారిని చెప్పవచ్చు. వీరు వేసిన భావకవిత్వపు నూతనమార్గాలలో సాహిత్యం సుమారు మూడు, నాలుగు దశాబ్దాలపాటు నడిచింది. రాయప్రోలు వారి ప్రభావం తదనంతర భావకవుల మీద విశేషంగా కనబడుతుంది.

## తరువాతి కవులపై రాయప్రోలు వారి ప్రభావం.

రాయప్రోలు వారి కావ్యభాష, శైలి వంటివి ఆనాటి కవులను చాలామందిని ఆకర్షించాయి. వీరి రచనల్లోని తెలుగు నుడికారం, తెలుగుదేశపు వర్ణనావిధానం పట్ల సమకాలికులలో అభిమానం ఏర్పడింది. నిత్యవ్యవహారంలోని పదాలతో మిశ్ర సమాసాలలో కూడిన వీరి రచనావిధానం వారిలో ఒక ఆసక్తిని కలిగించింది. ఆంధ్రుల ప్రాచీన వైభవాన్ని సుబ్బారావుగారు కీర్తించిన విధానం, వారి ఆంధ్రాభిమాన కవిత్వం చాలమందిని ఉత్తేజితులను చేసింది. వీరి రచనా విధానం వారిపై చెరగని ముద్రవేసింది. వీరి పద్యాల ఎత్తుగడను, భావనాశైలిని

---

1,2. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు

C. నారాయణరెడ్డి - P 181.

తరువాత వారెందరో ఆదరించి అనుసరించారు. "ఆంధ్రప్రశస్తి నేను వ్రాశానంటే ఆ ఆవేగం రాయప్రోలు వలన కలిగినదే..... నేను వచ్చానమ్మా నేను వచ్చాను అనే రాయప్రోలు రచన చూచిన తరువాత నేను వ్రాశాను.... రాయప్రోలు నాకొక విధంగా లక్ష్యభూతుడు.... ఈనాడు వారిముద్ర భావకవులలో అనేకులపై ఉంది." అని విశ్వనాథ వారన్నారు.[1]

'అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాడు' అనే విధమైన పద్యపు ఎత్తుగడ

'గోదావరీ పావనోదార వాఃపూర

మఖిల భారతము మాదన్ననాడు'[2]

వంటి రచనలలో స్పష్టం అవుతుంది. విశ్వనాథ, జాషువా, తుమ్మల వంటివారి దేశభక్తి రచనలపై రాయప్రోలు వారి ప్రభావముద్ర కనబడుతుంది.

భావకవులలోని

సభ్యశృంగార వర్ణనలకు ఊపిరినిచ్చింది రాయప్రోలు వారు.

'ఆమె నవనీత హృదయ నాయంతరంగ

శాంతిదేవత ఆశాపథాంతరాళ

పారిజాతము ప్రేమజీవన విభాత

కైశికీగీతి నాతపఃకల్పవల్లి'[3]

అనే విధంగా స్త్రీ ఆరాధన, స్త్రీవర్ణనలలో పవిత్రత రాయప్రోలు వారి ప్రభావమేనని చెప్పవచ్చు. స్త్రీ వర్ణనలలోని స్వచ్ఛత, సభ్యత, రమణీయతలను రాయప్రోలు వారు

---

1. విమర్శిని - 4 - P1.
2. ఆంధ్రపౌరుషము - విశ్వనాథ సత్యనారాయణ, P23.
3. 'ఆరాధన' - దీపావళి - వేదుల సత్యనారాయణ శాస్త్రి - P69.

పునరుజ్జీవింప చేశారు. వియోగ శృంగారాన్ని వర్ణించడంలో కూడా వీరు ఒరవడి దిద్దారు. రాయప్రోలు వారి విరహవర్ణనల్లోని భావనాశక్తి విషాదభావతీవ్రత కృష్ణశాస్త్రి లాంటి కవులలో ప్రసిద్ధంగా రూపుదిద్దుకుంది.

వీరి అమలిన శృంగార సిద్ధాంతం ఒక సంచలనాన్ని కలిగించింది. శృంగారాన్ని గూర్చిన ఆలోచనలకు ప్రేరణనిచ్చింది. దీని ప్రభావంలో శృంగారాన్ని గూర్చిన భావనలు ఎన్నో పరిణామాలు పొందాయి. యీ కోవ ప్రపంచంలో కృష్ణశాస్త్రి లాంటివారి రచనల్లో కనబడే భావమయ శృంగారం ఒకటి. ధర్మబద్ధంగా దాంపత్య బంధంలో విశ్వనాథ లాంటి వారి రచనల్లో వ్యక్తమయ్యే తులసాతికా శృంగారం మరొకటి. మనిషి మనసుకు ప్రాధాన్యాన్నిస్తూ శారీరక సుఖాలకు (ప్రాముఖ్యాన్నిచ్చి) విశృంఖల శృంగారంగా కొందరు భావించి దానికే పతాకాన్నిచ్చిన చలం రచనల్లోని శృంగారం వేరొకటి. ఇవి విభిన్న మార్గాలయినా అసలు సమాజంలో నరనారీ సంబంధాలను గూర్చి పునరాలోచనకు అవసరాన్ని, ఉద్దీపనను కలిగించింది అమలిన శృంగార సిద్ధాంతం. ఆ సిద్ధాంతం మూలంగా విమర్శనాదృష్టిలో గాని, వివేచనా తత్త్వంలో గాని బయలుదేరిన విభిన్నమైన ఆలోచనా మార్గాలలోని గమ్యాలుగా ఇవన్నీ కనబడతాయి.

తృణకంకణ కావ్యానికి కొంత పోలికలో సాగిన నవలగా 'ఏకవీర' (విశ్వనాథ) ను చెప్పవచ్చు. తులసాతికా ప్రస్థానం చేసిన విశ్వనాథవారు ఏకవీరలో ఈ సమస్యలోని సాధకబాధకాలను వ్యంగ్యంగా స్పృశించారు. కుట్టాన్ మీనాక్షిని సోదరీ అని పిలుస్తాడు. వారిద్దరు తృణకంకణంలోని స్త్రీ, పురుష పాత్రల వంటివారే. అయితే మీనాక్షి భర్తకీ విషయం తెలుస్తుంది. అతడామెను స్వీకరింపలేకపోతాడు. .... వీరభూపతి వంటివారికి మీనాక్షి కుట్టాముల వంటివారి అమలిన ప్రేమను తెలుసుకొనే సాధన యోగం ఉంటేనే అది జీవితంలో ఆచరణయోగ్యమౌతుంది. రాయప్రోలు వారి కృతులలో

అమలిన శృంగారం పలికించే నాయికయొక్క భర్త రంగంలోకి ప్రవేశించడు. ప్రవేశిస్తే ప్రళయం తప్పదని విశ్వనాథ భావించినట్లున్నారు."[1]

సామాజికంగా శృంగారానికున్న స్థానాన్ని గూర్చిన ఆలోచనను ప్రారంభం చేసింది అమలిన శృంగార సిద్ధాంతం. సాహిత్యంలోని శృంగార రససిద్ధాంతానికి కొంతదూరంగా ఆలోచించేందుకు అవకాశం ఇచ్చింది. రాయప్రోలు వారు అమలినశృంగార సిద్ధాంతంలో భావించిన నరనారీసంబంధంలోని ఒక భాగాన్ని స్పష్టమయిన రూపం ప్రకృతి పురుషభావాన్ని దంపతులకు సమన్వయిస్తూ చెప్పిన తుల పాలికా ప్రణయం.

ఈ విధంగా పదలాలిత్యంలో, శైలీ సౌకుమార్యంలో వస్తు వైవిధ్యంలో, ఆలోచనావిధానంలో ఎంతోమందిని ప్రభావితం చేశారు సుబ్బారావు గారు. వారి పదబంధవిధానాన్ని, సమాస శైలిని, పద్యపు పోకడలను చాలామంది అనుసరించారు.

రాయప్రోలు సుబ్బారావుగారు 'ఉత్తమకవికి కావలసిన భావావేశమును, ఉత్తమ తత్త్వవేత్తకు కావలసిన భావగాంభీర్యమును... సహజ సంపదలు'[2]గా కలిగి భావకవులలో ప్రత్యేక స్థానాన్ని పొందారు. ద్రష్టగా జీవిత తత్త్వాన్వేషణలో ఒక తత్త్వాన్ని దర్శించడం; స్రష్టగా దానికి రమణీయమైన కావ్యకల్పన చేయడం రెండూ వారిలో సమగ్రంగా కనబడతాయి. కనుక వారి కవిత్వం సత్యసౌందర్యాల సమన్వయం.

నవ్యమార్గంలో భావకవిత్వాన్ని రచించడమే కాకుండా వీరు దానికి

---

1. 'రాయప్రోలు సుబ్బారావు' (వ్యాసము). G.V. సుబ్రహ్మణ్యం నవోదయలహరి . P56
2. 'రూపనవనీతమ్' - సమీక్ష - జయశ్రీ - కృష్ణాపత్రిక 19-4-58

లక్షణకావ్యాలను కూడా రచించారు.[3] వారి రచనల్లోని సత్త్వాలను, కవిత్వంలోని సౌందర్యాన్ని దర్శించడానికి ముందుగా కవిత్వం పట్ల వారి అభిప్రాయాలను పరిశీలించడం సమంజసంగా ఉంటుంది.

---

రెండవ భాగం

# కావ్యపరిశీలన

రాయప్రోలు వారి దృష్టిలో

# కవిత్వతత్త్వం

# రాయప్రోలు వారి దృష్టిలో కవిత్వతత్త్వం

సృజనాత్మక రచనాశక్తి, విమర్శనాశక్తి ఒకే వ్యక్తిలో ఉండటం చాలా అరుదు. అటువంటి రెండు శక్తుల సమ్మేళనం రాయప్రోలు వారిలో సమగ్రంగా కనబడుతుంది. సుబ్బారావు గారి లోని విమర్శనాత్మక పరిశీలనా దృష్టి వారి తత్త్వవివేచనకు కారణభూతమయింది. అదే వారిని దార్శనికునిగా నిలిపింది. కనుకనే వీరు 'నవ్యాంధ్రసాహిత్య దండి'గా పేర్కొనబడ్డారు[1].

కవిత్వాన్ని గూర్చిన రాయప్రోలు వారి అభిప్రాయాల మీద ఇంగ్లీషు సాహిత్య ప్రభావం కొంత కనబడుతుంది. ఇంగ్లీషు సాహిత్యంలోని లిరికల్ పొయిట్రీ (Lyrical Poetry) వీరిని ఆకర్షించింది. దాని పరిమాణం, దానిలోని వర్ణనావిధానం, వస్తువు వీరికి నచ్చాయి. దానిలో భావం అస్పష్టంగా అందీ అందకుండా ఉండటంలో ఒక చమత్కారం కనబడింది. పరిమళంలో పరిసరాలను చుట్టివేసే పొదలోని పువ్వులాగా ఆ భావం తనకోసం వెదికేటట్లు చేస్తుందని, సాహిత్యపిపాసువులకు ఆ భావాన్ని గ్రహించడంలో రమ్యత గోచరిస్తుందని వీరి అభిప్రాయం.

"లిరిక్ నాతి దీర్ఘంగా, అనతి వర్ణనాత్మకంగా అర్థోన్ముక్త కథాంగంగా నడుస్తుంది. వివక్ష పూర్తి కాదు. ఆకాంక్షను

---

1. "నవ్యాంధ్ర కవిత్వగ్రంథ రచనయందు శ్రీ సుబ్బారావు గారెట్లు ప్రథమ లనిపించుకొనిరో తత్సాహిత్య లక్షణ గ్రంథకర్తలలో ప్రథమస్థానమును కూడ బడసిరి. వీరిని నవ్యాంధ్ర సాహిత్యదండి యని పిలుచుట తప్పు కాదు."

'రమ్యాలోక సమీక్ష' (వ్యాసము) తురుగంటి సీతారామయ్య.

ఆంధ్ర పత్రిక - ఉగాది సంచిక, 1939.

అవకాశం ఎక్కువ. భావం స్పష్టాస్పష్టంగా దాగుడుమూతలాడుతూ తనహాసం వెదుకులాడేటట్లు చేస్తుంది..... కావ్యసంకల్పనలో అది ఒక గడుసైన కైలాటం."[1]

లిరిక్‌లో కథాకథన శిల్పానికి ప్రాముఖ్యం తక్కువ. కథకు సంబంధించిన పూర్వాపరాలు విశేషంగా చెప్పబడవు. వాచ్యంగా చెప్పడం కంటె వ్యంగ్యంగా ధ్వనింపచేస్తూ సూచించడం అధికం.

"కథ చిన్నదిగా ఉంటుంది. అంగోపాంగములు అంతగా విస్తరింపవు. పూర్వోత్తరములు కూడా అధికంగా కథితములు కావు. పెద్ద చెఱకుగడలో రససిక్తములయిన కణుపు ఖండలు ఏ రెండు మూడో ఏరికొని సహృదయచర్వణకు అందించడమే ప్రధానదృష్టి. అందువల్ల కథా సంఘటనము తీగె మీద పువ్వుల లాగా కలిసీ కలియక వుంటుంది.... ఆ లిరిక్కుల్లో అధికాధికంగా అనురాగమే ఇతివృత్త భాగంగా కనబడుతుంది.... కాగా బాహిరము కంటె అంతరమూ, వాచ్యము కంటె వ్యంగ్యమూ ప్రస్తుతములు కావడం ఈలాంటి రచనలో ప్రధాన వైఖరి.... అనురాగము సంభోగ పరిణామము పొందనక్కర లేదు."[2] రాయప్రోలు వారికి లిరిక్ ప్రక్రియలో నచ్చిన లక్షణాలివి. కనుకనే వారు వాటిని ఆదరించారు. ఆ ప్రక్రియను, ఆ లక్షణాలను స్వంతం చేసుకుని వారి కవిత్వం ద్వారా ప్రచారానికి తెచ్చారు.

"---- Lyric poetry is small, sweet and creative. It attracted me, influenced me to adopt it in my

---

1. రాయప్రోలు వారి 'లిరిక్ ఆవిర్భావం' అను రేడియో ప్రసంగం నుండి - 'ఆంధ్రావళి' - ఎమెస్కో ప్రచురణ 1972 లో ఉల్లేఖింపబడింది.
2. 'నివేదన' - తృణకంకణము P3,4.

mother tongue. Apart from poetic embellishments and conventions I made a change, I made an earnest attempt to divorce the Lyric from sex overtone and tune it to the vibrations of kindness, fellowship and friendship and other soft vibrations of the human heart - the divine in the man".[1]

ఇంగ్లీషు కవులు పాత్రలు, వారి అనుభూతులు జీవితానికి వీలయినంత దగ్గరగా ఉండే ప్రయత్నం చేస్తారని వీరంటారు. ఆ లక్షణం వారికి నచ్చింది. పాత్రలు, సన్నివేశాలు సామాన్యుల అనుభవానికి దగ్గరగా ఉండాలని వీరి అభిప్రాయం. "ప్రతీ మనిషి అనుభవానికి దగ్గరగు తేవాలి. ఇందులో ఇంగ్లీషు కవులు చాలా జాగ్రత్త పడతారు. ఊరికే abstract గా ఉంటే లాభం లేదు".[2] కనుక ఈ విషయంలో కూడా ఇంగ్లీషు సాహిత్యం వీరిని కొంత ఆకర్షించిందనుకోవచ్చు.

రాయప్రోలు వారి రచనల్లో కథకు పూర్వాపరాలు ఎక్కువగా చెప్పడం ఉండదు. కథ రేఖామాత్రంగా ఉండి కొంత పాఠకుల ఊహకు వదలి వేయబడుతుంది. సంభోగ పరిణామం పొందని అనురాగం ఎక్కువ భాగం రచనల్లో ఇతివృత్తంగా స్వీకరించబడింది. తృణకంకణం, కష్టకమల లాంటి అస్పష్టంగా చాలా సూక్ష్మంగా ఉండే కథారేఖలును, స్వప్న కుమారంలో వారే ఉద్దేశించిన గూఢతను ఈ లిరిక్ సంప్రదాయం కొంత దోహదం చేసి ఉంటుంది. వారు ఉద్దేశపూర్వకంగా భావాన్ని వెదకడంలో

---

1. విమర్శిని - 4 అనుబంధం P34
2. Interview on 11-6-81

సహృదయులకు చమత్కారాన్ని అందివ్వాలని అనుకోవడం వారికవిత్వంలో భావం అస్పష్టంగా ఉంటుందన్న విమర్శలకు అవకాశాన్నిచ్చింది.

ఇది వీరి కవిత్వతత్త్వవివేచన మీద ఇంగ్లీషు సాహిత్యం యొక్క లలితమైన ప్రభావముద్ర. ఈ దృష్టికి తోడుగా ప్రాచీన భారతీయ ఆలంకారికులు చెప్పిన కవిత్వలక్షణాలను కూడా వీరు సాదరంగా గ్రహించారు. వీటి నన్నిటిని క్రోడీకరించుకుని సమర్థవంతంగా నవ్యకవిత్వ లక్షణాలను, తత్త్వాన్ని నిరూపించారు. ప్రాచీన ఆలంకారికుల అభిప్రాయాలలో భేద సామ్యాలను తులనాత్మకంగా పరిశీలించి నవ్యకవిత్వాన్ని వివేచించారు.

నవ్యకవిత్వానికి లక్షణకావ్యాలనదగ్గవి వీరి 'రమ్యాలోకము మాధురీ దర్శనమ్'. ప్రాచీన లక్షణగ్రంథాలను విమర్శించాలనడి వీరి దృక్పథం కాదు. నవ్యుల దృష్టి వైశిష్ట్యాన్ని స్పష్టం చేయాలనడే వీరి ధ్యేయం. కనుకనే

"పూర్వ లక్షణములు దిద్దు బుద్ధి లేదు
అవి నవీనముల్ శాసించు నవియు గావు
నవ్యకావ్యదృష్టిని చూపినాడ నంతె
కలదుగాదె అనుక్తంబు గ్రథనమందు."[2]

అని అన్నారు. సుబ్బారావుగారు నవ్యకవిత్వాన్ని నవ్యుల ఆలోచనలను సమర్థించడంతో పాటు, ప్రాచీన లాక్షణిక సంప్రదాయంతో ఆధునిక సాహిత్యానికున్న సంబంధాన్ని వెదికి చూపి వ్యాఖ్యానించారు. కనుకనే పూర్వ లాక్షణికుల అభిప్రాయాలకు అనువాదప్రాయాలుగా కనబడే భావాలు

---

1. భావకవిత్వపదానికి అప్పటికి వ్యవహారంలో ఉన్న నవ్యకవిత్వం అన్న పదమే ఈ భాగంలో వాడబడింది.

2. రమ్యాలోకము.

కావ్యశాఖల్ని ప్రభావితం చేశాయి.

దండి, ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు జగన్నాథపండితరాయలు వామనుడు వంటి లాక్షణికులు వీరి ఆలోచనా విధానాన్ని స్పష్టంగా ప్రభావితం చేశారు. సాహిత్యతత్త్వ ప్రతిపాదనలో ఈ ఛాయలు స్పష్టంగా కనబడతాయి. వీరు ఆనందవర్ధనుని ఎక్కువగా అభిమానించారు. ఆనందవర్ధనుని 'ధ్వన్యాలోకము' స్ఫూర్తికి తెస్తూ అదే పేరులో కొన్ని పద్యాలు వ్రాశారు.[1] వారి లక్షణకావ్యానికి ధ్వన్యాలోకాన్ని పోలిన 'రమ్యాలోకము' అన్న పేరు పెట్టారు. 'శబ్దార్థం' అభిధా పరతా మెదలి లక్షణా వ్యంజనా వృత్తులలో సంచరిస్తుందనడంలో ఆనందవర్ధనుడు ధ్వనికిచ్చిన ప్రాధాన్యం అతి సూక్ష్మంగా గోచరిస్తుంది.

'అపారే కావ్యసంసారే కవిరేవ ప్రజాపతిః'[2] అన్న ఆనందవర్ధనుని పలుకులను—

'ఈ అపార కావ్యసంసారమందున కవి యొకండె బ్రహ్మ'[3] అంటూ పరిగ్రహించారు.

అభినవగుప్తుడు రసాన్ని గూర్చి 'రస ఏవైవ సర్వం జీవతి కావ్యం; నహి రస శూన్యం కావ్యం కించిదస్తి। రస ఏవ వస్తుతః ఆత్మా;'[4]. ప్రాచీనాలంకారికులలో ఎక్కువమంది రసాన్ని

---

1. ధ్వన్యాలోకము - జడకుచ్చులు P 156
2. కావ్యాలంకార సంగ్రహము - P 90 లో ఉల్లేఖించబడింది.
3. రమ్యాలోకము - P 19
4. కావ్యాలంకార సంగ్రహము - P 99 లో ఉల్లేఖించబడింది.

కావ్యాత్మగా అంగీకరించిన విధంగానే సుబ్బారావుగారు 'కావ్యమునకు రసమే ఆత్మ అని విశ్వసించువారిలో నేనొకడను.'[1] అని అన్నారు.

'మూర్ఖా సంభోగ మిచ్ఛంతి' అనే జగన్నాథపండిత రాయల అభిప్రాయం వీరి ఆమోదాన్ని పొందింది. 'మూర్ఖులిచ్ఛయించెదరు సంభోగ సుఖము'[2]... అంటూ పండితరాయల భావాన్ని స్పష్టం చేశారు. వీరు నీచకావ్యత్వాదులను శృంగారపరిధిలో చేర్చి శారీరక సుఖాలకు అతీతంగా శృంగారాన్ని భావన చేయడం. సంభోగ శృంగారం కంటె వియోగ శృంగారానికి ప్రాముఖ్యం ఇవ్వడం వంటి ఉద్దేశాలకు దగ్గరగా ఉండడం వల్ల పండితరాయల భావాన్ని అభిమానించి ఉంటారు.

'సుప్రసిద్ధ దేశ్యంబులను శుద్ధ సంస్కృ
తములలో కల్పుటకు సంప్రదాయ మనదె వామనుడు'[3]

అంటూ శ్రవణసుభగమైన మిశ్రసమాసాలను ఆదరించడానికి వామనుని వచనాన్ని ఆధారంగా గ్రహించారు. కావ్యంలో ఇష్టార్థం ప్రధానంగా భావించి రాయప్రోలువారు

'రుచిమదిష్టార్థ సాహన ప్రచుర శబ్ద
సరమునే కావ్యమనియె ఆచార్య దండి.'[4]

అంటూ 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం' అన్న దండి ఉద్దేశాన్ని సాదరంగా స్వీకరించారు. ఈ విధంగా ప్రాచీన లాక్షణికుల భావాలు

1. అభినవాంధ్ర కవి పండిత సమ్మేళనము - ద్వితీయ సమావేశము - భారతి Feb - 1934

2, 3, 4 రమ్యాలోకము - P 12; 20; 37

కొన్నిచోట్ల కనిపిస్తుంటాయి. అయితే అన్నిటా ప్రాచీనుల మతమే అంగీకారం కానక్కర్లేదన్నట్లుగా అక్కడక్కడా నవీనుల ఆలోచనా సరణిని వ్యక్తం చేసారు. నవ్యకవిత్వ తత్త్వనిరూపణాధ్యేయంగా సాగడం చేతనే రమ్యాలోకము నవ్యకవుల మేనిఫెస్టో (Manifesto)గా వర్ణింపబడింది.[1]

కవికి ఆత్మీయునకు కయ్యంబె సాగెను
బహుదినాల వాక్ప్రపంచమందు:[2]

అని అనడంలోనూ 'ఉభయదృష్టి విడిచె లాక్షణికుడు' అని అనడంలోనూ కావ్యవిమర్శలో కొత్తదృక్పథం కావాలనే అభిప్రాయం కనిపిస్తుంది. విమర్శకునికి నవ్యతను గ్రహించే విశాలదృష్టి అవసరమని సుబ్బారావు గారి ఉద్దేశం. విమర్శకులు పాతదా, కొత్తదా అనే ఆలోచనను విడిచి దానిలోని గుణాన్ని మాత్రమే పరీక్షించాలి. ఆ గుణాలు ఆమోదనీయాలో కావో నిర్ణయించాలి.

పాత, కొత్తల భేదం కవులకు లేదు. పాత, కొత్త అనేవి మూలసూత్రాలకు వర్తించవు. పాతబంగారంలో కొత్తనగలు చేయించుకున్నట్టు వంటిదే ఈ నవ్యత. ప్రాచీనసాహిత్యవృక్షానికి అంటుమొక్కలే భావగీతాలు. కాలాన్ని అనుసరించి వాఙ్మయం కూడా మారుతుంటుంది అనే అభిప్రాయంలో

---

1. "రాయప్రోలు సుబ్బారావు నవ్యకవులకు ప్రతినిధిగా రమ్యాలోకము అను కావ్యనియమ గ్రంథమును రచించెను.... ఈ రమ్యాలోకము సుబ్బారావు గారు ఉద్దేశించిన నవ్యకవుల Manifesto గా కనబడుచున్నది."
దువ్వూరి రామిరెడ్డి - తెలుగు కవితలో క్రొత్త తెనుగులు (వ్యాసము) కవికోకిల గ్రంథావళి - P.168

2. రమ్యాలోకము - P18

రాయప్రోలు వారు ఇలా అన్నారు.

"ప్రాతదయినంతనే త్యజింపరు, నవీన
మయిన మాత్ర వరింపరు; ప్రియములై, స
హృదయ సేవ్యమానములైనవెల్ల, స్వీక
రించి భావాంబరము నలంకరింతురర్థి."[1]

ప్రాతదైన మాత్రాన భక్ష్యములు కావు,
నవ్యమైన మాత్రాన నింద్యములు కావు,[2]...

నవకవులు హృదయరంజకాలయిన వాటిని ప్రాచీనమయినవయినా గ్రహిస్తారు. ఆకర్షకమైన రమ్యభావాలు, శ్రావ్యమయిన శబ్దరీతి వంటివి ప్రాచీనవాఙ్మయం నుంచి స్వీకరించడానికి నవ్యులు వెనుకాడరు. కాని ఈ అనంతమైన సృష్టి వైచిత్ర్యాన్ని స్వయంగా చూచి, అనుభవించి తమదైన అనుభూతిని తమ భాషలో తమకు నచ్చిన రీతిలో వ్యక్తం చేసే స్వేచ్ఛను కోరుతుంటారు. నవ్యులు స్వేచ్ఛాప్రియులు. స్వానుభవ భావాలు చెప్పాలని వీరు వాంఛిస్తారు. అనుభూతి కవితకు ప్రాణం. కవి తనలో కలిగిన అనుభూతిని రసవత్తరంగా హృదయంగమంగా వెల్లడిస్తాడు. ఆ నేర్పే కవిని సామాన్యునికంటె విశిష్టుణ్ణి చేస్తుంది. బిందుప్రాయంగా కవిలో కలిగిన అనుభూతి హృదయం నిండా వ్యాపించి కవితామయం అయేలోపల కవినే విశ్వంగా కలిపివేస్తుందో రమణీయంగా రాయప్రోలు వారు 'ఈ గీతము' లో ఇలా చెప్తారు.

జారిండి నాలోన
స్వాతి బిందువు భాతి
చిమ్మలై చిలవలై
చెరువులై నిండింది.

---

1, 2 రమ్యాలోకము. P 22, 23

తుదిలేని ఆరాటమెదను వేటాడంగ

కడలేని కుతుకంబు కంఠమున్ కబళింప

మనసు నంతా వేపి మరుగు మూలలు చూచి

కన్నులన్నీ విప్పి మిన్నుమన్నూ గాంచి

తలపు దీపము చూప

నలుగడా వెదికాను

వలపు వాకిలి తీయు

వాడెలా వేశాను.[1]

స్వాతి బిందువు చెరువై నిండిన విధంగా బిందుపరిమాణంలో ప్రవేశించిన అనుభూతి మనసునిండా నిండుతుంది. అంతులేని ఆరాటం కలిగిస్తుంది. కవి హృదయాన్ని ఆరాటపెట్టిన అనుభూతి రసవంతమై కావ్యరూపం పొందుతుంది. కవి అంతఃకరణంలో ఆనందవల్లిని పూయించి కాయించి సహృదయ రంజకంగా వెలువడుతుంది. కవికి భావాన్ని ఇతరులకు అందించే శక్తి సామర్థ్యాలు సహజం.

ప్రపంచంలోని ప్రాణుల కష్టసుఖాలను భావావేశంలో వర్ణించే కవి భావాలకు ఆలంబన వాక్యం. వాక్య సంఘాత అయిన కవి కోరిక ననుసరించి శబ్దం ధ్వనిస్తుంది. సమర్థవంతుడైన కవి వాక్కులో సరళాక్షర సమ్మేళనంతో వాక్యం రాగసౌభాగ్యాన్ని పొందుతుంది.

"పూల కడుపులలో తేనె పోసె నెవడా!

దాని తీయు నేరుపు తుమ్మెదకు లభించె;

భాషలోని మాధుర్య లావణ్యభావ

సాధు భోగము కవిముఖ సాధ్యమయ్యె."[2]

---

1. 'ఈ గీతము' - వనమాల, P20

2. రమ్యాలోకము. P9

అటువంటి సామర్థ్యంతో తన అనుభూతిని సుందరంగా తీర్చిదిద్ది కావ్యస్వరూపాన్ని సృష్టిస్తాడు కవి.

పుష్పం నుంచి వెలువడిన పరిమళం పరిసరాలలో వ్యాపించిన విధంగా కావ్యంలోని శబ్దార్థం అభిధాశక్తిని దాటి లక్షణా, వ్యంజనా శక్తులలోకి ప్రవేశిస్తుందని, ఆ శబ్దమాధుర్యాన్ని సహృదయులు గ్రహిస్తారని రాయప్రోలువారి అభిప్రాయం. కావ్యగతమైన రమ్యార్థం ఆస్వాదించేవారి సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. సహృదయ హృదయరంజకమైన కావ్యమాధుర్యాన్ని గూర్చి చెప్తూ కావ్యం పాడిఆవు వంటిదని చమత్కరిస్తారు రాయప్రోలు వారు.

"పిచ్చి పాడియావు వంటిది కావ్యంబు
లేగ గుడిపి చేపు రాగదువ్వ
పిదుక నమృతమిచ్చు, పాడుగ గ్రుద్దితివేని
కాలు విసరు దున్నపోలు రావు!"[1]

సుబ్బారావుగారి దృష్టిలో కావ్యంలో వాచ్యార్థం కంటె వ్యంగ్యార్థానికే సౌందర్యం ప్రాముఖ్యం ఎక్కువ. ఉత్తమ కావ్యాలు ధ్వనిప్రధానాలై వ్యంజనా వృత్తిని ఆశ్రయించేవిగా ఉంటాయని వీరి అభిప్రాయం. విషయాన్ని స్పష్టంగా చెప్పడంలో కంటె ధ్వనిప్రధానంగా చెప్పడంలో రమణీయత ఉందనే, అంతేకాక గూఢత లోపిస్తే చులకనయ్యే అవకాశం ఉందని రాయప్రోలు వారు భావిస్తారు.

"స్పష్టత లేదని యెదవే
సృష్టిని విస్పష్టమయిన దేదోయి బుధా!

1. 'తెలుగు బంతి' - వనమాల - P23

క్లిష్టపదణము చేతని
ఇష్టార్థఫలంబు వెదుకరేమొ సహృదయుల్.[1]

'గూఢము హృదయంగమకతి
గూఢత మీమాంసకేంద్రులకు మూలమగున్
గూఢము రసాదియు స్థితి
గూఢత తొలగన్ జుగుప్స కొల్పు నవరా సుకవీ!'[2]

క్లిష్టపదణాన్ని తొలగించి సహృదయులు తమ కౌశలం కొద్దీ ధ్వన్యర్థాన్ని వెలికి తీస్తారు. కావ్యధ్వనిలో సుబోధంగా సూక్ష్మంగా రమ్యార్థం భాసిస్తూ ఉంటుంది.

సరళమైన భాష రచనకు రమ్యత కలిగిస్తుంది. భాషలో మృదుత్వం కావ్యానికి ఆహ్లాదం కలిగించే శక్తినిస్తుంది. శ్రావ్యమయిన శబ్దవిధానాన్ని సహృదయులు ఆదరిస్తారు. శ్రవణసుఖాన్ని అభిమానిస్తారు. వాక్కు మానవులందరికీ ఉన్న శక్తి. అయితే కవి 'ఛందో విశుద్ధిలో శబ్దసమ్మేళన గుణలుబ్ధుడు'. మహాకవి శ్రవణసుఖానికి భంగకరాలు, మృదుభావ బాధకాలు, రసభంజకాలు అయిన శబ్దాలను పరిహరిస్తాడు. మనోహరమయిన వాఙ్మయసృష్టికి మధురమైన భాష అవసరం అని రాయప్రోలువారి ఉద్దేశం.

'చెవికి తీయదు చాలదు శబ్దము-
కంటికింపగు కాంత కల్పన-
కలిసి హృద్యమును పడిసే
పాలకరింపురె కావ్యముల్.'[3]

1. 'క్షేమ ధ్వనమ్' - మిశ్రమంజరి. P32
2. మాధురీ దర్శనమ్ - P33
3. 'శ్రీరమ్యాన్' - మిశ్రమంజరి. P159

నవ్యులు కావ్యభాషగా జానుతెనుగును గౌరవిస్తారు. జనబాహుళ్యపు వ్యవహారంలోని సజీవభాషకు సాహిత్యగౌరవం కలిగించాలని నవ్యుల అభిప్రాయం. సారళ్యం, వ్యావహారిక ప్రయోగం ఉన్నభాష కావ్యభాషగా ఉండాలన్నది వీరి దృక్పథం. నవకవితకి శ్రవణ సుభగత్వమే ప్రధానం. భాషకు మాధుర్యాన్ని చేకూర్చి విన సొంపుగా ఉంటే అన్యదేశ్యాలయినా, ప్రాచీన వాఙ్మయ ప్రయోగాలయినా సంస్కృతాది శబ్దాలయినా నవ్యులు సమానంగానే స్వీకరిస్తారు. ఈ పదాల ఎన్నికలో మధురిమ అర్థగౌరవం ముఖ్యం. సరళాక్షరాల కలయికలో శబ్దానికి మృదుత్వం వస్తుంది. అది లలితమైన ఉచ్చారణలో శ్రవణసుఖాన్ని ఇస్తుంది. తెలుగుభాషకు సహజసౌందర్యంగా అబ్బిన పలుకుబడిని నవ్యులు ఆదరిస్తారు. శ్రవణసుఖానికి భంగకరాలు కానంతవరకు విసంధులను మిశ్రసమాసాలను వెలివేయనక్కర లేదని సుబ్బారావుగారి అభిప్రాయం.

'పదలలితవృత్తపద మృదుబంధమెందు
నవ్యము, రసవద్వాక్య సంధానమందు;
సంధులు విసంధులైనను, సాంస్కృతములు
దేశ్యములు లోన సమసించి, తీవెగా నవ.'[1]

కనుక సుబ్బారావుగారి దృష్టిలో చెవికి ఇంపు చేకూర్చే శబ్దజాలం ప్రధానం. "భావకవి భాషాసేవకుడు గాని భాషాద్రోహి గాదు"[2] అని, 'భాషకంటె నవ్యులకు తపస్సు లేదని అంటారు రాయప్రోలువారు. లాక్షణికుల దృష్టిలో దోషాలైన దగిన విసంధులవంటివి కూడా శ్రవణసుఖం ఉంటే వెలివేయవలసినవికావని

1. రమ్యాలోకము. P 20
2. 'అభినవాంధ్రకవిపండిత సమ్మేళనము'. ద్వితీయ సమావేశము
రాజమహేంద్రవరము : 28-12-33. అధ్యక్షోపన్యాసము.
రాయప్రోలు సుబ్బారావు. భారతి Feb 1934.

వీరి విశ్వాసం. పదాల కూర్పులో కౌశలం అవసరం.[1] ఈ శబ్దసౌష్ఠవమే కావ్యానికి శ్రుతిసుభగత్వాన్ని చేకూరుస్తుంది.

> చెవికి చక్కెరపాటయ్యై చవికి చెలిమి
> కులికెడుల మాటయ్యై చిత్తమునకు ముదిత
> ముద్దుటాటయ్యై లాలించు పొత్తుగాను ప్ర
> సన్నకావ్యమానందాభిసారిక వలె.[2]

---

1. 'శయ్య' అన నిదియే. ఏ పదము వెంబడి ఏ పదమును కూర్చిన బాగుగా నుండునో అదే శయ్య. దీనికే భామహుడు.

'మాలాకారో రచయతి యథా సాధు విజ్ఞాయ మాలాం
యోజ్యం కావ్యేష్వవహిత ధియా తద్వదేవాభిధానం.'

అని తెలిపెను. పూలమాలలు కట్టువాడు ఏ పువ్వును ఏ పువ్వుతో జోడించిన బాగుండునో అని విచారించి కట్టునట్లు కవియు ఏ పదమును ఏ పదముతో కలుపవలయునో తెలిసికొని రచింపవలయునని భామహుని అభిప్రాయము. ఈ అభిప్రాయమునే పింగళి సూరన

'పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన రీతి
రమణీయ ధారయు శబ్దములు కూర్చి'

అని తన కళాపూర్ణోదయమున తెలిపెను. పాశ్చాత్య మహాకవి Wordsworth 'The choice of the best words in the best place' అని నుడివెను.

'ఆంధ్ర సాహిత్యము - అభిరక్షిత మహోరత్నము' (వ్యాసము) M. పాండురంగారావు 'శారదా విపంచి'. వ్యాస సంపుటి. P270.

2. రమ్యాలోకము - P 11

అందువల్లనే రాయప్రోలు వారు 'మొట్టమొదట కావ్యపఠం సామాజికులకు శ్రుతిసుఖమియ్యాలి. పిమ్మట అనురాగంతో - తల్లి బిడ్డను వలె ఉపలాలించాలి. అంతేకాని, కావ్యంలోని అనురాగం మార్జార ప్రణయం లాగా కర్ణకఠోరంగా చిత్తవిక్షేపకంగా ధ్వనించరాదు. ....చల్లగా చనువు సళుపరించే రాగు వాకులో పాలకంలో విచ్చుకొనేటట్లు విరచించాలి.[1] అని అంటారు.

'స్వానుభవ భాష్యంగా వెలసే నవ్యకవిత్వానికి వస్తునియతి లేదు. ఈ సృష్టిలో కవి గ్రహింపరాని వస్తువు లేదు. కవి తన కౌశలంచేత రాళ్ళను పలికించనూ గలడు, సెలయేళ్ళలో జోల పాడించనూ గలడు.' అని రాయప్రోలు వారి నమ్మకం.

ప్రతిభావంతుడైన కవి ఏ నీరస వస్తువు నయినా రసవత్తరంగా మార్చగలడు.[2]

---

1. రూపనవనీతమ్. P 65.

2. "రమ్యం జుగుప్సితముదార మథాపి నీచం
ఉగ్రం ప్రసాది గహనం వికృతంచ వస్తు
యద్వాప్యవస్తు కవి భావక భావ్యమానం
తన్నాస్తి యన్నరస భావముపైతి లోకే." (దశరూపకం)

ఇటువంటి భావాన్నే అతిప్రాచీనకవి కాళిదాసు, అత్యాధునికకవి శ్రీశ్రీ కూడా వ్యక్తం చేసారు. కాళిదాసు 'యద్యత్ సాధున, చిత్రేస్యాత్ క్రియతే తత్తదన్యథా' అని అంటే శ్రీశ్రీ

'కుక్కపిల్లా అగ్గిపుల్లా సబ్బుబిళ్ళా
హీనంగా చూడకు దేన్నీ కవితామయమేనోయ్ అన్నీ'

అని అన్నారు. ఆంగ్లకవి Shelley కూడా ఇదేవిధంగా భావించారు.

'Poetry turns all things to loveliness. It exalts

'ప్రకృతియందు రమ్యము కాని వస్తుతతిని,
చిత్రకళలు రమ్యముగ తీర్చుదిని కాన;
క్లేద రమణీయ కల్పనాకారకమున
అపసరింత్రు మలిన జుగుప్సాదు లెపుడు."[1]

అయితే కళలు ఆనందోత్సాహాలను కలిగించటం ముఖ్యమని సుబ్బారావు గారి నిశ్చయం. కనుకనే కొందరు ప్రాచీనులు అభిప్రాయపడినట్లే జుగుప్సాయుతాలయిన వస్తువులను కవులు అధికంగా ఆదరించరని వీరు విశ్వసిస్తారు.

నవ్యకవికి ప్రత్యక్షమే ప్రమాణం. వాగ్వతులయిన కవులు వాగతీతమయి, అనుమానప్రమాణానికి సహితం అందీఅందని పరతత్త్వాన్ని[2] వదలి ప్రత్యక్షంగా కనిపించే ప్రకృతినే ప్రమాణంగా గ్రహిస్తారని సుబ్బారావుగారి అభిప్రాయం. అందులోనూ ఈ పృథ్వినే తల్లిగా, దేవతగా, భక్తితో నవ్యులు ఆశ్రయిస్తారంటారు రాయప్రోలు వారు. వీరు అనేకవిధాలుగా అనంతరూపాల్లో ఈ ప్రకృతి ధరిస్తున్న సౌందర్యాన్ని అర్చిస్తారు.

దేనిని ప్రమాణంగా స్వీకరించినా ఏ వస్తువును గ్రహించినా రసపోషకంగా రమణీయకల్పన కావించటం కవి ప్రతిభా విశేషం. రాయప్రోలు

---

(contd)

the beauty of that which is not beautiful and it adds beauty to that which is deformed."

'శారదా విపంచి'. (వ్యాససంపుటి)- P270-298

1. రమ్యాలోకము - P32

2. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని పరతత్త్వం భావింపబడింది.

వారి దృష్టిలో కరుణ, శృంగారాలు ప్రధానరసాలు.[1]

'కరుణ శృంగారములు రెండే
యితరస ప్రతిపత్తి నందెడి
ఒకటి కలుషము కడుగు; మఱొకటి
కావ్యకాయము శుద్ధికై'[2]

రసరాజంగా ప్రాచీనులలో కొందరి చేత కీర్తించబడినది శృంగారరసం. శృంగార రసానికి సంభోగ విప్రలంభ భేదాలున్నా రెండింటికీ సంభోగమే పరమావధి. నవ్యులు సంభోగశృంగారం కంటే వియోగమాధుర్యాన్నే అధికంగా అభిమానిస్తారు. క్షణికమైన సంభోగశృంగారాన్ని దంపతీనిష్ఠ ధర్మంగానే గౌరవిస్తారు. కేవలం 'ప్రజాతంతు నిర్వాహ సూత్రంగా' దాన్ని భావిస్తారు. జగన్నాథుని 'మూర్ఖాః సంభోగ మిచ్ఛంతి' అనే తత్త్వం వీరికి అభిమానం. కనుకనే నవ్యులు స్త్రీలో మోహావేశమును కాక వాత్సల్యాన్ని అమృత

---

1. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు కూడా ఇదేవిధంగా అభిప్రాయ పడ్డారు. "శృంగారము వేనిలో సృష్టి లేదు. రసములు చెప్పినవారు కూడా శృంగారమునకు ప్రథమస్థానము నిచ్చిరి. ...... శృంగార రసమును వదలి పెట్టినచో మానవజాతి నింతగా కదిలించు నింకొక భావము కలదు. దాని పేరు దుఃఖము. ఈ సృష్టి దుఃఖభూయిష్ఠమందురు.

'కావ్యానందము' - P 82, 85

2. 'శ్రీరవ్వాళ్' - మిత్రమంజరి. P162

గుణాలను గుర్తించి కీర్తించగలుగుతున్నారు.[1] అంతరంగ సౌందర్యాన్ని దర్శించి ఆరాధించగలుగుతున్నారు. కనుకనే హృదయ సౌందర్యార్చనే రాయప్రోలు వారికి అభిమానం కాని, సౌందర్యానుభవం వీరికి ఆదరణీయం కాదని అనిపిస్తుంది.[2]

రాయప్రోలు వారి దృష్టిలో కరుణారసం కూడా ప్రధానమయినదే.

'జనన వర్ధన విలయములలో
త్రిగుణముల వలె నలిగి వెనవదు
శోకమే బ్రహ్మాండ లీలా
బంధమానేమో కవీ![3]

---

1. 'కుల శుభాంగీ వయోధీర కుసుమమందు
మోహమధువె గవేషించె మునుపు సుకవి
సాత్త్విక ప్రేమ కోశపేశలము లయిన
వత్సలామృత రుచులను వలచె నేడు'
రమ్యాలోకము - P 37 (నవ్య సాహిత్య పరిషత్తు ప్రచురణ).

2. ... "సర్వరస బీజభూతమని పూర్వులచే నంగీకరింపబడిన శృంగారమందు సంభోగమును తొలగించి యట్లు తొలగించిన సాత్త్విక శృంగారమును ప్రణయమనియు, సౌందర్యమనియు (వియోగ) నామమిడి దానినే ప్రపంచము నంతటను చూచుచున్నారు. ఇట్లు ప్రపంచమునందలి ప్రతివస్తువును ప్రేమ (ప్రణయ) మయముగా చూచి తత్ప్రణయము నుద్ఘాటించుట నవ్యకవి కర్తవ్యము. దీనినే గ్రంథకర్తగారు సౌందర్యార్చనమనుచున్నారు. వీరి సిద్ధాంతమున సౌందర్యార్చనమే గాని సౌందర్యానుభవము లేదు. వీరికి మోహరహిత శృంగారమే ముఖ్య పాత్రేయము."

సాహిత్యంలో కరుణోదయకల్పనలకు శోకమే ఆలంబనం అయిందని వీరు భావిస్తారు.[1] కరుణరసప్రధాన రచనలు హృదయక్షాళన గావించగలవి. కరుణ రస ప్రధాన రచనలలో అన్నిటా శోకమే ప్రధానం అయినా హృదయావేదనలో స్వల్పభేదం రసానుభూతిలో విశిష్టతను చేకూరుస్తుంది అని రాయప్రోలువారి నమ్మకం. ప్రాచీన లాక్షణికులు లౌకికసుఖదుఃఖాలు సుఖదుఃఖాలనే కలిగిస్తున్నా కావ్యంలో దుఃఖం కూడా ఆనందాన్నే కలిగిస్తున్నదని అన్నారు. పాఠకులు కావ్యగతమైన దుఃఖవర్ణనలో రసానందాన్నే అనుభవిస్తారు.

---

(contd)

'రమ్యాలోక సమీక్ష' (వ్యాసము) - కురుగంటి సీతారామయ్య

ఆంధ్ర పత్రిక - ఉగాది సంచిక - 1939.

(contd)

3. 'శ్రీరమ్యాత్' - మిశ్రమంజరి - P162

1. .... అష్ట కష్టా
ల్వెతల బెట్టిన రాము శోకము
కావ్యమాయె మహర్షికిన్,
రతిని విధవను చేసి మాసిన
మగని ముందటు ఏడిపించెను
అజుని విధురుని చేసి యేడ్పిం
చెను మహాకవి - సత్కవీ!
పెంచి పాలించిన శకుంతల
అంపకాలపు డడరి కణ్వుడు
స్నేహధారలు చిందగా విల
పించె యక్షుడు విరహతన్

'శ్రీరమ్యాత్' - మిశ్రమంజరి - P162-163

రాయప్రోలు వారి దృష్టిలో కావ్యం హ్లాదైక ప్రధానం. అమంగళం పలకడం వీరి అభిమతం కాదు. సృష్టి మంగళప్రదమైనదని రాయప్రోలు వారి నమ్మిక. "హ్లాదైక మయమైన కావ్యము వలన ఆర్జింపదగిన పరమప్రయోజనము ఆనందము. ఆ ఆనందోపాసన కావించువాడే భావకవి."[1] బాధా పరితప్త హృదయాల మీద కావ్యపీయూషం తొలకరిలాగా వర్షించాలి. మనోరంజకత్వం కావ్యరచనకు ప్రధానం. ప్రాణి జన్మ వర్ధనాస్తమయాలలో అన్వయసూత్రం ఆనందమే. ఈ ప్రకృతి అనంతరూపాల్లో ఆ ఆనందాన్నే ధరిస్తుంది. కనుక ఆ ఆనందాన్నే కావ్యాలు ప్రధానం చేసుకోవాలన్న ఆకాంక్ష రాయప్రోలు వారిది.

'భగవల్లీలా భాగ్యరూపము గు
ఈ విశ్వంబున జీవులకెల్లా
ఆనందంబే అమృత సూత్రమని
ప్రాచేతసు డుపపాదించెన్.'[2]

'సౌందర్యమన్నను, రసమన్నను, ఆనందమన్నను మనకు ఏకార్థవాచ్యములే. మీరు ఆనందగీతములనే పాడుడు. ఆనందసూత్రములనే అల్లుడు. ఆనందమూర్తినే చిత్రింపుడు,'[3] అంటూ ప్రబోధిస్తారు రాయప్రోలువారు. సాహిత్యం మంగళప్రదమైనదిగా ఉండడం రాయప్రోలువారి అభిమతం. "కవులు మంగళమిత్రులు, మార్గోపదేశకులు, లోకానికి మంగళం కావలెనే."[4] "ప్రియుడు చెప్పిన

---

1,3 'అభినవాంధ్ర కవి పండిత సమ్మేళనము - రాజమహేంద్రవరము
అధ్యక్షోపన్యాసము - రాయప్రోలు సుబ్బారావు
భారతి - 1934 February.

2. 'కావ్యావతారము'- వనమాల P43

4. 'రూపనవనీతము' P 121

ప్రియురాలిలో, ప్రియురాలు పోయిన ప్రియునిలో పెనబడే అనిష్టగాథలలో రాజుల రణదాహం రక్తధారలలో తనిపే మారణసంఘటనలలో, ఘాతా ఘర్షణా, ద్వేషం, ద్రోహం, హింసా, హత్యాస్ అవిభాజ్యంగా పురువెకిలి, ముడిబడి సామాజికులు నిర్ఘాంతపొయ్యే బీభత్స సన్నివేశాలలో రూపకల్పనకు తగిన ఇష్టార్థం ఇముడదు.... జీవితం కేవలం రాక్షసాంశ కాదు.... మానవత్వంలో సౌకుమార్య సౌభాగ్యాలున్నవి. అవి ప్రసన్నంగా పరిణతములు కావాలె. చిత్త ప్రసాదనం పొందాలె. ఆ ప్రయోజనం రూపకముఖంగా జరుగుతుంది. చాక్షుష క్రతువు వలన జనులలోని జంతుత్వము శమించుతుంది. జనులు సుజనులై సుసంస్కృతులై సుధారణాపరులై సమాజమును వినయవిరాజనం చేయాలె. అదే సాహితీ లక్ష్యం..... చల్లని కల్పనలకే కళలు ఉపకరిస్తవి. కోయి కూతకే వేలు పూచిపే పోట్లకాదె పులకించి నిలబడుతుంది. తప్పెటలు వాయిస్తే మీదబడి వ్రాకుతుంది.'[1] ఇటువంటి ఉద్దేశాలు కలవారు కనుకనే నేమో వీరి ప్రబంధరచనలలో శుభాన్ని ఆకాంక్షించడం, ఆశావత్త్వం, ఉత్సాహం నిండి ఉంటాయి. 'ఈయన చేసిన ప్రబంధంలోనూ మిగతావారి దానిలోనూ చాలా గొప్ప భేదముంది. ఈయన ప్రబంధంలో అంతటా ఉత్సాహ ప్రవాహమే కాని దుఃఖం వెతికినా అగపడదు'.[2] కవిత్వం పట్ల ఈ విధమైన నిర్దిష్ట భావాలతో భావకవిత్వోద్యమానికి మార్గదర్శకులై నిలిచారు రాయప్రోలు సుబ్బారావుగారు.

---

1. రూపనవనీతమ్ - P 121, P 68
2. 'రమ్యాలోక సమీక్ష' (వ్యాసము) కురుగంటి సీతారామయ్య
   ఆంధ్రపత్రిక - ఉగాది సంచిక. 1939.

# సామాజిక దృక్పథం

# 5

# రాయప్రోలు వారి సామాజిక దృక్పథం

'ఏ నూతనసృష్టిని అలవరచుకుంటే సంఘానికి భావిలో ఎటువంటి ఉత్తమగతి కలుగుతుందో దానిని కవి సూచిస్తాడు. దీనినే, షెల్లీ 'కవులు ప్రపంచంలో నేటిని ప్రచ్ఛన్నంగా తీర్చిదిద్దే శాసనాధికారులు' అన్నాడు. కాని ఎంత ఉత్తమకవికైనా భవిష్యత్తు ఎంత ప్రధానమైనా.... భూతవర్తమానాలతో బాంధవ్యం ఉండకపోదు.

భూతకాలం కూర్చిన మహత్తరతనంతా అతను స్వాయత్తం చేసుకుంటాడు. భవిష్యత్తులోని ఉత్తమమార్గాన సంఘాన్ని నడిపించడం తన నిరంతర లక్ష్యంగా ఎంచుకుంటాడు.... ఈ కారణంచేతను ఏకవిరచనలోనైనాసరే తన సంఘపరిస్థితులూ తనకాలానికి చెందిన వాతావరణమూ ప్రతిబింబితం కాకమానవు. తన జీవితానికీ, తన సంఘానికి తనదేశానికీ తాను జీవించినకాలానికీ సన్నిహితంకాని కృతికి విలువలేదు.'[1]

రాయప్రోలు సుబ్బారావుగారు సమాజంలోని సమస్యలను అవగాహన చేసుకుని సామాజిక జీవనతత్త్వాన్వేషణ చేశారు. వీరి కావ్యాలను పరిశీలించినపుడు సమకాలీన సాంఘిక సమస్యలు, పరిస్థితులు దర్శనమిస్తాయి.

ఆనాటి రాజకీయ పరిస్థితుల ప్రేరణలో ప్రబోధగీతాల నెన్నిటినో రచించి సమకాలికులలో నూతనోత్తేజాన్ని కలిగించిన రాయప్రోలు వారి కావ్యాలలో కొన్ని సందర్భాలలో నాటి రాజకీయ పరిస్థితులు సూచింపబడ్డాయి. తెలుగుదేశప్రకృతిని ప్రముఖంగా దర్శింపజేస్తూనే వ్యంగ్యంగా ప్రబోధాన్ని కూడా ఇముడ్చుకున్న కావ్యం 'తెనుగు తోట'. ధ్వనిప్రాయంగా ఆంగ్లేయుల పాలనలో ఉన్న భారతదేశాన్ని సూచిస్తూ దేశరక్షణ కర్తవ్యప్రబోధం దీనిలో

---

1. వైతాళికులు - పీఠిక ముద్దుకృష్ణ P 3 & 4

కనబడుతుంది.

"ధాన్యకంకులు పండిన సొగసు చేల
ఎక్కడెక్కడి నుండియో చక్కవచ్చి
వ్రాలుచున్నవి పిట్టలు వేలువేలు; ...
చంపకము చెట్టు కాని పూవు చదురవరుల
తేనె పంచుక పోయెదరు మానవరుల....
కంచెదీసి త్రోవలు సేయు వంచకులను
తెలియగా లేరు తోటనేవలన గాచు...
పరులు సారకుండ కంచె కాపాడవలయు."[1]

ఇటువంటి సందర్భాలలో తెలుగుతోట సహజసౌందర్యవర్ణనే కాక పరాయిదేశస్థులు భారతదేశసిరిసంపదలను హస్తగతం చేసుకుంటున్నారన్న ధ్వని కూడా వ్యక్తం అవుతుంది. 'స్నేహలత'లో

"పంక నిర్మగ్న కంఠమా పాడియావు
పసిడి నున్నది ఋషులున్న భరతభూమి."[2]

అన్నప్పుడు కూడా అన్యాక్రాంతమైన స్వదేశాన్ని గుర్తు చేయడం కనబడుతుంది.

---

1. తెలుగుతోట - 5, 6, 7 ఖండాలు (అభినవకవిత) P322, 323, 324
2. 'భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి' అన్న చిలకమర్తి లక్ష్మీనరసింహం
గారి పద్యచ్ఛాయ కొంత దీనిలో కనబడుతుంది.
'స్నేహలత' - అభినవకవిత P292.

'మాతృదేశాభిమాన ప్రమాణబుద్ధి
చేకాని విదేశవస్తువుల్ వాకమనుచు
భరతపుత్రకు లెందఱెందఱో వ్రతంబు
బూనినారు'...![1]

అనే సందర్భంలో విదేశవస్తు బహిష్కరణోద్యమ ప్రస్తావన కనబడుతుంది.

బాల్యవివాహాలు, వితంతు వివాహాలు, కన్యాశుల్కాలు, వరకట్నాలు, కులమతాలవంటి సాంఘిక కట్టుబాట్ల విషయంలో విశాల దృక్పథం ప్రజలకు ఏర్పడాలని సంఘసంస్కర్తలు కృషిచేస్తున్న కాలంలోని కవిగా రాయప్రోలువారి రచనల్లో కొన్ని సామాజిక సమస్యలు ప్రతిఫలించాయి. ఈ సమస్యల ప్రస్తావనలో వీరి సంస్కార హృదయం, విశాలదృష్టి, అభ్యుదయ భావాలు కనబడతాయి.

రాయప్రోలువారు సనాతన సంప్రదాయాభిమానులయినా ఛాందసులు కారు. గతకాలపు ప్రాభవాలను స్తుతించినా వర్తమాన సమాజంలోని లోటుపాట్లను గుర్తించక పోలేదు. మారుతున్న సంఘవ్యవస్థను సహృదయదృష్టితో అవగాహన చేసుకున్న వ్యక్తిగా దర్శనమిస్తారు. దేశకాలపరిస్థితులబట్టి సమాజంలో మార్పులు సహజం, అవసరం అనే దృష్టి వీరికున్నట్లు తోస్తుంది. సంఘశ్రేయస్సును కాంక్షించి సంతులితత్వం పాటించడం మంచిదన్న అభిప్రాయం వీరి రచనల్లో ధ్వనిస్తుంది. మూఢవిశ్వాసంతో కొన్ని సాంఘికమైన అలవాట్లు, ఆచారాలు దురాచారాలుగా మారాయనే దృష్టి వీరిలో కనబడుతుంది.

ఇటువంటి ఒక ఆచారం కారణంగా ఒక అబల భవిష్యత్ సౌభాగ్యాన్ని కోల్పోయిందన్న బాధ వీరి 'స్నేహలత' రచనలో

---

1. 'స్నేహలత'- అభినవకవిత P305

వ్యక్తం అవుతుంది. స్నేహలత జీవితంలోని దుర్ఘటన వీరిని కదల్చివేసింది. ఒక స్త్రీ కన్నీటిగాథలోని కష్టానికి వీరి హృదయం పొందిన స్పందన స్నేహలతలో స్పష్టం అవుతుంది.

ఈ రచనలో వరకట్నం దురాచారం అనే అభిప్రాయాన్ని స్నేహలత పాత్ర ద్వారా సూచించారు.

'భరతజనయిత్రి సుకృత తపఃఫలమ్ము
లన నుదయమైన యువజను లకటకట!
అర్థము పురుషార్థ మనక కన్యల వరింప
శుల్కముల కువ్విళుల నూలు శూరులయిరె!'[1]

అని స్నేహలత విచారిస్తుంది. వేదాలు పుట్టిన పవిత్ర భూమిలో కన్యాత్వం అక్రమమయిన శుల్కం పాలబడ్డే దురవస్థ ప్రాప్తించిందని దుఃఖిస్తుంది. తల్లిబిడ్డల విడిపోయి తల్లడిల్లుతున్న ఆర్తుల సహాయానికి కృషిచేసే హృదిలో, మాతృదేశాభిమానంలో విదేశవస్తువులను బహిష్కరించే భరతపుత్రుల్లో స్వార్థత్యాగమే ప్రజ్వరిల్లుతోందని, ఆ విధంగా విశాలహృదయులు స్వార్థరహితంగా ప్రవర్తిస్తున్న సమయంలో 'హేయమయిన కన్యకా వరశుల్క రాక్షస కళంకమును' అపహసించుకునేవారు లేరా అని సందేహిస్తుంది. 'కన్నియను పెండ్లియాడుచో కన్నెతండ్రి యర్థకాము జేయు శుల్కదివ్యాప్సరసను పెండ్లియాడుచో .... యీ పెండ్లికొడుకు?' అని ప్రశ్నిస్తుంది. రాయప్రోలు వారి స్నేహలతలోని ఇటువంటి సందర్భాలు వరకట్నం అర్థపురుషార్థం అన్న అభిప్రాయాన్ని బలపరుస్తాయి. ఇటువంటి ఆచారాలు తొలగి సమాజంలో మార్పురావాలన్న భావాన్ని

---

1. 'స్నేహలత' - అభినవ కవిత - 298

చూపిస్తాయి.

'అర్థము కులం కళంకము నంటకుండ
నా పవిత్ర దీక్షా కన్యకా పక్షంబు
రక్షణము చేసినట్టి యా దక్షిణాగ్ని
కులమతాచారములు కాల్చి వెలుగుగాక!'[1]

అని అంటూ 'కులమతాచారములు' తొలగిపోవాలని ఆశిస్తుంది స్నేహలత. ఈ విధంగా ఈ కావ్యం సామాజిక వ్యవస్థకు సంబంధించిన వరకట్నం వంటి అలవాట్లు మార్చుకోవడం అవసరమన్న భావాన్ని సూచిస్తుంది.

కులమతాలను గూర్చిన వీరి అభిప్రాయాలలో కొంత విశాలదృష్టి కనబడుతుంది. "రాయప్రోలు వారి దృష్టి గతానికే అంకితమైపోయి వర్తమానానికి అందకుండా పోవడం కంటె పొరపాటు లేదు.... ఇతరులు కాంక్షించిన రాష్ట్రాభిమానం క్రమశః కులాభిమానంగా పరిణమించింది. కష్టజీవుల కష్టమును చూచి చూచినదానిని మరుగుచేయక చెప్పే నిజాయితీ యీయన కున్నది."[2]

ఏ కులమయినా ఏ మతమయినా విద్వేషాన్ని పెంచుకోక సాటి కులాలను మతాలను గౌరవించడం మంచిదని రాయప్రోలు వారి అభిప్రాయం. ఇది సామాజిక శాంతి సౌభాగ్యాలకి, సాంఘిక సహజీవనానికి తోడ్పడుతుంది. అటువంటి ఉదార హృదయపరివర్తననే వీరాకాంక్షిస్తారు. ఆ విశాలదృక్పథాన్ని

---

1. స్నేహలత - అభినవ కవిత - P308
2. ఆంధ్ర రాష్ట్రోద్యమ దర్పణం - రాయప్రోలు జాతీయ కవిత.
(వ్యాసము) K.V. రమణారెడ్డి
'అభ్యుదయ' - ఆగస్టు 1957 - P32 to 34.

పెంపొందించుకొమ్మని ప్రబోధిస్తారు.

ద్వైతాన్ని చేరడానికి సహాయపడేది మతం. ఏ మతం వారయినా మానవత్వాన్ని కోల్పోవడం హర్షింపదగ్గది కాదు. అన్ని మతాలూ ప్రజాభ్యుదయాన్నే ఆకాంక్షిస్తాయి. మతం మానవుని ఉన్నతమైన మనుగడకు మార్గదర్శకం కావాలి. అంతేగాని అది ఉన్మాదంగా మారడం పరమత దూషణ, తిరస్కారాలు చోటు చేసుకోవడం శ్రేయస్కరం కాదు. సాంఘిక దురాచారాలను సమర్థించుకోవడానికి మతాన్ని ఆధారం చేసుకోకూడదు. భగవంతుడు మానవునకిచ్చిన ఆయుష్షు పరిమితం. అందులో సగం నిద్దురలోనే గడిచిపోతుంది. అమూల్యమైన మిగిలిన కాలంలో అనవసరమైన వివాదాలలో ద్వేషాన్నెందుకు పెంచుకోవాలనేది రాయప్రోలు వారి ప్రశ్న. మానవత విశ్వజనీనం.

'ఏ పరమార్థము నీ మానవులకు
ప్రాప్యం బయ్యెను బ్రహ్మర్షులు మును
దారుణ తపముల దర్శించిరో ఆ
యుగాది తారణ నాదవేనా?

నిలువున దేహము నెత్తుటి జొత్తిల
సిలువ మీద బడె జేసు తానే
ప్రేమరాజ్యమును భూమి నిలుప నా
యుగాది తారణ నాదవేనా?

ఏకేశ్వరమతి లోకము నతికె
ప్రజాపహారక బంధము పెంచగ
భగవన్నామము ప్రవచించిన ఆ
యుగాది తారణ నాదవేనా?'[1]

---

1. 'తారణ' - వనమాల - P 13, 14.

దారుణమయిన తపస్సులలో బ్రహ్మర్షులు పరతత్త్వాన్వేషణకు మానవులకు మార్గాన్ని చూపించారు. ఈ పరమార్థం ఎప్పటికయినా మానవులకు ప్రాప్తం కావాలనేది రాయప్రోలు వారి అభిమతం. తాను దారుణస్థితిలో శిలువవేసిన మృత్యుముఖంలో ఉండికూడా భూమిమీద ప్రేమరాజ్యం స్థిరపడాలని కోరుకున్న మహనీయుడు జీసస్. ఆ ప్రేమరాజ్యం నెలకొనే యుగానికి ఆది అనేది రావాలని రాయప్రోలు వారి ఆకాంక్ష. సర్వమానవ సౌభ్రాత్రం పెంపొందే ఏకేశ్వర భావం లోకంలో వ్యాపించాలని కాంక్షించినవారు మహాపురుషుడు. మతాలు వేరైనా భగవంతుడు ఒకడే అనే విశ్వాసం వృద్ధిపొందిన యుగానికి ఆరంభం జరగాలనేది రాయప్రోలు వారి ఆశంస. ఈ విధంగా అన్నిమతాలకు మానవాభ్యుదయమే ధ్యేయమనే రాయప్రోలు వారు ఇక్కడ సూచించారు. చిత్తశుద్ధిలో మానవకల్యాణానికి తోడ్పడం ఏమతం వారికయినా అభిమతం కావాలి. ఏమతాన్ని అనుసరించినా తోటిమానవులను నిష్కల్మషంగా ప్రేమించడం ప్రధానం. ఒక మతం అధికం అని భావించి వేరొక మతాన్ని ద్వేషించడం మానవత్వం కాదు. మతద్వేషం మానవుడిలోని కనీసపు జాలి, దయలను కూడా నశింప చేస్తుంది.

'ఊరి నలుప్రక్కలందును నుదయవేళ
కదలి చీమల పుట్టల వెదకి వెదకి
మంచి బియ్యము చల్లు సంసారులకట
మారినారు మతద్వేష మలినమంటి!'[1]

ఆ మాలిన్యమయిన మతద్వేషం కారుచిచ్చులాగా వ్యాపించి మానవులలోని మానవత్వాన్ని మంటకలుపుతుంది. కుత్సితం మాత్సర్యం పెచ్చుపెరుగుతుంది.

---

1. 'బుద్ధదీక్ష' - ఆంధ్రావళి. P 63

జాతి ప్రగతిని దహింప చేస్తుంది.

'కుత్సితంబా మత్సరంబా
అంకురముగా అల్లుకొనె పగ
దాటివరె; సుడిగాలి కెపుడా
మండె హృదయము కాల్చదే!'[1]

రాజకీయపు కుట్రలు, మతాంతర మాత్సర్యాలు విశ్వమానవప్రేమను క్షీణింప చేస్తాయి. ఏ మతావలంబకులయినా పరమత సహనంతో ఇతర మానవుల పట్ల ప్రేమాదరాలను పెంపొందించు కోవాలనేది రాయప్రోలు వారి ఆశయం.

'రాష్ట్ర రాష్ట్ర దురాక్రమణాలన్
మత మతాంతర మత్సరములన్
ప్రేమమయమగు విశ్వమానవ
గర్భమే గాయాలు పడెన్'[2]

ఇక కులాన్ని గురించి ఆలోచిస్తే అతి ప్రాచీనకాలం నుంచి చాతుర్వర్ణ్య వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తోంది. వృత్తి ప్రాధాన్యాన్ని బట్టి ఈ విభాగం ఏర్పడి ఉంటుందనే భావానికి ఆధునిక కాలంలో ప్రచారం హెచ్చింది. ఆధునికకాలంలో కులపు గోడలు మానవత్వానికి అడ్డుగోడలై నిలిచాయి. స్పర్థలు చోటుచేసుకున్నాయి. అస్పృశ్యత సాంఘిక దురాచారంగా పరిణమించింది. మనుష్యుల మధ్య అసమానత చోటుచేసుకుంది. అసమానత అసహనానికి దారి తీసింది. అసహనం, అసంతృప్తి వర్ణాధిక్యాన్ని నిరాకరించేలా చేశాయి. క్రమ క్రమంగా నైతిక ప్రమాణాలు దిగజారాయి. దీనివల్ల ప్రజలలో కసి, ద్వేషం

---

1. 'ఫాల్గుణి' - మిశ్రమంజరి - P 94
2. 'భద్రయాత్ర' - మిశ్రమంజరి - P 24

పెరిగి జాతి ఐక్యత భంగపడే అవకాశం కనబడింది.

'జాతి విద్వేషాలు జ్వలియించి వెలుగ
కచ్చెకు లొత్తులై కలిసేరు జనులు'.[1]

జాతి విద్వేషాలు, కులమత కలహాలు సమాజశ్రేయస్సుకు భంగకరాలు. వాటిని ఆదిలోనే అణచివేయాలి. రాయప్రోలువారు కులవ్యవస్థను గూర్చి చర్చించరు గాని కులమతద్వేషాలు మాత్రం కూడదని ప్రబోధిస్తారు. సమాజప్రగతికి ప్రతిబంధకమయి మానవత్వాన్ని మంటకలిపే కులమత భేదాలు 'సంఘకాయాన్ని' దహిస్తాయని సుబ్బారావుగారి దృఢాభిప్రాయం.

'కుల విభేదము - మతవిరోధము
పాటమరించెను స్ఫోటకము వలె'.[2]
'కుల విద్వేషము కుష్ఠరోగమయి
ప్రాకున్ సంఘకాయంబు'.[3]

అంటూ కులద్వేషాన్ని తీవ్రంగా ఖండించారు రాయప్రోలువారు. ఏ కులం అన్న ప్రశ్నమాని అందరూ ఏకమై నడవాలనుడే వీరి ఆశయం. ఏ దేశమయినా ప్రగతి పథంలో పయనించాలంటే ప్రజలంతా కలసికట్టుగా ఒకటై నడవాలి. చరిత్ర చెప్పే సత్యం ఇదే. ప్రత్యేకాంధ్రరాష్ట్ర అవతరణ ఉద్యమ సందర్భంలో గతచరిత్రను గుర్తుకు తెస్తూ ఈ విషయాన్నే ప్రబోధించారు సుబ్బారావుగారు.

"పూజింపరే రెడ్డిరాజుల వీరత్వం
గాక వీరమ్ములు కానగ లెచ్చు

---

1. 'ఏమేమె పాడేవు' - వనమాల - P27
2. 'ఫాల్గుణి' - మిశ్రమంజరి - P96
3. 'పాపమ్' - మిశ్రమంజరి - P105

సేవింపరే కమ్మసేనాపతులు శత్రు
రక్త కుంకుమల నరుణ మొసంగి
తెలయింపరే వెల్మవీరులు బొబ్బిలి
బద్ధులై పరసేన గొట్టువారవ
అర్పింపరే బ్రాహ్మణాచార్య బుద్ధయు భా
షా వ్యవసాయ సస్యమ్ము వెత్తి
ఈ మహాంధ్రదేశ భగవతీమ తల్లి
నాటి నుండి సామ్రాజ్య సమాప్తి దాక;
కులము దరివెరె పొలిమేర గోలబడిరె?
బోయవరె తల్లి పల్లకీ మోయు మాంధ్ర![1]

రెడ్డి, కమ్మ, వెలమ, బ్రాహ్మణ అనే భేదాలు మరిచి మాతృదేశాభ్యుదయానికి పాటుపడాలనడి రాయప్రోలు వారి ప్రబోధం. దీనిలో కులభేదాలు మరిచి ఐకమత్యం పెంచుకోవాలన్న ఆకాంక్ష కూడా ఉంది.

ఈ కులవ్యవస్థలో వచ్చిన సాంఘిక దురాచారం అస్పృశ్యత. దానిని రూపుమాపటం మానవత్వం. అంటరానితనం హేయమయిన ఆచారం. కొన్ని కులాల వారిని హీనస్థితిలో ఉంచడం హృదయకాఠిన్యానికి చిహ్నం అనే విధమైన సానుభూతి వీరిలో వ్యక్తం అయింది.

'అల్లలేక యదార్థగతి యందు గ్రుంగి
జాతి మాలిన నిమ్నసంజాత మెల్ల
లోకరాదని విడిచిరి దైన్యమునకు..[2]

---

1. 'ఆంధ్ర'- ఆంధ్రావళి- P32
2. 'తెనుగులోటు'- అభినవకవిత. P331.

సాంఘిక దోషాలను పరిదిద్దడం, మానవత్వపు విలువలకై పోరాడడం విద్వాంసంతుల ధర్మం. కులవిభేదాల్లోంచి పుట్టిపెరిగిన ఈ సాంఘిక దురన్యాయం విషయంలో సుబ్బారావుగారు తమ విశాలదృక్పథాన్ని ప్రదర్శించారు. అస్పృశ్యులను వెలిగా చూడనవసరంలేదనే సంస్కార భావాన్ని కనబరచారు. సృష్టిలో ఎక్కడ చూసినా ప్రేమే కనబడుతుంది. భగవద్దత్తమయిన జ్ఞానం మానవునికుంది. జ్ఞానాభివృద్ధిలో మానవులు సృష్టి సర్వత్రా నిండి ఉన్న ప్రేమను సుస్థిరం చేయాలిగాని పగను రగల్చకూడదు. గాలి ప్రసరించినంత సహజంగా స్వపరభేదరహితంగా ప్రేమ వ్యాపించాలి.

'ప్రేమవృత్తికి చందాల భేదములు
బ్రాహ్మణాగ్రహారము నందు పవలు రేలు
విసరు పవనుడు కడజాతి వీథి యందు
లాకలేక వీచునె పక్షతంత్ర జడిమ?'[1]

మానవుల మధ్య ప్రేమాదరాలకు కులభేదం అనవసరం అన్న అభిప్రాయం ఇక్కడ వ్యక్తం అవుతుంది. అంటువ్యాధి వలె వ్యాపించే విద్వేషాలు విడిచి 'జనసమాజ జీవిత పయస్క్షారమైన మందు హింస'ను పరిమార్చడం మంచిదని రాయప్రోలు వారి సూచన. అటువంటి ఉదారత ప్రజలలో కలిగినపుడే సమాజం అభ్యుదయం పొందగలుగుతుంది. మానవసమాజంలోని మంచిచెడ్డలకు, జాతి అభ్యుదయానికి ప్రజలు సహృదయతతో వ్యవహరించడం అవసరం అంటూ అభ్యుదయ భావాలను కనబరిచారు.

సంఘశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సమాజపురోగమనాన్ని అవరోధించే దుష్టశక్తుల నిర్మూలనావశ్యకతాన్ని అక్కడక్కడా సూచించారు

---

1. తెనుగుతోట - అభినవకవిత P332

రాయప్రోలు వారు. అధికార వ్యామోహం, ధనదాహం, హింసాప్రవృత్తి సమరకాంక్ష వంటివి ప్రగతికి ఆటంకాలని గుర్తుచేశారు.

"బంగారు పాతళ్ళ ప్రాణాలు విడిచే మ
హా కుబేరుల కాంక్ష దాక దీరబోదవలె
పేద చీకటి బజార్ల ధనము రాసులు చేయు
వర్తకుల నడతలో వంకరలు తీరవలె
లంచాల ప్రాగి కల్మషమ్మైన అధికార్ల
ముసుగు బొంకల బాళ్ళు మొదలంట కదలవలె
పుట్టింటికే నిప్పుపెట్టుగ రాక్షసుల
ఇనుపగుండెల తిత్తు చిరిగించి విరియవలె
కూటికై అల్లాడి గుడ్డకై అల్లాడు
జనఘోష పొగబాటి - సమగారగిరి ప్ర
చండమై మండితే చల్లార్పగా రాదు
కాదోయి ఇది భోగ వాదాల కాలంబు."[1]

అని అంటూ బంగారానికై ప్రాణాలు విడిచే ధనవంతుల కాంక్ష, చీకటి బజార్లలో ధనరాసులు పోగుచేసే వర్తకుల ప్రవర్తన, అధికార్లలో లంచగొండి తనం, దేశభక్తిని కోల్పోయి స్వదేశవినాశానికి దోహదం చేసే రాక్షస స్వభావం మారాలని, అప్పుడే సమాజం ప్రగతిపథంలో పయనిస్తుందని సూచించారు. కూటికి గుడ్డకు వాపోయే జనఘోష నాగరిక సమాజాభ్యుదయానికి ఆటంకం అని అది రగిలి రగిలి ప్రచండమై మండితే దాన్ని చల్లార్చడం సాధ్యం కాదని అంటారు రాయప్రోలు

---

1. 'ఆంధ్రనవమి' - మిత్రమంజరి. P 13

నారు.

'మూడు మూలలమేయు పాడి యావుల పాలు
ఏక భాండము నందు పాకమై పొంగాలె.'[1]

అని ఆంధ్రదేశ సమైక్య భావాన్ని ప్రకటించారు. తెలంగాణా, కోస్తా, రాయలసీమ ప్రాంతాలు మూడూ మూడు విభాగాలుగా విశిష్టమయినవని, ఆ మూడు ప్రాంతాల ప్రజలు కలిసి మెలిసి ఏకం కావాలన్న ఆకాంక్ష వెలిబుచ్చారు.

ధాన్యాన్ని దాచిపెట్టి, ధనాన్ని పాతిపెట్టి, లోకాన్ని వ్యాకుల పరిచే విధ్వంసకమైన హింసామార్గం మారాలన్నది వీరి అభిప్రాయం. భూతకాల కడవేరి ప్రజలంతా సుఖపడాలని వీరి ఆకాంక్ష. కనుకనే

'కాకే కడుపుకు గరిటెడు గంజీ
దాకే సిగ్గుకు మూరెడు పాతా
ఎల్లరకుందే చల్లని రోజులు
వెలసే విశ్వము వెదకకండే.'[2]

'కరువులు కాలా కన్నులు కుట్టా
పాతిన ధాన్యము దాచిన విత్తము
ప్రజలకు పంచే పనులకు పెట్టే
ఇరుగు పొరుగులను అరసికొనండే.'[3]

అని నిర్మల హృదయంతో సమాజశ్రేయస్సును ఆశించారు. పాలకుండ వంటి సమాజప్రగతిని విషపూరితం చేసే పద్ధతి మారే రోజులు రావాలని

1. 'ఆంధ్రనవమి' - మిత్రమంజరి. P12
2. 'ఆరకా' - వనమాల - P13
3. 'సర్వజిత్' - వనమాల - P80

వీరి కోరిక.

వంటయింటిలో మగ్గిపోయే స్త్రీలకు, రాత్రింబవళ్ళు రాయకష్టంలో 'క్షేత్రసేవ' చేసే రైతులకూ, బ్రతికినంతకాలం శరీరశ్రమలో గడిపే కష్టజీవులకు అంటరానివారిగా పరిగణింపబడే దురదృష్టవంతులకందరికీ పుస్తకజ్ఞానం కలిగి, కనీసం 'నా ప్రజలు, నా దేశం' అనేమాత్రం అయినా జ్ఞానం కలగాలని ఆశించారు.[1]

కలతలలో, కక్షలలో, కష్టాలపాలైన లోకాలన్నీ ప్రేమలో ఏకమయి సుఖించాలని వాంఛిస్తూ

'విరియునే జాతుల విద్వేష తమమెల్ల
అణగునే దేశాల అర్థదాహమెకింత
మాతృదేశం బిచ్చు మధురాన్నపానాల
స్వేచ్ఛగా సుఖయింతురే యెల్లప్రజలు
ఆ యనంతుని లీలలనుభవింపుచును!'[2]

అని సంశయాత్మకంగా ప్రశ్నించినా ఆ కాలం వస్తుందనే ఆశ వీరిలో ఉంది. నిష్కల్మషంగా, నిస్వార్థంగా సమాజాభ్యుదయాన్ని వాంఛించిన సుబ్బారావు గారు ఆ చల్లని రోజులు వస్తాయని, చక్కని సమాజం నెలకొంటుందని విశ్వసించారు. దానికి మనోబలమూ, ఉత్సాహమూ పెంచుకోవాలని మార్గాన్ని సూచించారు. మంచి మంచిని పెంచుతుందనీ, ఈనాటి దుఃఖం రేపటి సుఖానికి కారణం అవుతుందనే నమ్మకంతో

'గతము రానాగతము తెలియదు
నేటి దుఃఖమునె మనకగున్!'[3]

---

1. 'పుస్తకము' - ఆంధ్రావళి. P23
2. 'శ్రీ రవీంద్రకవి' - ఆంధ్రావళి P45
3. 'సంక్రాంతిసంబరము' - మిత్రమంజరి. P66.

అని అంటారు రాయప్రోలు వారు.

ఎన్ని ఉత్పాతాలు వచ్చినా, ఈతి బాధలు కలిగినా భవిష్యత్తును ఆశాజనకంగా ఊహిస్తూ మానవుడు ముందుకు సాగుతాడని నమ్మారు రాయప్రోలు వారు. పరిస్థితులు ఎదురయినా ఉత్సాహాన్ని వీడక హృదయానందాన్ని పెంచుకునే ప్రయత్నం చేయాలనేది వారి ప్రబోధం. గతాన్నే చింతిస్తూ భవిష్యత్తుపై నిరాశ వహించడం పురోగమనానికి ఆటంకం అవుతుందనీ, పూర్వకాలంలోని మహోన్నతి క్షీణించిందని బాధపడుతూ నిరాశ నిస్పృహ చెందనవసరం లేదని వారి అభిప్రాయం.

"ఉత్సాహప్రభు మంత్ర శక్తుల నొకం డౌ కల్గుండె బాలున్ క్రియా
సత్వం సిద్ధికి, మంత్రమే గను తపోజ్వాలాస్త్ర మానావళిన్
ఉత్పన్నప్రభుశక్తి త్రమ్ములు క్షాత్రోపాస్తి రేమిన్ కలన్
ఉత్సాహం బొకటే నరత్వ మిక నాల్గోల్పు ప్రాపన ప్రాప్తికిన్
ధనధాన్యస్థితి పన్నుగిల్లినను విద్యాజ్ఞానదీపంబు లా
రిన, మర్యాదలు మాసినన్ ప్రబల దారిద్ర్యంబు పాటిల్లినన్
జన సమ్మేళన సళ్ళినన్, పగలు దంష్ట్రల్ విప్పినన్ గాని యెం
దు నిరుత్సాహపడుండు గావ నరుడందున్ తప్పు నర్థోదయమున్."[1]

ఈ సందర్భంలో కార్యదీక్షకు సఫలతకు ఉత్సాహం అవసరం అనీ, నిరుత్సాహం పొందక ముందుకు సాగినపుడు గతవైభవాన్ని తిరిగి పొందుతారనే దృఢవిశ్వాసాన్ని వ్యక్తం చేశారు సుబ్బారావుగారు. మనోబలంతో ప్రగతిపథంలో పయనిస్తే అభ్యుదయప్రాప్తికి అవకాశం ఉందనే నమ్మకం గల వ్యక్తి రాయప్రోలు వారు.

---

1. 'ఉగాది నివేదన' - వనమాల - P 15, 16.

మానవజీవితంలో అత్యంత సహజాలయిన కష్టసుఖాల విషయంలో కూడా వీరి దృష్టి ఇంతే. కష్టసుఖాలు వెలుగు చీకట్లు లాగా ఒకటి వెనుక ఒకటి వచ్చిపోతూ ఉంటాయని కష్టకాలంలో నిరాశ చెందకూడదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

"సుఖంబు కష్టమున్, వెన్నెల చీకటున్ బలెనె వీడక ఒకటొకటి వెనట

నాకట్టి

క్రమమున వచ్చుచుండును నిరాశ వహింతురె ఇంత మాత్రమునన్."[1]

రాయప్రోలు వారు వర్తమానం కంటె మంచి రోజులు భవిష్యత్తులో రాగలవన్న ఆశలో నిరాశ, నిస్పృహ, నిరుత్సాహాలను దూరం చేసుకుని ముందుకు సాగిన వారు జాతి అభ్యుదయాన్ని పొందగలదన్న ఆశా తత్త్వం కలవారు. కనుకనే

"కలదు కలదొక ప్రకాశము
లేద నాకీ నర సమాజము
శాంతిగని సుఖియించు కాలము
ఏటికీ గుంజాటనన్."[2]

అంటూ కలతలు కల్లోలాలు మరిచి రాబోయే మంచిరోజుల కోసం శాంతిలో నిరీక్షించమని ప్రబోధించారు.

రాయప్రోలు వారు ఈ విశ్వమైన సామాజిక స్పృహతో రచనలు చేస్తూనే కవిత్వాన్ని ఒక మలుపు తిప్పారు. తమ భావాలను తాత్త్విక దర్శనాలను కవితామయంగా వెల్లడించడంలో కొత్తదనాన్ని కనబరిచారు.

తమ ఉక్తి వైచిత్ర్యంలో రచనా వైశిష్ట్యంలో

---

1. 'ఓతిత' - అభినవకవిత - P 210
2. 'ఆకాంక్ష' - మిత్రమంజరి - P 89

సుమారు వేయి సంవత్సరాలనుంచి దాదాపుగా ఒకే మార్గంలో పయనిస్తున్న సాహిత్యానికి నూతనమార్గాన్ని చూపారు. భావవ్యక్తీకరణలో చమత్కారాన్ని చూపుతూ తమ కవిత్వానికి నవ్యతా స్ఫూర్తిని కలిగించారు.

---

# రచనావైవిధ్యం -
# ఉక్తివైచిత్ర్యం

6

# రచనా వైశిష్ట్యం - ఉక్తి వైచిత్ర్యం

రాయప్రోలు వారి రచనల్లో ఇతివృత్తం, రచనావిధానం, భావాలు, భావవ్యక్తీకరణ, ఉపమానాలు, కావ్యభాష ఇలాంటి వాటిలో అన్నిటా ప్రత్యేకత కనబడుతుంది. వీరి కావ్యాలలోని ఇతివృత్తాలు అధికంగా సామాజికాలనే చెప్పవచ్చు. వీటిలోని ఇతివృత్తం సంక్షిప్తంగా ఉంటుంది కనుక కథాకథన శిల్పచాతుర్యాన్ని ప్రదర్శించిన రచనలుగా ఇవి కనబడవు.

జీవనతత్త్వవివేచనాశీలం అయిన వస్తువును తృణకంకణాది కావ్యాలలో గ్రహించారు. వారు దర్శించిన ప్రేమతత్త్వ స్వరూపాన్ని, స్త్రీ గుణాల ప్రాధాన్యాన్ని వస్తువుగా ఉన్న వీరి కావ్యాలు ఒక ప్రణాళికాబద్ధంగా ఉన్నాయి. ఒక్కొక్క కావ్యం ఒక్కొక్క విశిష్టమైన ప్రేమలక్షణాన్ని ప్రధానం చేసుకుని ఉంది. సామాజిక జీవితవాస్తవికతను తాత్త్వికంగా అవగాహన చేసుకుని కావ్యపరంపర వెలయించడం వీరి రచనల ప్రత్యేక లక్షణంగా పేర్కొనవచ్చు.

సుఖలాలసతకు ప్రతీకలన్న భావాన్ని కొందరికీ, తాత్త్వికదర్శనాన్ని ధ్వనింపచేస్తున్నవన్న భావాన్ని కొందరికీ కలిగింపచేసిన ఉమర్ రుబాయీలను రాయప్రోలువారు మొట్టమొదటిసారిగా తెలుగులోకి 'మధుకలశం' అన్నపేరుతో అనువదించి తెలుగు సాహితీప్రియులకు నవ్యరుచులను అందించారు[1]. వస్తువిషయంలో వీరి ప్రత్యేకతకు

---

1. 'ఉమరు రుబాయతును ఆంధ్ర సారస్వతలోకానికి సుపరిచితం చేసిన ఘనత శ్రీ సుబ్బారావుగారిదే. మధుకలశంలోని పద్యాలు మొదట 1924వ సంవత్సరంలో భారతిలో అచ్చయినవి. ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు గాని ఇతరుల అనువాదాలు వెలువడలేదు'.

'మధుకలశము' - కామరగిరి నరసింహారావు - కిన్నెర, మార్చి 1954.

ఈ ముక్తకాలరచన చేశారని నిదర్శనం.

తమ సాంఘిక, సాహిత్య దర్శనాలమిళిత సమీకరణ స్వరూపంగా కవితాలోకం, మాధురీ దర్శనం, రూపనవనీతం వంటి రచనలు చేశారు. రూపనవనీతం పూర్తిగా సంవాదాత్మకమయిన రచన అవడానికి గాని, సంప్రదాయసిద్ధమైన నాటకలక్షణాలు ఉన్న దృశ్యకావ్యంగా గాని చెప్పడానికి అవకాశం లేని విధంగా ఆ రెంటికీ నడుమ నిల్చింది.[1] రసపోషణ, కథాకథనం వంటి వాటికి దీనిలో ఎటువంటి ప్రాధాన్యం కనబడదు. భావాన్ని అభివ్యక్తం చేయడానికి ఏర్పడిన సంవాద రూపకమయిన కల్పనగా దీనిని చెప్పవచ్చు. ఈ విధంగా రూపనవనీతమ్ లో వస్తువులోనే కాక స్వరూపంలో కూడా ప్రత్యేకత ఉంది.

ఇక ఖండికలలో విస్తృతమైన వస్తువైవిధ్యాన్ని ప్రదర్శించారు. 'పులియాకు' నుండి 'పూజ'ల వరకు ఎన్నోవిషయాలు వీరి కవితావస్తువులుగా కనబడతాయి. 'పులియాకు' వంటి నీరసవస్తువుపై రసవత్తరమైన రచనచేసి తమ సౌందర్యదృష్టిని స్పష్టం చేశారు. స్మృతిగీతాలు, స్తుతిగీతాలు వంటివి ఆనాటికి నవ్యవస్తువులే అని చెప్పవచ్చు. 'పాలబావి', 'కాపుకన్నె', 'చిలుక', 'కోయిల', 'మేఘమాల', 'తిలకము' 'పూవు' వంటి ఎన్నోవిషయాలు వీరి కవితావస్తువులు. దేశమాతను, తెలుగు తల్లిని, ప్రబోధాన్ని ప్రధానం చేసుకున్న రచనలు సహితం ఉన్నాయి. సామాన్యులు

---

1. "పాత్రలు, ప్రవేశ నిష్క్రమణాలు, రంగములు ఇలాంటి విభాగీకరణం ఈ రచనను రూపకభ్రాంతి నిచ్చింది. కాని ఇది రసానుపోషకమయిన దృశ్యబంధము కాదు. భావాభివ్యంజకమయిన కల్పనగా కాంక్షితమైన రచన"
'రూపనవనీతమ్'- నివేదన రాయప్రోలు సుబ్బారావు

జీవితాన్ని, సాధారణ సంఘటనలను, సర్వసాధారణ ప్రకృతి సంపదను వస్తువులుగా గ్రహించి కావ్యఖండికలలో నిసర్గరమణీయంగా చిత్రించారు. ప్రధానకావ్యాలను వీరు ఏర్పరచుకున్న ప్రణాళిక ఒకటి ఉంది కాని వీరి ఖండికలకు వస్తునియతి లేదు. వీరిని కదిలించిన అనుభూతులు, సంఘటనలు, సన్నివేశాలు ఏవయినా వీరికి కవితావస్తువులే అయ్యాయి. ఈ విధంగా వస్తువైవిధ్యానికి, వస్తునవ్యతకు చిహ్నలుగా వీరి రచనలు నిలబడతాయి.

వస్తువును గ్రహించడంలోనే కాక కావ్యానికి పేరు పెట్టడంలో కూడా కొంత నవ్యత కనబరిచారు. కావ్యాలలోని ప్రధాన పాత్రల పేర్లో, ప్రధానసంఘటనల లేక సన్నివేశాల పేర్లో కావ్యానికి పెట్టడం అధికప్రచారంలో ఉన్న సంప్రదాయం. కాని వీరి కావ్యాల పేర్లలో 'తృణకంకణం', 'జడకుచ్చులు' వంటివి అపూర్వంగా కనబడతాయి.

ఇది పేరు పెట్టడంలో నవ్యతకాగా పేరు పెట్టకుండా నవ్యత తెచ్చినవి తృణకంకణ కావ్యపాత్రలు. కావ్యంలో పాత్రలుగా గ్రహించడానికి ప్రాచీనకాలం నుంచి కూడా ప్రత్యేక నియమ నిబంధనలేవీ ఉన్నట్లు కనబడవు. పశుపక్ష్యాదులను, నదీనగాలను సహితం కావ్యపాత్రలుగా ప్రాచీనకవులు కొందరు గ్రహించారు. అయితే కావ్యపాత్రలయినవి చేతనాచేతనాలలో ఏవయినా వాటికి సార్థకమయిన ఒక పేరు పెట్టి వ్యవహరించడం అలవాటు. పశుపక్ష్యాదులకే పేరుపెట్టినప్పుడు కావ్యంలో ముఖ్యమయిన మానవపాత్రలకు పేర్లుపెట్టి వ్యవహరించడం సహజం. అయితే రాయప్రోలువారు ఈ అలవాటుకు కొంత భిన్నంగా తృణకంకణంలో ప్రధానపాత్రలయిన నాయికా నాయకులకే పేర్లుపెట్టకుండా కావ్యరచన చేయడం సాహిత్యజగత్తులో అపూర్వవిషయంగా చెప్పవచ్చు.

ఇక రచనా విధానాన్ని పరిశీలించినప్పుడు

నవీనంగా, కొంత ప్రత్యేకంగా కనబడేది కావ్యారంభం. ఇష్టదేవతాస్తుతి, పూర్వకవిస్తుతి, శ్రీకారం వంటివాటితో కావ్యాన్ని ప్రారంభించడం దాదాపు వేయి సంవత్సరాలుగా వస్తున్న ఆంధ్రసాహిత్య సంప్రదాయం. ఈ ఆచారానికి కొంత భిన్నంగా 'ఓ సుకుమారాలతా' అని వీరి తొలి కావ్యం 'లత'ను ప్రారంభించారు. ఆంధ్రసాహిత్యంలో విషాదాంత రచనలు అంతకు పూర్వం కొద్దికాలం క్రితమే ప్రారంభం అయ్యాయి. కనుక విషాదాంతరచన అప్పటికి సర్వసాధారణం అనడానికి అవకాశం తక్కువ. కాబట్టి వీరి రచనలలో విషాదాంతాలు కొంతవరకు కొత్తవి కాగా వీరు విషాదంతో కావ్యాన్ని ప్రారంభించడం అతి నవ్యప్రయోగం అనవచ్చు. 'లత' కావ్యం నాయిక మానసిక వ్యథతో ప్రారంభం కాగా, 'శృంగారకంకణం' 'అడుగులు బొబ్బలెత్త'... అని నాయిక శారీరకమైన శ్రమను సూచిస్తూ ప్రారంభింపబడింది. 'స్నేహలత'లో విషాదాంతాన్ని దృష్టిలో పెట్టుకుని

'నిత్యసంధ్యాకుమారి మణిమతల్లి
కట్టుచీర చెఱంగులు కాలిపోయె
అస్తగిరి మస్తకమున సమస్త కాంతి
నాయకుడు సూర్యభగవాను బాయలలమె.'[1]

అని అశుభ సూచకమైన వర్ణనతో ప్రారంభించారు. ఈ విధంగా శ్రీకార ప్రారంభం లేకపోగా విషాదాన్ని సూచిస్తూ ప్రారంభించడం నవ్య మార్గం అనవచ్చు.

పూర్వకవులపై వీరికి అభిమానం అధికంగా ఉన్నప్పటికీ కావ్యాదిలో పూర్వకవులను స్తుతించిన సందర్భాలు తక్కువ అని

---

1. 'స్నేహలత'. మొదటి పద్యం.

చెప్పవచ్చు. రమ్యాలోకంలో

"మామిడి కొమ్మ మీద కలమంత్ర
పరాయణుడైన కోకిల
స్వామికి మ్రొక్కి ..."[1]

అని ధ్వన్యాత్మకంగా వాల్మీకిని స్మరింప చేస్తూ స్తుతించడం పూర్వకవి స్తుతి విధానంలో ప్రత్యేకంగా కనబడుతుంది. అలంకారాలలో మాలోపమాలంకారము ప్రాచీనమే అయినా పద్యపాద పునరుక్తిలో ఉపమా మాలికను ప్రయోగించడం రాయప్రోలు వారు అనుసరించిన నవ్యవిధానం. ఒకే పద్యం కాని పద్యపాదాలు కాని పునరుక్తిగా ప్రయోగించడం ప్రాచీన ఆంధ్ర సాహిత్యంలో అసలు లేదనలేము గాని అధికంగా కనబడదు. తిక్కన సోమయాజి మహాభారతంలో

'దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప స్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రెచ్చు నిను దోర్లీలన్ వెసం గిట్టి గం
ధర్వుల్ మానము బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!'[2]

అనే పద్యాన్ని ద్రౌపదితో రెండు సందర్భాలలో పలికిస్తాడు. కీచకునితో పరుష వాక్యాలు పలికే సందర్భంలో ఒకసారి, తిరిగి ద్రౌపది భీమసేనునితో తన భంగపాటును చెప్పి పరితపించే సందర్భంలో ఒకసారి పునరుక్తిగా అదే పద్యం వాడబడింది. ఈ విధంగా రెండుసార్లు పలికించి ఔచిత్యాన్ని,

---

1. రమ్యాలోకము - P 2

2. శ్రీమదాంధ్ర మహాభారతము - విరాట పర్వము - ద్వితీయ ఆశ్వాసము
   55 వ పద్యం; 172 వ పద్యం

నాటకీయతను పోషించి ఆ భావానికీ ఆ సందర్భానికీ వన్నె తెచ్చారు అనటంలో సామయాది.

రాయప్రోలు వారు 'స్నేహలత' అగ్నికి ఆహుతి అవుతున్న సందర్భంలో వివిధ ఉపమానాలను ప్రయోగిస్తూ చివరి రెండు పాదాలను పునరుక్తి చేసి నవీనంగా చెప్పారు.[1] ఈ విధానం రచనకు కేవలం నవ్యత సాధించడమే కాక ఆ సందర్భానికీ సన్నివేశానికీ బలాన్ని చేకూర్చింది. ఈ విధంగా పాశ్చాత్య పరంపరలో సన్నివేశాన్ని పఠితకు ప్రత్యక్షం చేయడమే కాక ఆ ఘట్టానికి కరుణరసస్ఫూర్తిని కలిగించారు. వార్తాపత్రికలలో ప్రచురితమైన ఒక అబల ఆహుతి వార్త కవితాపరమైన భావావేశంలో రసమయమై స్త్రీపక్షవాదానికి ఆవర్తన దోహదం చేసింది.

---

1. విరియు చెంగల్వ పూవుల చెలువు నందు
కులుకు రాయంచ కన్నియ నడక పగిది
మూర్తి దలపించె భావవిశుద్ధవేది
దహనమున నున్న స్నేహలతామతల్లి!

ఈ పద్యంలోని చివరి రెండు పాదాలను తిరిగి తిరిగి ఎనిమిది రకాల ఉపమానాలతో ప్రయోగించారు.

తామ్రపర్ణీ నదాంతరోదకము లోన
పొదల తేలియాడె ముత్యాల తామ్మి లోలె...
మామిడి చిగుళ్ళ నిగనిగల్ మలయుసెజ్జ
చెదరు ధవళోత్తరీయంపు చెఱగు వరుస....
పండు పగడాల రాశిలో బడి భ్రమించు
విందు పాలపిల్లిరేక సానిర్చలముగ....
చిత్రిత కుంకుమ రంగవల్లికల నడుమ

భావాన్ని చెప్పడంలోనే కవి సామర్థ్యం వ్యక్తం అవుతుంది. భావం పాతదే అయినా చెప్పే విధానంలో కవి ప్రత్యేకత కనబడుతుంది. కనుకనే రాయప్రోలు వారు

'కలదు కాదె అనుక్తంబు గ్రథనమందు'.[1]

అని అన్నారు. గ్రథనం విషయాన్ని అనుక్తంగా, అపూర్వంగా మలచి నవ్యతా స్ఫూర్తిని కలిగిస్తుంది. శబ్దాలు కాని వాటి అర్థాలు కాని కొత్తగా వీరు సృష్టించినవి కావు. కాని శబ్దప్రయోగ కౌశలంలో వీరు నవ్యత సాధించారనవచ్చు.[2] వీరు

---

(contd)

తీర్చినట్టి కర్పూరలతిక విధాన.....

ప్రత్యతించు జీవాపక్షి వనమునందు

రంజిలెడి తెల్లని సుధాసరసి విధాన...

సుభగ తాంబూల రస సాంద్ర సుషమ మధ్య

నొత్తు తెలినవ్వు రేకల సుత్తి మాత్రి ...

కనక కదళీ దళంబులు గప్పికొనిన

పారిజాత ప్రసవ మాలభంగి....

'స్నేహలత' - P300, 301 (అభినవ కవిత)

1. కావ్యాలోకము

2. "వీళ్ళు నూతన పదాలను సృష్టించినారా? లేదు... ఉన్న పదాలకు ఉన్న అర్థము కంటె భిన్నార్థములు కల్పించినారా? లేదు. ప్రతిదానికీ సహజమైన అభిధార్థమూ అది పట్టుకపోతే ఉండే లక్షణార్థమూ అట్లాగే ఉన్నవి!.. పోనీ వ్యంజననేమైనా మరుగువరగా వాడి పదాలకూ పదబంధాలకూ నూతన రసవంతమైన అర్థాలను సహృదయులలో కలుగజేసినారా అంటే వీళ్లలో వ్యంగ్యం కంటే వాచ్యమెక్కువ. అవే పదాలై అవే అర్థాలైతే ఇక నవ్యత యెక్కడ ఉన్నది? వాటి గ్రథనములో ఉన్నది - విశేషమూ నవ్యతానూ. ఈ గ్రథనము వల్ల పదసమ్మేళనానికి ఒక అపూర్వతా నవ్యతా

ఉక్తి వైచిత్ర్యంలో భావశబలీకరణలో కొత్తదనాన్ని చూపారు. వక్రోక్తి వారి కవితాంశానికి జీవం అని అనిపిస్తుంది.[1] పదప్రయోగంలోని విశిష్టతవల్ల ఆ పదజాలం సమాహారంగా వాచ్యార్థానికి అతీతంగా రమణీయ భావప్రపంచాన్ని సృష్టిస్తుంది. ఉదాహరణకు -

“వళులకు కప్రంపు పాతరలు తీసినయట్లు
శ్రీగంధ భాండమున్ చిందినట్లు
పచ్చకుంకుమ పువ్వు పంటకోసినయట్లు
పన్నీటి కడవలు పగిలినట్లు
అగరు వృక్షముకొంబు పిగిలి పిల్చినట్లు

---

(contd)

వస్తున్నది.”

నవ్యాంధ్ర సాహిత్య వీథులు - కురుగంటి సీతారామయ్య P.596.

1. “రాయప్రోలు కవిత్వంలో కీలకం వక్రోక్తి.... ఈ విచిత్ర శబ్దప్రయోగకళ ఒక ఆకర్షణీయ జగత్తును, ఒక రమణీయ వ్యవహారాన్ని సృష్టిస్తోంది..... ఈ ఆకర్షణీయ జగద్వ్యవహారం అంతా శబ్దము యొక్క లక్షణా శక్తినాశ్రయించి ఉద్భవించినదే. ఇదే రాయప్రోలు సృష్టించిన నవ్యప్రపంచ పంచప్రాణ లక్షణం. ఇది తెలుగులో తత్పూర్వం అప్రధానమూ లేక కావ్యోచితమూ, లేక మృగ్యమూ గనక నిజమైన కవిత తెలుగులో 11వ శతాబ్దిలో కాక 20వ శతాబ్దిలోనే మొలకెత్తింది. ఆ మొలక పేరే రాయప్రోలు సుబ్బారావు” గుంటూరు శేషేంద్రశర్మ - విమర్శిని. P 112-113

కస్తూరి కాకమున్ కలిగినట్లు
పునుగు పిండి కుమారమున్ రేగినట్లుయు
పూల తావుల రెగబోసినట్లు
ప్రేమరూప నానారక్తి బింబనముల
కిక్తినావు రచించి చిత్రించి ఆల
పించి అభినయించి వచః ప్రపంచమందు![1]..."

ఈ సందర్భంలో రచించి, చిత్రించి, ఆలపించి, అభినయించి అనే క్రియలకు పైపాదాలలో వాటికి ఉపయోగించిన ఉపమానాలకు సమానత్వర్థంగాని, చెప్పుకో దగిన సామ్యంగాని వాచ్యార్థం వల్ల అధికంగా కనబడదు. కాని ఆ ఉపమానాలు సృష్టించిన ఒక మధురభావం మనోహరంగా ఆ క్రియలకు అన్వయించి విషయాన్ని అనుక్తంగా చేసింది. ఇదే విధంగా,

"పాల వ్రామ్మొగడచ్ పచ్చివెన్నెల విచ్చి
వీయని సుమపూసలాయె నేమొ?
కమ్మని మకరంద కణములు స్నేహించి
చినారి పలుకులై చిక్కెనేమొ?
పూల లావణ్యంబు పొంగి చక్కదనాల
పిండెల్లై కుచులొచ్చు పెరిగెనేమొ?
సెలయేటి యుయ్యాల కులుకు లూయ్యాలమున్
ముద్దు ముచ్చటలయి ముదిరెనేమొ?
పాటకును పద్యమునకు నద్రముగ నాడిగి
చతిరి చాతుర్యమునకు సాజముగ సాగి

---

1. రవీంద్రుని అస్తమయము - వనమాల P55

పారునకు పొత్తునకు చాలి పొందిపొసగు

మా తెనుగుతల్లి మెడకిదే మల్లెదండ.[1]

అంటూ భాషాసామర్థ్యాన్ని, మాధుర్యాన్ని స్మరించారు. ఈ సందర్భంలో సహితం నేసపద్యంలోని నాలుగు పాదాలలోని భావం తెనుగుభాషామాధుర్యాన్ని చవి చూపుతుంది. కాని, ప్రతిపదానికి వాచ్యార్థాన్ని గ్రహించి, అన్వయించి చూతే ఆ భావమాధుర్యం తగ్గిపోతుంది.

'కాళిదాసుని భణితి కళలు సమర్తాడే.'[2]

'తమసా తరంగవతికిన్ పొడకట్టె సమర్త బెమ్మెలు.'[3]

'వెనెలలు నిద్రపోయెడు వేళలయ్యె.'[4]

'పసుపు బూసింది తరువెల్ల విసురుమంద'[5]

'చూపులను పాలవెన్నెల జన్నతేలు.'[6]

'చీకటి జడల్ ముడుల్ విప్పుచుండులాడే.'[7]

'కన్నెవిరులు సమర్తాడు కాలమందు.'[8]

ఇటువంటి సందర్భాలలో వీరి భావాభివ్యక్తిలోని నవ్యత స్పష్టం అవుతుంది

1. తెనుగు మాన్యము - ఆంధ్రావళి - P39
2. 'నమోవాకమ్' - మిశ్రమంజరి - PXI
3. 'జాగ్రత్తము' - వనమాల - P71
4. 'తెనుగు లోటు' - అభినవ కవిత - P336
5. 'తెనుగు లోటు' - అభినవ కవిత - P319
6. 'అమృతవార్త' - 'జడకుచ్చులు' - P164
7. 'ఎవరు' - 'జడకుచ్చులు' - P132
8. 'స్వప్నకుమారము' - P9

వీరు చెప్పిన భావాలలో కొన్ని పాతవే కావచ్చు. ప్రాచీన ప్రయోగాలలో కనబడేవే కావచ్చు. కాని వాటిని వ్యక్తం చేయడంలో వీరి పదప్రయోగం వాటికి కొత్తదనం కలిగిస్తుంది.

వెదుళ్ళలో నుంచి గాలి వీచినప్పుడు వెలువడిన శబ్దాన్ని సంగీతధ్వనిగా వర్ణన చేయడం ప్రాచీనం కావచ్చు; కాని 'నవ్వుతు పండు వెదుళ్ళు పాడసాగె'[1] అని వర్ణించడం నవీనంగా కనబడుతుంది.

చంద్రునితో ముఖాన్ని పోల్చడం అతి ప్రాచీన ఉపమానం. ఈ ఉపమానాన్ని ఎన్నోవిధాలుగా కవులు అనేక అలంకారాల ద్వారా వ్యక్తపరిచారు. ఉపమేయం అయిన వ్యక్తి ముఖసౌందర్యం ముందు చంద్రుడు ఓడిపోతాడనే భావవ్యక్తీకరణ కూడా వాటిలో ఒకటి. ఇటువంటి విధానాన్నే అవలంబించి అదే భావాన్ని చెప్పినప్పటికీ,

'సిరి సిరి జాబిల్లి చెరిపేటి మోము
పూసిన పువ్వుపై మాసెరా చంద్రి'.[2]

అని జాబిల్లి అందాన్ని చెరిపిన ముఖంగా చెప్పడంలో నవ్యత చేకూరింది.

ఒక వ్యక్తిని గూర్చి చెప్పడంలో 'ఏ ముహూర్తాన పుట్టాడో' అనీ 'ఏ నక్షత్రాన పుట్టాడో' అనీ అనడం లోకవ్యవహారం. ఇటువంటి భావాన్నే 'మీ యమ్మ ఏ తారబాయలో నిను గాంచె'[3] అనే ప్రయోగం ఆ భావాన్ని అనుక్తంగా చేసింది. ఇదే పద్ధతిలో 'లోకత్రయం వాక్త్రయం' అనే ఆర్యోక్తి ఛాయలో సాహిత్యం చేజారిపోతుందనే భావాన్ని ఇముడ్చి - " ఇంటింట కవి సాహిత్య

---

1. జాత్రప్పుడు - వనమాల - P71
2. మిత్రమంజరి - P75
3. ఒడిసారి చిన్నాడు - వనమాల - P59.

దీపములలో' అని ప్రయోగించారు. దేశీసాహిత్యదీపాలతో పదజాలం పాతభావానికే కొత్త అందాన్ని తెచ్చింది.

వీరి రచనలో మరొక ప్రత్యేకత ఒక భావవ్యక్తీకరణకు ప్రసిద్ధంగా ప్రచారంలో ఉన్న కొన్ని పదాలను, పదబంధాలను వేరే భావాన్ని చెప్పడానికి ప్రయోగించడం. 'ఘుమఘుమ' అన్న పదం నవ్వడానికి ప్రయోగించడం అధికంగా కనబడుతుంది. అయితే రాయప్రోలు వారు దానిని తలుపు తెరవడానికి వాడడం కొత్తగా కనిపిస్తుంది. 'పదకొండింట తలుపు ఘుమఘుమ తెరచి'[1] అన్న ప్రయోగం విచిత్రంగా ధ్వనిస్తుంది. అదే రకంగా 'కెవ్వున' అనేది కేకవేయడానికి చిన్న పిల్లల ఏడుపుకు వాడడం ప్రసిద్ధం. 'కెవ్వు కెవ్వున నవ్వు పక్షినిచయంబు'[2], 'కెవ్వున నొయ్యారపు కూజితము వెల్లార్చుగా కాకము మూకంబు పోయె'[3] అన్న ప్రయోగాలలో (కాకము మూకం అన్న పదబంధం) పక్షులు చేసే ధ్వనిని నవ్వడంగా భావించడంతో పాటు, ఒయ్యారపు కూజితం కెవ్వున ధ్వనించిందనడం, కెవ్వున నవ్వడం అను భావవ్యక్తీకరణాలు నవ్యత సాధించాయి. 'కుచ్చెళ్ళు పెళపెళమను త్రుంకి'[4] అన్న సందర్భంలో 'పెళపెళ' అనేది చీరకుచ్చెళ్ళకు వాడడం అంత ప్రసిద్ధం కాదు. 'క్రక్కడం' అను క్రియను విషం క్రక్కడం, ఆగ్రహం వెళ్ళగ్రక్కడం అనువిధంగా ప్రయోగించడం ప్రసిద్ధం కాగా ఆ క్రియాపదాన్ని అందానికి చేర్చి 'రేకలు నందాలు గ్రక్కెడి పూవే'[5] అని ప్రయోగించడం

---

1. 'కేళాంకేళి' - జడకుచ్చులు - P-111
2. 'వసంత విహారము' - జడకుచ్చులు - P 121
3. కష్టకమలు - అభినవకవిత P-262
4. 'కేళాంకేళి' - జడకుచ్చులు - P 111
5. 'పూవు' - జడకుచ్చులు - P 125

విశిష్టంగా కనబడుతుంది. ఇదేవిధంగా[1] రువ్వడం, మేయడం, ఆరాటం, కారాడటం, నానడం, పిలకడం, కవుగిలింపడం, విందులాడడం మొదలైన పదాలు ప్రయోగించిన సందర్భాలు కూడా నవీనంగా కనబడతాయి.

వీరి రచనకు నవ్యతను చేకూర్చిన మరొక లక్షణం లింగాలను సూచించే శబ్దప్రయోగం. కొన్ని స్త్రీలింగపదాలకు పులింగ పదాలను, కొన్ని నపుంసక లింగపదాలకు స్త్రీలింగ సూచక శబ్దాలు జోడించి ప్రయోగించడంలో విచిత్రమైన అందం చేకూరింది.

ప్రాచీనప్రయోగాలలో పుంలింగంగా

---

1. 'చిలుకల పాటలు రువ్వక కూసురు' – 'కోలాటము'. కన్నెపాటలు P-12
'మొగిలు మేసె ప్రభాతములందు కాంచలన్' – 'మేఘమాల'. జడకుచ్చులు P 127
'గాల్లని యుదారకపు తీలలలో' – 'కోయిల'. జడకుచ్చులు – P 143
'కోర్కెలు లోలోన నానపోసె' – 'లలిత'. అభినవ కవిత P-219
'కనులు కనులు కవుగిలింప' – 'చెమ్మచెక్క' – కన్నెపాటలు P-9
'స్త్రీళ్ళు స్త్రీళ్ళలో విందులాడగా' – 'నాలుగు స్తంభాలాట' – కన్నెపాటలు P.10
'చకోరుని యందము పులకింతలై' – 'వరలక్ష్మీవ్రతము' – కన్నెపాటలు P.35
'పాటకయి కారాడె కోకిల' – 'ప్రకృతమది' – మిశ్రమంజరి P-128
'అందాలు పిలికేటి సందె సంపంగి' – 'వసంతము' – ఆంధ్రావళి P.68
'నవ్వురవ్వలు చిమ్మగన్' – 'పల్లెపడుచు' – మిశ్రమంజరి – P142
'గంటలు మొగలందు ఘల్లని ఎదాపెద మ్రోయుగ' – 'కోయిల' – జడకుచ్చులు P143
'రాలన్ చకోరదనాల నవ్వున్' – 'కష్టకమలు' – అభినవ కవిత – P269
'అందమున్ నలుగని ... కమలం' – 'కష్టకమలు' – అభినవకవిత P270
'కాంత లాపము పునియున్' – 'లలిత' – అభినవకవిత – P214.

అధిక ప్రచారంలో ఉన్న భ్రమరాన్ని రాయప్రోలు వారు మిళిందకన్య, భ్రమర బాల, తుమ్మెద పడుచు, భృంగపుత్రి అంటూ స్త్రీలింగంగా ప్రయోగించడం ప్రత్యేకంగా నవ్యత చేకూర్చింది.

(జలపదార్థం అయిన మేఘాన్ని మేఘుడు అనడం ప్రసిద్ధం కాగా వీరు 'నీరదసుత' అని స్త్రీలింగంగా ప్రయోగించడం, వేణువుకు 'కలికి వేణువు' అని స్త్రీవాచకాన్ని చేర్చడం నవ్యప్రయోగాలుగా చెప్పవచ్చు.

భూమిని స్త్రీగా సంప్రదాయానుసారం భావన చేసినప్పటికీ, పచ్చికను వర్ణించే సందర్భంలో 'కోడెతనంపు జగి' అని పుంలింగ సూచక శబ్దప్రయోగం క్రొత్తగా కనబడుతుంది. ఆడత్రాచు, నాగకన్య అని స్త్రీలింగ పరంగా సర్పాలను చెప్పడం ఉన్నప్పటికీ 'త్రాచుకుచ్చెతలు' అని 'కుచ్చెత' శబ్దాన్ని ప్రయోగించడం కొంత వైచిత్ర్యాన్ని కలిగిస్తున్నది. ఇదే విధంగా వీరు చేసిన మరికొన్ని సమాసాలు - 'జింకపడంతి', 'కురంగకన్య', 'కుమారహారిణి', 'సివ్వపడతి', 'కలికి కోయిల', 'కోడె కోయిల', 'కోకిలబాల', 'కలికి పూగుత్తి', 'కలికి తీగెలు', 'ముదితతీవె', 'కోమలవనము', 'కోమలశుకం', 'పులుగు పాలతులు' వంటివి వీరి రచనకు క్రొత్తదనాన్ని చేకూర్చాయి.

ఇవి తిర్యక్స్థలాలకు సంబంధించినవి కాగా మానవపరంగా 'చెలి' అనే సంబోధనం విశిష్టంగా కనబడుతుంది. 'లలిత' కావ్యంలో నాయిక నాయకుని గూర్చి తలచుకొని వ్యథ చెందుతున్న సందర్భంలో ... 'వెతల గాసిలితిన్ నిను బాసి చెల్వుడ! అని నాయికతో పలికించారు. (తృణకంకణంలో నాయిక నాయకునిలో ఆతని తల్లిదండ్రులను తీర్చవలసిందని బోధించే సందర్భంలో .... 'చెలీ! యిటు తానె దయాను వర్తనన్' అని నాయకుని 'చెలీ'! అని సంబోధించినట్లు వ్రాశారు. ఈ పదాల ప్రయోగాలు వ్యాకరణరీత్యాగాని, శబ్దార్థవిషయంలో కాని దోషాలు కాకపోయినా

ఆ విశిష్టమైన ప్రయోగాలు ఉన్నవని చెప్పవచ్చు.)

వీరి రచనకు సార్థకతనాన్ని కలిగించిన వాటిలో ప్రధానంగా చెప్పదగ్గవి భావాలు. వీరి భావనారీతిలో సార్థకతనం క్రింది సందర్భాలలో స్పష్టంగా కనబడుతుంది.

'వెండి లాంతరు వెలిగించి వెడలె రజని.'[1]

'నీలగిరులను బట్ట బయలున
పెరుగుముద్దలు పంచు శారద.'...[2]

'జున్నుగడ్డల వంటి చుక్కల
వెన్నెలను పెరుగన్నముట్టల
మ్రింగె దెయ్యము వంటి చీకటి.'[3]

చంద్రుని లాంతరుగా భావనచేయడానికి తోడు 'రజని' అన్న స్త్రీలింగ శబ్ద ప్రయోగం దానికి మరింత సౌందర్యాన్ని ఆపాదించి అభిసారికను స్మరింపచేస్తుంది. వెన్నెలను తత్పూర్వం ఎందరో కవులు ఎన్నో విధాలుగా వర్ణించారు కాని పెరుగన్నంగా భావించడం అపూర్వం.

'మొగ్గనవ్వు రేకులు విచ్చు - పొట్టి పగల
నవ్వు ముత్తి ముత్యంబులక్ రువ్వు - చెల్లు
నవ్వు లేత కెంపుల వాయనంబు లెత్తు
శబ్దములు నవ్వు అర్థకోశముల తెరచు.'[4]

---

1. 'పెండ్లిలగ్నం' - మిశ్రమంజరి - P57
2. 'నవరాత్రి' - మిశ్రమంజరి - P72
3. 'మంగళమాఘము' - మిశ్రమంజరి - P46
4. 'ఏరువాక' - మిశ్రమంజరి - P99

మొగ్గవిచ్చి పువ్వుగా మారడం, చెట్లు చిగర్చడం, శబ్దం సహజశక్తిలో అర్థాన్ని స్ఫురింపచేయడం వంటివాటిని సహృదయంగా భావనచేసి చమత్కరించారు. ఈ సందర్భంలో వీరి భావ వైచిత్ర్యం స్పష్టం అవుతున్నది.

సామాన్యుని దృష్టికి కవిదృష్టికి ఉన్న భేదాలలో ముఖ్య మయినది భావుకత. భావుకుడయిన కవి, సామాన్యునికి సాక్షాత్కారం అనిపించని విషయాన్ని తన కల్పనాసామర్థ్యంలో అసాధారణంగా, రస వత్తరంగా సృష్టిస్తాడు. ఉదాహరణకు

'పంట రాసులపైన పవళించి వేచి
తేట తటాకాల వీక్షమ్ము లాడి
వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి'[1]...

'తళతళ లాడే మెరుపుల జడలో
ఏడు వన్నియల బట్టాణంబును
నింగి నడుము నను సింగారింపగ'[2]..

'మావి కన్నెరికమే మరులు గొల్పినా నిన్ను
నీ పిలుపులో మావి నిలువెల్ల పూచెనో'[3]

'ఎండలో మాడిపోవు వేయిగురులరసి
ఏడ్చునకుల ప్రేమోత్కంఠ మెవ్వరెరుగు'[4]

అనేవి కవి ఊహాశక్తిని చూపుతాయి. రాయప్రోలు వారి భావనాబలానికి,

---

1. 'సంక్రాంతి' - ఆంధ్రావళి - P72
2. 'లారిమయ్యుట' - కన్నెపాటలు - P26
3. 'కోయిల' - మిత్రమంజరి - P102
4. 'స్వప్నకుమారము' - P27

కల్పనాచమత్కృతికి చక్కని నిదర్శనాలుగా చెప్పదగ్గవి ఇటువంటి సందర్భాలు.*

వీరి భావవ్యక్తీకరణలో స్వేచ్ఛ స్పష్టంగా కనబడుతుంది. వీరు ప్రయోగించిన పదబంధాలు, ఉపమానాలు ఈ స్వేచ్ఛను ప్రదర్శిస్తాయి. వీరి నూతన భావాలలో, పదబంధాలలో, ఉపమానాలలో కూడా వాత్సల్యస్ఫోరకంగా కనబడతాయి. మాతృమమతలకు వీరి దృష్టిలో ఉన్న ప్రాముఖ్యం వల్లనేమో పసిబిడ్డలు, బాలెంతలు అలంబనంగా వీరి నవ్యభావవాహిని సాగింది.

'భూదేవి సుఖప్రసూత పగిదిన్ జలమాడి
ధరించె పచ్చపూ పావడ'[1]..
'భూసతి ప్రసూతి వేదనము ను గ్రహించె'[2]..

ఈ సందర్భాలలో భూదేవి ప్రసూతగా కనబడగా మరొకచోట చిగురుటాకులు పసిపాపల పొత్తిళ్ళ భావన కలిగించాయి.

'ప్రసవించిన ఎలతీవెల
పసిపాపల పొత్తులాంబలంచిన పగిదిన్
మిసమిసల చిగురుటాకులు
పసుపారెడు ఎఱుపు మెఱయ వటవృక్షములన్.'[3]

వీరి వాత్సల్యదృష్టికి జగమంతా మాతృత్వభరితమే. కనుకనే వీరి దృష్టిలో 'మామిడి మాలు మోయగా', వేయి చుక్కల బాయ - దోస తీయని పిందెలను కన్నట్లు కనబడింది. దానిమ్మకు పగడాల కానుపును, శుక్తికి మౌక్తికాల

---

1. 'జన్మాష్టమి' - వనమాల - P71
2. 'తెనుగుతోట' - అభినవకవిత - P 325
3. 'శ్రీముఖి' - ఆంధ్రావళి - P. 15

* మరికొన్ని ఉదాహరణలు ఒకటవ అనుబంధములో ఇవ్వబడ్డాయి

కానుపును, లతకు ప్రసూతిని వీరు భావనచేశారు. సృష్టి సమస్తాన్ని వాత్సల్య దృష్టితో వీక్షించడం వల్లనేమో వీరికి అంతటా పసితనం కనబడింది. వీరి వాత్సల్య నయనాలలోని ఆ పసితనం బాలావాటిలో పసితనం, బాల్యం వంటి పదాలుగా వ్యక్తమయింది.

పసి తెమ్మెర, పసి కాంతి, పసి మొలకలు, పసిపచ్చిక పసి తరులపాదు, పసిపైరగాలి, బాల పుష్పము, బాల మామిళ్ళు, బాల వత్సము, పుల్ల బాదెంత, బాల సురాతేలు, బాల లతామతల్లి, కోకిలబాల, కలువ పాపలు, బాల తారలు, నాగబాలలు, పక్షిబాలికలు, వంటి పదబంధాలు వీరి వాత్సల్య దృష్టికి ప్రతీకలు. మేఘాలు 'నీలాల పుట్టింటి నీళ్ళాడ వెళ్ళు నడబిల్లగా', నదులను 'సస్యములకు పాలిచ్చు వాత్సల్యవతుల' గాను భావించడం కూడా ఇలాంటిదే ననవచ్చు. ఇదే విధంగా

'నింగి బాదెంత నడికట్టు కాంచులనగ
జారు నతసీ పయోధ ప్రసన్నరేఖలు'[1]..

అని నింగి బాదెంతగా వీరి భావనకు తోచింది.

'నిండు గృహ దీర్ఘికల మునగ నీరజములు
కడుపు చల్లని పంట నా వెడలుచున్న
మకరందఝరుల సంతానము'[2]...

తామర పూలలో నిద్రిస్తాయని ప్రాచీనులచే భావింపబడిన తుమ్మెదలు కూడా తామరల సంతానంగా వీరికి గోచరించింది.

నిశలు పోషించడం,

---

1. 'కవిత' - ఉదయరశ్ములు P 129
2. 'తెనుగు తోట' - అభినవ కవిత P 325

నిశలు పులకించడం, అంతరంగము తారడం, కన్నుల జడలల్లడం, చీకటి చిందులు వేయడం, రేకులు విప్పారడం, నవ్వులు పుష్పించడం, చీకటి పడగ యెత్తడం, వయసు పూయడం, శశి వికసించడం, మబ్బులు మంచుకన్నీళ్ళు కార్చడం - ఇటువంటి భావాలు వీరి భావనాశీలంలోని విశిష్టతకు మచ్చు తునకలు.

వీరి రచనలో కనబడే మరొక విశేషం విచిత్రమయిన ఉపమానాలు. రాయప్రోలు వారు ప్రయోగించిన ఉపమానాలలో అధికభాగం అతి సాధారణ విషయాలను సంబంధించినవి. చెప్పే విషయం ఎటువంటిదయినా అతి సామాన్యమయిన ఉపమానంతో సామ్యం చెప్పడం వీరి ఉపమానాలలోని విశేషం. అందువల్ల ఈ ఉపమానాలు సామాన్యులకు కూడా విషయస్వరూపాన్ని విస్పష్టం చేయడానికి సహాయపడతాయి.

'అజ సృష్టికంటె కవిత
ల్లజ శిల్పసృజన విలసదలంకృతమై ఆ
రజ ముగునంటివి దువ్వన
విజకుంతలములు జడ రమణించెడి కరణిన్.'[1]

'కొమ్మలుడిగిన ఈ గూడు కదలలేక
వణకుచున్నది నా దేహ ఘటిక పగిది'[2]

'తల్లి రెక్కల క్రింద మెత్తని సువర్ణ
మూతికల మైమరచి నిద్దురలు పోవు
కనె పారావతము భాతి కదలరాయె
నా యహంకారమేమి బంధంబు కాని.'[3]

---

1. కృష్ణాష్టపది - మిత్రమంజరి - P 36
2. 'ఋక్షదీక్ష' - ఆంధ్రావళి - P 65
3. ధ్యానగీతము - జడకుచ్చులు - P 114.

'అలల నర్తనము నంటి యుంటక
ఆరిపోయెడి ముద్దులట్టుల
తాకి తాకక ఒడల పులకల
తడియు నాలయు సమీరమున్.'[1]

'అరిపోవును చుంబనము వలె శబ్దమెప్పటి కప్పుడే.'[2]

మాఘ మాసంలో చెల్లాచెదరుగా కనిపించే మేఘశకలాలు కొప్పుకు ఉండని కురులలాగా లేదా సంక్రాంతి ముగ్గులు పొలు తీసిన పాదుకుల్లాగా రాయప్రోలు వారి భావనలో లోనాయి. ఇటువంటివి సాధారణ విషయాలకు సంబంధించిన ఉపమానాలు. సామాన్య విషయాన్ని అసాధారణమైన తాత్త్విక ఉపమానంలో గంభీరంగా చెప్పిన సందర్భం క్రింద ఉదహరించినది.

'కామ్యకాన నందగించిన క్రొత్త పువ్వు
ఎందరెందరికెన్నెన్ని చందములను
భిన్న భిన్న భావనలు మొలిపించు నవుర
ఐక్యగతియె ద్వైతాద్వైతమైన రీతి.'[3]

ఇక్కడ సామాన్యమయిన పుష్పం తాత్త్విక సత్యంలో సామ్యం పొందగా మరొక సందర్భంలో తాత్త్విక సత్యాన్ని అతిసామాన్యవిషయంలో ఉపమించడం కనబడుతుంది.

---

1 'ప్రభాతము' - ఆంధ్రావళి - P 77
2. 'అనాధ' - మిశ్రమంజరి - P 84
3. 'ఎవరు' - జడకుచ్చులు - P 136

'ప్రకృతి విత్తు దుకూలమై పరిణమించు
మూర్తి, పచ్చిక పాలుగా మారురీతి
సృష్టి బహురూపముల ఫలియింప, కర్మ
లమృత భాగ్యాను భవమున కరుగుచుండె.'[1]

ఈ విధంగా సామాన్య విషయానికి తాత్త్విక ఉపమానాన్ని, తాత్త్విక విషయానికి సామాన్య ఉపమానాన్ని చూపారు.

ఉపమానాన్ని ప్రధానం చేసి చెప్పడం, ఉపమాలంకారాన్ని ప్రయోగించడంలో వీరు అనుసరించిన ఒక క్రొత్త పద్ధతి. ఈ పద్ధతిలో ఉపమేయం బాహ్యంగా పద్యంలో కనబడక ధ్వని ప్రాయంగా సూచింపబడుతుంది.

'కలువలు పరచిన కంటి కంచములు
పెరుగన్నము తినె ప్రియ చకోరములు'.[2]

ఇక్కడ వెన్నెలకు, కలువలకు, చకోరాలకు ఉన్న సంబంధాన్ని బట్టి ఉపమేయాన్ని ఊహించాలి. రాత్రిపూట వికసించే కలువలను కంచాలుగా భావించి, చకోరాలు వెన్నెలను భుజిస్తాయన్న కవిసమయాన్ని ఆధారంగా గ్రహించినప్పుడే పెరుగన్నం అన్న ఉపమానానికి మూలం అయిన వెన్నెల అన్న ఉపమేయం స్ఫురిస్తుంది. దీనిని గూర్చి రాయప్రోలు వారు - .."ఉపమేయాన్ని చెప్పకుండా ఉపమానాన్నే ప్రధానం చేసి చెప్పాను. ఇట్లా చెప్పడాన్ని సంప్రదాయజ్ఞులు అంగీకరించరు. తెలుగు కవిత్వంలోకి ఈ విధానాన్ని తెచ్చింది నేనే."[3] అన్నారు.

---

1. ధ్యానగీతము - జడకుచ్చులు P 119
2. Interview with Sri 'Rayaprolu' - Oct 79.
3. 'రాయప్రోలుతో ముఖాముఖి' - విమర్శిని-4 P 36 (అనుబంధం)

ఇదే పద్యంలో చెప్పిన మరొక సందర్భం -

'పదుచు కరియావులను పిండిన
పాలు పోయుచు కలువ కడవల
పంచదారను పంచవచ్చెను
చందమామ జగంబునకున్'.[1]

ఇక్కడ సూచనప్రాయంగా ఉన్న ఇతర ఆధారాలను బట్టి, పాలవంటి వెన్నెలను, నల్లని ఆవువంటి ఆకాశాన్ని ఉపమేయాలుగా భావించాలి.

----'జలకమాడిన నభోజనని ఘనాలక
లార విప్పిన వేళ నాదు నెమలి'.[2]

నెమలి ఆట ఆధారంగా 'మేఘాలు' అన్న ఉపమేయాన్ని 'అలకలు' ఉపమానంలో అన్వయించుకోవాలి.

'తెల్లమబ్బులు నడుచు నల్లమైదానమున'.[3]

నల్లమైదానం అనడంలో 'ఆకాశం' అన్న ఉపమేయం ధ్వనిస్తుంది.[4]

వీరి కావ్యభాషలో ఇటు నవ్యతాప్రీతి, అటు వైదిక సంప్రదాయాభిమానమూ రెండూ మిళితమయ్యాయి. సామాన్య జనవ్యవహారంలో ఉండే చిన్న చిన్న పదాలను, లోకోక్తులను, సామెతలను కలిగిఉండి తెలుగు నుడికారాన్ని సజీవంగా ప్రత్యక్షం చేస్తుంది వీరి భాష. అటు వైదిక సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన పదజాలంలో వైదిక వాతావరణాన్ని చూపుతుంది. కనుకనే వీరి శైలి ఒకసారి చాలా సరళం

---

1. 'ప్రహ్లముడి' - మిశ్రమంజరి - P 129
2. 'రామలింగారెడ్డి' - ఆంధ్రావళి P 56
3. 'విజయదశమి' - మిశ్రమంజరి P 73
4. మరికొన్ని ఉపమానాలు ఒకటవ అనుబంధములో చేర్చబడ్డాయి.

గానూ కనబడుతుంది. మరొకసారి అతి గంభీరంగానూ కనబడుతుంది. దానిలో పద లాలిత్యమూ ఉంది, పద గాంభీర్యమూ ఉంది. ఆ రెండు లక్షణాల విచిత్ర సమ్మేళనం వల్ల వీరి శైలికి, కావ్యభాషకు ప్రత్యేకత చేకూరింది.

వీరి కావ్యభాషకు కొత్తదనాన్ని చేకూర్చిన వాటిలో పదబంధాలు ప్రముఖమైనవి. వీటిలో కొన్ని వ్యాకరణనియమాలకు అందనివి కూడా ఉన్నాయి. వ్యాకరణనియమాలకంటె శ్రవణసుభగత్వానికే అధికప్రాధాన్యమిచ్చే సుబ్బారావుగారు [1] వ్యాకరణశాస్త్రరీత్యా దోషాలయినవాటిని కూడా స్వేచ్ఛగా ప్రయోగించారు. ఎటువంటి పదబంధాలయినా వీరి శైలీవైశిష్ట్యంవల్ల ఆ సందర్భంలో కలిసిపోయి ఎంతో సహజంగా ఉంటాయే కాని ఎబ్బెట్టుగా ఉండవు.

..... 'మధుమాసపు కన్నె యెండలో
ఎలమావిచ్చురి లేటు నీడలన్
పసుపాడిన నిమ్మ చెంగటన్
వయసాకిన మావి పొత్తునన్

---

1. వతలకే వృత్త పదమ్ముదు బంధమెందు
నవ్యము రసవద్వాక్య సంధానమందు
సంధులు విసంధులైనను, సాంస్కృతములు
దేశ్యములు లోడ సమసించి తీపె గాని.
... శ్రవణసుఖంబు పాయదేని
అవికళంబు తీ భంగిమ నాకునికుల.
రమ్యాలోకము . P 25

ఎల కోయిల కూయ నేర్పగా
పసి తెమ్మెర సేద తీర్పగా
మనసాపని పచ్చిముచ్చటల్
తనివారగ చెప్పుకొందమో.[1]

ఈ సందర్భంలో దాదాపు ప్రతిపాదంలో ఒక కొత్త పదబంధం ఉన్నా ఆ పద్యపు నడకకు అవి ఎంత అందాన్ని కలిగిస్తున్నాయి.

జ్ఞాపకాసోపానములు, చాతక మునియతి, పచ్చిపరువు పదాలు, కాపు వేబడతుక, కలికి నట్టింట, వాఙ్మయ కుముదము, చిత్తబలము, రాబాటలు, పూలపిండి, సానాసుఖాలు, కైకానలు, ప్రసన్నమనస్సు, అరసంజె, చిత్తభిత్తిక, మందుశోకము, బిల్లిననవ్వు, లజ్జాలతికలు వంటి అరుదైన పదబంధాల నెన్నిటినో వీరి రచనల్లో చూడవచ్చు.[2] వెకలకు మిక్కిలిగా కనబడే వీరి పదబంధాలలో కొన్ని తదనంతరకవుల ప్రయోగాలలో స్థిరపడి పోయాయి. పూలసంకెళ్ళు, వలపువాకిలి, సెలయేటిపాట, మబ్బుల ముసుగు, వెండితెర, చూపుల వల, చూపుల గాలం, భావదాస్యము, వలపుటుచ్చు, నవ్వుపువ్వు వంటివి అధికప్రచారం వల్ల రాయప్రోలు వారి నూతనప్రయోగాలా అనే సందేహాన్ని ఈనాడు కలిగిస్తున్నాయి.

నిత్యవ్యవహారానికి సన్నిహితమైన సజీవభాష వీరి కావ్యాల్లో కనబడుతుంది. ప్రసిద్ధమైన సామెతలు, లోకోక్తులు నానుడులు ప్రయోగించి తెలుగుభాష వన్నె తగ్గకుండా ప్రదర్శించారు.

---

1. 'పరవే చెలి' - వనమాల P 30
2. ఇటు వంటి మరికొన్ని పదబంధాలు ఒకటవ అనుబంధంలో ఇవ్వబడ్డాయి.

'మ్రొగమున్న వేసితిమి, వచ్చెందాలటె ఓ భామా!, ఏటికి గుంజాటునన్, దేవతల కండ్లకు గట్టెను, కాండ్రయొకెడ నఖండదీపము' వంటి ప్రయోగాలలో తెలుగు నుడికారపు సొంపు స్పష్టం అవుతుంది. 'దశత్రింశల్లక్ష జనప్రసన్న రసనా దేవాలయాభ్యంతర ప్రాంచు ప్రార్థన గీతము' వంటి సుదీర్ఘ సమాసాలు చాలా అరుదుగా కనబడతాయి. అధిక భాగం వీరి శైలి సరళ సుందరంగా గోచరిస్తుంది.

వీరి కావ్యభాషలో వైదిక పదాలు అడుగడుగునా ప్రత్యక్షం అవుతాయి. రచనలలో అతి విస్తారంగా కనబడే వైదిక పదజాలం వీరి సంప్రదాయాభిమానాన్ని సూచిస్తుంది. ఈ పదజాలం వారి భాషకు భావానికి ఒక విధమైన సౌందర్యాన్ని, గాంభీర్యాన్ని చేకూరుస్తున్నది. వైదిక పదప్రయోగం వైదిక విషయాలలో వారి అభినివేశాన్ని ప్రదర్శించడమే కాక కావ్యగత విషయానికి ఒకవిధమైన పవిత్రతను సహితం ఆపాదిస్తోంది. ఈ పదాలను సాధికారంగా ప్రయోగించడం వీరి ప్రత్యేకత.

వీటిలో కొన్ని వైదిక కర్మలతో సంబంధం కలవి, కొన్ని వైదిక సాహిత్యానికి చెందినవి. పుణ్యాహవచనం, ప్రతిష్ఠాపనం, అభిషేక మంగళ క్రతువు, ఉపాసన, పూర్ణాహుతి, అభిఘరించడం లాటివి కర్మలకు సంబంధించిన పదాలు. ఈ పదాలను వారు ప్రయోగించడంలో ఒకవిధమైన సౌలభ్యం కనబడుతుంది. అవలీలగా ఇతర పదాలతో కలిపి వాటిని సుబ్బారావుగారు ప్రయోగిస్తుంటారు.

---- 'ప్రేమారాధన మాచరింతు లలితార్తి స్వేద లీలాదశన్
కామారార్చణమంచు బాష్పకణ ముక్తామాలికన్ త్రిప్పుచున్.'[1]

---

1. స్వప్నకుమారము. P22

'నే నాము జపమాల నిష్ఠలో త్రిప్పితిమి'.[1]

'భవభ్యావ్యతంత్రన్ పుణ్యాహవాచన పారాయణా'[2]

'స్వతంత్రోదయామ భవఘ్నంబు'.[3]

ఈ విధంగా ఆరాధనం, జపం, పుణ్యాహవాచనం, పారాయణా, ఉపాసన, క్రతువు, అవభృథం వంటి వైదిక కర్మల పదజాలాన్ని శైలీభంగం కాకుండా ధారావాహికంగా ప్రయోగించడం రాయప్రోలు వారి ప్రత్యేకత. ఇటువంటి కర్మలకు సంబంధించిన పదజాలమే కాక నీవారాగ్రము, వరేణ్యులు, పారణా ముచ్చిచ్చు, దక్షిణాగ్ని, హవిర్భాగం, ఆనందవల్లి, దీక్షితుడు, సోమామృతం వంటి ఎన్నో వైదిక శబ్దాలు వీరి సాహిత్యంలో ప్రత్యక్షమవుతాయి. వైదిక సాహిత్యానికి, సంస్కృతికి, సంప్రదాయానికి సంబంధించిన ఇటువంటి పదాల ప్రయోగాన్ని ఈ విధంగా చూడవచ్చు.

'దేశ ఋణమును...... తీర్పగలిగిన దీక్షితుడనని తెలిసి తెలిపే సమయమోయ్'.[4]

*'మూడు వన్నెలను ముచ్చిచ్చులుగా'[5]..

---

1. 'పతాకజయంతి' - ఆంధ్రావళి - P 96

2, 3 'ఆంధ్ర నవమి' - మిశ్రమంజరి - P 10

4 భద్రయాత్ర - మిశ్రమంజరి - P 25

5. భద్రయాత్ర - మిశ్రమంజరి - P 21

* గార్హపత్యము (పిత), దక్షిణాగ్ని (మాత), ఆహవనీయము (గురువు)

'పితా వై గార్హపత్యోగ్నిర్మాతాగ్నిర్దక్షిణః స్మృతః
గురురాహవనీయస్తు సాగ్నిత్రేతా గరీయసీ'. (మనుస్మృతి 2-231)

సంకేత పదకోశము - సంపాదకుడు: R. శ్రీహరి - P 13 లో ఉల్లేఖించబడింది.

...'శబ్దదర్శనపటిష్ఠుల తపోవరేణ్య వైలక్షణ్యములన్.'

....'కవిత బ్రహ్మానంద కామ్య క్రతు ఫలార్థమావిష్కృతంబది.'[2]

'సామము సోమము గ్రావిరి
సోమము స్వర్లోక కాంక్ష సుధియగ మన మా
తామహ పితామహ ప్రపి
తామహు లానందవల్లి తలిరింప సుధీ!'[3]

ఈ విధంగా వీరికి వైదిక వాఙ్మయంలో ఉన్న సంబంధాన్ని, అభిమానాన్ని చూపే సందర్భాలెన్నో వారి కావ్యాలలో కనబడతాయి.[4] ఇటువంటి పదాలనే

---

1. మాధురీ దర్శనమ్. P 10
2. నవరాత్రి - మిశ్రమంజరి - P 72
3. మాధురీ దర్శనమ్. P 13
4. 'అభినవ శ్రీచక్రమభయ ముద్ర వహింప భద్రపద పుణ్యాహవాచనము శ్రుతి నింప.... తుంగభద్రా పూర్ణమంగళోదకములతో సానినది 'నీరాష్ట్ర సంప్రతిష్ఠాపనము'... ('ఆంధ్రాభిషేకమ్'- మిశ్రమంజరి).
అనంత భూతంబులలో దాగిన ప్రణయ మధుమహావిర్భాగము'... ('ఫాల్గుని'. వనమాల)
'కామకోటి పీఠాధిప స్వామి అయిన అతను నభిషేక మంగళ క్రమువు నందు' - ('ఫాల్గుని'- వనమాల)
'అంతఃకరణమందు ఆనందవల్లినే పూయించి కాయించి పూర్ణక్రమువు పన్నె'- ('ఈ గీతము'- వనమాల)
'స్వీకరింపుమయ్య కన్నబిడ్డ ఇచ్చుకడసారి వందనంబు నీశ్వరార్పణం బటంచు'- (సింహాలత)

కాక మంత్రశాస్త్రానికి, తంత్రశాస్త్రానికి వేదాంతానికి సంబంధించిన పదాలను కొన్నిటిని వీరు ప్రయోగిస్తుంటారు. అటువంటి పదాలు సామాన్యులకు వ్యవహార ప్రసిద్ధమయిన సాధారణార్థంలో అవగాహన అవుతుండగా తాంత్రిక సంప్రదాయాల నెరిగినవారికి, మంత్రశాస్త్రంలో పరిచయం ఉన్నవారికి, వేదాంతవిదులకు వాటిలో విశేషార్థం స్ఫురించే అవకాశం ఉంది. అవి కొన్నిచోట్ల సాధారణార్థంలోనూ కొన్నిచోట్ల తాత్త్వికార్థంలోనూ కూడి ఉంటాయి. కొన్ని సందర్భాలలో రెండు అర్థాలూ సమన్వయిస్తాయి. విశేషార్థ స్ఫూరకాలయిన ఇటువంటి పదాలలో ఉదాహరణకు 'ఆనంద', 'అమృత' శబ్దాలను గ్రహిస్తే ఈ విషయంగా కనబడుతుంది.

లౌకికమైన సుఖసంతోషాలకు సంబంధించిన మానసిక స్థితికి ఆనందం అన్న శబ్దం వ్యవహారంలో ఉంది. ఇంతేకాక ఈ శబ్దం పారలౌకికమైన పరమానంద స్ఫూరకంగా చిదానందం, సచ్చిదానందం, బ్రహ్మానందం వంటి రూపాలలో తాత్త్వికంగా ప్రసిద్ధి పొందింది. 'ఆనందో బ్రహ్మ' అంటూ ఆనందమే బ్రహ్మంగా చెప్పబడినపుడు దానికి లౌకికమైన వస్తుగతమైన ఆనందం కాక ఆధ్యాత్మిక విషయగతమైన ఆనందం పరమార్థం. ఆనందమే తానుగా తానే ఆనందంగా అద్వైతస్థితిని పొందడమనే పరమోన్నతస్థితిగా బ్రహ్మానందాన్ని ప్రాచీనులు భావించారు. రాయప్రోలు వారు

---

(contd.)

'ఈ దక్షిణాగ్ని కలుషితాచారములు కాల్చివెలుగ గాక' (స్నేహలత)

'మాధుర్యోపాసకులయిరి సుకవులిర్వురయు' (మాధురీ దర్శనమ్)

ప్రేమ మంత్ర మహోపాసనా మయులకు నవ్యులకు ... (రమ్యాలోకము)

చేతమా కుసుమాభిషేకము తెనుగు సంపెగ సామికిన్ (కన్నెపాటలు)

చేరగ జాతకములు రసపారణకయి (మాధురీ దర్శనమ్)

'మనుజు డానంద సోపానముం డెలములు
అధికమయింది అధికమయింది అలసిపోయె?'[1]

అని అన్నప్పుడు మానవుడు సుఖసంతోషాలను పొందడానికి అనాదిగా కృషి చేస్తున్నాడనీ, శ్రమిస్తున్నాడనీ దానిలో అలసిపోతూ కూడా నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాడనే అర్థం చెప్పుకోవచ్చు. సామాన్యుడయిన మానవుడు ఒక ఆనందాన్ని అనుభవించిన తరువాత దానికంటె మిన్నయిన మరొక ఆనందాన్ని పొందాలని వాంఛిస్తాడు. దీనివల్ల అతడు పొందిన ఆనందం తాత్కాలికం కూడా అవుతుంది. అది చివరికి దుఃఖరూపమయిన వికారం కూడా పొందే అవకాశం ఉంది. కాబట్టి ఆ ఆనందం అసంపూర్ణం. ఈ విధంగా ఒకదాన్ని మించిన మరొకదాన్ని పొందాలనే కోరికవల్ల వీటిని మెట్లుగా 'ఆనంద సోపానములు' అన్న పదానికి అన్వయించుకోవచ్చు.

తాత్త్వికంగా ఆలోచించినపుడు 'ఆనందం' అనగానే తైత్తిరీయోపనిషత్తులోని బ్రహ్మానందవల్లి స్ఫురిస్తుంది. అక్కడ మనుష్యుడు, గంధర్వుడు, పితరుడు, ఆజానజుడు, కర్మదేవుడు, దేవుడు, ఇంద్రుడు బృహస్పతి, ప్రజాపతి, బ్రహ్మముల ఆనంద వైశిష్ట్యం ఒకదానికంటె మరొకటి అధికమంటూ చెప్పి బ్రహ్మానందం సర్వోత్తమంగా నిరతిశయ సుఖస్వరూపంగా చెప్పబడింది.[2] పరమానంద స్వరూపమైన బ్రహ్మానందం శాశ్వతమయింది. పొందే వ్యక్తి, పొందడం, పొందబడేది అన్న త్రిపుటి లేని అద్వైతస్థితి అది.

ఆనందం - విషయానందం, ఆత్మానందం, అద్వైతానందం నిజానందం, ముఖ్యానందం, బ్రహ్మానందం , వాసనానందం, విద్యానందం అని

---

1. అర్థమాలలు - వనమాల P 43
2. బ్రహ్మానందవల్లి - అష్టమానువాకం.

విశ్లేషింపబడింది. దీనిలో కూడా భాగవస్తుజ్ఞానమే లేని విద్యానందం పరమోత్కృష్టమయింది! ఈ భావాలను గ్రహించినపుడు పై ఉదాహరణకు

---

1. " సాత్త్వికస్థితియందు బ్రహ్మభావము కల్గినప్పుడు కలుగు మానసికసుఖము విషయానందమగును. సమాధిస్థితియందు కలుగు సంవృత్తి ఆత్మానందమగును. ఇది ఆత్మసాక్షిమాత్రమనెడి భావంబు కల్గుట వలన జనించు సుఖరూపముగా నున్నది. భోక్తృ భోగ్య రూపములైన ద్వైతభావంబులేని స్థితిని సాధించునపుడు కల్గు సుఖము అద్వైతానందమగును. ప్రారబ్ధ కర్మఫలములైన సుఖదుఃఖంబులకు దూరమై సమత్వస్థితిలో నున్నపుడు కలుగు సుఖము విద్యానందమగును. అహంకారవాసనలు నశించుట వలన నుండు సుఖము ముఖ్యానందము. బ్రహ్మజ్ఞానము వలన కలుగు ఫలము బ్రహ్మానందము. అలసిన బాటసారి యొకానొక సత్రమును చేరి సుఖముండునట్లుగా జీవుడు జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలందలి క్లేశములను విసిగి బ్రహ్మమును చేరి శాంతించును. వాసనానందమనగా ప్రారబ్ధకర్మఫలముగా ఆనందమయము నుండి విజ్ఞానమయమునకు పోవునప్పుడు కల్గు బ్రహ్మానందాభాసమనవచ్చును. ఆనందభోగము విద్యానందమగును. ఇందు భాగవస్తుజ్ఞానమే యుండదు. దీనినే నిర్వికల్ప సమాధి యందురు. ఇందు అనుభూతమగునది తృప్తి గాదు. సంతోషము గాదు. సుఖము గాదు. కేవలానందము గాదు. వస్తుమొకటియే యగును."

'నారద భక్తి సూత్రములు'- అనువాదకుడు : దాట్ల వేంకట రామిరెడ్డి
-P 60

ఈ విధంగా అర్థం చెప్పుకోవచ్చు. అఖండమూ, అద్వైతమూ శాశ్వతమూ అయిన ఆనందాన్ని పొందడానికి మానవప్రయత్నంగా మనుష్యుడు కృషి చేస్తున్నాడనీ; అన్యులోన్నతమైన ఆనందాలను పొందే ఆధ్యాత్మిక చింతనలో వాటిని అధిగమించే ప్రయత్నంలో మానవుడు అలసిపోతూ కూడా ముందుకు సాగుతున్నాడనీ అన్వయం చేసుకోవచ్చు. 'ఆనంద'పదంలో దివ్యానందస్ఫురణను గ్రహించవచ్చు.

'కర్మలమృత భాగ్యానుభవమున కలుగుచునుండె'[1] 'అమృత స్వరూపాచ' అని నారదునిచే భక్తి అమృత స్వరూపంగా భావింపబడింది.[2] 'అమృతాబ్ధి మహాశక్తి సంవృతా' అని లలితాదేవి స్తుతింపబడింది. ఆ దేవిని పరివేష్టించి ఉండే షోడశ పత్రదళాలలోని షోడశ శక్తులలో అమృతాశక్తి కూడా ఒకటి. ముక్తి, కైవల్యం, అపవర్గపదాలకు పర్యాయపదంగా తాత్త్వికార్థంలో అమృత శబ్దప్రయోగం ఉంది. అమృత శబ్దానికి ఉన్న నానార్థాలలో[3] 'ముక్తిః కైవల్య నిర్వాణ శ్రేయ సామృతాః' అంటూ మోక్షార్థం కూడా ఉంది. మధురమనీ, సుధ అనీ, శాశ్వతమనీ దానికి సాధారణార్థాలు. పై ప్రయోగంలో 'కర్మలమృత భాగ్యానుభవమునకలుచు నుండె' అని అన్నపుడు మధురమైన భాగ్యానుభవమనీ, శాశ్వతమైన భాగ్యానుభవమనీ, కైవల్యభాగ్యానుభవమనీ చెప్పుకోవచ్చు. పురాకృత కర్మఫలం లౌకిక సుఖసంతోష భాగ్యానుభవంగానూ ఉంటుంది, కైవల్యప్రాప్తికీ కారణమవుతుంది. కాబట్టి ఇక్కడ అమృత

---

1. 'ఎవరు' - అంత్రావళి. P 119
2. 'నారద భక్తి సూత్రములు' - 3వ సూత్రం
3. "'అమృతం వారి సుర మోక్షద్రావణే చూలి సుందరే అయాచితే యజ్ఞ శేషే పుంసి ధన్వంతరౌ భావే దివి వ్యాధిః" - అమరకోశం. P 760

శబ్దానికున్న ధాత్వర్థమూ స్ఫురించే అవకాశం ఉంది.

ఈ విధంగా వీరు ప్రయోగించిన రమ్య, మాధురి, కల్యాణ శివ, సుధార్ణవము వంటి శబ్దాలలో కూడా ధాత్వర్థాలు ఇమిడి ఉన్నట్లు కనబడతాయి. దేవీ ఉపాసనా, వైదిక సాహిత్యం మీద గౌరవం, లలితా సహస్రనామ పారాయణ, సౌందర్యలహరి, దేవీపంచశతి వంటి రచనల పట్ల అభిమానం ఉండడం వల్ల ఇటువంటి పదాలు అప్రయత్నంగా దొర్లుతూ ఉంటాయి.

ఇక రాయప్రోలు వారి రచనలలోని ఛందోరీతులను పరిశీలించినపుడు అధికభాగం సంప్రదాయబద్ధమైన వృత్తాలనూ, జాత్యుపజాతులనూ స్వీకరించడం కనబడుతుంది. సంప్రదాయానుసారం యతి ప్రాసాది నియమాలను పాటించిన సందర్భాలే ఎక్కువ. అయితే ఛందోవిధానంలో కూడా అక్కడక్కడా కొంత విశిష్టతను చూపించకపోలేదు.

వినసొంపుగా ఉండి పాటకు అనుకూలంగా ఉండే శంకరాచార్యుల వారి భజగోవింద శ్లోకాలు వీరిని ఆకర్షించాయి. ఆ ఛందస్సు మీది అభిమానంలో అదే రీతిలో సుందరకాండ నంతటినీ అనువదించారు. అదే విషయాన్ని-

"తల్లిపాలవలె తనివో త్రావిన
రాయప్రోలు గీరాత్మమునికి వల
పించె, ధేనువును దేవీ గీతవలె
భగవత్పాదుల 'భజగోవిందము'
వినసొంపయి పాడను వాటమి యగు
ఛందోరీతి చరణాల కించితము
అనుకరింపగా తెనుగు వేలె యగు

శ్రుతి చేసితిన్ రుచి రుచి మతమ్ము.[1]

అంటూ సుందరకాండ ప్రారంభం లో చెప్పారు.

'పదవే చెలి కాళ్ళ గజ్జియన్
రవళింపగ వెదుళ్ళ పల్లికిన్.'[2]

అనే ఖండికను సంస్కృతం లోని 'వియోగినీ' వృత్త ఛందస్సులో వ్రాశారు. మాత్రా ఛందస్సులాగా లయబద్ధంగా గేయరూపంగా నడవటం వల్ల ఈ వృత్తపు నడక వీరిని ఆకర్షించి ఉంటుంది. రాయప్రోలు వారు ఈ ఖండికలో యతి నియమాన్ని పాటించారు.

ప్రాచీన ఛందస్సులోని పద్యాలలో కాని సందర్భాలలో వీరు ప్రాస నియమాన్ని పాటించలేదు. 'చిగురుల పూవులన్ దరహాసింతువు'[3] అనే చంపకమాలా వృత్తాన్ని ఆరు పాదాలలో వ్రాశారు. 'సతమున్ ధేనువ కాండవాటి నిజవాసంబందు'...[4] అనే మత్తేభ వృత్తాన్ని ఐదు పాదాలలో వ్రాశారు.

'ఆ మహాకవి వాల్మీకి కతల చెప్ప
దే నాకటు ప్రతిభా సంపన్మయుస్వాధీన
ఏకదానం తన్మయత్వమై తపిస్తు.'[5]

అనే తేటగీతిని మూడు పాదాలలోనే వ్రాశారు. 'తెనుగుతోట' లో తేటగీతి

---

1 సుందరకాండ - P. 6,7

2. వనమాల - P30

3. వనమాల - P15

4. వనమాల - P39

5. జడకుచ్చులు - P160

పాదనియతిని పూర్తిగా ఉల్లంఘించారు. ఆ పద్యాలకు వారి భావసంపూర్తిని అనుసరించి పాదనియతి ఏర్పరచుకున్నట్లు కనబడుతుంది. రెండు, మూడు ఐదు, ఆరు, ఏడు పాదాలలో ఉన్న తేటగీతి పద్యాలిందులో కనబడతాయి.

మత్తేభ వృత్తరచనలో యతి ప్రాసలను ఉద్దేశ పూర్వకంగా వదలి 'దూత మత్తేభము'ను వ్రాశారు. దీనిని గూర్చి రాయప్రోలు వారు 'నా రచనలన్నీ యతిప్రాసలలోనే సంవృత్తమయినవి. కాని ఈ కావ్యములో మొట్టమొదటి పద్యం యతిప్రాసలు లేకుండా ఉన్ముక్తమయింది. రెండు, మూడు పద్యాలు అలాగే నడిచినవి. ఆ పయిన యతి ప్రాసలను నియతముగా పాటించక వ్రాసితిని. ఆలంకారికులు ఎవరునూ రసాధికరణ విచారణలో యతిప్రాసల ప్రసక్తి తడవలేదు. కాగా పద్యరచనలో వాటిని వదిలిపెట్టితే ఏదో లోపము కనిపించవలెను. లేదా వికృతము కావలెను..... అది యేమిటో తేలుచుండవలెనని తలంచుకొంటిని..... మేఘదూత... వంటి కృతిని సంయమముతో, శ్రద్ధాసక్తులతో తెనుగులోనికి, యతులను వదలి, ప్రాసల కోసం ప్రయాసపడక తీసుకొనివస్తే ఎలా పరిణమిస్తుంది? ..... అని మథన పడ్డాను. కృతిని ఈ రీతిలోనే మెలచి రసజ్ఞుల ముందుంచితే వారే ఓగాములు తేల్ప గలరని మనకు ప్రకటించితిని'.[1] అని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మాత్రా ఛందస్సును పయోగించి చాలా గేయాలను వీరు వ్రాశారు. మాత్రాగణాలను ప్రయోగించేటప్పుడు సర్వసాధారణంగా నియతమైన మాత్రలలో విరిగే పదాలనే ప్రయోగిస్తారు. కాని మాత్రల సంఖ్యా పూర్తి కావడానికి తరువాతి పదంలోని ఒకటి రెండక్షరాలను కలుపుకొని పదం మధ్యలో విరవడం చాలా తక్కువ సందర్భాలలో కనబడుతుంది.

---

1. దూత మత్తేభము - ఆముఖము

మాత్రాఛందో రచనలలో చాలావరకు అన్ని సందర్భాలలోను యతినియమం విధిగా పాటించారు. ఈ యతి విషయంలో మొదటి అక్షరానికి మైత్రి ఉన్న ఇతర అక్షరాలను ప్రయోగించడానికి అవకాశం ఉన్నా కూడా అదే అచ్చుగాని, అదే హల్లుగాని ప్రయోగించడం ఎక్కువ సందర్భాలలో కనబడుతుంది. ఇవి గేయాలలాగా పాటకు వీలయిన రచనలు కావడం వల్ల ఈ విశిష్టమైన అక్షర పునరుక్తి ఒక గమకాన్ని ఇచ్చింది.

"నవరసమ్ములు నాట్యమాడగ
చివురు పలుకులు చెవుల విందుగ
కవితలల్లిన కాంత హృదయుల ...."[1]

అనే సందర్భంలో న-నా; చి-చె; క-కాం అనే విధంగా ఒకే హల్లును ప్రయోగించడం లయవిన్యాసంలో సొంపు చేకూరుస్తున్నది. కొన్ని రచనలలో చివరి పాదంలో చివర ఒకటి, రెండు మాత్రలను తగ్గించి వ్రాశారు. ఇలా ఉద్దేశ పూర్వకంగా మాత్రలను లోపింపచేసి గతిగమకాన్ని సాధించారు. ప్రాసను గాని, అంత్యప్రాస నియమాలను అంతగా ఈ ఛందోరీతులలో పాటించినట్లు కనబడదు. కాని యతిని ఉల్లంఘించ లేదని చెప్పవచ్చు.

మూడు మాత్రలు నాలుగు మాత్రలలో 3+4; 3+4 - మొత్తం 14 మాత్రల పాదాలు మూడు, చివరి పాదంలో 3+4; 3+2 మొత్తం 12 మాత్రలు (చివరి పాదం చివర 2 మాత్రలు లోపం)లో, 8 వ మాత్ర యతిగా పాటించి దేశిఛందోరీతిలో చాలా గేయాలు వ్రాశారు.[2] 'తెమ్మెరా', 'ప్రభాతం', 'యాత్ర'

---

1. 'తెమ్మెరా' - ఆంధ్రావళి - P 27
2. ఇవి ముత్యాల సరాలకు సన్నిహితమైనవి.

'మాంచాల', 'శ్రీరవ్యాక్', 'శుభమ్', 'ఆషాఢి', 'ఫాల్గుణి', 'త్యాగరాయస్వామి', 'మంగళ మాఘమ్', 'ఉగాది', 'సంక్రాంతి సంబరము', 'బ్రహ్మముడి', 'నవరాత్రి' వంటివి ఈ విశిష్టమైన ఛందస్సులో వ్రాసిన రచనలలో ప్రముఖమైనవి.

నాలుగు మాత్రల గణాలలో పదహారు మాత్రల పాదాలలో నడిచిన ఖండికలు 'మన్మథాహ్వాన', 'ఉత్కంఠ' వంటివి. వీటిలో తొమ్మిదవ మాత్ర యతిస్థానంగా పాటింపబడింది.

'నీ సిగపూల సువాసన లలికల
స్నేహ కుటీలములు భామా - ఇటు
చెలుగును వీధుల, భామా'[1]

ఇక్కడ మొదటి పాదం పదహారు మాత్రలలో వ్రాసి రెండోపాదంలో రెండు మాత్రలు లోపింపచేసి మూడోపాదంలో మరి రెండు మాత్రలు (మొత్తం నాలుగు మాత్రలు) తక్కువ చేసి వ్రాశారు.

ఐదు మాత్రల గణాలలో పాదానికి ఇరవై మాత్రల నుంచి 'శ్రీ శివశంకర శాస్త్రి', 'సాగరి సాగరా', 'హాయిలే', 'మీరాదేవి గేయము' అవసాన సమర్పణ వంటి రచనలు చేశారు. 'శ్రీ రవీంద్ర కవి', 'శ్రీమతి సరోజినీ దేవి' వంటివాటిలో చివరి రెండు మాత్రలు తగ్గించారు. 'హాలి'లో ప్రతిరెండో పాదంలో చివరి మాత్రను లోపింప చేశారు. ఐదు మాత్రల గణాలనే వాడుతూ పాదానికి పదిమాత్రలే ఉంచి నాలుగు పాదాలలో 'శ్రీ రాధాకృష్ణ మహోదయులకు' వ్రాశారు.

చివరలో పది మాత్రల పాదాలు మూడింటి తరువాత నాల్గవ పాదం 20 మాత్రలలో వ్రాశారు. 'ఈ గీతము' లో ఇరవై మాత్రల

---

1. 'సరాగం' - మిశ్రమంజరి - P 137

పాదాలు నాలుగు, పది మాత్రల పాదాలు నాలుగు చొప్పున వ్రాశారు. 'పాలబాస' 'స్త్రూకవయంతి'లో ఇరవై మాత్రల పాదాలే కాని మూడు పాదాలే ఉండేట్లు వ్రాశారు.

'ఊరి కావల చెరువులో నీరు తెత్తురు నిరతమున్
చారు సంపెలు మెరయగా పల్లెపడుచులు కడవలన్'[1]

అనే రచనలో 3 + 4 + 5 = 12 మాత్రాగణాలను అదే క్రమంలో వాడారు. ప్రతిపాదంలో 12 మాత్రలు తరువాత 13వ మాత్రను యతిగా పాటించారు. మిశ్రగతిలో 3 + 4 మాత్రల గణాలలో ప్రాయికం ఎక్కువగా వాడుకలో ఉంది. ఇలా మూడు రకాల గణాలను కలిపి వ్రాయడం ఒక విశిష్ట ప్రయోగంగా కనబడుతుంది. దీని వల్ల ప్రత్యేకమైన నడక గేయానికి ఏర్పడింది.

ఈ రకంగా రాయప్రోలు వారి ఛందోరీతులలో విశిష్టత కనబడుతుంది. ఈ ఛందో విధానం గతికమకాన్ని, లయవిన్యాసాన్ని సాధించగా భాష, భావాలు, భావాభివ్యక్తి వంటి విషయాలలో వీరి ఉక్తివైచిత్రి కవిత్వానికి నూతనత్వాన్ని చేకూర్చింది. వీరి కావ్యాలను పరిశీలిస్తే నూతనత్వంతో పాటుగా ప్రముఖంగా కనిపించే మరొక ప్రధాన లక్షణం తెలుగుదనం.

---

1. 'పల్లెపడుచు' - మిశ్రమంజరి P 140.

# తెలుగుదనం

# రాయప్రోలు వారి రచనలలో తెలుగుదనం.

రాయప్రోలు వారు తెలుగుభాష అన్నా, తెలుగుదేశం అన్నా, తెలుగుప్రజలన్నా పొంగిపోతుంటారు. తెలుగంటేనే పరవశం పొందే వీరి హృదయపు పులకింత తెలుగుదనంగా వీరి కవితల్లో ప్రత్యక్షం అవుతుంది. తెలుగుతల్లి వీరి ఆరాధ్య. తెలుగు కవులు అభిమానులు. తెలుగుభాష అమృతతుల్యం. కనుకనే తల్లినుడి కంటె పరమామృతం లేదనే[1], భాష కంటె నవ్యనలకు తపస్సు లేదనే[2] అన్నారు

'ఏ ప్రఫుల్ల పుష్పంబుల నేర్వరునను
పూజ సల్పితినో ఇందు పుట్టినాను
కలదయేని పునర్జన్మ కలుగుగాక
మధుర మధురంబయిన తెనుగు మాతృభాష.'[3]

జన్మజన్మలకూ తెలుగునే మాతృభాషగా పొందాలనేది వీరి ఆకాంక్ష. తెలుగుదేశంలో జన్మించడం అభిమతం. వారు ఇంతగా అభిమానించిన తెలుగుభాష తియ్యదనాన్ని కవితల్లో చాటిచెప్పారు. మాధుర్యపు అనుభూతి ఎవరికివారు చవిచూడ గలిగింది. మాటలలో ఎదుటవారికి వ్యక్తం చేయడం కష్టం. అటువంటి మాధుర్యాన్ని రసవత్తరంగా

"వంశీ వంచి మృణాళముల్ మెలచి పక్వద్రాక్ష నెండించి, వా
గంశల్ మార్దవ మాధురీ సుభగ విన్యాసంబు జిల్కన్ దశ

---

1,2 రమ్యాలోకము P 7

3. రమ్యాలోకము P 6

త్రింశల్లక్ష జనప్రసన్న రసనా దేవాలయాభ్యంతర

ప్రాంశు ప్రార్థన గీతమైన తెనుగుంబల్కున్ ప్రశంసించెదన్."[1]

అని తమ శబ్దప్రయోగ కళాకౌశలంలో, శైలీ వైశిష్ట్యంలో సాహిత్యపిపాసువులకు చవి చూపారు. మధురమయిన తెలుగుభాష దేశభాషా ప్రకాశ వీథికలలో తేనె లొలుకుతూ విరాజిల్లుతోందని వీరి ఉద్దేశం.[2] పాటకు, పద్యానికి అందంగా అమరే ఆంధ్రభాషపై వీరికి అంతులేని అభిమానం. నిసర్గ మోహనమయిన పలుకుబళ్ళతో దేశస్థుల వ్యవహారంలో సజీవంగా నిలిచిన తెలుగుభాష వీరికి అత్యంత ప్రీతిపాత్రం. వీరు ఆదరించిన ఈ భాష వీరి రచనలలో తెలుగుదనానికి సజీవరూప కల్పన చేసింది.

వీరి రచనల్లో వర్ణించబడిన తెలుగుదేశ ప్రకృతి సౌందర్యం, తెలుగింటి పరిసరాలు, ప్రజల జీవన విధానం, భోజనపు అలవాట్లు, స్త్రీల కట్టుబొట్లు, నోములు వ్రతాలు, పండుగలు వేడుకలు, ఆటపాటలు మొదలయినవి తెలుగుదనాన్ని సంతరించుకున్నాయి.

నేలతీరు, నీటి వసతులు, శీతోష్ణస్థితులను బట్టి కొన్నికొన్ని ప్రాంతాలలో కొన్నికొన్ని పంటలు, పైర్లు అభివృద్ధి పొందుతాయి. కవులు వర్ణించిన చెట్లు చేమలు, పంటచేలు, పండ్లతోటలు మొదలయిన వాటిని బట్టి అవి ప్రసిద్ధంగా, విస్తారంగా ఉండే ప్రాంతాన్ని కొంతవరకు గుర్తించే అవకాశం ఉంది. రాయప్రోలు రచనలను పరిశీలిస్తే తెలుగుదేశపు ప్రకృతిసంపద ప్రత్యక్షం అవుతుంది. కవులు పుట్టిపెరిగిన పరిసరాలు కవితలో ప్రతిబింబించడం సహజం. సుబ్బారావుగారి రచనలో తెలుగుదేశంలోని గుంటూరు,

---

1. తెనుగు మాన్యము - ఆంధ్రావళి - P 39

2. రమ్యాలోకము - P6.

బాపట్ల, వేదుళ్ళపల్లి ప్రాంతాలు కనులముందు కదలాడుతాయి. ముఖ్యంగా వేదుళ్ళపల్లి పరిసరాలు వీరిని అధికంగా ప్రభావితులను చేసినట్లు తోస్తుంది." బాపట్ల, స్టువర్టుపురం మధ్య ఇసుకదిబ్బల మధ్య వేదుళ్ళపల్లి ఉన్నది. ఆ పల్లె పరిసరాలు, ఆయన కవితను - ముఖ్యంగా తృణకంకణాన్ని ఎట్లా ప్రభావితం చేసినవో చెప్తూ వినండి.... వేదుళ్ళపల్లె ప్రయాణం నాకు సుబ్బారావు కవితా భూమికను (Background) తృణకంకణ కావ్యరంగాన్ని చూపినది. వెదురు పొదలు, సొనల దరులలో మొగలి గుబురులు - ఇసుక తిన్నెలు - దూరాన తూర్పున వరి పొలాలు, తెల్లటి స్వాతి కొంగల బారులు - పల్లెటూరి వారి కోలాహలము - పశువుల మందలు అన్నీ రమ్యప్రకృతి దృశ్యాన్ని గ్రామీణ వాతావరణాన్ని ప్రదర్శించినవి. ఇవే సుబ్బారావు రసమయ హృదయాన్ని ప్రేరేపించినవి.... తృణకంకణంలో ఆ తరుణి ప్రణయిని - "అడుగులు బొబ్బరెత్త పదసాంచలమందున చిన్ని చెమ్మటల్ మడుగులు గట్ట" 'ఇసుక దిగబడు నడుగుల నీడ్చుకొనుచు' కన్నులకు కట్టినది."[1] కనుకనే వీరి రచనలు తెలుగుదేశపు ప్రకృతికి నిలయంగా నిలబడతాయి. వీరి రచనల్లోని పొదుపుటేర్లు, దీర్ఘికలలో ఊరే జలాలు, సొనల కిరువైపుల పెరిగిన పచ్చని పచ్చిక బీళ్ళు, మర్రి చెట్ల క్రింద ఇసుక పడకలు, మల్లెపందిళ్ళు, ఆ పందిళ్ళ క్రింద చీర బిగిపట్టి ముగ్గులు పోసే స్త్రీలు తెలుగుదేశానికి - ముఖ్యంగా బాపట్ల ప్రాంతాలకు సజీవ రూపకల్పనలు. జొన్నచేలు, అరటి తోటలు, తమలపాకు తోటలు, నిమ్మ, నారింజ, దబ్బ చెట్లు తెలుగుదేశాన్ని ప్రత్యక్షం చేస్తాయి. "ఈ కావ్యము (తెనుగుతోట) చదువువారికి తెలుగుదేశము

---

1. "రాయప్రోలు సుబ్బారావు - వారి సాహితీ శకలాలు" (వ్యాసము) మరుపూరు కోదండరామరెడ్డి - త్రివేణి-4 P 66-67

ప్రత్యక్షమగును. బాపట్ల, చీరాల, వేటపాలెము ప్రాంతములవారికే సొనల అందము తెలియును. అవి ఆకస్మికముగా నిసుక పడకల చీల్చుకొని పుట్టుంబోవు చేసి స్వచ్ఛ జలములో ప్రవహించును. సొన రెండు ప్రక్కలను పచ్చగా పచ్చికపొదలు ఊటలు పెరుగును....

'వీనులకు ముద్దుగొలుపు నవీన మధుర
మృదు స్వరమ్ములు పాడెడు సొనలు నేడు
మొలక పెత్తెడు ప్రక్కల మోహనముగ
నవ తృణాంకుర శీకర తల్పాల శయ్య'

మరియు

'శుచియయిన లోయిళులు బట్టి సొనల నీరు
పదల ద్రావుచున్నార భావతి మహర్షులు...'

మహర్షులు పదలునది కూడా సొనల నీరే నట... ఆ ప్రాంతములలో మల్లె పందిళ్ళ ప్రాతి ఎక్కువ.

'దివ్యముగు మల్లెపూల పందిళ్ళపట్ట
చేర యొడిపట్టి మొగ్గలు చిదుపు చిన్ని
కన్నియల ముద్దునడకలన్ కాంక్షపడెదా?'

అని చెప్పి నడిచినారు.... బాపట్ల చుట్టు ప్రక్కల నున్న లోటుచే సుబ్బారావు గారికి కావ్యనామము స్ఫురింపజేసినవి.[1] ఈ ప్రాంతాలలోని 'మిసమిసల మీరు మెత్తని ఇసుక నేలలు'[2] పసుపు పూసిన ముత్తైదువుల ముఖాలను

---

1. 'వెనుక లోటు' (వ్యాసము) - నాగరి నరసింహశాస్త్రి - భారతి. జనవరి 1954
2. నవపల్లవమాలికము - P 20.

తలపించే పూలతో గుమ్మడిపాదులు,[1] చెంపను వంగిన సీతాఫలపు చెట్లు[2] చుక్కలతో ఆకాశంలాగా పిందెలతో నిండిన దోసపాదులు,[3] వనకుమారిక ఉంచిన పసుపుముద్దల లాంటి పండ్లతో నారింజ చెట్లు,[4] ఇరువైపులా పెరిగిన అనాసమొక్కలతో దారులు,[5] దారుల క్రిందికి పొంగుగ ప్రాతి నీటిముత్యాల పూజలు చేయు దబ్బచెట్లు,[6] చిన్ని బంగారుపూసల చెంగల్వంటి జొన్నకంకులు పండిన సొగసు చేలు[7] తెలుగుదేశపు గ్రామసీమలను కనులముందుంచుతాయి.

'గెలలు దిగిన మవ్వపు నారికేళ తరులు
పూలగుత్తుల ప్రేలాడు పొన్నచెట్లు
మృదు కవచమ్ముల పిలిచెడి వెదురుపొదలు
కమ్మ గంధంపు మాకులున్ కలవు వనియు'.[8]
'నిగనిగ మెరయు కమ్మ చిగుళ్ళ గుత్తుల
నోరూరెడు చిరునిమ్మ చెట్లు
పురివిచ్చినట్లున్న చిమ్ముల తామ్ర పంక్తుల
సొంపు సుకుమార రసాల తరులు'.[9]

---

1. 'ఋతుమాల' - జకతుమ్మలు P 106
2. స్వప్నకుమారము - P 20
3. 'మంగళమాధుర్' - ముక్తమంజరి - P 47
4. స్వప్నకుమారము - P 20
5. కష్టకమలు - అభినవకవిత P 258
6. స్వప్నకుమారము P 21
7. తెనుగుతోట - అభినవకవిత P 322
8. శృంగారకంకణం - అభినవకవిత P 230
9. కష్టకమలు - అభినవకవిత P 258

'చువ్వలల్లెదిగి మంజుల కుష్మముల శ్రేణి
మొలకప్రాయపు పాలపోక బాళ్ళు'.[1]

ఇటువంటివన్నీ తెలుగుదేశపు ప్రకృతిశోభకు ప్రత్యక్ష నిదర్శనాలు.

చిన్నపల్లెలోని బ్రాహ్మణవాటికలో దూరదూరంగా ఉన్న తాటాకు కుటీరాలు, వాటి పరిసరాలు 'కృష్ణకమలి'లో మనోహరంగా చిత్రించారు. కవుల ఇంటి పరిసరాల వర్ణనను ఆధారంగా చేసుకుని సాధారణంగా పల్లెల్లో ఇంటి చుట్టుపట్ల ఉండే తోట వీరి రమ్యమయిన వర్ణనలో జీవం పోసుకుంది. ఆ ఇంటితోటకు అందాన్ని చేకూరుస్తున్నవి మల్లెపందిరి, బచ్చలిపాదు, అరటిచాలు, నిగనిగలాడే నిమ్మచెట్లు, గుబురు కొమ్మలతో మామిడిచెట్లు, పోకమొక్కలు, వెదురులు! సన్నగోరంట పొదలు దట్టంగా పెరిగి జారబడటానికి సాధ్యంకాని విధంగా తోటకు రక్షణనిచ్చే దడిగా ఏర్పడ్డాయి.

'పోకలను కౌగిలించు తాంబూల లతలు
పందిరుల నెక్కు ద్రాక్షవల్లికలును
పచ్చ చేమంతి మడులును బంతిపూలు
కుదురులును కాన్న కలువ కనకరజేయు
మవ్వముల వాని మధ్యాహ్నమల్లికలును
నవకమొలయు కాశీరత్న లతికలును
తులసితోటకు నావల నిలిపినట్టి
యలువలకు నల్లియుండె నాయనటితోట'.[2]

---

1. కృష్ణకమల - అభినవ కవిత - P- 256
2. కృష్ణకమల - అభినవ కవిత - P- 257

వీటికి సమీపంలో ఉన్నవి బాటూకు దళ్ళు. సర్వసాధారణంగా తెలుగు పల్లె ఇళ్ళలో కనబడే ఈ బాటూకు దళ్ళు, మధ్యాహ్నమల్లికలు, కాశీరత్నపు తీగెలు, తులసి మొక్కలు, అరటి మొక్కల ప్రస్తావన ఈ వర్ణనను సహజత్వానికి దగ్గరగా తెచ్చింది. ఇది సహజత్వాన్ని కల్పించగా ఆ గృహపరిసరాల చిత్రణకు జీవానిచ్చింది క్రింది పద్యంలోని దానిమ్మ మీది చిలుక ప్రసక్తి.

"అప్పుడు కిలకిల లాడుచు నగ్రశాఖ
నుండి దోరగా పండిన పండు కొరికి
మొలక కెంపుల వంటి గింజలను రాల్చె
చిన్న దానిమ్మ చెట్టుపై చిలుక యొకటి."[1]

ఇంటి పరిసరాలు ఈ విధంగా ఉండగా ఇంట్లోవారి జీవన విధానానికి రమణీయ రూపకల్పన వీరి రచనల్లో కనబడుతుంది. పల్లె జీవనంలో ఒక కోణాన్ని ప్రదర్శిస్తుంది 'పెండ్లిలగ్నం' అను ఖండిక. రైతు దంపతుల జీవన విధానం, ఆలోచనా సరళి, పెండ్లి సంబంధాన్ని నిర్ణయించుకోవడానికి వచ్చిన ఊరి పెద్దలకు సత్కారం దీనిలో చిత్రింపబడ్డాయి. పల్లెల్లో రైతు కుటుంబాల సంఖ్య అధికం. రైతులకు పంటపొలాలు, పాడిపశువులే సిరిసంపదలు. కనుకనే పూర్తిగా తెల్లవారకముందే నిద్రమంచం మీదనే తమ పంటలను, పశువులను, పాకలను గూర్చిన ఆలోచన మొదలవుతుంది.

నీళ్ళు లేక వరిచేలు పొల్లుపోయాయని, సేద్యానికి వానలు ఆలస్యంగా పడ్డాయని, చెరువు నిండింది కాబట్టి కరువు రాదని, మిరపతోటకు అంతవరకు పురుగు పట్టలేదని, మొక్కజొన్న అప్పుడే పాలు పోసు

---

1. 'కర్షకముల' - అభినవకవిత - P 261

కుంటాడనీ, పూతపట్టిన కాతిమేర చేను మంచు తాకకుండా కాస్తే చాలునని, ఏ విఘ్నంగానయినా ఎడ్లపాక ఆ సంవత్సరము తప్పించాలని, వానలకు కారిపోయిన గోడలు మెత్తించాలని, శిస్తు కోసం చేసిన అప్పు మీద వడ్డీ పెరిగిపోతూంటదనీ, పెయ్యదూడను అమ్మి ఆ అప్పు తీర్చడానికి మనసు ఒప్పటం లేదనీ రామన్న తలపోస్తున్నట్లు చేసిన వర్ణన[1] గ్రామవాసుల ఆలోచనా సరళికి అద్దం పడుతున్నది.

బయటకు వెళ్ళివచ్చిన భర్తకు ఉపచారాలు చేయడం, ఇంటికి వచ్చిన అతిథులను ఆదరించడం వంటి బాధ్యతల నిర్వహణలో గృహిణి ప్రాలుమాలదు. సూర్యోదయాన పొలానికి వెళ్ళి కాయకష్టం చేసివచ్చిన రామన్నకు 'కడవలో నీళ్ళు తోడి, ముక్కాలి పీటవేసి, చాకింటి ధోవతి తీసి' అందించి భార్యగా పరిచర్య చేస్తుంది 'భూదేవి.' పెండ్లిమాటలకు ఊరి పెద్దలు వచ్చిన సందర్భంలో గృహిణిగా ఆదరించి తగిన మర్యాద చేస్తుంది.

'నిలువు చెంబులో వేడినీళ్ళు తెచ్చె
అనువు గనిపెట్టి భూదేవి అంతలోనె
కిర్రు చెప్పులు విడిచి.. కాళ్ళేలు కడిగి
కూరుచుండిరి వారును కుశలమడిగి.'[2]

ఇంటికి వచ్చినవారికి కాళ్ళు కడుగుకొనడానికి నీళ్ళు అందించడం తెలుగింటి మర్యాద. కాళ్ళు కడుగుకొని కూర్చోవడం అలవాటు. అతిథులను మంచాలు వాల్చి, కంబళి పరిచి కూర్చో పెట్టడం, స్నానాలకు నీళ్ళు తోడి

---

1. పెండ్లిలగ్నం - మిత్రమంజరి · P57
2. పెండ్లిలగ్నం - మిత్రమంజరి · P 61

భోజనాలు ఏర్పాటు చేయడం, ఇందు కుప్పట్లు పరిచిన మంచాలు పంచలో కానిచ్చి, ఆరుబయలు వెన్నెల్లో కాన్క వేసి విశ్రమింప జేయడం వంటి వర్ణనలన్నీ తెలుగు పల్లెప్రజల మర్యాదలను చూపుతాయి.

కట్టు బొట్టు తీరు

ఆటపాటలు, వేడుకలు, పండుగలు కూడా జీవనవిధానానికి సంబంధించినవే.

'జిలుగు పూల కలంకారి చీర జార
చిందు పంచెదు కుచ్చెళ్ళు చెదరనీక
మాటి మాటికిని కాలి కడియాలు మలుపుకొనుచు'[1]

పాఠకుల కనుల ముందుకు నడిచివస్తుంది తృణకంకణం నాయిక. 'ముకువకు మంగళస్థానమయిన' వదనంలో తిలకరేఖను దిద్దుకొని, కాటుక కళ్ళలో, ఎఱుపు పంచుల గళ్ళపావడా పాదాలపై జీరాడగా, నిరుపాటి జడలో, జడలో పైడి జడకుచ్చులు అందగించగా, మెడలో కాసుల దండలో తెలుగుపడుచు ముగ్ధ సౌందర్యం వీరి రచనల్లో సాక్షాత్కరిస్తుంది. చెవుల కమ్మలు, ముక్కు పుడకలు లేని బోసితనం కూడా వింత సింగారం చేకూర్చగా జారుముడిలో ఆ కన్య,

'పూతనలుగుల తలయంట్లు పోసికొనక
శుక్రవాసర ముఖములు చూడనేదు'.[2]

ఈ తెలుగు కన్నెల శుక్రవారపు తలంటికి పరిపూర్ణతను, జీవాన్నిచ్చింది దూముడి విడిచి తల తుడుస్తున్న సందర్భం.

ఎంత యాలసించితే తలంటు నకేయు?
నాన్న యింటిలోన నున్నవాడె!

---

1. తృణకంకణం - P 1
2. 'ఏవరు'- జడకుచ్చులు - P 135

అనుచు నీళ్ళుగాలు నాకన్నె మోముకి
విడిచి పైటలాగి తుడువరాదె![1]

రాయప్రోలు వారు ప్రస్తావించిన పట్టెడలు, కాళ్ళకడియాలు, చెంపసరులు లోలకులు, కాళ్ళగజ్జెలు, పగడాల సరాలు, అందెలు, కాసుల దండలు, ఒడ్డాణాలు జడకుచ్చులు, కమ్మలు, ముక్కుపుడకలు, ఆంధ్రకన్యలు అభిమాన ఆభరణాలు. ఈ విశిష్టమైన ఆభరణాలను అలంకరించుకుని వీరి రచనల్లోని పడుచులు,

'గాజులాడ గలగల మని
పరికిణీలు విరిసి తిరుగ'[2]

'గిరగిర తిరిగే పరికిణీలలో;...
పయిటల చెంగులు పంజులాడంగ'

'కాళ్ళగజ్జెలును కంకణంబులును
లయ తప్పని తాళములయి మ్రోయగ'[3]

ఆటపాటలతో హాయిగా కాలం గడిపే దృశ్యం అది. ఈ కన్యలు ఆడిన చెమ్మచెక్క, నాలుగు స్తంభాలాట, కోలాటము, గొబ్బిళ్ళు, బొమ్మల పెండ్లిండ్లు, అట్లతద్దె ఉయ్యాలలవంటి ఆటలు ఆంధ్రత్వాన్ని సంతరించుకున్నాయి. తెలుగుదనాన్ని అభిమానించే రాయప్రోలు వారు కాలక్రమంగా ఈ క్రీడలు క్షీణిస్తున్నాయనీ, నేటివారు ఆదరించడం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

"ఉయ్యెల్ల బంతులన్ కవ్వించి వయసు నా
వరములై పడతులు పాడరేరు,

---

1. కష్టకమల - అభినవకవిత P 263
2. చెమ్మచెక్క - కన్నెపాటలు - P9
3. నాలుగు స్తంభాలాట - కన్నెపాటలు - P10

గొబ్బి తట్టెడు వేళ గూడ ప్రాయపు కన్నె

ఒరమర లేకాడ ముంచినారు,

తద్దె పండుగల సైత ముయాల ఊగుటు

మోటుగా ముగ్గులు మూసినారు,

రుక్మిణి మొదలుగా రుచిగాన్న బొమ్మల

పెండ్లిండ్లు బాలలు విడిచినారు'![1]..

అని అంటూ కన్నులలో 'ఆనంద సౌందర్య సంపదయా'న్ని పెంచిన క్రీడలను గూర్చి వివరించడం వీరికి వాటిపైగల అభిమానాన్ని సూచిస్తుంది. కేవలం ఆటపాటలలో బాధ్యతారహితంగా జీవితం గడపడం కాక, ఇహపరాల దృష్ట్యా నోములు వ్రతాల వంటివి కూడా అవసరమయినవే. అయితే వాటిని ఏదో బాధ్యతగా బరువుగా భావించడంకాక ఆహ్లాదంగా చేసుకునే పద్ధతి పేరంటాలు, పండుగలు వంటివాటిలో కనబడుతుంది. తెలుగింటి పండుగల వేడుక, పేరంటాల ఉత్సాహం రాయప్రోలు వారి రచనల్లో వెల్లివిరుస్తుంది.

తీరుతీరుల ముగ్గులలో ఇళ్ళను, వాకిళ్ళను అలంకరించి తెలుగువారు సంబరంగా జరుపుకునే పండుగ సంక్రాంతి. ఏడాది పొడుగునా పడిన శ్రమకు ఫలితంగా పంటలు ఇంటికి వచ్చే కాలం అది. చేలనిండా పుష్కలంగా ఉన్న పదార్థాలు వారి సంబరానికి, దానధర్మాలకు మరింత తోడ్పడతాయి. ఇండ్లకు చేరిన ఆ పంటలు 'క్షేత్రమాతృకలంపిన.. సంక్రాంతి సారెలు'.[2]

---

1. 'ఆచారము' - ఆంధ్రావళి P38
2. బ్రహ్మముడి - మిత్రమంజరి - P 127

'బూజు దులిపిన పూరి యిండ్లను
వెల్లవేసిన వీధి గోడలు
అలికి ముగ్గుల నిడిన యరుగులు
అందగించెను పల్లెలన్.'[1]

ఉన్నవి పూరిండ్లే అయినా గ్రామవాసుల శ్రద్ధాసక్తుల వల్ల, 'వెన్నెముగ్గులు పెట్టి వాకిళ్ళ ముందు' చేసిన అలంకరణలో, కన్నెలు పెట్టిన గొబ్బిళ్ళలో కళకళలాడుతూ ఉంటుంది గ్రామం.

'తెల్లవారక మేలు కొలుపులు
పాడుచును హరిదాసులరుగ'[2]

పల్లె సందడిస్తుంది. కొత్త బియ్యము, కొత్త బెల్లము, ముర్రుపాలు పోసి పొంగలి చేసుకుని పండుగ జరుపుకుంటారు. ఈ మకర సంక్రాంతికి సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశిస్తాడని, ఆ నాడు స్వర్గద్వారాలు తెరుస్తారని, విష్ణువు వైకుంఠంలో నిద్ర లేస్తాడని ఒక నమ్మకం వ్యాప్తిలో ఉంది. దీన్ని సూచిస్తూ సంక్రాంతికి పెట్టే ముగ్గులలో సహితం భోగినాడు స్వర్గద్వారాలు మూసి ఉన్నట్లు, సంక్రాంతి రోజు స్వర్గద్వారాలు తెరచి ఉన్నట్లు ముగ్గుపెట్టే వాడుక ఉంది. మాఘమాసాన్ని ఉద్దేశించి ఇటువంటి భావాన్ని ధ్వనింప చేశారు రాయప్రోలు వారు.

"బంతి మొక్కల బాళ్ళు గొబ్బికి
పసుపు ముద్దలు పెట్టగాన్...
...శీత శుక్ల నిశీథమందున

---

1,2 'సంక్రాంతి సంబరము' - మిశ్రమంజరి P 64-65

గౌరి నిద్దుర లేవగా - పై
కుంకుమున వాకిండ్లు తీయగ
వచ్చినావే మాఘమా!"[1]

ఆశ్వయుజ కృష్ణద్వితీయ రోజు తలంట్లు, రాత్రి భోజనాల తరువాత గోరంటాకు చేతులకు పెట్టుకోవడం, సూర్యోదయానికి పూర్వమే వినవచ్చే 'ముదురు వేళ' అనే గోరంటు ముచ్చట్లు, వేకువజామునే లేచి స్నానాదికాలు చేసి భోజనాలు చేసి తాంబూలం వేసుకుని అలంకరించుకోవడం, తెల్లవారక పూర్వమే ఉయ్యాలలూగే సందడి వంటి వాటి వర్ణన[2] తెలుగు కన్నెలు ఉత్సాహంగా జరుపుకునే తద్దె పండుగ వేడుకలను ప్రత్యక్షం చేస్తుంది.

వరలక్ష్మీ వ్రతానికి అత్తవారు పంపిన ఏరుపంపుల పట్టుచీరెలు, పసుపద్దిన గళ్ళరవికెలతో వంటి లాంఛనాలను అందుకుంటారు తెలుగింటి కొత్తకోడళ్ళు. వీరు గౌరిపూజకు చేసే ఏర్పాట్లు కనులపండుగ కలిగిస్తాయి.

"పసుపు కుంకుమ పూలు - బండ్లకపు తెచ్చితిమి...
అరటి స్తంభాలతో - అందమగు మంటపము
తమలపాకుల తోర - ణాముల సవరించితిమి.
బంతిపూలరుగు చే - మంతి పువ్వుల పీట
అమరించినాము నీ - ఆవాహనకు నేడే."[4]

ఉత్సాహంతో పూజామందిరాలను అలంకరించడానికి, శ్రద్ధాసక్తులతో

---

1. 'మంగళ మాఘమ్' - మిత్రమంజరి P 48
2. కేప్పకము
3. 'వరలక్ష్మీ వ్రతము' - కన్నెపాటలు - P 35
4. 'గౌరి పూజ' - కన్నెపాటలు P 33, 34

పూజకు ఆయత్తం కావడానికి ఇది కమనీయ రూపకల్పన. ఆ విధంగా ఆవాహన చేసిన జగదంబను భక్తిశ్రద్ధలతో అర్చించి,

'స్నేహదీపము వెలిగించి చిత్రశోభి
పసుపు కుంకుమ పూలు కానుక ఇచ్చి
చిన్ని కర్పూర హారతి చేతబట్టి'.[1]

మంగళహారతి పట్టి నోచిన నోమును పరిపూర్ణం గావిస్తారు. ఆ విధంగా చేసే పూజలను అనుసరిస్తుంటాయి పేరంటాలు. 'మా యింట ఈనాడు పేరంటము నందరనీ పిలిచి కుంకుమ బొట్టు పెట్టి, పాదాలకు పసుపు పూసి, అక్షతలిచ్చి, వాయనాల నిచ్చే తెలుగుదేశపు పేరంటాలు సహితం రాయప్రోలు వారి రచనలలో ప్రస్తావించబడ్డాయి.[2] తులసికి నిత్యపూజలు చేయడం, చిట్టిబొట్టు నోములు నోయడం, పసినిమ్మపండ్లు వాయనాలివ్వడం, లక్ష దీపాల నోములు చేసుకుని ఉద్యాపనలు తీర్చుకోవడం వంటి తెలుగుదేశపు ఆచారాలు ఎన్నో వీరి సాహిత్యసీమలో దర్శనమిస్తాయి. చద్దిఅన్నం తినడం వంటి సామాన్యమయిన అలవాటు నుంచి, ద్వితీయ విఘ్నం కూడదనే విశ్వమయిన నమ్మకాల వరకు వీరి కవిత్వంలో చోటు చేసుకున్నాయి.

ఇక వీరి రచనల్లో కనిపించే ఆహారపు అలవాట్లు కూడా ఆంధ్రత్వాన్ని పుణికి పుచ్చుకున్నాయి. ఇంటికి వచ్చిన బంధువులకు భూదేవి వండి వడ్డించిన వంటలు తెలుగువారి భోజనాన్ని పరిపూర్ణంగా ప్రదర్శిస్తాయి.

"కొత్త సాంబారు కారముల్ కాసరి కూర;
పైర వంకాయ పొటింపు దోరవేపు

---

1. తెనుగుతోట' - అభినవకవిత - P340
2. 'చుక్కల' - కన్నెపాటలు P-4; 'మంగళాచరణము' - తెనుగుతోట, అభినవ కవిత P315, 316, 317; కప్పకములు - అభినవకవిత - P275

కంది పప్పు కమ్మదనాలు చిమ్ముచుండ...
ఇంటి కాచిన కపురము వంటి నెయ్యి
జిడ్డు మీగడ గట్టిన గడ్డ పెరుగు![1]

ఈ భోజనాలు చేశారు గ్రామపెద్దలు. 'పోరపాకపు గారెలు అరిసెలు'[2] తో కూడుకున్నది పుట్టినరోజు పండుగనాటి ప్రత్యేక భోజనం. తద్దె పండుగనాడు తెల్లవారకపూర్వమే కన్నెలకు తల్లులు పెట్టిన భోజనం తెలుగింటి పల్లె భోజనం

'అరుగ దించిన సన్నబియ్యంపు వంటి
పాల్లకాయలు నేతిపోపుల నమర్చి
పేర బెట్టిన మీగడ పెరుగుతోడ
నపుడు తినిపించి రెల్ల కన్నెలను సతులు'.[3]

రాయప్రోలు వారు ప్రజలందరికీ చేకూరాలని వాంఛించింది కూడా ఆంధ్రుల భోజనంలో ముఖ్యమయిన నెయ్యి, అన్నమే.

'నోరెడు తెల్లని యన్నము
చేరెడు గుమగుమల నెయ్యి చేకుర ప్రజకున్'.[4]

ఆంధ్రత్వం మీద ఇంత అభిమానం ఉండడం వల్లనే నేమో వీరి భావనా ప్రపంచంలో కూడా అదే కనిపిస్తుంది. వీరికి నక్షత్రాలు 'నింగి వాకిటి పెండ్లి ముగ్గుల లాగా' తోచాయి.[5] పచ్చని పచ్చిక బీళ్ళలోని కళకళలాడే

1. 'పెండ్లి లగ్నం'- మిశ్రమంజరి P61
2. 'పొల్లు ఆశ' - మిశ్రమంజరి P91
3. కష్టకమల - అభినవ కవిత P277
4. 'తిక్కన జయంతి నాడు' - వనమాల P41
5. 'బ్రహ్మముడి' - మిశ్రమంజరి P128

బృందావనం ముత్తైదువలు పట్టిన పళ్ళల హారతి పళ్ళాన్ని తలపింపజేసింది.[1] ప్రభాతకాలంలోని అరుణిమలు పసుపుకుంకుమ కలిపి తీర్చిన ముగ్గుల అల్లికలను తలపింప చేశాయి.[2]

'చదలవాకి యంచముగ రంగ
వల్లికలు తీర్చినట్లు రంజిల్లె తార
లంతరమున దోచె శశి సంక్రాంతి నాడు
పాలు పొంగింపగా నిడ్డ భాండమట్లు'.[3]

చంద్రుడు సంక్రాంతినాడు పాలుపొంగించడానికి పెట్టిన భాండంలాగా తోచడం వీరి తెలుగుదనానికి చక్కని నిదర్శన.

ఈ విధంగా వీరి రచనల్లో ఆహారవ్యవహారాలు, అలవాట్లు, ఆటపాటలు వంటివాటిలో తెలుగుదనం వ్యక్తమవుతుంది. ఇది వీరికి తెలుగుదనంపై ఉన్న అభిమానాన్ని స్పష్టం చేస్తుంది. తెలుగుదనం మీది ప్రేమాదరాలు తెలుగుదేశాన్ని అభిమానించడానికి సహాయపడ్డాయి. ఆ దేశాభిమానం ఆంధ్రరాష్ట్రాభిమాన కవితగా రూపుదిద్దుకుంది. ఈ రాష్ట్రాభిమాన కవిత వెల్లువగా ప్రవహించడానికి రాజకీయ పరిస్థితులు దోహదం చేశాయి.

భాషలను బట్టి ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పడాలనే నినాదం ఆంధ్రదేశంలో బయలుదేరింది. క్రమంగా అది ఉద్యమమై వ్యాపించింది. 1913 లో బాపట్లలో ప్రథమాంధ్ర మహాసభ జరిగింది. రాయప్రోలువారు శాంతినికేతనం నుండి వచ్చే సమయానికి

---

1. జన్మాష్టమి - వనమాల P 71
2. ప్రభాతము - ఆంధ్రావళి P 76
3. [illegible]

ఈ ఉద్యమానికి చెందిన ఆంధ్రనాయకులలో స్పర్థలు బయలుదేరాయి.

...."1917 లో నెల్లూరులో కూడిన ఏడవ ఆంధ్రమహాజనసభలో ఉద్యమ విరోధులు రగడ చేపడినారు. శాంతి నికేతనము నుండి మరలి వచ్చిన రాయప్రోలు ఈ ద్వేషమగ్నులూ, స్పర్థాబద్ధులూ నైన ఆంధ్రనాయకులను చూచారు. ఉద్యమానికి రాగల ముప్పును పసిగట్టారు.... వర్తమానదురవస్థ నంత ఖండించేందుకు పూర్వమహాచరిత్రాంతర్గతాలైన ఉత్తేజకర సంఘటనల స్మృతి తెలియించ సాగినారు. ప్రతినిధుల ముందు అమరావతీ నగరాన విశ్వవిద్యాలయములు స్థాపించిన బౌద్ధులు ప్రత్యక్షమయ్యేసరికి (ప్ర) మహాదర్శనం సిద్ధించని స్వప్నం సభాసదుల తలలు వంచేసింది.... ఎక్కడి స్పర్థలు అక్కడనే అణగిపోయాయి. తత్కాలానికైనా ఇంత గొప్ప విజయాన్ని కవిత్వం ద్వారా సాధించిన కవి నాడు ఆ కాలాన శ్రీనాథులవలె నిన్న మొన్న రాయప్రోలు తప్ప మరెవరున్నారు?[1] ఆ విధంగా విజయం సాధించిన ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర రాష్ట్రాభిమాన కవిత్వంగా రాయప్రోలువారి రచనల్లో స్ఫుటాకృతి దాల్చింది, ఆంధ్రోద్యమ స్ఫూర్తి వీరి కవిత్వంపై ప్రసరించింది. తెలుగుదనంపై వీరికున్న అభిమానం దానికి మెరుగులు పెట్టింది. " 'తెనుగుతల్లి' అను పదమును మొదట ప్రయోగించినది వీరే. 'తెనుగువాణి', 'తెనుగుకత్తి', 'తెనుగుభూమి' మొదలైన వాని వెనుకగల ఆంధ్ర జాతీయావేశమునకు దారులు తీసినది వీరే. తెలుగునదులను, తెలుగురాజుల శౌర్యపరాక్రమములను, తెలుగు సిరిని స్ఫుటమైన రేఖలలో చిత్రించిన ప్రథములు వీరే."[2] పూర్వచరిత్రలోని ఆంధ్రుల విజయాలు

---

1. 'ఆంధ్రరాష్ట్రోద్యమ దర్పణం' - రాయప్రోలు జాతీయ కవిత (వ్యాసము)
   K.V. రమణారెడ్డి. అభ్యుదయ - ఆగష్టు 1957 P28
2. 'ఆధునికాంధ్ర కవిత్వము. సంప్రదాయములు - ప్రయోగములు'
   C. నారాయణరెడ్డి P293

వైభవాలు, ఆంధ్ర తేజస్సు, ఆంధ్ర పౌరుషం వంటి వాటి నెన్నిటినో బహుముఖాలుగా స్తుతించారు. ఆంధ్ర భూమిలోని ప్రతి ప్రాంతాన్ని విశిష్టంగా కీర్తించారు.

"సంపదాన్యాన సౌందర్యమున్న నెగడోయు
గోదావరి ముఖాన కోనసీమ
సుఫల సంపత్ప్రసన్న సురభిళమై మెరయు కృ
ష్ణారసస్నానము గుంటూరు సీమ
శివుని పోరి కదల్చి కవిని నేరిమి గెల్చి
మీరిన జాణ నెల్లూరి సీమ
ఆంధ్ర వీర్యయు పతాకాలంకృతమ్మైన
రతనాల యుంగరి రాయసీమ
నేల నాలుగు చెఱగుల నిక్కుదేరె
రాణసూయాణమై తెలంగాణ రేఖ"[1]...

'తెనుగుతల్లి' అంగాంగం ఐశ్వర్యోపేతమే. ఆ ప్రాంతాలన్నీ ఆంధ్రమాత ఆభరణాలే. అటువంటి వన్నెచిన్నెలు చెదురు చెదరకుండా కాపాడటం ఆంధ్ర పుత్రుల కర్తవ్యం అని ప్రబోధిస్తూ 'తెనుగుతల్లి బాలాత్మికా తిలక దీప్తిని' ఎన్నో రకాలుగా ప్రత్యక్షం చేశారు. 'మావవేదు మానవేదు ఆంధ్రుల మహోజ్వల చరిత్ర' అని చాటి చెప్పిన వీరి కవితలో గతవైభవం పునరుజ్జీవనం పొందింది. ఆంధ్రావనిని కీర్తిస్తూ, పురావైభవాన్ని చాటి చెప్తూ, ఆంధ్రమాతను స్తుతిస్తూ ఆశ్వమానికి ఆత్మైకానందించారు.

తెనుగు వాణి ఎంతోమంది గాయకులను సంగీతవాణ్ని

---

1. తెనుగుతల్లి - ఆంధ్రావళి - P36

అందించగా, సౌందర్యాభిరుచిని పెంపొందింప జేసింది తెనుగురేఖ. వసుంధరను సస్యశ్యామలంగా తెనుగుభూమి చేయగా విరోధి సమూహానికి సహింపరానిదై మెరిసింది తెనుగుకత్తి. ఇది శక్తి తికలన కత్తిని కదిలిన కదనభూమి. అమృతాక్షర వికాసమయిన పోతన లేఖిని ప్రకాశించిన ప్రదేశం ఆంధ్రదేశం అని ఆంధ్రప్రశస్తిని ప్రకటించారు సుబ్బారావు గారు.

ఇక్కడ గతవైభవాలు క్రీడించి శిలాశిల్పమై కూడా బ్రతికిపెట్టే ఆంధ్రుల ప్రాభవాన్ని చాటి చెప్తున్నాయంటారు వీరు. నిండారగా పారే అఖండ గోదావరి ప్రాంతాలలో చాళుక్య నాగరికత దాగింది. కోటగోడల శిథిలాలలో కాకతీయుల ప్రాభవం నిద్రిస్తోంది. పల్లెపదాలలో పల్నాటి వీరుల శౌర్యం జీవం నింపుకుంటోంది అని చెప్తూ అఖిల పురుషార్థసిద్ధిపొందిన మహామహా పితామహుల సంప్రదాయాన్ని మాయనీయవద్దని ప్రబోధించారు.

'ఉత్కళాశా నితంబమ్ము లొత్తి పొత్తె ఆంధ్రుల యశోమహాల సింహాచలములు' అంటూ తెలుగు శక్తి, తెనుగు తంచె, తెనుగు కవితలలో తెనుగు ప్రతిభ జగద్వ్యాప్తం అయిందన్నారు. 'గంగ తలనుండి కావేరి పాదాలదాక' తెలుగు కీర్తి వెలిగింది. త్యాగరాజు, నారాయణతీర్థులు, క్షేత్రయ్య, మల్లినాథుడు, అన్నంభట్టు పండితుడు, పంపడు, అక్కన్న, మాదన్నల వంటి ఆంధ్రులు సంగీతసాహిత్య కళల నుగ్గుపాలలో త్రాగి ఆంధ్రుల సామర్థ్యాన్ని నిరూపిస్తున్నారని రాయప్రోలువారు గర్వించారు. కర్ణాటరాజ్యరంగం ఆంధ్రకవులను బ్రహ్మరథం పట్టడం ఆంధ్రులకు గర్వకారణం అని గుర్తు చేశారు. తెలుగుప్రజల యశోవైభవం వీరివల్ల పెంపొందిందని సూచించారు.

'అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ

విద్యాలయములు స్థాపించినారు
ఓరుగల్లున రాజవీర లాంఛనముగా
బలుశస్త్రశాలలు నిలుపునారు
విద్యానగర రాజవీథులన్ కవితకు
పెండ్లి పందిళ్ళు కప్పించినారు
హాటకాద్రికి సమీపమున ఆంధ్రసామ్రాజ్య
దిగ్జయస్తంభ మెత్తించినారు
ఆంధ్రసంతతికే మహాభాగ్యమైన
దివ్యదీక్షాముఖ స్ఫూర్తి వివరించె
ఆ మహావేశ మర్థించి యాంధ్రులార
చల్లుడాంధ్రలోకమున నక్షత్రములు వేలు!"

ఇది వీరి ప్రబోధ కవితలో ప్రముఖమైనది. ఈ ప్రబోధం ద్వారా ప్రాచీన కాలం నుంచి కనబరుతున్న శక్తిసామర్థ్యాలను, శౌర్య పరాక్రమాలను దృష్టిలో నిలుపుకుని మహాభాగ్యమానాన్ని పెంచుకుని దీక్షాబద్ధులు కావాలని ఆంధ్రులను ఉత్తేజపరిచారు.

యుద్ధంలో వెనుతిరిగి వచ్చిన భర్తకు పసుపిచ్చి వేడినీళ్ళు పోసిన వీరపత్నులు, విశాల సామ్రాజ్యాన్ని చాకచక్యంతో ఏలిన వీరవనితలు విపుల సాహస పౌరుష మార్గాలను వెలయించి చరిత్రలో చిరస్థాయి పొందారు. కొండవీటి వీరులు, పల్నాటి శూరులు, తెలంగాణ భటులు, అద్దంకి మేటి మగలు ఆంధ్రుల ప్రతిష్ఠను పటిష్టం చేశారు. వారి చరిత్రను దృష్టిలో ఉంచుకుని దానికి అనుగుణంగా ప్రవర్తించడం ఆంధ్రుల విధి అంటూ ఉత్సాహమందించారు సుబ్బారావుగారు.

విశేషమైన భాషాసేవ చేసిన కృష్ణరాయల కీర్తిధ్వజమెత్తిన పవిత్రభూమి ఇది. ఎన్నో విదేశనౌకలకాశ్రయమై మోటుపల్లి రేవు వెలసింది ఆంధ్రభూమిలో. పంజాబు కర్పూరపు మొక్కలను పెరటితోటల్లో పెంచిన దేశం ఇది. అటువంటి ఆంధ్రదేశంపై 'చల్లుండాంధ్రమహోద్యమ ప్రథమ పూజాపుష్పములో' అని ప్రబోధించారు.

రాయప్రోలు వారి దృష్టిలో పూర్వాంధ్రచరిత్ర యావత్తూ స్వర్ణమయమే. ఆ స్వర్ణమయమైన మహోజ్వల చరిత్రను ఆంధ్రులకు వినిపించి ఆంధ్రకీర్తిని కొనియాడి 'భోయవవై తల్లి పల్లకీని' మోయుమని బోధించారు. ఆంధ్రుల ప్రాచీనప్రాభవాన్ని కీర్తిస్తూనే ప్రస్తుతపరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 'నాదుజాతి - నాదేశము - నాదుభాష' అనే అహంకారం అందరూ పొందాలని ఆకాంక్షించారు. ఆంధ్రులందరూ సమైక్యం కావాలని ఆశించారు.

'జాతిన దేశగౌరవము చక్కగ నిద్దీ మహాంధ్రమండలీ
భారము శ్లాఘనీయముగ పాలనచేసి సమానరాష్ట్రముల్
కూరిమి నాసకేయు తెనుగుం బుడమిన్ కయిసేయరయ్య'- - -

అంటూ ఆంధ్రరాష్ట్రాన్ని కోరారు. తమ రాష్ట్రాభిమాన కవిత్వం లోని భావావేశంలో ఇతరకవులకెందరికో ఉత్సాహాన్ని, ఉద్రేకాన్ని అందించారు.[1]

వీరి కోరిక నెరవేరింది. ఆంధ్రరాష్ట్రం అవతరించింది. అయితే దానితో అంతా తీరిపోయిందనుకున్న వ్యక్తికాదు రాయప్రోలువారు. ఉద్యమంలో ప్రారంభం అయిన అభిమానం రాష్ట్రసిద్ధిలో ఆగిపోలేదు. వీరి అభిమానం సహజసిద్ధం అయింది. రాష్ట్రం ఏర్పడగానే ఆంధ్రుల బాధ్యత తీరిపోదు. ఆ రాష్ట్రాన్ని సమర్థవంతంగా ఆదర్శప్రాయంగా పాలన చేయడం కూడా ఆంధ్రుల బాధ్యతే. కనుకనే ఈ బాధ్యతను

1. 'ఆంధ్రప్రశస్తి నేను వ్రాశానంటే ఆ ఉద్వేగం నాకు రాయప్రోలు వలన కలిగినదే. విశ్వనాథ.' - ఆంధ్రపత్రిక 11-3-''

మరిచిపోరానిదినమ్ముగా ఆంధ్రులకు గుర్తుచేశారు.

"నాల్గుకోట్ల మహాంధ్ర నాగరిక జనకాంక్ష
నలుబదేండ్ల నిరూఢ బలవదుద్యమ దీక్ష
ఈడేరినది ఆంధ్రమేకీభవింపండి
ఇరుగు పొరుగులు నచ్చ
హితులు నహితులు మెచ్చ
ఈడేరినది ఆంధ్రమేకీభవింపండి
....ప్రజల క్షేమము నెంచి పక్షకక్షలు డించి
నడపండి రాష్ట్రతంత్రము ముఖ్యపడకుండ
దేశప్రతిష్ఠక్ ప్ర
కాశంబు కావలె...."[1]

అంటూ తెలుగు తల్లిబాలు వీరి ప్రజాశ్రేయస్సు ఆకాంక్షిస్తూ పాలించ మని బోధించారు.

ఈ విధంగా రాయప్రోలువారి కావ్యాలను స్థూలంగా పరిశీలించినపుడు కొన్ని సామాజిక సమస్యలు ప్రతిఫలించడం, రచనావిధానంలో నూతనత్వం, తెలుగుదనం మీద అభిమానం కనబడతాయి. సూక్ష్మంగా పరిశీలిస్తే వీరి కవిత్వంలో అంతర్లీనంగా కనబడే సత్యాలు వీరి తత్త్వదర్శనానికే చూపుతాయి. ఆ తత్త్వవివేచన వీరిని దార్శనిక కవిగా నిరూపిస్తుంది.

---

1. 'ఆంధ్రాభిషేకమ్' - మిశ్రమంజరి - P15

మూడవ భాగం

# తత్త్వవివేచన

రాయప్రోలువారి

# తత్త్వచింతనపై ప్రభావాలు

# రాయప్రోలు వారిపై వైదిక వాఙ్మయ ప్రభావం.

రాయప్రోలు వారి కావ్యాలలో అంతర్లీనంగా కనబడే ఆధ్యాత్మిక దర్శనాన్ని అవగాహన చేసుకోవడానికి వారి వ్యక్తిత్వం ఏ విధంగా రూపుదిద్దుకుందో పరిశీలించడం సహాయపడుతుంది. వ్యక్తిత్వ వికాసంపై పుట్టి పెరిగిన వాతావరణం, పరిసరాలు, చదివిన సాహిత్యం, పెంచి పెద్దచేసిన వ్యక్తులు, విద్యాబుద్ధులు నేర్పిన పెద్దలు, పరిచితులు - ఇలాంటివి ప్రభావాన్ని చూపుతాయి.

|వేదపండితుల వంశంలో జన్మించిన రాయప్రోలు సుబ్బారావుగారు తాము పెరిగిన వెదుళ్ళపల్లి వేదఘోషలో ప్రతిధ్వనించే మునివాటికలా ఉండేదంటుంటారు. పుట్టి పెరిగిన ఈ వాతావరణం వీరి వైదికాభిమానానికి దోహదం చేసి ఉంటుంది. ప్రాచ్య సంప్రదాయాల పట్ల, ఆర్ష ధర్మాల పట్ల, వేదోపనిషత్ సూక్తుల పట్ల గౌరవాభిమానాలకు ఈ వాతావరణం కొంత కారణం అయి ఉంటుంది. ఈ ప్రభావంలో వీరు ఆర్ష సంస్కృతీ సంప్రదాయాలను పవిత్రంగా భావించి గౌరవించారు. 'వేదశాఖలు పెరిగె నిచ్చట.... ఉపనిషన్మధువులూరె నిచ్చట'... అంటూ వేదోపనిషత్తులను తలచుకొని ఉప్పొంగిపోయారు. ఉదారచరితులయిన ఋషులను పదేపదే ప్రస్తుతించారు.| వైదిక సాహిత్యం పూర్వులు మనకిచ్చిపోయిన మాన్యమని, అమూల్య సంపద అని అభిమానించారు.

ఇంత గాఢంగా వీరి హృదయంలో స్థిరపడి ఉన్న వైదికాభిమానం వీరి సాహిత్యంపై అధిక ప్రభావాన్ని చూపింది. |వీరి రచనలో వేదోపనిషత్ ప్రభావం ఒకచోట ఉన్నదని చెప్పటానికి వీలు లేకుండా పాలలో వెన్నలాగా సర్వత్రా వ్యాపించి ఉంది. వీరి కావ్యభాషలో వైదిక పదజాలం ప్రత్యేక స్థానం పొందింది. వీరి రచనలో వైదిక స్ఫూర్తి నిచ్చే పద్యాలు అనేకం

అనవచ్చు. వీరి వైదికధర్మాభినివేశం సాహిత్యంలో వైదికవాతావరణ చిత్రణగా ప్రతిఫలించింది. భారతీయమైన వీరి వ్యుత్పత్తిశక్తికి మూలాధారంగా చెప్పదగినది వైదికవాఙ్మయం. వీరి సాంఘిక జీవితసమన్వేషణకు, సాహిత్యదర్శనానికి వేదోపనిషత్తులు పూర్వరంగంగా భాసించాయి. పాపపుణ్యకర్మల నమ్మకం, జన్మ సిద్ధాంతం, భగవత్తత్త్వచింతన, దైవచింతన వంటి వీరి సనాతన సంప్రదాయ భావాలకు వైదికవాఙ్మయం ఆధారభూతం. వైదిక సంస్కృతీ సంప్రదాయాల్లోని కొన్నింటిని గుర్తించి కీర్తించడం ద్వారా ఆనాటి సాహిత్యసీమలో ఒకవిధంగా వాటిని వీరు పునరుద్ధరించారని చెప్పవచ్చు.

కనుకనే వేదోపనిషత్ సూక్తులకు, భావాలకు ప్రతిబింబాలవంటి భావాలు వీరి రచనలో కనబడతాయి. 'నీవార శూకవత్ తన్వీ పీతా భాస్వత్యణూపమా'[1] అని ప్రాచీనులచే పరతత్త్వరేఖ భావింపబడ్డది. ఇదే భావాన్ని అనుసరిస్తూ రాయప్రోలువారు 'నీవారాగ్రము మాడ్కి సూక్ష్మమయి హృన్నీలాభ్రమధ్యస్థ తీలా విద్యుచ్ఛిఖబోని జీవుని మెరత్ తర్కించి సూత్రించే....[2] అంటూ మహర్షులకు దర్శనీయమైన పరతత్త్వాన్ని స్మరించారు. ఆ పరబ్రహ్మ నిర్వికారము, నిరంజనము అని అంటూ అది సామాన్యులకు అందనిదని భావించారు. శుద్ధవిజ్ఞానాంశ, నిర్వికల్ప బ్రహ్మ అయిన పరతత్త్వరేఖ తపోధనులయిన మహర్షుల హృదయాల భాసితం. కనుకనే తపోవిదగ్ధులు 'కలరో వేదో యనుచు భూమ్యాకాశములు వెదుకన్ హృదంతిక కోశమున నీవారశూకాగ్రముగ మెఱసె తదంశయున్'[3] అన్నారు. ఇదే భావాన్ని 'చిన్ని నిప్పై సిగవై సన్నగా తళుకుమను జీవ

1. తైత్తిరీయారణ్యకం 10-13 యజుర్వేదం
2. 'ఉగాది నివేదన' - వనమాల - P 15
3. 'బ్రహ్మముడి' - మిత్రమంజరి P 130

లక్షించె నాకు ద్రష్ట'[1] అని వ్యక్తం చేశారు. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ'[2] అన్న ఉపనిషదుక్తి ఛాయలో పరతత్త్వాన్ని వాగతీతంగా భావించి 'వాచామగోచరంబనిది దానిని'[3] అని అన్నారు రాయప్రోలు వారు.

నిరాకారమయిన భగవత్ స్వరూపాన్ని సచ్చిదానంద రూపంగా భావించడం ప్రసిద్ధి పొందిన విషయం. 'రసో వై సః రసం హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి'[4] అని అంటూ తిత్తిరినామక ఋషిప్రోక్తంగా భావింపబడే తైత్తిరీయోపనిషత్తు ఆనందమే బ్రహ్మమని తెలియజేస్తుంది. దీనిలోని బ్రహ్మానందవల్లి అనే విభాగంలో ఆనందమయకోశ స్వరూపాన్ని ఆనందతత్త్వాన్ని మీమాంస చేయబడి, ఆనందస్వరూపమైన బ్రహ్మము వివరింపబడింది.

జీవుడు శుభాశుభ కర్మఫలాలననుభవించడానికి ఆధారంగా పాంచభౌతికమైన శరీరం ఏర్పడింది. ఇది అన్నమయ శరీరం. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలు ఒకదానిలో ఒకటి ఇమిడి ఉన్నాయి. ఇవి క్రమంగా ఒకదానికంటె వేరొకటి సూక్ష్మమైనవి. ఆ క్రమంలో చివరిదయిన ఆనందమయకోశము అన్నిటికంటె సూక్ష్మమయింది. ఈ ఆనందమయ కోశానికి 'ప్రియము' శిరస్సు. 'మోదము' దక్షిణభాగం. 'ప్రమోదము' ఉత్తరభాగం. ఆనందమే ఆత్మ. బ్రహ్మ

---

1. రమ్యాలోకము - P 15
2. తైత్తిరీయోపనిషత్తు - బ్రహ్మానందవల్లి - చతుర్థానువాకం
3. రమ్యాలోకము - P 12
4. తైత్తిరీయోపనిషత్తు - బ్రహ్మానందవల్లి - సప్తమానువాకం

ఆధారం[1] అని అంటూ ఆనందమయ కోశాన్ని భావన చేసింది తైత్తిరీయోపనిషత్తు.

జీవుడు సుఖరూపంగా భావించి ఆనందించే మానుషానందము నుంచి ఉత్కృష్టము, సర్వోత్తమము అయిన బ్రహ్మానందం వరకు గల అంతరాలు వివరించింది తైత్తిరీయోపనిషత్తు. 'మానుషానందము, మనుష్యగంధర్వానందము, దేవగంధర్వానందము, పితురానందము, ఆజానజానందము, కర్మదేవానందము, ప్రజాపత్యానందము, బ్రహ్మానందము' అనే అంతరాలను చెప్తూ బ్రహ్మానందం సర్వోత్తమం అన్నది. 'బ్రహ్మము' అనంతం కనుక బ్రహ్మములోని ఆనందం కూడా అనంతమే.

'భృగువల్లి' అనే వేరొక విభాగంలో అన్నము, ప్రాణము, మనస్సు, విజ్ఞానము, ఆనందము - వీటిలో ఒకొక్కదానిని బ్రహ్మముగా తెలుసుకోడానికి ప్రయత్నం చేస్తూ భృగువు ఆనందస్వరూపుడైన బ్రహ్మమును కనుగొని ఆనందమే బ్రహ్మగా గుర్తించిన విధం వివరింపబడింది.

'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్।
ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే।
ఆనందేన జాతాని జీవంతి।
ఆనందం ప్రయంత్యభిసంవిశంతీతి।'[2]

---

1. 'తస్మాద్వా ఏతస్మాద్ విజ్ఞానమయాత్। అన్యో౽న్తర ఆత్మా ఆనందమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుషవిధతామ్। అన్వయం పురుషవిధః। తస్య ప్రియమేవ శిరః। మోదో దక్షిణః పక్షః। ప్రమోద ఉత్తరః పక్షః। ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా।'
(తైత్తిరీయోపనిషత్తు - బ్రహ్మానందవల్లి - పంచమానువాకము)
2. తైత్తిరీయోపనిషత్తు - భృగువల్లి - షష్ఠానువాకము.

ఆనందరూపమయిన బ్రహ్మను తెలుసుకుని, ఆ బ్రహ్మానందం పొందడమే మానవ జిజ్ఞాసకు పరమావధి. రాయప్రోలు వారు సాహిత్యంలో ఆనందానికి ప్రాధాన్యం ఇవ్వడానికి ఈ ఉపనిషత్ ప్రభావం పూర్వరంగంగా ఉపకరించిందనవచ్చు. సృష్టి, స్థితి లయ విన్యాసం ఆనందమూలమని, అటువంటి ఆనందసాధన సాహిత్యానికి లక్ష్యమని అంటారు సుబ్బారావుగారు. సాహిత్యం అమంగళం పలుకకూడదని, అశుభం వాంఛించకూడదను వారి విశ్వాసానికి పై ఉపనిషద్వచనం ఆలంబనం. వారు ఆనందానికిచ్చే ప్రాధాన్యానికి ప్రాతిపదికలాంటి ఈ సూక్తిని రాయప్రోలు వారు తరచుగా ఉల్లేఖిస్తుంటారు.[1] సాహిత్యం అశుభం, అమంగళం పలుకకూడదన్న అభిప్రాయం వారికున్నా వారి రచనలలో విషాదాంతం తో పాటు విషాదారంభం కూడా ఉంది.[2] అయితే ఇది వారు గ్రహించిన కావ్యవస్తువును, రసపోషణను, సమస్యా పరిష్కారాన్ని దృష్టిలో పెట్టుకుని కథావస్తువుకు అనుగుణంగా స్వీకరించిన నవ్యమార్గమే నని చెప్పుకోవచ్చు. అంతేకాని వారి తత్త్వంలో, వ్యక్తిత్వంలో అశుభం, అమంగళం అంగీకరిస్తున్నట్లు కనబడదు. ఈ జగత్తు 'సచ్చిదానంద కల్యాణ నిలయం' గా నమ్మే వారు 'కావ్యము వలన అర్థింప

---

1. "అక్బర్ హైదరీ తో మాట్లాడుతూ 'ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని' అన్న వాక్యం ఉపనిషత్తుల్లోంచి పలుకుతూ వచ్చారు. అక్బర్ హైదరీ చాలా హర్షించారు. ఆనందం నుంచి ఉద్భవం ఆనందంలోనే లయం పొందడం చాలా బాగున్నదీ ఈ తత్త్వం అన్నారు... అని చెప్పారు రాయప్రోలు".

   Interview with Sri J. Madhava Rama Sarma 30-3-81.

2. 'కష్టకమల', 'స్నేహలత' అటువంటి రచనలు.

దగిన పరమప్రయోజనము ఆనందము. ఆ ఆనందోపాసన కావించువాడే కవి..... మీరు ఆనందగీతములనే పాడుడు. ఆనందసూత్రములనే అల్లుడు. ఆనందమూర్తినే చిత్రింపుడు,"[1] అని ప్రబోధించారు. ఈ విధంగా వీరి విశ్వాసానికి ప్రాతిపదికగా ఉపనిషద్దృష్టి గోచరిస్తోంది.

'ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః' అను సూక్తిని అనుసరిస్తూ 'లవియింపకుము ప్రజాతంతువు' నను శ్రుతి శాసనము పాటించడం మానవాళికి ధర్మం అని రాయప్రోలువారు భావించారు. ఆ సూక్తిని శాసనంగా తలదాలుస్తూనే తమదైన అమలిన శృంగార సిద్ధాంతానికి రూపకల్పన గావించారు. ఉపనిషదుక్తిలోని ప్రజాతంతు ధర్మానికి భంగం వాటిల్లకుండా నవ్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీనిని బట్టి వేదోపనిషత్ సూక్తులు వీరి దృష్టిలో తగిన గౌరవాదరాలను కలిగి ఉన్నాయని తోస్తుంది.

వైదిక సంప్రదాయంలో అగ్నికి ప్రముఖస్థానం ఉంది. ఎన్నో వైదిక కర్మలకు అగ్నిహోత్రం సాక్షిభూతంగా అత్యావశ్యకంగా ఉంది. హవిర్భాగాలను ఆయా దేవతలకందజేసే వాహకుడైన దేవునిగా అగ్నికి ప్రధాన పాత్ర ఉంది. అగ్నిని భగవత్స్వరూపంగా భావించి, ఆరాధించి, పూజించడం ఋగ్వేదకాలం నుంచి వస్తున్న సంప్రదాయం. 'అగ్నిర్దేవో ద్విజాతీనాం' అని ప్రసిద్ధి. నిత్యాగ్నిహోత్రం విధిగా నిర్వహించడం అనాదిగా వస్తున్న వైదికాచారం. 'అగ్నిర్మూర్ధా దివః కకుత్పతిః పృథివ్యా అయమ్. అపాం రేతాంసి జిన్వతి' – 'అగ్నిరస్మి జన్మనా జాతవేదా ఘృతం మే చక్షురమృతం మ ఆసన్.'[2] అని అగ్ని

1. అభినవాంధ్ర కవిపండిత సమ్మేళనము - ద్వితీయ సమావేశం.
రాజమహేంద్రవరము - 28-12-33 - భారతి Feb 1934

2. ఋగ్వేదము 8-44-16; 3-26-7 - 'భారతీ నిరుక్తి'. (హరి సోదరులు)
లో ఉల్లేఖింపబడినది. అవతారిక P-21- P20.

ధ్వనింపబడింది. ఈ విధమైన సంప్రదాయ ధారలో

విసబడియె నాకఁ సూక్తి హృద్విపరమందు
స్తుతులు మూసి ముక్కోటి దేవతల వదలి
బ్రహ్మ విష్ణు రుద్రుల పరంపర త్యజించి
అగ్నిముఖమందె అమృతమ్ము నందు మనుచు.[1]

అని రాయప్రోలువారు అగ్నిని స్మరించారు.

హిందువుల దృష్టిలో ఓంకారానికి పవిత్రస్థానం ఉంది. వేదవిహిత శుభకర్మలకు, భగవదారాధనకు, వేదాధ్యయనానికి ఓంకారోచ్చారణే ప్రారంభం. ఓంకారం భగవత్స్వరూపంగా పూజలందుకోవడం, ఓంకారోపాసనా కూడా సనాతన సంప్రదాయంలో ఉన్నాయి.

'ఓమితి బ్రహ్మ ఓమితీదం సర్వమ్'[2] అంటుంది తైత్తిరీయోపనిషత్తు. సంప్రదాయజ్ఞులచే 'ఓం' అనే ప్రణవం శివశక్తి సమ్మేళనంగా త్రిమూర్త్యాత్మకంగా భావింపబడింది.[3] ప్రణవనాదం పవిత్రతను ఉద్ఘాటిస్తూ 'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మామనుస్మరన్'[4].... అంటుంది భగవద్గీత.

---

1. 'ధ్వనిగీతము' - జడకుచ్చులు - P 119
2. తైత్తిరీయోపనిషత్తు - శిక్షావల్లి - అష్టమానువాకం.
3. 'శక్తి అ+ఉ; శివుడు ఉ+మ్. ఈ రెండును చేరినపుడే ప్రణవమనెడి ఓంకారమేర్పడుచున్నది. ఆ నాదము నుండియే పరాపశ్యంత్యాదుల యుత్పత్తి. దాని నుండియే స్వరవర్ణపదవాక్యాదుల ప్రపంచము. అ,ఉ,మ్ అనువాని సంయోగమే ప్రణవము.... అవియే హరిహరవిరించులు'. 'శంకర గ్రంథ రత్నావళి' - పంచమ సంపుటము - శ్రీ సౌందర్యలహరి - విపులికర్త - శ్రీ శ్రియానంద నాథులు. ఈశ్వర సత్యనారాయణశర్మ - P7
4. భగవద్గీత - అష్టమాధ్యాయం - అక్షర పరబ్రహ్మ యోగం - శ్లోకం - 13

మాధురీ దర్శన ప్రారంభంలో దర్శనమిచ్చే

'ఓమిత్యేకాక్షరమ్ బ్రహ్మ
శ్రుతీనాం ముఖ్యమక్షరమ్
ప్రసీదతు సతాం స్వాంతే
స్వైకమ్ త్రిపురుషీమయమ్'.[1]

అనే శ్లోకం త్రిమూర్త్యాత్మకమైన ఓంకారంపై రాయప్రోలువారి భక్తి ప్రపత్తులను సూచిస్తుంది. రూపనవనీతంలో కూడా శబ్దబ్రహ్మ పావిత్ర్యాన్ని ప్రకటించారు.[2]

నరజన్మ దుర్లభం. మానవునిగా జన్మించడమే పుణ్యఫలం కాగా, అందులోనూ సంస్కారవంతునిగా జ్ఞానిగా జన్మించడానికి మరింత పుణ్యం చేసుకుని ఉండాలి. జీవి పుట్టుకకు, జీవితకాలంలోని మంచి అనుభవానికి పూర్వపుణ్యమే కారణం అంటుంది వైదికసాహిత్యం.

'జంతూనాం నరజన్మ దుర్లభమతః పుంస్త్వం తతో విప్రతా
తస్మాద్వైదిక ధర్మమార్గపరతా విద్వత్త్వమస్మాత్పరమ్
ఆత్మానాత్మ వివేచనం స్వనుభవో బ్రహ్మాత్మనా సంస్థితి
ర్ముక్తిర్నో శతకోటి జన్మ సుకృతైః పుణ్యైర్వినా లభ్యతే.[3]

'యేషా మస్తి పరిజ్ఞానం వినైవ జ్ఞాన సాధనం తల్పునం
తదారాధనం తేషాం పూర్వజన్మసు సూరిభిః'[4]

---

1. మాధురీ దర్శనము
2. రూపనవనీతం P 131
3. వివేకచూడామణి - శ్రీ శంకరాచార్యులు - శంకరగ్రంథ రత్నావళి Vol 6 - P3
4. శ్రీ స్కాంద మహాపురాణము - సూతసంహిత
   'వైదిక మత చరిత్రము' - గోపరాజు వైకుంఠరావు P 117 లో
   ఉల్లేఖింపబడింది.

ఇదే విధంగా రాయప్రోలు వారు కూడా అభిప్రాయపడ్డారు. నరజన్మ దుర్లభమని, అందులోనూ విద్వాంసునిగా జన్మించడం మరింత పుణ్యఫలమని, మానవుని సంపత్ప్రతికి బహుజన్మల పుణ్యం దోహదం చేస్తుందనే నమ్మకం వీరి సాహిత్యంలో కనబడుతుంది.[1]

“ప్రారబ్ధ కర్మణామ్ లోకే భోగాదేవ పరిక్షయః
ఆగామి నస్త్వనారంభాత్ సంచితస్యతు ధర్మతః।”
“హరిణాపి హరేణాపి బ్రహ్మణాపి సురైరపి
లలాట లిఖితా రేఖా పరిమార్ష్టుం నశక్యతే.”

అని ఆర్యోక్తి. పాప పుణ్య కర్మల ఫలం ఏదయినా అనుభవించడం అనివార్యం. ప్రారబ్ధం, సంచితం, ఆగామి అని మూడు విధాలుగా చెప్పబడ్డ కర్మలు జీవిని వెంటనంటే ఉంటాయి. వాటి ఫలం ఎటువంటిదయినా దాన్ని అనుభవించాల్సినదే కాని దానిని మార్చడం బ్రహ్మరుద్రాదులకయినా సాధ్యం కానిది. సాంప్రదాయికమయిన ఈ నమ్మకాలు, భావాలు రాయప్రోలు వారి సాహిత్యంలోనూ కనబడతాయి. ఈ విధమైన వారి ఆలోచనా విధానం వైదిక సాంప్రదాయిక మార్గంలోనిదనే చెప్పవచ్చు.[2]

జీవి కర్మఫలాన్ని అనుభవించిన తరువాత తిరిగి వేరే జన్మ ఎత్తుతుందన్నది వైదిక విశ్వాసం. జీవికి పునర్జన్మ ఉందనే నమ్మకాన్ని చాలా సందర్భాలలోని గీతా వాక్యాలు దృఢపరుస్తాయి. జీవి ఒక శరీరాన్ని వదలి వేరే శరీరంలో ప్రవేశిస్తుందని చెబుతూ జీర్ణవస్త్రాన్ని

---

1,2 రాయప్రోలు వారి “తత్త్వచింతన” విభాగంలో ‘జన్మకర్మ సిద్ధాంతాలు’- (రాయప్రోలు వారి సృష్టి) అనే శీర్షికలో ఈ భావాలు సోదాహరణంగా వివరింపబడ్డాయి. కనుక వారి రచనలనుంచి ఉదాహరణలు ఇక్కడ చూపలేదు.

వదలి నూతనవస్త్రాన్ని మానవులు ధరించినట్లే జీవి వేరొక శరీరాన్ని ఆశ్రయిస్తుందని అంటుంది భగవద్గీత.

'వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ'[1]

దీనికి ప్రతిబింబంలాగా కనబడుతుంది రాయప్రోలు వారు ఒక సందర్భంలో వెలిబుచ్చిన అభిప్రాయం.

'పాతగుడ్డలు పారవేతుము
క్రొత్తమడతలు కట్టుకొందుము
చావు బ్రతుకులు సత్యమింతే'[2]...

అంటూ పునర్జన్మ సిద్ధాంతం పట్ల తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ఆత్మలో భాయావాసనాదికంగా గతజన్మరాగరసాలు నిలిచి ఉంటాయని తైత్తిరీయం చెబుతుంది.

'యథా వృక్షస్య సంపుష్పితస్య దూరాద్గంధో వాత్యేవం పుణ్యస్య కర్మణో దూరాద్గంధో వాతి'[3]...

ఇటువంటి భావాన్నే భగవద్గీత కూడా వ్యక్తం చేస్తుంది.

'శరీరం యదవాప్నోతి
యచ్చాప్యుత్క్రామతీశ్వరః

---

1. భగవద్గీత - సాంఖ్య యోగము - 22 వ శ్లోకం
2. భద్రయాత్ర - మిశ్రమంజరి - P23
3. తైత్తిరీయారణ్యకం.

గృహీత్వైతాని సంయాతి

వాయుర్గంధానివాశయాత్![1]

సంప్రదాయసిద్ధమయిన ఇటువంటి భావాన్నే రాయప్రోలువారు సహితం తమ రచనలో కనబరచారు.

----- -----'ఆ కన్నెకే నోములిచ్చె

రాలుగరగించు గాంధర్వ గాలనమ్ము?

జన్మవాసన వెంత నైజములో జగతి.[2]

అని జన్మాంతరాలలో ఆత్మగతమైన కొన్ని భావాలు స్థిరంగా ఉంటా యన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మాయా మోహితుడయిన మానవుడు క్షణభంగురం అయిన జీవితంలో యదార్థ జ్ఞానాన్ని పొందలేక అసత్యాలను సత్యాలుగా భ్రమిస్తాడు. ఈ బంధాల వ్యామోహం మానవుని భగవత్ ధ్యానానికి జ్ఞానానికి దూరం చేస్తోంది. కనుకనే వేదాంతులు

"కిం యానేన ధనేన వాజి కరిభిః ప్రాప్తేన రాజ్యేన కిం

కిం వా పుత్ర కళత్ర మిత్ర పశుభిర్దేహేన గేహేన కిం

జ్ఞాత్వైతత్ క్షణభంగురం సపదిరే త్యాజ్యం మనోదూరతః

స్వాత్మార్థం గురువాక్యలో భజ భజ శ్రీ పార్వతీ వల్లభం."[3]

అంటూ ప్రాపంచిక విషయాలు అశాశ్వతాలని గుర్తుచేస్తుంటారు.

---

1. భగవద్గీత - పురుషోత్తమ ప్రాప్తి యోగము - 8 వ శ్లోకం
2. 'ఎవరు!' జడకుచ్చులు P 137
2. 'శివాపరాధ క్షమాపణ స్తోత్రం' - శ్రీ శంకరాచార్యులు
   శంకర గ్రంథరత్నావళి - vol 8 - P 88

అశాశ్వతాలయిన ఈ బంధాల వ్యామోహం వదలి జ్ఞానాభివృద్ధితో పరమాత్మధ్యాన తత్పరత పెంచుకోవాలంటుంది వైదికవాఙ్మయం. రాయప్రోలు వారు కూడా ఈ బంధాలు అశాశ్వతాలని అంటూ వాటికోసం శాంతిని వీడి అశాంతి పాలుకావద్దని ప్రబోధించారు.

---- "ఋద్ధత చంచలంబులయి మాయంగాదె ప్రాపంచికా
శ్రేయస్స్నేహ విరోధ భావములు; శాంతిన్ వీడగా నేలాకో!"[1]

'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అని ఆర్యులన్నట్లుగా మనసే బంధాలు పెంచుకోవడానికి గాని, ఆ బంధాల నుండి విముక్తి పొందడానికి గాని కారణం. మనస్సుననుసరించే వాక్కు, కర్మ ఉంటాయి. త్రికరణశుద్ధిగా చేసే ప్రతిపనికి ఆధారం మనస్సే కనుక మనసుకు ఈ బంధాలు అశాశ్వతాలన్న భావాన్ని అలవరచినపుడు దానిని అనుసరించి కర్మ దానంతట అదే సాధ్యం అవుతుంది. ఆ స్థితికి ముందుగా మనసుకు స్థైర్యం, ధైర్యం చిక్కి శాంతి పొందడం అవసరం. కనుకనే నేమో క్షణికాలయిన ఈ బంధాలకోసం శాంతిని వీడవద్దని అన్నారు రాయప్రోలు వారు. చిత్తశాంతి కలిగినపుడే మానవుడాశించిన పరమార్థాన్ని పొందడానికి ప్రయత్నించి కృతకృత్యుడు కాగలడు అని సూచించారు.

వైదిక సంప్రదాయంలో గోవుకు ప్రత్యేకస్థానం ఉంది.

'గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకాః సమస్తాః సుఖినో భవంతు'

అని సమస్త లోకాల సౌఖ్యాన్ని ఆశిస్తూ మంగళవచనం పలుకుతారు సంప్రదాయజ్ఞులు. లోకకల్యాణంతో పాటు గోవులకు సహితం శుభం

---

1. 'లలిత' - అభినవ కవిత - P210

కలగాలని, సుఖంగా వర్ధిల్లాలని ఆకాంక్షించడం వాటికిచ్చే ప్రాధాన్యాన్ని చూపుతుంది. హిందువుల దృష్టిలో గోవు పొందిన గౌరవాన్ని వైదిక వాఙ్మయం చూపుతుంది.

'నమో బ్రహ్మణ్య దేవాయ గోబ్రాహ్మణ హితాయచ
జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమోనమః'[1]

అని గోవులకు హితమొనర్చేవానిగా భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుడు ప్రణామాలందుకుంటున్నాడు. ఉపనిషత్తులతో పాటుగా గోవుకు కూడా ఉన్న పవిత్రతను సూచిస్తూ సర్వోపనిషత్తులు ధేనువులతో పోల్చబడ్డాయి.

'సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః
పార్థోవత్సః సుధీర్ భోక్తా దుగ్ధం గీతామృతం మహత్.'[2]

అని ఉపనిషత్తులు ధేనువులుగా వానిని పితికే గోపాలనందనుడు శ్రీకృష్ణునిగా, అర్జునుడు లేగదూడగా, ఆ ధేనువులిచ్చిన పాలు గీతామృతంగా భావన చేయబడింది.

"దేవాన్ భావయ తానేన తేదేవా భావయంతు వః
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ."[3]

యజ్ఞం చేత దేవతలను తృప్తిపరచి సంతుష్టులయిన ఆదేవతల వల్ల సర్వోత్తమమైన సంతోషాలు పొందడం వేదోక్తకర్మలలో ఒకటి. యాగంలో ప్రధానమయినవి మంత్రం - దేవత - హవిస్సు. బ్రాహ్మణుడు మంత్రం చదవగా యాగానికి తృప్తిపొంది యాగఫలాన్నిచ్చేది యాగదేవత. హోమానికి కావలసింది గోఘృతం.

---

1. మహాభారతము - శాంతిపర్వము, రెండవ అధ్యాయం, 13వ శ్లోకం
2. గీతాధ్యాన శ్లోకం
3. భగవద్గీత - కర్మయోగము - 11 శ్లోకం.

యాగానికి ముఖ్యమయిన హోమద్రవ్యాన్ని ఇచ్చేదిగనుక బ్రాహ్మణులతో పాటు ప్రత్యేకంగా గోవును పేర్కొనడం జరిగి ఉంటుంది. ఆ విధంగా పవిత్రమైన గోవును పూజించడం అనాదిగా వస్తున్న హైందవ ఆచారం.

రాయప్రోలు వారు గోవును ప్రత్యేకంగా గౌరవదృష్టితో వీక్షించడానికి, అభిమానించడానికి ఈ సంప్రదాయాన్ని పూర్వరంగంగా చెప్పుకోవచ్చు.

"నిర్మల కుటుంబ సుపయస్విసీమ తల్లి
కానల తనంత పెరిగిన కసవు మెసవి
ప్రేమ దుగ్ధమ్ము ముప్పూట పిదుకదేల?
పాలుద్రావ పూజించెడి బ్రాహ్మణులును
మాంసము భుజింప ఖండించు హింసకులును
ఒక్కటయి యేల గోవుల నుండనీరు
పుట్టి పెరిగిన ఇష్టభూముల సుఖాన!"[1]

అంటూ గోవుల పట్ల వారికున్న అభిమానాన్ని వ్యక్తం చేశారు. వారి రచనలో గోవు పదే పదే పేర్కొనబడుతూ ఉంటుంది. ఆవూ దూడల అనురాగాన్ని అధికంగా ప్రస్తావిస్తుంటారు. మాతృవాత్సల్య ప్రస్తావన వచ్చినపుడు ఆవూ దూడల వాత్సల్యక్రీడలను అతిరమ్యంగా చెప్తుంటారు. కావ్యాన్ని కూడా అపూర్వంగా ఆవుతో పోల్చి తమ ప్రత్యేకతను నిలుపుతున్నారు.[2] సందె

1. తెనుగుతోట - అభినవకవిత - P 330
2. పచ్చిపాడి యావు వంటిది కావ్యంబు
వేగఁ గుడిపి చేపురాగ దువ్వ
పిదుక నమృతమిచ్చు పాడుగ స్రద్ధితి కేని
కాయ విసరు జున్నుపాలు రావు
'తెలుగుతోట' నవనీతాలు P 23

కడల పల్లె ప్రవేశించు శ్రీను దేవతలు దర్శించి ఆనందిస్తుంటే దినాలు నిమిషాలుగా గడిచిపోయినవి"[1] అని అంటూ గోవు దేవత అన్న భావాన్ని వ్యక్తం చేశారు.

'న శివేన వినా దేవి దేవ్యాచ నవినా శివః

నైతయో రంతరం నాస్తి చంద్ర చంద్రికయోరివ'

అని చంద్ర చంద్రికల వలె శివశక్తుల అభేదం ప్రాచీనులలో భావింప బడింది.

"శివః శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం

నచే దేవం దేవో నఖలు కుశలః స్పందితుమపి

అతస్త్వామారాధ్యాం హరిహర విరించాదిభిరపి

ప్రణంతుం స్తోతుం వా కథ మకృత పుణ్యః ప్రభవతి"[2]

అని శక్తియుక్తుడయినపుడే భగవంతుడయినా శక్తివంతుడు, అభివ్యక్తుడు కాగలడని లేకుంటే స్పందన కూడా సాధ్యం కాదన్న భావం శక్తిప్రాధాన్యాన్ని సూచిస్తుంది.

రాయప్రోలు వారు స్త్రీకి ప్రముఖస్థానం ఇచ్చి గౌరవించడానికి శివశక్తులలోని ఈ శక్తిప్రాశస్త్య దృష్టి పూర్వరంగంగా భాసించిందనవచ్చు. 'పూర్వజా త్రిపురాంబికా' అని భావించిన సుబ్బారావుగారు స్త్రీని ప్రశమరాణిగా పరిగణించారు. 'స్త్రీ పురుషులకు పరంపరాగతముగానే ప్రధాన, ద్వితీయ స్థానములబ్బినవి'.... స్త్రీ లేకపోతే శ్రేయస్సు లేదు. ప్రపంచం అరిష్టదష్టమై నష్టమవుతుంది.... స్త్రీ లోకమందు అదృష్టంగా ఉన్న దివ్యస్వరూపం లేదు

---

1. 'రూపనవనీతమ్' - మొదటి రంగము - P 15
2. సౌందర్యలహరి - శ్రీ శంకరాచార్యులు శ్లోకం - 1

నాకు దర్శనమయింది."[1] అంటూ స్త్రీలో వారు భావనచేసిన శక్తిని, దివ్యత్వాన్ని అభివ్యక్తం చేశారు." ---- స్త్రీ గర్భంలో పురుషుడు సర్వసాధారణం. అందుకే లలితా సహస్రనామాల్లో 'పూర్వజా త్రిపురాంబికా' అని నామం. అంటే ఈశ్వరుడి కన్నా లలిత ముందు పుట్టింది అని నేను తీసుకున్నా. క్షేత్రానికే ప్రాముఖ్యం. --- బలం అంటూ స్త్రీది అని ఒక సిద్ధాంతం ఉంది. బిడ్డను మోసేది స్త్రీ కనుక మాతృగర్భానికి, మాతృమూర్తికి గౌరవం ఎక్కువ ఉండాలి."[2] అంటూ స్త్రీని గూర్చిన వారి తాత్త్వికదర్శనాన్ని వెల్లడి చేశారు సుబ్బారావుగారు. ఈ విశదమైన వీరి తత్త్వచింతనకు ఆదిశక్తి ప్రాధాన్యం కొంత దోహదం చేసినట్లు కనబడుతుంది. ఈ సృష్టి సమస్తం శివశక్తుల విన్యాసం అనే భావం వీరి ఊహలో కనబడుతుంది.

శివశక్తి సమ్మేళనం వంటిదే ప్రకృతి పురుష తత్త్వం. నిర్గుణమయిన పరబ్రహ్మ అవ్యక్తుడు. ఆ అవ్యక్తం చిల్లీలా విలాసంగా ప్రకృతి పురుషులుగా వ్యక్తమయి, తిరిగి ఆ ప్రకృతి పురుషుల కలయిక వల్లనే జగత్తులో సృష్టిరూపంగా వ్యక్తమవుతున్నది. ఈ చరాచర ప్రపంచమంతా ప్రకృతే. ఆ ప్రకృతి జడం. అటువంటి ప్రకృతికి ప్రాణమూ, చైతన్యమూ కలిగించింది పురుషుడు. అనాదీ, అనంతమూ అయిన సృష్టికి ప్రకృతి పురుషులు కారకులు. ప్రకృతి దేహం కాగా పురుషుడు చైతన్యం అయ్యాడు. సర్వభూతాలూ ఆ సంయోగం వల్లనే కలిగాయి. వారి సంబంధం అవినాభావమూ, పరస్పరాశ్రయమూ. రాధాకృష్ణ తత్త్వాన్ని ఈ విశదమైన ప్రకృతి పురుష యోగంగా భావనచేసే సంప్రదాయం ఉంది.

రాయప్రోలు వారు స్త్రీ పురుష దాంపత్య ధర్మాన్ని దర్శించిన

---

1. రూపనవనీతమ్ - అంతరంగము, బహిరంగము - P86, 56
2. Interview with Sri Rayaprolu on 8-7-81

పద్ధతి వెనుక ఈ తాత్త్విక దర్శన ప్రభావం కొంత ఉన్నట్లు తోస్తుంది. దాంపత్య ప్రసక్తి వచ్చినపుడు 'స్త్రీ పుంస యోగం' అన్న పదబంధాన్ని ఎక్కువగా ప్రయోగిస్తుంటారు. 'స్త్రీ పుంస యోగార్థ్మహా' అన్నట్లు వ్రాశాను. ఎక్కడా సంభోగం అన్న పదం వాడను.[1]

సీతారాముల అనురాగాన్ని, స్త్రీ పురుష సంబంధాన్ని ప్రకృతి పురుష యోగాన్ని గూర్చి వారు వెలిబుచ్చిన అభిప్రాయాలు వారు దాంపత్య ధర్మంలో ప్రకృతి పురుష యోగాన్ని, శివశక్తి సమ్మేళనాన్ని దర్శించారన దానికి బలాన్నిస్తాయి.

ప్రకృతి పురుషుల దివ్యప్రభావ రుచుల
సృష్టియందు దర్శింప వర్ణింపనయ్యె
ఏ తరమువిన ఛ్ఛాయలన్ స్పృహా ముఖాన
ఆదరించి ఆరాధింపరాదదేల?[2]

ఈ భావన వీరిలో ఉంది కాబట్టే వీరి 'మాధురీ దర్శనమ్' రచనలో శివశక్తి సమ్మేళనాత్మకమైన యోగస్పర్శ తెలుగా గోచరిస్తుంది. ఇదే అభిప్రాయాన్ని 'రూపనవనీతమ్' లో ఒక సందర్భంలో ఇలా అన్నారు. 'రామాయణములో సీతారాములు మిథునకామము విపాకమును పొందింది... దంపతీకృతమయిన ఆ కామం త్రివర్గ పరిబద్ధమైన శుద్ధకామం.... ప్రకృతి పురుషుల బ్రహ్మాండక్రీలయే కామం. ఏ తన్మహా మధుర యోగస్థాయియే రతి. సామాన్య జంతు సంతానము నందు రతి అంతటను బుజబుజూద్దీపన లక్షితంగా ఉంది. పుష్పిత బుద్ధీంద్రియులైన మానవులలో అది స్త్రీ పుంస యోగమై ఆత్మిక

---

1. Interview with Sri Rayaprolu 11-6-81
2. 'అర్ఘ్యమాలలు' - వనమాల - P44

సుఖానుభూతి నందింపగల సత్యాంశగా సిద్ధి పొందింది... ప్రాణిదాయకమైన పాశవిక దైహం ఇరువురిలోనూ అపరిహార్యంగా ఉన్నది. ఆ పశు ప్రవృత్తి ప్రసారములను మానుషంగా మార్గవించి సుమానుషంగా సౌష్ఠవించి సుకభూయు సుందరం కావించడమే స్త్రీ పుంస యోగం.... మానవ స్వరూపంలోనే ఈ వ్యవస్థ రెండు సగ సగాలుగా ఉన్నది. ఈ రెండు సగాలూ ప్రకృతి పురుష ప్రతిపత్తిలోనే ఉన్నవని కొందరు పురాణ బ్రహ్మవాదులనక పోలేరు. అకామంగా సృష్టి జరిగింది. నాడు మొదలు నేటి వరకును ప్రకృతి పురుషులు ఏకం కావలెనన్న అవ్యక్త సూత్రం ఇద్దరినీ సమంగానే లాగుతున్నది. అందువల్ల స్త్రీ పుంస యోగంలో కూడా ఈ ద్వంద్వ స్థితి విరుద్ధం కానక్కరలేదు.'[1] ఈ విధంగా వీరు భావించిన నరనారీ సంబంధం అయిన దాంపత్యధర్మంలో ప్రకృతి పురుష లీలాత్మకమైన యోగ పవిత్రత తొంగిచూస్తుంది.

## ప్రాచీన సాహిత్య ప్రభావం.

సీతారాముల అనురాగాన్ని అద్వైత మిథున యోగంగా 'బాష్పసత్రధువు'గా శ్రవణ పవనంగా భావించిన రాయప్రోలు వారికి రామాయణం అభిమాన గ్రంథం. కనుకనే "రామాయణం మీద 'faith' పెట్టు -- అది first poetry work" అని అంటారు.[2]

'కూజంతం రామరామేతి
మధురం మధురాక్షరం
ఆరుహ్య కవితా శాఖాం
వందే వాల్మీకి కోకిలం'[3]

---

1. 'రూపనవనీతకు' - ఏడవరంగము P112, 113, ఆరవరంగము 73,74
2. Interview with Sri Rayaprolu on 11-6-81
3. 'శ్రీ సుందరకాండ' - రాయప్రోలు - P1 లో ఉల్లేఖింపబడింది.

అన్న శ్లోకవ్యాఖ్యలో 'మామిడికొమ్మ మీద కలమంత పరాయణుడైన కోకిలస్వామికి మ్రొక్కెద'... అంటూ వాల్మీకి పట్లగల గౌరవం చూపారు. 'ఉత్తరరామచరిత'పై అభిమానానికి రామాయణం మీద తమ గౌరవం దోహదం చేసి ఉంటుంది.

రాయప్రోలు వారి తాత్త్వికచింతనపై అమిత ప్రభావాన్ని చూపినవాడు భవభూతి. భవభూతి అభివ్యక్తం చేసిన సుమానుష ప్రేమను ఆదర్శంగా గ్రహించారు రాయప్రోలు వారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అమలిన శృంగారసిద్ధాంతానికి రూపకల్పన చేశారు. దాంపత్య శృంగారంలో కాలక్రమంగా స్థిరంగా నిలిచి ఉండేది స్నేహమే నని వీరు అభిప్రాయపడడానికి భవభూతి గురువున్నాడు.

... 'కాలేనావరణాత్యయాత్ పరిణతే యత్ స్నేహసారే స్థితం'.[1] అన్న భవభూతి వాక్కు సుబ్బారావుగారు స్నేహానికి ప్రముఖస్థానం ఇవ్వడానికి ఆలంబనం అనవచ్చు. ఈ సుమానుష ప్రేమ వీరి ధ్యేయం. ఇటువంటి అభిప్రాయాన్నే ఒక సందర్భంలో వెలిబుచ్చారు. 'మిథునానురాగమునందు కూడ సంభోగ శృంగారమును గాక ఉపనాగరక సాహచర్యమునే యుపాదించును. భవభూతి ఆదేశించిన 'సుమానుష ప్రేమను' భావకవి ప్రాప్యముగా నారాధించుచున్నాడు. అతని రసోపాసనకు అధిష్ఠాన దేవత కూడా ఆ ప్రేమయే'.[2] ఈ విధంగా దాంపత్యంలో ఇంద్రియాతీతమైన అనురాగబంధాన్ని స్నేహంగా గుర్తించడంలో భవభూతి ప్రభావముద్ర రాయప్రోలు వారి మీద బలంగా కనబడుతుంది.

---

1. ఉత్తరరామచరిత - ప్రథమాంకం
2. అభినవాంధ్ర కవి పండిత సమ్మేళనము - ద్వితీయ సమావేశం
   భారతి - Feb, 1934.

"ఇయం గేహే లక్ష్మీ రియ మమృతవర్తి ర్నయనయో
రసావస్యాస్పర్శో వపుషి బహుళశ్చందనరసః"...[1]

వంటి వర్ణన రాయప్రోలు వారు వర్ణించిన స్త్రీ సౌందర్యవర్ణనకు తోడ్పడి ఉంటుంది. ప్రబంధకవుల శృంగారవర్ణనలు నచ్చని సుబ్బారావుగారి వంటి నవ్యకవికి స్నిగ్ధ సుకుమారమయిన ఇటువంటి వర్ణన ఆదర్శప్రాయం అయింది. ఉత్తర రామచరితలో సీతాదేవి వర్ణన తనకు నచ్చినట్లు మాటలలో కూడా అప్పుడప్పుడు చెప్తుంటారు.

'బంగరు పలచని రెమ్మను పచ్చిపసుపు
కొమ్మవలె మంగళమ్మాయి క్రుమ్మరింప
ఇంత వేసి కాటుక కండ్ల నుంపుకొనెడ
ముగుద ఆకలి దప్పులు మాయు చేయు'.[2]

రాయప్రోలు వారి రచనలో కనబడే ఇటువంటి సుకుమారమైన వర్ణనకు భవభూతి వర్ణనావిధానం ప్రాతిపదికగా తోడ్పడి ఉంటుంది. 'ఉత్తరరామచరిత' పై అభిమానంతో తెలుగులోకి అనువదించారు.

రాయప్రోలు వారు అభిమానించే మరొక మహాకవి కాళిదాసు.[3] కాళిదాసును గూర్చిన ప్రసక్తి లేకుండా వారు ప్రసంగించే సందర్భాలు చాలా తక్కువని చెప్పవచ్చు. పెంచిన ప్రేమకు ఉదాహరణగా శకుంతలపై కణ్వుని అనురాగాన్ని వీరు తరచు ప్రస్తావిస్తుంటారు. తొలకరి మేఘాన్ని చూడగానే అప్రయత్నంగా 'ఆషాఢస్య ప్రథమ దివసే' అని

1. 'ఉత్తర రామచరిత' - ప్రథమాంకం
2. 'పెండ్లిబగడం' - మిశ్రమంజరి - P 57
3. 'నాకు మొదటినుంచీ భవభూతి, కాళిదాసు అంటే చాలా ప్రీతి' ముఖాముఖి I, విమర్శిని 4 - అనుబంధం - P 32

కాళిదాసును స్మరిస్తారు.[1] 'శకుంతల', 'మాతమత్తేభము' వంటి వీరి రచనలకు కాళిదాసుపైగల అభిమానం కారణం కావచ్చు. ఇంతగా వీరభిమానించే కాళిదాసు ప్రభావం వీరి రచనపై ఉండటం సహజం. "'మేఘదూతం' నన్ను inspire చేసింది."[2] అంటూ మేఘసందేశం తనకు ప్రేరణ కలిగించిన రచనగా చెప్తారు. రాయప్రోలు వారి రచనల్లో ముఖ్యంగా పేర్కొనబడే తృణకంకణ రచనకు కాళిదాసు రఘువంశం దోహదం చేసిందని ఒక సందర్భంలో పేర్కొన్నారు. 'రఘువంశంలో అజవిలాప ఘట్టం నన్ను బాగా ఆకట్టుకుంది. అజమహారాజు అనుభవించిన వియోగ దుఃఖాన్ని కాళిదాసు వర్ణించిన విధం నా హృదయంలో ముద్రపడింది. తృణకంకణం వ్రాయటానికి అదొక కారణమైంది.'[3] అని రఘువంశం ఆకర్షించినట్లు స్పష్టం చేశారు. అజ విలాప ఘట్టం మీద ఉన్న ఈ అభిమానం వల్లనే నేమో 'కష్టకమల' లో సందర్భోచితంగా ఆ ఘట్టాన్ని తెలుగు చేసి కావ్యంలో ఇముడ్చారు. కేవలం ఒకటి అజ విలాపమే కాదనటట్లుగా 'కాళిదాస కవీంద్రుని నాటకత్రయము బహుపర్యాయములు

---

1. 1910 ప్రాంతంలో బందరు ప్రయాణం గూర్చి చెప్తూ 'గ్రీష్మం బాగా భీష్మంగా ఉండింది. రోళ్ళు పగిలినవి. అయితే ఆషాఢ ప్రథమ దివసం. దానిలో ప్రథమ పయోధరం. బాలకిరి కన్నె పరితెలో పయిట బాగా ఆకాశవీధిలో కన్పించినవి.'

   మధురస్మృతులు - మటూరి కృష్ణారావు (వ్యాసము)

   రాయప్రోలు సుబ్బారావు. కృష్ణాపత్రిక వజ్రోత్సవ సంచిక 14-2-64

2. 15-6-79 రేడియో ప్రసంగము

3. 'ముఖాముఖి' III రాయప్రోలు వాఙ్మయ సూచిక P35

సాకల్యముగా సమాలోచన చేసి, ఆ మీద వ్రణాకంకణము కూర్చినారు. నాటకత్రయ ప్రభావాన్ని ప్రస్తావించారు తల్లావఝల శివశంకరశాస్త్రిగారు.[1] వ్రణాకంకణంలో నాయకుడు నాయికకై చింతిస్తున్న ఘట్టంలో అజ విలాప ముద్ర కొంత కనబడుతుంది.

పాత్రల స్వభావానికి అనుగుణంగా అనుభూతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాయప్రోలు వారి అభిప్రాయం. అప్పుడు రచనకు జీవం వస్తుందని వీరి ఉద్దేశం. ఈ విధమైన వీరి దృష్టికి కూడా కొంతవరకు కాళిదాసు కారణం అని అనుకోవచ్చు. కాళిదాసు శకుంతలలోని పాత్రల అనుభూతుల వర్ణన తీరుని ఆకట్టుకుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని 'శకుంతల' అనువాదం చేసినట్లు కనబడుతుంది.[2]

"పురాణ మిత్యేవ న సాధు సర్వం న చాపి కావ్యం
నవ మిత్యవద్యమ్[3]......... ......" అన్న కాళిదాసు

---

1. 'వ్రణాకంకణ నీరాజనము' తల్లావఝల శివశంకరశాస్త్రి
2. "పాత్రలకు ఇంటిమసీని, పాత్రల ఫీలింగ్స్‌లో ఇంటెన్సిటీని కాళిదాసు నిరూపణ చేశాడు. అదే ఆ నాటకంలో కీలకం. ఇంటిమసీ వల్లనే కణ్వుడు, శకుంతల నాటకంలో పాత్రలయినారు. శకుంతలాదుష్యంతుల సంగతి కణ్వుడికి తెలిసింది. శకుంతలను ఏమీ అనలేదు. ఆమెను భర్త దగ్గరకు పంపటానికి అన్నీ సిద్ధం చేశాడు. ఆ నాల్గవ అంకం అంతా పాత్రల ఫీలింగ్స్‌ను పలకబోయడమే. పొయిట్రీ యే అలా ఉండాలి. ముఖ్యంగా డ్రామా.... అలా ఉంటేనే డ్రామా. నా శకుంతలానువాదం చూడండి..."

   'ముఖాముఖి' I రాయప్రోలు వాఙ్మయ జీవితసూచిక P32
3. 'మాళవికాగ్నిమిత్రము' - కాళిదాసు - ప్రస్తావన - 2వ శ్లోకం

భావానికి ప్రతిబింబం లాగా

'ప్రాతగిలిన మాత్రాన భద్రములు కావు
నవ్యమైన మాత్రాన నింద్యములు కావు'[1]

అని అన్నారు. రాయప్రోలువారు.

('తృణకంకణం' నాయిక వర్ణనలో 'కన్నెగేదంగి చెందునా కళుకు లాలయు, నా వెలంది యొడల్ నగవేవి వేక'...[2] సహజ సౌందర్యాన్ని వెదజల్లుతున్నదనే సందర్భం

--- 'ఇయమధికమనోజ్ఞా వల్కలేనాపి తన్వీ
కిమివహి మధురాణాం మండనం నాకృతీనామ్'[3]

అని వర్ణించిన కాళిదాసును తలపింప చేస్తుంది. ఈ స్నిగ్ధ సౌందర్యవర్ణనే కాదు, పెంపుడు లేడిని ఒకదానిని కల్పించడం, ఆ పెంపుడు లేడిలో నాయిక జరిపిన ముద్దుముచ్చట్లు శకుంతలను జ్ఞప్తికి తెస్తాయి.

'శ్యామా శ్యామల తామలమ్మగు ప్రవాసస్థాన పుణ్యాస్పదక
శ్రీమద్వాటికలన్'...[4]

అనే వర్ణనమయిన ఎత్తుగడలో కాళిదాసు ప్రభావముద్ర అతి స్పష్టంగా కనబడుతుంది.

'వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ'[5]

<u>కాళిదాసు ఆదిదంపతుల స్తుతిలోని ఈ వాగర్థ బంధ్యాన్ని అనుసరిస్తూ</u>

1. రమ్యాలోకము - P 28
2. తృణకంకణము - P. 1
3. అభిజ్ఞాన శాకుంతలము - ప్రథమాంకం - 18 వ శ్లోకం
4. స్వప్నకుమారము - P 22
5. రఘువంశము - 1 వ శ్లోకం.

రాయప్రోలు వారు

'విగళిత ముఖమై శబ్దము

వకిలివెడి అర్థము వచ్చు ధ్వని విశదము నన్'[1]

అని శబ్దార్థాల సంబంధాన్ని పేర్కొన్నారు. ఈ అర్థాన్నే ధ్వనింపచేస్తూ 'వాగర్థ' శబ్దాన్ని అక్కడక్కడ ప్రయోగించారు.[2] కాళిదాసుని స్తుతించడం కూడా వాగర్థ ప్రణయ పరంగానే కీర్తించారు.[3])

'యావద్వర్ణ్యాచరణకు ఆవలము శరీరమనిరి'[4] అని సుబ్బారావుగారనడం 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్'[5] అన్న కాళిదాసు వాక్కును గుర్తుకు తెస్తుంది.

స్వప్నకుమారములోన్ తెల్లసురపొన్నపూల సంకెళ్ళను త్రెంచనని ప్రమాణం చేస్తూ నాయకుడు

'....త్రెంచ వేనెట్టులోన్ సహియించువాడ

సన్నగిల్లు హస్తము నుండి జారువాక'[6]

అని అనడం 'కనకవలయ భ్రంశ రిక్త ప్రకోష్ఠః'[7] అన్న కాళిదాసు వర్ణనను

---

1. మాధురీ దర్శనము - P24.

2 (a) విహిత వాగర్థ శోభన విభూతి కలన
శబ్దకాండ మనంతమై శాఖసాగె - (రమ్యాలోకం P11)

(b) వాగర్థ విశ్వముఖమున
భోగింపనగు అనంత భావంబులలన్
రాగిలు మధు హవి
ర్భాగము .......

(c) సుకవి వాగర్థ బాంధవ స్ఫూర్తి రక్తి ... శబ్దములు నించు

(d) వాగర్థంబుల బాంధవంబు చివిరింపన్ -- 'నివేదన'. వనమాల P73

3. 'వాగర్థ ప్రణయము కీర్తించెదు మృదుకుసుములను భావింతుము'....
తృణకంకణము. P9

తలపిస్తుంది.

ప్రాచీన ఆంధ్రకవులలో నన్నయ ఛాయ కొంత రాయప్రోలు వారిపై కనబడుతుంది. 'శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షో ముఖాంగేషు, యే లోకానాం స్థితిమావహన్త్యవిహతాం స్త్రీపుంస యోగోద్భవాం' అనే స్తుత్యాత్మక పద్యంలో నన్నయ గ్రంథారంభం చేశారు. దీనికి సన్నిహితమైనది రాయప్రోలువారు భావన చేసిన నరనారీయోగం. కనుకనే స్త్రీపుంస యోగోద్భవా అన్న నన్నయ దృష్టి వీరిని ఆకర్షించి ఉండవచ్చు. దీనితో పాటు నన్నయలో వీరిని ఆకర్షించిన లక్షణం అక్షర రమ్యత.

'సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తిలో
నారసి మేలు నా నితరు లక్షర రమ్యత నాదరింప ...'[1]

అని నన్నయ పాఠకాదరణ పొందుతుందని భావించిన అక్షర రమ్యతపై సుబ్బారావుగారికి అభిమానం ఉన్నట్లు తోస్తుంది.

- - - - - - - - - - - - - 'ఈ తేగాతి తేగొత్తిడు
ధ్వనపనం జేటకి త్రిప్పుకొంక జననే! రమ్యాక్షర క్షోణికిన్'[2]

---

(contd) 4. 'నందా' - మిత్ర మంజరి - P 119

5. 'కుమార సంభవము' - పంచమ సర్గము - 33 వ శ్లోకం

6. స్వప్న కుమారము - P 23

7. మేఘ సందేశము - 2 వ శ్లోకం

1. శ్రీమదాంధ్ర మహాభారతము - అవతారిక - 26 వ పద్యం

2. 'సతమున్ క్షేమన వకాండ వారి' - వనమాల - P 39

అని వీరు ప్రార్థన చేయడంలో నన్నయ ఉద్దేశించిన అక్షరరమ్యత ధ్వనిస్తుంది. అక్షరరమ్యత శ్రవణసుఖాన్ని ఇస్తుందని వీరు భావించారు. నవ్యకవులు దానికి ప్రాధాన్యం ఇస్తారంటూ

'మృదుల సరళాక్షరముల సంమేళనమున
ఆర్ద్ర నవనీత మార్దవమందు నుడులు'[1]

అని అన్నారు. నన్నయ ప్రసక్తి వచ్చినప్పుడు అక్షర రమ్యతను గూర్చి ప్రస్తావించడం కనబడుతుంది.[2]

కొన్ని వర్ణనల మీద, పద్యపు ఎత్తుగడ మీద, పదబంధాలలో, క్రియారూపాలలో వీరిమీద తిక్కన, పోతన, శ్రీనాథుడు, పెద్దన వంటి ప్రాచీనాంధ్ర కవుల ప్రభావం కొంత కనబడుతుంది. కాని వీరి తాత్త్విక చింతనపై విశేషంగా వారి ప్రభావం కనబడదు. అయితే వీరికి పరిచితులు సన్నిహితులు అయిన కొందరు వ్యక్తులు వీరి ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేశారు. ఆ ప్రభావం వీరి తాత్త్విక దర్శనానికి కొంత దోహదం చేసింది.

---

1. రమ్యాలోకము - P 20
2. 'నన్నయాక్షర రమ్య ప్రసన్న ఫణితి - - -' రమ్యాలోకము - P1
'అక్షర రమ్యత నెరిగిన దక్షుడు. . . . .' మాధురీ దర్శనము - P9.

# రాయప్రోలు వారి మీద ప్రభావం చూపిన వ్యక్తులు

<u>పినతల్లి</u>: రాయప్రోలు వారి మీద అధికప్రభావం చూపిన వ్యక్తులలో ప్రథములు వారి పినతల్లి శ్రీమతి రామసుబ్బ నరసమ్మగారు. వారి మనసులో స్త్రీ వర్ణనల పట్ల ఆలోచన సాగి, స్త్రీని గూర్చి వారి ఉన్నత స్థిరభావాలను ఏర్పరచుకోవడానికి ఆవిడే ముఖ్యకారణం అని చెప్పవచ్చు. రాయప్రోలు వారు స్త్రీపట్ల చూపే గౌరవానికి, వారి రచనల్లో స్త్రీ గుణాలకు ప్రాధాన్యం లభించడానికి, స్త్రీలో వారు మాతృమూర్తిని దర్శించడానికి మూలాధారంగా వారి పినతల్లి నిలబడుతుంది. సుబ్బారావుగారు కవిగా రూపుదిద్దుకుంటున్న కాలంలో ఆవిడ మాటలు వారి మనసులో చెరగని ముద్ర వేశాయి. వారి ఆలోచనలకు ఆవిడ ఏ విధంగా ప్రేరేపణనిచ్చిందో స్పష్టంగా చూపుతాయి వారు చెప్పిన ఈ మాటలు.

"అయితే నా అంతఃకరణ తంత్రులను స్మృతి చేసిన ఛాయా సంధ్య మాత్రం గుర్తున్నది. అది నివేదిస్తాను. చద్ది అన్నం ఆరగుండా పాలూ మీగడా కలిపి తినిపించి నన్ను పెంచింది మా పిన్ని. ప్రతిదినమూ ఏ రామాయణమో, పురాణమో చదివి ఆవిడకు వినిపించే వాడుక ఉండేది.

ఒకనాడు అనసూయ చరిత్ర చదివి వినిపించాను. అది అంతా శాంతంగా విన్నది. చిట్టచివరకు 'నాన్నా! చూచావురా! త్రిమూర్తులు కూడా ఎలా తల్లికంటిలో చూస్తే చంటిపిల్లలైనారో? ఈలాంటి భావం మన కళాకలాపాలలో ఇంకా అధికంగా ఉంటే ప్రేమ భాండం బాగుండేదా? ఏ గ్రంథంలో విన్నా ఆడవాళ్ళను గురించి

ఏమేమో వ్రాస్తారు మగవాళ్ళు" అని అన్నది. కథ కంచికి పోయింది.
ఆ పలుకూ, ఆ స్వరమూ, ఆ శ్రుతీ కూడా నాలో ఏ పచ్చని పడక మీదనో శయనించి నిదురపోయినవి. కాని అనంతరం ముక్తకంఠమైన నా రాగానికంతా అదే అమృతబీజమని విధేయ విజ్ఞాపన. అది మొదలు కాని 'క్షీరసాగర శయనా' అనే గీతం వినబడితే ప్రేమరూపిణి యైన తల్లి ఆమె వక్షస్థలం మీద స్తన్యపానం చేసే శిశువూ నా హృదయాంబరం మీద దర్శనమిస్తారు".[1] రాయప్రోలు వారు సమస్త ప్రకృతిలో మాతృమూర్తిని దర్శించడానికి వారి పినతల్లి పలుకులే నేపథ్యంగా నిలిచి ఉంటాయి. పద్మభ్రమరాలకు వినూత్నంగా మాతాపుత్ర భావం కల్పించడం,[2] ఆకాశం నీళ్ళాడబోయే ఇల్లాలుగా వీరి మనో నేత్రాలకు భాసించడం[3]. భూదేవి సుఖప్రసూతగా గోచరించడం[4] వంటి వీరి ప్రత్యేకతలకు పరోక్షంగా వారి పినతల్లి కొంతవరకు కారణభూతురాలు కావచ్చు.

ప్రాచీన సాహిత్యంలో స్త్రీ వర్ణనలను గూర్చి వీరికి విమర్శనాత్మక దృక్పథం ఏర్పడడానికి, స్త్రీ వర్ణనలలో 'కచకుచాది వర్ణనలలో

---

1. 'నా బాల్య రచన' (రేడియో ప్రసంగము) - ప్రతిభ - అక్టోబరు 1941
2. 'దప్పిగొని చేరిన మిళింద తనయులకును
   పూలపాలిచ్చి చేకట్టు పోవకుండ
   కడుపులో దాచుకొనదె పంకజము' - స్వప్నకుమారము - P 26
3. 'ఆకాశము నీళ్ళాడునట్టి ఇల్లాలి వలె కనబడ్డది' ఆముఖము.
   మాతృమత్తేభము
4. '... భూదేవి సుఖప్రసూత పగిదిన్ ...'
   'జనాశ్రయము' - వనమాల - P 71

అలంకృతము కాకపోతే కాంతాసౌందర్యము రూపుకట్టదా[1] అనే మనో రిరంస వీరిలో కలగడానికి, వారి పినతల్లి వారిలో అనసూయ కథా ముఖ్యంగా కథించిన చిన్న ఆధారం ప్రధాన కారణం.

కావ్యవస్తు నిర్ణయంలో కూడా వారి పినతల్లి ప్రభావం కనిపిస్తుంది.[2]

శ్రుతిః క్షమా దయా శౌచం
కారుణ్యం వాగనిష్ఠురా
మిత్రాణాం చానభిద్రోహః - ...

అనే ఏడు గుణాలను ప్రాధాన్యమిస్తూ రాయప్రోలు వారి కావ్యనాయికలు సృష్టించబడ్డారు. రూపనవనీతంలో ఒక పాత్ర ముఖ్యంగా ఆ గుణాలు 'పినతల్లి చెప్తుండేదని' చెప్పించారు[3]. కష్టకమల కావ్యానికి ఆధారం అవతరిన సంఘటన వారి పినతల్లి చెప్పగా విన్నట్లు పీఠికలో వ్రాశారు[4]. పినతల్లి కోరిక మీద భజగోవింద శ్లోకాలను అనువదించారు.

1. 'నివేదన' - తృణకంకణము
2. 'సుబ్బారావుగారికి తమ పినతల్లి మీద మిక్కిలి భక్తి. వారిని ఉత్తేజితులను గావించినవారిలో ఆ చల్లని తల్లికి ప్రత్యేక గౌరవ స్థానము కలదు. ఉదాత్తమైన సంస్కృతి కల ఆ సాధ్వి ప్రభావము సుబ్బారావుగారు ఉపయోగించు పదజాలము మీదనే కాక వారు స్వీకరించిన కథావస్తువు మీద వర్ణనల మీద కనబడుచున్నది.'
'సారస్వత నవనీతము' - వేములపల్లి రామానుజరావు - P93
3. రూపనవనీతము - P86.
4. 'ఇది జరిగిన ఆగంతుకమని మా పిన్ని చెప్పగా ఎప్పుడో విన్నాను. --- మనసులో మసలుచున్న ఆ భావన కొంతకాలానికి ఈ కృతిగా రూపొందినది'. 'కష్టకమల' - ప్రకరిక.

వారి పినతల్లిని సూచిస్తూ రచనలలో అక్కడక్కడా పినతల్లి పాత్ర సృష్టించడం కనబడుతుంది. రచనలో అసంకల్పితంగా 'పిన్ని'ని గూర్చిన ప్రస్తావన వీరికి పినతల్లిపై కల అభిమానాన్ని సూచిస్తుంది.[1] "నాయనా! చెప్పిన మాటలన్ విననప్పు నీకుం బోధకు - -" అని వారి పినతల్లి అంటుండేదని ఆ నాటి మాటలనే పెట్టి వ్రాశానని ఒక సందర్భంలో రాయప్రోలు వారు అన్నారు.[2]

ఈ విధంగా వీరికి జ్ఞానచక్షువు నిచ్చి తాత్త్విక దర్శనానికి దోహదం చేసిన విదుషీమణి వీరి పినతల్లి. అందుకే ఈ కవికి పినతల్లిమీద ప్రీతి చాలా హెచ్చు. ఆమె వాత్సల్యపూరము

---

1. 'మధు: ఆహా. స్మృతికి వస్తున్నది. ఆభరణాలు ధరించేటప్పుడు పాడవలసినదని మా పిన్ని ఎప్పుడూ చెప్పేది.
   .... చెంపలు దువ్వి, తిలకము దిద్ది, చేరా దివికా సవరించి కన్నెను తీర్చే పిన్ని ప్రేమనూ... విప్పారేటట్లు రచించాలి.'
   రూపనవనీతమ్ - P 86, 65.
   'ననుగని పాలవైచి ప్రాణములు విడచె
   అనతి దండాన మాయమ్మ అది మొదలుగ
   పెంచిరెల చేతులం బెట్టి పిన్ని తోడ
   సకల బాంధవ్యము వాత్సల్య దృష్టి' - 'ఏవరు'- జడకుచ్చులు P135
   ... 'నిద్దురలు వాయక యుంది దనుంగు చెల్లెలన్
   జ్ఞానవతీ శిరోమణి ప్రసన్న గుణోదయ నాదు పిన్నియున్'
   'కనకము' - జడకుచ్చులు - P 151
   'పిన్నిలో వెనక వచ్చుచు వింటినేను' – స్నేహలత - అభినవ కవిత P293
2. 'కనకము' - జడకుచ్చులు P150

ఆస్వాదిస్తూ దాన్ని సందర్భాలలో ఆమె పలుకులే పద్యాలలో చూపించారు. ఆమె అనేక విషయాలు అవగాహన చేసుకున్న విశాల హృదయ; లోక యాత్రలో క్లిష్ట గ్రంథులు విప్పివేయగలిగిన వివేకవతి. ఆమె సూక్తులు ఈ కవీంద్రుని కళకు దోహదం చేసినవి.[1] అని తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి గారన్నారు.

<u>మేనమామ:</u> ఒక విధంగా రాయప్రోలు వారి మేనమామను వారికి గురువుగా చెప్పుకోవచ్చు. సుబ్బారావు గారికి చేయి విడిచిన మేనమామ అయ్యారి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. వీరు సంస్కృతాంధ్రాలలో గొప్ప పండితులు. తిరుపతి వేంకటకవులలో

'అన్నంబెట్టెడివాఁడు జుట్టంబతఁడు విద్యాభ్యాసకుఁడున్ నేర్పి వెం
కన్నీయందు లతంబు గానను జుమీ దోషంబు మన్నాత్రపుల్
నన్నున్ మాన్పెను వారి యాశువుల వంశంబెల్ల నయ్యారి సు
బ్బన్నా! చూపి యిటిమున్ కీర్తిని సుమ్మా శిష్యచూడామణీ'[2]

అని ప్రశంసింపబడిన శిష్యులు. విద్వాంసులైన మేనమామ వద్ద సుబ్బారావుగారు సంస్కృతాంధ్ర కావ్యాలను దాదాపుగా అన్నింటిని పఠించారు. 'తనకు సాహిత్య విద్యాగురువు మామయ్యే' అని వారంటారు. (అభిజ్ఞాన శాకుంతలం, ఉత్తర రామచరితలు మేనమామ వద్ద తలంకషంగా చదివారు. ఇంట్లో గురువు దగ్గర చదువుతున్న ఆ చదువు ఆ కావ్యాల మీద అభిమానం పెరగడానికి దోహదం చేసింది.)

---

1. 'నీరాజనము' - వృద్ధాకంకణము - తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి
2. వేంకట శాస్త్రి - శ్రీ వేమవరాగ్రహార శతావధానము 'నానారాజ సందర్శనము' - P 133

మేనమామ ప్రోత్సాహంలో రాయప్రోలు వారు కవిత్వం చెప్పడం నేర్చుకున్నారు. వీరి ఆశుకవితా ధారణకి కూడా వీరి మేనమామే కారణమయ్యారు. మేనమామతో కలిసి కొంతకాలం అవధానాలు చేసేవారు. మేనమామ తన ఆశుకవితాధారణ ప్రారంభానికి ఏవిధంగా ప్రోత్సాహమందించేవారో ఇలా వివరించారు.

"శ్రీ శాస్త్రిగారు ఆశుకవిత్వకలాపం ప్రారంభించారు. గార్లపాడు చెరువు మీద వృద్ధవటవృక్షమున్నది. ఆ చెట్టు చల్లని నీడలలో ఆశువుగా వాగ్ధారణ సాగింది. నన్ను పిలిపించి వెంట ఉంచమన్నారు. అక్కడక్కడ 'అందుకోరా' అనేవారు. ఏదో నేను కూడా అనుసరించేవాడిని. తరువాత శ్రీ శాస్త్రిగారు అవధాన ఆశుకవితా దీక్షలో బయలుదేరిరి. నన్ను వెంటరమ్మన్నారు. మొట్టమొదట కావలిలో దిగినాము.... అక్కడినుండి నెల్లూరు వెళ్ళాము.... నెల్లూరులో ఆశుకవితా సభకు వావిలికొలను సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు. ప్రభావతీ ప్రద్యుమ్నము ఆశువుగా చెప్పుతున్నారు. అది ఆశువులో రక్తి కట్టుతుందా.... సభ నీరసంగా ముగుస్తుందను శంక తగిలింది. శ్రీ శాస్త్రిగారు ధ్యానాధికం జరిపి నెల్లూరి రసిక జనానికి స్వాగతపద్యాలు చెప్తున్నారు. ఇంతలో నేనొక పద్యం కూర్చాను."[1] ఆ విధంగా రాయప్రోలు వారి కవితాధారణకి చేయూత నిచ్చారు వారి మేనమామ. సుబ్బారావుగారికి కవితాధార, ధారణా శక్తి పట్టుబడడానికి, సంస్కృతాంధ్ర సాహిత్యాభిమానం ఏర్పడడానికి

---

1. 'తెలుగు కావ్యాదర్శము'. ఆంధ్రీకర్త అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి పీఠిక - రాయప్రోలు సుబ్బారావు.

పాండిత్యం వృద్ధి చెందడానికి వీరి మేనమామ కారణభూతమయ్యారు. వీరి ఆధ్యాత్మిక చింతనను కూడా వీరికి మేనమామలో ఉన్న సాన్నిహిత్యం కొంత దోహదం చేసింది![1]

రవీంద్రుడు: 'గీతాంజలి' నోబుల్ బహుమతి పొందడంతో రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రపంచప్రసిద్ధుడయ్యాడు. గురుదేవుడనే విశ్వకవి అనే పేరుప్రఖ్యాతులు విస్తరించాయి. రాయప్రోలువారు మద్రాసులో ఉన్నకాలంలో గీతాంజలిని గూర్చిన వార్తలు వెలువడ్డాయి. భారతీయులలో చాలామంది లాగానే రాయప్రోలువారు కూడా గీతాంజలి మీద అభిమానంతో దానిని చదవాలనే ఆతృత కనబరిచారు. గీతాంజలి చదివిన తరువాత ఆ రచన మీది అభిమానం రచయిత మీదకు మళ్ళింది. రవీంద్రుని చూడాలని, ఆయనవద్ద ఉండాలనే కోరిక జనించింది. దీని ఫలితమే రాయప్రోలువారి శాంతినికేతన నివాసం. "... ఆ సమయంలోనే గీతాంజలి బయటికి వచ్చింది. పేపర్లలో దానిని గురించి వ్రాస్తున్నారు. చదువుదామంటే పుస్తకం బజార్లో దొరికేది కాదు. బసవరాజు అప్పారావుగారు ఆ పుస్తకాన్ని ఒక క్రిష్టియన్ దగ్గరనుండి పట్టుకొచ్చారు. అప్పుడు నేను కూడా దానిని చదివాను. ఏమీ అర్థం కాలేదు. అయితే రవీంద్రనాథ ఠాగూరును చూడాలని శాంతినికేతనంలో చదవాలని బాగా

---

1. "ఈ కవిశేఖరుని లోని ఆధ్యాత్మిక దృష్టికి అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి యనుగ్రహము పుష్టినిచ్చినది. ఆ బ్రహ్మణ్యుని పొలిక ఈయనలో చాలా భాగమున్నది."
'ఆంధ్ర రచయితలు'. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి P462

అనిపించసాగింది. రవీంద్రనాథ్ ఠాగూరుకు ఉత్తరం వ్రాశాను. - - - - ఆయన రమ్మని ఉత్తరం వ్రాశారు. . . . కలకత్తా వెళ్ళాను."[1] అని అన్నారు సుబ్బారావుగారు.

రాయప్రోలు వారిలో రవీంద్రుని మీదఉన్న అవ్యక్తాభిమానం శాంతినికేతన ప్రయాణంలో గురుభావంగా స్థిరపడింది. తమ అభిప్రాయాలకు దగ్గరిపోలికలున్న అభిప్రాయాలు గల రవీంద్రుని పట్ల భక్తిగౌరవాలు వృద్ధి పొందాయి. వారిలో అంతకు పూర్వం ఉన్న భావాలు గురుదేవుని శుశ్రూషతో స్థిరరూపాన్ని పొందాయి. శాంతినికేతనంలో సాహిత్యవిద్యారహస్యాలు, కవితారహస్యాలు తెలుసుకునే అవకాశం సుబ్బారావుగారికి కలిగింది. విధుశేఖర భట్టాచార్య, నందలాల్ బోస్, ఆండ్రూస్, పియర్సన్ మొదలైన పండితుల పరిచయం వారిలోని ఎన్నో సందేహాలను తీర్చింది. "నా సందేహాలన్నిటికీ శాంతినికేతనంలో సమాధానాలు దొరికాయి"[2] అని అంటారు సుబ్బారావుగారు.

రాయప్రోలువారు శాంతినికేతనానికి వెళ్ళేటప్పటికే చాలా రచనలు చేశారు. వారి రచనలలో ప్రసిద్ధమైన తృణకంకణం కూడా రవీంద్రుని వద్దకు వెళ్ళక పూర్వమే వ్రాశారు.[3] అంటే స్త్రీని గూర్చి, ప్రేమతత్త్వాన్ని గూర్చి, అమలిన శృంగార సిద్ధాంతాన్ని

---

1,2 విమర్శిని - 4 అనుబంధం - P38

3. "నవ్యసాహిత్య పరిషత్తు నవమ వార్షికపు టుపన్యాసములో రాయప్రోలు తన రచనలు జరిగిన తరువాతే తాను శాంతినికేతనము వెళ్ళి వచ్చినట్లు చెప్పినారు." నవ్యాంధ్ర సాహిత్యవీధులు కురుగంటి సీతారామయ్య P212

గూర్చి వీరి అభిప్రాయాలు రవీంద్రుని పరిచయానికి పూర్వపువే అని చెప్పవచ్చు. కాని రాయప్రోలు వారి అభిప్రాయాలను రవీంద్రుని అభిప్రాయాలను చాలా దగ్గర పోలికలున్నాయి. రవీంద్రునికి అంతేవాసి కావటం రాయప్రోలు వారి భావాలను స్థిరరూపాన్నిచ్చింది.

"పకపక నవ్వేటి పసిబాల పెదవులన్
పొంకపు వన్నెలు పూయు పడతి క్రాల్గన్నులన్
చనుబాలు జిడిగానే జనని నిండు మొగాన
ప్రేమ కళాంశవే వీక్షించినాను
కోమల హృదయాన గురుదేవ నీవు".[1]

రవీంద్రుని ప్రేమ భావనారీతి వీరినాకర్షించినట్లు ఇక్కడ తెలుస్తున్నది. రవీంద్రుని పట్ల ఆకర్షణ పెరగడానికి గౌరవాభిమానాలు అభివృద్ధి కావడానికి ఈ ప్రేమ లక్షణం కూడా కొంత దోహదం చేసి ఉంటుందని ఊహించవచ్చు. ఎందుకంటె వీరి అమలిన శృంగార సిద్ధాంతంలో మౌలికంగా వీరు ప్రతిపాదించదలచుకున్న ప్రేమ తత్త్వంలో పైది కూడా భాగమే. పుత్ర వాత్సల్యాన్ని, తల్లిపట్ల ఆత్మీయతానురాగాలను, యౌవన శృంగార భావనను ఒకే ప్రేమ దృష్టిలో వీక్షించడం వీరి ఆదర్శం. అదే ప్రేమ భావన రవీంద్రునిలో వీరు గమనించారు. దానివల్ల గురుదేవుని వైపు అతి త్వరగా ఆకర్షితులయి ఉంటారు. కనుకనే రవీంద్రుని ప్రతిభను గూర్చి చెప్పేటప్పుడు ఆ ప్రేమ వైశిష్ట్యాన్ని ముందుగా ప్రత్యేకించి పేర్కొని ఉంటారు.

స్త్రీని కేవలం కామ దృష్టిలో కాక హృదయపూర్వకంగా ఆమె దివ్యగుణాలను

1. 'శ్రీ రవీంద్ర కవి' - ఆంధ్రావళి - P44

ఆరాధించడం రవీంద్రుని విశిష్టలక్షణం.[1] స్వర్గహైతే బిదాయ్ లో రవీంద్రుడు స్త్రీమూర్తికిచ్చిన స్థానం సరిగా రాయప్రోలు వారి భావాలకు దగ్గరిది. "....ప్రేమకి మంచితనానికి సంకేతంగా స్త్రీ యొక్క రెండో పక్షాన్ని ఠాకుర్ స్వర్గహైతే బిదాయ్ లో ప్రదర్శించారు. మాతృమూర్తిగా అవతరించి ఓర్పుతో సమస్తం సహించే స్త్రీ కి ఇది స్తోత్ర రూప నివేదన..."[2] స్త్రీని దేవీ స్వరూపంగా మాతృమూర్తిగా దర్శించడం రాయప్రోలు వారి అభీష్టం. "రవీంద్ర మహాకవి వలపూ, స్నేహమూ, అభిమానమూ, సానుభూతీ, ఇష్టమూ అన్న ఆకర్షణలకు ప్రాయమైన ప్రేమ విశ్వవ్యాప్తి అని గుర్తించారు. రవీంద్రుని సాహచర్యము తో రాయప్రోలు వారికి ఆయనగారి విశ్వప్రేమానుభవము గట్టిగా తాకింది. రాయప్రోలు వారు అప్పటికప్పుడే హెర్మిట్, డోరా అన్న కావ్యాల్లో శరీరాకర్షణను దాటిన ప్రేమను ప్రపంచించి ఉన్నారు. రవీంద్రుని కావ్యాల తాకిడి కూడా తాకేసరికి వారు ప్రేమను గురించి భగవద్గీతలు పలకడం ప్రారంభించారు.[3]

రవీంద్రుడు ఆధ్యాత్మిక నైతిక విలువలకు ప్రాధాన్యం

---

1. 'దివ్య స్త్రీమూర్తిని ఇంత హృదయపూర్వకంగా ఆరాధించడం మనకు నేర్పినది రవీంద్రుడే.'
   'సాగుతున్న యాత్ర' - ఆవంత్స జానకిరామ్ P 100
2. 'వంగసాహిత్య చరిత్ర' - సుకుమార్ సేన్
   అనువాదం - కొత్తపల్లి వీరభద్రరావు P 288
3. 'ఆంధ్రకవిత్వము మీద రవీంద్రకవి ప్రభావము' (వ్యాసము)
   శ్రీపాద గోపాలకృష్ణమూర్తి - ఆంధ్రపత్రిక ఉగాది సంచిక
   1963-64.

ఇచ్చే వ్యక్తి. మానవత్వాన్ని నమ్మిన జాతి మత వివక్షణారహిత దృక్పథం ఆయనది. ఆయన ప్రేమ విశ్వవ్యాప్తమనీ సృష్టిప్రేమమయం అనీ నమ్మినవారు. సుఖ దుఃఖాలు ప్రాణికి సహజమైనవే అయినా దుఃఖానికి కృంగిపోక ఆనందాన్వేషణలో సాగిపోవాలనే ఆదర్శం రవీంద్రునిది. ఈ అభిప్రాయాలన్నీ సుబ్బారావుగారి రచనల్లో కనబడతాయి. రవీంద్రుని కవితామాధుర్యం రాయప్రోలువారి గేయ రచనలలో తొంగిచూస్తుంది. వీరిలోని సౌందర్యారాధనను కవితా దర్శాలను రవీంద్రునికి అంతేవాసికావటం మెరుగులు పెట్టిందనుకోవచ్చు.

స్వాతంత్ర్యం, సర్వమానవ సౌభ్రాత్రం, మానవత్వం ప్రదర్శిస్తూ దేశభక్తి గేయాలెన్నిటినో ఠాకుర్ వ్రాశారు. ఈ దేశ భక్తుని సాంగత్యం రాయప్రోలువారిలో అచంచల మాతృదేశాభి మానానికి, నాదు జాతి - నా దేశము - నాదు భాష అనే భావం బల పడడానికి కొంతవరకు ప్రోద్బలకమై ఉండవచ్చు.

రవీంద్రుని సాహిత్యప్రభావం దాదాపుగా ఆనాటి కవులందరి మీదా ప్రసరించింది. అటువంటప్పుడు రవీంద్రునితో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న రాయప్రోలువారి మీద గురుదేవుని భావాల ప్రభావం చూపడంలో ఆశ్చర్యం లేదు.[1] రాయప్రోలువారి

1. "భారతీయ నవ్యసారస్వత ప్రబోధానికి ప్రతిష్ఠాతలైన రవీంద్ర, అరవింద, సరోజినుల కావ్యకల్పనలలో వికసించిన ఆదర్శాన్వేషణ సమాశయ ప్రశస్తి సౌందర్య పిపాస - ఈ మూడు గుణాలూ - తెలుగుదేశంలో వారి అనుయాయులైన రాయప్రోలు, అబ్బూరి కవుతిరుపతి కావ్యాలలోను ముఖ్యంగా ప్రతిబింబితమవుతాయి..."
'నవ్యకవిత్వము - భావచిత్రణ' (వ్యాసము) మల్లవరపు విశ్వేశ్వరరావు భారతి - 1939 ఏప్రిల్.

రచనలలో 'వసంతము', 'ఉత్సర్జన' రవీంద్రుని గీతాలకు అనువాదాలు. 'తెనుగు తోట' లోని 'ఆవాహన'లో 'జలకన్యలు' లోని 'విరహపక్షి'లో ఠాకుర్ పద్ధతిలో వాసకసజ్జిక వేచిఉండడం వర్ణించారు. రవీంద్రుని మార్మిక వాదం సుబ్బారావుగారి మీద కొంత ప్రభావం వేసింది. రవీంద్రుని ప్రయోగ ప్రభావం 'రూపనవనీతమ్' రచనావిధానం మీద కనబడుతుంది.[1] "సంక్రాంతి యను గేయముపై వ్యావహారిక పదప్రయోగ విషయములో రవీంద్రుని ప్రభావమున్నదని రాయప్రోలు వారే... అన్నారు. 'యుద్ధభిక్ష' లోని కథ రవీంద్రుడు వ్రాసిన 'శ్రేష్ఠభిక్ష' అనిన గేయములోనిది. 'పాలబాన' (ఆంధ్రావళి) పై రవీంద్రుని భావనాప్రభావమున్నది.... 'స్నేహసంవరణము' పై గీతాంజలి లోని పదమూడవ గీతము, ఇరువది ఆరవ గీతము ప్రభావము లేశప్రాయముగా కనిపించుచున్నది..... గీతాంజలి లోని ఈ రెండు గీతములలో భక్తుడు (ప్రేయసి) భగవంతుని (ప్రియుని) రాకకు చేసిన నిరీక్షణము చిత్రింపబడినది. భక్తుడు భగవంతుని రాకకు నిరీక్షింపగా అతడెంతకూ రాలేదు. కొంత సేపటికతని పదధ్వనులింటి ముంగిట వినిపించినవి.

'I have not seen his face, nor have I listened to his voice; only I have heard his gentle footsteps from the road before my house'. (గీతాంజలి 13 వ గీతము)

---

1. 'మా గురుదేవులు ఇలాటి రీతిలో చిన్న చిన్న రచనలు వ్రాసి నాటికలని పేరు పెట్టారు?'
'రూపనవనీతమ్' - నివేదన

ఈ భావమే కించిద్భేదముతో

'జీలవనంబున జేరిననాకు
నా బాధ రాదేమి నానాయకుండు' (జడకుచ్చులు)

అని రాయప్రోలు వారి కవిత్వములో తొంగిచూచినది.

'నాకిటు పొంత నా వల్లభుడుండ
చూచి సైపగ లేదె సుకవి నామనసు'

అనెడి పంక్తులలో ఈ భావమే మంతకాసము చేసినది. అట్లే గీతాంజలి లోని

'He came when the night was still; he has his harp in hands; and my dreams became resonant with its melodies'

(26వ గీతములోని భాగం)

అను పంక్తులలోని అభిప్రాయమే ఇంకాక విశదముగా రాయప్రోలు వారి,

'... దీపము తీసి శయనింప బోయెడు సమయమునందు బోటియ్యనుడు సోలుచును వచ్చు సఖిరా'

(సఖీసంవరణము)

అను పాదములలో వ్యక్తమైనది. రవీంద్రుని గేయములో భక్తుడు ఎదురు చూచి ఎదురుచూచి నిద్రించుచుండగా ప్రభువు వచ్చును. రాయప్రోలు వారి రచనలో ఎదురుచూచి ఎదురుచూచి విసిగి నిద్రించుట మనుకొనుచుండగా ప్రభువు వచ్చును. ఇంతే భేదము. కాని ఈ రచనలో రవీంద్రుని తత్త్వము స్పష్టముగా కనిపించును.*1

1. 'ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు.'
C. నారాయణరెడ్డి P 296-297

రవీంద్రుని మీది అభిమానంతో ఆయన కవితా మాధుర్యం తెలుగులోకి తేవాలనే కోరిక వీరి కవితలోని ఈ ఛాయలను, వీరి అనువాదాలను (రవీంద్రుని గీతాలను) ప్రతిబింబిస్తూ ఉంటుంది. రవీంద్రుని ఆదరాభిమానాలు వీరిని తీర్చుకోలేని ఋణగ్రస్తుల్ని చేశాయని సుబ్బారావుగారి భావన. అందుచేతనే నేమో 'రవీంద్ర వ్యాసావళి'ని అనువాదం చేస్తూ —

'గురుదేవుల ఋణాన్ని ఈ రూపంగా లవలేశమైనా తీరిస్తే కృతజ్ఞుడను' అని అంటారు.[1]

రాయప్రోలు వారు రవీంద్రుని ఆదరాభిమానాలను సంపూర్ణంగా అనుభవించారు. రవీంద్రునిచే కీర్తింపబడ్డ ఘనత సుబ్బారావుగారికి దక్కింది. 'ఆంధ్రులకు ఒక అధునాతన మహాకవి ఉన్నాడు. ఆయనే యువకుడైన రాయప్రోలు సుబ్బారావు'[2] అని విశ్వకవిచే కరతాళధ్వనుల మధ్య బహిరంగ సభలో కీర్తింపబడటం అసాధారణ విషయం. రాయప్రోలు వారు రవీంద్రునిపై గల అత్యధిక గౌరవాభిమానాలతో గురుదేవుడని ఆయనను స్మరిస్తుంటారు. రవీంద్రుడు సరస్వతీ స్వరూపుడనీ ఆయన భావనాశక్తి అత్యద్భుతమనీ రాయప్రోలు వారి భావన.[3] విశ్వకవి శుశ్రూష వేళ

---

1. 'రవీంద్ర వ్యాసావళి' - ద్వితీయ సంపుటము. అనువాదకులు: రాయప్రోలు సుబ్బారావు. నివేదన P xxxiv
2. 'రాయప్రోలు సుబ్బారావు - వారి స్మృతి శకలాలు' (వ్యాసము) మరుపూరు కోదండరామరెడ్డి - విమర్శిని-4 P 68
3. 'గురుదేవుల దర్శనం కాగానే పాదాభివందనము చేసితిని. వారు 'How are you' అంటూ శిరస్సున చేయి పెట్టారు.

వాక్పనితులు రావడానికి తోడ్పడింది.

రాయప్రోలు వారి దృష్టిలో శాంతి నికేతనం ఋషివాటిక లాగా పరమ పవిత్రం. ఈ నాటికీ రవీంద్రుని పేరే వీరిని తన్మయులను చేస్తుంది. ఇన్ని ఏండ్ల తరువాత కూడా వీరు ఆ శాంతినికేతన జీవితానుభూతిని మధురభావనంగా పదిలంగా మనస్సులో భద్రపరచుకున్నారు. అటువంటి గురుదేవుని సాహిత్యఛాయలు రాయప్రోలు వారి రచనలలో కనిపించడం అతి సహజం.

<u>శ్రీ అరవిందులు</u>: రాయప్రోలు వారి ఆధ్యాత్మికభావాలకు బలాన్నిచ్చిన వ్యక్తిగా శ్రీ అరవిందులను చెప్పవచ్చు. వీరిద్దరి భావాలలోని సామ్యం రాయప్రోలువారు శ్రీ అరవిందులను అభిమానించేలా చేసి ఉంటుంది. సుబ్బారావుగారు అమితభక్తిగౌరవాలతో గురుదేవులుగా చెప్పే రవీంద్రుడు కూడా శ్రీ అరవిందుల పట్ల అభిమానం కల వ్యక్తి.[1] తమ గురుదేవులు అభిమానించే వ్యక్తిగా కూడా వీరికి శ్రీ అరవిందుల పట్ల కొంత ప్రత్యేకశ్రద్ధ

---

(contd)

ఒడలు పులకించినది. సరస్వతీ హస్తము తాకినట్లుండెను... గురుదేవుల భావనా విహంగము అటు చక్రవాకి వలె ప్రాతః సంధ్యలలో ప్రాతః సంగీతం పాడగలదు. సంధ్యాకాల విరహంలా విలపింపగలదు."

'మా గురుదేవులు - నేను' (వ్యాసము) రాయప్రోలు సుబ్బారావు

'రాయప్రోలు వారి సాహిత్య సౌందర్య దర్శనం' P10, 12

1. 'Homage to Sri Aurobindo' అనే పేరుతో రవీంద్రనాథ్ ఠాకుర్ ఒక ప్రసిద్ధ రచన చేశాడు.

ఉండే అవకాశం ఉంది. శ్రీ అరవిందులను సుబ్బారావుగారు రెండు మూడు సార్లు కలిశారు.[1] శ్రీ అరవిందులు పాండిచేరిలో స్థిరపడిన కొద్దికాలానికే మొదటిసారి వారిని రాయప్రోలువారు కలిశారు. శ్రీ అరవిందుల పట్ల గౌరవంలో 'శ్రీ అరవిందులు ఒక అవతారము' అని పేర్కొంటూ వారిని మహాయోగిగా స్మరించారు.[2] బెంగాలు విభవజనమూర్తి ప్రస్తావిస్తూ 'అరవిందుని కూడా బంధించారని'[3] ప్రత్యేకంగా వారిని పేర్కొనడం సుబ్బారావుగారికి శ్రీ అరవిందులపైగల అభిమానాన్ని సూచిస్తుంది.

సుబ్బారావుగారు సృష్టిస్థితిలయ కారిణిగా ఆదిశక్తిని భావన చేయడానికి, ఆ ఆదిశక్తిని మాతృమూర్తిగా ధ్యానించడానికి, సృష్టి సమస్తంలో మాతృమహత్వాలను దర్శించడానికి శ్రీ అరవిందుల తత్త్వ దర్శనం మహత్తరమైన మానసిక దార్ఢ్యాన్నిచ్చింది. ఆద్యాశక్తి సృష్టికి మూలం అనీ, ఆ ఆదిశక్తిది అనంతమైన మాతృవాత్సల్యమనీ, ప్రకృతి సమస్తంలో తానే అభివ్యక్తం అవుతూ ఉంటుందనీ, దేవతలందరూ

---

1. శ్రీ అరవిందులను రెండు మూడు సార్లు కలిశారనీ, 'యోగసాధన వల్ల అదివరకటి కంటె రంగు వచ్చి బంగారం లాగా అయ్యాడని' వ్యాఖ్యానం కూడా చేశారని ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు గారు (13-5-81) చెప్పారు.
2. 'మహాయోగి' - (వ్యాసము) రాయప్రోలు సుబ్బారావు "శ్రీ అరవిందులు - అతిమానసిక అవతారమూర్తి" - వ్యాస సంకలనం
3. 'మధుర స్మృతులు - ముట్నూరి కృష్ణారావు' (వ్యాసము) రాయప్రోలు సుబ్బారావు. కృష్ణాపత్రిక 14-2-64

ఆమె అభివ్యక్తులే నవే భావాలు శ్రీ అరవిందులలో రాయప్రోలు వారిలో ఇద్దరిలో కనబడతాయి. శ్రీ అరవిందులు శక్తికి, ప్రకృతికి ప్రాధాన్యం ఇవ్వడం దివ్యమాత అని తల్లిగా ఆద్యాశక్తిని స్మరించడం శ్రీ అరవిందుల పట్ల రాయప్రోలు వారికి కల ఆకర్షణకు కొంత కారణం అయి ఉండవచ్చు. పినతల్లి మాటలవల్ల ప్రభావితులై, మాతృమహాత్మ్యాన్ని దర్శించడం ప్రారంభించిన సుబ్బారావుగారికి ఆ అభిప్రాయం దృఢపడడానికి శ్రీ అరవిందుల తత్త్వం దోహదం చేసింది. వీరి దృష్టిలో మాతృ వాత్సల్యానికి ఉన్న ఔన్నత్యం ఆధ్యాత్మిక స్వరూపాన్ని పొంది స్థిర పడడానికి శ్రీ అరవిందుల దర్శనం సహాయకారి అయింది. రాయప్రోలు వారిలో తత్ప్రాధాన్యమే ఉన్న భావాలు శ్రీ అరవిందుల శక్తిస్వరూప ఆవిష్కరణ సిద్ధాంతంలో బలపడి ఉంటాయి.

సృష్టికి మూలం మహాశక్తి అని శ్రీ అరవిందుల అభిప్రాయం. మహాశక్తిది మాతృహృదయం. మాతృవాత్సల్యంతో సృష్టిసమస్తాన్ని వీక్షిస్తుంది. సృష్టి స్థితిలయకారిణి ఈ ఆదిశక్తి. ఆమె సృష్టికి అందరూ బిడ్డలే. దుష్టులను శిక్షించినా అది ఆమె కృపే. ఆమె కారుణ్యం అపరిమితమూ అనంతమూ. మహాశక్తి తన వివిధ శక్తుల ద్వారా వివిధ దేవతలుగా అభివ్యక్తం అవుతుంది. అందులో ప్రముఖమైన శక్తులు మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి. మహేశ్వరి జ్ఞానస్వరూపిణి, జ్ఞానప్రదాయిని. మహాకాళి శక్తి, దార్ఢ్యం కలిగిన ఉగ్రభీకర స్వరూపిణి. మహాకాళి తమస్సు, మౌఢ్యం, అజ్ఞానం వంటి వాటి పట్ల కొంత కఠోరంగా భీకరంగా వ్యవహరిస్తుంది. అయితే ఈమె క్రోధం వెనుక కూడా ప్రేమ ఉంది. మహాలక్ష్మి ఆనందస్వరూపిణి. సౌందర్యారాధనం, భగవదభిముఖమైన దివ్యానందం, ప్రేమ ఆమెకు ప్రీతిపాత్రమైనవి. ఈమె సౌందర్యాధి

దేవత. సన్యాస జీవనం గాని, దారిద్ర్యమూ, కఠినమూ అయిన జీవనం గాని ఈమెకు సంతోషదాయకం కాదు. ఈమె ప్రేమ సౌందర్యాల ద్వారా భగవంతునికి మానవులకు మధ్య బంధాన్ని ఏర్పరుస్తుంది. మహాసరస్వతి కార్యనిర్వహణా చతురురాలు. శాస్త్రం, క్రియాకౌశలం, విషయ సాంకేతిక పరిజ్ఞానం మహాసరస్వతి అధీనాలు. ఈమె నిర్దుష్టంగా వ్యవహరిస్తుంది. పరిపూర్ణత్వం ఈమె లక్ష్యం. ఇతర మహాశక్తుల కార్యమంతా పూర్తి అవడానికి ఈమె కారణమవుతుంది. ఈ నాలుగు శక్తులూ విడివిడిగా అభివ్యక్తమయ్యే ఆదిశక్తి రూపాలేనని శ్రీ అరవిందులు అభిప్రాయపడ్డారు.[1]

ఆ దివ్యమాత అంతశ్శక్తిగా, సర్వపోషక శక్తిగా ఈ సృష్టి సమస్తానికి ఆధారం అవుతుంది. సృష్టి సర్వాన్నీ రక్షించి, పాలిస్తూ శాశ్వత శక్తిగా ఈ విశ్వానికి పైన నిలిచి ఉంటుంది. ఈ సృష్టిలోని వస్తువులన్నీ ఆమే. ప్రకృతి సమస్తానికి ఆధారం అయి ప్రకృతి అంతటా అభివ్యక్తమయే పరమశక్తి ఆ జగన్మాత. ఆ జగజ్జనని సృష్టి స్థితిలయ కారిణి. ఆమే జ్ఞాతా జ్ఞాత సమస్త లోకాలలోని సర్వ రూపాలను కల్పిస్తూ వాటి ద్వారా వ్యక్తం అవుతూ ఉంది. సృష్టి అంతా ఆమె ఆవిష్కరణే. అని సృష్టికి ఆదిశక్తికి ఉన్న సంబంధాన్ని శ్రీ అరవిందులు స్పష్టం చేశారు.

---

1. "Adya Shakti is the original Shakti, therefore the highest form of the Mother .... the four powers of the Mother are four of her outstanding Personalities, portions and embodiments of her divinity through whom she acts on her creatures, orders and harmonises

శ్రీ అరవిందుల తత్త్వదర్శనంలో మహాశక్తిని గూర్చిన ఇటువంటి భావాలు రాయప్రోలు సుబ్బారావు గారి రచనల్లో సహితం కనబడతాయి. ఆద్యాశక్తి సృష్టికి మూలం అనీ ఆమె మాతృవాత్సల్యానికి అంతు లేదనీ, ఆమె విశ్వవ్యాప్తంగా విలసిల్లుతోందనీ, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి ఆదిశక్తి 'అవస్థాంతరాలే'నని రాయప్రోలు వారు భావన చేయడం కనబడుతుంది.

"కేవల నిర్గుణ భావమూ ఈశ్వరు
నంశ కాదిమ నిష్ఠయైన ప్రకృతి
సంహార సమయ రూక్ష రుషా ప్రచండ క
ల్లోల తాండవమున నాయె కాళి
సకల కల్యాణ లక్షణ పూర్ణగాత్రి యై
తమ్ముల పుట్టిల్లు తనువు లక్ష్మి
సంగీత సాహిత్య సామ్రాజ్య నేత్రియై
మగని వాకిండ్ల నేమరని వాణి

---

(contd)

her creations in the worlds and directs the working out of her thousand forces... ... to the four we give the four great names - Maheswari, Mahakali, Mahalakshmi, Mahasaraswati."

'The Mother' - Sri Aurobindo P65, 1926

సృష్టిచక్రము చకచగా త్రిప్పుచున్న

ఆదిశక్తి అవస్థాంతరాక్రమముగ

జ్ఞానవీధి నర్తనయు నింపు దాంత్రసముయు[1]...

ఈ సందర్భంలో మహాశక్తిలోనే మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి మహాసరస్వతి అంతర్భూతం అన్న శ్రీ అరవిందుల సిద్ధాంతాన్ని పోలిన భావాన్నే రాయప్రోలువారు అభివ్యక్తం చేశారు. శ్రీ అరవిందులు చెప్పిన నాలుగు శక్తులలోని మహేశ్వరి ఇక్కడ ప్రత్యక్షంగా కనబడదు గాని మొదటి పాదంలో 'నిర్గుణభావమయిన ఈశ్వరునికి ఆదిమనిష్ఠయయిన ప్రకృతి' అనడంలో విశ్వవ్యాప్తంగా అన్నీ తానే అయి విలసిల్లే మహాశక్తి రూపం అయిన మహేశ్వరిని ప్రకృతిగా వీరు స్మరించి ఉంటారనుకోవచ్చు. ప్రకృతి రూపంగా అభివ్యక్తమయ్యే ఆదిశక్తిని వీరు మాతృమూర్తిగా భావించడం ఇతర సందర్భాలలో కూడా కనబడుతుంది.

దేవీ ఉపాసకులయిన సుబ్బారావుగారి దృష్టికి ప్రకృతి జడం కాదు. సర్వశక్త్యాత్మకం. వీరు 'మాతృమూర్తిం దరిశింతు నీ ప్రకృతి దివ్యశుభావరణాన' అంటూ ప్రకృతి సమస్తంలో ఆ మాతృమూర్తిని భావన చేశారు. సృష్టి యావత్తూ శివశక్తుల విన్యాసంగా భావించిన రాయప్రోలువారు 'నేడు పట్టితినిట్లు తల్లి చల్లని కొంగు తండ్రి జాడ నెరుంగ' అని అంటూ తండ్రి జాడ తెలుసుకొనడానికి తాము పట్టిన ఆ తల్లి చల్లని కొంగు సహాయపడగలదని ఆశించారు. కనుకనే కళ్ళకు కనబడక అనుమాన

1. ఉగాది - మిశ్రమంజరి - P 68

ప్రమాణానికి కూడా ఉండీ ఉండని అనాదిపితను గూర్చిన తర్కవితర్కాలకంటె వీరికి ప్రకృతి యొక్కటి సన్నిహిత లక్ష్యం.

వీరి ఈ ప్రకృత్యారాధన పృథివ్యారాధనగా వ్యక్తం అయింది. ఆ పృథివ్యారాధన రాజకీయ కారణాల ప్రాధాన్యంతో దేశభక్తిగా స్థిరపడింది. జగన్మాత భరతమాత రూపంలో వీరికి ఆరాధ్య అయింది. ఈ విధంగా వీరి దేశభక్తికి ఆధారమయిన ఆధ్యాత్మిక ప్రాతిపదికను శ్రీ అరవిందుల దివ్యమాత తత్త్వం కొంత దోహదకారి అయిందనుకోవచ్చు. శ్రీ అరవిందులు దేశాన్ని దివ్యమాతగా ఆరాధించారు.[1] ఈ రకంగా వీరిద్దరిలో ఆదిశక్తిని, ప్రకృతిని, దేశాన్ని గూర్చిన భావాల్లో కొంత సామ్యం కనబడుతుంది. తను ఆలోచనా సరళి సరయినదే అనే భావాన్ని కలిగించి సుబ్బారావుగారి తత్త్వచింతనకు బలాన్ని చేకూర్చింది శ్రీ అరవిందుల దివ్యమాత తత్త్వదర్శనం. అరవిందుని భావాలు వీరికి అండగా నిలిచాయి.

<u>ఇతర పరిచితులు</u>: (రాయప్రోలు వారి పినతల్లి వారి ఆలోచనా

---

1. "I have three madnesses... the third folly is this: where as others regard the country as an inert object, and know it as the plains, the fields, the forests, the mountains and rivers, I look upon my country as the Mother, I worship her and adore her as the Mother" 'Sri Aurobindo'. Navajatha P 40

విధానాన్ని కొంత ప్రభావితం చేయగా, మేనమామ తగిన పాండిత్యాన్ని కవితాశక్తిని కలిగించారు. గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగుర్, శ్రీ అరవిందులు వీరి ఆత్మిక భావస్థైర్యానికి కావలసిన మానసిక బలాన్ని అందించారు.) వీరే కాక రాయప్రోలు వారికి పరిచితులై సన్నిహితంగా మెలిగిన మరికొందరు వ్యక్తులు కూడా వారిని కొంత ప్రభావితం చేశారని చెప్పవచ్చు. వారిలో కొందరు ఆశీర్వదించిన పెద్దలు, కొందరు వివేచనాశక్తికి దోహదం చేసిన మేధావులు, మరికొందరు వీరి తత్త్వచింతనలోని మంచిని గుర్తించి ప్రోత్సహించిన మిత్రులు, శ్రేయోభిలాషులు. (ఇటువంటి వాళ్ళలో ముఖ్యంగా చెప్పదగ్గవారు తిరుపతి వేంకట కవులు, చిలుకూరి వీరభద్రరావు గారు, అత్తిలి సూర్యనారాయణగారు, గంటి లక్ష్మన్న పంతులు గారు, కొమర్రాజు లక్ష్మణరావు గారు, విధుశేఖర భట్టాచార్య, పియర్సన్, కాళీమోహన ఘోష్, క్షితిమోహన సేన్, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు, కట్టమంచి రామలింగారెడ్డిగారు, సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు.) వీళ్ళలో రాయప్రోలు వారికి ఉన్న పరిచయాన్ని, వాళ్ళ ప్రభావాన్ని క్లుప్తంగా పరిశీలించడం వల్ల వాళ్ళ ప్రభావం రాయప్రోలు వారి సాహితీవ్యక్తిత్వ నిర్మాణానికి ఏ విధంగా దోహదం చేసిందో స్పష్టం అవుతుంది.

తిరుపతి వేంకట కవులు సుబ్బారావు గారి మేనమామకు గురువులు కావడం వారిపై రాయప్రోలు వారికి గౌరవం కలగడానికి కొంత కారణం కావచ్చును. దీనికి తోడు రాయప్రోలువారు మేనమామతో కలిసి అవధానాలు

చేయడం వల్ల ఆ రంగంలో అప్పటికి లబ్ధప్రతిష్ఠులై అగ్రేసరులయిన తిరుపతి వేంకట కవులపై భక్తిగౌరవాలు పెరిగి ఉండవచ్చును. తిరుపతి వేంకటకవుల అవధాన సభలకు వెళ్ళడం, వారిపై గౌరవం, గురుభావం ఉండడం వల్ల రాయప్రోలు వారిపై వారి ప్రభావం కొంత కనబడుతుంది. ప్రారంభంలో అవధానాలు చేసిన సుబ్బారావు గారికి పద్యం ఎత్తుగడకు కవితాధారకు తిరుపతివేంకటకవులు కొంత ఆదర్శంగా కొంత మార్గదర్శకంగా నిలిచి ఉంటారు. తిరుపతి వేంకటకవుల అవధానం తరువాత నరసరావుపేటలో

"చంద్రుదెవ్వరికైన చల్లగా నుండదా
పద్మాల భాగ్యమా పాటి గాక
వెలుగేరికైనను చెలువుగా నుండదా
గ్రుడ్డిగూబల నోము కొరత గాక
కలకంఠ తీయని పలుకుం బుట్టింపదా
పైత్యరోగుల పాపఫలము గాక
కోయిల గానంబు హాయిగా నుండదా
విరహుల దుర్దశా విధము గాక
మీ కవిత్వంబు మీ లీల మీదు ఫణితి
సరసులకు గాదె కర్ణరసాయనంబు
సరస తిరుపతి వేంకటేశ్వర కవీంద్రు
లార శాశ్వత కీర్తి విస్తారులార."[1]

అనే పద్యాన్ని సుబ్బారావుగారు చెప్పారు. తిరుపతివేంకటకవులు

---

1. 'నానారాజ సందర్శనము' - తిరుపతి వేంకటకవులు - P189

ఆత్మకూరు రాజు '5౦ రూపికలను పేర్చుదును' మాత్రమిచ్చెదను సభ చేసెదరా అని కబురంపినపుడు కొంత బాధపడ్డ ఆ జంట కవులు ఆ రాజుగారికిలా బదులు చెప్పారట.

°శివుడెవ్వరికైన సేవనీయుడు గాడె
వైష్ణవోత్తముల పాపమ్ము గాక
యముఁడెవ్వరికైన నాసంకనీయుడే
సరసీరుహముల దోషమ్ము గాక
మధు వెవ్వరికైన మాననీయుడు గాడె
జాతి దౌర్భాగ్య దేసమ్ము గాక
విష్ణు వెవ్వరికైన వినతి పాత్రుడు గాడె
శైవుల దురదృష్ట సరణి గాక
మా దురదృష్టమును బట్టి మమ్ము గాక
వింపను నన్నంతనే మీరు వెలితి యనునె
వితరణాపర భోజ! పృథ్వీబిడౌజ!
యాత్మకూరు పురీ రాజ! యతుల తేజ![1]

ఈ పద్యానికి పోలి ఉంది రాయప్రోలు వారు నరసరావుపేటలో చెప్పిన పద్యం. ఈ రెండు పద్యాలకు ఉన్న సామ్యం గమనిస్తే తిరుపతి వేంకటకవుల పద్యపు ఎత్తుగడ రాయప్రోలు వారి మీద ఏ విధంగా ప్రభావం చూపిందో స్పష్టం అవుతుంది.

తమ 'లలిత' కావ్యానికి చెళ్ళపిళ్ళ వారు ఉపోద్ఘాతం వ్రాసి ఆశీర్వదించారని సుబ్బారావు గారు చెప్పుకున్నారు.[2]

1. నానారాజ సందర్శనము - పూర్వార్థము - తిరుపతివేంకటకవులు P59
2. 'నా ఆంతి ఆడిమ - లలిత' - విమర్శిని 4 P4

కళాప్రపూర్ణులైన చెళ్ళపిళ్ళవారికి తమ 'మాధురీదర్శనమ్' కావ్యాన్ని అంకితం చేశారు రాయప్రోలువారు.[1] ఇవి తిరుపతి వేంకటకవులపై రాయప్రోలువారికిగల గౌరవాభిమానాలను సూచిస్తాయి. అంతేకాక వారి కవిత్వం పట్ల రాయప్రోలువారికి ఉన్న అభిమానాన్ని సూచిస్తూ ఒక సందర్భంలో ఇలా ఉత్తరం వ్రాసారు. "...గుంటూరు సీమ చదివితిని. అఖండమగు మీ కవితయందలి కథావిషయగమనము అత్యద్భుతముగ నున్నది. ఈ కథాసంవిధాన పరిపోషణ ఆంధ్రవాఙ్మయము నందు ఒకరిద్దరు సనాతన కవులయందు తిక్కన పినవీరభద్రుడు తక్క లేవి మొదలు గనుపట్టదు...."[2] ఈ రకంగా వీరభిమానించిన తిరుపతి వేంకటకవులు వీరిని ఆశీర్వదించి వీరి కవితాధారకు ప్రోత్సాహానందించారు.

1909 ప్రాంతంలో రాజమహేంద్రవరంలో రాయప్రోలు వారికి 'ఆంధ్రకేసరి' పత్రికా సంపాదకులు అత్తిలి సూర్యనారాయణ

---

1. 'భువన శ్వేతర భంజక
నవనీత పదార్థ రంజనన్ నిండినదీ
కువలయ సుందర భాండమ
నవద్యము కళాప్రపూర్ణ నైవేద్యము కాన్.'

శతావధాని, కళాప్రపూర్ణ శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారికి 'ప్రభుత్వాస్థాన మహాకవి' బిరుదప్రదాన మహాసభలో అంకితము.

2. 'గుంటూరు సీమ' - ఉత్తర భాగము - ఉపోద్ఘాతములో పూర్వభాగం కూర్చిన ఉత్తరాలు P xxxvii

చిలుకూరి వీరభద్రరావు గార్లతో పరిచయం ఏర్పడింది. వాళ్ళ స్నేహం, ప్రోత్సాహం రాయప్రోలు వారికి తమ అభిప్రాయాలను వ్యాసాల రూపంగా వ్యక్తం చేసే అవకాశాన్నిచ్చింది. గంటి లక్ష్మన్న పంతులు గారితో సాన్నిహిత్యం గోల్డ్‌స్మిత్ (Goldsmith) రచన హెర్మిట్ (Hermit) అర్థం చేసుకుని అనువదించే అవకాశాన్ని ఇచ్చింది. ఆయన ప్రోత్సాహంతోనే ఆ కావ్యం రాయప్రోలు వారి తొలి రచన 'లలిత'గా రూపొందింది.

1912 ప్రాంతంలో మద్రాసులో కొమర్రాజు లక్ష్మణరావు గారి ఆదరాభిమానాలు రాయప్రోలు వారి జ్ఞానాభివృద్ధికి సహకరించాయి. కొమర్రాజు వారి ఆధ్వర్యంలో సంపాదక వర్గంలో ఒకరిగా విజ్ఞాన సర్వస్వ నిర్మాణంలో పాల్గొన్నారు. ఈ విజ్ఞాన సర్వస్వంలో పనిచేయటం వీరికి విజ్ఞానదాయకం అయింది.

శాంతినికేతనంలో గురుదేవుల అంతేవాసి కావడం వల్ల వీరికి ఎందరో మేధావుల సాంగత్యం లభించింది.[1] అధ్యాపకుడు కాళీమోహన్ ఘోష్ సోదరుడై వీరికి సహకరించాడు. క్షితిమోహన్ సేన్ గొప్ప విద్వాంసుడు. సంస్కృతం, ఫిలాసఫీ, బెంగాలీలలో మూడు ఎం.ఏ డిగ్రీలు సంపాదించిన మేధావి. ఆయన రాయప్రోలు వారికి బాగా పరిచితుడై చనువిచ్చాడు. ఆయనపై వీరికి గురుప్రతిపత్తి విశ్వాసం కుదిరాయి. సుబ్బారావు గారిని హిందీ నేర్చుకొమ్మని ఆయనే

---

1. ఈ మేధావుల వివరాలు 'మా గురుదేవులు - నేను' అన్న రాయప్రోలు వారి వ్యాసం నుండి గ్రహించబడ్డాయి.

'రాయప్రోలు సాహిత్య సౌందర్య దర్శనం' (వ్యాస సంకలనం) P.10 to 13

ప్రోత్సహించాడు. ఆ హిందీ పాఠాలను పియర్సన్ ఇంగ్లీషులో బోధించే వాడు. హిందీ జ్ఞానం వల్ల శాంతినికేతనంలో ఉన్నకాలంలో ఇతరుల అభిప్రాయాలన్నీ చక్కగా అవగాహన చేసుకునే అవకాశం వచ్చింది. పియర్సన్ ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మను భాషలలో ఎం.ఏ డిగ్రీలు చేసుకుని లాహోరు క్రిస్టియన్ కాలేజీలో ప్రొఫెసరుగా ఉండేవాడు. విధుశేఖర భట్టాచార్య విద్వాంసుడు. ఆయనకు ఏ శాస్త్రం వచ్చో ఏది రాదో తెలుసుకోలేని విధంగా అన్నివిషయాలలో విశేష పాండిత్యం కలవాడు. ఆయన కావ్యంలోని వాక్యాలను శోధించి నిగ్గుతేల్చే రసాన్వేషి. సంస్కృతంలో తమకు లభించిన విజ్ఞానవిషయ సంపత్తి అంతా ఆయన ముఖోపదేశమే నని రాయప్రోలు వారి విశ్వాసం. ఇటువంటి మేధావుల సాహచర్యం వీరిలోని పాండితీ ప్రకర్షకు వన్నె తెచ్చింది. ఈ విధంగా 1909- 16 సంవత్సరాల మధ్యకాలంలో వీరు తమకు సన్నిహితంగా వచ్చిన వ్యక్తుల సహకారం వల్ల వివిధ విషయాలపై తమ స్వంత అభిప్రాయాలను ఏర్పరుచుకోగలిగారు. వివేచనా శీలంలో, విమర్శనాత్మక దృక్పథంలో, అవగాహనా శక్తిలో తమదైన ఒక మార్గాన్ని నిర్ణయించుకోగలిగారు. తరువాత కాలంలో వీరికి సన్నిహితం అయిన వ్యక్తుల ప్రోత్సాహంలో వీరి భావాలు అభిప్రాయాలు స్థిరపడ్డాయి.

మిత్రుడిగా ఉత్సాహమనందించిన వ్యక్తి దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు. రాయప్రోలు వారిలోని జాతీయతా భావాన్ని పెంపొందించి ఆంధ్రాభిమాన కవితకు 'ఆంధ్రరత్న' ప్రోత్సాహాన్ని అందించారు. 1917 లో ఇంగ్లండు నుండి తిరిగివచ్చిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారిని దేశ స్వాతంత్ర్యోద్యమం, ఆంధ్రరాష్ట్రోద్యమం ఆకర్షించాయి.

స్వేచ్ఛా నిరతి, త్యాగదీక్ష, దేశసేవ, ప్రజలపై అభిమానం కల వ్యక్తి గోపాల కృష్ణయ్యగారు చక్కని ఉపన్యాసాలిచ్చి ప్రజలలో దేశస్వాతంత్ర్యోద్యమం పట్ల ఆసక్తిని కలిగించి వాళ్ళను ఉద్రేకపరిచేవారు. చీరాలను పురపాలక సంఘంగా మార్చి పన్నులు వసూలు చేయడాన్ని నిరసించి ప్రజలకు ధైర్యం చెప్పి పొలాలకు తరలించి ఊరిని నిర్మానుష్యంగా చేయడం రామదండును స్థాపించడం ఆయన నాయకత్వ ప్రతిభకు నిదర్శనాలు. ఇంతటి కార్యదీక్షా శాలి కనుకనే ప్రభుత్వపు కట్టుదిట్టాలకు ఎదురు నిలిచి ఉపన్యాసాల నివ్వడం, జాతీయ మహాసభకు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకు కార్యదర్శిగా వ్యవహరించ గలిగారు.

ఇటువంటి దేశభక్తుడితో రాయప్రోలు వారికి మైత్రి ఏర్పడింది. ఈ మైత్రి సుబ్బారావు గారిలోని దేశాభిమానాన్ని, ఆంధ్ర రాష్ట్రాభిమానాన్ని మరింతగా పెంచింది. "అమరావతీ పట్టణమున... వంటి పద్యాలను సభలలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు శ్రావ్యంగా భావయుక్తంగా చదవడం అటు చదివిన వారికి ఇటు వాటిని వ్రాసిన వారికి పేరు ప్రఖ్యాతులను తేవడమే కాకుండా ప్రజలలో ఆంధ్రాభిమానాన్ని పెంపొందింప జేసింది.[1] సాహిత్యాభిమాని అయిన రాయప్రోలు

---

1. 1917-18 లో నెల్లూరులో పురమందిరాన్ని ఆనుకొని దక్షిణాన వెంకటగిరి రాజాగారి కళాశాల మైదానంలో వేసిన పెద్దకొటాయిలో ఆంధ్రమహాసభ దేశభక్త కొండా వెంకటప్పయ్య అధ్యక్షతన జరిగినది. ---- అప్పుడే స్కాట్‌లాండు నుండి వచ్చేసిన దుగ్గిరాల గోపాల కృష్ణయ్య పసిమి మిసిమి మెయిబాయిలో చక్కటి దీర్ఘకాయంలో కాషాయ లాల్చి - పెద్దతలకుద్దె చుట్టుకుని పెద్దపళ్ళెంలో కర్పూరం వెలుగుచుండగా చేబట్టి 'అమరావతీ పట్టణమున'- అను ప్రబోధ

వారు నాటకీయ సభలకు హాజరు కావడంపై దుగ్గిరాల వారి ప్రభావం ఉండి ఉంటుందని ఊహించవచ్చు.[1] రాయప్రోలు వారు 'పదవే చెలి కాళ్ళ గజ్జియల్' అనే వియోగినీ వృత్తాన్ని వ్రాయడానికి గోపాలకృష్ణయ్య గారు కారణమని అంటారు.[2]

వీరి రచనలను గూర్చి పండితులు, సాహిత్యాభిమానులు అందించిన ప్రశంసలు వీరేర్పరుచుకున్న మార్గంలో ముందుకు సాగడానికి సహకరించాయి. ఉత్సాహాన్నందించాయి. (1913 లోనే జయంతి రామయ్య పంతులు గారు తృణకంకణ రచనను గూర్చి:--- "Its sentiments are chaste and poetry of a high order --- this little poem purports to mark the beginning of a new school of Telugu poetry")[3]

---

(contd)

గీతాలు చదివి ఆంధ్రమాతకు నీరాజనమిచ్చినారు. ఆ చదువులో మాట మాట ప్రాణం పోసుకుని సభ్యుల మానసాలను ముగ్ధుల వలె పొంగించింది---- పద్యాలు వ్రాసిన - చదివిన వారి పేరుతో వినని వారి నాయికలపై హాస్యం చేసినవి.

'రాయప్రోలు సుబ్బారావు - కొన్ని స్మృతి శకలాలు' (వ్యాసము) మరుపూరు కోదండరామరెడ్డి - విమర్శిని 4 - P56, 57

1. 'ఆయన కాంగ్రెసులో తిరుగుతుండేవారు. త్రిపుర కాంగ్రెసుకీ, అలంపూరు కాంగ్రెసుకీ వెళ్ళటం నాకు గుర్తే'- రాయప్రోలు వరలక్ష్మమ్మ గారితో ముఖాముఖి విమర్శిని - 4 - అనుబంధం - P40

2. వనమాల - విజ్ఞాపన P7

3. తృణకంకణము - 14th edition 1966 - letter dated 3-10-13

అని తమ అభిప్రాయం వ్యక్తపరిచారు.

వీరికి ఉత్సాహాన్నందించిన మరొక పండితుడు కట్టమంచి రామలింగారెడ్డిగారు.[1] 1916లో రాయప్రోలువారి

1. "----సాహిత్యపరుల ప్రశంసలన్నీ ఒక ఎత్తూ అధునాతన విమర్శకాచార్యుడు పండిత ప్రవరుడు డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి మెప్పులంది దగ్గరివాడు కావడం ఇంకొక ఎత్తు! సుబ్బారావు నవ్యమధుర కవితా రీతులకు అలరి, చెంతు గాంతువేని ఈ పెద్ద రెడ్డి ఎప్పుడట్టి ప్రోత్సాహమిచ్చినారు.... ఆయన ప్రాపున ఈ రావు శర్మ (రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ) ఇద్దరూ తెనుగునాట పై మెట్టులో తెరలకు వచ్చినారు....నెల్లూరులో జరిగిన ఒక రెడ్డి మహాజనసభ సందర్భంలో రాయప్రోలు నెల్లూరు వచ్చిఉండి రామలింగారెడ్డి మీద ఈ పద్యం చెప్పినాడు.

స్వచ్ఛంద బలవదుచ్ఛ్వాల వీచ్యవంతమై
యెదుగు నాంగ్లేయ సాహిత్యపటిమ
రసిక సంభరణా లాలసరీతి కరగిపోయెది
మధురాంధ్ర సాహిత్య కాంతి
చందన ద్రుమ సువాసన గుబాళింప నరకు
పోవిం డెరలు దుర్దాంత రచన
అలసులు రాకుండ నవల తేనియ దీపి త్రావి
త్రావించు దార్శకుని మదువు
మేళనంబాయె నీయందు ----
- - - - - - - - - - - - - - - -
----లోకవలరయు నవనుమారులకు

కవిత్వాన్ని "... His imaginative gifts are of a high order and his power of phrase is remarkable, almost unique ...' అంటూ ప్రశంసించారు.[1] రామలింగారెడ్డి గారు వీరి కవిత్వాన్ని విను సందర్భాన్ని రాయప్రోలువారు ఈ విధంగా స్మరించారు. "ఆ రాత్రియందే ఈ ఖండకృతిని కట్టమంచి రామలింగారెడ్డి గారు చదివే సుకృతం లభించింది. తరువాత వారు మద్రాసు వచ్చినపుడు నన్ను పిలిపించి చదివించి మనసిచ్చి విన్నారు. తమ ఆనందమును వెల్లడించారు. అంతేకాదు మొట్టమొదటి పద్యమును ప్రత్యేకముగా పరామర్శించారు. అది వినునపుడు రామలింగారెడ్డిగారి రసిక హృదయాలోకము ఎంతో కుశలాతికుశలంగా వికసమయింది."[2]

రాయప్రోలువారి కవిత్వం పట్ల అభిమానాన్ని వ్యక్తం చేసి ప్రోత్సహించిన ప్రముఖులలో శ్రీ రాధాకృష్ణన్ గారు కూడా ఒకరు. 1939 లో వారు సుబ్బారావు గారికి వ్రాసిన లేఖలో ఈ ప్రోత్సాహం

---

(contd)

. లోడుగా వలయు నీవు రామలింగావతంస!
కట్టమంచి ఒళ్ళంతా పులకరెత్తి 'నన్ను బాగా అర్థం చేసుకుని ఈ పద్యం చెప్పితివి' అన్నాడు".
'రాయప్రోలు సుబ్బారావు - వారి స్నేహశీలత (వ్యాసము)
మరుపూరు కోదండరామరెడ్డి, విమర్శిని - 4 P 68, 69

1. 'తృణకంకణము' - 14th edition 1966, letter dated 26th May 1916.
2. తృణకంకణము - నివేదన P 5.

స్పష్టంగా కనబడుతుంది.

"I have learnt to admire him both as a man of high ideals and author of remarkable powers..... His poetic soul.... has found for itself new vision & expression, and it is fairly safe to prophesy that his work will mark an epoch in Telugu Literature. He has placed the Andhra World under a supreme debt of obligation by his substantial & unique contributions to its literature and we hope that he will continue to enrich it."[1]

హైదరాబాదులో మిత్రులతో కలిసి 1940-41 ప్రాంతంలో హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్తును రాయప్రోలు వారు స్థాపించినపుడు దానికి శ్రీ రాధాకృష్ణన్ గారు ప్రారంభోత్సవం చేయడం వీరి కార్యకలాపాల పట్ల శ్రీ రాధాకృష్ణన్ గారికి గల ఆదరాభిమానాలను వ్యక్తం చేస్తుంది.

ఈ విధంగా పెద్దల ఆశీర్వాదం, పండితుల ఆదరణ, మిత్రుల ప్రోత్సాహం వీరి తత్త్వచింతనకు దోహదం చేశాయి. కొందరు ఆలోచనలకు ప్రేరణ కలిగించగా మరికొందరు ఆ అభిప్రాయాలకు సాహిత్యరూపాన్ని ఇవ్వడానికి అవకాశాన్ని, ప్రోత్సాహాన్ని అందించారు. రాయప్రోలు వారి, విమర్శనాత్మకమూ, సహేతుకమూ

---

1. 'మాధురీదర్శనమ్' - letter dated 19-7-1939

అయిన విషయపరిశీలనగా సాహిత్యవ్యక్తిత్వ నిర్మాణానికి వీరందరి పాత్ర కొద్దిగానో గొప్పగానో ఉందని చెప్పవచ్చు. రాయప్రోలు వారు నవ్యమైన ఒకమార్గంలో సాహిత్యాన్ని నడపడానికి వీళ్ళందరి పరిచయం సహకరించింది.

అయితే వీళ్ళందరి ప్రేరణలో తమ దృక్పథాన్ని తాము ఏర్పరుచుకున్నారే గాని వాళ్ళ మార్గంలో నడవలేదు. కనుకనే ప్రత్యేకంగా ఏ ఒకరి ప్రభావమూ ఏదో ఒకచోట స్పష్టంగా ఉందని చెప్పే అవకాశం తక్కువగా ఉంది. అందరి భావాలనూ రంగరించుకుని, తమలో ఇముడ్చుకుని సత్యాసత్య విచక్షణా జ్ఞానంతో విమర్శనా దృక్పథంతో తమ వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నారు. కనుకనే తమ మార్గంలో సాహిత్యాన్ని కొంతకాలం పాటు నడపగలిగారు. కొందరు కవులను ప్రభావితం చేయగలిగారు.

ఈ రకంగా వైదికవాఙ్మయం వల్ల, ప్రాచీన కవులవల్ల, పరిచితులైన వ్యక్తులవల్ల వీరి తత్త్వచింతన ప్రభావితం అయింది. అందువల్ల వీరి ఆధ్యాత్మిక దర్శనంలో అధికభాగం సాంప్రదాయికతే కనబడుతుంది. వీరి నమ్మకాలు కొన్ని ప్రాచీనకాలం నుంచి వస్తున్న భారతీయ ఆధ్యాత్మిక దృష్టికి అనుగుణంగా ఉండటం గమనించవచ్చు. ముఖ్యంగా కర్మ-జన్మ సిద్ధాంతాలను గూర్చిన వీరి భావాలు సంప్రదాయబద్ధంగా సాగటం చూడవచ్చు.

# కర్మ-జన్మసిద్ధాంతాలు

# రాయప్రోలు వారి దృష్టిలో కర్మ - జన్మ సిద్ధాంతాలు

'ఈశ్వరు డనుగ్రహించె నాకీ భవంబు'[1] అని అంటూ ప్రాణికి కర్మానుసారంగా భగవంతుడు జన్మను అనుగ్రహిస్తాడను సంప్రదాయ దృష్టినే రాయప్రోలు వారు వ్యక్తం చేశారు.

'జ్ఞానోపాసనలకు క
ర్మానుష్ఠానములకు ఇతరాధ్యాత్మిక సం
ధానములకేది స్థానము
మానవ జీవితము కాక మహిలోన సుధీ!'[2]

"ఈశ్వరుని కుపసర్జనీ కృతు
డయిన మనుజుని సంసృతికి బహు
జన్మ జన్మాంతర కృతాకృత
ఫలవిపాకము కావలెన్"[3]

ఈశ్వరుడు ప్రసాదించే జన్మలలో క్రిమికీటకాదులకన్న మానవజన్మ ఉత్తమమయింది. జ్ఞానోపాసనలకు, కర్మానుష్ఠానాలకు ఇతర ఆధ్యాత్మిక చింతనలకు మానవజీవితమే సాధనం. మానవ జన్మ ఉన్నతం కనుకనే 'జంతూనాం నరజన్మ దుర్లభం' అని భావింపబడింది. ప్రాణి ఎన్నో జన్మలలో చేసుకున్న పుణ్యఫలం వల్ల మానవజన్మ లభిస్తుంది. మానవులలో కూడా విద్యాంసునిగా

---

1. 'మధుమాలి' - జడకుచ్చులు P 99
2. మాధురీ దర్శనము - P 12
3. ఆపాధి - మిశ్రమంజరి P 87

జన్మించడం మరింత సుకృతఫలం. మానవుని బహుజన్మ పుణ్యఫలం అతని సంస్కృతి.

జీవితంలో గతజన్మ పాప పుణ్యఫలాలు పూర్వ రంగంలా వర్తిస్తుంటాయి. ఆ పాపపుణ్యఫలాన్ని అనుసరించి జీవి అనుభవాలుంటాయన్నది ప్రాచీనకాలం నుంచి భారతీయుల నమ్మకం.

'నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతైరపి
అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్'.

వంటి ఆర్యోక్తులు ఈ విషయాన్నే చెపుతుంటాయి. రాయప్రోలువారు ఈ అభిప్రాయాలకు వ్యతిరేకులు కారు. కర్మాచరణ పట్ల వీరికి గౌరవం ఎక్కువ. 'కర్మ చేయాలని ఈశావాస్యోపనిషత్తులో ఉంది. కుర్వన్నేవహి కర్మాణి' అని .... కర్మ చేయకపోతే ఎట్లా? మానవుడికి కర్మ చేయడం అవసరం. జీవనార్థం కర్మ' అని వస్తుంది."[1] అని అంటారు.

'కట్టిడి కర్మమ్ముల వైపరీత్యములు సృష్టిన్ నీకవై వెలవా'[2]

"పప్పిక పాలుగా మాలు రీతి
సృష్టి బహురూపముల ఘటియింప, కర్మ
లమృత భాగ్యానుభవమున కడుచునుండె"[3]

ఈ భావాలు వారు కర్మసిద్ధాంతానికి ప్రాముఖ్యాన్నిస్తారన్న అభిప్రాయానికి ఆధారం అవుతున్నాయి. ఇంతేకాక కొన్ని సందర్భాలలో ఏ జన్మలో చేసిన కర్మఫలమో ఈ రీతిగా అనుభవానికి వస్తుందని

1. Interview on 10-7-81
2. లలిత - అభినవ కవిత P 216
3. ధ్యానగీతము - జడకుచ్చులు P 119.

పాత్రలుగా అనిపిస్తుంటారు.[1] సత్కర్మఫలం అమృతభాగ్యానుభవాన్ని కలిగిస్తుంటుంది. స్నేహాలు ప్రేమలు కూడా పురాకృత సుకృతఫలం అనే అభిప్రాయం వ్యక్తం చేస్తుంటారు సుబ్బారావుగారు.[2]

"తల్లి భాగీరథీదేవి చల్లనయిన
కడుపునన్ దాగి ధన్యమై కలిసిపోయె
పూత యమునా తరంగిణి; పూర్వజన్మ
సుకృతబీజము లిట్లు పండకయయున్నె!"[3]

పూర్వజన్మ సుకృతబీజాలు ఆ విధంగా ఫలిస్తుంటాయి కనుకనే

---

1\. ...అంతము లేని వంతలన్
మోయగ నోచినాను తరమో తుదు వంక లలాట రేఖలన్...
....క్రూర నోములు నోచితి త
ద్దురిత ఫలంబుగ వియోగ దుఃఖాతురనై
తిరుగుచు నిటు, పలవించెద..." 'లలిత'- అభినవకవిత P 214, 215
....కాదుగుల కూతులన్ కనుటకున్ పువు పూజలు సేయనైతినే
కృపయెడు దుర్గతుల్ గడువరాదని కానగరాని వేదనన్
సుడివడి స్రుక్కు నాదు మనసున్ బిగబట్టితి..." కష్టకమల- అభినవ
కవిత - P 269.

2\. దైవికంబగు సుకృతిని దక్క నవని
జతల ప్రేమోదయము సంగతము కాదు (తృణకంకణాదు)
పూర్వ పుణ్యోదయముల్ సుమీ
ప్రణయ యోగ్యము లైన నిబిడబంధముల్ (కష్టకమల)
ఏ వ్రతములు చేసి చెందిన సరాగమొ గాని వచింప జాలమా
జత చెలికారపు ముద్దుమలె--- --- ---(స్నేహలత)

3\. 'స్నేహలత'- అభినవకవిత - P 288

భారతదేశంలో పుట్టడమే పూర్వపుణ్యంగా భావించారు.

'ఏ పూర్వ పుణ్యమో ఏ యోగబలమో
జనియించి నాడవీ స్వర్గఖండమున'[1]

అనే వీరి ప్రసిద్ధ గేయం వీరి నమ్మకాన్ని చాటి చెప్తుంది.

మానవజీవితంలో కర్మానుసారంగా వచ్చే కష్ట సుఖాలు అతిసహజంగా చీకటి వెలుగుల వలె వచ్చి పోతుంటాయి. అయితే ఆశావాది అయిన సుబ్బారావుగారు కష్టాలు కలకాలం ఉండబోవని ధైర్యాన్ని కనబరుస్తుంటారు. కలిమి లేమి కూడా అటువంటివే. వాటి కోసం విచారించనక్కర లేదు. అది వ్యర్థం అని వీరి ఉద్దేశ్యం.

'--- --- --- --- --- --- సుఖంబు కష్టమున్
వెన్నెల చీకటుల్ బలెనె వీడక ఒకట్టి వెనక నొకట్టొకటై
క్రన్నన వచ్చుచుండును నిరాశ వహింతురె ఇంతమాత్రకున్
కలిమియును లేమియును కలకాలముండ
బోవునవి కావు వానికై పొంగబోకు
కాలకర్మాను గతుల నాకట్టగలమె
కడచి బ్రతికిన వారలు కలరె ఇలను.[2]

ఈ విధంగా కలిమి లేములు, కష్టసుఖాలు ఏవి ఎంతకాలం ఉంటాయో తెలియకపోవటమే విధివిలాసం. భవిష్యత్తు అనూహ్యంగా ఉండటం సహజం. విధి విచిత్ర లీలలలో రాబోయే వాటిని గుర్తింపలేకపోవడమే సృష్టి రహస్యం. చెట్టును పూసిన పూలలో

1. 'జన్మభూమి' - ఆంధ్రావళి P21
2. లలిత - అభినవ కవిత P210

ఏవి ప్రియురాలి సిగనలంకరిస్తాయో, ఏవి భగవంతుని పాదపద్మాల సన్నిధిని చేర్తాయో, ఏవి వ్యర్థమై నేలరాలి నశిస్తాయో చెప్పలేక పోవడమే సృష్టిరహస్యానికి ఉదాహరణప్రాయం. విధి బలీయమనీ దానిని ఎదిరించడమసాధ్యమనీ రాయప్రోలువారు భావిస్తారు. కనుకనే

"విధి విశృంఖల దుర్విపాకము పృథివి
నెవరెదిరింప గల్గిరి?....."[1]

అని ప్రశ్నించారు. కాలక్రమానుసారంగా వచ్చే ఫలాలను శరీరం ఉన్నంతవరకు అనుభవించడం అనివార్యం అని వీరంటారు.

'కాయ మెప్పుడు నందాక కాలమిచ్చు
భాగధేయ మనుభవింపకయు తీరదబల'[2]

'పుట్టిన అన్నిప్రాణులకు మరణం తథ్యం', 'పుట్టుట గిట్టుట కొరకే'నని సామాన్యులు భావిస్తే 'జాతస్య మరణం ధ్రువం' అని ఆర్యోక్తి. కర్మఫలం అనుభవించిన అనంతరం నియుతాయుర్భాగం చెల్లగానే మరణం సంభవించడం సృష్టినైజం. అయితే ఆత్మకు మరణం లేదని అది ఒక శరీరాన్ని వదలి వేరొక శరీరం ప్రవేశిస్తుందన్నది భారతీయుల దృఢవిశ్వాసం. రాయప్రోలు వారు కూడా ఆత్మతత్త్వాన్ని ఇదే విధంగా భావించారు.

'చచ్చిపోవు కారాకుల స్థానములను
చివురు చేతలు మొలుచు సౌష్ఠవము గనుచు

---

1. 'మాంచాల' - వనమాల P48
2. తృణకంకణము - ఉభనవకవిత P241

మృత్యువున కేలా భీతి వహింత్రు జనులు
అవల శిశు సౌమ్య సౌందర్యముల్పొంచుండ:[1]
'పాతగుడ్డలు పారవేతుము
క్రొత్తమడతలు కట్టుకొందుము
చావు బ్రతుకుల సత్యమింతే
ఎందుకో సందేహముల్.'[2]

అని అంటూ ప్రాచీనుల తత్త్వచింతనకనుగుణంగా ప్రతిబింబప్రాయంగా ఆత్మతత్త్వాన్ని వీరు భావన చేశారు.[3] జీర్ణవస్త్రాన్ని విడిచి నూతనవస్త్రాన్ని ధరించిన విధంగా ఆత్మ జీర్ణమయిన శరీరాన్ని వీడి నూతన శరీరాన్ని వరిస్తుంది. పండిన ఆకు రాలిపోగా దాని స్థానంలో చిగురు టాడిరి నును లేతకొమ్మ అందంగా అంకురిస్తుంది. అదే విధంగా మరణించినవారు తిరిగి శిశుసౌందర్యంలో జన్మిస్తారు. చావుబ్రతుకులలో ఉన్న ఈ సత్యాన్ని గుర్తించలేనివారు మరణానికి భయపడతారు. మరణానంతరం 'తరుణ సుకుమార పరిధానం' లభిస్తుందని రాయప్రోలు వారు విశ్వసిస్తారు.

---

1. 'వసంత వికాసము' - ఉదకుప్పులు P 122
2. భద్రయాత్ర - మిశ్రమంజరి - P 23
3. 'వాసాంసి జీర్ణాని యథా విహాయ
   నవాని గృహ్ణాతి నరోఽపరాణి,
   తథా శరీరాణి విహాయ జీర్ణా
   న్యన్యాని సంయాతి నవాని దేహీ' (ద్వితీయాధ్యాయం, 22వ శ్లోకం)
   అన్న గీతావాక్యాలకు ప్రతిబింబం లాగా రాయప్రోలు వారు
   భావించారు.

పుణ్యఫలం చేత ఆత్మ ఊర్ధ్వగతులకు పయనిస్తుంది. విమల నక్షత్రలోకాలకు, నిశ్చలానంద నిలయానికి పయనిస్తుంది. తపో యోగఫలంగా ఆత్మ 'అమృత నిధాన బ్రహ్మైక్యం' పొంది తృప్తి పొందుతుంది. జీవాత్మ పరమాత్మను చేరి మోక్షాన్ని పొందడం ప్రాణికి పరమార్థం. రాయప్రోలు వారి ఈ అభిప్రాయాలు రచనలలో అక్కడక్కడా కనబడుతుంటాయి.[1]

'భావస్థిరాణి జననాంతర సౌహృదాని' అని రాయప్రోలువారు విశ్వసిస్తారు. ఆత్మలో ఛాయావాసనాధికంగా గతజన్మరాగరసాలు నిలిచి ఉంటాయన్న అభిప్రాయం కొన్ని సందర్భాలలో వ్యక్తం చేశారు.

... ... "ఆ కన్నెకే నాడు లిచ్చె
రాలు కరగించు గాంధర్వ లాలనమ్ము?
జన్మవాసనవెంత నైజములో జగతి."[2]

---

1. "ఆమె పరమాణు పరిమాణమయిన ఆత్మ
విమల నక్షత్రలోక మార్గమును బట్టి...."
నిశ్చలానంద బాంధవ నిలయమునకు
నడచి పోవంగ గలదు నీ కడుపునందు
దుర్ముహూర్తాన బుట్టిన దుహిత యాత్మ" (స్నేహలత)
"యోగభ్రష్టుడవయి నా
యీ గృహమున బుట్టి తనువు నెరుగక పోతిన్
సాగితివా నియతాయు
ర్యోగము పూరించి బ్రహ్మపదవికి నందా!" (నందా) మిశ్రమంజరి
2. 'ఎవరు' - జడకుచ్చులు P 127

'బొంది నశియించియు నసంగ పూతమయిన
ఆత్మలోన ఛాయావాసనాదికముగ
రాగరసములు నిల్చునన్ ప్రణయవిదుల
స్నేహమీమాంసలను స్మరించెదను మదిని.[1]

జన్మవాసనలు కొన్ని జీవిలో స్థిరంగా నిలిచి ఉంటాయని వీరు భావించినట్లు ఈ సందర్భాలు స్పష్టం చేస్తాయి.

ఈ విధంగా రాయప్రోలువారు పాప పుణ్యకర్మల ఫలాలు కష్టసుఖాలకు కారణాలని నమ్ముతారనీ; ఆత్మనాశనం లేనిదనీ అది శరీరాలను ఒకదానిని వదిలి వేరొకదానిలో ప్రవేశిస్తుందనీ దానివల్ల పునర్జన్మ ఉందని వీరు విశ్వసిస్తారనీ; ఆత్మ బ్రహ్మైక్యం పొందడం వంటి అభిప్రాయం వీరికి ఉందనీ; జన్మవాసనలు అనంతరజన్మలో ఛాయావాసనాదికంగా అనుసరిస్తుంటాయని భావిస్తారనీ పైన ఉదహరించిన భాగాల వల్ల స్పష్టం అవుతుంది. ఈ భావాలన్నీ ప్రాచీనకాలంనుంచీ భారతీయ తాత్త్వికచింతనలో భాగాలే కనుక ఈ అభిప్రాయాలు వీరిని సంప్రదాయవాదిగా భావించడానికి దోహదం చేస్తున్నాయి. కావ్యాల్లో వైదికవాతావరణాన్ని సృష్టించడంలో ఈ సంప్రదాయాభిమానం మరింత వ్యక్తం అవుతుంది. వీరి రచనల్లోని వైదిక కర్మల ప్రస్తావన వీరి దృష్టిలో కర్మాచరణకు ఉన్న గౌరవాన్ని సూచిస్తుంది.

---

1. స్నేహలత - అభినవ కవిత P 282.

# వైదిక కర్మల ప్రస్తావన

'షట్ కర్మాణి దినే దినే' అని ఆర్యోక్తి. చిత్తశుద్ధిని ప్రధానం చేసుకుని నిత్యకర్మాచరణ ఉద్దేశింపబడింది. కనుకనే శ్రీ శంకరులు 'చిత్తస్య శుద్ధయే కర్మ'[1] అని అంటారు. హైందవ ధర్మ శాస్త్రాలు బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలలో వివిధ కర్మలు విధించాయి. ప్రాచీనకాలం నుంచి స్నానం, సంధ్య, జపం, హోమం, దేవపూజ అనే నిత్యకర్మలు విధ్యుక్త ధర్మాలుగా భావింపబడుతున్నాయి. కౌశలంతో కర్మ చేయమనీ కర్మ చేయడంలో వ్యక్తికి కల అధికారం ఫలప్రాప్తిలో లేదనీ బోధిస్తుంది గీత.[2] శ్రుతి స్మృతి పురాణేతిహాసాలు కర్మాచరణ ప్రాధాన్యాన్ని చెబుతూనే ఉన్నాయి. వర్తమాన స్థితి పూర్వకర్మ ఫలం అయితే భవిష్యత్తు ప్రస్తుత కర్మ ఫలం అవుతుంది. భావి సౌభాగ్యాన్ని వాంఛించేవారు వర్తమానంలో సత్కర్మాచరణ పట్ల ఆసక్తి కలిగి ఉండడంలో ఆశ్చర్యం లేదు.

'ఏ ప్రఫుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజ సల్పితినో యిందు పుట్టినాడ'[3]

అని అంటూ పాప పుణ్యాల నమ్మకంతో సుబ్బారావు గారు కర్మభూమి అయిన భారతదేశంలో జన్మించడమే మహాభాగ్యంగా భావించారు. సద్గతులు సత్కర్మ ఫలాలుగా విశ్వసించిన రాయప్రోలువారు విధ్యుక్త

---

1. వివేక చూడామణి - శ్రీ శంకరాచార్యులు 11 వ శ్లోకం
2. 'యోగః కర్మసు కౌశలమ్' (భగవద్గీత 2-50)
   కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన (భగవద్గీత 2-47)
3. రమ్యాలోకము - P8

కర్మాచరణ పట్ల ఉదాత్తభావాన్ని కలిగి ఉండడం ఆశ్చర్యం కాదు. వీరి రచనలను బట్టి వీరు సనాతన హైందవ సంప్రదాయాలయిన కర్మానుష్ఠానాలపై అభిమానం కల వ్యక్తి అని తోస్తుంది. వీరి వర్ణనలు రచనకు ఆర్ద్రవాతావరణాన్ని కల్పించడమే కాక వీరి సంప్రదాయాభిమానాన్ని కూడా వ్యక్తం చేస్తాయి.

"ఆ హితాగ్ని సమస్త వేదాంత వేత్త
పౌరుడు సాయమర్ఘ్య ప్రదానాదరమున
ఉద్ధరణి పంచపాత్రయు నూని ద్వార
వేదిపై కూరుచుండె నావేళయందు".[1]
"పశ్చిమాభిముఖుండయి పరమ నిష్ఠ
సంధ్యవార్చుచున్న పారేంద్ర శర్మ..."[2]

స్నేహలత తండ్రి సాయం సమయంలో అర్ఘ్యం ఇవ్వడానికి ఆసీనుడయ్యాడని వర్ణించారు. కప్పకమలలో

'చనె నా బ్రాహ్మణవాటిక
ననుదిన కృత దేవతార్చనాతిథ్యంబుల్'.[3]

అని గ్రామసీమలలోని వైదికవాతావరణాన్ని చూపారు. 'కమల తండ్రి వసంతశాస్త్రి ప్రదోషసమయం కాగానే

'శిష్యులతోడ నాలయంబు నిర్గమించె సంధ్యార్చనానియతి'[4].

అని సాయం సంధ్యకు బయలుదేరినట్లు చిత్రించారు. లలితకావ్యంలో సంధ్యావర్ణనలో ఇతర వర్ణనీయాంశాలతో పాటు,

---

1, 2 స్నేహలత - అభినవకవిత P 283, 285

3, 4 కప్పకమల - అభినవకవిత P 265, 268

....“జలాంజలులై జడధారువెల్లువా

కలకడ సంధ్యావార్చిరి సకాల సమంజస మానబద్ధులై”[1]

అని మునివాటికల ఆచారాన్ని సహితం బోధించారు. సత్యవర్ధనుడు పాంథ వేషధారి అయిన లలితలో తన వైరాగ్యజీవితాన్ని గూర్చి చెప్పే సందర్భంలో

‘తమంత తాము ఎదుగు కాయలు కూరలు నారగించుచున్

సానలు నింపు దీర్ఘికల శుభ్రజలంబుల నాచమించుచున్’...[2]

కాలం గడుపుతున్నట్లు రాయప్రోలువారు కల్పన చేశారు. సంధ్యావార్చడం ఆచమించడం వంటి ఈ కల్పనలు అనువాదకావ్యమయిన ఈ రచనకు భారతీయ ఆధ్యాత్మావరణాన్ని ఆపాదించాయి.[3]

ఇన్ని స్థానాలలో సంధ్యావందనాన్ని వర్ణించిన రాయప్రోలు వారికి ఉపనయనాది కర్మలలో నమ్మకం ఉండడంలో ఆశ్చర్యం లేదు. వారి కుమారుని మృతి సందర్భంలో రచించిన ఖండికలో

“ఉపనయనము కావింపని

అపచారము నాకు నిలిచెనందునా...”[4]

అని అంటూ ఉపనయనం చేయని దోషం పుత్రుని అకాలమరణానికి కారణం అయిందేమోననే బాధను వ్యక్తం చేశారు.

మరణానంతరం అపరకర్మలు అనాదిగా భారతీయ సంప్రదాయంలో భాగాలు. స్నేహలతా ప్రియంవదల సంభాషణలో వివాహాలలో ఆచారం అయిన మంగళస్నానాల ప్రసక్తితో పాటు ‘నివాపోదకాలను’ గూర్చి కూడా చేర్చారు సుబ్బారావుగారు.

---

1,2 ‘లలిత’- అభినవకవిత - P195

3. ‘లలిత’- గోల్డ్‌స్మిత్ వ్రాసిన ‘హెర్మిట్’ అనే ఇంగ్లీషు కావ్యానికి స్వేచ్ఛానువాదం

4 ‘నందా’- మిశ్రమంజరి . P 121

"నా వివాహంబులో వసంతంబులాడి
మంగళస్నానమాడితి గంగయందె
మన సఖీమణులె మురిపింప ముందు రాక
మన వివాహోదకము విచ్చు రసముజూచిందె"[1]

అని అంటుంది ప్రియంవద. వైదిక సంప్రదాయంలో శుభాశుభకర్మల ప్రస్తావన ఇక్కడ కనబడుతుంది.

ప్రాతఃకాలంలో ప్రార్థనాదికాలు చేయడం దాదాపుగా వేదకాలం నుంచీ వస్తున్న సంప్రదాయం. 'ధ్యానగీతము'లో ఈ సంప్రదాయాన్ని చక్కగా ప్రదర్శించారు సుబ్బారావుగారు.

"తమసమున నుండి జ్యోతిష్పథంబునకు అ
సత్యమున నుండి సత్యసాంగత్యమునకు
మృత్యువున నుండి మమ్ము అమృతమునకును
చేర్పుమని ఉపనిషదుక్తిచే స్తుతించి
రమ్యమయిన దేవీ పంచరత్నములను
కంఠమెత్తి పాడితి నాడట గురుల పాదుక..."[2]

ఈ ధ్యానవిధానం అనాదిగా వస్తున్న వైదికసంప్రదాయాన్ని కనులముందు ఉంచుతుంది. ఋషులు ఉషఃకాలంలో వేచి ప్రార్థనలు చేసే సత్సంప్రదాయ మార్గంలో ఈ వర్ణన సాగింది.

వైదిక నిత్యకర్మలలో దైవపూజ కూడా ఒకటి. దీప, ధూప నైవేద్యాలు పసుపు, కుంకుమ, పూలతో పూజించడం; మంగళహారతి మంత్రపుష్పం సనాతన పూజా సంప్రదాయంలో భాగాలు.

1) స్నేహలత - అభినవకవిత P 294

2) ధ్యానగీతము - జడకుచ్చులు P 115

"అరసి అర్చింపుమా జగదంబనెపుడు
స్నేహదీపము వెలిగించి చిత్రపీఠి
పసుపు కుంకుమ పూలు కాసరి వల్లి
చిన్ని కర్పూరహారతి చేతబట్టి
పాడవమ్మ.....' 1

'జయము గానము జేయు యుష్మత్పవిత్ర
మంత్రపుష్పోక్తి యీ లోన మానిజనుల
కర్ణపూర్ణోత్సవము చిలుకంగ వలయు"..2

ఈ విధంగా దైవపూజా విధానం సంప్రదాయానుసారంగా వర్ణించారు రాయప్రోలు వారు. నోములు వ్రతాలు కూడా వీరి రచనల్లో చోటు చేసుకున్నాయి.

వైదిక సంస్కృతిలో అర్ఘ్యపాద్యాలకు ప్రముఖస్థానం ఉంది. ప్రాచీన సాహిత్యంలో దాదాపు ఏదో ఒక ఘట్టంలో ఈ అర్ఘ్యపాద్యవర్ణనలు కనబడతాయి. అతిథి సత్కారాలలో ఇవి అతిముఖ్యమైనవిగా భావింపబడుతూ వచ్చాయి. 'అతిథిదేవోభవ' అని అతిథిని దైవంగా భావించడం భారతీయ సంప్రదాయం. కనుక దైవపూజావిధానంలోని ఈ అర్ఘ్యపాద్యాలు అతిథిసత్కారంలో కూడా చోటుచేసుకుని ఉంటాయి. అయితే ఆధునిక కాలంలో నిత్యజీవితంలో వీటి ఆచరణ కొంత సన్నగిల్లినా గౌరవ పురస్సరంగా ఆ ప్రసక్తి అక్కడక్కడా కనబడుతూనే ఉంటుంది. గురువుల విషయంలో గురుతుల్యుల విషయంలో అర్ఘ్యపాద్య సత్కారం సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తూ రాయప్రోలువారు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారిని గురించి వ్రాస్తూ

---

1,2 'తెనుగుతోట' - అభినవకవిత P.340, 339

" ..... వేంకటకవీంద్రుగురు

ప్రభుపాదునకిదె మా వా

గ్విభవ కాదంబినీ పద్యకావ్యంబున్." [1]

అని కావ్యప్రసక్తి చెప్పారు.

ఈ విధంగా సంధ్యావందనం, అర్ఘ్యం, పాద్యం, దైవప్రార్థన దైవపూజ, వివాహ మంగళస్నానాలు, నివాళోదకాలు వంటి వైదికకర్మల ప్రస్తావన రాయప్రోలువారి రచనలలో కనబడుతుంది.

యజ్ఞయాగాది వైదికకర్మలలో గృహిణులుగా స్త్రీలు భాగం పంచుకున్నా ప్రత్యేకంగా వారికి అటువంటి కర్మలలో కర్తృత్వం లేదు. కనుక స్త్రీలు వైదికకర్మలకు కొంత దూరం అయ్యారు. స్త్రీల సద్భావనలను సద్గతులను దృష్టిలో పెట్టుకుని కావచ్చు కొన్ని నోములు వ్రతాలు ప్రచారంలోకి వచ్చాయి. వ్రతాలు వంటి వాటిలో శక్త్యనుసారం దానధర్మాలు చేసి వాటి ఫలంగా సుఖసంతోషాలను, కుటుంబక్షేమాన్ని ఆకాంక్షించడం ఆచారంగా వస్తోంది. స్త్రీలు నోములలో భగవదారాధన చేసి పేరంటాల రూపంగా పసుపు కుంకుమ, పూలు, పండ్లు వంటివి పంచి సత్కర్మాచరణ ఫలాన్ని అనుభవిస్తారు. కనుక ఇవి కూడా కొంతవరకు కర్మసిద్ధాంతం పట్ల నమ్మకంలో వ్యవహారంలో ఉండి ఉంటాయని ఊహించవచ్చు. స్త్రీలు నోములు వ్రతాలు ఆచరించే సంప్రదాయం తెలుగుదేశంలో చాలాకాలం నుంచి ప్రచారంలో ఉంది. తమంత తాముగా నిర్వర్తించే ఈ నోములను వ్రతాలను స్త్రీలు ఉత్సాహంగా జరుపుకుంటారు. స్త్రీలకు ఉద్దేశింపబడిన ఈ విధమైన నోములను వ్రతాలను కూడా రాయప్రోలువారు వర్ణించారు.

---

1. 'చెళ్ళపిళ్ళ మహాకవి' మిత్రమండలి - P113

'కన్నెపాటలు' లో గౌరీపూజకు తెలుగుపడుచులు అరటి స్తంభాలతో అందంగా మంటపాన్ని అలంకరించడం, మంగళసూచకంగా మామిడాకులతో తోరణాలు కట్టడం, బంతి చేమంతి పూలతో పీఠాన్ని అమర్చడం, పసుపు, కుంకుమ, పూలు విరివిగా పూజకై సిద్ధం చేయడం, నైవేద్యానికి తేనె, జున్ను, కొబ్బరి వంటివి సమకూర్చడం రమ్యంగా చిత్రించారు. స్త్రీల వ్రతాలలో అతిప్రసిద్ధిపొందిన 'వరలక్ష్మీవ్రతము' కూడా వీరి రచనలో చోటు చేసుకుంది. నోములు వ్రతాలలో దైవపూజతోపాటు ప్రధానమయినది పేరంటం. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు మొదలైనవి పంచడం దీనిలో ముఖ్యోద్దేశం. తెలుగింటి పేరంటాన్ని రాయప్రోలువారు తమ సహజ ధోరణిలో మధురంగా వర్ణించారు.

"నొసల కుంకుమ బెట్టి పసుపిచ్చి మాయింటి
పేరంటమునకని పిలిచినావా
పచ్చని పసినిమ్మపండ్ల గంపల జూసి
ఇస్తి వాయనమని ఇచ్చినావా!"[1]
"భోగి నోములు నోచి నెలతలు
పాలు పొంగలి పంచి వెళ్లిరి-"[2]

ఈ విధంగా పేరంటం పిలవడం నుంచి వాయనం పంచడం దాకా వర్ణించారు. 'పూజకాడ్డీ పురుషుడూ దానం కాడ్డీ బిడ్డలూ' అని లోకోక్తి. వ్రతాలలో పసుపు కుంకుమలు పంచడం, పండ్ల వంటివి వాయనాలివ్వడం ఐదవతనాన్ని వృద్ధిపొందిస్తుందని, సత్సంతానాన్ని ఇస్తుందని హైందవ

---

1. 'కష్టకమల' - అభినవ కవిత - P275
2. 'మంగళమాఘము' - మిశ్రమంజరి P48.

స్త్రీల నమ్మకం. ఒక శుభం జరిగినప్పుడు దానిని పూజాఫలంగా నోముల పంటగా భావించడం సహజం. రాయప్రోలు వారి రచనలలో కొన్ని సందర్భాలను బట్టి వారికి ఇటువంటి అభిప్రాయాలున్నట్లు కనబడుతుంది. తిక్కన సోమయాజిని 'మా నోముల పంట! తిక్కన మూర్తి'[1] అని సంబోధించారు. 'ఆ కన్నెకే నోములిచ్చె రాలు కరగించు గాంధర్వ బాలనమ్మ'[2] అని కమ్మని గాత్ర సౌభాగ్యం కూడా నోముల పంటగా చెప్పారు. 'ఏయమ పూల పూజ ఫలియించెనో నిన్ కడుపార గాంచి'[3] 'కొడుకుల గొడుకులన్ గనుటకున్ పువు పూజలు సేయనైతి'[4]. పూజాఫలంగా బిడ్డల ప్రాప్తి అన్నది వీరి విశ్వాసంగా ఈ సందర్భాలు చూపుతాయి. కనుక నోములు, పూజలు సత్ఫలితాలనిస్తాయని వీరు నమ్ముతారని ఇవి స్పష్టం చేస్తాయి. వీరి రచనలలో చిట్టిబొట్టు నోము (తెనుగు తోట), లక్షదీపాల నోము (వనమాల), వరలక్ష్మీ వ్రతము, గౌరీ పూజ (కన్నెపాటలు), తులసి పూజ (కృష్ణకథలు) వంటి నోములు, పూజలు, వ్రత విధానంలోని ఉపాసనలు ప్రస్తావించబడ్డాయి.

ఈ విధంగా స్త్రీల పూజలను, వ్రతాలను, పేరంటాలను వాయన దానాలను చిత్రించి స్త్రీల సత్సాంప్రదాయాచరణానికి కూడా తమ రచనలలో స్థానం కల్పించారు.

ఈ రకంగా వీరి రచనలలో కనబడే కర్మల ప్రస్తావన, పాప పుణ్య కర్మల నమ్మకం వీరు కర్మ సిద్ధాంతాన్ని విశ్వసిస్తారనే

---

1. నివేదన - వనమాల P 73
2. ఎవరు - జడకుచ్చులు P 137
3. లలిత - అభినవకవిత P 208
4. కృష్ణకథలు - అభినవకవిత - P 269

అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. ఈ రకమైన హైందవ నమ్మకాలు పూర్వరంగంగా వీరి ఆలోచనా సరళి, తాత్త్విక అవగాహన సాగాయి. ఇటువంటి వైదిక భావాల ప్రాతిపదిక మీద సృష్టి సమస్తాన్ని తాత్త్విక నయనాలతో వీరు పరిశీలించారు. తమవైన విశ్వాసాల నేర్పరచుకున్నారు. అద్వైతాది సిద్ధాంతాలను గూర్చి, భక్తి వంటి మోక్షసాధన మార్గాలను గూర్చి భగవత్తత్త్వాన్ని, భగవదారాధనా విధానాన్ని గూర్చి నిర్దిష్టమైన అభిప్రాయాలను చెప్పారు.

---

# భగవత్తత్త్వం

10

# అద్వైతం - రాయప్రోలువారి దృష్టి

నిర్వికారం నిరంజనం వాగతీతం అయిన పరబ్రహ్మతత్త్వం సామాన్యులయిన కవులకు అంతగా ఆస్వాదయోగ్యం కాదని రాయప్రోలువారి భావన. వీరి దృష్టిలో అద్వైతం అందనిది.

అద్వైతుల దృష్టిలో ప్రకృతి మాయ. దృశ్యమానం అయిన ప్రపంచం అంతా వాస్తవంగా లేనిదనీ, అది ఎండమావుల్లో జలప్రవాహం లాగా, త్రాటిలో పాము లాగా, మాయాజన్య భ్రాంతి వల్ల యథార్థంగా ఉన్నట్లు గోచరిస్తుందే కాని యథార్థం కాదన్నది అద్వైతుల ప్రధానసిద్ధాంతం. ఇటువంటి నిత్యానిత్య వివేకంలో 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అని గుర్తించడం అద్వైతానికి ఆయువుపట్టు. కాని

"కానబడకనుమాన ప్రమాణమునకె
అందియందని పరతత్త్వమువల నుంచి
పంచభూత దృశ్యంబైన ప్రకృతి యొకటి
సన్నిహిత లక్ష్యమనియె వచస్వి నేడు."[1]

అని అంటూ రాయప్రోలువారు పరతత్త్వం తమకు అందనిదిగా భావించి ప్రత్యక్షంగా కనబడే స్థావరజంగమాత్మకమైన ప్రకృతిని లక్ష్యంగా గ్రహించారు. అద్వైతులచే మాయగా భావింపబడే ప్రకృతిని ఉపాసించారు. ఇది వీరు అద్వైతి కాదనే ఊహకు అవకాశాన్ని ఇస్తోంది. 'బ్రహ్మ సత్యం జగన్మిథ్యా' అని భావనచేయడంలో మాధుర్యం లేదని వీరు భావిస్తున్నట్లుగా కనబడుతుంది.[2] ప్రకృతిని సౌందర్య

1. రమ్యాలోకము - P 19.
2. 'సుబ్బారావు గారు ఒక సభలో నీరసమైన అద్వైతం నాకొద్దు. నాకు ...పంచేంద్రియ తర్పణమైన ఆనందం నాకావాలి-.... పంచేంద్రియాల ద్వారా ఆస్వాదించే రసస్ఫురణ నాకు కావాలి' అని అన్నారు.

Interview with Dr Amarendra - 30-3-81

వంతంగా, భగవత్ స్వరూపంగా భావించి ధ్యానించడంవల్ల 'ధ్యాత - ధ్యేయము - ధ్యానము' అనే త్రిపుటి ఏర్పడి అద్వైతభావానికి వీరు కొంత దూరమైనా అనుకునే అవకాశం కలిగించింది. భావుకుడైన కవిగా వీరు ప్రకృతిలోని ప్రతి చిన్న అంశంలో అందాన్ని చూచి తన్మయం పొందారు.

పుత్ర మిత్ర, కళత్రాది సుఖాలు బంధాలు అనిత్యాలని గుర్తించి 'సంన్యస్య సర్వకర్మాణి భవబంధ విముక్తయే' అని భవబంధ విముక్తిలో ప్రయత్నం చేయాలని అద్వైతుల ఆశయం. పుత్ర మిత్ర కళత్ర గృహారామాదుల్లో మమకారం దేహేంద్రియాదుల్లో అహంకారం మోక్షప్రాప్తికి, ఆత్మజ్ఞానానికి ప్రతిబంధకాలని అద్వైతుల భావన. అయితే

"శాంతియు ప్రేమయున్ మధుర రసంబులు పేశల రాగ లాలిత
స్వాంత దళీ పుటంబులను అయ్యవి యస్ఖలితంబులై మనున్
అంతరముల్ పెనంచిన ప్రియ ప్రణయంబులు మాయలోవు వి
భ్రాంతియె గాక ప్రేమ గలుపన్ విడదీయ నిమిత్త సాక్ష్యమే'.[1]

అని ప్రేమ బంధాలు త్రెంపినా తెగనివని భావించి, సృష్టిసమస్తం ప్రేమయుతమై సజీవ మహత్వంలో విలసిల్లుతోందని రాయప్రోలు వారు విశ్వసించారు. ఇక మమకారం గూర్చి పరిశీలిస్తే

'నాదు జాతి - నాదేశము - నాదు భాష
అను అహంకార దర్శనమందు మాంద్య'[2]

అన్నది వీరి ప్రబోధ కవిత్వానికి ఆధారం. ఈ జాతి నాది, ఈ దేశం నాది, ఈ భాష నాది అన్న మమకారం ఉంటేనే అభ్యుదయానికి కృషిచేయడం జరుగుతుంది.

---

1. తృణకంకణము - అభినవకవిత P 245
2. 'ఆంధ్ర' - ఆంధ్రావళి P 33

అంతా మిథ్య అనుకుంటే ప్రగతి పథంలో పయనించడం అసాధ్యం. ఆ అహంకార దర్శనంలో ముందుకు అడుగువెయ్యమంటూ దేశకాల పరిస్థితుల కనుగుణంగా ప్రబోధాన్ని ప్రబోధించారు సుబ్బారావుగారు.

అద్వైతుల దృష్టిలో 'అవిచారిత రమణీయం సర్వమిదుంబర ఘటోపమ భాగ్యమ్' అని భాగ్యవస్తువుల నశ్వరతనే మేలిపంక్తిగా భావించి వైరాగ్య భావాన్ని పెంపొందించుకోవడం ముముక్షువుల కర్తవ్యం. కాని రాయప్రోలువారి రచనలలో వైరాగ్యభావం అంతగా కనబడదు.

'కవికి తాత్త్వికునకు కయ్యంబె సాగెను
బహుదినాలు వాక్ప్రపంచమందు
రాగరక్తుడాతడు రాగముక్తుడాతండు
సగుణ నిర్గుణముల సఖ్యమెట్లు?'[1]

అని అంటూ కవులు 'రాగరక్తుల'న్నారు. అటువంటి వారికి వైరాగ్యం అంతగా అభిలషణీయం కాదని అనుకోవచ్చు. ఇటువంటి అభిప్రాయంతోనే కావచ్చు ఒక సందర్భంలో

"కనుకనే వాచామగోచర
మునికి అపరోక్షానుభూతిని;
వరలు కవి నిస్సంగులను - ఏ
టికి గృహస్థుల వటువగన్"[2]

అని అన్నారు.

కనుక అద్వైతం అందనిదని, తాత్త్వికుల రహస్యాలు తేటపడని

---

1. రమ్యాలోకము - P 23
2. 'ఉపాధి' - మిశ్రమంజరి P 84

నిగూఢ విషయాలు అనే భావన వీరిలో అక్కడక్కడా కనబడుతుంది. అద్వైతం అందనిదన్న భావనేగాని అద్వైతసంప్రదాయానికి చెందిన రాయప్రోలువారిని అద్వైతానికి వ్యతిరేకులని అనుకోవడానికి అవకాశం లేదు. వీరికి దానిపట్ల ప్రత్యేకమైన ఆసక్తి లేదని చెప్పుకోవచ్చు.

"ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం - వీటిల్లో ప్రత్యేకంగా ఒక ఆసక్తి, ఆస్థ సుబ్బారావుకున్నట్లు కనిపించదు. అద్వైతం అన్న ఆమోదం వారికున్నది. ఎందువల్లనంటే అటువంటి సంప్రదాయంలోని వారు కాబట్టి. ...నాకు మాత్ర శాక్తేయతత్త్వం, శివపూజ ఉండేది. అద్వైతవాసనా ఉండేది."[1]

ద్రష్ట అయినకవి అద్వైతి అయి అంతా మిథ్యగా భావన చేసినప్పుడు కవిత్వసృష్టికి అవకాశమే లేదు. ఏదయినా రెండు ఉన్నయ్యనుకున్నప్పుడే మాధుర్యానికి, తన్మయత్వానికి అవకాశం ఉంది కాని అంతా ఒకటే అయితే రసాస్వాదన ప్రసక్తే లేదు.[2] కనుక సృజనాత్మక రచన చేసే కవి అంతరంగంలో అద్వైతం పట్ల కొంత ఆమోదం ఉన్నప్పటికీ ఆచరణలో ద్వైతి కాకతప్పదని చెప్పవచ్చు. రసవత్తరమైన రచన సాగించాలనుకునే కవి వైరాగ్యాన్ని, మిథ్యా

---

1. Interview with Sri J. Madhava Rama Sarma garu 30-3-81

2. "మామూలుగా నా ఉద్దేశంలో కవులందరూ కూడా ఒకవిధంగా ద్వైత వాదాన్నే ఎక్కువగా అభిమానించినట్లు కనబడుతుంది.... ఎందుకంటే అద్వైతంలో కేవలం ఏకత్వం. ఈ ఏకత్వంలో మాధుర్యం ఏమీ లేదు. ఇవి రెండూ విడిపోయి ఎడబాటులో వియోగం పొందినపుడే ఆ వియోగ వేదనలోంచి మధురమైన కవిత్వం పుడుతుంది."

Interview with Dr Amarendra 30-3-81

వాదాన్ని ఆశ్రయించడం ఆచరణీయం కాకపోవచ్చు. కనుక రాయప్రోలు వారిలో అద్వైతవాసన ఉన్నా కవిగా కొంతవరకు విశిష్టాద్వైతానికి దగ్గరవుతున్నారని భావించవచ్చు. శంకరాచార్యుల పట్ల అభిమానం వీరికుంది. శంకరుని అద్వైత ప్రధాన రచన వివేకచూడామణిని తెలుగు చేశారు.[1] "ఎందుకు చేశానంటే శంకరుడు అద్వైతం చెప్పాడు కదా! సన్యాసం ముఖ్యం. అదే సిద్ధి..... పంచరత్నస్తోత్రం ... అని కేవలం ప్రాతఃస్మరణ.... దాన్ని అద్వైతులు చదువుతారు. అది కూడా శంకరుడు చెప్పిందే. దాన్ని నేను రోజూ చదువుతాను." అని అన్నారు.[2] శంకరుని సౌందర్యలహరి, భజగోవింద శ్లోకాలు అనువాదం చేశారు. దీని వల్ల వీరికి శంకరుని పట్ల అభిమానంతో పాటు అద్వైతవేదాంతం మీద గౌరవం ఉందని తెలుస్తోంది.

"అసలు కవి అయినవాడెల్లా నిర్గుణబ్రహ్మనే చెబుదామని ప్రయత్నించినా సగుణబ్రహ్మ ద్వారాగాని చెప్పడం కుదరదు..... రాయప్రోలు కోరింది, పొందదలుచుకుంది నిర్గుణబ్రహ్మవస్తువు అయినప్పటికీ అది సగుణస్వరూపం లేందే కనబడదు కాబట్టి, కవిత్వం శబ్దం లేనిదే వినబడదు కాబట్టి ద్వైతసిద్ధాంతంలోనే చెప్పాడు. కాని ఆయన ఒళ్ళు మరచి చెప్పినప్పుడు మాత్రం అద్వైతం కనిపిస్తూనే ఉంది. ఆయనకు మూడింటిలో ఏదిష్టమూ అంటే అద్వైతమునందే పర్యవసానం. కాని దాన్ని చెప్పేటప్పుడుండే ద్వైతంలోనూ చెప్పాలి, విశిష్టాద్వైతంలోనూ చెప్పాలి."[3] అద్వైత ప్రస్తావన వచ్చినపుడు రాయప్రోలు వారు "మాధ్వులు ద్వైతం. వాళ్ళు అద్వైతాన్ని తీవ్రంగా ఎదుర్కొంటే మధుసూదన సరస్వతి అద్వైతాన్ని నిలబెట్టాడు...నేను అద్వైతిని కాను."[4] తాను అద్వైతిని

---

1. అముద్రిత రచన

2,4 Interview on 8-7-81

3. Interview with Sri Koganti Sitaramacharyulu garu on 30-3-81.

కానని రాయప్రోలువారనడంలో కూడా అద్వైతం అంతర్నిహితమన్న భావమే కనబడుతుంది.

"అందము నిర్వికారము నిరంజనమౌ పరతత్త్వరేఖ ఆ

నందము నిర్గుణాన సగుణాననుప్రాప్తము యౌటు; వాచ్యమూ

త్రింశదిశాంతు నీ ప్రకృతి దివ్యశుభావరణాన"[1]....

అనే నిశ్చయంలో ప్రత్యక్షంగా కనబడే ప్రకృతినే లక్ష్యంగా స్వీకరించినట్లు కనబడుతుంది. శుష్కమీమాంసను వదలి అనంతరూపాలలో విలసిల్లే ప్రకృతిని ఆశ్రయించి ఆరాధించడం రాయప్రోలువారి అభిమతం. జగత్తు మిథ్య అన్న దృష్టి జ్ఞానయోగులదని ప్రేమయోగాన్ని దర్శించదలుచుకున్న తమవంటి వారికి ఆ అద్వైతభావన అప్రధానం అని వీరు భావించినట్లు కనబడుతుంది. పరతత్త్వం, పరబ్రహ్మం గూర్చిన మీమాంస వీరికి అప్రధానం. ఇక ఆ భగవంతుని చేరే మార్గాలను గూర్చి ఆలోచించినపుడు, జ్ఞాన కర్మ భక్తి మార్గాలలో వీరికి భక్తిమార్గం పట్ల గౌరవం అధికంగా కనబడుతుంది.

## భక్తిమార్గం - రాయప్రోలువారి దృష్టి

కేవలజ్ఞానమార్గం సామాన్యులకు సాధ్యం కాదనీ భక్తిమార్గం అందరికీ అందుబాటులోనిదనీ వీరి అభిప్రాయంగా కనబడుతుంది. "నహి జ్ఞానేన... జ్ఞానులంటారు కాని అందరూ కారు. ఒక్క జనకునికే వచ్చింది ఆ పేరు. Purity itself is జ్ఞానం. Purity అంటే ఎన్నిటితో అర్థం చేసుకోవాల్సివస్తుంది. మనోవాక్కాయ కర్మల యందు మాట యందు ఏ కల్మషం అంటని శుద్ధమార్గం ఏదో అది జ్ఞానమార్గం.... అది అసంభవమైన విషయం. మనకు మనసు నిలవదే. ఎంతగొప్పవాళ్ళూ... ఎందరు చెప్పినా

1. 'తెలుగు మాన్యము' - ఆంధ్రావళి P 41

కేవలం జ్ఞానిగా ఒకరిని కన్నా చెప్పలేను. (కోపం, భయం, చిరాకు) ఏమీ లేని మౌనమార్గం జ్ఞానమార్గం. అవన్నీ శాంతానికి విరోధం లేకుండా ఉండడానికి మార్గాలు. 'యోగశ్చిత్తవృత్తి నిరోధః'. మనస్సు... చిత్తం ప్రసరించకుండా నిశ్చలంగా ఉండడం కావాలి. శంకరుడే, ఇన్ని చదివిన వాడే 'భక్తి రేవ గరీయసీ' అన్నాడు. భక్తి మార్గం కన్న ఇంకో మార్గం లేదు. అదే నా ఉద్దేశం. భక్తి అంటే లక్ష్యం. ఏది భక్తియో అది మధురం. ఎక్కడ భక్తి ఉంటుందో అక్కడ మధురం ఉండి తీరుతుంది. భక్తే మధురం అని నా ఉద్దేశ్యం.[1]

కనుక భక్తి మార్గం వీరికి అభిమానపాత్రమయింది. అది ప్రజలను శాంతపరచు ఆచరణయోగ్యమయినదిగా వీరు భావించారు. రసవత్తరమైన భక్తి మధురమయిందని వీరి మాటల్లో స్పష్టమయింది. భక్తికి ఆలంబన అవసరం. ఆ ఆలంబన సగుణంగా ఉండడం సర్వసాధారణం. భక్తి మార్గాన్ని అభిమానించారు కనుకనే వీరి రచనల్లో సగుణారాధన తత్త్వం గోచరిస్తుంది.

---

1. Interview on 10-7-81

# రాయప్రోలు వారి సగుణారాధన తత్త్వం

దేవతా ప్రస్తావన: కావ్యారంభంలో విఘ్నేశ్వర ప్రార్థన, సరస్వతీ స్తుతి, ఇష్ట దేవతా స్తుతి వంటివి ప్రాచీనకవులు చాలమంది సంప్రదాయంగా పాటించారు. కవులు వాగ్వ్రతులు కనుక వాగ్దేవిగా భావనచేయబడిన సరస్వతీదేవిని స్తుతించడం సహజం.

'మృదు పాదయుతైన వాణికి మెడలు గాక
ఎందరెందరు సుతులనో ఎత్తిపెంచి
మమత తీరని ఏకకుమార సరణి
నను కటాక్షించు తల్లి వాణిని నుతింతు.'[1]

రాయప్రోలు వారి ఈ ప్రార్థన సంప్రదాయ మార్గంలోనే. 'లలిత' కావ్యారంభంలో కనిపించే సరస్వతీ ప్రార్థన కొంత ప్రత్యేకంగా కనబడుతుంది. సాహిత్యాన్ని సరస్వతీ స్వరూపంగా భావించడం సంప్రదాయమే అయినా ఆ దేవికి బదులుగా సాహిత్యాన్ని స్తుత్యాత్మకంగా ప్రార్థించడం వీరి ప్రత్యేకత. సాహిత్యాన్ని సరస్వతీ స్వరూపంగా భావించి ఆమె కంఠధ్వనించే కావ్య జగత్తును కీర్తించారు.

'శతపత్రాయిత శుక్లపీఠమును శింజన్మంజు మంజీరరం
జిత పాదంబులు పాటవింపగ విపంచీ జీవతంత్రీ కల
శ్రుతులన్ దీర్చి చతుర్ముఖ భావతరణ శ్లోకంబులం జాదు భా
రతి కంఠంబు ధ్వనించు కావ్య సుకుమార ద్వారమీక్షించెదన్.'[2]

---

1. స్నేహలత - అభినవకవిత - P.282
2. 'లలిత' - అభినవకవిత - P.190.

ఇతర సందర్భాలలో సరస్వతీ దేవిని స్తోత్రరూపంగా ప్రస్తుతించిన పద్యాల కంటె ఆ దేవి స్వరూపాన్ని అభివర్ణించడం, వాగ్దేవిగా స్మరించడం కొంత అధికంగా కనబడుతుంది.

"శుక్లాంబరాభరణా బ్ర
హ్మక్లేశాపహరణా శ్రుతిమానసకాసా
రక్లిన్న చరణా చరణాయు
తాక్లాంత సువర్ణ జగతి కధిరాజ్ఞి సుధీ।"[1]

'తెలుగు వాఙ్మయవతి' అయిన సరస్వతీదేవిని 'పలుకులకు, చదువులకు సముద్దిష్టానము బ్రాహ్మణమతల్లి' అంటూ చదువుల వల్లిగా భావించారు. తెల్ల తామర పూలు ఆ దేవికి ప్రీతిపాత్రమయినవి. శ్వేత వస్త్ర ధారణిగా, శ్వేత పద్మాసనగా, బ్రహ్మసతిగా, పుస్తక ధారిణిగా, వీణాపాణిగా ఆవిడ వీరి రచనలలో సాక్షాత్కరిస్తుంది. ఈ ప్రయోగాలలో వీరు భావన చేసిన వాగ్దేవి ప్రాచీనుల రూపకల్పనలో ప్రసిద్ధమయిన స్వరూపమే.[2] వాఙ్మయాన్ని ఆ విధంగా ఒక

---

1. మాధురీ దర్శనము - P 18

2. 'పలుకులాడి విపంచి పాటను
పరవశుండై బ్రహ్మదేవుడు
జీవఘటు ఘటనా సమర్థుం
డయ్యె జగదుత్పత్తముగాక.
'ఆమె హస్తన్యస్త పుస్తక
ముంది చదివె చతుర్ముఖుండుల
సంహితలు" ------- ('నవరాత్రి' - మిశ్రమంజరి)
వేదాలకు స్వరాలు తాడునై నిలువంగ
శ్రుతులాడు నీ వీణ. తుంబురుని వాణీ ('వాణి' - మిశ్రమంజరి)

దేవీ రూపంగా భావించడం వీరు సగుణోపాసకులని అనుకోవడానికి దోహదం చేస్తుంది.

ఈశ్వరుని గూర్చిన ప్రస్తావన రచనల్లో అక్కడక్కడా కనబడుతుంది.[1] ఆ సందర్భాలలో ఆ శబ్దాన్ని భగవంతుడనే అర్థంలో ప్రయోగించినట్లు కనబడుతుంది. ప్రకృతి పురుషులలో పురుషుడన్నట్లు ధ్వనిస్తుంది. కాని 'శివుడు' అనే అర్థానికి అక్కడ అవకాశం తక్కువగా కనబడుతుంది.

'ధ్యాని బుద్ధ ప్రతిమ', 'బుద్ధదీక్ష' వంటి ఖండికలలో బుద్ధుని అహింసాసిద్ధాంతం పట్ల అభిమానం ప్రధానంగా కనబడుతుంది.

---

(contd)

'భారతీ పాణి వీణారవంబటంచు
నాలకించితి చంద్రి నేనాసు గీతి' (స్నేహలత)

'శ్వేత క్షౌమాంబరము - శుక్లా
భరణ హారము - హస్త వీణా
పుస్తకావరణముగ భాసిలు
కవి సరస్వతి సృష్టిలో' (శ్రీరమ్యాత్ - మిశ్రమంజరి)

'వీనె చవుల శ్రుతికి తెనుగు వాక్పగతికి' (మిశ్రమంజరి P VII)

'పాణి వాయింప మ్రోగిన వీణ మీద' (రమ్యాలోకము)

1. 'ఈశ్వరుని భావమె కద జగదైశ్వర్యము' (మాధురీ దర్శనమ్)

'ఈశ్వరుడనుగ్రహించె నాకీ భవంబు' (మధుమూర్తి - జడకుచ్చులు)

'దీనావనుడైన ఈశ్వరుడనారతమున్ వెతలందు వారలన్
కావగనుండ నీకు భయకారణమేటికి?' (లలిత)

'ఏ ప్రఫుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజ సల్పితినో ఇందు పుట్టినాడ' - (రమ్యాలోకము)

బుద్ధుడిని శ్రీమహావిష్ణువు అవతారంగా భావించి ధ్యానించినట్లు ఆ సందర్భాలలో కనబడదు. అహింసకు ప్రతిరూపంగా బుద్ధుని కీర్తించారు. బుద్ధుని ముఖంలో ప్రతిఫలించే శాంతిని, చిదానందాన్ని ప్రశంసించారు.[1] సుఖ సంతోషాలు భోగభాగ్యాలు విడనాడిన త్యాగమూర్తిగా ప్రాపంచిక క్లేశాన్ని భరించలేని సుకుమార హృదయునిగా, మానవోత్తమునిగా, మహా జ్ఞానిగా ప్రస్తుతించారు. దీనిని బట్టి బుద్ధుని సద్గుణాభివర్ణన చేశారనే భావన కలుగుతుంది గాని సాక్షాత్ భగవత్స్వరూపంగా స్తుతించి ఆరాధించినట్లు కనబడదు.

'జన్మాష్టమి' ఖండికలో శ్రీకృష్ణజయంతిని ఇతివృత్తంగా స్వీకరించారు కాని ఈ రచనలో శ్రీకృష్ణుని ప్రత్యేకంగా ప్రస్తుతించలేదు. కేవలం ప్రకృతినే వర్ణించారు. శ్రీకృష్ణజనన సమయంలో ప్రకృతి పొందిన పులకింతను ప్రధానం చేసి చెప్పారు. 'జన్మాష్టమి' అను పేరును బట్టి శ్రీకృష్ణుని ప్రస్తావనే గాని ఖండికలో ఆ దేవుని ప్రసక్తి లేదు. 'రూపనవనీతమ్'లో శ్రీకృష్ణుని గూర్చిన ప్రసంగం వస్తుంది. విశుద్ధ ప్రేమ చైతన్యం మరుగున పడటం వల్ల సమాజం అల్లకల్లోలం అయినట్లూ తిరిగి ఆ ప్రేమ స్వరూపావిష్కరణ సమాజంలో ప్రేమస్థిరత్వాన్ని కలిగించినట్లు ధ్వనించడానికి శ్రీకృష్ణుని ప్రస్తావన చేసినట్లు తోస్తుంది. శ్రీకృష్ణుని పవిత్రప్రేమకు ప్రతిరూపంగా గ్రహించి ఆ ప్రేమమూర్తి అంతర్ధానాన్ని పునర్దర్శనాన్ని సూచించారనిపిస్తుంది.

---

1 "---- ధ్యాని బుద్ధ
ప్రతిమా ముఖ శాంతి యోగరత చిన్మహిమన్
స్మృతి హితమగ తెలిపిన భవ
దతీత విజ్ఞాన సంహితాధ్యయనంబుల్" (కృష్ణాష్టపది - మిశ్రమంజరి)

ఈ విధంగా ఈ రచనలో ఒక లక్ష్యంలో సిద్ధాంతప్రయోజన దృష్ట్యా శ్రీకృష్ణుని ప్రస్తావించినట్లు భావించవచ్చు. 'లాలి' అన్న ఖండికలో (మిశ్రమంజరి) శ్రీకృష్ణుని తులసీదళహారిగా, బృందావనవిహారిగా, గోపీ వస్త్రాపహారునిగా, రాధాప్రియునిగా వర్ణించారు. ఇది సంప్రదాయసిద్ధమయిన శ్రీకృష్ణుని స్వరూప స్వభావ చిత్రణానుసరించి ఉంది.

'ప్రవాసరాధిక', 'రాధ పిలుపు' వంటి ఖండికలలో రాధ ప్రేమకు ప్రాధాన్యం ఇచ్చారు. రాధ ప్రియుని కై నిరీక్షించడం ఈ రచనలలో ప్రధానం అయినా ఆమె కృష్ణుని వెదికే తీరులో భక్తిభావం గోచరిస్తుంది. మధురభక్తి ప్రధానంగా ఈ రచనలు కనబడతాయి.

కాలాన్ని దేవతగా స్మరించడం అక్కడక్కడా కనబడుతుంది.

'కాలదేవతా కరుణించునె యని చెప్పని హృదయము లెవ్వండే'[1]

'ఎంత వేచిన తెల్లవారక యుడుగు కార్తికరాత్రు లేమో!

కాలఘాతకుని చేతిపాశ ముఖాల పోలిక కనబడెన్.'[2]

కాలాన్ని దైవంగా భావించిన రాయప్రోలు వారు జగన్మాత అయిన దేవిని కూడా 'కాలరూపిణి' గా ధ్యానించారు.

<u>దేవీ ప్రాధాన్యం</u>: "భగవతి ఈశ్వరాది నిను ప్రస్తుతియింతును కాలరూపిణీ"[3] అంటూ కాలరూపిణిగా, ఈశ్వరాదిగా వీరు స్తుతించిన జగజ్జనని ప్రస్తావన వీరి రచనలలో అధికంగా కనబడుతుంది. పూర్వభా త్రిపురాంబికా

---

1. 'తారకా' - వనమాల P 12
2. 'మాంచాల' - వనమాల P 46
3. ఉగాది నివేదన - వనమాల P 15

అనే భావం వీరికున్నట్లు తోస్తుంది. వీరి రచనలలో గౌరి, పార్వతి, భగవతి దేవి, రాజరాజేశ్వరి, కాత్యాయని, కామేశ్వరి, కనకదుర్గ వంటి దేవీనామాలు ప్రస్తావించబడ్డాయి. వీరి ప్రశ్నమ కావ్యానికి 'లలిత' అని పేరుపెట్టడం, వీరి కుమార్తెకు 'లలిత' అని నామకరణం చేయడం, వీరి ఇంటికి 'లలితా కుటీరం' అన్న పేరు ఎన్నిక చేయడం వీరు లలితాదేవికి ఇచ్చే ప్రాధాన్యం సూచిస్తాయి.

'స్నేహలత' స్వప్నంలో కనకదుర్గను చూచినట్లు ఆమెను ఆ దేవి 'పరమానందాస్పదమయిన శ్రీ భవానీ పదనమునకు రమ్మ'ని ఆదర చేసినట్లు, 'అంబ వెనువెంట వచ్చెదనంటి... తండ్రి... వేంకటేశ్వ... ప్రార్థనలు సల్పితిని అంబపక్ష నియమ' అని ఆమె తన లేఖలో వ్రాసినట్లు రాయప్రోలు వారు చిత్రించారు. ఇతర దేవతలను వదిలి ఇక్కడ అంబనే వీరు ఎన్నిక చేయడం ఆదిశక్తికి వీరిచ్చే ప్రాధాన్యాన్ని చూపుతుంది. శక్తి స్వరూపాలుగా ప్రసిద్ధి పొందిన దేవతానామాల ప్రస్తావన వీరు శ్రీకదంబ ధ్యానాసక్తులనే ఊహకు బలాన్నిస్తుంది. వీరు జగన్మాతను ప్రస్తావించిన చోట ప్రత్యేకించి దేవీప్రస్తావన చేసినట్లు కాక, అప్రయత్నంగా వీరి నోటివెంట ఆ దేవీ ప్రసక్తి వెలువడినట్లు ఎక్కువ సందర్భాలలో కనిపిస్తుంది. అసంకల్పితంగా ఆ దేవిని వీరు స్మరించే విధానం వీరి మనసులో దేవి నిత్యస్థిరవాసిగా ఉంటుందనే భావాన్ని కలిగిస్తుంది. వీరు 'శక్తి' అభిమానులని దేవీ ఉపాసకులని అనడానికి అవకాశాన్నిస్తుంది.

"ఈయన మొదటినుంచి ఆస్తికుడు. ఈ ఆస్తిక్యం యీయన్ని భావకవిగా చేసింది. అందులో శాక్తుణ్ణి చేసింది. ..... ఆ శక్తినే మానసికంగా లలితగాను, వాచికంగా ప్రకృతిమాతగాను ఆరాధించాడు.[1]

1. 'రమ్యాలోక సమీక్ష' - కురుగంటి సీతారామయ్య. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక - 1939.

వీరు దేవికి ప్రాధాన్యం ఇస్తారు కనుకనే

'అస్మన్మనస్ వాహా సరః
ప్రాతః పద్మ మరంద భాండమిదె
అంబా! స్వీకరింపగదే!' [1]

అని తమ అభినవ కవితను అంబకే నివేదన చేశారు. తమ ఆశుకవితా ధోరణిని వీడి నవ్యకవిత్వ మార్గ పయనానికి కూడా ఆ దేవిని ప్రార్థించారు.[2] దేవీ ధ్యాన తత్పరులు కనుకనే ఈ ప్రకృతి సమస్తం సర్వమంగళగా వీరికి కనబడుతుంది. సంధ్యారాగం దేవికి చేసే కుంకుమార్చనను తలపింప చేసింది. ప్రకృతి శోభ సర్వమంగళాదేవి పసుపు భాండారంగా కనబడ్డది. చెట్లు కుంకుమ బరిణలు పట్టినట్లు, సూర్యుడు కుంకుమాక్షతలు చల్లుతున్నట్లు భావన కలుగుతుంది.[3] కవితకు కూడా అటువంటి పూజనే చేయించారు సుబ్బారావు గారు.

"కవన్న పసుపక్షతలు సల్ల గౌరి పేర
దేవి పేర కుంకుమను శాక్తేయులీయ

---

1. ఆంధ్రావళి - P 14
2. 'జననీ, యేమిటి కింక ఆశుకవితా సన్యాస మిప్పింపవే!'
"... త్రిప్పుమింక జననీ, తమ్మాక్షర శ్రేణికిన్! (వనమాల P39)
3. 'కుంకుమార్చనా శ్రీలను నాలలాడెనట పశ్చిమకర్తన సాంధ్య వర్తనన్
ఏలిక' - అభినవకవిత - P 195
'ఈ పసిమి - ఈ మిసిమి సర్వమంగళాదేవి పసుపు భాండారమేమొ...
రూపనవనీతము - P 55
'కొమ్మలు పట్టిన కుంకుమ బరిణలు' - 'తోరణం' - వనమాల - P12
'చల్లుచున్నాడు కుంకుమాక్షతలు తరణి' - 'తెనుగు బాట'
అభినవకవిత - P329

విప్రులు సరస్వతీ దీక్ష విరుగా సంగ

స్రైలవే తల్లిమెడను కీలాలలామ"[1]

నిశ్శబ్దంగా ఉనన ప్రకృతి ధ్యానస్థితగా తోచడం, దబ్బచెట్లు నీలమణుల్నాల పూజలు చేస్తున్నట్లు కనబడడం, నారింజ పండ్లు వనరుమారి ఉంచిన పసుపుముద్దలుగా భావన కలగడం, గుమ్మడిపూలు పూజకు పట్టిన పళ్ళాలుగా భాసించడం - రాయప్రోలు వారికి సృష్టి సమస్తం మంగళప్రదంగా ప్రత్యక్షం అవుతుందని అనడానికి దృష్టాంతాలు.

దేవీ ధ్యానతత్పరులు కనుకనే,

'దానిమ్మ పూవంటి తరుణి కెమ్మోవిపై

మల్లెపువ్వుల నవ్వు సుళ్ళు తిరుగ'

అనే వీరి నూతన ప్రయోగానికి వెనుకగూడా ఆ దేవీనామ ధ్వని వినిపిస్తుంది. 'దాడిమీ కుసుమ ప్రభా'[2] అని లలితా సహస్ర నామావళిలో ఒక నామం. అది శరీరకాంతిలో సామ్యం కాగా ఇక్కడ అధరంలో సామ్యం చెప్పారు. అసలు దానిమ్మపూవులో సామ్యం చెప్పే భావనను ఆ దేవీ సహస్రనామాలలో వీరికున్న పరిచయం, వాటిని అప్రయత్నంగా పలుకుతుండడం దోహదం చేసి ఉంటుందని ఊహించవచ్చు.

వీరికి ఆరాధ్యఅయిన ఆ జగదంబ శ్రీచక్రస్థిత కనుకనే నేమో వీరి రచనలో 'శ్రీచక్ర' శబ్ద ప్రస్తావన కనబడుతుంది.[3] వీరి రచనలో కనిపించే

---

1. 'పూజ' - జడకుచ్చులు - P95
2. 561 వ నామం
3. 'సాహితీ శ్రీచక్రమందు కాళిదాస భవభూతు లిరువురే భాసించెదరు.'
   'శకుంతల' - ప్రస్తావిక - P1
   'అభిజన శ్రీచక్ర మధ్యమ ముద్రవహింప' (ఆంధ్రాభిషేకము - మిశ్రమంజరి)

దేవీ పూజా విధానం వీరి సగుణారాధన తత్త్వాన్ని చక్కగా చూపుతుంది.

"దివ్యసంతతి కెలన భక్తిన్ భజింప
ప్రేమ సామ్రాజ్య పాలనా ప్రీతి యగుచు
నిండు గాలువు తీర్చెడి రమణీయ మూర్తి,
రాజరాజేశ్వరి కుమారరక్తి మధుర,
స్తన్యమోహాంధ యగుచు సాక్షాత్కరించు;
అరసి యర్పింపు మా భగవంబ నపుడు
స్నేహదీపము వెలిగించి చిత్రవీధి
పసుపు కుంకుమ పూవులు వాసరి చల్లి
చిన్ని కర్పూరహారతి చేతబట్టి ...."[1]

తెలుగు బాటలో మంగళహారతి పాడమంటూరు సుబ్బారావుగారు.

ఈ విధంగా సరస్వతి, గౌరి, రాజరాజేశ్వరి, సర్వమంగళ శ్రీకృష్ణుడు, రాధ*, బుద్ధుడు మొదలైన దేవతల ప్రస్తావన వీరి రచనల్లో కనబడుతుంది. శ్రీ వెంకటేశ్వర సుప్రభాతాన్ని అనువదించారు. భగవంతుని నామరూపాత్మకంగా భావన చేయడం వీరి సగుణారాధనను స్పష్టీకరిస్తున్నది.

ఇతర దేవతల ప్రసక్తి ఉన్నా స్తుత్యాత్మకంగా కనబడే రచనలలో సరస్వతి - ఆదిశక్తి - జన్మభూమి ప్రధానంగా చెప్పదగ్గవి. వాణి - శక్తి - పృథివి వీరి రచనల్లో త్రిమూర్తులవంటివి. బ్రహ్మాండమంతా శబ్దమయం. శబ్దం వాణికి ఆధారం. ఆ శబ్దమూ వాణీ వాగర్థాలవలె అవినాభావసంబంధం కలవి. శబ్దానికి వీరిచ్చే స్థానం

1. 'తెనుగు బాట' - అభినవ కవిత - P.340

* రాధను చైతన్య సంప్రదాయంలో దేవతగా ఆరాధించడం ఉంది.

సమున్నతం. రూపనవనీతంలో శబ్దమే బ్రహ్మమనేటంత ఉన్నతంగా శబ్ద స్వరూపాన్ని వివరించారు. "సాహిత్యం సంపూర్ణకళ. సాహిత్యం శబ్దబంధం. శబ్దశక్తి అక్షయమునూ, అనంతముఖమునూ. శబ్దము లేకపోతే బ్రహ్మాండము లేదు. బ్రహ్మము జ్ఞాతవ్యము కాదు. శబ్దమే ధర్మము. తదర్థమే అర్థము. శబ్దార్థబంధమే కామము. ఇట్లా శబ్దము అఖండమునూ అక్షరమునూ అయిన జ్యోతి స్వరూపి. శబ్దమందు భూర్భువస్సువర్లోకములు మూడును ఇమిడియున్నవి. - - - శబ్దమునకు జరా మృత్యు వికారములు లేవు. వజ్రముల కంటె కఠినము కుసుమముల కంటె కోమలము. అక్షయమైన ఈ శబ్దము సువర్ణమయమై మేరువు వలె వెలిగింది. రసమయమై క్షీరసముద్రము వలె విస్తరిల్లింది".[1] అన్నారు. ఈ దృష్టి పావిత్ర్యమే శబ్దానికి ప్రతీకాత్మకరూపమయిన 'ఓం' కారాన్ని పవిత్రంగా దర్శించడానికి దోహదం చేసి ఉంటుంది. వాఙ్మయులయిన కవులకు శబ్దం ఆరాధ్యం కావడంలో ఆశ్చర్యం లేదు. వేదాది సర్వవాఙ్మయానికి ఓంకారము ప్రారంభం. ఓంకారమే బ్రహ్మము.[2] కనుకనే నేమో ఓంకారము వీరి గృహంలోని దైవమంటపంలో స్థానాన్ని పొందింది. వీరిలోని ఈ భక్తి భావమే వాగధీశ్వరిగా భావింపబడే సరస్వతీదేవిని స్తుతించడానికి తోడ్పడి ఉంటుంది. ప్రత్యేకించి సరస్వతిని స్తుతించినా సర్వదేవతలూ 'ఆదిశక్తి'లో అంతర్భూతాలే అనే భావన

---

1 'రూపనవనీతమ్' - P 131

2. 'ఓమిత్యేకాక్షరమ్ బ్రహ్మ
శ్రుతీనాం ముఖ్యమక్షరమ్
ప్రసీదతు సతాం స్వాంతే
ధ్యేకమ్ త్రిపురుషీమయమ్' (మాధురీ దర్శనమ్)

వీరికుంది.

"కేవల నిర్గుణ భావమౌ ఈశ్వరు
నంశ కాదిమునిష్ఠ యయిన ప్రకృతి-
సంహారసమయ రూక్షరుచా ప్రచండిక
ల్లోల తాండవమున వ్రాలు కాళి-
సకల కల్యాణ లక్షణ పూర్ణగాత్రియై
తమ్ముల పుట్టిల్లు తనుపు లక్ష్మి-
సంగీత సాహిత్య సామ్రాజ్య నేత్రియై
మగని వాకింట్ల నేమురని వాణి-
సృష్టిచక్రము చకచకా త్రిప్పుచున్న
ఆదిశక్తి అవస్థాంతర కృతులగ
ధ్యానవీథి నత్యుదయనించుదు....." [1]

అని అన్నారు. కనుక సరస్వతీదేవిని ప్రత్యేకించి ప్రార్థన చేసినా ఆమె శక్తి స్వరూపమనే భావన వీరికుంది. కనుక వీరి దృష్టిలో జగన్మాత అయిన ఆదిశక్తే ప్రధానదైవం. 'ఋతుమయిన నాక రూపంలో అభినయిస్తున్న సృష్టి స్థితి లయ యోగిని' అని ఆ దేవిని స్మరించారు. 'దైవీ తంత్రావనము సృష్టి' అంటూ ఈ సృష్టి ఆ దేవి చిద్విలాసమనే భావాన్ని వ్యక్తం చేశారు. కనుక 'శ్రీమాతా, శ్రీమహారాజ్ఞీ, శ్రీమత్సింహాసనాధీశ్వరీ' అయిన ఆ దేవి వీరి భావనలో ఆరాధ్యదైవం. ఆ దైవాన్ని వీరు ప్రకృతిముఖంగా దర్శించి ఆరాధిస్తారు. పృథ్వి ప్రకృతిలో భాగమే. కనుక వీరి పృథ్వ్యారాధన కూడా ప్రకృత్యారాధనే. దీనిని బట్టి వీరు దేవతలుగా ధ్యానించి

---

1. ఉగాది - మిత్రమంజరి - P 68

పాలించే త్రిమూర్తులూ (వాయు - శక్తి - పృథివి) ఒకటే శక్త్యారాధనం క్రిందికే వస్తున్నాయి. ఆ శక్తిని వీరు ఆరాధించే విధానం ప్రకృత్యారాధనమే. చేతనా చేతనాలన్నిటా జగన్మాతను దర్శించారు రాయప్రోలు వారు. కనుక వీరి ప్రకృత్యారాధన తత్త్వంలో దేవ్యారాధనా భావం అంతర్లీనంగా ఇమిడి ఉంది.

---

# ప్రకృత్యారాధనాతత్త్వం

సుబ్బారావుగారు ప్రకృతిలో భగవత్స్వరూపాన్ని దర్శించి ఆరాధిస్తున్నట్లు చెప్పవచ్చు. ప్రకృతి స్వరూపిణి అయిన దేవిని మాతృమూర్తిగా భావనచేయడం వీరికి అభిమానం. తండ్రిజాడ తెలుసుకొనడానికి ఆ తల్లికొంగు స్వీకరించడం సహాయపడగలదని వీరి విశ్వాసం. వీరిదృష్టిలో ప్రకృతి సర్వశక్త్యాత్మకం.

పరబ్రహ్మజ్ఞానాన్ని పొందడం కష్టసాధ్యం. అనుమాన ప్రమాణానికి కూడా అందని ఆ పరతత్త్వరేఖను దర్శించడం తపస్సంపన్నులకే తగింది. నీవారాగ్రం వలె సూక్ష్మమూ, జ్యోతిరూపమూ అని భావింపబడే పరమాత్మను తమ హృదంతరాళంలో దర్శింపగలిగారు మహర్షులు. వారి జ్ఞానఫలంగా చెప్పదగిన బ్రహ్మానందాన్ని రాయప్రోలువారు కీర్తించారు.

"నీవారాగ్రము మాత్రి సూక్ష్మమయి హృన్నీలాభ్రమధ్యస్థి తే
లా విద్యుచ్ఛిఖ భాతి జీవుని మెఱపన్ దర్శించి సూక్తించె, ధ్యా
నా విష్కార విభూతి నే ఋషి తదీయ జ్ఞానముక్తాఫలం
బై వేదోపనిషత్ప్రసన్నమగు బ్రహ్మానంద మూహించెదన్."[1]

అది జ్ఞానయోగుల జ్ఞానఫలం. అయితే వాగతీతమయిన ఆ పరబ్రహ్మము వాగ్వ్రతులయిన కవులకంత ఆస్వాదయోగ్యం కాదని రాయప్రోలువారి భావన.

ఆ బ్రహ్మోపాసన సగుణంగా చేసినా నిర్గుణంగా చేసినా ఆనందమే పరమార్థం. రెండింటా పరమోత్కృష్టమయిన ఆనందమే ప్రాప్యం కనుక భగవంతుడిని సగుణంగా ప్రకృతిముఖంగా ఆరాధించి తరించడం

---

1. ఉగాది నివేదన - వనమాల P 15

వీరి ధ్యేయం. వీరి దృష్టిలో,

'కేవల నిర్గుణ భావమూ ఈశ్వరానంద కారిణి నిష్ఠ' మయినది ప్రకృతి. "తంత్రంలో పరాసంవిత్ అనేది వేదాంతుల బ్రహ్మము వంటి పరవస్తువు. అది సచ్చిదానంద రూపం. దీనిలో స్థితిగతులు రెండూ ఉన్నవి.... సృష్టి జరగడానికి ముందు ఈ సచ్చిదానంద వస్తువు యొక్క గతి ఉన్నది. దాని పేరే ఆద్యాశక్తి; లేక జగన్మాత. ఈ శక్తి సచ్చిదానందమయి. పరసంవిద్రూపుడే పరశివుడు. అతని గతే ఆదిశక్తి. పరశివుడు తనకు వేరుగాని ఆదిశక్తి రూపంలో ఈ ప్రపంచం సృజించాడు. ఈ ఆదిశక్తే స్వేచ్ఛాకల్పితమయిన మాయాయోగంలో తన్ను తాను మెట్టు మెట్టుగా సంకుచితం చేసుకుని ప్రకృతిగా వెలసింది. శివుడే శక్తిరూపంలో గతిశీలుడైనాడన్నమాట.... కాబట్టి గతిమయమైన 'ఆద్యాశక్తి' మాయా కాదు. ప్రకృతీ కాదు. ఆ శక్తి శివసచ్చిదానందమయి. ఆద్యాశక్తికినీ పరసంవిత్తుకున్నూ - సచ్చిదానంద పరమశివునికిన్నీ ఏమీ భేదాలేదు . తంత్రపు భావవేరు. ఈ ప్రపంచానికి మూలం సచ్చిదానందమయి అయిన చిచ్ఛక్తి. ఆ శక్తియే పరాప్రకృతి. ఈ పరాప్రకృతి సచ్చిదానందమయి కాబట్టి ఇది మూలంగా కల ఈ ప్రపంచం దుఃఖమూలం ఎలా ఔతుంది? మరి జడం ఎలా ఔతుంది. ప్రకృతం దుఃఖమూలమనీ జడమనీ మాయఅనీ లోచవచ్చు. కాని లోతుగ దిగి చూస్తే దుఃఖమయమని కాక ఆనందమయమని తెలుస్తుంది."[1] ఆ ఆనందమూలమయిన ప్రకృతి నిర్గుణంగా ఆరాధించినా సగుణంగా ఆరాధించినా ప్రాప్తించేది శివానందమే.

"అందరు నిర్వికారము నిరంజనమూ పరతత్త్వరేఖ; ఆ

నందమె నిర్గుణాన సగుణానను ప్రాప్యమయాటు, మాపుమా

---

1. 'శ్రీ అరవిందుని పురుషోత్తమతత్త్వము'- వేమూరి శివరామశాస్త్రి

P 3 పు 13

క్షేత్రం దరిసించు నీ ప్రకృతి దివ్య శుభావరణాన, తప్పియో

చిందులు పులాను బిడ్డవలె వింత స్వతంత్రములో విహరింతువ్."[1]

కనుక పసిబిడ్డగా ప్రకృతి ఒడిలో జగన్మాతను దర్శిస్తూ తరించడం వీరి అభిలాష. వీరికి కంటికి కనబడని పరతత్త్వాన్వేషణ కంటె అనునిత్యం కనులముందు కదలాడే ప్రకృత్యారాధనమే ఉపాదేయం. మంగళప్రదమైన ఈ మనోహర ప్రకృతిలో మాధుర్యం శృంగారం నిండి ఉన్నాయి. అవ్యక్తమూ నిత్యనూతనమూ అయిన దివ్యాంశ ప్రకృతిలో ప్రకాశిస్తున్నది. వీరి దృష్టిలో ప్రత్యక్షంగా కనబడే ఈ ప్రకృతి సృష్టిస్థితిలయకారిణి అయిన జగన్మాత స్వరూపమే. త్రిగుణాత్మకమూ, నామరూపాత్మకమూ అయిన ఈ ప్రకృతిలో త్రిగుణాతీతమూ, నామరూపరహితమూ అయిన దివ్యశక్తి ఉంది. అదే నిత్యనూతనంగా ప్రకాశించే మహత్తరశక్తి. ప్రకృతి జడం కాదు.

"కానబడక కనుమాన ప్రమాణము సతె

అంది యుండని పరతత్త్వము వలనుంచి

పంచభూత దృశ్యంబైన ప్రకృతి యొకటె

సన్నిహిత లక్ష్యమని యె వచస్వినేడు".[2]

కవులు ప్రకృతి ముఖంగానే ఈశ్వరుని అర్చిస్తారని రాయప్రోలు వారి అభిప్రాయం. అందుకే 'సృష్టియందె ఈశ్వరుని అర్చింత్రు కవుల' అని అంటారు. వీరి దృష్టిలో పాంచభౌతికమయిన ప్రకృతే ప్రధాన దైవం. వీరి భావనలు 'సకల కల్యాణ సదనం ఈ మనోహర జగతి'. ఈ ప్రకృతి ఎన్నో విధాలుగా ఎన్నో రూపాలలో సౌందర్యాన్ని ధరిస్తున్నదని సుబ్బారావుగారి

---

1. తెలుగుమాన్యము - ఆంధ్రావళి P 41

2. రమ్యాలోకము - P 16

అభిప్రాయం. కవి మిథ్యామీమాంసలను వదిలి ఆ సౌందర్యాన్వేషణ సాగిస్తాడని వీరి ఉద్దేశం.

"ఈ మాంగల్య మనోహరం బగు మహాసృష్టిన్ విలోకింపు మో
యీ! మాధుర్యమె రాలు, పెనుగ్రహములన్ శృంగారమే చిందు, మి
థ్యా మీమాంసలు బాలుమీ నరుడు శబ్దవ్యంజనా సూక్ష్మదై
ప్రేమాస్వాదన సల్పుజాలె కవియై....." 1

అని అంటారు సుబ్బారావుగారు.

ఒక్క కవే కాదు. శిల్పులు, చిత్రలేఖకులు, గాయకులు అందరూ ప్రకృతిలోని ఆ సౌందర్యాన్నే అర్చిస్తారని వీరి అభిప్రాయం. నామరూప వికారాదులతో కూడిన ఈ ప్రపంచమూ, ప్రకృతీ సుబ్బారావు గారికి ప్రధానం. జగత్తు మిథ్య అనేది సృష్టి జ్ఞాన యోగులది. కవులూ కళాకారులూ యీ ప్రపంచాన్ని మిథ్యగా భావిస్తే కళాసృష్టి సాధ్యం కాదు. కనుల ఎదుట ప్రత్యక్షం కదలాడే ప్రకృతిని తమ కళారాధనను ఆలంబనం చేసుకోవడం కళాస్రష్టల సహజలక్షణం.

ఆ ప్రకృతిని తల్లిగా భావించిన రాయప్రోలువారు పరతత్త్వాన్వేషణకు ఆ తల్లి సహాయపడగలదని విశ్వసించారు. అదే భావాన్ని వాచ్యంగా ఒక సందర్భంలో ఇలా చెప్పారు.

"ఆ వేదఋషులలన్ ఆ మంత్రద్రష్టలలన్
అంది యందక యున్న యజ్ఞపూరుషరేఖ
ఉపనిషత్సూత్రాల యోగాది శాస్త్రాల
నిలిచి నిల్వక యుండు నిర్వికల్ప బ్రహ్మ

---

1. తెనుగున జయంతి నాడు - వనమాల P 41

తర్కవాదాలలో తత్త్వభాష్యాలలో
చూచి చూడగరాని సూక్ష్మవిజ్ఞానాంశ
వెదికి వెదకలేక నేను పట్టితినిట్లు
తల్లి చల్లని కాంతు తండ్రి జాడ నెఱుంగన్.[1]

రాయప్రోలువారి దృష్టిలో ఆ తల్లి ఎవరో కాదు. అనునిత్యం కనులఎదుట కనిపించే ప్రకృతే. 'ఇష్టదేవతల కోసం అన్వేషణ జరిగింది. అఖండప్రేమలో అనంత లోకాలలో అక్షయంగా ప్రత్యక్షంగా ఆయన ప్రకృతినే పట్టుకున్నాడు'[2] అని నవ్యకవిని గూర్చి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

'ఆ యెడ చేయిచాచి, అభయాఖ్యనయ ప్రియమైన మోమునన్
హాయిలు వాఱు వత్సలత పాలను బోసె, ప్రశాస్త సంధ్యయా
మ్నాయన మూర్తి యొందు నివసించెడె, స్వప్నకవాటబంధమున్
తీయు స్మరించితిన్ భగవతీ ప్రకృతి స్తిమిత స్వరూపమున్.'[3]

అంటూ నాయకుని స్థానాన ప్రకృతిలో భగవంతుని దర్శించారు. సుబ్బారావు గారి దృష్టికి ఆ భగవతి దయామయి, వాత్సల్యవతి, ఆనందమయి. ఆ భవానీ సదనం ఆనందానికి నిలయం. తన బిడ్డల పై వాత్సల్యంతో వారిని తన సమీపానికి ఆహ్వానించి ఆనందాన్ని ప్రసాదిస్తుందని వీరి విశ్వాసం. ఈ అభిప్రాయం స్నేహలత స్వప్నవృత్తాంతంలో కనబడుతుంది.

---

1. శ్రీ శివశంకర శాస్త్రి - ఆంధ్రావళి - P 47
2. కవిశ్యాభిరుచులు - ప్రాతవీ క్రొత్తవీ' రాయప్రోలు సుబ్బారావు భారతి - నవంబరు 1939
3. స్వప్నకుమారము - P 30

"మృదు వాత్సల్య భరస్మిత
వదనమ్మున నన్నుఁ బిలిచె పరమానందా
స్పదమయిన శ్రీ భవానీ
పదనమునకు రమ్మ రమ్మ సత్వరమనుచున్." [1]

వీరి దృష్టిలో ఆ జగన్మాతే సృష్టికి ప్రారంభమూర్తీ చైతన్యమూ అయిన దివ్యశక్తి. కనుకనే 'ఓ భగవతి ఈశ్వరాది నిను ప్రస్తుతియింతును కాలరూపిణీ' అని స్తుతించారు. ఇక్కడ ఈశ్వరనామ సంవత్సరాది సందర్భంగా కాలస్వరూపాన్ని అభివర్ణించడం ప్రధానం. దీనిలో సృష్టికి మూలంగా భగవతిని వీరు భావించిన తీరు కూడా ధ్వనిస్తున్నది. ఆమె మహాకాళి కదా! సృష్టి సర్వం దేవీమయంగా వీరు భావిస్తారు. కనుకనే వీరికి సంధ్యారాగం కూడా దేవికి చేసే కుంకుమార్చనను తలపింపచేసింది.[2]

వీరి ఉద్దేశంలో అనాదిపితను గూర్చిన తర్కం అనవసరం. ఆ జ్ఞానం కనబడనిది, అందనిది. ప్రత్యక్షంగా కనిపించి అందుబాటులో ఉన్న ప్రకృతినే తల్లిగా ధ్యానించి దైవంగా ఆరాధించాలి. వీరి రచనల్లో దేవతలను ప్రస్తావించిన విధానం ఈ భావాన్నే బలపరుస్తుంది. నన్నెకవిని గూర్చి చెబుతూ "... అన్నదై యనంతుడైన ఈశ్వరుడొక్కడే అతనికి ప్రభువు. సర్వసంపన్నమయిన దేశమొక్కటే అతనికి మాతృమూర్తి. అనశ్వర కల్యాణమయిన సరస్వతి యొక్కటే

---

1. 'స్నేహలత' - అభినవకవిత P 306
2. 'లలిత' - అభినవకవిత P 195

యావనిశుపాస్య దేవత"[1] అని అన్నారు. నవకవులందరికీ వర్తించినా వర్తించకపోయినా ఆ భావాలు రాయప్రోలువారి పట్ల నిత్యసత్యాలు. వారి తత్త్వచింతనకు సోపానాలు. వారు భావకవిని గూర్చి "భావకవికి ఈశ్వరుడు కలడు. అయితే నిర్వికల్పుడయిన ఆ అనాదిపితతో వికల్ప జగన్మయుడైన తానెట్లు మెలగవలెనో బోధపడుట లేదు. అందువలన భావకవి ఆ తండ్రిని సాక్షిగానే నిలిపి తల్లిని ప్రత్యక్షదైవముగా సమీపించు చున్నాడు. త్రిమూర్తులుగాని తక్కిన ముక్కోటి దేవతలుగాని అతని భావనకధిష్ఠాన దేవతలు కారు".[2]

వీరు ప్రత్యక్షదైవంగా స్వీకరించే ఆ తల్లిని ప్రకృతి ముఖ్యంగా దర్శిస్తున్నారు కనుకనే వీరి ప్రకృతివర్ణనలలో పవిత్రత గోచరిస్తుంది.[3] ఈ ప్రకృత్యారాధనాతత్త్వం వీరి ప్రణయారాధనకు మూలాధారం అయింది. జగన్మాత భరతమాతలను అభేదంగా ఆరాధించారు. "నా దేశాభిమాన కవిత్వం కూడా తెచ్చిపెట్టుకున్నది, ఎవ్వరో చెప్పగా వచ్చినది కాదు. అది నా చుట్టూ వున్న పరిస్థితులను చూసిన

---

1, 2 'అభినవాంధ్ర కవి పండిత సమ్మేళనము' - ద్వితీయ సమావేశం.
అధ్యక్షోపన్యాసము - రాయప్రోలు సుబ్బారావు. భారతి - Feb 1934

3. "ఎచట జూచినను సుకాన్తమగు భావనాతపం చేయునట్లు కనబడును. శుష్కమైనట్టియు, భావవిరహిత, పవిత్రము గానట్టియు వర్ణనములు గానరావు...... పూర్వులకు ప్రకృతి వర్ణనము. నవ్యులకు సర్వస్వము"
రమ్యాలోక సమీక్ష - తురుగంటి సీతారామయ్య
ఆంధ్రపత్రిక ప్రమాది ఉగాది సంచిక - 1939.

అనుభూతి - ప్రేరణ. భూమిని వదిలి నేను ఊహించను. అందుకే ప్రకృతి నా ఆరాధ్యదేవత"[1] అంటారు. అందువల్ల వీరి దేశభక్తి ఆధ్యాత్మిక ప్రాతిపదిక మీద నిలిచి ఉంది. ఇదే వీరి దేశభక్తి గేయాలలోని విశిష్టత.

---

1. వేంకటాద్రులతో ముఖాముఖి' - జ్వాలాముఖి
పరుసా - నవంబరు 1976.

# దేశభక్తిలో ఆధ్యాత్మిక చింతన

"కలదు కలండని పలికే దేవుడు
కలడో లేడో కనబడదెవరికి
కలదు కలదు నిను కన్నదేశమిది
నిత్యము సత్యము నిశ్చయమోయ్."[1]

కళ్ళకు కనబడని దేవుడు ఉన్నాడా లేదా అనే మీమాంసకు అవకాశం ఉంది. కాని దేశం ఉందా లేదా అనే సందేహానికి ఆస్కారమే లేదు. ఆస్తికులకు నాస్తికులకు అందరికీ కూడా మాతృభూమి నిత్యసత్యం. అయితే దృష్టిభేదంవల్ల దేశం కొందరికి మట్టిగా, కొందరికి మనుష్యులుగా కనబడవచ్చు. సుబ్బారావుగారికి దేశం ఈ రెంటికీ అతీతంగా మంగళ దేవతగా భాసించింది. సకలకల్యాణావసతి అయిన మాతృభూమి ఆరాధ్య దేవతగా ప్రత్యక్షమయింది. మాతృదేశం రాయప్రోలువారికి ఉపాస్య దేవదేవి.[2]

వీరి దేశవైభవ సంకీర్తనంలో దేశానురక్త గానంలో అంతర్లీనంగా భగవద్భక్తి భావమే కనబడుతుంది. వీరికి ఇష్టదేవత దేశమే.[3] కనుకనే <u>కొన్ని సందర్భాలలో దేశగానం, భరతమాత వందనం కావ్యారంభంలో</u>

1. భద్రయాత్ర - మిశ్రమంజరి P 23
2. 'దేశమే నీవుపాసించు దేవదేవి'
   'నీరాజనము' - పచ్చతోరణము - దేవులపల్లి రామానుజరావు P 61
3. "ఇష్టదేవతల కోసం అన్వేషణ జరిగింది. అఖండ ప్రేమలో అనంత శోభలలో అక్షయంగా ప్రత్యక్షంగా ఉన్న ప్రకృతినే పట్టుకున్నారు... (నవ్యకవి)... వల్ల, దేశం కంటె ఇష్టదేవత లేదంటున్నారు."
   'కవిత్వాభిరుచులు - ప్రాతవీ క్రొత్తవీ' (వ్యాసము) రాయప్రోలు సుబ్బారావు.

ఇష్టదేవతా స్తుతి స్థానాన్ని పొందింది. వాగ్దేవి సరస్వతీ దేవిని కూడా మాతృభూమిని స్తుతించిన తరువాతనే ప్రస్తుతించడం దేశమాతకు వీరిచ్చే ప్రాధాన్యాన్ని సూచిస్తుంది. తన సాహిత్య సమర్పణ కూడా ముందుగా భూదేవికే.[1]

రాయప్రోలు వారు దేశభక్తి రచనలు చేయడానికి ఆనాటి దేశ రాజకీయ పరిస్థితుల ప్రభావం లేకపోలేదు. జాతీయోద్యమం, ఆంధ్రరాష్ట్రోద్యమం, వీరి దేశభక్తి కవిత్వానికి ప్రేరణనిచ్చాయన్నది వాస్తవమే. కాని అంతకు పూర్వం వీరిలో అంతర్లీనంగా ఉన్న భక్తి భావన వెలికి రావడానికి మాత్రం ఆ పరిస్థితులు ప్రోత్సహించి ఉంటాయి. మొదటినుంచి ప్రకృతిని భగవత్స్వరూపిణిగా ఆరాధించే సుబ్బారావుగారు ఆ ప్రకృతిని దేశమాత ముఖంగా దర్శించడానికి కాలం సహాయపడి ఉంటుంది. వీరి ప్రకృత్యారాధనా తత్త్వం దేశభక్తిగా స్ఫుటాకృతిని పొందడానికి రాజకీయాలు

---

(contd)

భారతి - నవంబరు 1939.

1. "పరమ పుణ్యవతికి
    భరత భూదేవతకు
తేనె చవుల శ్రుతికి
    తెనుగు వాగ్భగవతికి
శారదాభిరతికి
    సాహితీ శ్రీమతికి
సహృదయ సుకృతులకు
    సాదర సమర్పణము". (ఓం - మిశ్రమంజరి P VII)

పార్శ్వాలకాలయి ఉంటాయి. దేశభక్తిలోని భావతీవ్రతను, పవిత్రతను మాత్రం వీరి ఆధ్యాత్మిక చింతనే పునాది అని అనవచ్చు. కనుక వీరి జాతీయాభిమానం సహజమయింది. కేవలం పరిస్థితుల ప్రాబల్యమే కారణం అయితే దేశం స్వాతంత్ర్యం పొందాక, ఆంధ్రరాష్ట్రం అవతరించాక కూడా ఆ దేశాభిమానం ఈనాటికీ స్థిరంగా నిలిచి ఉండే అవకాశం తక్కువ. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు ఒకటిన్నర దశాబ్దాల తరువాత కూడా 'మిత్రమంజరి'లో (1963) అదే భావతీవ్రతను చూపారంటే అది కేవలం పరిస్థితుల కారణంగా వచ్చిన పొంగు లాంటి దేశభక్తి అని అనడానికి అవకాశం తక్కువ.

కనుకనే వీరి దేశభక్తి రచనలు ప్రచారాన్ని దృష్టిలో ఉంచుకుని వ్రాసినట్లు కాక వీరి హృదయగత పవిత్రభావాలుగా దర్శనమిస్తాయి. హృదయంలో ఇమిడిన దేశభక్తి కవిత్వరూపంగా పొంగి పొర్లిందని అనిపిస్తుంది. ఆ రచనలలోని ప్రాణభూతమయిన ఆత్మ వీరి ఆధ్యాత్మిక చింతన, తాత్త్విక దర్శనాల నుంచి పుట్టింది. కనుకనే ఇప్పటికీ ఆ గేయాలు సజీవంగా నిలిచి ఉన్నాయి. ఇప్పటికీ అవి పాడుతుంటే ఒళ్ళు పులకరిస్తుంది.[1] ఆ గేయాలలోని భాషామాధుర్యసౌరభ్యాలు

1. "భారతజాతిని భారతీయ జాతిగా నిలబెట్టినటువంటి సంస్కృతి సంతటినే కూడా పునరుద్ధరించాలి, ఆ చరిత్ర చాటవేయు, దాన్ని మళ్ళీ హృదయాలు చేర్చి చదువుకోండి అని ప్రబోధం చేయడంలో సుబ్బారావుగారు ఆధ్యాత్మికమయినటువంటి సాంస్కృతికమయినటువంటి ప్రభావాన్ని చూపారు. వారి గేయాలు ఈనాడు కూడా ఆంధ్ర రాష్ట్రం వచ్చినా పాడుతుంటే ఒళ్ళు పులకరిస్తుంది."

Interview with Dr Amarendra 30-3-81

వెనుక పవిత్ర భావాలు జీవచైతన్యంగా వ్యాపించి ఉన్నాయి. ఆ నిర్మల భావనే దేశాన్ని మంగళదేవతగా వీరికి సాక్షాత్కరింప చేసింది.

"దేశమంటే దిబ్బ కాదోయ్
పంట పొలములు - పండ్ల తోటలు
గోనదీ నిక్షేప నగములు
కాంచు మంగళ దేవతోయ్."[1]

వీరి దృష్టిలో భరతమాత పుత్రులని చెప్పుకోవడమే గర్వించదగిన విషయం. వీరి దేశమాత సంకీర్తనం జన్మభూమి పురావైభవ స్మరణమే నని అనుకో వచ్చు. ప్రాచీనౌన్నత్యాన్ని కీర్తిస్తూ భరతమాత సర్వసౌభాగ్యవతి అనే భావాన్ని కలిగిస్తారు రాయప్రోలువారు. ఉదాత్త భారతీయ సంస్కృతి వీరి రచనలలో అంతర్వాహిని. వీరి భావతీవ్రత ఎంత అధికంగా ఉంటుందంటే జన్మరాహిత్యంలో మోక్షం పొందడం కంటె భారతీయుడిగా - అందులోనూ తెలుగువాడిగా తిరిగి తిరిగి జన్మించడమే వీరికి ప్రీతిపాత్రమేమో అనిపించే విధంగా ఉంటుంది.

భారతదేశం కర్మభూమి. వేదోపనిషత్తులు వెలసిన పుణ్యభూమి. తపోనిధులైన మహాత్ములు పుట్టిన పవిత్రభూమి. భారత ప్రభువుల శౌర్యప్రతాపాల 'జయవదితి వ్యాస సూత్ర భాష్యాలు' ప్రభవిల్లాయి. పాడి పంటలతో ఫలపుష్పాలతో దివ్యౌషధులతో సస్యశ్యామలమయినది భారతదేశం. సర్వసంపద్విలసితమయినది భారతదేశం. అది వీరికి స్వర్గతుల్యమే. కనుకనే,

---

1. భద్రయాత్ర - మిశ్రమంజరి - P24

"ఈ యనంత చైతన్య బృంహితమయిన జ
గత్తులో జన్మభూమి స్వర్గంబ యగును.
తద్వియోగంబె నరక బాధా ప్రవృత్తి."[1]

అని అంటారు. పూర్వజన్మ సుకృతఫలమే ఈ భూమిలో జన్మించడం. ఏ మంచి పూలనో ప్రేమించి భారతీయునిగా పుట్టడమే వేరికళ్ళుపనీయం. భారతీయుడినని చెప్పుకొనడమే గర్వించదగిన విషయం. "తనకు ఇష్టదేవత దేశము. ఆమెకు ఆప్తపుత్రుడు తాను... (భావకవి) ప్రత్యక్షమైన ఈ మాతృస్థానమంతయు తనదేయని యతని విశ్వాసము."[2]... అంటూ భావకవుల పక్షంగా తమ భావాన్ని చెప్పారు. మాతృభూమి ఔన్నత్యాన్ని లోకానికి చాటి చెప్పడం పుత్రుల కర్తవ్యం.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము
ఏ పూర్వ పుణ్యమో ఏ యోగ బలమో
జనియించినాడవీ స్వర్గఖండమున
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో
నిను మోచె నీ తల్లి కనక గర్భమున.

---

1. రమ్యాలోకము - P8
2. అఖిలవాంధ్ర కవిపండిత సమ్మేళనము, ద్వితీయ సమావేశం. అధ్యక్షోపన్యాసము - రాయప్రోలు సుబ్బారావు - భారతి Feb 1934.

లేదురా ఇటువంటి భూదేవి యెందు

లేరురా మనవంటి పౌరులింకెందు"..[1]

అనటంలో రాయప్రోలు వారి హృదయంలో స్థిరంగా ఉన్న పవిత్రభావాలు

మాతృ ఋణం, పితృ ఋణం, దేవ ఋణం తీర్చడం కష్టసాధ్యం అని ప్రాచీనుల నమ్మకం. సుబ్బారావుగారు వీటికి దేశ ఋణాన్ని కూడా చేర్చారు.

"దేశ ఋణమును దేవ ఋణమును

మాతృ ఋణమును మనిషి ఋణమును

తీర్పగలిగిన దీక్షితుడనని

తెలిసి తెలిసే తరుణమేరాయ్."[2]

పురాకృత సుకృత ఫలంగా భారతదేశమనే స్వర్గఖండంలో జన్మించినవారు అవకాశం లభించడమే అదృష్టంగా భావించి ఋణవిముక్తికి ప్రయత్నించాలి. అది ఋణగ్రస్తుల కర్తవ్యం. రాయప్రోలు వారు 'మహేంద్రదేశ భగవతీమతల్లీ' అని దేశాన్ని భగవత్స్వరూపంగా భావించారు. కనుకనే వారికి దేశఋణం దేవఋణం సమానంగా కనబడ్డాయి. చేతనాచేతనాల్లో దేశమాత దివ్య స్వరూపం దర్శించి అంజలి పట్టారు.

"మహిత ముక్తాసరులలో కాం

తంత కబరీభరము లోఖల

చిర చెంగుల సాగరము పై

పారు దేవీ రూపమున్

---

1. జన్మభూమి - ఆంధ్రావళి P 21
2. భక్తయాత్ర - మిత్రమంజరి P 25

మాతృధాత్రి అలభ్యవస్తు - స
మృద్ధ నిధి నిక్షేపగాత్రి - స
మస్త లోకాలోక కామ స
వత్రి - కంచలి పట్టిరక్."[1]

హృదయపూర్వకంగా తామారాధించిన భరతమాతకు నివాళులు చెల్లారు.

"మంగళము సంక్రాంతిసామికి
మంగళము మా భోగిసానికి
మంగళము మన మాతృభూమికి
మంగళం బందరికినీ"[2]

అని మంగళ వచనం పలికారు.

ఈ విధంగా వాక్‌రూపంగా, ప్రకృతిగతంగా పృథివీముఖంగా రాయప్రోలు వారు ఆదిశక్తిని ఆరాధించారు. సృష్టి స్థితి లయాలకు మూలమయిన శక్తిని స్త్రీ స్వరూపంగా భావన చేయడం వల్లనే నేమో వీరికి స్త్రీపట్ల గౌరవాభిమానాలు అభివృద్ధి పొందాయి. ఆధ్యాత్మికంగా స్త్రీరూపాన్ని ఉపాసించిన సుబ్బారావు గారు లౌకికంగా స్త్రీ తత్త్వాన్ని సహృదయదృష్టితో వివేచించారు. సమాజంలో స్త్రీ స్థానం, స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలు, స్త్రీ పురుషుల సంబంధాలు, కుటుంబ జీవనంలో స్త్రీపాత్ర వీరి తాత్త్విక పరిశీలనలో భాగాలయ్యాయి. స్త్రీ కేంద్రబిందువుగా సాగిన ఈ తత్త్వచింతన వీరి అమలిన శృంగార సిద్ధాంత రూపాన్ని పొందింది. వీరి అమలిన శృంగారసిద్ధాంతానికి స్త్రీని గూర్చిన తాత్త్విక దర్శనం ప్రాతిపదికగా నిలిచింది.

---

1. ఆషాఢి - మిశ్రమంజరి P 75,76
2. సంక్రాంతి సంబరము - మిశ్రమంజరి P 66

# స్త్రీ తత్త్వదర్శనం

# రాయప్రోలు వారి సాత్త్విక దృక్పథంలో స్త్రీ

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రా ఫలాః క్రియాః"[1]

స్త్రీలు గౌరవింపబడిన చోట దేవతలు ఆనందిస్తారు. స్త్రీలు గౌరవింపబడక పోతే చేసే పనులు సఫలం కావు.

"శోచంతి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులమ్"[2]

'కలకంఠి కంట కన్నీరొలికిన ఇంట సిరి నిలవదు' అని అంటూ స్త్రీల ఆనందానికి ప్రాధాన్యం ఇవ్వబడింది. భారతీయ సంస్కృతి సంప్రదాయం స్త్రీకి ఉన్నత స్థానం ఇచ్చి గౌరవిస్తూ వచ్చింది.

'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని స్వాతంత్ర్యం విషయంలో కొన్ని నియమ నిబంధనలనేర్పరిచినప్పటికీ మాతృమూర్తిగా, ధర్మపత్నిగా ఆమెకు సంఘంలో ఎంతో గౌరవం ఉంది. ఆమెకు వ్యక్తిగా స్వేచ్ఛ తక్కువైనా గృహిణిగా గౌరవం, ఆదరం ఎక్కువ.

హిందువుల గార్హస్థ్య జీవితంలో పురుషునికి స్త్రీ విలాసవస్తువు కాదు. సహధర్మచారిణి. గృహస్థు నిర్వహించాల్సిన వైదిక కర్మకాండల్లో ధర్మపత్నితో కలిసి చేయవలసినవే ఎక్కువ. బృహదారణ్యకోపనిషత్తులో స్త్రీతో కలిసికాని పురుషుడు సంపూర్ణుడు కాడనే భావం కనబడుతుంది.

"స హైతావానాస యథా స్త్రీ పుమాంసౌ
సంపరిష్వక్తౌ స ఇమమేవాత్మానం
ద్వేధాఽపాతయత్ తతః పతిశ్చపత్నీ

---

1,2 మనుసంహిత. అధ్యాయం 3, 56,57 శ్లోకాలు.

చా భవతాం తస్మాదిద మర్ధ వృగల మివ"[1]

అర్థ శరీరం పత్ని. మిగిలిన భాగం పతి. ఒక బీజానికి రెండు దళాలుగా ఒక ముత్యపు చిప్పకు రెండు భాగాలుగా గార్హస్థ్యమనే శరీరానికి భార్యా భర్తలు సమానమైన రెండు అర్ధభాగాలు.

పురుషునికి ధర్మపత్ని అయిన స్త్రీకి వైదిక వాఙ్మయంలో జాయ, జని, పత్ని వంటి పదాలు ప్రయోగింపబడ్డాయి. ఆ పదాలు 'స్త్రీ' అన్న శబ్దానికి పర్యాయపదాలుగా కాక సార్థకంగా ప్రయోగింపబడ్డాయి. ఈ పదాల వ్యుత్పత్తి అర్థాలను చూస్తే స్త్రీకి ఉన్న స్థానం వ్యక్తమవుతుంది.

'జాయతే ౽ స్యాం పతిః పుత్రరూపేణేతి జాయా'.

(ఈమె యందు పతి పుత్రరూపమున జనించును)

'జాయతే ౽ స్యాం పుత్ర ఇతి జనీ'

(ఈమె యందు పుత్రుడు పుట్టును)

'పత్యుర్నయో సహ యజ్ఞ యోగాస్సంపద్యత ఇతి పత్నీ'

(పతికి ఆమెతో కూడ యజ్ఞయోగము కలదు)[2]

ఇదే విధంగా ద్వితీయా, సహధర్మిణీ, పురంధ్రీ, కులపాలికా సతీ వంటి పదాలు స్త్రీకి హైందవుల దృష్టిలో ఉన్న గౌరవాన్ని సూచిస్తాయి.

"సామ్రాజ్ఞీ శ్వశురే భవ సామ్రాజ్ఞీ శ్వశ్ర్వాం భవ
ననాందరి సామ్రాజ్ఞీ భవ సామ్రాజ్ఞీ అధి దేవృషు"[3]

---

1. బృహదారణ్యకోపనిషత్తు 1-4-3
2. గురుబాల ప్రబోధిక P 355, 357
3. ఋగ్వేదము 10-7-1 (46)

అని ఋగ్వేదంలో స్త్రీ గృహానికి మహారాణి అన్న భావం కనబడుతుంది. ఈ విశదమైన స్త్రీ ప్రాముఖ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రామాయణ భారత భాగవతాల వంటి పురాణేతిహాసాలన్నీ స్త్రీని గౌరవించాలనే బోధిస్తాయి. వైదికధర్మప్రతిపాదనా ప్రధానాలయిన భారతాది గ్రంథాలన్నీ స్త్రీని పవిత్రమూర్తిగా పతివ్రతగా ధర్మనిర్వహణలో సహాయకారిగా చిత్రించడానికి ప్రాముఖ్యాన్నిచ్చాయి.

ప్రాచీనాంధ్రసాహిత్యంలో కూడా ప్రారంభంలో ఎక్కువ భాగం పురాణేతిహాసాల అనువాదాలు కావడం వల్ల స్త్రీపరంగా ఇటువంటి భావాలే కనబడతాయి. కాని కావ్యరచనలో కొంత స్వతంత్రం చూపిన ప్రబంధాలలో స్త్రీపాత్రచిత్రణలో మార్పు వచ్చింది. ప్రబంధాలయినా స్త్రీని అగౌరవపరచలేదు. హీనంగా చూడమని బోధించలేదు. కాని వర్ణనల్లో స్త్రీలోని సౌందర్యానికి ప్రాధాన్యం ఇచ్చాయి. నాయికను సౌందర్యమూర్తిగా చూపించే ఉద్దేశంవల్ల ఆమె హావభావ విలాసాలకు, ఆంగిక సౌందర్యానికి ప్రాముఖ్యం లభించింది. ఈ వర్ణనలు స్త్రీ విలాసవస్తువన్న అభిప్రాయం ఏర్పడడానికి అవకాశమిచ్చాయి. స్త్రీ అంతరంగ సౌందర్యవర్ణన తగ్గి అంగాంగవర్ణనలు పెరిగిపోయాయి. క్షీణప్రబంధయుగం నాటికి స్త్రీ వ్యక్తిగా మరుగునపడి భోగ్యవస్తువుగా మిగిలింది. ఆమెను ఆపాదమస్తకం వర్ణించడంలో కవులు ఒకరిని మించి మరొకరు ప్రతిభానైపుణ్యాలను ప్రదర్శించసాగారు. ఆమెకు సంఘంలో ఉన్న స్థానానికి గాని, ఆమె పరిస్థితులకు గాని, మానసిక స్థితికి గాని ప్రాధాన్యం లభించలేదు. వారి దృష్టి కేవలం ఆమె ఉన్నతాంగాల మీదనే కేంద్రీకృతమయింది. ఆనాటి సాహిత్యంలో స్త్రీ అంటే సుగుణాల పోగు కాదు. సౌందర్య రాశి మాత్రమే.

ఈ విశ్వమైన సాహిత్యవాతావరణంలోని స్త్రీని తత్త్వదృష్టితో పరిశీలించి, ఆమెను వాత్సల్యమూర్తిగా, దాక్షిణ్యమయిగా స్తుతించి, ఆధునిక కవిత్వంలో వ్యక్తిగా నిలబెట్టిన ఘనత రాయప్రోలు వారిది.[1] స్త్రీని మాతృ మూర్తిగా, సోదరిగా, భార్యగా, తనయగా దర్శించి ఆమెకుగల పూర్వపు గౌరవాదరాలను పునరుద్ధరించిన దార్శనికకవి సుబ్బారావుగారు. వీరు ఆమె బాహ్యసౌందర్యానికే కాక అంతరంగసౌకుమార్యానికి ప్రాధాన్యమిచ్చి కాముకావరణం నుంచి బయటకు తెచ్చి వివేకవతిగా సాహిత్యంలో నిలిపారు.

పినతల్లి అనసూయ కథకిచ్చిన వ్యాఖ్యానం వల్ల స్త్రీని గూర్చిన తత్త్వచింతన వీరిలో ప్రారంభమయింది. ప్రేమ స్వరూపిణి అయిన స్త్రీని గూర్చి వారు దర్శించిన సత్యాలను కావ్యరూపం ఇవ్వాలనే సంకల్పానికి ఆనాటి సామాజిక పరిస్థితులు కూడా ప్రోత్సాహాన్నిచ్చాయి. 19 వ శతాబ్దిలోని సాంఘిక విప్లవభావాల ఫలితంగా స్త్రీల స్థితిగతులలో కొన్ని మార్పులు వచ్చాయి. స్త్రీలు సంఘంలో సముచిత స్థానం పొందాలనే ఉద్దేశంతో విద్యావ్యాసంగాల్లో ముందుకు రాసాగారు. దీని ఫలితంగా స్త్రీలు కూడా విద్యావంతులయి వివిధరంగాలలో ముందుకు వచ్చారు. స్త్రీలు ఇల్లు వదిలి బయటకు రావడంతో కొన్ని సమస్యలు తలెత్తాయి. సంఘంలో స్త్రీ పురుషులు సన్నిహితంగా మెలిగే అవకాశం, అవసరం

---

1. 'ఆధునికాంధ్ర కవిత్వములో స్త్రీ సమారాధన తత్త్వమునకు రాయప్రోలు వారే మొట్టమొదటి ఆచార్యులు:

'ఆధునికాంధ్రసాహిత్యము - సంప్రదాయములు, ప్రయోగములు'

C. నారాయణరెడ్డి P 286

ఏర్పడింది. స్త్రీ పురుషుల మధ్య ప్రకృతిసహజమయిన పరస్పరాకర్షణ సమస్యలను ఒక కారణమయింది. ఈ సమస్యలను పరిష్కారం సూచించాలనే తపనే స్త్రీని గూర్చిన సుబ్బారావుగారి తత్త్వజిజ్ఞాసను ప్రోత్సాహానిచ్చి ఉంటుంది. ఈ తాత్త్వికదర్శనం అమలిన శృంగార సిద్ధాంతంగా రూపు దిద్దుకుని ఉంటుంది.

ప్రాచీనాంధ్రకవులు - ముఖ్యంగా ప్రబంధ క్షీణ ప్రబంధ యుగాలలోని కవులు స్త్రీని భోగ్యవస్తువుగా నఖశిఖ పర్యంతం వర్ణించడం రాయప్రోలువారికి నచ్చలేదు.[1] సాహిత్యం స్త్రీలోని సౌందర్యాన్ని ప్రదర్శించడం కాక ఆమె అంతఃకరణంలోని ప్రేమస్వరూపాన్ని చూపాలన్నది వారి ఆశయం. "మన వాఙ్మయమునందు అధికముగా కాముకావరణ మందే స్త్రీ ప్రదర్శింపబడినది. ఆమె యౌవనావస్థయే ఎక్కువగా వర్ణితము. అంగోపాంగ వర్ణనలందు గూడ అతివ్యాప్తియే పట్టినది. ప్రణయ

---

1. "స్త్రీని భార్యగానూ కామదృష్టితోనూ చూడ్డం అలవాటైపోయింది మనకు. ఇంతవరకూ వచ్చిన ప్రబంధాలల్లో అంతా ఇదే దృష్టి. ఇదేం బాగుంది? స్త్రీని మంచి స్నేహితురాలిగా ఎందుకు చూడకూడదూ? ఇప్పుడు చదువుల్లో ఆడపిల్లలూ మగపిల్లలూ కలిసి చదువుకుంటున్నారు. ఈ సమయంలో మన పాతప్రబంధాల్లోని భావాలనే చెప్తే ఎట్లా? స్త్రీ పురుషుల మధ్య స్నేహం ఉండాలి. అందుకనే వాళ్ళ లిరికల్ పోయెట్రీని చూసికాని దానికి దయ, స్నేహం, వాత్సల్యం మొదలైన సుగుణాలను కలిపి కొత్త కవిత్వం వ్రాశాను."
విముక్తిని - 4 . అనుబంధం P35

మర్యాదయందును సాధారణముగా చ్యుతి ఆమెదే".[1] అనే అభిప్రాయం సుబ్బారావుగారిది. కనుకనే

"కులశుభాంగీ వధూశేఖర సుగుణమందు
దేహమున్నదె గవేషించె మున్ను సుకవి
సాత్విక ప్రేమ కోశపేశలము లయిన
వత్సలామృత రుచులను వలచె నేఁడు"[2]

అని అన్నారు.

స్త్రీ కేవలం సౌందర్యమూర్తి మాత్రమే కాదు. మాతృమూర్తి, దాక్షిణ్య శీలి, ప్రేమ స్వరూపిణి. స్త్రీ పురుషుల మధ్య సంబంధం భార్యాభర్తల అనుబంధం మాత్రమే కాదు. విషయసుఖేచ్ఛలకు దూరమైన బాంధవ్యం కూడా ఉంది. స్త్రీ పురుషునికి తల్లి, సోదరి, కూతురుగా కూడా అనుబంధం కలిగి ఉంది.

"ఒకనికి కుమారితను మఱియొకనికి సఖి
నింకొకనికి తల్లిని ఇందులోన
నెవ్వరితనో భావింపుము హృదయమందు
దాని వరుసలు వాసనావశము లేని?[3]

---

1. అభినవాంధ్ర కవి పండిత సమ్మేళనము - ద్వితీయ సమావేశము అధ్యక్షోపన్యాసము - రాయప్రోలు సుబ్బారావు.
భారతి - Feb 1934
2 రమ్యాలోకము - P37
3 'ఎవరు'- జడకుచ్చులు P135

అని ఒకపాత్రలో అనిపిస్తారు. వీరికి స్త్రీ 'స్తన ద్వంద్వంలో' యౌవనత్వం కాక అమృతకలశాలు, 'పాలకుండలు' గోచరించాయి.

....'క్షీరసాగర శయనా' అనే గీతం వినబడితే ప్రేమరూపిణి యైన తల్లి ఆమె వక్షస్థలం మీద స్తన్యపానం చేసే శిశువూ నా హృదయాంబరము మీద దర్శనమిస్తారు. వాఙ్మయ ప్రపంచంలో మాధుర్యమయ మయిన ప్రకృతి మధుర కలశారాధనం చేసే కవి సాక్షాత్కరించేవారు.

"పచ్చి కస్తూరి గంధ కుంభములు దాచి

క్షీరభాండము వెత్తివి చిన్నవాడ'

అనే పద్యంలో ఇమిడిఉన్న నా భావం ఇదే[1] అని తమ అభిప్రాయాన్ని స్పష్టం చేశారు సుబ్బారావుగారు. వీరి దృష్టిలో స్త్రీ సృష్టికి వికాసహేతువు. చైతన్యానికి ప్రతీక. పురుషుడు స్త్రీ లేకపోతే పశుప్రాయుడు. పురుషుణ్ణి అడుగడుగునా నడిపించే శక్తి స్త్రీ. పురుష వృషభముల అంతరంగములను మసృణీకరించునది స్త్రీ. ప్రాచీన ధర్మశాస్త్రాలలో చెప్పిన విధంగా స్త్రీ లేనిదే పురుషుడు పరిపూర్ణుడు కాడనే భావం రాయప్రోలువారికుంది.[2] కళత్రము అర్ధాంగి. ఆమె సాహచర్యము లేకపోతే జీవితము సాంగోపాంగ వికాసము పొందదు. దక్షిణము లేని ఉత్తరమవుతుంది.[3] అని స్త్రీ స్థానాన్ని గౌరవించారు.

ప్రకృతి కృపణుడై పురుషుడు తప్పుచేసినా సహించే తత్త్వం

---

1. 'నా లలిత రచన'. రేడియో ప్రసంగము - విమర్శిని 4 - P2
2. "ఏతావానేవ పురుషో యజ్జాయాత్మా ప్రజేతిహ
   విప్రాః ప్రాహుస్తథా చైతద్యో భర్తా సాస్మృతాంగనా" మనుసంహిత, 9అ, 45శ్లో.
3. 'తృణకంకణము - అతిథుల' 'తృణకంకణం' నివేదన - P4

ఆమెది. తన జీవితం మోడు బారినా వెకిలిచేయని ఆమె దాక్షిణ్యగుణం ఆరాధించదగింది.[1]

'కార్యేషు దాసీ కరణేషు మంత్రీ

శయనేషు రంభా క్షమయా ధరిత్రీ'

అని స్త్రీ ప్రశంసింపబడింది. 'ధృతిః క్షమా దయా శౌచం' అని వ్యాసుడు స్త్రీ గుణాలను కీర్తించాడు. వ్యాసుడు చెప్పిన స్త్రీలోని ఉన్నత గుణాలు రాయప్రోలు వారికి ఆదర్శం. అవి సాహిత్యంలో ప్రతిఫలింపచేసి ఆమె ఔన్నత్యాన్ని చిత్రించాలని వీరు భావించినట్లు కనబడుతుంది. రాయప్రోలు వారి నాయికలు ఆ సప్తగుణాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

ఈ విశిష్టమైన భావాలలో స్త్రీని పురుషుని కంటె ఉన్నతంగా చూశారు రాయప్రోలు వారు. కనుకనే వీరి రచనల్లో స్త్రీ పాత్రలే ప్రాధాన్యం వహిస్తాయి. వీరి కావ్యాలలో స్త్రీలే ధైర్యస్థైర్యాలలో వ్యవహరిస్తారు. స్త్రీలు త్యాగజీవనులుగా, సహనమూర్తులుగా చిత్రింపబడ్డారు. వివేకవతి అయిన స్త్రీ వీరి రచనల్లో దర్శనమిస్తుంది.

---

1. ఈ భావానికి రూపకల్పనే 'రూపనవనీతము' లోని వకుళమాల పాత్ర.

# స్త్రీ గుణవర్ణన

రాయప్రోలు వారు తమ రచనల్లో ప్రేమ కరుణ వాత్సల్యం వంటి గుణాల వర్ణనలో స్త్రీ ఆత్మసౌందర్యాన్ని తీర్చిదిద్దారు. వీటి ద్వారా స్త్రీ ఔన్నత్యాన్ని పునః ప్రతిష్ఠించారు. అంగాంగ వర్ణన స్త్రీ పట్ల కామదృష్టిని పెంపొందింపచేస్తే స్త్రీ ఉదాత్తగుణవర్ణన వారిని సహృదయంలో ప్రేమింప చేస్తుంది. ముందుగా ఆకర్షించేది స్త్రీ బాహ్యరూపమే అయినా ఆ ఆకర్షణ తాత్కాలికం అయ్యే అవకాశం ఉంది. కాని స్త్రీ మృదుస్వభావ వర్ణన ఆమె మీద గౌరవాదరాలను ఎక్కువ చేస్తుంది. ఉత్తమసాహిత్యం స్త్రీ ఉన్నత గుణాలను కీర్తించాలి గాని బాహ్యసౌందర్యాన్ని కాదని రాయప్రోలు వారి అభిప్రాయం. సాహిత్యంలో అలా తీర్చిదిద్దబడిన గుణవతులు వీరికి ఆదర్శం.

వైదికాచరణ మర్యాదలు మెరయంగ
నన్నయ తీర్చిన నయచరితలు
క్షాత్ర వర్చస్సు పిక్కటిలంగ తిక్కన
మాంసలించిన అభిమానవతులు
వివిధ తోముల రేఖలవఘళింపంగ శ్రీ
నాథుదాదించిన నాటకత్తె
ఆంధ్రకళా జీవంబు లందంబు తెగబోయు
సూరన మెచ్చిన సుభగమతులు
పురుష సరళి సంస్కార శోభలు చెలంగ
కళల రూపాలలో రూపకళల పొదవి
సాహితీ చిత్రములను సాక్షాత్కరించు

ఆంధ్ర సాహిత్యము తల్లుల కంజలింతు[1]

అంటూ ప్రాచీన సాహిత్య వీథుల్లోని సాహిత్యపుటమ్మల కంజలి ఇచ్చి తమ స్త్రీ గౌరవాన్ని అభివ్యక్తం చేశారు రాయప్రోలు వారు. స్త్రీ ఔన్నత్యాన్ని ప్రదర్శించి ఆమెకు తమ రచనల్లో పూజ్యస్థానాన్నిచ్చి ఉన్నతపీఠం మీద అధివసింప చేశారు. ఈ స్త్రీ సమారాధనా తత్త్వం తరువాతి కవులకు అనుసరణీయమయింది.[2]

"ధృతిః క్షమా దయా శౌచం
కారుణ్యం వాగ నిష్ఠురా
మిత్రాణాం చానభిద్రోహః
సప్తైతాః సమిధః శ్రియః"

వ్యాసుడు చెప్పిన ఈ గుణాలనే 'రూపనవనీతమ్'లో ఒక సందర్భంలో

'ధృతి తోడ గృహంబు దిద్దవే
క్షమలో పసిపాప నెత్తవే
దయ జూడవె బంధు జాలమున్
కరుణించవె కష్టజీవులన్
శుచివై కులకీర్తి నిల్పవే

---

1. 'ఉగాది' - మిశ్రమంజరి P 69.

2. భావకవులలో ప్రేయసికి పూజ్యత కల్పించుటలో రాయప్రోలు వారు ప్రథములు.....- ప్రేయసీ పూజ్యత తదనంతర భావకవులలో ఉత్తరోత్తరాభివృద్ధి గాంచినది... పలువురామెను దేవీపీఠముపై నధిష్ఠింపచేసిరి. స్త్రీ సమారాధనా తత్త్వమునకు రాయప్రోలు వారే మొట్టమొదటి ఆచార్యులు' - 'ఆధునికాంధ్రకవిత్వము - సంప్రదాయము ప్రయోగములు' C. నారాయణరెడ్డి - P 286, 332

పలుకాడను నిష్ఠురంబుగా

సఖునేపను ద్రోహచింతనన్ *[1]

అని పలికించారు. స్త్రీలో వీరభావానికి, ఆశించే గుణాలుగా వీటిని చెప్పుకోవచ్చు. కనుకనే ఈ గుణాలకు ప్రాధాన్యం ఇస్తూ వీరి కావ్యనాయికలు సృష్టింపబడ్డారు.[2] స్త్రీ స్వభావం లోని అన్ని కోణాలను స్పృశించి

1. 'రూపనవనీతము' - P 86

2. "అబలా వ్యక్తిత్వంలో సప్తసహజగుణాలను ప్రత్యేకంగా తమ పిన్నిగారు చెప్పేవారని రాయప్రోలువారు పేర్కొన్నారు. వాటిని వ్యక్తీకరించటమే తమ కావ్యరచనా పరమార్థమని ప్రయోగశీలియైన రాయప్రోలు సంకల్పించియుండవచ్చు. ఆ సంకల్పశక్తిలో నుంచి ఆయన కావ్య నాయికలు పుట్టారు. ఆయన రచించిన ఏడు కావ్యాలు అమలిన శృంగార ధర్మసదనానికి అనువైన సప్త సమిధలు. ఆ నాయికలనూ వారు ప్రతినిధులుగా నిలిచే గుణాలనూ వారియందు ప్రధానంగా ప్రపంచితమయ్యే ప్రేమ స్వభావాలనూ ఈ క్రింది విధంగా వివేచించవచ్చు.

| కావ్యం | పాత్ర | గుణం | ప్రేమ స్వభావం. |
|---|---|---|---|
| లలిత | లలిత | ధృతి | అచంచల ప్రేమ |
| తృణకంకణం | నాయిక | క్షమ | అమలిన ప్రేమ |
| అనుమతి | అనుమతి | దయ | ఆర్ద్ర ప్రేమ |
| కష్టకమల | కమల | శౌచం | అనాసక్త ప్రేమ |
| స్నేహలత | స్నేహలత | కారుణ్యం | ఉద్విగ్న ప్రేమ |
| స్వప్నకుమారం | స్వప్నసుందరి | వాగనిష్ఠురత్వం | వాత్సల్య ప్రేమ |
| రూపనవనీతము | వనజమాల | మిత్రులకనభిద్రోహం చేయకుండటం | దాక్షిణ్య ప్రేమ" |

(contd)

పరిపూర్ణమైన స్త్రీ తత్వాన్ని వీరు కావ్యాల్లో ప్రదర్శింపు చేశారు.

'లలిత' కావ్యనాయిక లలిత స్వభావమతి. స్త్రీలోని ధైర్యగుణానికి ప్రాధాన్యం ఇచ్చే కావ్యం 'లలిత'. స్త్రీ అబల కాదని సమయం సందర్భం వచ్చినప్పుడు ధైర్యసాహసాలు ప్రదర్శించగలదని నాయిక నిరూపిస్తుంది.

లలిత మనసారా ప్రేమించిన వ్యక్తి విధి విలాస విపాకంబు వెనుకదన్నగా ఆమెను దూరమయ్యాడు.

"కొలిచిన వంశదేవతలు కోరిన కోరిక తీయరాయెనే
తలచిన తీరు తెల్లను వ్యథా వ్యథమై విరమించె నెమ్మదిన్
మొలచిన ఆసలన్నియును మోసలు బోయక వాడిపోయె
వలచిన వన్నెలాడదని పట్టినటుంచు - - - ....." [1]

విని ఆమె బాధపడింది. కాని తన నిరాశను, విచారాన్ని ప్రకటనసెట్టి అతిసాహసంతో అతనిని వెతుకుతూ అడవులు పట్టింది. రాజాంతఃపురాల్లో అత్యంత సుకుమారంగా పెరిగినదే అయినా ఆ వైభవాలను త్రోసిరాజని ప్రియునికై ఒంటరిగా కారడవుల్లో సంచరించింది. అతడిని వెతకడంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నది.

"ఎడనెడ పాయుచున్న సెలయేళ్ళను వెచ్చని నీరు త్రావుచున్
పొడమిన కందమూలముల భోజనవేళల నారగించుచున్
కడయు మొదల్ కనంబడని కాననమందు భ్రమించునాంటిగా
జడియక దైన్యమందక అసాధ్యమటంచు త్యజింపకెంతయున్" [2]

---

(contd) రాయప్రోలు సుబ్బారావు - (వ్యాసం) G.V. సుబ్రహ్మణ్యం

నవోదయ లహరి P 35

1. 'లలిత' - అభినవకవిత P 219
2. 'లలిత' - అభినవకవిత P 192

అడవిలో భయపడి అసాధ్యమని జంకక ధైర్యంతో ముందుకు నడిచి కార్యసాఫల్యం పొందింది. ఇక్కడక్కడా స్త్రీ సహజ స్వభావంతో చేలగా కంట తడిపెట్టినా ఎప్పటికైనన్ నిరాశానివేశంబుల రానీనని అవశోద్వేగంబు రానీకున్నన్ అంటూ రాయప్రోలువారు ఆమెను సమర్థించి ధీరురాలుగానే నిలబెట్టారు.

ఈ కావ్యం కాక ఇక్కడక్కడా కొన్ని ఖండికల్లో కూడా స్త్రీల ధైర్యస్థైర్యాలను ప్రస్తావించారు.

"విఱిగి వచ్చిన ప్రాణవిభునకు పసుపిచ్చి
వేడినీళ్ళను పోసె కోడలుకదె
కత్తుల తిరునాళ్ళ కవయు వచ్చిన సాధ్వి
కాంతకన్నులబడి దాగె నూతు రాకదె
కులకన్యల కృశించి నూలు సున్న విశాల
రాజ్యచక్రము త్రిప్పె రాణి యొర్తు ...
విమల సాహసనీకుమార్యములు వెలయు
దిక్చక్రంబులందు చిత్రించినారు
తమ చరిత్ర విచిత్ర పత్రములనాడు...."[1]

అంటూ భారతస్త్రీలలో ప్రాచీనకాలం నుంచీ ఉన్న వీరవనితల ధైర్యసాహసాలను గుర్తుకు తెచ్చారు.

'పురుషున్ జూడుడు వీరమాతలకుమున్
పుణ్యాత్మకున్ గేహినుల్...'[2]

---

1 'ఆంధ్రి' - ఆంధ్రావళి P31

2. 'ఉగాది' - మిత్రమంజరి P67

"తన రాజ్యసీమా నితంబముల్ దాటి
    వైరుల పారద్రోలిన రుద్రమాంబ

--- --- --- --- ---

బిరుదు పోటరి రాచబిడ్డలన్ బొమ్మల
    బాయి వాదించిన నాయకమ్మ
తన ప్రియస్వామి బాలునకు పోడిమి కర
    వాల వెలసంగిన మాంచాల మగువ
తెనుగు దేవతలుగ దీపించుచున్నారు
మలగిపోక నిత్యకళల తనరి
వీరవాసరముల నారాధనము సల్పు
దేవృత కీర్తి యోగమంది సతులు".[1]...

అని వీరపత్నులను వీరమాతలను ప్రస్తుతించారు. 'మాంచాల' వంటి వస్తువును ఎన్నుకుని ఒక ఖండిక వ్రాయడానికి కూడా స్త్రీలోని ధైర్యగుణం వ్యక్తం చేయాలనే వీరి కోరిక కారణం కావచ్చును.

స్త్రీ స్వభావంలో అత్యుత్తమమయింది ప్రేమ. స్త్రీ ప్రేమ స్వరూపిణిగా, సహనశీలిగా పేరు పొందింది. తృణకంకణ నాయిక ఈ కోవకు చెందినదే.

"అడుగులు బొబ్బవెత్త వదనాంచల ముందున చిన్కుచెమ్మటల్ *
మడుగులు గట్ట మండు కసుమాలపు టెండ పడంతి యోర్చు జా
రెడు జిలుగుం బయంట సవరించుచు బాటల నింపులూడ కా
ల్నడకన పోవుచుండె నెడలన్ కనుపట్టెడు లోటలోనికిన్."[2]

---

1. ఉగాది - మిశ్రమంజరి P 68, 69
2. తృణకంకణము - మొదటి పద్యం

"ఇసుక దిగబడు నడుగుల నీడ్చికొనుచు
ఉడుకు టెండకు ముందు నిట్టూర్పులదర. *
కాలి చల్లారు పెంపుడు కానబడిన
పడుచు జింక పరుంటినా నడచు నామె"[1]

తన స్నేహితుడిని కలుసుకోడానికి ఎండలో ఎంతో కష్టాన్ని సహించి వచ్చింది. వివాహానికి దూరంగా ఉండడానికి నిశ్చయించుకున్న స్నేహితుని మనసు మార్చాలని నిర్ణయించుకుంది. తన మీది వలపుతో వ్యథ చెందుతున్న చెలికానిని ఓదార్చి అతడిని వేరే వివాహానికి సుముఖుడిని చేయడానికి సంకల్పించిన స్నేహశీలి తృణకంకణ నాయిక. ఈమె మిత్రునిపట్ల అనభిద్రోహలక్షణం కల స్త్రీ అని రాయప్రోలువారి ఉద్దేశం.[2] ఆమె ప్రేమమూర్తి - కనుకనే

"నడచి బడలిన యాయాస మెడల లేదు
చిర చెలుగుల తలిర్చిన నారలేదు.

---

1. తృణకంకణము - అభినవకవిత P 228

2. "తనకోసం బాధపడుతున్న స్నేహితుణ్ణి ఓదార్చడానికి పోతూ అంత కష్టాన్ని భరించింది. స్త్రీకి ధృతి క్షమ దయ శౌచం కారుణ్యం వాక్కులో అనిష్ఠురత్వం మిత్రులయందు అనభిద్రోహలక్షణమూ ఉండాలి అని వ్యాసుడు చెప్పాడు. మరి ఇక్కడ స్నేహితుడు తనకోసం విలపిస్తుంటే ఊరుకుండటం అతనికి ద్రోహం చేసినట్లవుతుంది. తృణకంకణంలో నాయిక మిత్రులయెడ అనభిద్రోహలక్షణం కలది. అది చెప్పాలనే ఆమె అడుగులు బొబ్బలెత్తగా ఆ పురుషుణ్ణి సమాధానపరచటానికి వెళ్ళిందన్నది ప్రధానం చేసి తృణకంకణం వ్రాశాను"
విమర్శిని-4 అనుబంధం P36

వేడి నరసినయుపుడె ముద్దాడికానియు

అహహా యెంతటి ప్రేమార్ద్రమామె మనసు".[1]

అంత ఎండలో చెమటలో తడిసి వచ్చినా ఆ అలసటను వెకరంచేయక తనను చూచి చెంతచేరిన వేడిని ముద్దుచేసిన ప్రేమార్ద్రహృదయమామెది. ఈ పెంపుడు జింకతో ఆమె ప్రవర్తన ఆమె ప్రేమస్వభావాన్ని చక్కగా చూపుతుంది. ఆమె నగవు పలుకులతో కనుగొనలలో వాత్సల్యరసము కురియగా ఆ మోహన హరిణాన్ని ముద్దాడుతుంది.

"నయన మాలాంచలములు స్వప్నంబులయిన
వేల చెల్లెలా యూ ప్రాణమాతికలను
కారణం చెయ్యనిది కఠోర కంటకంపు
వనుల తిరుగవు గద చిన్నతనపు చేష్ట"[2]

అని అంటూ ఆ లేడితో సంభాషించిన తీరు ఈ నాయిక ప్రేమ వాత్సల్యాలను స్పష్టం చేస్తుంది. ఇంతటి ప్రేమార్ద్రహృదయ కనుకనే నాయకుడు ఆమెను తలచుకుంటున్న సందర్భంలో

"నా ప్రియసఖి అనురూప గు
ణా ప్రచుర ప్రసన్నశీల నవనీత శరీ
ర ప్రణయ మృదుల హృదయ...."[3]

అంటూ ఆమె గుణాలను శ్లాఘిస్తాడు.✓

మిత్రుల యెడ అనర్ఘద్రాక్షా లక్షణాలు కలిగిన ఇంకొక నాయిక వకుళమాల. (రూపనవనీతమ్) స్త్రీ స్వభావంలోని దాక్షిణ్యాంశం ఆమె చేత ఏ పనయినా చేయించగలదని నిరూపిస్తుంది వకుళ పాత్ర. అనిష్టకరమైన వాటినైనా అనర్ఘద్రాక్షాత్మైన మైత్రినేన్ని మగువలను

---

1,2,3 ప్రాణకంకణము - అభినవ కవిత P229, 232

పెట్టనివగలు, తీయరాని దివ్యాంశలు' అని అంటారు సుబ్బారావుగారు.
వకుళ దాక్షిణ్యమయి. వకుళా సుందరులు విడుపూ తడుపూ లేకుండా
కలిసి మెలిసి పోరుపూ మరుపూ లేని సాహసవ్రతం జరిపారు. వకుళ
దైన్య యాచనాదులకు అవశంగా కరిగిపోయే స్వభావం కలది. ఈమె
స్త్రీలోని దాక్షిణ్య దయా క్షమాది గుణాలకు ప్రతీకగా నిలిచి స్త్రీ
ఆధిక్యాన్ని నిరూపించుకుంటుంది. మిత్రుడు క్రూరంగా మోసపోటు
పెట్టితే --- తన స్నేహంతో పాటు అస్ఖలితమైన తన శీలమును కూడా
కోలుపోయింది. కామసిద్ధికై స్నేహితునిని సమర్పించి తన జీవయాత్రిక
భగ్నం చేసుకున్నది. విరక్తయై ఏకాంతయోగం అవలంబించింది.
ఈమె జీవితత్యాగం సుందరుని జీవితభోగంగా పరిణమించింది.
లీల కూడా స్నేహితుని ప్రవర్తనకు బాధపడ్డ యువతే. రాయప్రోలు
వారు నాటకంలోని కొన్ని పాత్రల ద్వారా వకుళ, లీలల పాత్రచిత్రణ
లోని పరమార్థాన్ని వెలిబుచ్చారు.[1] లీల కూడా తన స్నేహితుడి

---

1. "ఓహో! నారీజన నిజాంతరాళము ఎంత సునిశితమయినదో, ఎంత శుభ
మంతమైనదో ఇంతవరకూ మహాయుగములు గడిచినా గ్రహింపలేకపోయి
నాడు నరుడు.... స్త్రీజన శీలమెల్లప్పుడూ కనకోకంటక సాంగత్యంగా
భయపడవలసిందేనా? ఆ భయభ్రాంత భిన్నం కావలసిందే స్త్రీ జీవితమేనా? దోషా
దోష విచారణ యందు ధర్మశాసనము ఇట్లా ఏకైక పాక్షికమై పోయిందా?
--- దుర్విదగ్ధుల స్నేహకైతవమూ, దాని ప్రతిఫలంగా అబలలకు కలిగే
తీవ్రశిక్షణ తనుత్రాసమూ తెలిసింది. భయంకరమైన ఈ మానభంగ చిత్ర
తనము పురుషవృషభ స్వభావం గ్రహించలేదు కాబోలు! ఎన్ని పాపాలతో
ప్రాయశ్చిత్త శిక్షలు వ్రాసిపెట్టారు. గొంతుకోయకుండా ప్రాణాలు తీయ
కుండా జీవితహత్య చేసే ఘాతుకులను వేరెలా గరనాలెనా."
'రూపనవనీతమ్' - 33, 34, 76

అంతరపాటు వల్ల తాను మతిని మయినట్లు బాధపడింది. స్నేహప్రీతి వీరి సహజగుణంగా చిత్రింపబడింది. స్నేహ స్వభావం స్త్రీ ప్రకృతిలో కనిపించే మరొక గుణం

"పరిచయ రహస్య మాధుర్యమెరిగినట్టి
ప్రణయులను స్నేహ రుచి యట్లు ప్రాప్తివశత
కలిసి మాటాడినట్టి ధన్యులను నెల్ల
తలపు వెడలను స్నేహలతా కుమారి"[1]

పరిచయము నంత మాత్రానే వారి మనస్సులో నిలిచే స్నేహ స్వభావం కలది స్నేహలత. ఈ గుణం వల్లనే ప్రియంవదకు ఎక్కువ సన్నిహితమయింది.

"స్నేహలతా ప్రియంవదలు చిన్నతనమ్మున నుండియున్ సుహృ
న్నేహనిబద్ధలై కలిసిపోయి రెడమ్ములు లేని తీరినన్
దేహము లందు దక్క విడదీయుటకు వారల బ్రహ్మయాడు ద్వో
దైహ్యదయంగమం బగు ప్రియ ప్రణయమ్మున కేది పారమో"[2]

స్నేహానికి అధిక ప్రాధాన్యమిచ్చిన రాయప్రోలు వారు తమ కావ్యాల్లో ఎందరో స్నేహితులను సృష్టించారు. తృణకంకణ నాయికా నాయకులు ఆబాల్య స్నేహితులు. అనుమతి, లలిత కావ్యాలలో కూడా స్నేహానికి ప్రాధాన్యం ఉంది. కష్టకమలలో కమల, మాధవుడు సన్నిహితులు. రూపనవనీతంలో సుందరి, లీల; లీల, సుభాషి; సుందరుడు, వకుళ; వకుళ, సుగంధి; సుందరుడు, పరంజ్యోతి - ఇలా దాదాపు అన్ని పాత్రలూ స్నేహితులు గానే సృష్టింపబడ్డాయి. వారిది స్నేహానుబంధం. స్త్రీ పురుషుడికి

1,2 'స్నేహలత' - అభినవ కవిత P 285, 286

ఇతర బాంధవ్య బంధాలతో పాటు మంచి స్నేహితురాలు ఎందుకు కాకూడదనే భావంతో తన కావ్యాల్లో స్నేహం పట్ల ఆసక్తిగల పాత్రలను సృష్టించారు సుబ్బారావుగారు.

స్త్రీ దయకు వాత్సల్యానికి ప్రతీక. 'స్వప్నకుమారము' లోని నాయిక వాత్సల్యవతి. తనను కటాక్షించవలసిందిగా కోరిన నాయకునికి మాతృ ప్రేమ ఔన్నత్యాన్ని విశదపరిచి, విషయ సుఖేచ్ఛలు అశాశ్వతాలని బోధిస్తుంది. వాత్సల్య సూత్రాన్ని విప్పి చెబుతుంది.

"పిలిచి ప్రతివారి పాలియకలను గాని
పొలగానుటకు నే తొయ్యరాల గాను"-- [1]

అంటూ మృదువుగా తిరస్కరిస్తుంది. తిరిగి తిరిగి తన కాంక్షనే వ్యక్తం చేస్తున్న నాయకునికి ఆదరమే శిక్షగా విధిస్తూ తనలోని వాత్సల్యాన్ని కనబరుస్తుంది.

"అంతటి శుభాస్య అనసూయ యనుచు వింత
లాలనము నన్ను లాలింప లాతి యెపుడు
మంచి సమయము కాదు కుమార! ---" [2]

అని పలుకుతూ అనసూయలోని మాతృవాత్సల్యాన్ని తెలిపిస్తుంది. ఆశ్రయ వాత్సల్యం ఎట్లా ఉంటుందో నిదర్శనం చూపి వివరిస్తుంది.

"దప్పిగాని చేరిన మిళింద తనయులకు
పూలపాత్రిచ్చి చేకట్ల పోవకుండ
కడుపులో దాచుకొనదె పంకజము ప్రియుడే
చేరదీసిన మమకారమేరి తెలుక

---

1. స్వప్నకుమారము P17
2. స్వప్నకుమారము P19

సంక్రోధాద్భవించే నరకంగ దరియు
నిర్దయునకు చల్లని నీడనే యొసంగు
ఫలరదార్ద్ర శాస్త్రీజాతములు కుమార!
ఇంత యాత్రయు వాత్సల్యమేమి తెలియు?[1]

నాయకుని కామవాంఛను పుత్రవాత్సల్యంలో సమాధానపరుస్తుంది ఈ నాయిక.

స్త్రీ హృదయం వాత్సల్యానికి దయకు కూడా పుట్టిల్లు. కనుకనే

"తొట్టిలో పసిపాపను దొడ్డిలోని
బాలవత్సమున్ దోటలో పచ్చితీవెకల
నేక వత్సల దృష్టిలో సాకినట్టి
ప్రియ కుటుంబినులు - - - -."[2] అంటూ,

చెట్టూ పుట్టలనూ, గొడ్డూ గోదలనూ, పిల్లాపాపలను ఒకే విధంగా వాత్సల్య దృష్టిలో వీక్షించే స్వభావం స్త్రీ సహజం అని అంటారు సుబ్బారావుగారు.

'కచకమలే'లో కమల చినబాబాయి ఉండడానికి నమ్మని 'పూర్ణ' స్త్రీ హృదయం ప్రతిఫలిస్తుంది. చేతనవ్వు వదనంలో విలసిల్లుతుండగా కమలను చేరబిలిచి దగ్గరకు తీసుకుని చెక్కిళ్ళు దువ్వుతూ

"- - - - కమల చుబుకమును బట్టి కాని నను జూడు మను-ను..
ఆయమ బాలికా వదనమందున చూపులు నిల్పి దృష్టిలో
పాయక బుద్ధి ప్పై పెంటికి ఉల్లన దీర్పుకు క్రిందికి రెప్పలన్
బాయక నలంతి చెమ్మటలు పోసుడిచెన్ - - -."[3]

---

1. సన్న్యస్త కుమారము - P 26
2. బుద్ధదీక్ష - ఆంధ్రావళి - P 64
3. కచకమలు - అభినవ కవిత - P 264

అన్న రాయప్రోలువారి వర్ణన స్త్రీలోని అనురాగానికి ముచ్చుతునక. ఈ అనురాగం ఆమెలో జాతిని పెంచడానికి తోడ్పడింది.

'కనకము' (జడకుచ్చులు)లో పిష్టను పట్టుకున్న కుమారునిలో దానిని వదలి వేయుమని 'ఆడువారి మెత్తని గానముల సారళ్యములమి కానగా' పినతల్లి కోరుతుంది. కనికరం కళ్ళలో కదలాడుతుండగా అనునయంలో ఈ విధంగా పలుకుతుంది.

"నా ప్రాణమ్ములు తల్లడిల్లెడిని డెందం బాకులం బాయె క్రీ
డా ప్రేమం డెవ్వగాక యీ వులుకు బిడ్డన్ వేపె దెందాక వం
ద్రీ! ప్రేమార్ద్రము లైన చూపులను నీనిం జూచి పోనిమ్ము బా
ల ప్రాయమ్మును దాటమిన్ కనుల వేలన్ వైచె సోలింతలన్." [1]

ఆమె కరుణా లోలకాడగా దానిని విడిచిపెట్టుమని ప్రాధేయపడుతుంది. ఈ ఖండికలోని పినతల్లి పాత్రలో స్త్రీలోని సరళ స్వభావం కరుణ కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది.

ఇటువంటి ప్రేమార్ద్ర హృదయం అప్పుడప్పుడు స్త్రీని ముందు వెనుకలు సహితం ఆలోచించకుండా చేస్తుంటుంది.

"ముందు వెనుకలు వచ్చుచున్ పోవుచున్న
వారలను జూడ వేడామె వాకిటను
చని కిపోయిన తనయుని చేరపిల్చి
బుద్ధ భగవానుని పేరు చెప్పుచును కప్పె." [2]

'బుద్ధదీక్ష' అనే ఈ ఖండికలో ఒక స్త్రీ పొంగి పొర్లుతున్న దయాహృదయంలో

---

1. కనకము - జడకుచ్చులు P 153
2. బుద్ధదీక్ష - ఆంధ్రావళి P 65

దారిలో వచ్చేపోయే వారిని కూడా గమనించక చలికి వణుకుతున్న గోవును దానిని కాగలించిన వృద్ధుని చలినుంచి కాపాడటానికి తన వస్త్రాన్ని విప్పి కప్పుతుంది. తన సంగతిని పూర్తిగా విస్మరింపచేసింది ఆమె దయాహృదయం. ఈ దయాహృదయం వల్లనేనేమో స్త్రీకి హృదయసౌకుమార్యం సిద్ధించింది. విషాదాన్ని చూడలేకపోవటమే కాక వినికూడా సహించలేని కోమలహృదయం స్త్రీలో కనబడుతుంది. ఆమెలోని ఆ సరళస్వభావం ఈ క్రింది సందర్భంలో వ్యక్తమవుతుంది.

"హృదయపదమ్ము వెన్నవోనదరించి ద్రవింపగ జేయు నామెగ
ద్గదరుతి యార్ద్ర క్షేరనిశితంబగు శోకరసాభావమేనగా
చదివిన యంతసేపును విషాదము లోడుత గంటి నీళ్ళుప
ద్యన్నదకాన నద్దుకొంచు విని యున్ నయనమ్ములు వాప్పి పూర్ణయున్[1]

కవుల అభిలాష పుట్టించ చదువుతుంటే విని కంటనీరు పెట్టిన సరళ హృదయం పూర్ణది.

అయితే ఎంతటి హృదయసౌకుమార్యమున్నా స్త్రీ వివేకహీన కాదు. సుబ్బారావుగారి కావ్యాల్లో అధికభాగం స్త్రీలే వివేకంతో ప్రవర్తిస్తారు. వీరి కావ్యనాయికలు వయసులో చిన్నవారయినా బుద్ధివికాసంలో పరిపూర్ణలు. స్త్రీమూర్తిహృదయ అయిన పూర్ణకంకణ నాయిక నాయకునికి ప్రేమతత్త్వాన్ని విప్పి చెబుతుంది.

"మనసుచే వాక్కుచేత కర్మంబుచేత
కలుషితములు కాదగినవే వలపులవని
తపసుచే జ్ఞానిచే ధ్యానధారచేత

---

1 కష్టకవుల - అభినవకవిత P 268

తనపై మైత్రీమయ భావనది ప్రేమ"[1] *

అని వలపుకు ప్రేమకు భేదాన్ని విస్పష్టం చేయగల వివేకవతి ఆమె. సుబ్బారావుగారు తాము దర్శించిన ప్రేమతత్త్వాన్ని, వాత్సల్యస్వరూపాన్ని అమలిన శృంగార సిద్ధాంతాన్ని, అధికభాగం స్త్రీ పాత్రలతోనే పలికిస్తారు. వీరి కావ్యాల్లో ఉపదేశించే స్థానంలో స్త్రీ, ఉపదేశాన్ని పొందే స్థానంలో పురుషుడూ కనిపిస్తారు. మంచి స్నేహితులుగా మిగిలిపోవడం తమ ప్రేమకు పరమార్థం అని చెప్పిన తృణకంకణ నాయిక 'కనుల నాందారులు చూచువానుట కన్న చెలులకు కావలసింది వేరని భావిస్తుంది. తన సంభాషణాచాతుర్యంలో నాయకుని మనసు మార్చి అతడు 'సోదరీ' అని సంబోధించే విధంగా అతనిలో మానసిక పరివర్తనను తీసుకురాగలిగిన సమర్థురాలు ఆ నాయిక.✓

స్వప్నకుమార నాయిక దప్పిగొని చేరిన విహంగతనయులకు పూల పాలిచ్చే పంకజపు వాత్సల్యాన్ని చూపి మమకార స్వరూపాన్ని, వాత్సల్య సూత్రాన్ని విశదం చేస్తుంది. వాత్సల్యం సృష్టిలో అంతటా చూడగలమని చెప్పి ప్రేమమాధుర్యాన్ని స్పష్టం చేస్తుంది. నాయకునిలో మార్పును తెస్తుంది.

ఏక కనుల ఇంగితం కలది. తాననుకోని విధంగా తనకు ప్రణయ వేళ వచ్చినా దానిని దాచి ఉంచింది. తాను తబ్బిబ్బుపడినా తనమనో భావాలను బయటపెట్టలేదు. తనకు సహాయపడగలదనుకున్న ప్రేమ స్వరూపిణి అయిన మేనత్తకు మాత్రమే - అది కూడా ఆమె బలవంతం మీదనే వెల్లడించింది.

భావుకత (రూపనవనీతమ్) ఎన్నో విషయాలను అతి చక్కగా

---

1. తృణకంకణము - అభినవ కవిత P 245

వ్యాఖ్యానిస్తుంది. ఆమె వివేచనాశక్తిలో విదుషి అని నిరూపించుకుంటుంది. ఆమె 'విశుద్ధ బుద్ధి'లో 'స్నేహపూరంబులో ప్రకాశించుచుండె' అన్న పద్యానికి వైరుధ్యంలో వ్యాఖ్యానం చేస్తుంది. స్నేహలక్షణాన్ని అభివ్యక్తం చేస్తుంది. దాంపత్య ధర్మాన్ని విప్పిచెబుతుంది. 'ప్రేమ శ్రుతి భాష్యం' వినిపిస్తుంది. ప్రణయ సరళిని విశదం చేస్తుంది. జ్యోతిర్మయమైన వాఙ్మయంలో 'కావ్యపర పక్షములు' నిరూపిస్తుంది. కవి స్వరూపాన్ని స్పష్టం చేస్తుంది.

'స్నేహలత'లో గంగానదిని వర్ణించే సందర్భంలో 'మేలు కీడులు నాకటనే యెదిరి యుంటి' అని గంగానది మంచి చెడులను విడమరిచి చెప్తుంది ప్రియంవద. ఆ సందర్భంలో ఆమె విచక్షణ కనబడుతుంది.

స్త్రీలోని దయాగుణం ఆమెలో త్యాగశీలతను పెంపొందిస్తుంది. 'అనుమతి' కావ్యనాయిక అనుమతి తన ప్రియుని కుటుంబానికి సహాయపడడానికి తన జీవితాన్ని త్యాగం చేస్తుంది. తాను ప్రేమించిన వ్యక్తి కారణాంతరాలవల్ల వేరే స్త్రీని వివాహం చేసుకోవడాన్ని సహృదయంతో అర్థం చేసుకుంది. అంతేకాక విధివశాత్తు అతడు మరణించగా అతని భార్యాపుత్రులకు సహాయపడ్డది. స్త్రీ హృదయం కారుణ్యానికి ఆటపట్టని నిరూపిస్తుంది.

అనుమతి ప్రియుని కుటుంబానికై త్యాగం చేస్తే స్నేహలత పితృగృహ పరిరక్షణకై తన జీవితాన్ని పూర్ణాహుతి చేసింది.

"మొన్న అపరాహ్ణమున బాలార్కు నీవు
కాళ్ళు వాయంగ కట్టిన గడపవెల్ల
తిరిగి తిరిగి వేసారి యేతెంచి నట్టి
దైన్యపు మొగము విడదు నా తలపు తంత్రి - - -

..వారు పెండ్లి కానకే యనాది గృహము

సాక్షి పెట్టుట విన నాగవనయ్య నేను" [1]

ఆమె కోమల హృదయం కుమార్తె వివాహం కోసం తిరిగి తిరిగి వేసారి వచ్చిన తండ్రిముఖాన్ని చూడలేక పోయింది. పెండ్లికి కావలసిన ధనానికై ఇల్లు తాకట్టు కావడం విని విచారిస్తుంది స్నేహలత. కన్యలను వరించడానికి శుల్కం కోసం ఎదురుచూస్తారే యువకులను తలచుకుని బాధపడుతుంది. తనకోసం తనవారు దారిద్ర్యాన్ని పొందడం సహించలేక పోతుంది. చివరికి ఆత్మత్యాగమే పరిష్కారమై ఆ మహాపాతకాన్ని ఆపగలదని ఆశిస్తుంది. స్త్రీలో కనవచ్చిన మమకారం, సంస్కరణా ప్రీతి కూడా దీనిలో వ్యక్తమవుతాయి. సహజంగా స్త్రీ సంప్రదాయాన్ని అభిమానించే తత్త్వం కలదే అయినా కొంత సంస్కారప్రియత్వం ఉందని ఈమె చూపుతుంది. స్త్రీలోని సంస్కార హృదయాన్ని చూపి త్యాగశీలతకు పరాకాష్ఠను కలిగించిన పాత్ర స్నేహలత.

స్త్రీలో కనిపించేవి కేవలం శాంతి, క్షమ, దయ, కరుణ త్యాగం వాత్సల్యం వంటి గుణాలే కావు. వలచి వలపించుకోవడం కూడా స్త్రీ జీవితంలో అతిప్రధానమూ, ప్రకృతి సహజమైన లక్షణం. కనుకనే సుబ్బారావుగారు స్త్రీ భార్యగా ప్రేయసిగా తన ప్రేమను వ్యక్తపరచడానికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. అమలిన శృంగార సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన రాయప్రోలువారు భార్యగా ప్రేయసిగా స్త్రీపాత్రను వదలివేయలేదు. స్త్రీలోని ఈ కోణాన్ని కూడా స్పృశించి స్త్రీ వ్యక్తిత్వచిత్రణకు పరిపూర్ణత

---

1. స్నేహలత - అభినవకవిత P 304, 303

కీర్తించారు. స్త్రీలోని శృంగారభావాలను వారి ఖండికలలో అతి రమ్యంగా చిత్రించడం స్త్రీ తత్త్వదర్శనానికి వన్నె తెచ్చింది.

'పెండ్లిలగ్నం'(మిత్రమంజరి)లో భూదేవిని ఇల్లాలుగా అతి మనోజ్ఞంగా చిత్రించారు. గృహిణిగా ఆమె బాధ్యతానిర్వహణను తన సహజ సుందర శైలిలో తీర్చిదిద్దారు.

'కడవలో నీళ్ళలో 2 ముకాలి పీట
వేసి చాకింట భూదేవి తోసియుంచె
భర్తకుపచారములు చేయ ప్రాలుమాల
దెంత పనియున్న భూదేవి యింటిలోన'[1]

ఎంతపనిలో ఉన్నా భర్తకు ఉపచారాలు చెయ్యడంలో స్త్రీ చూపే శ్రద్ధాసక్తులు, అతిథులకు వండి వడ్డించడంలో ఆమె ఓర్పు, నేర్పు, ఇరుగుపొరుగులలో ఐకమత్యం ఈ ఖండికలో ప్రతిఫలించాయి.

'సఖీ సంవరణము', 'రాధ పిలుపు', 'ప్రవాస రాధిక' విరహవేది వంటి రచనల్లో స్త్రీ ప్రేయసిగా ప్రియుని ఆరాధించే విధానం స్పష్టంగా కనిపిస్తుంది.

"నాథుని చేష్టలు నామది నెంచి
ఆనందమే మున్నదియని తలపోతు
--- ఎన్ని తప్పులు పెట్టి ఎంత చేసినను
ఎడబాయ జాలదే హృదయము విభుని
పలు భవములయందు పలుకోసములను
నను కరగించిన నాయకుం డితడె.

---

1. పెండ్లిలగ్నం - మిత్రమంజరి P 60

అభిమాన మెడలిన అవమానమయిన
అఖిల లోకమ్ములు ఆడిపోసినను
నాథునిపై నిల్పి నగ్నమ్ములయిన
నా యనురాగముల్ మాయునే చెలియ!"[1]

తమది జన్మ జన్మల బంధంగా భావించి ప్రియునిపై అనురాగాన్ని స్త్రీ మనసులో ఎంత గాఢంగా నిలుపుకుంటుందో తెలుస్తుంది ఇటువంటి వర్ణనల్లో. ప్రియుడు తనను చేరనప్పటి దైన్యవిషాదాలు కూడా వీటిల్లో ధ్వనిస్తాయి.

ఇంతటి సుకుమార భావాలు కలిగిన స్త్రీ హృదయం కళలకు నిలయం. 'కళలన్నీ కాంతాశ్రితములు కదా' అంటుంది రూపనవనీతంలో భామతి. సుబ్బారావుగారు స్త్రీల కళాకౌశలాన్ని అక్కడక్కడ కీర్తిస్తుంటారు.

"తీరు తీరుల నలంకారముల్ ముగ్గులన్
చిత్రించి మువ్వంపు చేతిచేతల
పూసలతో బొమ్మ పోసిన యట్లు నే
కలని కుట్టుపనులల్లు కౌశలంబు
కైవారములు లేకయే వలయము లచ్చ
దళ రేఖల నమర్చు కలికితనము
పాడేటి రాగాల పాలు తీసిన రీతి
సన్నహారము తీయు జాణతనము
తెనుగు నాటి కులస్త్రీల కనుదినంబు
పసిడి పసుపుగ నెరగారి వన్నెమనసి
నకట...."[2]

---

1. 'సఖీసంవరణము' - జడకుచ్చులు - P 105
2. 'ఆహారము' - ఆంధ్రావళి - P 37

స్త్రీల కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అది క్షీణిస్తోందన్న విచారాన్ని రాయప్రోలు వారు వెలిబుచ్చారు. స్త్రీలలో ఆనంద సౌందర్య సంచయాన్ని పెంచే ఆటపాటలూ వేడుకలూ వినోదాలు కూడా వీరి రచనల్లో చేరాయి.

ఈ విధంగా వీరి కావ్యాల్లో స్త్రీ స్వభావంలోని అన్ని కోణాలు ప్రతిఫలించాయి. వీరి రచనల్లోని స్త్రీ తన సద్గుణాధిక్యంలో కుటుంబ సభ్యులలో మాత్రమే అభిమానింపబడే ప్రేమస్వరూపిణి కాదు. ఆమె తన తేనెధారల పలుకులలో పాలవెన్నెల చూపులలో

"పడుచులకు పిన్న, పేరొలచ్చి నాడెల్ల
వృద్ధజనుల కన్నులయవ్వ, ఇష్ట దైవ
మూరివారి కందరకు నా యోగ్యరాలు..."[1]

తన యోగ్యతలో ఊరికి, నాడకు, ఇరుగుపొరుగు వారలకు కూడా అభిమాన పాత్రురాలయిన వీరి కావ్యాల్లోని స్త్రీ గుణవతే కాదు - రూపవతి కూడా. అయితే ఆమె సౌందర్యస్వరూప వర్ణనలో రాయప్రోలు వారు ప్రత్యేకత కనబరిచారు.

---

1 'అమృతవార్త' - జడకుచ్చులు P 164

# స్త్రీ సౌందర్యవర్ణన

కవి తన ప్రతిభా విశేషంతో ఏ వస్తువుకయినా ఒక రూపాన్ని సృష్టించి పాఠకుల ముందుంచుతాడు. నాయికా నాయకులయినా, దుష్టపాత్రలయినా, ప్రకృతిచిత్రాలయినా, సన్నివేశాలూ సంఘటనలూ అయినా కవి వర్ణనా చాతుర్యం వల్ల సజీవంగా పాఠకుల కనుల ముందు కదులుతాయి. దీనికి ముఖ్యకారణం వర్ణనే. పాత్రలను ప్రత్యక్షం చేయగల ఈ వర్ణనలలో కథను, కావ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఔచిత్యాన్ని పాటించడం కవి కర్తవ్యం.

భారతాంధ్రీకరణ కాలంలో కథానుగుణంగా, పాత్రోచితంగా సాగిన వర్ణనలు క్రమంగా ప్రబంధాలలో అధికమయ్యాయి. కథాబలానికి పాత్రపోషణకు వర్ణించడం కాక వర్ణనకోసం వర్ణన చేయడం పెరిగింది. ప్రబంధాలు అష్టాదశవర్ణనాప్రధానాలు కావడం దీనికి కొంత కారణమయి ఉంటుంది. ఈ వర్ణనల్లో ప్రధానమైనది నాయికల సౌందర్యవర్ణన.

ప్రబంధనాయికలు సౌందర్యానికి ప్రతీకలు. నాయికను అతిలోకసౌందర్యవతిగా, అపురూపసుందరిగా తీర్చిదిద్దాలనే తపనతో ప్రబంధకవులు ఆమె సర్వాంగాలను నఖశిఖపర్యంతం కీర్తించారు. వర్ణనా చాతుర్యాన్ని, పాండిత్యప్రకర్షను, రచనా చమత్కృతిని దృష్టిలో ఉంచుకుని కవులు ఒకరిని మించి మరొకరు నాయిక అంగాంగవర్ణన చేశారు. నాయికలందరూ ఒకేరకంగా కనబడతారు.[1] ప్రబంధకవులు నాయికల గుణాలకంటె శరీరసౌందర్యాన్ని ఎక్కువగా వర్ణించడం ఈ విధమైన

---

1 పాత్రములన్నియు నొకేతీరుం దాల్చిన బొమ్మలు. అలంకార శాస్త్ర ప్రకారము చెక్కబడినవి. ఆయా కావ్యములలోని పాత్రములు (contd)

పాత్రికను సొంత కారణం కావచ్చు. ఏ భాగానికి ఆ భాగంగా సర్వాంగాలను కూర్చి చేసిన వర్ణన ఒక శిలావిగ్రహాన్ని, చిత్రపటాన్ని పాఠకుని కనుల ముందుంచుతుందే గాని సజీవరూపకల్పనగా నిలిచే అవకాశం తక్కువ. ఈ వర్ణనల్లో కూడా అత్యుక్తులే అధికం. చమత్కారమే ఎక్కువ. ప్రబంధ నాయికల వర్ణన పాఠకునికి కవి గొప్పతనాన్ని చాటిచెప్పినంతగా సౌందర్యవతి అయిన నాయికను సజీవంగా కనులముందుంచదు.

ఈ విధంగా సాగిన నాయికల అంగాంగ సౌందర్య వర్ణనలకు భిన్నంగా సహజసౌందర్యవతులైన నాయికల స్వరూపస్వభావాలను రాయప్రోలు సుబ్బారావుగారు వర్ణించారు. వీరి కావ్యనాయికలు అలంకార శాస్త్రగ్రంథాలను అనుసరించి మలచబడ్డవారు కారు. నిత్యపరిచితులు, సజీవ మూర్తులు.

'నాయికల రూపురేఖలు నాగరక వి
లాస శైలులు చిత్రింప లాక్షణికుల
శాస్త్రముల్ తప్పునేల సాక్షాత్సజీవ
మధుర సౌందర్య తరుణీ బింబంబు లుండ'[1]

(cont'd)
విక్షేపములయందుండుటలో బాయని నెంతో పుణ్యవతి! అని కావ్యకుల యందలి పాత్రలను ఒండొంటి ననుకరించునట్టి ప్రతిబింబములు. పేరు ఊరు మాత్రము మార్పియుందురు.... ఆకారములు గుణములు చేతలు నడకలు అన్నియును నలంకారశాస్త్రమను నాకే యంగడిలో నెరవుతేబడిన వస్తువులు. పేర్లు మాత్రము వేరు. వర్ణనయేమో యొకటియే. అవియు నంత శ్రేష్ఠములు కావు - వ్యక్తిత్వము సున్న'....
కవిత్వతత్త్వవిచారము — C. రామలింగారెడ్డి - P23,54

1. తెలుగుబంతి - వనమాల P 25

అంటూ వారు వ్యక్తపరిచిన ఈ భావానికి అనుగుణంగానే వీరి కావ్యనాయికలు చిత్రింపబడ్డారు. ప్రబంధాలలోని నాయికా వర్ణనలలో విసుగెత్తిన రాయప్రోలు వారు 'కేవలు బాహ్యవర్ణనలలో అలంకృతము కాకపోతే కాంతా సౌందర్యము రూపు కట్టదా'[1] అనే తలపులో ఆవిష్కృతమైన వర్ణనలను తావీయలేదు. నాయిక అత్యంత సౌందర్యవతి అని చెప్పాలనే తహతహ వీరిలో తక్కువ. నాయిక అంగాంగ సంకీర్తన దాదాపుగా లేదనే చెప్పవచ్చు. స్త్రీని శిల్పసదృశంగా నఖశిఖపర్యంతం వీరు వర్ణించరు. అసభ్య వర్ణనలకు వీరి రచనలో తావే లేదు. వీరి కావ్యనాయిక సహజసౌందర్యవతి.

'చెవుల కమ్మలు పెట్టని చెలువ కాంత
ముక్కుపుడకలు తీసిన బోసి కాంత
చిన్నబోయిన యా కన్నె వన్నె కాంత
చారుమూర్తిలోనె వింత సింగారమొ తెరకే'[2]

అనునిత్యం కనుల ముందు కనిపించే సహజసౌందర్యవతులయిన స్త్రీలే వీరి కావ్యనాయికలలో పాఠకునికి ప్రత్యక్షం అవుతారు. వీరెన్నుకున్న నాయికలు ఎక్కువ భాగం సాధారణ మధ్యతరగతి స్త్రీలు కావడం దీనికి కారణం అయి ఉండవచ్చు.[3]

పూర్తిగా అలంకరించుకొని ఉన్న స్త్రీలను సుబ్బారావుగారు వర్ణించిన ఘట్టాలు చాలా తక్కువ. వారు వర్ణించిన

---

1. తృణకంకణము - నివేదన - P4
2. కష్టకమలు - అభినవకవిత P 254
3. 'లలిత'లో నాయిక పాత్రము రాజకుమారి. కాని ఆ కావ్యం ఇంగ్లీషు మూలానికి అనుసరించిన రచన.

స్త్రీలు అధికభాగం కష్టాలకు మానసిక వ్యథలకు గురి అయినవారు. వర్ణనను రాయప్రోలు వారు వర్ణనకోసం చేయరు. తమ నాయికలు బాధలను ఎదుర్కోవడంలో వారి సౌందర్యం ఏవిధంగా వన్నె తగ్గిందో చెప్పడానికే ఆ స్త్రీల సౌందర్య సౌకుమార్యాలను ప్రశంసించడం, ప్రస్తావించడం ఎక్కువగా కనబడుతుంది. ఆ వర్ణన నాయిక పొందిన వ్యథను ద్విగుణీకృతం చేస్తుందే కాని నాయిక శరీర అంగాలను పాఠకుని ముందు బయల్పరచదు.

"అడుగులు బొబ్బరెత్త వదనాంచల మందున చెమ్మ చెమ్మటల్
మడుగులుగట్ట మండు కసుమాలపు టెండ.......  *
----- --- --- -- బాకిపడిన యింపులోడి కా
ల్నడకన బోవుచుండె --- ---
పసినిమ్మ పండ్లబోయలు
కాసరెడి యా కుసుమగంధి కోమలపు టొడల్ *
కసుగందిన కవటాకన
వసివాడె నిదాఘతాప పరిపీడన చేత్
కన్నెగేదంగి చెందునా కళుకు లాలయు
ఆ వెలంది యొడల్ నగవేవి లేక
జాలి చెమ్మటు ముత్యాల జంపు సరుల
సహజ సౌందర్యమును వెదజల్లుచుండె" 1 *

ఎండ తీవ్రత, నాయిక పడుతున్న శ్రమ కనులకు కట్టడానికి 'బాకిపడిన యింపు' ప్రస్తావన దోహదం చేస్తుంది. మండుటెండకు శరీరకాంతి ఏవిధంగా వన్నె తగ్గిందో చెప్పడానికే ఆవిడ శరీరం పసినిమ్మ పండు

---

1. వృణాకంకణము - అభినవ కవిత P-227

వంటిదని చెప్పబడింది. చేత మొగలి పూవు వలె తళుకులీనే శరీరం చెమటలో తడిసినట్లు చెప్పడం ఆమె కష్టాన్ని మరింతగా పెంచి చూపుతోంది. ఈ వర్ణనలు ఎండలో నడిచే కన్నెను కనులముందు ప్రత్యక్షం చేస్తాయి. నాయిక ఎంత కష్టానికోర్చి నాయకుని వద్దకు వస్తున్నదో, నాయకుని సాన్నిధ్యంలో నాయిక తన శరీరకష్టాన్ని ఏ విధంగా తృణప్రాయంగా తీసివేసిందో కనులకు కట్టి చూపుతుంది. కనుక 'హాకిడన యింపు', 'పసినిమ్మపండు వంటి శరీరం', 'కన్నె నేవంది', 'ఎండనా కళుకు బాలయు శరీరం' అన్న ప్రయోగాలు ఆ విశేషమైన ప్రయోజనాన్ని సాధించాయి. ఇదే విధంగా 'పతితే'లో

"వాడిన వల్లికారతె పసివాసిన నీదు తనూ విలాసమున్
చూడగ జాలి పుట్టెడు వినూతన చేతన శోభనంబు చూ
రాడెడి నీదు జవ్వనపు టుంతము నారయ వింత యౌను"...

"నలిగిన నలినము గతి మెలం
గుచు మాసి మురుంగు నీదు కోమల తనువు మా
కలి దెప్పులు నొప్పులు కదు
నలసిలి వందందు తిరిగె అడవుల నడుమన్"[1]

ఈ వర్ణనలు నాయకుని వెదుకుతూ అడవులు పట్టిన నాయిక దుర్గతిని ఇనుమడింప చేస్తున్నాయి.

'కన్నె మొగమున సొబగు కందదేమి
పెదవి తాంబూల రాగంబు వదలదేమి
కనుల కాటుక నిగ్గులు కరుగదేమి'...[2]

---

1. 'పతిత' - అభినవ కవిత - P 208
2. కష్టకములు - అభినవ కవిత - P 280

అమాయకురాలైన కోమల మరణం పట్ల జాలి సానుభూతి పాఠకునికి కలిగిస్తున్న వర్ణన ఇది.

అగ్నికాహుతి కాబోతున్నది స్నేహలత. ఆమె శరీరం కాలి నశించబోయింది. అటువంటి నాయిక శరీరాన్ని, ముఖాన్ని-

"పూవుల బోడ చేసినవి వోలె మనోహర మార్దవమ్ములై
ఆ విపులాయతాక్షి తొడలన్నియు సొంపులు నింపుచుండె నీ
లా విశదస్మితంబయి విలక్షణమైన కుమారికా ముఖ
శ్రీ వదనంబు ... ... ... ... ..."[1]

అంటూ సహృదయులలో కరుణను పెంచే విధంగా వర్ణించారు. ఆమె సౌకుమార్యాన్ని కనుల ముందుంచి దేహత్యాగం చేసిన ఆ స్త్రీపై జాలిని పెంపొందింప చేస్తుంది. ఈ విధంగా సాగిన కావ్యనాయికా సౌందర్య వర్ణనలు సార్థకంగా ఉన్నాయి.

అయితే, రాయప్రోలు వారి కావ్యనాయికలు అధికభాగం కష్టాలకు బాధలకు గురి అయినవారే కనుక ఔచిత్యపోషణకు అలా చేశారని కేవలం స్త్రీ సౌందర్యవర్ణన చేసే సందర్భం అవకాశం లభించక పోవడం వల్ల ఆ విధంగా వర్ణించడం జరిగిందని అనుకునే అవకాశం ఉంది.

కనుక బాధల ప్రసక్తి లేని సందర్భంలో రాయప్రోలు వారు స్త్రీల సౌందర్యాన్ని ఏ విధంగా వర్ణించారో పరిశీలించవలసి ఉంది.

'పూచి పూయవు చెలి యొకెట్ ... బాల మోమున
చిరునవ్వుల్ వెలవింకను తేటగా

---

1. స్నేహలత' - అభినవ కవిత P 264

సోలధారల కడిగిరాగ్ పూలపొత్తుల పొందివిరాగ్

బాలికామణి ముఖకళల్ బాల మల్లెల ముపవనిలో

--- దోసపిండియు నునుపులన్ భాసిలున్ చెలి ప్రాయమున్

--- మందమంతయు నడకలో అందమంతయు నునుపులో

--- పూవు పైబడు మహిమనమో ఆవుపిండిన అప్పాలవెమో

అనగ ఆ చెలి చెలువమున్ వెనగె ప్రాయపు చేష్టలన్...[1]

ఈ విధంగా సాగుతుంది సుబ్బారావుగారి స్త్రీ సౌందర్యవర్ణన. ఎక్కడా సభ్యతావరణాన్ని దాటి స్త్రీని వర్ణించరు. వీరి స్త్రీ వర్ణనలో పూవులో తావిలాగా సహజత్వం గుబాళిస్తుంది. తెలుగుదేశపు స్త్రీమూర్తి వీరి వర్ణనా సామర్థ్యం వల్ల పాఠకుల కనుల ముందు కదులుతుంది. ప్రత్యక్షంగా కనులకు కట్టినట్లు సజీవచిత్రణ చేయగల సమర్థత రాయప్రోలు వారి స్త్రీ సౌందర్యవర్ణనలకు ఉంది. పై వర్ణన యౌవనంలోని స్త్రీని అత్యంత సుకుమారంగా రూపకల్పన చేస్తుంది. తెలుగు పల్లెపడుచు సౌందర్యం నిసర్గ రమణీయంగా వర్ణించబడింది.

"బుర్రదుత్త నెత్తిన బెట్టి నవ్వుకనుల

రవిక దాదుగని గాల్ల గుబ్బడి యొకర్తు

పావుచుసఱి పొందైన ముస్తుసడల

కలికి యొబిసెల వసెతాటుగాగ దాల్చి

పిలుదులసి యాడి చీరరాపిళ్ళ పెరయు

కాపు కూతురు పొలముల కావనేగు..."[2]

---

1. 'పల్లెపడుచు' - మిత్రమంజరి P 141, 142

2 'తెనుగుతోట' - అభినవకవిత P 322

అత్యంత సహజంగా సాగిన ఈ వర్ణన ఎక్కడా అసహ్యంగా ఉన్నభావం కలిగించదు. 'రవిక లాగక' వట్టు చెప్పినా, 'పిఱుదులసియాడు' తున్నవన్నా ఇది తెలుగుదేశం లోని పల్లెపడుచు పొలానికి వెళ్ళడాన్ని సహజంగా చూపుతుంది.

నైసర్గిక సౌందర్యాన్ని స్వల్పవర్ణనలలో ప్రదర్శించడంలో నేర్పు రాయప్రోలు వారిది. ఈ వర్ణనల్లో అత్యుక్తులు పదాడంబరం కనపడవు. చలనం చైతన్యం, జీవం మూర్తీభవించి ఉంటాయి. నిశ్చల చిత్రపటాన్ని వర్ణిస్తున్న విధంగా కాక సజీవచైతన్యంలో కళకళలాడే అనుభూతి నందిస్తాయి వీరి సౌందర్యవర్ణనలు

"జిలుగుపూల కలంకారి చీర జాలు
చిందు సందెడు కుచ్చెళ్ళు చెదరనీక
మాటికిని కాల కడియాలు మలుపు కానుచు *
కూతవేటటు చని చేరుకొనియె వనము".[1]

"నడకల తుఱుకలి చరణంబుల కెంపులు పెంప చెన్ని చే
తాడవలి త్రిప్పు కొంచు కళుకుల్ వెదజల్లెడు కన్నులందెడా
పెడ నెఱివోయి తాటుక స్రవింపగ పోవుచుండె ...
... వయసు వాలకముల్ మురిపింప పొంకులన్."[2]

ఈ రకమైన వర్ణన నిశ్చల చిత్రపటాన్ని కాక పఠితకు చలనచిత్రాన్ని చూపుతుంది. స్త్రీ సౌందర్యం దానంతట అదే పఠిత మనసులో రూపు దిద్దుకుంటుంది. చలనాన్ని చైతన్యాన్ని కలిగిఉన్న కల్పన ఇది.

---

1. తృణకంకణము - అభినవకవిత - P 228
2. 'కాపుకన్నె'- మిశ్రమంజరి. - P 143

'ఎఱుపంచుల గళ్ళ పావడా
పసుపారగ నీరసంబులన్
కలహంసిక తుళ్ళినట్లుగా
మృదు తూలికె వంగినట్లుగా
పదమెత్తవె భాగ్యశాలినీ!' [1]

ఈ వర్ణన వన మృదుపదాలతో నాయిక పాఠకుల ముందు నాట్యమాడుతున్న భావాన్ని అందిస్తుంది. సుదీర్ఘ సమాసాలు, శ్లేషాది అలంకారాలే నాయికల సౌందర్యాన్ని చిత్రించగలవనే భ్రమను పటాపంచలు చేస్తుంది ఈ వర్ణన. కేవలం సౌందర్యవతులు గానే కాక, ఆ పాత్రపట్ల ఒక విశిష్టమైన గౌరవాన్ని కలిగిస్తుంది ఇక్కడ కూడా వీరు స్త్రీలను వర్ణించిన విధానం

"ఒక్క పలచని నెమ్మేను పచ్చపసుపు
రామ్మువవె మంగళస్నాయ క్రమ్మరింప
ఇంత వేసి కాటుక కండ్ల యింపు లీడ
ముగువ ఆకలిదప్పులు మాయుచేయు".[2]

"పండు వంటి కుంకుమ బొట్టు నిండు రానిన
వదనమున వేత నవ్వు దాపంక..."[3]

నర్మసచివుని నోట అసభ్యంగా నాయికను వర్ణింప చేసిన ప్రబంధ కవుల శృంగార వర్ణనలకు[4] భిన్నంగా నాయకుడే స్వయంగా నాయికను వర్ణించే

1. 'పదవే చెలి' - వనమాల - P 31
2. పెండ్లిలగ్నం - మిశ్రమంజరి - P 59
3. కేష్టకమల - అభినవ కవిత - P 263
4. వసుచరిత్రలో నూగారు, నాభి, వళులు, జఘన ప్రదేశాలలో సహా గిరిక సౌందర్యాన్ని అంగాంగం నర్మసచివుడు నాయకునికి వర్ణించి (contd)

సందర్భంలో కూడా చక్కని సభ్యత కనబరిచారు. సుబ్బారావుగారు.

తన గుణలతలు పూచిన తోటలో యన
చిరునవ్వు వెన్నెల చెండ్లు విసర
తన మనోలీల కాంచిన రాచ మక్కువన
పలుకు కొమ్మలు పూలపాలు పిదుక
తన భావబంధ మందిన విభ్రమంబున
చూపులు వలపుటుయ్యెలలను వన్న
తన ప్రేమ భావనల్ గను నూత్న కళలన
నగలు ప్రాయంపు మనసునలు సూప
కనుల నలవాల్చి పాతితాక్షముల లోన
కాంచియును కాంచవేని శ్రీగంటి కొసలు
పెదల వాకిటల్ రాల్చెదు వ్రేకేయ
మౌగ్ధ్యమెడబాయ వేసు నా మది లతాంగి![1]

ఇక్కడ నాయికానాయకులు ఆబాల్యస్నేహితులు. నాయికకు మరొకరితో వివాహం జరిగింది. తమకు వివాహం జరగనందుకు చింతిస్తున్నారు

---

(contd)

చెప్తారు. పరపురుషుని చేత నాయిక సౌందర్యాన్ని వర్ణింప చేయడం సబబుగా కనబడదు.

1. తృణకంకణము - అభినవకవిత - P 235

నాయకుడు. నాయికను గూర్చిన తలంపులో వ్యగ్రత చెందుతున్నాడు. ఏకాంతంలో నాయికను స్మరిస్తున్నాడు. ఆ సందర్భంలో నాయిక రూపురేఖా విలాసాలు నాయకుని కనుల ముందు మెదలడం అతి సహజం. అయినా కూడా ఈ సందర్భంలో నాయికపరంగా నాయకుని మనసులో మెదిలి జ్ఞప్తికి వచ్చినది ఆమె శరీర సౌష్ఠవం, సౌందర్యం కాదు. ఆమె నవ్వులు, పలుకులు, చూపులు, నడక, క్రీగంటి చూపులు మాత్రమే అతడు స్మరిస్తున్నట్లు వర్ణించడం రాయప్రోలు వారి సూక్ష్మ సౌందర్య వర్ణనా పాటవానికి మచ్చు తునక.

స్త్రీల సౌందర్యాన్ని వర్ణించడంలో రాయప్రోలు వారు ఏర్పరచుకున్న పద్ధతి చాలా ప్రశంసనీయమయింది. స్త్రీ కన్నులు, కంటిచూపు, శరీరకాంతి, ప్రాయము వంటి వాటిని గూర్చిన వర్ణనలే వీరి రచనల్లో ఎక్కువగా కనబడతాయి. 'చెలువు కాటుక కంటి చూపులు', 'చెంపకు చేరెడు కన్నుల సొంపులు', 'క్రీగంటి చూపులు', 'ఇంత వేసి కాటుక కన్నుల యింపు', 'కులుకు వెదజల్లెడు కన్నులు', 'కడిగిన కాటుక రేకల ముడుపులలో చూపు మెరుగులు', 'క్రాలుగనుల కాటుక నిగారింపు పసలు', 'హాయించూపు సారింపులు' పాఠకుల హృదయాలను 'వలపు ఉచ్చులను పన్ని' బంధిస్తుంటాయి. పచ్చితంగేటి పూరేకు వంటి మేనిలో పసినిమ్మపండ్ల వంటి శరీరకాంతిలో, మొగలిపూవు వంటి దేహకాంతిలో పచ్చి పసుపు కొమ్ము వంటి మంగళ చ్ఛాయలో స్త్రీలు రాయప్రోలు వారి రచనల్లో ప్రత్యక్షమవుతారు.

ఈ విధంగా సుబ్బారావుగారు వర్ణించిన స్త్రీలు సర్వావయవాలలో చక్కని రూపురేఖలలో జీవచైతన్యాన్ని ఇముడ్చుకుని

సజీవమూర్తులుగా సాక్షాత్కరిస్తారు.

'తనదు మెడనున్న కాసుల దండ తీసి
కన్నె కంఠాన బెట్టి కరకంకణల దండ
చెంపలను ముద్దు దెప్పులన్ చెరుగు కాటు
కను పయిట దిద్ది పోయి రమ్మనుచు బంపె' [1]

అనడ సందర్భంలో తల్లి కవులను అలంకరించిన విధంగానే రాయప్రోలు వారు తమ రచనల్లోని స్త్రీలను సజీవంగా అలంకరించారు. వారి శక్తి సామర్థ్యాలనే సొమ్ములను పెట్టి సజీవమందరులుగా వారిని తీర్చిదిద్ది సాహితీజగత్తులోకి పంపారు. ఆ స్త్రీలు,

'దానిమ్మ పూవంటి తరుణి తెమ్మోవి పై
మల్లెపువ్వుల నవ్వు ముల్గు తిరుగ'

పాఠకుల మనోనేత్రాల ముందు సజీవమూర్తులుగా శాశ్వతంగా చిరునవ్వులు చిందిస్తుంటారు.

ఈ విధంగా స్త్రీ సౌందర్యాన్ని సభ్యతాచరణాన్ని దాటకుండా రాయప్రోలు వారు వర్ణించారు. స్త్రీలోని వాత్సల్యం వంటి అపూర్వగుణాలకు ప్రాధాన్యాన్నిచ్చారు. స్త్రీ గౌరవాన్ని సాహిత్యంలో పునః ప్రతిష్ఠించారు. ఆధునిక కవులలో స్త్రీ ఆరాధనా తత్త్వానికి మార్గదర్శకులై నిలిచారు. వీరి ఆలోచనల్లో స్త్రీకి సమున్నత స్థానం ఉండటం వల్ల వీరి భావుకత దృష్టి సమాజంలో స్త్రీల సమస్యల వైపు ప్రసరించి ఉంటుంది.

విద్యా విషయాల్లో పురుషులతో కలిసి స్త్రీలు మెలగుతున్నప్పుడు ఉత్పన్నమయ్యే సమస్యల్లో ప్రధానమయింది ప్రకృతిసహజమైన

---

1. 'కష్టకమల' - అభినవకవిత P-278

పరస్పరాకర్షణం. స్త్రీ పురుషులిలో ఎన్నోరకాల బాంధవ్యాలను కలిగి ఉన్నా ఒక మంచి స్నేహితురాలిగా ఉండటం ఎక్కువగా సాధ్యపడటం లేదు. యువతీయువకుల మధ్య కామరహితమైన స్నేహం నిలిచి వర్ధిల్లాలి. సత్సమాజానికి అది ఎంతో అవసరం. ఇది నెలకొనడానికి యువతీ యువకుల మానసిక ప్రవృత్తిలో మార్పురావాలి. పురుషుని కామదృష్టి వల్ల స్త్రీ కొన్ని సమస్యలను ఎదుర్కొనవలసి వస్తోంది. ఆ సమస్యలను రాయప్రోలువారు తమ తాత్త్విక దృష్టితో పరిశీలించారు. దాని ఫలితమే అమలిన శృంగార సిద్ధాంతం.

# అమలినశృంగార తత్త్వం

12

# అమలిన శృంగారం

"కుశీలవులు కామానికి వశులవుతున్నట్లున్నది. దీనిని అరికట్టాలి. లేకపోతే సమాజం సంకరమవుతుంది" అన్న వివక్షతో రాయప్రోలు వారి అమలిన శృంగార దర్శనం కొనసాగింది. కాయికమైన కామానికతీతమైన ప్రేమకు ప్రాధాన్యం ఇస్తుంది అమలిన శృంగార సిద్ధాంతం. ఇటువంటి దైహిక వాంఛాతీతమైన ప్రేమకు ప్రాముఖ్యం ఇచ్చిన ప్రాచీన ప్రాక్పశ్చిమ తత్త్వదర్శనాలను పరిశీలించినపుడు వైష్ణవ సంప్రదాయంలోని భక్తి తత్త్వంలోనూ, ప్లేటో (Plato) ప్రతిపాదించిన ప్రేమతత్త్వంలోనూ అమలిన శృంగార సిద్ధాంతానికి కొంత పోలిక కనబడే అవకాశం ఉంది. వాటిలో పోలికలను భేదాలను పరిశీలించడం అమలిన శృంగార సిద్ధాంత స్పష్టతకు సహాయపడుతుంది.

## వైష్ణవ సంప్రదాయంలో భక్తి.

వైష్ణవ సంప్రదాయంలోని భక్తితత్త్వంలో ప్రధానమయింది ప్రేమ. వారి దృష్టిలో భక్తికి మూలం ప్రేమ. ప్రేమ లేకపోతే భక్తుడు భగవంతునికి దూరంగానే ఉండిపోతాడనీ, ప్రేమే భక్తునికి భగవంతునికి మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందింపజేస్తుందని వారి విశ్వాసం. ఈ సంప్రదాయం వారు ప్రేమకు ఇచ్చే ఉన్నతస్థానం, దాని స్వరూపం స్పష్టం కావడానికి వారి భక్తిరస సిద్ధాంతాన్ని కొంత పరిశీలించవలసి ఉంది.[1]

ప్రాచీనాలంకారికులలో ఎక్కువమంది భక్తిని

---

1. ఈ భక్తిరస చర్చకు 'Early History of the Vaisnava Faith and Movement in Bengal' By S.K. De గ్రంథం ఆధారం

రసంగా అంగీకరించలేదు. కాని వైష్ణవాలంకారికులు రసానికి సంబంధించిన పదజాలాన్ని, విషయవర్గ విధానాన్ని అలంకారశాస్త్రం నుంచి గ్రహించి కొన్ని మార్పులు చేర్పులు చేసి వాటిని భక్తిభావంలో నిరూపించి, భక్తిని కూడా రసంగా నిర్ధారించారు. శాంతం, ప్రీతి, ప్రేయస్సు, వాత్సల్యం మధుర రసాలను ఐదింటిని 'ముఖ్యభక్తి' రసాలుగా; హాస్యం, అద్భుతం, వీరం, కరుణ, రౌద్రం, భయానకం, బీభత్సరసాలను 'గౌణ భక్తి' రసాలుగా రూపగోస్వామి గ్రహించారు. కాని మధుసూదన సరస్వతి శాంతం, భక్తి కంటె భిన్నమయిందని దానిని భక్తిలో చేర్చలేదు. ఈయన దృష్టిలో భక్తే నిజమయిన రసం. ఇతర దేవతల విషయంలో భక్తి భావమేనని అంగీకరిస్తూ పరానందం కలిగించగల పరమాత్మ విషయంలోని భక్తిమాత్రం రసమేనని మధుసూదన సరస్వతి అభిప్రాయపడ్డారు.[1] భక్తులలో నిక్షిప్తంగా ఉండే హ్లాదినీ శక్తి భక్తునికి సహజసిద్ధమైన ఆనందాన్ని కలుగజేస్తుంది.

భక్తి శబ్దానికి మూలమయిన 'భజ్' ధాతువు 'దాస్యము లేక సేవ' అనే భావాలను తెలియజేస్తుంది. కనుక భగవంతునికి చేసే దాస్యం లేక సేవ భక్తియొక్క ప్రధానలక్షణంగా గ్రహింపబడ్డది. దాస్యం అంటే మనోవాక్కాయకర్మలతో భగవంతునికి సేవచేయడం.[2] మధుసూదన

---

1. "రత్యాదేర్విషయా వ్యభిచారీ తథోర్జితః
భావః ప్రోక్తో రసో నేతి యదుక్తం రసకోవిదైః
దేవాంతరేషు జీవత్వాత్ పరానందా ప్రకాశనాత్
తద్యోజ్యమ్ పరమానంద రూపే న పరమాత్మని"

2. "సాచా కాయిక వాచిక మానసికాత్మికా త్రివిధేవానుగతిర్
ఉచ్యతే"

సరస్వతి భక్తిని ఈ విధంగా నిర్వచించాడు.

"భజనం అంతఃకరణస్య భగవదాకారతా రూపం భక్తిః"

"ద్రుతస్య భగవద్ధర్మాద్ధారావాహికతాం గతా
సర్వేశే మనసో వృత్తిర్భక్తిరిత్యభిధీయతే"

భక్తి పుట్టుకను స్వభావాన్ని బట్టి ఆరోపసిద్ధము, సంగసిద్ధము, స్వరూపసిద్ధము అని మూడు విధాలు. 'ఆరోపసిద్ధభక్తి' బాహ్యంగా ఆరోపింపబడి సాధించింది. 'సంగసిద్ధ' భక్తి పుణ్యపురుషుల సాంగత్యం వల్ల సిద్ధించింది. ఈ మూడు విధాల భక్తులూ కూడా సకైతవ, అకైతవ అని రెండు విభాగాలుగా ఉంటాయి. సకైతవ అంటే ఉపకరణంగా ఉండేది. అకైతవ అంటే ఉపకరణంగా లేనిది. ఏదయినా ఇష్టసిద్ధి కోసం అవలంబించిన మార్గం లేక ఉపకరణంగా ఉండే భక్తి సకైతవభక్తి. వేరే ఏ కోరిక లేక భగవంతుని మీద అనురాగమే ప్రధానంగా ఉన్న భక్తి అకైతవ భక్తి. దీనినే 'అకించన' అని కూడా అంటారు.

'అకైతవ' లేక 'అకించన' భక్తి 'వైధి', 'రాగానుగ' అని రెండు విధాలు. శాస్త్రోక్త విధానాలను అనుసరించేది వైధి[1]. శక్తి సమూహాలు శక్తిమత్ పట్ల ప్రదర్శించే రాగాత్మక భక్తిమార్గం రాగానుగ భక్తి. రాగమంటే తాను కోరుతున్న లేక సన్నిహితమయిన వస్తువు లేక వ్యక్తిపైనగల కోరిక లేక ప్రేమాతిశయం అని అనుకోవచ్చు[2].

---

1. వైధి భక్తిలో పదకొండు అంశాలున్నాయి.
(1) శరణాపత్తి: భగవంతుడే శరణు కోరడం (2) గురుసేవ: ఈ భక్తి మార్గాన్ని తెలిపిన గురువుని సేవించడం (3) శ్రవణం: భగవంతుని రూపం, లీలలు మొదలైన వాటిని గూర్చి వినడం (4) కీర్తన: భగవన్నామాన్ని

(contd)

రాగానుగ రాగాత్మిక అనే పేర్లను బట్టి ఈ భక్తి అంతా రాగమయం అని విశదమవుతుంది. భక్తునికి భగవంతునితో గల సంబంధ బాంధవ్యాలను బట్టి రాగం వివిధ విధాలుగా ఉంటుంది. అందుకే 'ఏషాం అహం ప్రియ ఆత్మా సుతశ్చ సఖా గురుః సుహృదో దైవం ఇష్టమ్' అని ప్రియునిగా, చెలికానిగా, గురువుగా భగవంతుడు భాసిస్తాడని చెప్పబడ్డది. భగవంతుడైన శ్రీకృష్ణుడు గోపికలను, తన భార్యలను ప్రియునిగాను

---

(contd)

సంకీర్తనం చేయడం (౩) స్మరణం: మనస్సులో భగవంతుని పదే పదే స్మరించడం (౪) పాదసేవ: దేవతామూర్తిని స్పృశించడం, ప్రదక్షిణం చేయడం, ఊరేగింపులలో పాల్గొనడం, పుణ్యతీర్థాలను సేవించడం వంటివి. (౫) అర్చన: మంత్రోపదేశం చేసిన గురువు చెప్పినట్లుకాని, ఆగమశాస్త్రంలో చెప్పినట్లుకాని పూజాక్రమాన్ని అనుసరించడం (౬) వందనం: నమస్కరించడం (౭) దాస్యం: దాస్యమంటే ప్రత్యక్షంగా సేవ చేయడమే కాక తాను భగవంతుని సేవకుడననే భావాన్ని కలిగి ఉండడం. దీనికంటె కొంచెం ఎక్కువ మెట్టును చెందింది సఖ్యం (౮) సఖ్యం: స్నేహభావం లేక బంధుభావం. ఆఖరి మెట్టు ఆత్మనివేదన. (౯) ఆత్మనివేదన: తన శరీరం మనస్సు ఇంద్రియాలు ఆత్మ అన్నీ భగవంతుని కొరకే అనే భావం. భగవంతుని చేరడమే దీనికి శ్రేయం.

౨. "యథా చక్షురాదీనామ్ సౌందర్యమ్ తాదృశ ఏవాత్ర భక్తస్య శ్రీ భాగవతాదపి రాగ ఇత్యుచ్యతే"

"విషయినః స్వాభావికో విషయ సంసర్గేచ్ఛాతిశయః ప్రేమా రాగః"

సనకాది మునులకు ఆత్మగాను, యశోదానందులకు పుత్రునిగాను, సుదాముని వంటి గోపబాలకులకు సఖునిగాను, ప్రద్యుమ్నునికి గురువుగాను, సుభద్రను సహోదరుని గాను కనిపించినట్లు వివరించబడింది.

బెంగాల్ వైష్ణవ సంప్రదాయంలో భక్తునికి భగవంతునితో ఉండే దశలు ఎక్కువ ప్రాధాన్యాన్ని పొందాయి. ఈ దశలను పరిగణించక పోతే ఆ సంబంధం నీరసంగా ఉంటుందనీ, వివిధ భక్తుల భక్తి తీవ్రతలను నిర్ణయించడం సాధ్యం కాదని వీరి ఉద్దేశం. భగవంతునితో భక్తుడు భావించుకున్న బాంధవ్యాన్ని బట్టి వారి భక్తి వైశిష్ట్యం వెల్లడవుతుంది. ఆ బాంధవ్యం ఎంత శ్రేష్ఠమైనదయితే భక్తి అంత విశిష్టమైనదిగా పరిగణింపబడుతుంది. భక్తునికి ఉన్న భావసంబంధాన్ని పరిగణించక పోవడం వల్లనే శాంతభక్తి మిగిలిన నాలుగు రకాల భక్తిమార్గాలకంటె హీనమయిందిగా వీరిలో కొందరు భావించారు.

దాస్యం నీరసమైన శాంతభక్తి కంటె హెచ్చుస్థాయిలోది. ఇది కాక సఖ్యం, వాత్సల్యం అని రెండు దశలున్నాయి. అన్నిటికన్న పరమోత్కృష్టదశ శృంగారపరమైన మధురభక్తి. గోపికలకు శ్రీకృష్ణుని పైగల అనురాగం ఈరకమైన భక్తికి ప్రతీక. భక్తుడు స్త్రీ పురుష భేదం లేకుండా మాధుర్యభక్తి మార్గాన్ని అనుసరించి మధురభావాన్ని పొందవచ్చు. ఈ దశలో భగవంతునికి భక్తునికి మధ్య ఆకర్షణ పెరిగి భగవత్తత్త్వం ఆత్మనివేదనాజనితమైన మధురభావంలో కప్పివేయబడుతుంది. భక్తుడు ప్రేమభావం వల్ల ఆనందానుభవం పొంది భగవంతుని నిజరూపాన్ని దర్శించుకుంటాడు. భగవంతుని మీద ప్రీతిభావం కలవాడు వేరే ఏ వస్తువును గాని, వ్యక్తిని గాని ప్రేమించలేడు. ఈ సంప్రదాయవాదుల దృష్టిలో భగవంతుని మీద ప్రీతి లేకుండా ముక్తి లేదు. కైవల్యం

నిష్కల్మషమైన ప్రేమలో కూడిన నిజమైన భక్తిలో పొందవచ్చును. తాను ప్రేమించే వ్యక్తి సంతోషం కోసం స్వార్థరహితమైన ప్రీతిలో వ్యవహరించడం ప్రియత యొక్క ముఖ్య లక్షణం. ఈ ప్రయత్నంలో భక్తుడు తన సుఖసంతోషాలను లెక్క చేయడు. స్వార్థరహిత సేవే దీనిలో ప్రధానం. ఈ ప్రీతి భగవంతునికి చాలా సంతోషాన్ని కలుగచేస్తుంది.[1]

భగవంతుని మీద ఉండే ఈ ప్రేమ వాత్సల్యంగా గాని స్నేహంగా గాని, శృంగారంగా గాని భాసించవచ్చు. భగవంతుని ప్రియునిగా భావించే భక్తుల్లో భక్తి పరాకాష్ఠను పొందుతుంది. దీనిని 'కాంతభావము లేక మధురరతి' అని అంటారు. రూపగోస్వామి దీన్ని 'ప్రియత' అని అన్నారు. ఈ భావం మహాభావం అనే అత్యున్నత దశను పొందుతుంది. భక్తి క్రమపరిణామంగా పొందే దశల్లో అది ఉన్నతమయింది.[2] వైష్ణవ భక్తి రస శాస్త్రంలో చెప్పబడిన

---

1. "భాగవతో ప్రానంద చమత్కారితా తస్య భక్తేః స్ఫూయతే"
2. భక్తి భావం క్రింది ఎనిమిది దశల్లో క్రమపరిణామాన్ని పొందుతుంది.
   (1) రతి: మానసికోల్లాసాన్ని కలుగచేస్తుంది (ఉల్లాసయతి)
   (2) ప్రేమ: మమతను పెంపొందిస్తుంది. దేవుని తనవానిగానే భావించడం జరుగుతుంది. (మమతయా యోజయతి)
   (3) ప్రణయము: నమ్మకభావం కలుగుతుంది (విశ్రంభయతి)
   (4) మానము: మధురాధిక్యం చేత కలిగే సున్నితత్వంలో వివిధ అనుభూతులను అనుభవించడం
   (5) స్నేహము: హృదయం ద్రవించడం (ద్రవయతి)
   (6) రాగము: కోరిన వస్తువు, వ్యక్తి లేక దేవుని పొందవలెననే అభిలాషను కలిగించేది.
   (7) అనురాగము: ప్రేమించిన వ్యక్తి నిత్యనూతనంగా ఉండాలనే భావం.

(contd)

ఐదు ప్రధాన భక్తిరసాలు ఐదు ప్రధానభావాల నుంచి పుట్టాయి. వీటి నన్నిటిని కలిపి ప్రేమభక్తి లేక ప్రీతి అని అంటారు. శాంత, దాస్య, మైత్రి వాత్సల్య మాధుర్యాలు ప్రతి ఒకటీ శ్రీకృష్ణునితో సంబంధం కలిగిఉంటే రతి అని చెప్పబడతాయి.[1]

భాగవతం భక్తిమార్గాలను నవవిధాలుగానే పేర్కొన్నది.[2] రూప గోస్వామి ఐదు మాత్రమే ప్రధాన భక్తిరసాలని నిర్ధారించాడు. మిగిలిన

---

(contd)

(ప్రతిక్షణమ్ ఏవ స్పృహయమ్ నవ నవత్వేనానుభావయతి)

(8) మహాభావము: సంభాషాస్పర్శాదికాల వేళ కలిగిన ఉన్మాదావస్థ

(అసమోర్ధ్వ చమత్కారేణోన్మాదయతి)

1 "The five primary Bhakti Rasas or devotional sentiments in the Vaishnava Sastra, sublimated from the five basic feelings and in their totality they are called Prema Bhakti or Priti. The five kinds of devotional feelings mentioned above namely Santa, Dasya, Maitrya, Vatsalya and Madhurya are called Sthayi Bhavas in the Rasa Sastra and as such each of them is a Rati in relation to Krsna". (P.400.)

2. "తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్, సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్, హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా!"

ఏడూ గౌణరసాలనీ, వాటిని అయిదు ముఖ్యరసాల పరిధిలోకి చేర్చవచ్చునని రూపగోస్వామి అభిప్రాయం.[1] ఒకే పురుషునిలో ఒకటి కన్న ఎక్కువ రసాలుండవచ్చు. సఖ్య, దాస్య, వాత్సల్యాలు బలరామునిలో; వాత్సల్య, సఖ్యాలు యుధిష్ఠిరునిలో, భీమునిలో; సఖ్యం, ప్రీతం అర్జునుడు, నకులుడు, సహదేవులలో కనబడతాయి.

కృష్ణవిషయ రతి స్థాయీభావంగా ఏర్పడే భక్తిరసాల వర్ణాలు, అధిదేవతలను గూడా వైష్ణవాలంకారికులు నిర్ణయించారు.[2] ముఖ్యభక్తి

---

1. "అమీ పంచైవ శాంతాద్యా హరేర్భక్తి రసామతాః
ఏషు హాస్యాదయః ప్రాయో బిభ్రతి వ్యభిచారితామ్"

2.

| ముఖ్యభక్తిరసాలు | వర్ణం | అధిదేవత |
|---|---|---|
| (1) శాంతం | శ్వేతం | కపిలుడు (విష్ణువు) |
| (2) ప్రీతి | చిత్రవర్ణం | మాధవుడు |
| (3) ప్రేయస్సు | అరుణం | ఉపేంద్రుడు |
| (4) వాత్సల్యం | శోణం (రక్తవర్ణం) | నృసింహుడు |
| (5) మధుర లేక ఉజ్జ్వల | శ్యామవర్ణం | కృష్ణుడు |

| గౌణభక్తిరసాలు | వర్ణం | అధిదేవత |
|---|---|---|
| (1) హాస్యం | బూడిదవర్ణపు తెలుపు | బలరాముడు |
| (2) అద్భుతం | పింగళ | కూర్మావతారం |
| (3) వీరం | గౌరవర్ణం | కల్కి అవతారం |
| (4) కరుణ | ధూమ్రవర్ణం | రాఘవుడు |
| (5) రౌద్రం | రక్తవర్ణం | భార్గవుడు |

(contd)

రసాల్లో దాన్ని అంతర్భాగాలు కూడా ఉన్నాయి.

<u>శాంతం</u>: ఇది రెండు విధాలు (1) పరోక్షం- దేవుని దివ్యస్వరూపం కనబడక పోవడం (2) సాక్షాత్కారం- భగవంతుని దివ్యదర్శనాన్ని పొందడం. దీనికి స్థాయీభావం కృష్ణవిషయరతి. ఇది సమం కాని సాంద్రం కాని కావచ్చు.

<u>ప్రీతం</u>: (ప్రీతి). సేవాభావంతో కూడిన భక్తి. ఇది సంభ్రమ ప్రీతమూ, గౌరవప్రీతమూ అని రెండు విధాలు. దాస్యభావంతో కూడి ఉంటే సంభ్రమప్రీతం. దీనికి స్థాయీభావం ప్రీతి. దీనిలో కృష్ణుని పట్ల యజమాని లేక అధిపతి అనే గౌరవం ఉంటుంది. లాలనతో కూడిన సంరక్షణాభావయుక్తం గౌరవప్రీతం. దీనికికూడా స్థాయీభావం ప్రీతి. తక్కువ స్థాయిలో గల బంధువుకు కృష్ణునిపట్ల గల గౌరవం లేక ప్రేమను గౌరవప్రీతంగా చెప్పవచ్చు.

<u>ప్రేయస్సు</u>: ఇది సఖ్యం వల్ల కలిగే భక్తి. దీనికి స్థాయీభావం సఖ్యరతి లేక స్నేహం; విశ్వాసం అనే భావన.

---

(contd)

| | గౌణభక్తిరసాలు | వర్ణం | అధిదేవత |
|---|---|---|---|
| (6) | భయానకం | కాలవర్ణం | వరాహావతారం |
| (7) | బీభత్సం | నీలవర్ణం | మత్స్యావతారం |

ఈ గౌణరసాలు ముఖ్యభక్తిరసాల పరిధిలోకి చేర్చవచ్చునని ఈవిధంగా వివరించబడింది. అద్భుతరసం అయితే ముఖ్యరసాలన్నిటిలోనూ; హాస్యం సఖ్యంలో, వాత్సల్యంలో; భయానకం వాత్సల్యంలో; బీభత్సము శాంతంలో; రౌద్రం కొంత వాత్సల్యంలో కొంత మధురంలో చేర్తాయి.

<u>వాత్సల్యం</u>: వాత్సల్యం అంటే తల్లిదండ్రులకు సంతానంపై ఉండే అనురాగం. దీని స్థాయీ భావం వాత్సల్యరతి లేక తల్లిదండ్రులకు గల దయ, జాలి.

<u>మధుర రసం</u>: ఇది శృంగార సంబంధమైన అనురాగం. దీనికి స్థాయీ భావం ప్రియత, ప్రేమ లేక మధుర రతి. ఇది అన్ని భక్తిరసాలకన్న ఉత్కృష్టమైనది.[1]

---

1. సనాతన గోస్వామి రచించిన 'బృహద్భాగవతామృతము'లో రెండు భాగాలున్నాయి. మొదటి భాగంలో శ్రీకృష్ణుని భక్తుల్లో ఎవరు శ్రేష్ఠులో అన్వేషిస్తున్నట్లు చెప్పించబడింది. తరువాత భాగంలో ప్రయాగలో గంగాతీరాన మహర్షుల సమక్షంలో గడిపిన ఒక బ్రాహ్మణ భక్తుడు తిరిగి వస్తూ ఉంటాడు. మార్గమధ్యంలో అతనికి నారదుడు ఎదురు వస్తాడు. నారదుడు ఆ బ్రాహ్మణుని గొప్ప కృష్ణభక్తునిగా కీర్తిస్తాడు. తాను నిజమైన కృష్ణభక్తుడు కాదని తనకంటె గొప్ప భక్తుడు దక్షిణ దేశంలోని ఒక యువరాజని ఆ బ్రాహ్మణుడు సమాధానం చెబుతాడు. నారదుడు ఆ యువరాజు దగ్గరకు వెళ్తే అతడు, ఇంద్రుడు తనకంటె గొప్ప భక్తుడని అంటాడు. స్వర్గలోకంలో ఇంద్రుడు బ్రహ్మదేవుడు నిజమైన కృష్ణభక్తుడని సమాధానమిస్తాడు. బ్రహ్మ శ్రీకృష్ణునికి ఇష్టుడు భక్తుడు శివుడేనని చెబుతాడు. శివపార్వతుల దగ్గరకు నారదుడు వెళ్తే ప్రహ్లాదుడే అసలు భక్తుడని అంటారు. ఈ విధంగా అన్వేషిస్తూ నారదుడు ప్రహ్లాదుని నుండి హనుమంతుని (దాస్య భక్తి కలవానిగా) అక్కడి నుంచి పాండవులను (సఖ్యంలో ఇష్టులని) వారి దగ్గర నుంచి యాదవులను (ప్రీతి, ప్రేయస్సు కలవారని) అక్కడి నుంచి ఉద్ధవుని, తరువాత గోపికలను; అందులోనూ ప్రధానమైన రాధను చేరతాడు నారదుడు. రాధను చేరడంలో నారదుని అన్వేషణ ముగుస్తుంది. మధురభావంలో గోపికలు, రాధ శ్రీకృష్ణునికి ప్రియాతిప్రియ భక్తురాండ్రుగా తేలుతుంది.

(contd)

గోపికలకు, రాధకు కృష్ణునిపైగల అనురాగం ఈ విధమైనది.

ఈ మధురరతి నాయికలను బట్టి సాధారణి, సమంజస సమర్థ అనే భేదాలు కలిగి ఉంటుంది.

సాధారణి : ఉదాహరణ-కుబ్జ. దీనిలో ఆనందం ఒకరిదే. ఇది ప్రేమస్థాయిని చేరుతుంది.

సమంజస : ఉదాహరణ - రుక్మిణీ కృష్ణుల దాంపత్య అనురాగం. దీనిలో ఆనందం ఇద్దరిదీ. ఇది అనురాగస్థాయికి చెందుతుంది.

సమర్థ : ఉదాహరణ - రాధ, గోపికలు. కృష్ణుని సౌఖ్యం కోసం గోపికల ప్రయత్నాలు ఈ విభాగం లోకి వస్తాయి. దీనిలో శ్రీకృష్ణుని సౌఖ్యమే దృష్టిలో ఉంటుంది.

---

(contd)

గోపికలు, రాధ మధురభక్తిమార్గంలో ఇష్టులయ్యారని స్పష్టం చేయడానికే ఈ కథ కల్పింపబడింది." Here Narada discovers at last that the most beloved of Krsna are Gopis who have attained the Madhura Bhava and among whom the chief is Radha. The narrative is obviously intended to explain the chief characteristics of a Bhakta and the different stages of devotional attainment, ending in the Madhura or erotic attitude of the Gopis towards Krsna... Hence those who desire to worship Krsna must also worship fair damsels of Vraja. But of those Vraja-Sundaris again Radha is the greatest which conclusion indicates that there is no greater Bhakta of Krsna than

(contd)

ఈ భక్తిరసానికి మధుసూదనసరస్వతి విభావాదులను నిర్ణయించాడు.[1] ఈ విధంగా నిరూపింపబడిన భక్తిరసానికి ప్రేమ ప్రాతిపదికగా కనబడుతుంది. ప్రేమ లేని భక్తి సాయుజ్యం ఇవ్వదని వీరి ఉద్దేశ్యంగా తోస్తుంది. ప్రేమరహితుడైన భక్తుడు దూరంగా నిలిచి భగవంతుని అనుగ్రహానికై నిరీక్షిస్తూ ఉంటాడు. ప్రేమతో కూడుకున్న భక్తి ప్రణయంగా మారి భక్తుడు ప్రేయసిగా భావించుకుని ప్రియునిలో సాన్నిహిత్యాన్ని భగవంతునిలో అనుభవిస్తాడు. కాబట్టి దాస్య సఖ్య, వాత్సల్య మధుర భక్తిభేదాల్లో నాయికా నాయక భావంతో కూడిన మధురభావం భక్తికి పరాకాష్ఠ. దీనిలో సాంఘిక, నైతిక ధర్మాలను భగవంతునికై త్యజించడం విశిష్టత. 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అనే గీతాసూక్తికి ప్రత్యక్ష నిదర్శనాలు గోపికలు, రాధ వంటివారి మధుర భక్తిమార్గాలు. గోపికలు తమ సాంఘిక బంధాలను, ధర్మాలను వీడి, అనన్యభక్త

---

his eternal consort Radha".

'Early history of Vaisnava Faith & Movement in Bengal'. By S.K. De, P 198.

1. 'విభావో ద్వివిధః - ఆలంబన విభావః ఉద్దీపన విభావశ్చ తత్ర ఆలంబన విభావో భగవాన్ ఉద్దీపన విభావః తులసీచందనాదిః అనుభావో నేత్ర విక్రియాదిః వ్యభిచారిణో భావాః నిర్వేదాదయః వ్యక్తీభవన్ భగవదాకారతా రూపరసాఖ్యః స్థాయీ భావః పరమానంద సాక్షాత్కారాత్మకః ప్రాదుర్భవతి స ఏవ భక్తియోగ ఇతి తం పరమం నిరతిశయం పురుషార్థం వదంతి రసజ్ఞాః'.

సాహిత్యదర్శనము. K.V.R నరసింహము P 189

మయిన ఆ పరమాత్మ ప్రీతిలో తాదాత్మ్యాన్ని పొంది తరించారు. కృష్ణుని తారుడనడంలో సంకేతార్థం తీసుకొనక అఖండార్థం చెప్పుకుంటే 'తారయతి శిథిలయతి ఆధ్యాత్మికాది తాపత్రయాన్ ఇతి తారకః. ఆధ్యాత్మికాది తాపం పోగొట్టేవాడు కనుక శ్రీకృష్ణుడు తారుడు'.[1] కనుక ఇది ఆధ్యాత్మికమయిన అద్వైతసిద్ధి. 'భక్తి అనునది ఒక విశిష్టమైన చిత్తపరిపాకం. యౌవనంలో ఉన్న యువతి మనోహరుని మధురానురాగం కోసం ఎలా రతిభావాన్ని భజిస్తుందో అన్వేషణలో ఆర్తమైన అంతరాత్మ అలా ఆ పరంజ్యోతి పరిష్వంగం కోసం పారవశ్యంలో పలవరిస్తుంది.... రతిచ్ఛాయ జంజకం చేత పైకి అది శృంగారంగా కనబడుతుంది. కాని అది లోకంలో ప్రేయసీ ప్రియుల మధ్య కనబడే భౌతికమైన రతి కాదు. జీవాత్మ పరమాత్మల సమైక్యం కోసం అంతరమైన చైతన్యం అభిలషించే అవ్యక్తమైన ఆధ్యాత్మిక రతి.... ఈ భక్తి ఇంద్రియ తృప్తి కోసం లక్షించింది కాదు. భవబంధ విముక్తి కోసం ప్రవర్తించింది.'[2] ఈ విధంగా వైష్ణవాలంకారికులలో భక్తి రసంగా - అందులోనూ మధురభక్తి శ్రేష్ఠంగా నిరూపింపబడింది.

వైష్ణవ భక్తిరస సిద్ధాంతంలో పరమోత్కృష్టంగా నిరూపింపబడిన మధురభక్తి కేవలం సిద్ధాంతపరమైనది మాత్రమే కాదు. ఈ భక్తిమార్గంలో పయనించి గమ్యం చేరిన చాలామంది భక్తులు చరిత్రలో కనబడతారు. వారిలో కొందరిని గూర్చిన వివరణ మధురభక్తి తత్త్వాన్ని మరింత స్పష్టం చేస్తుంది. ఉదాహరణగా చూపడానికి దక్షిణభారతదేశంలో ప్రసిద్ధిపొందిన 'ఆండాళ్', ఉత్తరభారతంలో ప్రఖ్యాతి పొందిన 'మీరాబాయి' లను పరిశీలనను

---

1. 'వ్యాస వింశతి'- కృత్తివాస తీర్థులు P 136
2. 'మందార మకరందాలు' పీఠిక G.V. సుబ్రహ్మణ్యం P 9

గ్రహించడం జరిగింది. శివుడిని ఇదే పద్ధతిలో ఆరాధించి తరించిన 'అక్కమహాదేవి' చరిత్ర ఆ మార్గం కేవలం విష్ణుభక్తులకే పరిమితం కాదని చూపుతుంది. ఈ ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకుని శైవభక్తురాలైన అక్కమహాదేవిని గూర్చికూడా కొంత వివరించడం జరిగింది. ఈ విధంగా విషయస్పష్టత దృష్ట్యా, ఆండాళ్, మీరాబాయి, అక్కమహాదేవి - ఈ ముగ్గురి భక్తివైశిష్ట్యం ఇక్కడ ప్రస్తావించబడుతున్నది.

## ఆండాళ్

"ఆళ్వారు అను శబ్దమునకు భగవానుని అనంత కల్యాణ గుణసముద్రమున లోతుగా మునిగినవాడు అని అర్థము. దానికి స్త్రీలింగము 'ఆండాళ్'. ఈ జాతి వాచకము పదునొకండు మహాసాధువులన్వయించు ఆళ్వార్ శబ్దము వలె కాక ఒక మహాభక్తురాలికే అన్వయించుచుండుట భగవానుని భార్యగా వెలుగొందు ఆ దివ్యవనితకు కల ఉన్నతాధ్యాత్మిక స్థానమును వేనోళ్ళ చాటుచున్నది."[1]

లక్ష్మీదేవిగా పూజలందుకుంటున్న ఆండాళ్ కు ఇంకొకపేరు గోదాదేవి. భవబంధాలన్నింటినీ త్యజించి శ్రీకృష్ణుని గోపికలు భజించిన విధంగా గోదాదేవి శ్రీరంగేశ్వరుని ధ్యానించింది. అతడే తన సర్వస్వం అని నమ్మింది. మనోవాక్కాయ కర్మలా శ్రీరంగనాథుడే తన భర్త అని భావించిన ప్రేమ తపస్విని గోదాదేవి. తండ్రి అయిన విష్ణుచిత్తుడు చెప్పిన ధనుర్మాస వ్రతాన్ని అభిమానించి ఆచరించింది. భక్తిపారవశ్యంలో రోజుకొక్క పాశురాన్ని రచించి పాడింది. ఆ దివ్య ప్రబంధమే తిరుప్పావుగా నేటికీ ప్రసిద్ధంగా గానం చేయబడుతోంది.

భగవంతుని గూర్చిన తన మానసికానుభూతులను తన

---

1. 'శ్రీకృష్ణుని పవిత్రాంగనలు' - ఆండాళ్ (వ్యాసము) స్వామి పరమాత్మానంద

P ౨౦

కలలలో వెల్లడించింది. తనకు భగవంతునితో పెండ్లి అయినట్లే భావించి ఆ వృత్తాంతాన్ని తన చెలికత్తెలకు చెప్పింది. భగవంతుని అధరసుధారసాస్వాదనకు అర్హంగా ఉన్న పాంచజన్యాన్ని వైభవాలడగమని వేడుకుంది. తన విరహాన్ని వ్యక్తపరచి తనను శృంగారనాయకుడైన శ్రీవేంకటేశ్వరుని సన్నిధికి చేర్చమని మన్మథుని కోరింది. కృష్ణసంబంధం గల తులసిని గాని పీతాంబరాన్ని గాని తెచ్చి తన ప్రాణాలను కాపాడమని చెలులను వేడుకుంది. తను శ్రీరంగేశునికి నిర్ణీతవధువుననే భావించేది. ప్రాణాలను నిలుపుకొనడానికి శ్రీరంగేశునితో ఒక్క పలుకయినా పలకాలని తపించింది. కృష్ణభగవానుని పదద్వయాన్ని స్పృశించాలని వాంఛించింది.

తన భావనాశక్తిచేత గోపికలు పొందిన అనుభవాన్ని పొందింది. తన పాశురాలలో గోపికాముఖంగా తన మనోవాంఛలను వ్యక్తం చేసింది. ధనుర్మాస వ్రతానికి కావలసిన వస్తువులలో ఒకటయిన 'పఱై' (తప్పెట) నెపంగా పెట్టుకుని శ్రీకృష్ణుని సాంగత్యాన్ని గోపికలు ఏవిధంగా అభిలషించారో కొన్ని పాశురాలలో మధురంగా వర్ణించింది. ఈ భాగాలలో గోపికాహృదయం, గోదాదేవి ధ్యేయం స్పష్టంగా గోచరమవుతాయి.

"ప్రభూ! నీ గుణగణముల పాడుకొనుచు వచ్చునపుడు చలియో, తాపమో, శ్రమమో ఏదియును కొంచమైనను తెలియలేదు. నీ వద్ద...నిన్నే యాచించుచూ వచ్చితిమి...... తప్పెటయా- అది నెపము మాత్రమే. నిన్ను పొందుటకు ప్రతిబంధకములుగ నుండు వానినన్నిటిని తొలగొట్టి మా శ్రమ యంతయు తీరునటుల మమ్ము అంగీకరింప కృప చేయవలయును". అని ప్రార్థించుచున్నారు... (గోపికలు)

"'పఱై' మా పరమోద్దేశము కాదు. శ్రీకృష్ణుని దివ్యపాదారవిందముల యందలి నిత్యకైంకర్యమే మా పరమోద్దేశము". అని మనవి చేయుచున్నారు. "ఇటుపై ఒక క్షణమైనను కృష్ణుని విడిచి మేము ఎడబాయక నిత్యకైంకర్యము చేయుచుండ వలయును".. మంచును, చలిని లక్ష్యపెట్టక వచ్చినటుల చెప్పుటలో తమ విరహతాపమును వ్యక్తీకరించుచున్నారు.

.... మమ్ము నీవు స్వీకరించుటయే మహాప్రసాదము. అంతియే గాని మేము నీవద్ద నీ కంటె వేరు ప్రయోజనముల నపేక్షించెదమని తలంచి యుంటివా......అని సంబంధమును నీతోడనే మాకు కావలయును".[1] ఇక్కడ గోపికల ప్రస్తావన ఉన్నా మానసికంగా ఆ స్థానంలో ఉన్న వ్యక్తి గోదాదేవే. కనుక భగవంతుని పొందడమే ఆమె భక్తికి లక్ష్యం. చివరికి తన కోరిక నెరవేర్చుకున్నది. శ్రీరంగేశునిలో ఆధ్యాత్మిక సమ్మేళన సిద్ధించింది. తన మనః ప్రాణాల నాకర్షించిన ఆ భగవంతుని చేరి మానవసృష్టికి అంతర్థానమయింది. భక్త్యావేశాలలో తన ప్రియునికి తనను తాను సమర్పించుకొనిన పవిత్రమూర్తి ఆండాళ్.

---

1 " --- --- --- --- --- ఉన్నై

అరుత్తిత్తు వన్దోమ్ పఱై తరుది యాగిల్

తిరుత్తక్క శెల్వముమ్ శేవకముమ్ యామ్ పాడి

వరుత్తముమ్ తీర్న్దు మగిళ్న్దు ఏలోరెమ్బావాయ్

పెఱ్ఱమ్ మేయ్త్తు ఉణ్ణుమ్ కులత్తిల్ పిఱన్దు నీ

కుఱ్ఱేవల్ ఎఙ్గళై క్కొళ్ళామల్ పోగాదు

ఇఱ్ఱై ప్పఱై కొళ్వాన్ అన్ఱుకాణ్ గోవిన్దా

ఎఱ్ఱైక్కుమ్ ఏళ్ళేళ్ పిఱవిక్కుమ్ ఉన్దన్నోడు

ఉఱ్ఱోమే యావోమ్ ఉనక్కేనామ్ ఆట్చెయ్ వోమ్

మఱ్ఱై నమ్ కామఙ్గళ్ మాఱ్ఱు ఏలోరెమ్బావాయ్".

28, 29 పాశురములు

'తిరుప్పావై తిరువెమ్బావై' - ఆంధ్ర అనువాదకుడు - శ్రీ సుదర్శనాచార్య శిరోమణి.

P85 టు 98

## మీరాబాయి

సర్వోత్తమమైన మధురభక్తిమార్గంలో భగవంతుని ఆరాధించినవారిలో మీరాబాయి ప్రసిద్ధురాలు. ఆత్మార్పణలో భగవత్సన్నిధి చేరిన భక్తురాలు ఈమె. జనాపవాదభీతిని వదలి, సాంసారిక బంధాలను తెంచుకొని తన ప్రణయాన్ని తన మనోనాథుడైన గిరిధారికి నివేదించుకున్నది. నిర్భయంగా నిర్మలప్రేమతో కృష్ణుడిని ఆరాధించింది. అతడినే తన ప్రేమికునిగా ప్రాణేశ్వరునిగా ధ్యానించింది. తనను తాను శ్రీకృష్ణునికి సఖినని, సతినని భావించుకొంది. తనది జన్మాంతర సంబంధంగా ఊహించుకుని గిరిధరునితో వియోగాన్ని భరించడం సాధ్యంకాదని తలచింది.

"ప్రభూ! నీ ప్రేమకై సమస్త సౌఖ్యములను విడనాడినాను. నన్ను నిష్కారణముగా ఏల వేధించెదవు? వియోగ వ్యథాగ్ని నా హృదయమును దహించుచున్నది. వచ్చి దానిని చల్లార్చుము. ఇపుడు నన్ను నీవు విడనాడజాలవు. ప్రభూ! నన్ను నీలో కలుపుకొనుము....[1]

తన ప్రియుడు తన హృదయంలోనే సుస్థిరుడై ఉన్నాడని నిశ్చయం చేసుకుంది. 'గిరిధరుడు తప్ప నాకొరుతెవరు లేరని' నమ్మి ఆ దేవదేవుడినే ఆరాధించింది. తన అనుభూతులను, ఆనందాన్ని, విషాదాన్ని, ఆరాధనను అతనికి నివేదించుకుంది. దయాసముద్రుడు ప్రేమస్వరూపుడు అయిన కృష్ణ పరమాత్మను పరిణయమాడినట్లే భావించింది. ఆమె మనసు అనునిత్యం హరి వశమై నిలిచేది. భక్తిపారవశ్యంలో తన ప్రభువులో ఏకమైనట్లే ఊహిస్తుండేది.

---

1. ప్రాక్కృష్ణప్రేమ పవిత్రాంగనలు - P44

తనను తానే అనురక్తచిత్త అయిన గోపికగా భావించుకునేది.

*సాధుల సంగతి చరియించితిని
సంప్రదాయముల వర్జించితిని..
ఆశ్రితావనుడు మీరా ప్రభువే
అంతరాయముల తొలగించె
మేఘసుందరుని గానములోనే
మీరా నిరతము పులకించె...
కళ్యాణ మాడె నమ్మా - అమ్మా
కమలలోచనుడు కలలో నన్నే...*[1]

ఈ భావాలు మీరాహృదయాన్ని భక్తి తత్త్వాన్ని చక్కగా చూపుతాయి. లౌకిక సుఖాలను ఆమె వాంఛించలేదు. మనః పూర్వకంగా తనను తానే సమర్పించు కొనిన గిరిధరుని త్రికరణ శుద్ధిగా సంతుష్టుని చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. చివరికి ఆమె మనోవాంఛితం నెరవేరింది. తన ఆరాధ్యదైవము, ప్రియతముడు అయిన శ్రీకృష్ణునిలో ఐక్యమయింది. జన్మసాఫల్యాన్ని పొందింది.

---

1. 'మీరాబాయి' By ఉషా. S. నిల్సన్. అనువాదం C. నారాయణరెడ్డి
P 13, 14, 43.

# అక్కమహాదేవి

భక్తిరససిద్ధాంతం అంతా కృష్ణపరంగానే అన్వయం చేయబడింది. దీనికి ఈ ఆలంకారికులు కృష్ణభక్తులు, వైష్ణవాభిమానులు కావడం కొంత కారణం కావచ్చు. మధుసూదనసరస్వతి ఇతర దేవతల విషయంలో భక్తి భావమనీ పరమాత్మస్వరూపుడైన శ్రీకృష్ణుని విషయంలో మాత్రం భక్తి రసమే నని అభిప్రాయపడ్డారు.[1] ఇందులో కూడా మధురభక్తి మార్గం మహోన్నతంగా భావించబడ్డది. కాని కేవలం కృష్ణపరంగానే కాక శివుడిని కూడా ఈ విధంగానే ఆరాధించడం ఉంది. పరమేశ్వరుడిని భర్తగా భావించి, భక్తులు భార్యలనే భావనలో పూజించడం శైవభక్తులలో సహితం కనబడుతుంది. శరణసతి, లింగపతి అనే భావన వీరశైవభక్తి సిద్ధాంతంలో కనబడుతుంది. వీరశైవులకు ముఖ్యమైనది షట్స్థల జ్ఞానం. భక్తస్థలము, మాహేశ్వరస్థలము, ప్రసాదస్థలము, ప్రాణలింగస్థలము, శరణస్థలము, ఐక్యస్థలము అనేవి షట్స్థలాలు. ఈ స్థలధర్మవిశేషము చేత వీరశైవులు భక్తాది సంజ్ఞలు కలిగి ఆరు విధములుగా ఉంటారు. ... అంగలింగ జ్ఞానము కలిగి తాను సతినని భావించి పతి అయిన శివుని ధ్యానించి, ఆ ధ్యాన సౌఖ్యములో ప్రవేశించినవాడు శరణుడు. శరణభావము కలిగి ఉండడము శరణస్థలము.[2] ఈ పద్ధతిలో చెన్నమల్లికార్జునుని

---

1. 'రతిర్దేవాది విషయా వ్యభిచారీ తథోర్జితః
   భావః ప్రోక్తో రసోనేతి యదుక్తం రసకోవిదైః
   దేవాంతరేషు జీవత్వాత్ పరానందా ప్రకాశనాత్
   తద్యోజ్యమ్ పరమానందరూపే న పరమాత్మని'
   Early History of Vaisnava Faith & Movement in Bengal
   By S.K. De P 198
2. 'శ్రీపండితారాధ్యచరిత్ర' - పాల్కురికి సోమనాథకవి ప్రణీతము
   పరిష్కర్త : డా॥ చిలుకూరి నారాయణరావు P 310, 312

ఆరాధించి తరించిన మహాభక్తురాలు అక్కమహాదేవి. చిన్నతనం నుంచి చెన్నమల్లికార్జునుని ఏకాగ్రతతో ఆరాధించింది. యథేచ్ఛగా శివపూజలు చేస్తూ, మాహేశ్వరులతో కాలం గడుపుతూ శివధ్యానమే జీవితపరమావధిగా గడిపింది. మల్లికార్జుననే హృదయేశ్వరునిగా భావించి తనను అర్పించుకోవడానికై తహతహలాడింది. తన భావాలను ఆవేశంగా వ్యక్తం చేసింది.

"జననీ! సుందరమూర్తిని జరామరణములు లేనివానిని ఆకారము లేనివానిని ప్రేమించినాను.

జననీ! జన్మము, భయమెరుగని వానిని సుందరమూర్తిని ప్రేమించినాను.

జననీ! సుందరమూర్తి చెన్నమల్లికార్జునుడు నా భర్త....

ప్రభువా! ఇచ్ఛవచ్చినచో నన్నంగీకరింపుము. ఇచ్ఛలేనిచో అంగీకరింపవలదు.

నీ అర్చన చేయుచుండ నేను శాంతముగా నుండజాలను.

ప్రభువా! ఇచ్ఛకలిగినచో నన్ను ప్రేమింపుము. ఇచ్ఛలేనిచో ప్రేమింపవలదు. నిన్ను నా భుజములలో బంధింపనిచో శాంతముగా నుండజాలను."[1]

మనసార ప్రేమించిన మల్లికార్జునునిలో ఐక్యం కావాలని వాంఛించింది. రాజభోగాలను తృణీకరించి తన దైవాన్ని చేరడానికి ప్రయాణమయింది. ఇహలోకయాత్రను విసిగి, భవ సంపర్కంలో (భర్త కౌశికుడు) తన దేహం అపవిత్రం అయిందని భావించి ఈ దేహం వదలి కైలాసానికి పోవాలని కోరుకుంది. ఆమె కోరిక సిద్ధించింది. నిరాకార పదార్థంలో ఐక్యమయిన అనుభూతి ఆమె పొందినట్లు ఈ క్రింది రచన చెపుతుంది.

"అది లింగమని చెప్పును
అది లింగములో ఏకీభావమని చెప్పును

---

1. 'వీరశైవ పవిత్రాంగనలు'. స్వామి పరమానంద. P30

అది సర్వోన్నతన అనను

అది సామరస్యమనను

అది సంభవించినదనను

అది నీవనను

అదినేనను

చెన్నమల్లికార్జున లింగములో లీనమై ఒకటైనపుడు

నేనేమియు అనను"[1]

ఇటువంటి అద్వైతసిద్ధి అక్కమహాదేవికి లభించింది.

ఈ ముగ్గురి భక్తితత్త్వాలలో ప్రధానమయినది శృంగారం. భగవంతుని ప్రియునిగా భర్తగా ఆరాధించి ఆ భగవంతుని చేరడం వీరి లక్ష్యం. ఈ శృంగారం ఆధ్యాత్మిక శృంగారం. ఇక్కడ క్షణికమైన విషయ సుఖేచ్ఛ ప్రధానం కాదు. శాశ్వతానందదాయకమైన భగవంతుని సమాగమం వాంఛితం. అద్వితీయమైన ఆధ్యాత్మికానందం శ్రేయం. నిరాకారుడైన భగవంతుడు పాంచభౌతికమైన శరీరం కలవాడు కాడు. కనుక దీనిలో శరీరసంబంధం లేదనవచ్చును. ఇది దైహికసంబంధం లేని శృంగారభావన మాత్రమే. ఇది అమలినమయినది.

ఇదే విధంగా రాయప్రోలువారు అమలినశృంగారసిద్ధాంత ప్రతిపాదనలో దైహికసంబంధాలకు అతీతంగా భావమయమైన ప్రేమ శాశ్వతం అనే అభిప్రాయం కనబడుతుంది. విషయసుఖేచ్ఛలకు అతీతమైన అనురాగాల నన్నిటిని అంతర్భూతం చేసుకున్నది అమలినశృంగారం. 'శృంగారశాఖలయిన స్నేహవత్సలాదులు'[2] అని అంటూ స్నేహవాత్సల్యాలను శృంగారశాఖలుగా గ్రహించారు.

---

1. ప్రాక్పశ్చిమ పవిత్రాంగనలు - స్వామి పరమాత్మానంద - P 33.
2. రమ్యాలోకము - P37

ఈ భక్తిరససిద్ధాంతంలో కూడా స్నేహ వాత్సల్యాలవంటి భక్తిమార్గాలన్నీ కూడా శృంగారంలో అంతర్భూతం అనే భావం స్ఫురిస్తుంది.

స్నేహ సురత వాత్సల్యములో జీవితమున
ప్రేమ తరంగంబులకు అంకి ప్రేమ యొకటె
ప్రేమ శిఖరావరోహణాభిఖ్యలయిన
వన్నెకు సత్పథయుల కివియెల్ల మెట్టులగును[1]

అని రాయప్రోలువారన్నారు. వీరి దృష్టిలో ప్రేమ శృంగారాలు సమానార్థకాలు.[2] ఈ భక్తిరససిద్ధాంతంలో కూడా దాస్య, సఖ్య, వాత్సల్యాలవంటివి ఒకదాని కంటె ఒకటి ఉన్నతంగా శృంగారం పరమోత్కృష్టంగా నిరూపింపబడింది. క్రమపరిణామంగా ఒకదానినుంచి ఒకటి పెరిగి శృంగారభావంతో కూడిన మధురభక్తికి మార్గాలవుతాయి. స్వార్థరహితమైన ఈ ప్రేమలకన్నిటికి పరాకాష్ఠ శృంగారం అని వైష్ణవాలంకారికుల మతం. దైహికసుఖాలను ప్రాధాన్యం చేసి అన్నిప్రేమలు శృంగారంలో అంతర్భూతమవుతాయన్న రాయప్రోలువారి సిద్ధాంతానికి ఈ భక్తిసిద్ధాంతం కొంత ఆలంబనం అయి ఉంటుందని ఊహించవచ్చు.

---

1. రమ్యాలోకము P 38
2. శృంగారం, ప్రేమ శబ్దాలను గూర్చి 'అమలిన శృంగార సిద్ధాంతం' అనే విభాగంలో వివరించబడింది.

# ప్లేటో ప్రతిపాదించిన ప్రేమతత్త్వం

రాయప్రోలు వారి అమలిన శృంగార సిద్ధాంతానికి ప్లేటో ప్రతిపాదించిన ప్రేమ తత్త్వానికి కొంత సామ్యం ఉన్నట్లు కనబడే అవకాశం ఉంది. దీనికి కారణం ఈ రెండు సిద్ధాంతాలలో ప్రేమ శారీరక సంబంధానికి అతీతమయినదిగా భావింపబడటం. రేఖామాత్రమయిన ఈ పోలికలున్నప్పటికీ ఈ సిద్ధాంతాల మూలతత్త్వంలో భేదం గోచరిస్తుంది.

ఏదైనా ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించినపుడు సిద్ధాంత ప్రతిపాదనోద్దేశ్యం, ఆ సిద్ధాంతం మీద పరిస్థితుల ప్రభావాలు, ప్రతిపాదకుల మనస్తత్వం, ఆలోచనా విధానం ఆ సిద్ధాంత ప్రతిపాదనలో ప్రధానపాత్ర వహిస్తాయి. ఈ ప్రభావాలు, ప్రయోజనాలు సిద్ధాంతాలలో భిన్నత్వానికి దోహదం చేస్తాయి. తాత్త్వికుల మనస్తత్వం సిద్ధాంతానికి మూలాధారం. ఆలోచనా విధానం లోని వైవిధ్యం సిద్ధాంతపు మూలతత్త్వంలో భేదాన్ని సృష్టించటం సహజం. రాయప్రోలు వారి అమలిన శృంగార సిద్ధాంతాన్ని, ప్లేటో ప్రేమ తత్త్వాన్ని ఈ దృష్టిలో పరిశీలిస్తే స్వల్పసామ్యం ఉన్నప్పటికీ ఈ రెండు సిద్ధాంతాలు చాలవరకు భిన్నంగా ఉన్నట్లు స్పష్టం అవుతుంది.

ప్లేటో ప్రేమతత్త్వం వెనుక రాజకీయ ప్రయోజనాల ప్రాధాన్యం కనబడుతుంది. సాంఘిక పరిస్థితుల ప్రభావం కూడా ఉన్నప్పటికీ రాజకీయ పరిస్థితులు అధికప్రభావం చూపాయి. రాయప్రోలు వారి సిద్ధాంతానికి సాంఘిక పరిస్థితుల ప్రభావం ఎక్కువ. ఈ సిద్ధాంత ప్రతిపాదనోద్దేశ్యం కూడా సాంఘిక ప్రయోజనమే నని చెప్పవచ్చు. రాజకీయాలలో ఏమాత్రం సంబంధం లేనిది వీరి ప్రేమ సిద్ధాంతం. ఇది పూర్తిగా సాంఘిక దర్శనం. రాయప్రోలు - ప్లేటో, ఇద్దరూ విరుద్ధ మనస్తత్వాలు కల వ్యక్తులనవచ్చు.

సుబ్బారావుగారి ఆలోచనాసరళి పాశ్చాత్య సంస్కృతి సంప్రదాయాల కంటె కూడా భారతీయ సంప్రదాయానికి దగ్గరది. అమలిన శృంగార సిద్ధాంతం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో పుట్టిపెరిగిందనవచ్చు. ప్లేటో సిద్ధాంతానికి వెనుక ఉన్న రాజకీయ పరిస్థితులూ, కారణాలూ రాయప్రోలువారి భావనకు పూర్తిగా భిన్నమయినవి. మౌలికమయిన ఆలోచనలలోనే వీరివి విభిన్నమార్గాలు. ఎవరి ఆలోచనా పద్ధతిని అనుసరించి వారి సిద్ధాంతాలు రూపుదిద్దుకోవటం సహజం.

ప్లేటో ప్రధానంగా వివాహవ్యవస్థకు వ్యతిరేకి.[1] క్రింది వర్గాలవారి విషయంలో అంతగా పట్టించుకోకపోయినా ఉన్నతాధికార, పాలక వర్గాలవారి విషయంలో వివాహబంధాలను ప్లేటో ప్రోత్సహించలేదు. వివాహం వంటి బంధాలు అధికార విధి నిర్వహణలో ప్రతిబంధకాలవుతాయని, ఏకాగ్రతను ఆటంకపరుస్తాయని

---

1 "....The conception of marriage as a partnership between man and woman for all the purposes of life was almost entirely foreign to the Greek mind. Even Plato, who in the 'Republic' proposes that men and women shall receive exactly the same education and be equally capable of discharging all the duties of a citizen, at the same time expressly prohibits for the men and women of his ruling class anything beyond temporary sexual relations for the purpose of breeding...."

'The Symposium' By Plato - Introduction
Walter Hamilton. P. 13

అంటాడు అవివాహితుడయిన ప్లేటో. వ్యక్తుల శక్తిసామర్థ్యాలు వారి వ్యక్తి ధర్మాలను పూర్తిగా వినియోగపడకుండా భార్యాబిడ్డలవంటి అనుబంధాలు అవరోధం కలిగిస్తాయని ఇతని అభిప్రాయం.

రాయప్రోలు వారు దీనికి పూర్తిగా వ్యతిరేకులు. భార్యాబిడ్డలు ప్రతిబంధకాలనే విశదమయిన ఊహే వారి మానసిక ప్రవృత్తికి భిన్నమయింది. భార్యాభర్తల అనుబంధాన్ని వారు అధికంగా గౌరవిస్తారు. అమితంగా ఆదరిస్తారు. పురుషుడికి గృహస్థు కావడం లోనే చరితార్థత అన్నది వీరి విశ్వాసం. కళత్రం అర్ధాంగి. ఆమె సాహచర్యం లేకపోతే జీవితానికి పరిపూర్ణత లేదు, వికాసం లేదు అని దృఢంగా నమ్మిన గృహస్థు సుబ్బారావుగారు. సీతారాముల అద్వైతానురాగం వీరికి ఆదర్శం. కనుక వివాహబంధం, కుటుంబవ్యవస్థ వీరికి ఉపాదేయాలు.

ప్లేటో సిద్ధాంతం వివాహబంధాన్ని నిషేధించడమే కాదు. పిల్లలను తల్లిదండ్రులకు దూరం చేస్తుంది. కర్మాగారంలో ఉత్పత్తి చేసే వస్తువుల లాగా అనిశ్చితకాల అనురాగబంధాలకు అతీతంగా ఆస్తులను వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పిల్లలను ప్రభుత్వం స్వీకరించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలంటాడు ప్లేటో. ఈ సిద్ధాంతంలో తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య వాత్సల్య బంధాలు లేవు. ప్లేటో ప్రేమతత్త్వంలో వాత్సల్యానికి ప్రత్యేక ప్రతిపత్తి లేదు. స్త్రీ పురుషుల మనస్సులతో సంబంధం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన జంటలలో ఉత్తమ సంతానాన్ని పొంది ప్రభుత్వమే పెంచి పెద్ద చేయాలని ప్లేటో ప్రతిపాదన.

ఇప్పుడు మనకున్న వివాహపద్ధతి పూర్తిగా సంస్కరింపబడాలి. కొన్ని పర్వదినాలలో జనసంఖ్య తరుగు పెరుగులు పొందకుండేటట్లుగా... ప్రభుత్వం వధువులను వరులను సమావేశపరుస్తుంది. ఉత్తమ వధూవరులకే ఎక్కువ సంతానప్రాప్తి అయ్యేటట్లు ప్రభుత్వం చూస్తుంది. పుట్టగానే

పిల్లలను ప్రభుత్వం తల్లితండ్రుల దగ్గరనుంచి తీసుకొనిపోయి ఎవరు ఎవరి పిల్లలో తెలియనీయకుండా జాగ్రత్తగా పెంచుతుంది. ....ప్రభుత్వం నిర్ణయించే వివాహాలలో వధూవరుల ఇష్టానిష్టాలలో ప్రణయద్వేషాలలో నిమిత్తం లేదు. ప్రభుత్వం పట్ల తమకున్న ధర్మాన్ని శిరసావహించి ఈ వివాహాలను పాలించాలి...."[1] అన్నది ప్లేటో దృక్పథం.

రాయప్రోలు వారు ప్రణయతంత్రం కాదని సంభోగశృంగారం స్వీకరింపదగిందని అన్నప్పటికీ, వియోగ మాధుర్యం ఆదరణీయం అని అన్నప్పటికీ స్త్రీ పుంసయోగాన్ని పాశవిక క్రియగా పరిగణించలేదు. పవిత్ర కార్యంగా భావించారు. దంపతీ నిష్ఠ ధర్మంగా స్వీకరించారు. స్త్రీ పురుషుల మనస్సులతో సంబంధం లేకుండా యాంత్రికంగా పిల్లల ఉత్పత్తికి మాత్రమే శారీరక సంబంధం అని భావించలేదు. తల్లితండ్రులెవరో పిల్లలకు తెలియవలసిన అవసరం లేకుండా పిల్లలను ప్రభుత్వమే పెంచి పెద్దచేయడం అన్న ఆలోచనే రాయప్రోలు వారి దృక్పథానికి అందనిది. తల్లితండ్రులకు దూరంగా పిల్లలను ఆయన ఊహించలేదు. తల్లి తండ్రులకు బిడ్డల పెంపకంలో కలిగే ఆనందం, తృప్తి, వారిపై ఉండే వాత్సల్యం వీరు అమూల్యంగా భావించారు. రచనలలో అత్యున్నతంగా చిత్రించారు. చెట్టుకు పుట్టకు గూడా తల్లిబిడ్డల భావబంధాన్ని ఆపాదించి వాత్సల్యాన్ని వర్ణించారు. ఇంతేకాదు ఈ వాత్సల్యం వీరి అమలిన శృంగార సిద్ధాంతంలో ఒక భాగంగా గూడా విశిష్టస్థానాన్ని పొందింది.

ప్లేటో స్త్రీకి కొన్ని విషయాలలో సమానప్రతిపత్తిని

---

1. 'చేగంటులు' - G.V. కృష్ణారావు P 111, 112

అంగీకరించినా స్త్రీని ఉన్నతంగా భావించినట్లు కనబడదు. పురుషుని ఇచ్చిన విలువ, గౌరవం స్త్రీకి ప్లేటో ఇవ్వలేదు.

కాని రాయప్రోలు వారు స్త్రీని పురుషుని కంటె ఉన్నతంగా భావించారు. ఒకే భావాన్ని రచనలలో చిత్రించారు. స్త్రీ గౌరవం వీరి అమలిన శృంగారానికి పునాది. పురుషుల పొరపాటు వల్లనే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నా యని, స్త్రీ అంతరంగాన్ని అర్థం చేసుకోవటంలో పురుషులు విఫలమవు తున్నారని వీరి అభిప్రాయంగా వీరి రచనా ప్రణాళిక స్పష్టం చేస్తుంది. దీనిని బట్టి పురుషులను స్త్రీల కంటె తక్కువగా వీరు భావించారని అనవచ్చు. స్త్రీ ఆధిక్యమే వీరి ఆదర్శం.

ఈ విధంగా వీరిద్దరి ఆలోచనా విధానంలో వైరుధ్యం కనబడుతుంది. అది వీరి ప్రేమ సిద్ధాంతాలలో ప్రతిబింబించింది. ఆ భేదాన్ని క్రింది విధంగా చూడవచ్చు. స్త్రీ ఆకర్షణకు పురుషుడు లోనయ్యే అవకాశం ఉందని స్త్రీ పురుషుల మధ్య స్నేహాన్ని ప్లేటో ప్రోత్సహించలేదు. ఇద్దరు ఒకే లింగానికి చెందిన వ్యక్తుల మధ్య ముఖ్యంగా పురుషుల మధ్య ప్రేమనే అతడు ఆమోదించి నట్లు కనబడుతుంది.[1] ఏకలింగ వ్యక్తులలో ఉండే ప్రేమను అత్యున్నతంగా

---

1 "---- Platonic love, inspite of the meaning commonly attributed to it, is a common search for truth and beauty by two persons of the same sex inspired by mutual affection ---- for Plato true love between individuals is normally homosexual, ----"
'The Symposium' By Plato. Introduction Walter Hamilton - P 26

ప్లేటో భావించినట్లు కనబడుతుంది.

రాయప్రోలు వారి భావన దీనికి భిన్నమయింది. కేవలం పురుషుల మధ్య కేవలం స్త్రీల మధ్యనే కాదు- స్త్రీ పురుషుల మధ్య కూడా స్నేహం ఉండే అవకాశం ఉన్నదని రాయప్రోలు వారి అభిప్రాయం. ఈ స్త్రీ పురుష స్నేహం వీరి అమలిన శృంగార సిద్ధాంతంలో ప్రధానాంశం. శారీరక సుఖాలకు అతీతంగా అంతరంగాలను ప్రేమలో ముడివేసి పరస్పరం స్నేహమాధుర్యాన్ని ఆస్వాదించాలంటారు సుబ్బారావు గారు. స్త్రీకి దూరంగా ఉండాలనేది వీరి ఆదర్శం కాదు. ఏ బాంధవ్యబంధం లేని స్త్రీ,పురుషుల మధ్య శారీరకాకర్షణాతీతంగా స్నేహసంబంధంలో ప్రేమ కొనసాగడమే రాయప్రోలు వారి సిద్ధాంతానికి మూలం. ఇదే అమలినశృంగారానికి జీవభూతమయిన బీజం.

సౌందర్యానికి ప్రేమకు అవినాభావ సంబంధం ఉంది. దర్శించిన సౌందర్యాన్ని ప్రేమించడం, ప్రేమించిన దానిని పొందాలనుకోవడం సహజం. ప్లేటో ప్రేమసిద్ధాంతం ఒక క్రమంలో ఈ సౌందర్యారాధనను చెబుతుంది. ప్రప్రథమంగా బాహ్యసౌందర్యంలో ఆకర్షితులయిన వారికి అదే విధమయిన సౌందర్యాన్ని ఇతరస్థానాలలో కూడా దర్శించాక అంతటా ఉన్న సౌందర్యం ఒకటే అనే జ్ఞానం కలుగుతుంది. తరువాత బాహ్య సౌందర్యం కంటె భిన్నమయినదిగా, విశిష్టమైనదిగా ఆత్మసౌందర్యాన్ని గుర్తించడం జరుగుతుంది. క్రమంగా ఆత్మసౌందర్యారాధన నుంచి దృక్పథం విశాలమై సౌందర్యమనే సముద్రాన్ని దర్శిస్తుంది. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, సత్యాన్ని సౌందర్యవంతమయినదిగా భావించడం జరుగుతుంది. ఆ దివ్యసౌందర్యం పట్ల ఆకర్షణ కలిగి దానిని ప్రేమించడం, పొందాలనుకోవడం జరుగుతుంది. ఇదే ఉన్నతమయిన ప్రేమ. ఆ దివ్యసౌందర్యోపాసనలో జ్ఞానాన్ని పొందాలనుకోవడమే ప్రేమకు పరమావధి అన్నది

ప్లేటో అభిప్రాయంగా కనబడుతుంది.[1] బాహ్యసౌందర్యానికి ఆకర్షితులై దానిని ఆరాధించడం అధమమయినదిగా, దివ్యసౌందర్యోపాసన పట్ల ప్రేమ అత్యున్నతమయినదిగా ప్లేటో భావించినట్లు కనబడుతుంది. దివ్యసౌందర్య

---

1. "When a man, starting from this sensible world and making his way upward by a right use of his feeling of love for boys, begins to catch sight of that beauty he is very near his goal. This is the right way of approaching or being initiated into mysteries of love, to begin with examples of beauty in this world, and using them as steps to ascend continually with that absolute beauty as one's aim, from one instance of physical beauty to moral beauty, and from moral beauty to the beauty of knowledge, until from knowledge of various kinds one arrives at the supreme knowledge whose sole object is that absolute beauty, and knows at last what absolute beauty is."
'The Symposium' by Plato. Translated by Walter Hamilton P.94.

వాసనలో, జ్ఞానసౌందర్యాన్వేషణలో ఒకరికొకరు తోడునీడగా ఇద్దరు వ్యక్తులు సాగడం ప్లేటో ప్రేమతత్త్వంగా చెప్పవచ్చు. ఒకే లింగానికి చెందిన వ్యక్తుల పరస్పర ప్రేమాభిమానాలలో ఆ సత్యాన్వేషణను కలిసి కృషి చేయడం ఈ ప్రేమతత్త్వ లక్షణంగా కనబడుతుంది. దీనిలో ప్రధానంగా దివ్యసౌందర్య దర్శనాన్ని గుర్తించి ప్రేమించడం ముఖ్యం. వ్యక్తులను ప్రేమించడం క్రింది దశకు చెందింది. బాహ్యసౌందర్యము, ఆత్మసౌందర్యము, దివ్యసౌందర్యము దీని మూడు దశలు.

రాయప్రోలువారు దైహికసుఖాలను అతీతంగా ప్రేమను భావించారు కాని వ్యక్తికి దూరంగా కాదు. వ్యక్తిని వివిధ విధాలుగా ప్రేమించడమే రాయప్రోలువారు చెప్పే అమలినశృంగారం. ఒకే వ్యక్తిని తల్లిగా, సోదరిగా స్నేహితురాలిగా, కుమార్తెగా ఎన్ని విధాలుగా ప్రేమించవచ్చో అన్నిరకాలుగా అభిమానించడం వీరి సిద్ధాంతంలో భాగం. అవే వాత్సల్యం, స్నేహం, దాంపత్యం వంటి శాఖలుగా వీరి అమలిన శృంగారసిద్ధాంతంలో భాగాలయ్యాయి. ప్రేమశిఖరారోహణలో స్నేహ, సురత, వాత్సల్యాలు మెట్లవంటివని వీరు భావించారు. వీరి ప్రేమసిద్ధాంతానికి దివ్యప్రేమ ఆదర్శం కాదు. నిర్మలంగా, నిష్కల్మషంగా ఎదుటి వ్యక్తిని ప్రేమించడం ఆశయం.

ఈ విధంగా ఈ రెండు ప్రేమసిద్ధాంతాలలో భిన్నత్వం కనబడుతోంది.[1] దైహిక

---

1 ..."ప్లేటో కు వీరికి పోలిక లేదు. ఇక ఉన్న సామ్యమొక్కటే. శారీరక సౌందర్యము కన్న, ఆత్మసౌందర్యము గొప్పది... ఈ తత్త్వమును ఇంచు మించుగా ఇద్దరొకే విధముగా ప్రతిపాదించిరి. అంతమాత్రము చేత వీరి 'అమలిన శృంగారము' Platonic love ఒకటే యనుట సమంజసము కాదు." 'ఆధునికాంధ్రకవిత్వము, సంప్రదాయములు - ప్రయోగములు' సి. నారాయణరెడ్డి P 281

వాంఛలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం మాత్రం రెండింటిలో సమానధర్మంగా చెప్పవచ్చును. కాని అదికూడా విభిన్న ఆశయాలలో జరిగిందని పైన చూపిన భేదాలు స్పష్టం చేస్తాయి.

---

# అమలిన శృంగార సిద్ధాంతం.

'రసములకు నెల్ల శృంగారరసము తల్లి'- అన్నిరసాలలో ప్రధానరసం శృంగారం. 'శృంగారః శుచి రుజ్జ్వలః' వంటి వాక్యాలు శృంగార పావిత్ర్యాన్ని సూచిస్తాయి. రసరాజమైన శృంగారాన్ని గూర్చిన చర్చలు, వివరణాలు విస్తృతంగా ఉన్నాయి. అయితే స్త్రీ పురుష సంభోగ శృంగారం అనే అర్థంలో నేడు శృంగారం అనే పదం స్థిరపడింది. శరీరసంబంధం లేని స్త్రీ పురుషుల విషయంలో శృంగార పదం అంతగా వాడబడటం లేదు. విప్రలంభ శృంగారంలో వియోగం కొంత ఉన్నా అది సంభోగాపేక్షితమే కాని సంభోగ భావనను సంపూర్ణంగా దూరం కాదు.

రాయప్రోలు వారి దృష్టిలో శృంగారం అనేది విశిష్టమైనది. శృంగార శబ్దం సంకుచితార్థంలో ప్రయోగింపబడుతోంది కాని నిజానికి దాని పరిధి అతి విస్తృతమైనదని వారి విశ్వాసం. కేవలం దాంపత్య శృంగారమే శృంగారం కాదనీ, ఏ ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న అనురాగం అయినా శృంగారమే నని సుబ్బారావుగారు భావిస్తారు. ఆలంకారికుల అతి విస్తృత రసచర్చలో సంభోగ విప్రలంభ శృంగారాలకు ప్రాధాన్యం లభించడం వల్ల శృంగారం అంటే అదేననే భావం స్థిరపడిందనీ, వాటి విస్తరణలో స్నేహ, వాత్సల్యాల వంటివి సంగ్రహించబడ్డాయనీ, నిజానికి అవి శృంగారానికి శాఖలనీ వీరంటారు. అన్నిటికీ మూలమయినదీ తల్లిలాటిదీ శృంగారం అని వీరి అభిప్రాయం.

"విప్రలంభ సంభోగముల్ విస్తరించి
సంగ్రహించిరి శృంగార శాఖలయిన

స్నేహ వత్సలాదుల; నతి స్నిగ్ధ హృదయు

లగు కవులకిప్పుడవి వరేణ్యాంబులయ్యె[1]

అని అన్నారు. కనుక వీరి దృష్టిలో వాత్సల్యాదులు కూడా శృంగార శాఖలే. ఎక్కడ ఆకర్షణ ఉందో ఎక్కడంతా శృంగారం ఉందని వీరి ఉద్దేశం. "ఎక్కడెక్కడ ఆకర్షణ ఉందో అక్కడ మోహం ఉంది. అదంతా శృంగారమే. తల్లీ బిడ్డల మధ్య ఆకర్షణ ఉంది. అదీ మోహమే. అదీ శృంగారమే. మోహం యొక్క భావన ముఖ్యం - తన్మయ మవడం."[2] అని అన్నారు. సుఖ సంపదలో సమభాగిని అయిన చెలి ముఖంలోనే కాదు లాలనీయమైన పసిపాప ముఖంలో కూడా శృంగారమే ఉంది. విశాలమయిన కాటుక కళ్ళలో, నవ్వు పూబంతులలో నయనానందకరంగా ఉండి పలకరిస్తే బిత్తరపోయి పారిపోయే పల్లెపడుచు వాలకం శృంగారమే. అనురాగ బంధం పొందిన స్నేహితుని ఆశాదీపం ఆరిపోకుండా తన అనునయమనే స్నేహధారలో నిలిపే స్నేహితురాలిదీ శృంగారమే. ఇది స్నేహశృంగారం. సుస్నాతయై, జారుముడిలో, నొసట కుంకుమ బొట్టులో, పసుపు పూసిన పాదాలలో తులసి పూజలు చేసే ధీరమూర్తిదీ శృంగారమే. ఈ పవిత్రమూర్తి దర్శనం వల్ల కలిగే ఆహ్లాదం మాతృశృంగారం. స్తన్యపానంలో ప్రపంచాన్నే మరచిన శిశుగండస్థల చుంబనంలో తల్లికి ఒడలు పులకరిస్తుంది. ఇదీ శృంగారమే. కళాకాంతులలో తొణికిళ్ళుతూ సౌందర్యబింబం అయిన బిడ్డ జగన్మోహనమై అందరిని ముద్దులాడడానికి ఆహ్వానిస్తుంది. ఇది పుత్రశృంగారం.

---

1. రమ్యాలోకము P 37
2. Interview 11-6-81

ఈ విధంగా మాతృ శృంగారం, స్నేహ శృంగారం, పుత్ర శృంగారం వంటివి శృంగారశాఖలు. సాధారణంగా ఇటువంటి అనురాగాలన్నిటిని 'ప్రేమ' అని అనడం వ్యవహారంలో ఉంది. శృంగారం అన్న పదం కంటె ప్రేమ అన్న పదం కొంత విస్తృతార్థంలో వాడబడుతున్నది. ఏ రకమయిన ఆత్మీయతను, అనురాగాన్ని అయినా ప్రేమ అని వ్యవహరించడం సాధారణం. రాయప్రోలువారు శృంగార శబ్దాన్ని ఈ 'ప్రేమ' అన్న పదానికి సమానార్థకంగా గ్రహించినట్లు తోస్తుంది. కనుక శృంగారాన్ని కూడా అంత విస్తృతార్థంలో గ్రహిస్తేనేగాని వీరి అమలిన శృంగార సిద్ధాంత స్వరూపం స్పష్టం కాదు. వీరు ప్రేమ, శృంగార శబ్దాలను పర్యాయపదాలుగా ప్రయోగించడం కనబడుతుంది.

"పరమ ధర్మార్థమయిన దాంపత్య భక్తి
స్తన్య మోహనమయిన వాత్సల్య రక్తి
సాక్షిమాత్ర సుందరమయిన సఖ్య సక్తి
పొందు నాదిమమగు ప్రేమ యందె ముక్తి"[1]

అని దాంపత్య శృంగారం, వాత్సల్యం, సఖ్యం అనేవి ప్రేమలోనే లీన మవుతాయంటారు. ఇదే విధంగా ప్రాచీన లాక్షణికులు కూడా అభిప్రాయ పడ్డారు. కవికర్ణపూరుని 'అలంకార కౌస్తుభము' ప్రేమ అంగి, శృంగారము అంగము అని అంటుంది. ప్రేమ అధికతరమని, అన్ని రసాలు దానిలోనే అంతర్భవిస్తాయని కవికర్ణపూరుని అభిప్రాయం.

"ఉన్మజ్జంతి నిమజ్జంతి ప్రేమ్ణ్యఖండ రసత్వతః
సర్వేరసాశ్చ భావాశ్చ తరంగా ఇవ వారిధౌ।

---

1 తృణకంకణము - అభినవకవిత. P. 244

అథ ప్రేమ రసః అత్ర చిత్తద్రవః స్థాయీ। ప్రేమ రసే సర్వేరసా అంతర్భవం తీత్యత్ర మహాయాసేన ప్రపంచః।"[1]

ఆధునికులలో కూడా ఇటువంటి అభిప్రాయం కనబడుతుంది. "బిడ్డ ఎడ తల్లిదండ్రులకు గల వాత్సల్యము దాని (ప్రేమ యొక్క) ప్రబల రూపము. ఆ ప్రేమ సంబంధము నుండియే ఈ శాఖలన్నియు విడివడి వచ్చినను. వీటికి గల తారతమ్యము మాత్రాభేదమే గాని గుణభేదము కాదు."[2]

యువజంటలోని శృంగారంలో, అవ్వ మనుమల వాత్సల్యంలో స్నేహితుల నిష్కల్మష స్నేహంలో అన్నిటా ఈ ప్రేమే వర్తిస్తున్నదని రాయప్రోలు వారి ఉద్దేశం. ఇక్కడ దాంపత్య శృంగారాన్ని, వాత్సల్యాన్ని, సఖ్యాన్ని ప్రేమలో అంతర్భాగాలుగా గ్రహించారన్నది స్పష్టమవుతున్నది.[3]

"స్నేహ సురత వాత్సల్యముల్ జీవితమున
ప్రేమకంగంబులగు అంగి ప్రేమ యొకటె
ప్రేమ శిఖరావరోహణాభిజ్ఞులయిన
మృదు సహృదయుల కివి యెల్ల మెట్టులగును."[4]

ఇదే అభిప్రాయం శృంగార శాఖలయిన 'స్నేహ వత్సలాదులు' అని అనడం వల్ల

---

1. 'Number of Rasas' V. Raghavan P 132
2. 'సాహిత్య శిల్ప సమీక్ష' - పింగళి లక్ష్మీకాంతం - P 138, 139
3. "ఈ ప్రేమశబ్దము ఆలంకారికుల శృంగారము నంతర్లీనము చేసికాని విశేషార్థయుతమైనది" - పాటిబండ సుబ్రహ్మణ్య శాస్త్రి 'మాధురీ దర్శనము' (వ్యాసము) విమర్శిని - 4 P22
4. రమ్యాలోకము P 38

వేరు శృంగారం, ప్రేమ శబ్దాలు రెండు సమానంగా స్వీకరించారని అనవచ్చు. ప్రేమ శృంగారాలు సమానార్థకాలుగా కనబడుతున్నాయి కనుక ప్రేమను వీరిచ్చిన స్థానాన్ని పరిశీలిస్తే వీరి దృష్టిలో శృంగారానికున్న విస్తృతి, పావిత్ర్యం విశదమవుతున్నాయి.

ప్రాచీనకాలంలో ద్రష్ట అయిన మహర్షి పరమాణుప్రాయమైన పరమాత్మను దర్శించగా నవ్యకవి ప్రేమయోగాన్ని దర్శించాడన్నారు రాయప్రోలు వారు. కనుక వీరి దర్శనం ప్రేమయోగం. ఒక పువ్వులో కోమలత్వం, ఒక పువ్వులో రేకుల పొందిక, ఒక పువ్వులో కాంతి, వేరొక దాన్లో పరిమళం, ఇంకొక దాన్లో మధువు ఉన్నట్లుగానే ప్రేమకళలు భిన్నత్వంలో భాసిస్తున్నాయి. సృష్టి అంతటా నిర్మలమయిన ప్రేమ నిండి ఉంది. పువ్వులలో, వెన్నెలలో, పక్షికూతలలో అన్నిటా ప్రేమే ఉంది. విశ్వవ్యాప్తమయిన ఈ ప్రేమలక్ష్మిని ఆరాధించని వారు ప్రణవమంత్రాన్ని పొంది ఉపయోగించుకోలేని చెవిటివారితో సమానం అని రాయప్రోలువారు భావించారు.[1]

సుబ్బారావుగారు ప్రేమమంత్రమహోపాసకులు. మనసును వెన్నవలె కరిగించగలిగే ప్రేమభాగ్యాన్ని పొందినవారు ధన్యులని అన్నారు. దైవికమయిన సుకృతి వల్ల తప్ప ప్రేమ కలుగదు. అందులోనూ అస్ఖలితమైన ప్రణయం చిరంతర తపస్సు వల్లనే సాధ్యం. ప్రేమబంధాలు తెంపినా తెగనివి. ప్రేమను కలపడం కాని విడదీయడం

---

1. 'సచ్చిదానంద కల్యాణసదనమయిన
ఈ మనోహరజగతికి నేగుదెంచి
ప్రేమలక్ష్మి నారాధింప లేమి యకట?
ప్రణవమంత్రము బధిరుని ప్రాప్తి యగుట'.
'రమ్యాలోకము' (నవ్యసాహిత్యపరిషత్తు ప్రతి) P 17.

గాని సాధ్యం కానిది. ప్రేమ పంచడంలోనే ప్రేమకు సార్థక్యం ఉంది. ఈ సమస్త ప్రపంచం ప్రేమ భాండం. కువలయం ప్రేమ జ్యోత్స్నామయం. ఎంత ఇచ్చినా ఎందరికి పంచినా తరుగనిది ప్రేమసంపద అని రాయప్రోలు వారి అభిప్రాయం. వీరి దృష్టిలో ప్రేమే బ్రహ్మం.

"కర్మమే బ్రహ్మమని
జ్ఞానమే బ్రహ్మమని
నాకు - బ్రహ్మము ప్రేమ
కాదో రాధాకృష్ణా"[1]

అని అన్నారు. వేదాధ్యయనంలో 'పూర్ణ' శబ్దాన్ని ప్రేమగా స్వీకరించి

పూర్ణమదః పూర్ణమిదమ్ పూర్ణాత్ పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

అన్న శ్లోకాన్ని ఈ విధంగా తెలుగు చేశారు.

"ప్రేమంబది ప్రేమించెది
ప్రేమ యుండె దీపించెను ప్రేమము
ప్రేమమునుండియు ప్రేమ తెచ్చితిమి
తరుగదు విరుగదు తత్ప్రేమార్ణము"[2]

'ప్రేమంబది అంటే భగవంతుని ప్రేమ. ప్రేమించెది - ఇది మానవుల ప్రేమ..... ప్రేమే భక్తిరా అని నేననుకున్నా. పూర్ణమూ ప్రేమా ఒకటనే నేను భావించాను.. ప్రేమలో లేని గుణం ఏమిటి? అన్నీ ఉన్నాయి. స్తన్యం ఇవ్వని ఆడజన్మ వ్యర్థం.

---

1. 'శ్రీ రాధాకృష్ణమహోదయులకు' - మిశ్రమంజరి. P 51
2. ప్రచురణ కాని పద్యం.

అట్లాగే ప్రేమరూప చూడని వాడు. బ్రహ్మం నిరుపాధికం, నిర్వికల్పం, నిరంజనం అని వాళ్ళంటూ అనలేదా? శబ్దం బ్రహ్మం అనలేదా? నేను ప్రేమ బ్రహ్మం అంటాను.... ...అన్నీ తీపే.... తేనె, చక్కెర, పళ్ళరసం - అన్నిట్లో మాధుర్యానికి తారతమ్యం చెప్పొచ్చు. లేకుండి. తరింపచవచ్చు. ప్రేమను తరించడానికి వీల్లేదు. ప్రేమకు బిడ్డ, భర్త, గురువు లాటి విశేషణాలు చేర్చవచ్చు. ప్రేమ మాధుర్యం మారదు. ప్రేమనే నిలుస్తుంది. నేను పిన్నిని ప్రేమించాను.... ఒక పిక్చర్ (Picture) ప్రేమించా అంటాడు...[1] అంటూ ప్రేమను గూర్చి తమ అభిప్రాయాన్ని సుబ్బారావు గారు చెప్పారు. రాయప్రోలు వారు ప్రేమ శబ్దాన్ని సమసించిన తీరు గమనిస్తే వీరు కేవలం వాచ్యంగా ప్రేమను బ్రహ్మం అనడం కాకుండా దానిని అంత పవిత్రంగానూ స్వీకరించినట్లు స్పష్టం అవుతుంది.[2] ప్రేమను భగవద్దత్తమైన సంపదగా పురాకృత సుకృత ఫలంగా వీరు భావించారు. రాయప్రోలు వారు భావకవే కాదు - ప్రేమకవి కూడా. చరాచర ప్రపంచం సమస్తంలోనూ వీరు ప్రేమనే దర్శించారు. ప్రేమే వీరి కవిత్వంలో అంతర్లీనంగా ప్రవహించే అమృతవాహిని. కనుకనే నిజమే నేను ప్రేమోన్మాదిని (మిశ్రమంజరి) అని అన్నారు. ప్రేమ సృష్టి

---

1. Interview on 10-7-81
2. ప్రేమ మంత్ర మహోపాసన, ప్రేమోపనిషదంజలి, ప్రేమ తర్పణం, ప్రేమాధ్యయనం, ప్రేమ తపః ఫలం, ప్రేమ యోగం, ప్రేమ మహేశ్వరం, ప్రేమారాధన, ప్రేమ తీర్థసేవ, ప్రేమ మాధుర్యం, ప్రేమ సౌభాగ్యలక్ష్మి, ప్రేమ పూర్ణార్ఘా, ప్రేమాభరణం, ప్రేమ లక్ష్మి, ప్రేమ సాధన సిద్ధి, ప్రేమ జ్యోత్స్న, ప్రేమ వీణా వాదనం, ప్రేమోచ్ఛిష్టం, ప్రేమ భిక్ష, ప్రేమ భవనం, ప్రేమ సరస్సు మొదలైనవి.

సహాయకమయినదని, ప్రేమ సాధనకు గురువులు అవసరం లేదని వీరంటారు. 'కర్మలు చేయటానికి వానిని చేయించే వశిష్ఠులు కావాలె; జ్ఞానం సాధించడానికి దాని సాధన ఉపదేశించే గురువులు కావాలె కాని, ప్రేమ ప్రవృత్తిలో చేసే కర్మగానీ, సాధించే జ్ఞానముగానీ ఏమున్నది? ఏమీ లేదు. ప్రేమించడమే; ఒకటే కర్మ; ఒకటే సాధన. అందుచేతనే ప్రేమికులకు వశిష్ఠులుగాని, గురువులుగాని ఉండరు.... నిజమేమంటే కర్మజ్ఞాన మార్గములకు యోనిభూతమయిన పరమ రహస్యం ప్రేమ. మానవులకు ఉపాస్యం ప్రేమ".[1] అని అన్నారు. ఇది వీరి దృష్టిలో ప్రేమ స్వరూపం. వీరి రచనలో ప్రేమ శృంగారాలు సమానార్థకాలు కనుక ఇదంతా శృంగారానికి వర్తిస్తుంది. రతి, స్నేహం, వాత్సల్యాలను గూర్చిన వీరి అభిప్రాయాలను పరిశీలిస్తే వారు శృంగారశాఖలుగా స్నేహవాత్సల్యాలను చేర్చడంలో గల ఔచిత్యం స్పష్టమవుతుంది. వాటిలో కూడా మనసులను కలిపివేసి ఆనందానుభూతిని కలిగించే ప్రేమ ఉందన్న వీరి భావం విశదమవుతుంది.

సర్వప్రాణిగతంగా ప్రేమ ఉన్నట్లే 'ప్రాణులకెల్ల... సర్వాంగీణమయి విలసిల్లేది' రతి. శృంగారం లాగానే దానికి స్థాయిగా చెప్పబడిన రతి కూడా విషయభోగం అనే తిమిరంలో కప్పబడి ఉందని రాయప్రోలువారి ఉద్దేశం. సురతమును అర్థంలో రతి అను పదం స్థిరపడింది.

"రతి బహువార్థ; మది వ
ప్రీతమయి, స్త్రీపుంసయోగ చరశిక్షా సే
హితమై సుమానుష భవ
క్రమ కల్యాణంబునకగు రమ్యముగ సుమీ."[2]

---

1. 'రూపనవనీతమ్' - P133-134
2. మాధురీదర్శనమ్ P34.

రతి అంటే 'రమ్' అన్న ధాత్వర్థంలో ఆనందించటం అని గ్రహించాలి. సుమధుర శబ్దాలలో సుందర రూపాలలో పొందే తృప్తిని ఆనందాన్ని పొందడం కళా పరమ రహస్యం. ఇదే రతి నిరీక్షితమయిన రసోపనిషదంశ అని రాయప్రోలు వారి అభిప్రాయం. భగవద్రతి, గురుజన రతి, మిత్ర బాంధవ రతి, పుత్రరతి వంటివి విశేషణాలలో రతిని వ్యవహరించడం ఉంది. ఈ అవస్థలలోని రతి స్నేహంగా, వాత్సల్యంగా భావింపబడుతోంది. రతి ప్రతిబంధకాలేవీ లేని శిశుదశలో అవికృతమై ఉంటుంది. తరువాత వయస్సులలో ప్రణయాభిముఖంగా సాగుతుంది. కాని అక్కడ ప్రజాతంతు కార్యోన్ముఖమయి తనూసంగేచ్ఛగా పరిణతి పొందుతోంది. రతి దంపతుల మధ్య విషయ సుఖేచ్ఛలకు ఆలంబనంగా ఉన్నప్పటికీ అక్కడ అమరత్వాన్ని పొందుతుంది. కనుకనే

> తరుగక విరుగక చెలగక
> చిరకాల స్నేహ వైర శ్లేషోపరం
> పరలన్ చెదరక నిర్భర
> పరిణతి గాను రతియు మిథునబంధమున సుఖీ![1]

అని వీరంటారు. రాయప్రోలు వారు ఆనంద బిందువు చిత్పదార్థం అని అంటూ రతికి విస్తృతార్థస్ఫూర్తి కలిగించడం వల్ల అటువంటి రతి స్థాయిగా గల శృంగారంలో స్నేహ, వాత్సల్యాదులు అంతర్భాగాలుగా మారాయి. "రాగమయుమయిన రతి మూలభూతమయిన స్థాయి. అదే ఆనంద సీమకు దగ్గరలో ఉంటుంది. దాని వివిధావస్థలు ఇతర రసాలకు స్థాయి భావాలు అవుతూ ఉంటవి. సంభోగ పర్యవసానము పొందే రతి మాత్రమే

---

1. మాధురీ దర్శనమ్ - P 25

శృంగారమని భావింపరాదు. చిత్త ప్రసాదనము రంజనము సంపాదించి సుఖానుశయ రాగ భూమికలో సంచరింప చేస్తూ ఆనంద పెట్టేది కూడా శృంగారమే అని నవ్యులు భావిస్తారు.[1] రతి అంటే ఆత్మను దీప్తినిచ్చేది. లోక ప్రాణుల పట్ల ఉండే వాత్సల్యం గాని ప్రీతిగాని రతికి మూలధర్మం.[2] ప్రేమను నిలిపేది, పెంచేది స్నేహం.

'స్నేహము వెన్నవాతె శిశు జిహ్వలతున్ చవి గాల్పు యాతనల్
ద్యాహన రక్తుతా జతల పాలకమున్ మసృణీకరించి చే
ల్లోహరణా ప్రభావములు లోకయు ప్రేమ మహోత్సవంబు నం
దాహవనీయ పేయ రసమై మధుమంత మొనర్చు విశ్వమున్.[3]

సాన్నిహిత్యం వల్ల ఏర్పడే గాఢానుబంధాన్ని, అనురాగాన్ని స్నేహంగా చెప్పవచ్చు. అయితే కేవలం కలిసినంత మాత్రంలో పవిత్రమైన స్నేహం ఏర్పడక పోవచ్చు. కనుకనే రాయప్రోలు వారు,

---

1. ఆంధ్ర ధ్వన్యాలోకము - నివేదన, రాయప్రోలు సుబ్బారావు P V
2. "భక్తి వాత్సల్యాదులకును శృంగారమనను స్థాయియైన రతికిని సమాన ధర్మమున్న మాట నిజము. దానికి ప్రేమ అనిగాని ప్రణయము అనిగాని పేరు. లోకప్రాణుల యెడ మనకు సహజముగా కలిగెడి ఇష్టము లేక ప్రీతి అనునదియే రతికి గాని వాత్సల్యమునకు గాని మూల ధర్మము. ... మూలప్రకృతియైన ప్రేమతత్త్వము ఉప్పొంగి వెల్లివిరిసి నిర్భరమైనట్టి దశకే రతి అని పేరు. ... ఆత్మను దీప్తినొసగు పాటిలో రతిభావము ప్రశస్తముగన్నాము"-
   'సాహిత్య శిల్ప సమీక్ష' - పింగళి లక్ష్మీకాంతం P 139, 150, 155
3. 'లలిత' - అభినవ కవిత - P 216

"కలసిన యంత మాత్రమున కాదు సుమీ చెలికార మంతరం
బుల నతుకంగ జాలిన యపూర్వపు లంకెయు స్నేహమా తద
స్ఖలిత సమస్త సాధనము జ్ఞాన విదగ్ధుల మార్గ సూత్రమే
వలతిని నైన ప్రేమ పరిపాకము లిట్టివె యన్వయించెడిన్."[1]

అని అంటారు. మనసులు కలసిన సావాసపు పుణ్యం స్వప్నంలో కూడా సాధ్యం కానిది. పరిచయ రహస్య మాధుర్యం తెలిసినవారికే స్నేహమాధుర్యం తెలుస్తుందంటారు సుబ్బారావు గారు. చెలికారపు మమత మధురమైనది. ఆ స్నేహమధువు నాస్వాదించేవారు ధన్యులు. స్నేహం నెలకొనడానికి తుల్యశక్తి, తుల్యావస్థ, తుల్యదశలలో ఏదో ఒకటి ఉండాలి.

రాయప్రోలు వారు తల్లిదండ్రులు కన్నబిడ్డను అత్తవారింటికి పంపేటప్పుడు పడే బాధకు కారణం 'కన్నచెలిమి' అని అంటారు. అంతేకాదు దంపతుల మధ్య స్థిరంగా శాశ్వతంగా నిలిచి ఉండేది స్నేహమేనని వీరి అభిప్రాయం. ఇక్కడ భవభూతి భావించిన స్నేహం వీరి దర్శనానికి ఆలంబనం అయినట్లు కనబడుతుంది.

'కాలేనావరణాత్యయాత్ పరిణతే యత్ స్నేహసారే స్థితం
భద్రం తస్య సుమానుషస్య కథమప్యేకం హి తత్ ప్రాప్యతే'.[2]

అని కాలక్రమంగా దాంపత్య అనుబంధం స్నేహంగా పరిణమిస్తుందనే భవభూతి కూడా భావించాడు. క్షణికమైనప్పటికీ సంభోగశృంగారాన్ని సృష్టివైభవాన్ని దృష్టిలో పెట్టుకుని దంపతీనిష్ఠ ధర్మంగా స్వీకరించాలని

---

1. మృణాళకంకణము - అభినవకవిత P 244
2. ఉత్తరరామచరిత - భవభూతి - ప్రథమాంకం.

సుబ్బారావుగారి అభిప్రాయం.[1] దాంపత్యం వీరి దృష్టిలో ధర్మమేగాని భోగం కాదు.[2] అయితే సుఖానుభవం క్షణికం అయినా వారిలో అనురాగం శాశ్వతంగా ఉంటున్నది. ఈ అనురాగం స్నేహాత్మకం. సాన్నిహిత్యం, సామీప్యం, సహజీవనం వారి ప్రణయాన్ని, వలపును, స్నేహాత్మకంగా పరిణామింప చేస్తాయని వీరి నమ్మకం. జంట బాసిన పక్షి విలాపం శాశ్వతికమైన సుఖాన్నిచ్చే శరీరం కోసం కాదు. చెలిమి కోసం. సహచరులను కోల్పోయిన మానవులలో నయినా అంతే. శరీరగతమయిన వాంఛల భంగానికి పొందే దుఃఖం కాదు. సాహచర్యమాధుర్యాన్ని కోల్పోయిన విచారం ప్రధానమయింది. కనుక దంపతుల మధ్య స్థిరంగా నిలిచి ఉండేది స్నేహమేనని రాయప్రోలు వారి విశ్వాసం.

---

1. 'విషయమయమైన సంభోగవిధి జగాన
క్షయమయియ్యు రూపాంతర సంక్రమమున
సుప్రజాతంత్ర నిర్వాహ సూత్రమగుట
తలచెదరు దంపతీనిష్ఠ ధర్మము గదె' (రమ్యాలోకము P.12)

2. 'వీరికి మోహరహిత శృంగారమే ముఖ్యోపాదేయము... వీరి దృష్టిలో స్వీయ తప్ప యితర నాయికలు లేరు. ఫలన సంభోగసహితమైన శృంగారములో ధర్మరూపమైన కామ పురుషార్థమునే వీరు తప్పక, యితరులు గ్రహించినందున నొప్పగలరు. ----వీరి సిద్ధాంతమున సౌందర్యార్పణమే గాని సౌందర్యానుభవము లేదు. అనుభవాభావమే దాని నమతినము చేసినది.'
'రమ్యాలోక సమీక్ష' (వ్యాసము) కురుగంటి సీతారామయ్య
'ఆంధ్రపత్రిక ఉగాది సంచిక' 1939.

సుబ్బారావుగారు చరాచరాలన్నిటిలో తల్లిబిడ్డల అనుబంధాన్ని ఊహించారు. కనుకనే వీరికి సృష్టిలో అంతటా శిశు స్నిగ్ధత్వం, మాతృమహత్వం గోచరించాయి. అందువల్లనే నేమో వీరి దృష్టిలో నాయికే ధన్య. పయోదానంలో ప్రసూత ఫలాన్ని పొందడంలో ఆమె జన్మ చరితార్థం అవుతుందన్నారు. వాత్సల్యమధువును గ్రోలినవారే ధన్యులని భావించారు. నాయకుని సుఖం క్షణికం కాగా నాయిక పుత్రవాత్సల్యం వల్ల స్తన్యదానం వల్ల పొందే సుఖం, ఆనందం శాశ్వతం అని వీరి ఉద్దేశం. పూర్వం గడిచిన సుఖానుభూతి తిరిగిరానిది కనుక భోగసోపానం ఎక్కిన అనురాగవతులు స్తన్యమోహన మయిన పసిపాపల చుంబనాస్వాదాన్ని ఆశిస్తారని రాయప్రోలువారు భావించారు.

ఈ విధంగా స్నేహం, వాత్సల్యం వంటి అనురాగాలలో మోహం- అంటే తన్మయమయ్యే లక్షణం ఉంది. మోహం ఉన్నచోటల్లా శృంగారం ఉందని వీరి ఉద్దేశం. కనుక ఇటువంటి అనురాగాలన్నీ శృంగారావరణం లోనివే నని వీరు అభిప్రాయపడ్డారు.

స్త్రీ పురుషుల మధ్య సంబంధం కేవలం భార్యాభర్తల అనుబంధంగానే ఉండనక్కర లేదు. ఉండడం లేదు.

"నర నారీ సంబంధము
పరిభావింపుము దిశావిభాగము పరికిన్
ధర జననీ భగినీ సహ
చరీ కుమారీ క్రమము నిజంబగుట సుమీ"[1]

తండ్రీ కూతుళ్ళు, తల్లీ కొడుకులు, అన్నాచెల్లెళ్ళుగా స్త్రీ పురుషుల

---

1. మాధురీ దర్శనమ్ P26

అనుబంధం శాశ్వతమయింది. శారీరక సంబంధ ప్రసక్తే లేని ఈ అనుబంధాల్లో గాఢానురాగం ఉండడం కూడా అతి సహజం. వీరు వీటినన్నిటినీ శృంగారపరిధిలో చేర్చబట్టే

'సురత సంస్పర్శ లేని ఈ శుచి మనముల
జీవితానురాగాదులన్ బలుకరించు
కానరాని శృంగార; మాకర్షణా ప్ర
భావ విమలోపచార సుఖావహము గ'[1]

అని అంటారు.

ఇక 'అమలిన' అన్న పదాన్ని పరిశీలించినపుడు ఇలా కనబడుతుంది. శృంగారం అంటే కేవలం కాయికభోగంగా, కాముక వ్యాపారంగా భావింపబడేటప్పుడు, సురతస్పర్శలేని శాశ్వతానురాగాలనన్నిటినీ శృంగారంగా వ్యవహరించవలసి వచ్చినపుడు, ఆ విస్తృత పరిధి గల శృంగారాన్ని ఏమనాలి? దీనికే అమలిన శృంగారం అని రాయప్రోలువారు నామకరణం చేశారు. శారీరక సంభోగం తప్ప శృంగారంలోని ఇతరానుభవాలన్నీ స్నేహవాత్సల్యాల వంటి ప్రేమలలో కూడా ఉన్నాయి. అటువంటి సంయోగాపేక్ష లేని ప్రేమను అమలిన శృంగారం అని రాయప్రోలువారు భావించారు. ఇక్కడ శృంగారపు అర్థవిస్తృతిని దృష్టిలో ఉంచుకుని పరిశీలిస్తే ఈ 'అమలిన' విశేషణ సార్థక్యం అవగతం అవుతుంది. అంతేగాని కొందరు విమర్శకులు సందేహపడినట్లు దాంపత్య శృంగారం మలినం అనేది రాయప్రోలువారి ఉద్దేశం కాదు. అమలిన అనేది ఈ శృంగారంలోని నిర్మలత్వాన్ని పవిత్ర్యాన్ని సూచించడానికి ప్రయోగించిన విశేషణం మాత్రమే. 'అమలిన శృంగారం' అంటే ఏ స్త్రీపురుష సంబంధంలో

---

1. రమ్యాలోకము - P40

మిథునానురాగంలో అయితే మలినమవడానికి అవకాశం లేనిదో అదే అని.... తరతరం కూడదు ఇక్కడ----"[1] అని వారి అభిప్రాయం. దాంపత్యశృంగారంలో

దైహికవాంఛాతీతంగా ఆత్మగతంగా శాశ్వతంగా నిలిచే స్నేహాను రాగం కూడా దీనిలో అంతర్భూతం అవుతున్నది. స్నేహం, వాత్సల్యం, దాంపత్యం ఈ మూడిటిని చరాచరాలకు అన్నిటికీ అన్వయిస్తూ పదేపదే సుబ్బారావుగారు చెప్తుంటారు. "ఈ మూడిటిని విలీనం విశిష్టత పొందినదిగా అమలినశృంగారాన్ని భావించవచ్చు. "విరికులు లూని అనురాగము మన కావ్యములలో వలె సంభోగ పరిణామము పొందనక్కరలేదు. విషయేంద్రియ భుక్తము కాక భావాత్మక మయిన స్నేహయోగంగా పరిణతమవుతుంది. దీనిని అమలినశృంగారమని సంకేతించాలని. మలినము కాజాలనిదని భావము."[2] అని వారన్నారు. ఇలాటి అనురాగం సర్వప్రాణి సహజంగా అనుభవంలో ఉంది.

పార్వతీపరమేశ్వరులు, భారతీబ్రహ్మదేవులవంటి వారి దాంపత్యంలో సురతప్రసక్తిని, విషయసుఖాలను ఊహించడం అనౌచిత్యం అయి రసభంగం కలిగిస్తుందే గాని రసపోషకం కాదు. యామినీచంద్రులను, పద్మినీమిత్రులను భార్యాభర్తల సంబంధం, ప్రేయసీప్రియుల అనుబంధాన్ని ప్రాచీనులు ఆరోపించారు. ఈ భావాలలో కవులు శృంగారరచనలు చేశారు. ఈ అనుబంధంలో సురతస్పర్శలేని భావమయశృంగారం ఉంది. ఇదికూడా అమలిన శృంగారమేనని రాయప్రోలువారు భావించారు. ఇది శాశ్వతమయింది. ఇదే విధంగా వేదాలలో ఉషను, ఉపనిషత్తులలో ఉమను వర్ణనచేయడంలో

---

1,2 తృణకంకణము - నివేదన P4

కూడా శాశ్వతమయిన ఆనందం విలసిల్లుతోంది.[1]

పాంచ భౌతికమైన శరీరం మలినమయింది. అటువంటి శరీరానికి అతీతమై ఆత్మగతంగా ఉన్న అనురాగం అమలినమయింది.[2] కాయసాయుజ్యం అప్రధానమయి అంతరంగాలను ముడివేసే అమలిన

---

1. "నరనారీ సంబంధము పరిశీలించిన స్త్రీని తల్లిగాను, సోదరిగాను, భార్యగాను, కుమారిగాను భావింపవచ్చును. వైదిక కాలమున ఉషస్సు విధముగనే భావింపబడి సౌందర్యవంతమై అలరారినది. ఈ సంబంధము లన్నింటిలోను వాత్సల్యము ప్రేమ అను వివిధ శబ్దములచే నుపలక్షితమైన శృంగారమున్నది. కావుననే శృంగారమును సంకుచితార్థమున వాడ రాదన్నది నవ్యులమతము. నవ్యులు వాంఛించు శృంగారమున భక్తి వాత్సల్యము మిళితములు కాగా కేవల మానసికానుభూతి ప్రధాన మగును----" మాధురీ దర్శనము-(వ్యాసము) పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి. విమర్శిని - 4 - P 17

2. "ప్రతి మానవుడు కూడా అమృతరూపుడు. ఆనందమయం ఇతనికుంది. ఈ కరచరణాద్యవయవాలెంత సార్థకంతో కూడి ఉన్నాయో ఆనందమయంతో కూడి ఉన్నాడు కాబట్టి విజ్ఞానంతో కూడి ఉన్నాడు. దానికి సంబంధించింది మలినమైన శృంగారం..... అమలినశృంగారం అన్నది భావమయ దేహ వికాసంతో కలిగేది..... ఇది కేవలం భౌతికమైనది కాదు. అంగాంగములను సంబంధించినట్టిది కాదు. ఇది అతీతమయినటువంటి --- ఉత్తమమయినటు వంటి అమలినశృంగారమని భావన---"

జమ్ములమడక మాధవరామశర్మ

Interview 30-3-81

శృంగారాన్ని గూర్చి రాయప్రోలువారు "It is a discovery of Modern Poet in the sense the Past masters didnot touch it. Nevertheless it is implicit.... In our classical poetry Sringara predominates. Sringara is nothing but human love. Love is the supreme substance of creation itself.... The classicist nodded for the charm of homely language while the modern liked the new direction of love given therein"[1]... అని అన్నారు.

ఈ విధంగా స్నేహభావమైన అన్ని అనురాగాలను లీనం చేసుకున్నదిగా అమలిన శృంగారం ప్రత్యేకత సంతరించుకుంది.[2] విస్తృతార్థంలోని

---

1. Unpublished Essay of Sri Rayaprolu. విమర్శిని-1, P24

2 A 'వీరి సిద్ధాంతమున సౌందర్యారాధనమే గాని సౌందర్యానుభవము లేదు. అనుభవాభావమే దానిని అమలినము చేసినది'.

రమ్యాలోక సమీక్ష - కురుగంటి సీతారామయ్య - ఆంధ్రపత్రిక - 1939

B 'శృంగార ప్రేయో వాత్సల్యాది రసముల సమీకరణము ఇది. శృంగారమునకు శుచి యను నామాంతరమున్నది. శుచి యనగా ఋగత్వాది విరహితమై ప్రకాశించునదని అర్థము. ఈ విశాలమైన అర్థములో వీరు స్నేహమును, వాత్సల్యమును శృంగారమునకు రూపాంతరములుగానే గ్రహించిరి. శృంగారమునకు మమత, అనురాగము, ప్రేమ, ప్రణయము, స్నేహము మున్నగు అనేకార్థములను భావించుకొనిరి.... ప్రేమ శబ్దమును శృంగార పర్యాయము గానే గ్రహించిరి'--- ఆధునికాంధ్రకవిత్వము - సంప్రదాయము - ప్రయోగములు

C. నారాయణరెడ్డి P 271, 282

(Contd)

రతిని స్థాయిగా గ్రహిస్తే స్నేహ వాత్సల్యాలు సహితం శృంగారరసంలో చేరడానికి విరోధం అంతగా కనబడదు. అయినప్పటికీ విమర్శకుల లాక్షణిక దృష్టికీ, శాస్త్ర పరిశీలనకూ ఈ సిద్ధాంతం సమర్థనీయంగా కనబడకపోవచ్చు. అమలిన శృంగారాన్ని రససిద్ధాంతంగా చెప్పడం కంటె సామాజిక జీవన విధానానికి సంబంధించిన సాహిత్యసిద్ధాంతంగా గ్రహించడం బాగుంటుంది. కనుకనే నేమో వీరు శృంగారాన్ని సామాజికపరంగా చూశానన్నారు. "ప్రాచీనులు శృంగారాన్ని సంభోగశృంగారానికి పర్యవసానం చేస్తే, నేను శృంగారాన్ని సామాజిక శృంగారంగా సంభావించుకున్నాను. ..... సామాజిక పరంగా చూశాను. శృంగారం అన్నది సమాజనిష్ఠమయినదే. ఆవు తన లేగదూడను లాలనగా నాకుతుంది. పక్షి తన పిల్లలకు ఆహారం తెచ్చిపెడుతుంది. ఇదిగో ఇలాంటిదే సామాజిక శృంగారం."[1]

ఈ విధంగా రాయప్రోలువారు విస్తృతార్థంలో స్వీకరించిన శృంగారాన్ని ఏ విధంగా తమ రచనలలో చిత్రించారో పరిశీలిస్తే అమలిన

---

(contd)

c. "కాయజకర్మ కలితమై, అంతఃకరణ సందీప్తమై భావ్యమానమై పరిణమించే ప్రణయం సంభోగపర్యంతమైన రతి కంటె శక్తిమంతమైనదని వారి సిద్ధాంతం. సర్వావస్థలను సమన్వయించే రతిని ప్రేమగా భావించవలెనన్నది... భోజుని శృంగారరస సమీకరణ వాదానికంటె ఇది అభినవం. దీనికే అమలిన శృంగారమన్నది సంకేతం."

'రాయప్రోలు సుబ్బారావు' (వ్యాసము) G.V. సుబ్రహ్మణ్యం

నవోదయలహరి P31, 32

1. రాయప్రోలు సుబ్బారావు గారితో ముఖాముఖి - C. నారాయణరెడ్డి: ఉస్మానియా విశ్వవిద్యాలయము వజ్రోత్సవసంచిక 1918-78 తెలుగు విభాగము P43

శృంగారాన్ని గూర్చిన వారి అభిప్రాయాలు మరింత స్పష్టపడతాయి. వీరు తమ సిద్ధాంతానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్లనే నేమో వీరి రచనలలో కొన్నిపాత్రలకు పేర్లు లేవు. తృణకంకణంలో నాయికా నాయకులకు పేర్లు లేవు. స్వప్నకుమార నాయిక అనామిక. అక్కడ సిద్ధాంతమే ముఖ్యం కాని పాత్ర ప్రధానం కాదని వీరు భావించి ఉండవచ్చు. పాత్రను ఏ పేరుతో పిలిచినా ఆ సిద్ధాంతంలో మార్పు ఉండదని వీరి అభిప్రాయమై ఉంటుంది. కనుక ఆ రచనలు ప్రత్యేకంగా వీరు నమ్మిన సిద్ధాంతానికి లక్ష్యాలుగా నిలుస్తాయి. వారి సిద్ధాంతాన్ని స్పష్టం చేయడానికి వారు చిత్రించిన వాత్సల్యం, స్నేహం, దాంపత్యశృంగారాలు ఇక్కడ వివరింపబడుతున్నాయి.

# రాయప్రోలు వారి రచనలలో వాత్సల్య చిత్రణ

స్వప్నకుమారం ప్రధానంగా వాత్సల్య స్వరూపాన్ని స్పష్టం చేయడానికి ఉద్దేశించిన రచనగా తోస్తుంది. ఈ కావ్యనాయిక, కాముక భావంతో తనను సమీపించిన నాయకునికి వాత్సల్య మాధుర్యాన్ని చవిచూపి మనసు మార్చే ప్రయత్నం చేస్తుంది. ప్రేమ సరళమైన మనస్సుతో నాయకుని కామాతురతని తిరస్కరిస్తుంది. అందు చేత 'ముసుగు చెరగు దైనాస్మ' నాయకుని దయావతి అయి సమాధాన పరుస్తుంది.

'పిలిచి బ్రతిమాలి పాలీయ గలను గాని

పాలుగానుటకు నే యోగ్యురాలను గాను'.[1]

అని పవిత్ర సాత్త్వికమైన మైత్రిని కాంక్షించిన నాయకునికి మాతృవాత్సల్యామృతాన్ని పంచుతుంది. ఆత్మభావనలో కన్నమమత, కన్నుల కన్న ప్రేమ వెల్లివిరియగా 'హృదయచాపల్యానికి కైవల్యభోగ సంపదను' ఘటించింది. జననిగా ఆదరించి వాత్సల్యస్వరూపాన్ని బోధించి నాయకుని మానసిక వికాసానికి సహాయపడుతుంది.

'అంతట శుభాస్య అనసూయ యనుచు వింత

లాలసము నన్ను లాలింప 'లాలు'కుపుడు

మంచి సమయము కాదు కుమార!' యనుచు

తిన్నగా బలిఁ జేయి విదిల్చి చనియె'.[2]

అనసూయ లాగా మాతృస్థానంలో నిలబడి కామాతురుడైన నాయకుని వీక్షించింది. ముందుగా అతని కోర్కెను తిరస్కరించింది. అతని మనసు

1. స్వప్నకుమారము P 17

2. స్వప్నకుమారము P 19

మరచింపచేసి మాతృప్రేమ అవగతమయ్యేటట్లు చేస్తుంది. తత్ఫలితంగా నాయకుడు చివరికి ప్రకృతిలో మాతృమూర్తిని దర్శించగలుగుతాడు. నాయకుని దృష్టిలో వచ్చిన ఈ మార్పును నాయిక చేసిన వాత్సల్య స్వరూప ఆవిష్కరణ సాకారం చేస్తుంది. నాయికా నాయకులు మధ్య కేవలం దాంపత్య శృంగారాన్నే చిత్రించాల్సిన అవసరం లేదని, మాతృవాత్సల్యాన్ని సహితం చూపవచ్చు ననడానికి ఉదాహరణగా ఈ రచన కనబడుతుంది.

కన్నమమకారం ప్రకృతి సహజం. కన్నప్రేమ కంటె పెంచిన ప్రేమ గొప్పదన్న ఒక అభిప్రాయం లోకంలో ఉంది. కన్నప్రేమను పెంచినప్రేమను రెంటిని 'కష్టకములు' లో రాయప్రోలువారు చూపించారు. అయినా ఆ రచనలో పెంచిన ప్రేమస్వరూపం కొంత ప్రాధాన్యం వహించింది. కములు మేనత్త పూర్ణ 'దత్తప్రేమామృత' అని నిరూపిస్తుంది ఈ రచన. పూర్ణ కములను దగ్గరకు పిలిచి చెక్కిళ్లు దువ్వడం, చుబుకాన్ని పట్టుకుని ప్రతిమలాడడం, దృష్టిదోషం తగలకుండా మెటికలు విరవడం, చెమటలు తుడవడం, అలుగన చేర్చుకొనడం ఆమెకు కములపై గల వాత్సల్యానికి చక్కని నిదర్శనాలు. 'చిట్టియన్నము పెట్టిన నెయ్యంగ పైతివిగదే తల్లి' అని ఆందోళన చెందుతుంది. మానసిక వ్యధలో కములు మేనత్తను కన్నెత్తి చూడకపోతే, మాటకు సరిగా సమాధానం చెప్పకపోతే,

'ప్రాణము కంటె నెక్కుడనురాగములో లాలించి పెంచు ని
న్నాణెపు మోహపుత్రిక తనన్ చెవికింగడు గూర్పుపూర్ణ యి
ట్టాణెపు చిన్నదాని వికటంబుగ తీరు తలంచి'[1]

పడ్డ ఆవేదన, పెంచిన ప్రేమ వాత్సల్యం ఎంత తీవ్రమైనదో తెలియచేస్తుంది.

---

1 కష్టకములు - అభినవ కవిత P264

కమల మానసికంగా కలత చెందుతోందని ఊహించి 'మొగములు చిన్నబుచ్చు కాని మూసిన ముచ్చట లోన నేటికే పొగిలెదు...' అంటూ పెంచిన యత్తి మోహము తపింప చేయక!... కమల ఆవేదనకు కారణం తెలుసుకోవాలని ఆరాటపడుతుంది. కేవలం కమల మీదనే కాదు. కుమారుని పైనా ఆమెకు మమకారం ఉంది. కనుకనే 'దూరభూములు నున్న ముద్దుల కుమారు చూడజాలని కారత నిక్ జూచి తీర్చుకొనగ వచ్చితి నమ్మ' అంటుంది. ఇద్దరిని సమంగా ప్రేమించింది పూర్ణ. కుమారుని పెళ్ళిలో విషయం తెలుసుకున్న రాత్రి ఆమె కళ్ళకు నిద్ర కరువయింది. ఈ విధంగా పూర్ణపాత్రలో ప్రేమ వాత్సల్యాలను వర్ణించారు రాయప్రోలువారు.

హృదయ విదారకంగా కనిపించే శోక సన్నివేశంలో కూడా వాత్సల్యాన్ని ప్రదర్శించారు.

'నవ్వు మోములు నిండు మనసులు లోని
నాందారులు కౌగిలింతల నోలలాడు
తండ్రి బిడ్డల పరిధి తనిసిరపుడు
బదిగి స్నేహలతా వీతహోత్రులపుర!'[1]

అని స్నేహలత అగ్నికాహుతి అయినపుడు వారికి తండ్రి, బిడ్డల బంధం కలిపి తండ్రి ఒడిలో చేరిన బిడ్డగా చూపారు స్నేహలతను.

వాత్సల్యం అనేది తల్లిదండ్రులకు పిల్లలమీద, గురువులకు శిష్యుల మీద, పెద్దలకు పిన్నల మీదనే కాక ఇతర ప్రాణులపై ఉండే అవకాశం ఉంది. నడిచి బడలిన ఆయాసం తీరకుండానే తనదెదురు వచ్చిన పెంపుడు లేడిపిల్లను వాత్సల్యంతో ముద్దు చేస్తుంది హృతాకంకణ

---

1. 'స్నేహలత' - అభినవకవిత - P300

నాయిక. 'చెల్లెలా' అంటూ దాన్ని సంబోధించి ఆ మూగజీవి యోగక్షేమాలను పరామర్శిస్తుంది. నాయిక ఆప్యాయతానురాగాలు చల్లదనానికి ఆమె కాళ్ళదగ్గర నిశ్చింతగా సొమ్మసిల్లిన శిశువులాగా నిద్రిస్తుంది ఆ లేడి. మానవుడు పెంపుడు జంతువుల పైన చూపే వాత్సల్యాన్ని ఈ సందర్భంలో చిత్రించారు రాయప్రోలు వారు.

'కష్టకమలం'లో పూర్ణలో "పిన్నతీవ చెల్లెండ్ర చూపింతు గాక" అని పలికించడంలో మొక్కలపై మమకారం ధ్వనిస్తుంది. లోకి ప్రాణిపై ఉండే వాత్సల్యం భూతదయను ద్యోతకం చేస్తుంది. అదే అహింసకు పునాది. కనుకనే 'కనకము' అనే ఖండికలో 'ఈ నీటు పులుగు బోవిడువనేరదు నా మమకార మయ్యరో! అని పలికి పిట్టను పట్టిన కుమారుని పినతల్లి

'నా ప్రాణమ్ములు తల్లడిల్లెడిని డెందం బాకులం బాయు క్రీ
డా ప్రేమంకవు గాక యీ పులుగు బిడ్డన్ వేపె దెందాక'.[1]

అంటూ ప్రాణ్యేయపర దానిని విడిపిస్తుంది. ఇక్కడ భూతదయ ప్రధానమయినా ఆమె వాత్సల్యం ఆ మాటలలో ధ్వనిస్తుంది. కనుకనే రాయప్రోలువారు పెరటిలో మొక్కను, ఇంటిలోనున్న ఆవుదూడను, కన్నబిడ్డను ఒకేరకమైన వాత్సల్యంతో స్త్రీలు చూస్తారని అంటారు.

'తొట్టిలో పసిపాపను, దొడ్డిలోని
బాలవత్సమున్, తోటలో పచ్చ మొక్క
నేక వత్సల దృష్టితో సాకినట్టి
ప్రియ కుటుంబినులు --- --- ---'[2]

---

1. 'కనకము' - జడకుచ్చులు P 153
2. 'బుద్ధదీక్ష' - ఆంధ్రావళి - P 64

అని ఒక సందర్భంలో ఈ వాత్సల్యాన్ని గూర్చి చెప్పారు.

జ్ఞానవంతులయిన మానవులు తోటిప్రాణులను వాత్సల్యంతో చూడడానికి కొంత అవకాశం ఉంది. కాని సుబ్బారావుగారు తమ వాత్సల్య దృష్టిని ప్రకృతికి కూడా అన్వయించారు. ప్రాచీనకవులలో ప్రేయసీప్రియులుగా భావింపబడ్డ పద్మభ్రమరాల సంబంధాన్ని తల్లీబిడ్డల అనుబంధంగా అపూర్వసృష్టిచేసి వారి వాత్సల్యదృష్టిని మహోన్నతంగా నిరూపించారు.

"దప్పిగాని చేరిన మిళింద తనయులను
పూలపాత్రిచ్చి చీకట్లు సోకకుండ
కడుపులో దాచుకొనదె పంకజము ప్రియుడ
చేరదీసిన మమకార మేరికెరుక"[1]

"తల్లి తామర పూలపాలను
త్రాగుచున్న స్తనంధయాళిను
లంబు చేసె దరించుచున్ ---"[2]

పద్మం చేరదీసిన మమకారంలో స్తనంధయాళికులాన్ని దగ్గరకు తీస్తే, చెట్లు వాటిని కొట్టడానికి వచ్చినవారికి సహితం ఆశ్రయ వాత్సల్యం వల్ల నీడనిస్తున్నాయంటారు సుబ్బారావుగారు. తన పొదుగును బాధించినదయినా దూడను ఆవు వాత్సల్యంతో నాకుతున్నది. ఈ విధంగా సృష్టి అంతటా వాత్సల్యం గోచరిస్తున్నదని రాయప్రోలువారి ఉద్దేశం. వీరు వాత్సల్యాన్ని ఎన్నిటిలో ఏ విధంగా దర్శించి, దర్శింప

---

1. 'స్వప్నకుమారము' - P 26
2. 'తొల్కరి' - మిశ్రమంజరి P 92

చేష్టాల్లో, రచనల్లో అక్కడక్కడా వీరు చూపిన మాతృభావన చూస్తే స్పష్టం అవుతుంది. వీరి వాత్సల్య నయనాలకు మేఘపంక్తులు వాత్సల్య లహరుల్లాగా కనబడ్డాయి.

'కడల కరడుల కరడువై వెడలుచుండె
మధుర జలధర పంక్తులు మాతృ హృద్య
మధుర మెడలెడు వాత్సల్య లహరు లట్లు'[1]

అని అంటారు. ప్రకృతిలో సహజంగా జరిగే సంఘటనల్లో కూడా వీరు వాత్సల్యాన్ని దర్శించారు.

'నిండు రెక్కల క్రింద నిదురించు నెలకూన
లను రేప పాడేటి మును పుల్గు బాదెంత'.[2]

'పూలబిడ్డల ప్రీతి నుయ్యాల లూపు పవనుడు'[3]

'తల్లితీవియ విడచి క్రిందకును జారి
ఏకతము నూగు నాక లవలే కుమారి...'[4]

పూలతీగల్లో వాత్సల్యానురాగబంధం అనుసంధించడం ఇక్కడ ప్రత్యేకత. పక్షులు కూయడం, గాలికి పూలు కదలడం అతి సహజమైన విషయాలు. కాని వాటిలో తల్లి పిల్లకు పాడే లాలిపాటను, తండ్రి బిడ్డను నిద్రపుచ్చు దానికి ఉయ్యాల ఊపడాన్ని ఊహించడం రాయప్రోలువారి వాత్సల్య దర్శనానికి చక్కని నిదర్శనాలు. నదు పల్లానికి పారడం సహజం. నీటిలో

---

1. 'తృప్తి' - జడకుచ్చులు P 92
2. 'శ్రీ శివశంకర శాస్త్రి' - ఆంధ్రావళి P 46
3. స్వప్నకుమారము P 17
4. తృణకములు - అభినవ కవిత P 260

నీరు, ఏటిలో ఏరు కలవడం వింతకాదు. కాని రెండు నదుల కలయికలో మాతృమమతలను చూడడం, తల్లి ఒడిలోకి శిశువును తీసుకున్న వాత్సల్యాన్ని చిత్రించడం రాయప్రోలు వారి వర్ణనా వైశిష్ట్యం

"తల్లి భాగీరథీ దేవి చల్లనయిన
కడుపునన్ దాచి ధన్యయై కలిసిపోయె
పూత యమునాతరంగిణి ..."[1]

అని అంటూ గంగాయమునల సంగమానికి తల్లీబిడ్డల భావబంధాన్ని ఆపాదించారు. ఈ రకంగా సుబ్బారావుగారు ప్రకృతిలో కూడా వాత్సల్య మాధుర్యాన్ని దర్శించి రమ్యంగా చిత్రించారు.

---

1. 'స్నేహలత' - అభినవకవిత P 288

# స్నేహ చిత్రణ

రాయప్రోలు వారి కావ్యాల్లో స్నేహానికి ప్రముఖస్థానం ఉంది.[1] దాదాపుగా అన్ని కావ్యాల్లోనూ స్నేహితులైన కొన్ని పాత్రలు సృష్టింపబడ్డాయి. మోహ రహితమైన స్నేహ మాధుర్యాన్ని చవిచూపడానికి వీరు ప్రయత్నించారు.

"కలిసిన పుష్పముల పాత్రిక
విడువని పరిమళము పరిధి విధి నియమములన్
విడిబడియును వారల పెం
పుడు మైత్రీ ప్రేమ బంధములు తెగవవురా!"[2]

---

1. "రాయప్రోలు కావ్యాలన్నిట్లో నిండు తొణుకుగా స్నేహ భావము యొక్క మాధుర్యము చిత్రితమైనది. అన్నా చెల్లెండ్ర మధ్యనుండు భావమునూ, తల్లీ బిడ్డల మధ్యనుండు వాత్సల్యమునూ, ప్రేయసీ ప్రియుల మధ్యనుండు ప్రేమయునూ వీనినన్నిటినున్నది స్నేహమే. దీని నుదాత్తము చేసి చిత్రించి పోషించి భక్తి శృంగారముల పర్యవసించునట్లు సిద్ధాంతీకరించినారు. ... స్నేహమునుండి లోకమునకు కలుషితమైన యాదరమును గోల్పోవుచున్నదను వేదనమునకే నీ కవి దానిని అమలినముగా చేసి యమృతత్వము కల్పింప సంకల్పించి తన కావ్యముల వ్రాసినారు. స్నేహమందున్న మోహమును క్షాళనము చేసి స్వచ్ఛమైన మధుర భావముగా దానిని నిరూపించుటకు గావ్యావతరణము గావించినారు."
'సాహిత్య సంపద' - పిల్లలమర్రి హనుమంతరావు P 87
2. తృణకంకణము - అభినవ కవిత P 249

బలీయమైన విధివల్ల విడిబడిగూడా మైత్రీబంధం తెగదన్న విషయాన్ని విశదీకరిస్తుంది వ్రణకంకణం. స్త్రీ పురుషుల మధ్య స్నేహాన్ని చూపడం ఈ రచన ఉద్దేశం అని అనుకోవచ్చు. పవిత్రప్రేమకు వివాహమే అవసరం కాదనీ అంతరంగాల్ని కలిపి ముడివేసే స్నేహానికి ప్రాధాన్యాన్నిచ్చేవారికి సంయోగ వియోగాలు సరిసమానమేననీ వ్రణకంకణం సూచిస్తుంది. ప్రేమ విఫలమై వివాహం జరగనప్పుడు క్షణికమైన విషయసుఖేచ్ఛల నుంచి మనసు మరల్చడమే వివేకం అని ఈ రచన సందేశాన్నిస్తుంది.

దీనిలో నాయికానాయకులు బాల్యస్నేహితులు. వివాహం చేసుకోవాలనుకున్నారు. కాని విధివశాత్తు వారి వివాహం కాలేదు. వివాహాన్ని వాంఛించిన నాయకుడు విఫలమనోరథుడై వ్యథ చెందసాగాడు. చిన్ననాటి నుండి 'వేరుపెరుంగక ఒక కంచమునన్ భుజించి పెరిగి' పెద్దలయిన వారి మధ్య అనన్యానురాగం అభివృద్ధి పొందింది. ఆ అనురాగాన్ని పురస్కరించుకుని వివేకవతి అయిన నాయిక నాయకుని మానసిక తాపాన్ని పోగొట్టి సమాధానపరిచింది. ఈ ప్రయత్నంలో ఆమె ప్రేమస్వరూపాన్ని, స్నేహమాధుర్యాన్ని, దాంపత్యస్వరూపాన్ని విశదపరుస్తుంది. ప్రేమకు వలపుకు ఉన్న భేదాన్ని స్పష్టం చేస్తుంది.

"మనసుచే వాక్కుచేత కర్మంబు చేత
కలుషితములు కాదగినవే వలపులవని
తపసుచే భక్తిచే ధ్యాన ధార చేత
లీనమై ఐక్యమయి జాలినది ప్రేమ"[1]

---

1. వ్రణకంకణము - అభినవ కవిత P245

తమ మధ్య ఉన్న చెలికాడపు మమత సన్నగిలకుండా ప్రేమబంధాన్ని కొనసాగించుకోవచ్చునని నచ్చచెబుతుంది.

"వలపు నశియించినయును ప్రేమ నిలువగలదు
యేని కలదైన కలుషము గాని స్నేహ
మ్మును మధు రసానుభూతిని బాపరి మనము
నీడలట్టుల నైక్యమందెదము గాక" 1

అని చెప్తూ వివాహమే ప్రధానం కాదని స్నేహంలో కలకాలం స్నేహానురాగాలను నిష్కల్మషంగా పంచుకోవచ్చునని వ్రణాకంకణం నాయిక నాయకుని సమాధానపరుస్తుంది. ఈ కావ్యముఖంగా రాయప్రోలువారు యువతీయువకుల నడుమ శారీరక సంబంధం ప్రధానం కాదని, స్నేహంలో కలిసి ఉండి ఆనందాన్ని అనుభవించవచ్చునని సమాజానికి సందేశాన్నిచ్చారు. నాయిక స్థానంలో వారు నిలబడి సమాజాన్ని నాయకునిగా భావనచేసి ప్రేమ తత్త్వాన్ని విప్పిచెప్పారు.

రూపనవనీతం బాలావరకు స్నేహాన్ని ప్రధానం చేసుకున్న రచన. స్నేహపీఠికను సృష్టించి దానిని జతల స్నేహితుల స్నేహబంధాలను చిత్రించారు. స్నేహాన్ని గూర్చిన అభిప్రాయాలను ఎన్నిటినో సుబ్బారావుగారు దీనిలో వ్యక్తీకరించారు. స్నేహాన్ని వివిధ కోణాల నుంచి పరిశీలించి కష్టాలను నష్టాలను అన్నిటినీ ప్రదర్శించారు. సమాజ పరిస్థితులను వ్యక్తుల బలహీనతలను దృష్టిలో పెట్టుకుని 'సహవాస మార్గంలోని గోతులను సహితం చూపించారు.

---

1. వ్రణాకంకణము - అభినవకవిత P 248

ఇల్లు శోభిల్లడానికి దీపమూ, జీవితం జేగీయమానం కావడానికి స్నేహం ఆధారం అంటారు సుబ్బారావు గారు. ఇంట్లో ఉండే చీకటిని దీపకాంతి ఛేదిస్తే, దేశంలో జాతిలో ఉండే మూఢత్వాన్ని సత్సమాజం తొలగిస్తుంది. మంచి సమాజానికి స్నేహం ముఖ్యం. దీపానికి తైలంలాగా సమాజానికి స్నేహం పోషకం. తైలం మడ్డి కడితే దీపం ప్రకాశించదు. అదే విధంగా స్నేహం కలుషితమయితే సమాజం అల్లకల్లోలమై, తేజోవిహీన మవుతుంది.

"స్నేహపూరంబులో ప్రకాశించి మించె
మానవులు నివ్వెరాన్న సమాజ దీప
మది చెదరి, చింది, పంకిలమయిన, సకల
హీనమును గాదె ఇండ్ల వాకిండ్ల వరుస"[1]

మైత్రి మలినమై మసిపాతి చెడిపోవడానికి కనబడుతున్న కారణాలను, అవకాశాలను ఈ రచనలో రాయప్రోలు వారు చూపారు.

స్నేహమాధుర్యాన్ని కొన్నిపాత్రలలో పలికించారు. 'రూపనవనీతం'లో సుందరుడు తన తొందరపాటు వల్ల వకుళమాలకు తనకు మధ్యనున్న మధురమయిన స్నేహానికి భంగం వాటిల్లినందుకు పశ్చాత్తాప పడతాడు. వకుళ స్నేహపాత్ర సమర్పించిందని వ్యథ చెందుతాడు. ఆ సందర్భంలో 'నిజంగా స్నేహభాండమును మోసిన మదితుపైన విఘ్నమయితే ధన్యము'[2] అని అంటాడు. పరంజ్యోతి అతనిని ఊరడిస్తూ స్నేహమే

---

1. రూపనవనీతము P 96
2. రూపనవనీతము P 24

స్నేహమొక్కటే సుమా సుఖప్రకాశనమును పోషిస్తుంది.... మానవునకు అంతఃకరణమనే ఒక గొప్ప కోశమున్నది. అది స్నేహద్వారా శాంతమైతే విప్పివిప్పారుతుంది. ఆ మహనీయావస్థే సుమానుషత్వం"[1] అని చెప్తారు. సునందుడు మైత్రీ స్నేహాలు రెండూ మనసుకు సహజలక్షణాలని చెప్పి "మొదటినుంచీ మనస్సుకు మైత్రీ సంగం నేర్పాలె ఆ వ్యసనం ఆ తీపి నిలబడే సాధన కావాలె"[2] అంటాడు.

ఈ రూపకంలో వచ్చే ముఖ్యపాత్రలన్నీ దాదాపుగా ఒకరికి ఒకరు స్నేహితులే. దీనిలోని ప్రధాన ఇతివృత్తానికి స్నేహమే ఆధారం అని అనుకోవచ్చు. 'లలిత', 'ప్రణయకంకణము', 'అనుమతి', 'కృష్ణకమలు' కావ్యాలలో నాయికా నాయకులు 'ఆజన్మాప్త మైత్రి' కలవారే. 'స్నేహలత' లో స్నేహలత, ప్రియంవదలు శరీరాలు మాత్రం వేరైన ప్రాణమిత్రులు. ఈ విధంగా వీరి రచనల్లో చాలావరకు మధ్య స్నేహాన్ని సృష్టించి స్నేహానికి ప్రముఖస్థానాన్నిచ్చారు.

బాంధవ్యం ఉన్న వ్యక్తుల మధ్య కూడా స్నేహం ఉన్నట్లు రాయప్రోలు వారు భావించారు. 'కన్న చెలిమి', 'పెంచిన చెలిమి' అని చెప్పి ఆ చెలిమి వల్లనే పరస్పరం వదలి ఉండలేక పోతున్నారని వీరంటారు.

"... అంపకపు నాడు కవుంగిలి బాయలేని ఏ
మెత్తని తల్లికన్న చెలిమిన్..."[3]

---

1, 2 'రూపనవనీతమ్' P 43, 45, 64

3 'కాయలు - జడకుచ్చులు' P 145.

శకుంతల అంపకాలప్పుడు సర్వసంగపరిత్యాగి అయిన కణ్వుని బాష్పను పెంచిన చెలిమి కారణమని వీరి అభిప్రాయం. వస్తువు సన్నిహితంగా మసలడం వల్ల స్నేహబంధం దృఢపడుతుందని వీరి ఉద్దేశం.

ఈ స్నేహాన్ని రాయప్రోలు వారు ప్రకృతికి కూడా ఆపాదించారు. శిశిరానికి పూలు, తీగలు శోభావిహీనం కావడం, వసంతానికి కనులు పండుగ చేయడం ప్రకృతి సహజం.

"నీవు తరుణా స్నేహ విరహము
నిలుపరాని దురాతపంబున
డీగులు పడి చెడి సొగసు మాసెను
తీగెలును పూలును వగన్"--..

అని దీనికి స్నేహవిరహం కారణం అన్నారు సుబ్బారావుగారు.

'మిత్రవశ్యం కాని మనీష ఉండదు' అంటూ విశ్వసించిన రాయప్రోలు వారు స్నేహం పొందడం కూడా పుణ్యఫలంగా చెప్తారు. 'సాహసవ్రతం'[1] అని స్నేహానికి వ్రతదీక్షను జోడించారు. వ్రతం అనగానే నియమనిష్ఠలు, దీక్ష, పవిత్రత స్ఫురిస్తాయి. వ్రతానికుండే శ్రద్ధాసక్తులు సాహసానికి కూడా అవసరమే అని వ్రతం అనే శబ్ద ధ్వని వల్ల సూచింపబడిందని ఊహించవచ్చు. కనుకనే నేమో,

"అరసి యర్చింపుమా జగదంబ నపుడు
స్నేహదీపము వెలిగించి ----"[2]

---

1. "...విడుపూ తడుపూ లేకుండా మేము కలిసి మెలిసి పారుపూ మరుపూ లేని సాహసవ్రతం జరిపాము" - 'రూపనవనీతము' P30
2. వెనుకటోట - అభినవకవిత P340

అని అన్నారు. స్నేహదీపం అన్నపుడు స్నేహానికి తైలం అన్న అర్థంతో పాటు 'స్నేహం అనే దీపం' వెలిగించమన్న ధ్వనిని సహితం రాయప్రోలువారు ఉద్దేశించి ఉంటారని ఊహించవచ్చు.

స్నేహానికి ఇంత ప్రాధాన్యాన్నివ్వబట్టే వారి కావ్యతత్త్వాన్ని గూర్చిన ప్రస్తావనలో 'నా రచనల్లో Philosophy స్నేహం'[1] అని అన్నారు. స్నేహం విశ్వాన్ని మధుమంతం చేస్తుంది. అది నశిస్తే లోకమంతా పాడుబడి శుష్క కాననం లాగా తయారవుతుంది. స్నేహం లేని శూన్యప్రపంచంలో పొందు పొత్తు లేక, తోడు నీడ లేక ప్రాణుల జీవనం కష్టసాధ్యం అని వీరి అభిప్రాయం. కనుకనే

'మైత్రిని పోలిన ధర్మపు
సూత్రము వేరొండు లేదు సూ మనుజులకున్
ధాత్రిన్ దానిని నడిపిన
పాత్రత నిహపరసుఖమ్ము లవశ్యము కలుగున్'[2]

అని అన్నారు.

---

1 Interview on 11-6-81

2. 'భావస్థిరాణి జననాంతర సౌహృదాని' (వ్యాసము) రాయప్రోలు సుబ్బారావు 'సరస్వతీ సామ్రాజ్యశ్రీ' - అయ్యంకి వేంకట రమణయ్య గారి సన్మాన సంచిక. P 123

# దాంపత్య చిత్రణ

సుబ్బారావుగారు సంభోగ శృంగారం కంటె విప్రలంభ శృంగారం ఆదరణీయం అని అన్నప్పటికీ, శారీరక సుఖానికి ప్రాధాన్యాన్నివ్వని అమలిన శృంగార సిద్ధాంతాన్ని ప్రతిపాదించినప్పటికీ దాంపత్యధర్మానికి వ్యతిరేకులు కారు. వీరి దృష్టిలో గృహస్థాశ్రమానికి తగినంత గౌరవం ఉంది. గార్హస్థ్యాన్ని అల్పదృష్టితో వీక్షించి, సంసార సుఖాలను త్యజించి సన్యాసాశ్రమం స్వీకరించడాన్ని వీరు ఆదరించలేదు. సుఖాలనన్నిటినీ వదిలి జీవించడం వీరి ఆదర్శం కాదు. కనుకనే

"చారు సంసార ముఖ్య సుఖోత్సవము వదలి
అడవుల చరింప కలదె కాసంత ఫలము?
పడుచు తనవు పరాగముల్ వదల నగునె
సర్వసంగ పరిత్యాగ శాంతి వారె."[1]

అని అన్నారు. ఇంతేకాకుండా ఈ విధంగా సన్యసించి అడవులలో చరించమని ఎవరయినా చెప్పారా? లేక నీకే కుతూహలం కలిగిందా? అని ప్రశ్నిస్తూ 'ఏటికిట్లు లాతురగతి నొంటి బావ పెడత్రోవల బట్టెను నీదు బుద్ధి? అని 'లలిత'లో నాయకునితో అడిగిస్తారు. ఇక్కడ సంసార సుఖాలను వదిలి అడవులు పట్టడం 'పెడత్రోవ' అనే వీరి భావం ధ్వనిస్తుంది.

ధర్మార్థ కామ మోక్షాలలో తృతీయ పురుషార్థాన్ని

---

1. 'లలిత' - అభినవ కవిత P 207

వీరు నిరసించలేదు. ఏకాగ్రమైన మనోహరానందాన్ని కాంక్షించడం దోషం కాదంటారు.

'ఏకాగ్రస్థాయికి మది
నాకర్షించెడి మనోహరానందము నే
లా కాంక్షింపగరాదు? ని
రాకృతమదె కామవర్గ దమ్యార్చనముల్' [1]

ప్రాణులన్నిట్లో ఉన్న కామంలో కూడా దివ్యాంశ ఉందంటారు ఈ సందర్భంలో.[2] ఆంధ్రుల తత్వాన్ని గూర్చి చెబుతూ "సన్యాస ప్రవృత్తి వారికి బొత్తిగా గిట్టదు. నాగరక గృహస్థాశ్రమం వారికి అభీష్టాప్తి. భోగ భాగ్యాలు ఉపాదేయాలే గాని గర్హ్యాలు కావు. అందువల్లనే వైరాగుల్లో ఆంధ్రులు తక్కువ.... మన పూర్వులిచ్చిపోయిన తెనుగుమాన్యం శృంగార వనం గాని వేదాంత మఠం కాదు."[3] అని వారి అభిప్రాయాన్ని వెల్లడి

1. స్వప్నకుమారము P 24
2. "భామతి: రామాయణములో సీతారాముల మిథునకామము విపాకమును పొందింది. అందువల్లనే ముని కంఠాన స్పందించిన సుందరకాండ అమృతభాండమైనది. దంపతీ ఖ్యాతమయిన ఆ కామం త్రివర్గపరిరక్షితమయిన శుద్ధకామం. అది అవ్యభిచారి. సృష్టిలో ఈ దివ్యాంశ నిగూఢమై సార్వత్రికంగా ఉన్నది.
   పరం: కామము కూడా దివ్యాంశ అని భగవతి భావమా?
   భామతి: ప్రకృతి, పురుషుల ప్రణయైక విలయమే కామం. ఏతన్మహో మధుర యోగస్థాయియే రతి..." రూపనవనీతము - P 112, 113
3. 'కవి త్యాగి రుచులు ప్రాతవీ- క్రొత్తవీ' (వ్యాసం) రాయప్రోలు సుబ్బారావు.
   భారతి - నవంబరు 1939

చేశారు. వీటిని బట్టి రాయప్రోలు వారు తృతీయ పురుషార్థానికి గాని, గృహస్థాశ్రమ ధర్మానికి గాని వ్యతిరేకులు కారని తెలుస్తున్నది.

'సంభోగవిధి క్షయమే' అయినా అది ప్రజాతంతు నిర్వాహక సూత్రం. కనుకనే దానిని దంపతీనిష్ఠ ధర్మంగా గ్రహించాలన్నారు రాయప్రోలు వారు. వీరి దృష్టిలో దాంపత్యం మహాక్రతువు. అందుకే దాంపత్యాన్ని సవనమని, క్రతువని, స్త్రీపుంస యోగమని అభివ్యక్తం చేస్తుంటారు. ప్రజాతంతు పాలనమే దైవమైన ధర్మము. అది సవనమ్మట్లు మహాక్రతువే. --- జగత్కళ్యాణము గార్హస్థ్యమూలంగానే జరుగుచున్నది... అపత్య గ్రంథి బంధనంలో ఆడు దానికి పాణిగ్రహణ వ్రతము ఫలిస్తున్నది.... దంపతీనియతము కాని మిథున సాంగత్యంలో జీవితము అబద్ధమై అనర్థగ్రస్తమవుతుందని పర్యవసానం. --- దాంపత్య గ్రహణంలో అవ్యక్తంగా ఒక మహాక్రతువు జరుగుతున్నది. పురుషుడు శిక్షాకైంకర్యమైన బ్రహ్మచర్యను పరిత్యాగం చేస్తున్నాడు. స్త్రీకూడా పితృగోత్రంలో బాటు తన అక్షయ కన్యా సౌభాగ్యమును విసర్జిస్తున్నది. ఉభయత్యాగ భాగధేయమే దాంపత్యం. అది అపత్యరూపాదికంగా స్వాత్మావలోకనను సాధనమౌతున్నది? ...[1]

ఈ విధంగా దాంపత్యం ఉభయత్యాగ భాగధేయమనే అభిప్రాయాన్ని రూపనవనీతంలో వ్యక్తపరిచారు. ప్రకృతి పురుషుల లీలగా దాంపత్యాన్ని వీరు స్వీకరించినట్లు కనబడుతుంది. కనుకనే దాంపత్యాన్ని చెప్పేటప్పుడు నరనారీ సంబంధం అనీ స్త్రీపుంసయోగమనీ వ్యవహరిస్తుంటారు. సంభోగం అన్న శబ్దాన్ని ప్రయోగించటం

---

1. 'రూపనవనీతమ్' - P 45, 46, 85, 87

వారికంత ఇష్టమైనది కాదు.[1] అటువంటి సందర్భాలలో భోగార్చన, ప్రణయార్చన అని వర్ణిస్తుంటారు.

"పచ్చిమబ్బుల తమ్మిపూబట్టరమున
తళుకు బరమోడ్పు గాను జంట కలువలమర
బాలు లతికల విసరు మంజరుల తోడ
చెలియ తోచె భోగార్చన సలిపినట్లు."[2]

వారి రచనల్లో 'లలిత' కావ్యంలో కథ వివాహాంతంగా ఉంది. పరస్పరం ప్రేమించుకున్న నాయికానాయకులు విధివశాత్తు వివాహానికి దూరమై బాధపడతారు. నాయిక ధైర్యసాహసాల వల్ల వారు తిరిగి కలుసుకుని దంపతులయ్యారు. దీనికి మూలం ఇంగ్లీషు సాహిత్యంలోనిదయినా[3] రాయప్రోలు వారు ప్రతిపాదించదలుచుకున్న ప్రేమతత్త్వ ప్రణాళికలో దీనికి స్థానం లభించింది.

కాయిక భోగానికి అతీతంగా దంపతుల ఆత్మలను ముడివేసి కలిపి ఉంచేది స్నేహం అని రాయప్రోలు వారి విశ్వాసం. వసంతఋతువులో ప్రకృతికి వచ్చే శోభలన్నీ హేమంతాగమనంలో కళావిహీనమవుతాయి. అదే విధంగా యౌవనావిర్భావంలో వచ్చే కోరికలు, వలపులు కాలక్రమంగా వార్ధక్యంలో వసివాడి నశిస్తాయి. కాని స్థిరంగా దంపతుల మధ్య నిలిచేది

---

1. "'సంభోగ' శబ్దం వాడటం నాకిష్టం లేక 'భోగార్చన చేసినట్లు' అని అన్నాను". Interview on 11-6-81
2. రమ్యాలోకము P34
3. రాయప్రోలు వారి 'లలిత' గోల్డ్‌స్మిత్ ఇంగ్లీషు రచన హెర్మిట్‌కు అనుసరణ.

స్నేహం అని వీరి ఉద్దేశం. దాంపత్య ప్రసక్తిలో చెలిమి, స్నేహం, సహవాసం అను శబ్దాలను ఎక్కువగా ప్రయోగించారు.

స్వప్నకుమారంలో నాయకుడు కామమోహితుడయి నప్పటికీ స్వప్నసుందరి గూర్చి 'ఆ దయావతి సహవాస మాసగాంచి' అని అంటాడు. తరువాత తన ప్రేమవృత్తాంతం చెప్తూ 'ఎట్టకేలుగన్ ముదివరె నా సరాగ కెలక ముగ్ధని స్నేహ విదగ్ధ చింతులన్' అని తన ప్రేమ స్నేహంలో ముడిపడ్డట్లు చెప్పింది. 'బ్రహ్మముడి' (మిశ్రమంజరి) అను ఖండికలో స్త్రీ పురుషుల కలయికను గూర్చి చెప్పినపుడు రాయప్రోలు వారు

'పట్టజాలని పలుకరాని అవశ్య హృదయ రహస్య లాలస
అడిగె నరుదా పడుచు స్నేహము ----
సహచరీ సహచరులుగా స్త్రీ పురుషులాదట కలిసి మెలసిరి.'[1]

అని వారి సహవాసాన్ని ప్రధానంగా చెప్పారు. వీరు ఒక సందర్భంలో నూతన దంపతులను ఆశీర్వదిస్తూ

'-- ఈ నవపీతాంబర సూత్రధారుల కఖండ స్నేహ ధర్మాశ్రితో
త్సవముల్ గూర్తురు గాత --'[2]

అని అఖండమయిన స్నేహం వారికి కలగాలని కోరుకున్నారు. ఈ విధంగా దంపతులను స్నేహితులుగా, వారి మధ్య అనుబంధంలో చెలిమిని ప్రధానంగా వర్ణిస్తారు రాయప్రోలు వారు.

రాయప్రోలు వారి దృష్టిలో దాంపత్యానికి సముచిత స్థానం ఉంది. 'కళత్రము అర్ధాంగి. ఆమె సాహచర్యము లేకపోతే జీవితము సాంగోపాంగ

---

1. 'బ్రహ్మముడి' - మిశ్రమంజరి P 129, 130
2. 'దీవన' - వనమాల P 78

వికాసమును పొందదు. దక్షిణము లేని ఉత్తరమవుతుంది. మానసకాసారంలో విహరించే హంసకు రెండు రెక్కలు కావాలె. అదిగాక, నిష్పంకత్వము ప్రాణిలోకమునకు నిసర్గలక్షణము కాదు'అని అంటారు సుబ్బారావుగారు.[1]* ప్రేమ సరస్సు మిథున పద్మాలలో ప్రకాశిస్తోందని అంటారు.[2]

ఈ విధంగా వాత్సల్యం, స్నేహం, దాంపత్యం సందర్భోచితంగా వర్ణన చేయడమే కాకుండా ప్రేమతత్త్వాన్ని చెప్పేటప్పుడు సాధారణంగా ఆ మూడింటిని కలిపి చెబుతుంటారు.

"తల్లిం బిడ్డలలో విలీనమగు వాత్సల్యంబు, మైత్రీ సము
త్ఫుల్లాంతఃకరణాప్తులౌ సఖుల సాధు స్నేహముల్, ధర్మసం
పల్లగ్నాత్మసహాయ కంకణుల దాంపత్యంబు, హాలాతి వ
ర్తిల్లన్ ప్రేమ రసాతిరేక పరిపూర్ణీభూత జీవంబులై."[3]

"వలపుల పూలసంకెలలు బంధము చేయగ గువ్వజంట, ని
ర్మలమగు వత్సలత్వ మెద రాగిల నావుల తల్లిబిడ్డ, లే
కలుషము లేని సత్ప్రణయ కాంక్షలు మేళన చేయు మిత్రముల్,
మెలకువ కీ రహస్యమె సుమీ! కనిపించెడు సృష్టియందునన్."[4]

సృష్టిలో అంతటా దాంపత్య శృంగారం, స్నేహం, వాత్సల్యం కనబడుతున్నట్లు వీరు భావించారు. తల్లి, పాలు త్రాగే లేగబిడ్డలు తల్లిబిడ్డల వత్సలతా సౌందర్యాన్ని వ్యక్తం చేస్తాయి. పవనతరంగపు ఉయ్యాలలో పవళించడం

---

1. తృణకంకణము - నివేదన P5
2. 'అడివారి చిన్నాడు' - వనమాల - P60
3. 'లలిత' - అభినవకవిత P 212
4. తృణకంకణము - అభినవకవిత P 245

నేర్పిన విహంగం ప్రేమవైభవపరిణామ గీతాలు పాడుతుంటుంది. పువ్వుల్లో తేనెల్లో, పక్షిగూళ్ళల్లో అన్నిటా ప్రేమరసమే చిందుతున్నది. ఆకాశంలో తారకలు సహితం మోహం వల్ల ఆకాశాన్ని వదలలేకుండా ఉన్నాయి. గువ్వ జంట స్నేహకాంక్షలో వియోగాన్ని భరింపలేకుండా ఉంది. స్తన్యమోహం వల్ల పుత్రుని ముద్దాడే సౌఖ్యాన్ని తల్లి విడలేదు. రాత్రింబగళ్ళు, వెన్నెల, వేడి అందించే చంద్రుడు, సూర్యుడు, ప్రాణాన్నిచ్చే పవనము, జలసమృద్ధి నిచ్చే మేఘాలు - వీటి వ్యాప్తి అంతా ప్రేమభరితమే. నిర్మలమయిన కంఠంలో 'అంబా' అంటూ అరిచే ఆవుదూడ అరుపులో, కొమ్మమీద కలవరించే చిన్నిచిలుక పలుకులో సుప్రభాత జనయిత్రి వాత్సల్యం, సృష్టిలోని సజీవ ప్రేమ మహోత్సవం ప్రకటింపబడుతున్నాయి. పాలు త్రాగిన పారవశ్యంలో కేరింతలాడే లేగదూడల చెంగనాలు, తల్లి పాలసారాన్ని గ్రోలిన బిడ్డ ముఖం, తొలకరి వానలకు పులకించిన పంటచేలో గుప్పున నలుమూలలా వ్యాపించే కమ్మని వాసనలూ ప్రేమరసస్నాత సుగంధాన్ని వెదజల్లుతాయి. నిశ్శబ్ద నిశీథంలో అరణ్యమధ్యంలో పికి కూత ప్రేమావేశంలో పలికినట్లుంటుంది. గువ్వజంట, ఆవూదూడ, స్నేహితులు కాలుష్యరహితమైన ప్రణయంలో మెలగడం జరుగుతుంది. ఇలా సుమాలు కామం లేని మేళనసుఖంలో పరస్పరం విడనాడలేకుండా ఉన్నాయి. ఈ విధంగా సృష్టిసమస్తం వాత్సల్యం, స్నేహం, దాంపత్యాలలో కూడిన ప్రేమమయంగా సుబ్బారావుగారు భావించారు.

శ్రీ రవీంద్ర కవి గూర్చి రాయప్రోలు వారు

"పకపక నవ్వేటి పసిబాల పెదవులన్
పారువు వెన్నెల పూయు పడతి క్రాల్గన్నులన్

చనుబాలు జడిగానే జనని నిందు తియగాన

ప్రేమ కళాంశనే వీక్షించినావు..."[1]

అని అన్నారు. కాని ఆ పలుకులు రాయప్రోలువారి పట్ల పూర్తి సత్యాలుగా అన్వయిస్తాయి. ఈ విధంగా పరమపవిత్రమయిన ప్రేమను అందరు గుర్తించాలని ఆశించారు. కనుకనే

"పరమ శుచినాప్పు ప్రేమ ప్రపంచమునకు

నడుచు మార్గము మరల నేర్పుమనె సఖియు!"[2]

అని స్నేహలతలో ప్రశ్నిస్తారు.

ఈ విధంగా వీరు భావించిన స్నేహ, వాత్సల్య, దాంపత్య ప్రేమలతో కూడిన అమలిన శృంగార ప్రణాళికననుసరించి ఇతివృత్తాలను గ్రహించారనుకోవచ్చు.

## స్వీకరించిన ఇతివృత్తాలలో ప్రేమసమస్యలు

ఆధునిక సమాజంలో స్త్రీ పురుషుల పరిచయ సాన్నిహిత్యాలవల్ల వారిలో కొందరు వివాహం చేసుకోవాలని కోరుకోవచ్చు. అయితే కొందరి విషయంలో వివాహం సానుకూలపడటం మరికొందరి విషయంలో విఫలం కావడం సహజం. అటువంటి సందర్భాలలో ఉత్పన్నమయ్యే సమస్యలు ఏ విధంగా ఉండే అవకాశం ఉందో ఊహించి రాయప్రోలువారు ఇతివృత్తాలను గ్రహించినట్లు తోస్తుంది. కనుకనే వారి కావ్యాలలో అధికభాగం ప్రేమే ప్రధానపాత్ర వహించింది.[3]

వివాహం వాంఛించిన స్త్రీ పురుషులకు పరిస్థితులు మధ్యలో కొంత విముఖంగా ఉన్నా వారి ప్రయత్నం సానుకూల పడితే సమస్యే లేదు. కథలో

---

1. శ్రీ రవీంద్రకవి - ఆంధ్రావళి P 44
2. 'స్నేహలత' - అభినవకవిత P 290
3. "రాయప్రోలు ఉపదేశించదలచినది ప్రేమభగవద్గీతలను. ఆయన కావ్యాల

ఈ విశిష్టమైన ముగింపు 'లలిత'లో కనబడుతుంది. నాయిక వివాహం ఇతరులతో జరిగి నాయకుడు అవివాహితుడిగా మిగిలితే సమస్య ఏవిధంగా ఉంటుందో పుణాకంకణం చూపుతుంది. నాయకునికి వేరే వ్యక్తితో వివాహం జరిగి నాయిక అవివాహితగా ఉండటం 'అనుమతి'లో కనబడుతుంది. నాయకుడు నాయిక సాహచర్యాన్ని వాంఛించినా నాయిక వివాహానికి విముఖంగా ఉండి కేవలం వాత్సల్యదృష్టితో నాయకుని దర్శిస్తే ఏవిధంగా ఉంటుందో 'స్వప్నకుమారం' చూపుతుంది. నాయిక ముగ్ధ అయి, ఒకచోట పుట్టిపెరిగిన సావాసం వల్ల అభిమానమే గాని, వివాహం స్ఫూర్తి ఆలోచించే వయసు కూడా లేని అమాయిక అయినప్పుడు సమస్య ఏరకంగా ఉంటుందో 'కష్టకమల'లో కనబడుతుంది. నాయికానాయకులు ఇద్దరూ వివాహితులై స్నేహంతో సంచరిస్తూ, నాయకుని యాచ్ఞాదీనతను నాయిక దాక్షిణ్యం చూపి శీలదానం చేస్తే వచ్చే సమస్య ఎటువంటిదో 'రూపనవనీతమ్' ప్రదర్శిస్తుంది. ఇక నాయికా నాయకులకు పరిచయం లేకపోయినా ఆర్థికసమస్య వారి వివాహానికి అడ్డు నిలిస్తే పర్యవసానం ఏవిధంగా ఉంటుందో స్నేహలత చూపుతుంది.

'లలిత'లో నాయకుడు ప్రేమించిన పడతితో వివాహం

---

(కొనసాగి)

కళ్లు స్నేహలతాదేవి తప్ప అన్నీ కల్పితాలు. లలిత, అనుమతి నాయికలలో ఈయన ప్రారంభించిన ప్రేమశాఖలు పుణాకంకణంలో అప్రాప్తప్రేమ, కష్టకమలలో వికసించని ప్రేమ, స్నేహలతలో కుటుంబప్రేమగా విస్తరించాయి.

'అర్ధశతాబ్దపు ఆంధ్రకవిత్వము' (వ్యాసము)

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి - భారతి - నవంబరు 1962

జరుగదని నిరాశ చెంది అడవులు పట్టిపోయాడు. 'మృణాకంకణం' లో నాయకుడు నాయికను వేరొకరితో వివాహం జరిగిందని తెలిసి ఆమెనే ధ్యానిస్తూ వైరాగ్యంతో వివాహానికి విముఖత చూపాడు. 'అనుమతి' లో వేరొకరిని వివాహం చేసుకున్నా విధివశాత్తు అల్పాయుష్కుడయ్యాడు. 'కష్టకమల' లో నాయకుడు అమాయిక అయిన నాయిక స్వభావం తెలుసుకోక ప్రణయలేఖ వ్రాసి ఆమె మానసికవ్యథకు కారణమయ్యాడు. 'స్వప్నకుమారి' లో నాయిక మృదువుగా తిరస్కరించినా కామాతురుడై ఆమెను కోరాడు. కాని వివేకంతో నాయిక వాత్సల్యాన్ని అర్థం చేసుకున్నాడు. 'రూపనవనీతమ్' లో నాయిక దాక్షిణ్యాన్ని ఆసరాగా చేసుకుని ఆమె సంసారసుఖాలను త్యజించి విరాగిణిగా మారేటట్లు ప్రవర్తించాడు. 'స్నేహలత' లో నాయకుడు కావ్యంలో ప్రత్యక్షంగా కనబడక పోయినా సాంఘిక దురాచారానికి, అర్థలోభానికి కట్టుబడి నాయిక శరీర త్యాగానికి కారణమయ్యాడు. ఈ విధంగా వివిధ ప్రేమ సమస్యలలో చిక్కుకున్న యువకుల మానసిక ప్రవృత్తులను పరిణామాలను ఈ నాయకులలో రాయప్రోలు వారు చిత్రించారు.[1] ఈ రకంగా ప్రేమలో, వివాహంలో ఎదురవుతున్న సమస్యలను వారి రచనలలో చిత్రించి సహృదయపాఠకుల ముందుంచారు. స్త్రీ పురుషుల మధ్య కేవలం వివాహబంధం ఒక్కటే వారిని ప్రేమాభిమానాలతో దగ్గరగా కలిపి ఉంచుతుందని అనుకోవటం వల్ల ఇన్ని సమస్యలు వస్తున్నాయని రాయప్రోలు వారి అభిప్రాయంగా కనబడుతుంది. నాయికానాయకుల మధ్య

---

1. 'లలిత', 'అనుమతి' కావ్యాలకు ఆంగ్లమాతృకలు ఉన్నా, 'స్నేహలత' యదార్థ సంఘటన అయినా వాటిని వారు ఎన్నుకోవటంలో వాటిలోని సమస్యలు వారినాకర్షించి ఉండవచ్చును.

వివాహబంధానికి అతీతంగా స్నేహవాత్సల్యాలు వర్ధిల్లే అవకాశం ఉందని, శారీరక సుఖానికి అతీతమయిన ఆ ప్రేమలు శాశ్వతమయినవనీ, నిర్మలమయినవనీ, అటువంటి అమలిన శృంగార భావన కలగడం చేత యువతీయువకులకు అవసరం అనీ ఈ రచనా ప్రణాళిక ఉద్దేశంగా భావించవచ్చు.

---

# సింహావలోకనం

# సింహావలోకనం

రాయప్రోలువారు తమ కవితాదీపికలో నవ్యాంధ్రసాహిత్య వీథులను తేజోవంతం చేశారు. నవకవుల కెందరికో మార్గదర్శకమై నిలిచారు. ప్రబంధ, క్షీణప్రబంధ యుగాలలోని శృంగారప్రాముఖ్యం, పాండిత్యప్రకర్షల ఔద్ధత్యం వల్ల సంధియుగంలోని (19 వ శతాబ్ది) కవిత్వం ఒక మార్గం అంటూ లేక అస్థిరంగా అన్నివైపులా పయనించింది. వివిధమార్గాలలో సంచరిస్తున్న కవిత్వానికి ఒక పంథాను చూపినవారు రాయప్రోలువారు. తమ కవిత్వవిధానంలో భావకవిత్వానికి ఒక రూపాన్నిచ్చారు. వైదికసంపత్తి సంప్రదాయాలలోని ఔన్నత్యాన్ని తాము గుర్తించడమే కాక తరువాత వారికి కూడా అందించారు. తమ తాత్త్వికదర్శనంలో, ఆలోచనావిధానంలో కొందరికి ఆలోచించే అవకాశాన్నిచ్చారు. అమలినశృంగారసిద్ధాంత ప్రతిపాదనలో శృంగారాన్ని గూర్చిన ఆలోచనలకు ప్రేరణ నందించారు.

కవిత్వం పట్ల కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలతో సాహిత్యసృష్టి చేశారు. కనుకనే లక్ష్య, లక్షణ కావ్యాలను రెంటినీ వ్రాశారు. నిరాశలో నిరుత్సాహాన్ని పెంచుకోకూడదనే ఆశావాదిగా దర్శనమిస్తారు. కవిత్వం అమంగళం పలుకకూడదనీ, అశుభం వాంఛించకూడదనీ, ధ్వన్యైక ప్రధానంగా ఉండాలనీ వీరి విశ్వాసం. భావాన్ని స్పష్టంగా చెప్పడం కంటె ధ్వనిప్రధానంగా చెప్పడంలో రమణీయత ఉన్నట్లు వీరు భావిస్తారు. కనుక వీరి రచనలలో శ్లేష, ధ్వని అధికంగా కనబడతాయి. అక్షరరమ్యత, భాషాసారళ్యం, శ్రవణసుభగత్వం కవిత్వానికి అవసరమని వీరు నమ్ముతారు. కనుకనే చెవికి ఇంపు చేకూర్చేటప్పుడు వ్యాకరణదోషాలున్నా లెక్కచేయనక్కరలేదని అంటారు. భాషావిషయంలో వీరు స్వేచ్ఛ అనుభవించారు. శృంగార, కరుణ రసాలు రెండు

ప్రధానరసాలని వీరి అభిప్రాయం. శృంగారంలో కూడా విప్రలంభ శృంగారాన్ని నవ్యులు ఆదరిస్తారని వీరి ఉద్దేశం. సంభోగపరమైన రతి కాక వాత్సల్యపూరితమైన స్నేహం వీరి లక్ష్యం.

భావోద్వేగం, బుద్ధితీక్ష్ణత చేదోడు వాదోడుగా నడిచిన కవిత్వం రాయప్రోలువారిది. యావద్దేశాన్ని కదిలించిన సంఘటనలు వీరినీ కదిలించాయి. వాటి స్పందనగా వీరి కవితావాహినిలో సమకాలీన సమస్యలు ప్రతిఫలించాయి. ఆ కాలంలో అందరినీ కదిలించిన వార్తలు, సంఘటనలు, సన్నివేశాలు వీరికి ప్రేరణనిచ్చి కవితావస్తువులయ్యాయి. స్వాతంత్ర్యోద్యమం, ఆంధ్రరాష్ట్రోద్యమం, విదేశవస్తు బహిష్కారం, వరకట్న దురాచార నిరసనం వంటివి కొన్ని రచనలకు ఆలంబనమయ్యాయి. ఇటువంటి సమస్యలు ఉద్ధృతం అంతగా లేనప్పుడు తమదైన తాత్త్విక దర్శనంలో రచనలు సాగించారు. స్మృతి కావ్యాలు, ప్రబోధ గేయాలు, 'స్నేహలత' వంటి రచనలు ఈ విధంగా. కొంత పరిస్థితుల ప్రభావం వల్ల యాదృచ్ఛికంగా వచ్చినవే అనుకోవచ్చు. తృణకంకణం, మాధురీ దర్శనం, రూపనవనీతం మొదలైన రచనలు ఉద్దేశపూర్వకంగా తమ తాత్త్విక దర్శనంలో వ్రాసినవి. దేశభక్తి గేయాలలో కవిత్వమాధుర్యంతో పాటుగా, కవితావేశం స్ఫురించే వస్తువు కూడా ఉండడం వల్ల వాటికి అధికప్రచారం వచ్చి ఉండవచ్చు. ఇతరరచనలలో ఆ ఆవేశం అంతగా వచ్చే అవకాశం తక్కువ. అంతేకాక అవి వారి తాత్త్వికదర్శనాన్ని ఆధారం చేసుకున్నవి కావడం వల్ల వాటిలోని తత్త్వాన్ని సామాన్యులు అవగాహన చేసుకోవడంలో కొంత కష్టం ఉండవచ్చు. ఈ కారణాలవల్లనేనేమో వీరికి సామాన్యుల దృష్టిలో దేశభక్తి ప్రబోధగేయాల కవిగా ఎక్కువ పేరు వచ్చినట్లు కనబడుతుంది.

పరిస్థితుల ప్రేరణలో దేశభక్తి గేయాలు వ్రాసినా వీరి ఆధ్యాత్మిక భావన వాటిలో జీవాంశగా భాసించింది. దేశాభిమానం,

భాషాభిమానం మనసు నిండా నింపుకున్న అమృతహృదయులు సుబ్బారావుగారు. తెలుగుదేశం, తెలుగుభాష, తెలుగువారి సంప్రదాయాలు వీరి కంఠించిన పులకింతలలో కావ్యాలన్నిటిలో తెలుగుదనాన్ని మూర్తీభవింప చేశారు. తెలుగుభాషామాధుర్యాన్ని వీరి కావ్యభాషలో చవిచూపారు.

రాయప్రోలువారు సంప్రదాయవాది అయినా నవీనత కనబరి-చారు. కావ్యవస్తుగ్రహణంలో, రచనావిధానంలో, భావాభివ్యక్తిలో అన్నిటా ప్రత్యేకత కనబరిచారు. అభినవకవితగా పేరుపెట్టబడిన వీరి కావ్యాలు అడుగడుగునా కొత్తదనాన్ని నింపుకున్నాయి. తమ ఉక్తివైచిత్రిలో నవ్యతాస్ఫూర్తిని కల్పించారు.

నూతన పదబంధాలు, వైదిక పదాలు, వ్యావహారిక పదాల సమ్మేళనంలో వీరి కావ్యభాష త్రివేణీ సంగమమయింది. నూతనపదబంధాల సృష్టిలో స్వేచ్ఛను అనుభవించారు. ఇంతేకాక నిత్యవ్యవహారంలోని అతిసామాన్యపదాలను లోకోక్తులను ప్రయోగిస్తూ తెలుగు నుడికారాన్ని పోషించారు. అటు వైదికసంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన పదజాలాన్ని విశేషంగా ప్రయోగించారు. వీరి కవిత్వమార్గంలో వాడుక భాషా, వైదిక భాషా చెట్టపట్టాలేసుకుని నడిచాయి.

దేవీ ఉపాసనా, లలితా సహస్రనామ పారాయణా వంటివి ఉండడం వల్ల, సౌందర్యలహరి, శివానందలహరి, శ్రీసూక్తం వంటివి అభిమానాలు కావడం వల్ల, మంత్ర, తంత్ర శాస్త్ర పరిచయం వల్ల ఆ సంప్రదాయాలకు సంబంధించిన పదాలు కనబడతాయి. ఈ పదాలు ప్రయత్నపూర్వకంగా వాడాలని వాడినట్లు కాక వాటిలో వారికి ఉన్న పరిచయాధిక్యం వల్ల అప్రయత్నంగా వెలువడినట్లు తోస్తుంది. ఇటువంటి పదాలకు ప్రయత్నిస్తే తాత్త్వికార్థాలు స్ఫురించే అవకాశం ఉంది. అవి వాడాలని వాడినవి కావు కనుక వాటికి వ్యాఖ్యార్థం కంటె దేవీపరంగా, ఉపాసనావిధానంలో, మంత్ర తంత్ర శాస్త్రాలలో ఏ అర్థంలో వాడబడ్డాయో అటువంటి అర్థం చెప్పుకోవడం సమంజసంగా ఉంటుంది.

రాయప్రోలు వారు సంప్రదాయాభిమాని. వైదిక సంస్కృతీ సంప్రదాయాల పట్ల విశేషమైన అభిమానం కల వ్యక్తి. వీరి కావ్యాలలో చిత్రింపబడిన వైదిక వాతావరణం ఈ అభిమానాన్ని కొంత చూపుతుంది. వీరిమీద వేదోపనిషత్ ప్రభావం ఉంది. వీరి సంస్కారం సంస్కృత కవులది. వీరిలోని ఈ సంస్కారానికి రవీంద్రుని వంటివారి పరిచయాలు మెరుగులు పెట్టాయి. భారతీయమైన ఈ సంస్కారం మీద లలితలలితంగా ఇంగ్లీషు కాల్పనిక కవుల ప్రభావం పడింది.

సాంప్రదాయికమైన విశ్వాసాలు వీరిలో కనబడతాయి. వీరి దృష్టిలో విధి బలీయం. పునర్జన్మను, పురాకృత కర్మఫలాన్ని వీరు విశ్వసిస్తారు. ఆత్మలో ఛాయావాసనాదికంగా గతజన్మ రాగరసాలు నిలిచి ఉంటాయని నమ్ముతారు. అయితే స్మృతుల విషయంలో వీరికంత పట్టింపు లేదు. కాన్ని ఆచార వ్యవహారాల విషయంలో కూడా ఎక్కువ పట్టుదల కనబడదు.

వీరి దేశభక్తి దేవీభక్తి. భగవత్తత్త్వాన్ని గూర్చి, భగవద్భక్తిని గూర్చి వీరికి నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. వీరికి పరబ్రహ్మతత్త్వ మీమాంస అప్రధానం. భక్తి జ్ఞానాదులలో ప్రకృత్యుపాసకులైన సుబ్బారావుగారు భక్తివైపు కొంత ప్రీతిని కనబరిచారనడానికి అవకాశం ఉంది. ప్రకృతి ముఖంగా వీరి సగుణారాధన సాగింది. ప్రకృతిలో జగన్మాత మాతృరూపాన్ని దర్శించి ఆరాధించడం వీరి లక్ష్యం. కనుకనే మాతృమూర్తిగా ఉపాసించిన దేవదేవిని ప్రకృతి ముఖంగా పృథివీ రూపంగా ఆరాధించారు. ఆ జగన్మాత దేశమాతగా వీరికి ఆరాధ్య. వీరి దేశభక్తికి ఈ ఆధ్యాత్మిక చింతన మూలాధారం అయింది. ఆ పవిత్రతే వీరి దేశభక్తి గేయాలలో ప్రాణభూతమైన అంశంగా నిలిచింది.

దార్శనిక కవి రాయప్రోలు స్త్రీ గౌరవం, మూర్తీభవించిన వ్యక్తి. స్త్రీ పట్ల విశేషమైన గౌరవాభిమానాలుండటం వల్ల స్త్రీ స్థానాన్ని గూర్చి

ఆలోచించినట్లు కనబడుతుంది. ప్రబంధాలలోని అతివేల వర్ణనకు వ్యతిరేకి గాని ప్రేమకు వ్యతిరేకి కారు. ప్రేమ స్వరూపిణి అయిన స్త్రీలోని వాత్సల్యాది అమృతగుణాలను తమ రచనలలో ప్రాధాన్యనిచ్చారు. పురుషుల కారణంగా స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ కోణాల నుంచి దర్శించారు. స్త్రీ స్వభావంలోని అన్ని కోణాలు వీరి కవిత్వంలో ప్రతిఫలించాయి. పరిపూర్ణ మైన స్త్రీ వీరి కావ్యాలలో దర్శనమిస్తుంది. స్త్రీని కేంద్రబిందువుగా గ్రహించి ఆమె ఎదుర్కొనే సమస్యలను పరిశీలించి తమ అమలిన శృంగార సిద్ధాంతాన్ని రూపొందించారు.

(7) విశిష్టమైన వీరి అమలిన శృంగార సిద్ధాంతానికి, వైష్ణవ భక్తి సిద్ధాంతంలో కొంత సామ్యం కనబడుతుంది. ప్లేటో ప్రతిపాదించిన ప్రేమ తత్త్వానికి దగ్గరి పోలికలు అమలిన శృంగారసిద్ధాంతంలో అంతగా కనబడవు.

స్నేహవాత్సల్యాదులు రసాలుగా అంగీకరిస్తే తప్ప అవి విడిగా ఉండే అవకాశం లేదు. ఆ అవకాశం లేనప్పుడు వాటిని చేర్చడానికి వీలయినది శృంగారరసం. లోకంలో శృంగారం అనే భావానికి ఉన్న అర్థం పైభావాలకు భిన్నమయింది. దూష్యర్థాన్ని పరిహరించడానికి స్నేహవాత్సల్యాలను అంతర్భూతం చేసుకున్న శృంగారాన్ని చెప్పడానికి తగిన విశేషణంగా 'అమలిన' శబ్దాన్ని ప్రయోగించారు. జీవితతత్త్వదర్శనం నుంచి వెలువడ్డ అమలిన శృంగారం సాహిత్యదర్శనంగా వెలసింది. ఒక సాహిత్యసిద్ధాంతానికి పేరు పెట్టడం అనేది అంతకు ముందున్న సాహిత్యస్థితిని బట్టి ఉంటుంది. భావకవిత్వం అంటే పూర్వం ఉన్న కవిత్వంలో భావం లేదని కాదు. వచన కవిత్వం అంటే పూర్వం వచనం లేదని కాదు. భావానికి ప్రాధాన్యం అధికమనీ, వచనానికి ప్రాముఖ్యం ఎక్కువ అనే గుర్తింపు ఈ పేర్ల లక్ష్యం. అదే

విధంగా అమలిన శృంగారం అనగానే దాంపత్య శృంగారం మలినమయిందని కాదు. ప్రబంధ సాహిత్యం అంగాంగ వర్ణనలకిచ్చిన ప్రాధాన్యం వల్ల శృంగార భావానికి ఒక విశిష్టమైన అర్థం రూఢి అయింది. దానికి భిన్నంగా శృంగారంలోని స్నేహ వాత్సల్యాల వంటి భావాలలోని పవిత్రత స్పష్టం చేయడానికి 'అమలిన' విశేషణాన్ని ప్రయోగించారు.

సృష్టిలాస్యం అయిన ప్రేమ అందరి మధ్యా వర్ధిల్లాలన్నది వీరి ఆకాంక్ష. స్త్రీ పురుషులు స్నేహంలో సమాజ శ్రేయస్సు నాకాంక్షిస్తూ ఉత్సాహంతో ముందుకు నడవాలన్నది వీరి ఆశంస. ఆనంద మూలం, కల్యాణమయం అయిన జగత్తులో ద్వేష వైషమ్యాలను వీడి ప్రేమను పెంచి పోషించాలన్నది వీరి ఆదర్శం.

---

# అనుబంధాలు

# అనుబంధం - 1

## విశిష్ట ప్రయోగాలు *

**పదబంధవైశిష్ట్యం.**

పచ్చిపండుగ, కన్నెపాటలు, స్నేహదీపము, పచ్చిరాగాలు, వెన్నెలాడేనెల, క్షేత్రమాతృక, వేడివేడి పదాలు, ఆకలి కాక, నాదకాసారము, పచ్చిపాట్లు, స్నేహభాండము, పచ్చిముత్తెములు, కన్నెగిలుటు, పచ్చిపారాణే, తలపు దీపము, వడిగుండె, పచ్చిప్రాయము, నాగెండు, కన్నెఅలుకలి, గండుగుఱ్ఱము కన్నెనవ్వు, నవ్వుంగామట, పుస్తకశ్రీకుమారి, ఆనంద దుర్భిక్షం, గాడ్పుబూతు తీవెలు, అనులాప మాలలు, వాక్పుష్పములు, ధర్మమకుటము, ప్రేమదీపము, మృత్యుస్వకరము, అహింసాపయస్సు, మనుశ్శైత, పరువు మావిచివుళ్ళు, పచ్చిరసికులు, పచ్చివలపు, అనురాగకళికలు, ఊర్పువెన్నెర, భావాంబరము, మొలకగీతి, భావశుకములు, ఆనంద బిక్షాటనము, ముత్తెపు టశ్రువులు, భావోత్తరీయము, పచ్చనిపాట, మనసుపాదులు, ప్రేమరస ధౌత సుగంధము, అనురాగ విహాయసము, పండుబవురులు, పచ్చిఫణితి, పచ్చియెడద, కుమారరసాల తరులు, బాలకుమార బృందములు, శోకరాగాంకురములు, పచ్చివిరహులు, చింతాపుష్పము, సంకల్పలతలు, కాంక్షాతరంగములు, కరుకుపెడబాటు, పిచ్చివగలు, అభిమానచేలము, హృదయపుస్తకము, నవనవలాడెడి నుడువులు.

---

* రాయప్రోలువారి రచనలలో విశిష్టంగా కనబడే పదబంధాలు, భావాలు భావాభివ్యక్తి, ఉపమానాలు వంటి వాటిలోని కొన్ని ప్రయోగాలు ఈ అనుబంధంలో చేర్చబడ్డాయి.

## భావవైశిష్ట్యం

### లలిత

- - - - - - - - - - - - - - - - - - - - - - - - - - ; పో

వాయెనే యింతకైన మొదలాటి మరియు విపత్తులంచనున్. (P200)

పుడమి పడంతి కాదె తనపుంజిగినా మొలకెత్తు పచ్చికన్ ... (P201)

బాటు బాటం జాలి పడె పచ్చి ముత్తియములు. - - .... (P209)

- - - - - - - - - - - - - - - - - - - - ; పులకరించె నే

బదులు తనంబు నా మనసు పొదుల వాంఛలు మొలకరింపగన్ (P216)

... కోరెలు లోలోన నానసాగె - - - - - - - - - - (P219)

### తెనుగు లోటు.

నవనవ సుతూపాల ప్రసూనములు పూచె --- (P319)

వెన్నెలలు నిద్రపోయెదు వేళలయ్యె ---- (P336)

### తృణకంకణము

శశి వికసించిన శ్రావణ

నిశీథమున కానబడిన నీరదసుతతున్ .... (Introduction)

- - - - - - - - - - - - - ?

తన సుమ లతలు పూచిన శోభలో యున

చిరు నవ్వు వెన్నెల చెండ్లు విసర,

- - - - - - - - - - - - - - -

పలుకు కొమ్మలు పూలపాలు పిదుక --- (P235)

### కష్టకమలు.

నిగనిగ వెగయు కన్నెచిగుళ్ళ గుత్తుల

నీడలాడెదు చిలు నిమ్మచెట్లు, ---- (P256)

------------చెప్పవె నాయాకపు కూజితము వ్రేలార్పు చా

కాదమ శుకంబు పోయె నదిగో! ....... (P262)

..... నీ నగు మొగం బాక తీరయి భాషు, నందమున్

నలగని యునికనాళ్శో కమలంబిది కాదు కదమ్మ వల్లి!.. (P270)

----------! వచింపుము నా ప్రణయంపు టూపుగిం

తలను ---- - ----- ------. ------...(P275)

స్నేహాలత

హిమగిరి నితంబములు కన్నయుండ్లుగాక

కదలి నీళ్ళాదు ప్రొద్దులు గడప వచ్చు

వనదసుత, ...... ----.. (P291)

స్వప్నకుమారము

చదలు వెన్నెలు లల్లుచున్నది, కుమార

చాపలము వేదు పవన సంచాలనమున ---- (P4)

కావ్య కుసుమముల్ పూచు సంకల్ప లతలు

కడు బలాత్కారముగ త్రెంపబడియె విధిని - .... (P9)

కన్నెవిరులు సమర్తాడు కాలమందు ..........(P9)

మౌక్తికముల కానువు మోయు శుక్తి కకట

గర్భవిచ్ఛేద మే పాపకారణంబు ------ (P25)

ఎండలన్ మాడిపోవు వేయుగుల లరసి

యేడ్పు నదుల ప్రేమోదంత మెవ్వ డెఱుగు? - .....(P27)

ఆంధ్రావళి

(ధాత) ... మావి పిందియలు మరియు...

...పూలు పసుపాడ, కుంకుమన్ బూయ కొమ్మ... (P16)

.... మామిడి చూలు మోయు ....

(ఆంధ్రమాత) ... ఆశల్ కౌతుకపూర్ణ చంద్రికలు పూయన్..(P25)

...భాషా కుమారి కట్టువు పెండ్లి యున్నైన....  (P26)

(తమ్ముడా) ..చేకిపోవని చేవ పదములు చేర్చి .....(P28)

(ఆంధ్ర) సాహిత్య కలశంబు క్షాళించి పండిత

రాజు క్రొంజవుల క్షీరములు నించె, ...(P30)

(ఆహారము) అన్నకాటకపుటుబుండు సావహించె

భూమి నానంద దుర్భిక్షమును సఖుండ - ... (P37)

(తెనుగు మాన్యము) ... పిల్లవేణువు ముఖంబున గుబ్బ సుఖ స్వరాళి... (P41)

(శ్రీ శివశంకర శాస్త్రి).. చిందు రెక్కల క్రింద నిదురించు వెలతూన

లను లేప పాడేటి నును పుల్గు బావెంత

తూర్పు వాకిలి ముందు తూగరు వన్నెల నూలు

అలవాక వడికేటి అరుణాంశుక కుమారి .. (P46)

(కృష్ణరాయ నాగేశ్వరులు) ఆంధ్రమున తీక్ష్ణ గణాశైలి నభిఘరించి ...(P53)

(బుద్ధదీక్ష) ధర్మధేనువు చేపగా దాయ గట్టి

జగతి పిదికె నెవండహింసాపయస్సు... ... (P63)

మునిగి పోలేదు నీ ముత్యాల భవనంబు

పారిపోలేదు నీ పాడిగాల్తైల మంద ... (P75)

(ప్రభాతము) వెండిగాలుసులు లంకె వేసి ప్ర

చండమగు నీ నీలి తెరలను

తూర్పు వాకిలి తలుపు రెక్కల

లాలగలాగెద రెవ్వరో? (P76)

**జడకుచ్చులు**

(శుక్తి) నీరదములు నృత్యములాడు దారులందు... .(P91)

(పిలుపు) నా విరహాగంధి గీతికన్యయును చెప్పు

శిరసు వెత్తుచునున్నవి చిగురుపొదలు

నవ్వుచున్నవి కదల నందాల సందె

కావిరంగుల రంగైన మోవి విరిచి ... ...(P97)

(ఒకమాట) పలుకుము నీవైన చెలియ పాలాలుకంకన్...(P107)

(ధ్యానగీతము) ప్రాయుదాడగితి ఛాయాంబరమును కడిగి ... (P116)

(మేఘమాల) ప్రాకెన్ చీకటి చెట్లు పోయుగవు పూరంగున్

దిశాంతములలన్ .... (P127)

(ఎవరు) చీకటి జడన్ ముడున్ విప్పి చిందులాడె -- (P132)

(ధ్వన్యాలోకము) ప్రాయు దాడగితి ఛాయాంబరమును కడిగి (P116)

(రాధ పిలుపు) పొదలలో పూవునై పోయినావేమొ!

తమ్మిలో తేనెనై దాగినావేమొ? ...(P162)

**వనమాల**

(ఉగాది) శూన్యము లయ్యె సుందరవనములు

రక్తాంబరముల రక్షసించెన్. .... (P10)

(శారద) కొమ్మల పట్టెను కుంకుమ బరిణల

కోయిల పాడెను కుశలగీతముల ...(P12)

(ఉగాది నివేదన) ముదిరిన చెట్లు కనెగిలి మొకలలు గా, పతి చీర్ణ... (P16)

శాంతిభిక్షానికై చాచేవు కొంగు

చిల్లుపశాంతికై ఎత్తేవు గళము! ..... (P27)

గాలిలో ధూళిలో కటికి నట్టిండలో.... (P28)

... నా లోటు కాషాయ పీతాంబరము లాప్పై -- (P28)

తెలి వాకల వెల్లి పొర్లుచున్

చెంగలాడెడు చిన్నివీచికల్ .... (P32)

(పుష్పలావిక) పడకటింటికి రవిదారి యడుగుచుండ ... (P33)

...పలుకులో పలుకు పెనబడి పట్లు పట్టు. ...(P34)

(మాంచాల) మైల విడిచిన నల్లకోకను

మలల మెఱిసెను పూలచుక్కలు

నాడి నాదని దిజ్ఞితంచిను

లాడి లాగగ నలుకొనన్. ..... (P46)

(అడివోరి చిన్నారు) పలుకువే పూచేను పచ్చిపువ్వులు వోలె...

కథల జడలల్లితే కండ్లు కట్టినయట్లు

కళగట్టు మన లోక గాథా రహస్యాలు,

నుడువులో అవి తేనె మధువులో, రసాల

కడవలో, రాగాల పడవలో కనరావు.... --(P58)

మీ యమ్మ యే తార బాయలో నిను గాంచె

ఏ యోషధుల పాలపాయసం బిడి పెంచె.... ..(P59)

(జన్మాష్టమి) - - - - - - - - - - - గృహా వీధులాప్పై, భూ

దేవి సుశుభ్రసూత పరిధిన్ జలమాడి ధరించె పచ్చపూ

పావడ, దిక్కులే చికుర పాశము లట్టుల ద్రేవె కృష్ణమే

ఘావలి, ....... ..... (P71)

చెలిలో చిందులు మానె చీకటి ....

..... - -- నవ్వుమపందు వెదుళ్ళ పాడసాం

గెం, దమసాంతరంగవతికిన్ పాడకట్టి సమర్థ చిన్నెలు(P71)

మిశ్రమంజరి.

(ప్రమోవాకమ్) కాళిదాసుని భణితి కళలు సమర్థాడై (P1)

(ఆంధ్ర నవమి) తెలుగు కన్నెను పసుపు తలఁబ్రాలు పోయరావె (P12)

(భద్రయాత్ర) ఆకటి కాకల కల్లాడగ ప్రజ, . - - - - .(P22)

(గురుదేవ రవీంద్ర) సంగీత సాహిత్య సాధనల పడకిల్లు- (P26)

(మంగళ మాఘమ్) పువ్వులను మురిపింప తుమ్మెద

కన్నెలతలు సమర్తలాడగ - - . ..(P45)

రావి బంగారాకు లొత్తగ

పగలబడి నవ్వంగ మాగధి ....(P45)

పాలు పోసిన పైరు పొట్టల

చేలు శ్యామల మాంసలములై

ఈనిదు వచ్చిన పదునులాయెను . . . . .. (P48)

(మన్మథా వాహన) సర స్తరంగములు చలువ పాన్పులుగ

ఉయాలలూగే బయారి తమ్ముల

మిళింద కన్యలు మేలుకాప్పెదరు . . . (P53)

శిరీష శాఖల చెంప సరులుగా

అలంకరించెను అలరు జొంపములు ...(P53)

పెండ్లిలగ్నం వెండి లాంతరు వెలిగించి వెడవె రజని - - (P57)

చెట్లునుక్ కదలవు సొమ్మసిలిన యట్లు (P57)

(సంక్రాంతి సంబరము) సస్య కేసర కలిత కోళ్ళల

చేలు పసుపాడిన విధంబున

చూడ కనులకు వేడుకాయెను ...(P65)

(ఆషాఢి) గాడ్డు నేలలు వదిలి కన్నెపా

లాలనాటరె యుంటులన్, ... (P88)

(ఫాల్గుణి) ప్రాతపడియును మాసి మాయని

వెండి తెరపయి విస్తరించెను-

సర్వలి కలాపము చిత్రరూపకమట్లు- .... (P92)

(శ్రాంజలి) వాల్మీకి శోకంబు స్రవపించె శ్లోకమై

నన్నయార్య కంఠాన నటియించె భారతము ---(P98)

(కోయిల) వచ్చావె కోయిలా వన్నెలాడే నెలను

పచ్చి పడుచు పదాల వాకిండ్లు తీయగా ---(P102)

(రామలింగారెడ్డి) బాడిమెయు పూవు నదుకుపొందికయు సూపు

పదభావముల కాకల పొన్న మర్రి, ..... (P115)

(నందా!) పూవును కోసిరి పూర్ణము

గా విచ్చి వాసింపనీయకయె నా నందా! --- (P119)

(బ్రహ్మముడి) కామ్యులకు బిగురాకు కాసులదండ లిచ్చు వసంతుదేగెను; (P126)

సృష్టి కింకను బాల్య మెడలదు. .... (P127)

.......నిశల్ వాసి-యుంచె విమలాంబరమువై(P128)

(పల్లెపడుచు) ....జనములన్ కట్టివేయును కనులన్. ...(P142)

## ఉపమా వైశిష్ట్యం

**మిశ్రమంజరి**

(ఆషాఢి)

పరము వెనుకై ఇహము పైకొన
తన్నుతానె సంశయ ఘనాఘన
ఘటనమున మనుష్య వృత్తము
బురదబడ్డ గజంబువోలెన్ (P77)

- - - - - - - - - - - - -

మానవుని వ్యక్తి స్వతంత్రము
అల్ల అల్లన జారిపోయెను
చిల్లికుండ జలాలవోలెన్. (P77)

(ఫాల్గుణి)

- - - - - - - - - - - -
- - - - - - - - - - - - - వగ
దాటి వచ్చె, సుడిగాలి కెప్పుడో
మండి కృపాణము కాల్చదే: (P94)

పగులు వాటిన ప్రహరి గోడలు -
గడియ ఊడిన తలుపు చెక్కలు -
ధర్మ సత్రము పరిధి నీ బం
గారు గడ్డ నిలంబడెన్. (P94)
కుల విభేదము మతవిరోధము
పాటు పరించెను స్ఫోటకము వలె (P96)

(రామలింగారెడ్డి)

లతిక నికుంజ వలయము నల్లినరీతి
కథకు తెంపులు వేసి గమకమిచ్చి (P115)

(ప్రాభాతి) గర్భవతులను - బిడ్డతల్లుల
నరటి తోటల యట్లు నటికెరి -
పాడియావుల పగల గాసిరి (P94)
పనస పండ్ల విధంబునన్.

(సంధ్యా) పుట్టితివి ప్రొద్దు పొడుపుల
నట్టింటను మొలిచినట్టి నవనము పగిదిన్.... (P117)

అపుడపుడె కడిగి తుడిచిన
అపరంజి కలశము పోల్కి నగపడె నీమో
ముపగత - - - - - - - - - - - . . . . (P120)

(విప్రనలపలుకు) చరిచితి కర్ణుని చరితము
వెరచే కడు బిత్తరిలిన వైఖర్య విధానన్
బెదరిన కనుచూపులతో
మదియును చెదరెను అగమ్యమానంబగుచున్ (P124)

(బ్రహ్మముడి) మధువు ద్రాగిన తుమ్మెదలవలె - రేగిమబ్బులు
మూగి వాలగెను; (P126)
ఎగసె నెత్తురు ముద్దవలె నపు - డరుణ బింబము
తినఁగా. (P127)

(పుల్లెపదుము) తూతురాకలనె అతనికిన్ చూతపల్లవ మనదగున్
మంచిగంధపుమొలకయో మంచు ముద్దుల కిలకయో. (P140)
మొగ్గ లోపలి ముద్దుపటువున్ సిగ్గు చిన్నెలు చెదరవూ
దోసపిండియు నునుపులన్ భాసిలున్ చెలిప్రాయమున్ (P141)

పూవుపైబడు తుహినమో - ఆవు పిండిన అమృతమో

అనగ ఆ చెవి చెలువమున్ (P142)

<u>వనమాల</u>

(తెలుగు బంతి) పచ్చి పాడి యావు వంటిది కావ్యంబు (P23)

(పుష్పలావిక) - - - - - - - - ...ఆ టుకుగులాడు (P35)

సందె వచె మెల్లగా జాజె మందగతిని

(పులియాకు) చిప్పరున్ గుత్తులు బోసి పాదములు...

పూగుత్తుల్ విరితించినట్లు చారునవ్వుల్ చిందు (P38)

(అర్ఘ్యమాలలు) యజ్ఞయాగాది కర్మ పర్యాయ పరము

వదలినా రహింసాధర్మ పక్షపక్షికి,

దక్షిణాయన రక్తి నుత్తరము విడుచు

కర్మసాక్షి సహస్రాంశు కాండమట్లు (P44)

(మాంచాల) ధీర ఖడ్గంగము దూంకి చూడని

తీయ సంపగి మొగ్గ తీరున

పగలు రేలును వెట్టుచుండెను

పడతి మాంచాల (P45)

(రవీంద్రుని అస్తమయము) ఆరిపోయినది దివ్యస్నేహ శృంగార

దీపంబు నివాళి తోసినట్లు.

- - - - - - - - - - - ...

నిష్క్రమించినది నాందీ ముఖోజ్జ్వల తార

చిత్రాంత యవనిక చినిగినట్లు (P56)

(జన్మాష్టమి) - - - - రుచి మనస్స్ఫురుశాద్వల పత్రశయ్యలన్

బృందయు వెన్నె ముత్తయుదు వెత్తిన పచ్చల పళ్ళెరంబునన్ (P71)

ఆంధ్రావళి.

(తెలుగు మాన్యము) ఊగిన ఆలమందగతి ఇంపు చిగిర్చి ఫలించి
నట్టియటు
ధ్యానము పోలిక సస్వరము యాడెడి వేదికలాగు
నీ తెలం
గాణము . . . . . . . . (P39)

(బుద్ధ దీక్ష) కాన్పు ఉడిగిన ఈ గోవు కదలలేక
వణకుచున్నది నా వచః ఫణితి పగిది. (P65)

(ప్రభాతము) నిదుర విడి ఆశా నితంబిని
నీలవేణి విదల్పగా వెడి
మల్లెపువ్వుల పగిది జాఱెను
అల్లనల్లన తారకల్
పండు కుంకుమ కలిపి చేర్చిన
పచ్చిముగ్గుల అల్లికల వలె
ఉపరిగత ప్రాలేయ నగముల
నుండి అరుణిమ లగపడెన్.
ప్రథమ ప్రభోదయము వేళను
భాసిలెడి సంపన్న గృహమటు
లలిత వికాస సుహాస్య ముఖమయి
అలరెబో జగమంతయున్. (P76)

(యాత్ర) ఏటి సందిట ఆడుచున్నది
ఆట బొమ్మల వితాన నావయు (P79)

జడకుచ్చులు

(శుక్తి) అగాధ పాతాళ తిమిరమొకట
మారపార నభంబాకట మారుమూల

పగలు రేలు పలక్షింయు ప్రాణి పోలిక (P91)

లసదుష్ణ కంఠ ధవళ మాలలు గనబడె

నెలల బాలెంత స్తన్య ధారల విధాన

భావరేఖయు పుటల కంపనము మానె

సుప్త విరహిణో భ్రూలతా క్షోభ బోలి. (P92)

(ఒక మాట) అమృత రసవశులై నవ్వు అళ్లల వికసి

ఆర్ద్ర సుమములు బాలెంత చాంద్ర పోలిక

పసుపు బూసిన ముత్తైదువుల మొగాల

ననుకరించి గుమ్మడి పువ్వులందముల్వే. (P106)

(ధ్యాన గీతము) సృష్టి పసిబాల పగిది నిద్రించుచుండె

తల్లి రెక్కల క్రింద మెత్తని సువర్ణ

తూలికల మై ముడిచి నిద్దురలు వోవు

కనెక పారావతము బోలి కదలదామె

నా యహంకార మేమి బంధంబు కాని (P114)

(వసంత వికాసము) చకలని నభంబు రంగులన్ పికలలై

నిండు జవ్వని యరుణాంపు గండమల్లు. (P121)

(శేష చైత్రము) నవనవ లాడేటి చివురాకు వెల్ల

కలకెక్కె నెండ కాకలు బోవె ముదిరి. (P124)

(కవిత) సందెలను పచ్చిపాలతో సవదరించి

నింగి బాలెంత నడికట్టు కాంగులనగ

జారు నతసీ పయోద ప్రసన్న రేఖ

లందికాని లాగి చేరెగా నందగించు (P129)

(ఎవరు)

ఆరుబయను కలంకారి చీర చెంగు

ఎగర ఆశా ముఖంబుల నందగించె.. నీరదపంక్తులప్పుడు (P131)

పొదల యందెందొ కనరాక పూర్ణ పరిమ

ళమున భ్రమరులను బాగు సుమములట్లు

కటిక చీకటి లోపల కానరాక

పాడుచుండిరి గాంధర్వ గానమెవరొ. (P132)

.... - - - .యా సొగసు రూపు

వెల్లు చేసునా యున్న యనుమాన మెత్తె నాకు

తరళి ముఖుడగా నూరించె నదియు నన్ను

సంస్కృతంబైన కవి కావ్య శైలి వోలె. (P133)

ఓర్వ లేని వారెవ్వరో యొకరి నాకరు

పోల్చు కానకుండ త్రెంచను వాల్చినారు

నీవు నాకును నడుమ నీ నీలితెరలు

సిగ్గుపడు ప్రణయుల మధ్య లజ్జలాగు. (P134)

అందమయిన పర్వంబుల నల్లనతడు

మనుషు పొగల పట్టు నేసిన వితాన (P136)

వీథుల బారవె నా బిడ ........

రాగ .... గాన తరంగ ఝరము

తెలి తమలపాకు లోటు పాడులను పాడు

ధవళ జలనుల్ల భూతి సార్ద్రంపు గతుల (P138)

వేరు వేరైతి మంతట బారు జలద

గర్భమును వదలిన జలకణములట్లు

ప్రియ సమాగమ సుకృత మర్థించె నతడు
భీష్మ తపన రోహిణి బొందు శ్రీపున్నమల్లు (P141)

(కనకము) వదలదను నీ పుటంగును .... వం
పెదగాకల యుత్తవారి పిల్లను బోవెన్. (P151)

(ధ్వన్యాలోకము) శశి ప్రకాశింపదయ్యె, నిశ్వాసమలిన
పవన బహుళాంధ్రమయిన దర్పణము పగిది. (P157)

లలిత పక్షి లేని తామ్మయిన నావంటి వనిత
ఏమి ఫల ముండె ....
మింటు విధాన కోరిక విరమించె. (P220)

తెనుగు తోట. తెలియరాని చక్కిలిగింత లలమ నాదల
మేలుకొలిపెడు పవనుడు బాలుకట్లు (P318)
ప్రాచి కుమారికా కంఠమందు
మలయు కుంకుమ పూవుల మాలలనగ
సాంపొలుకు మన్నయుచి యుదయంపు రుచులు (P336)

స్నేహలత ... విచ్చిన పుష్పము పోలె బుట్టె వం
గడమునకెల్ల సౌరభ్యముగా నయగారి కుమారి. (P285)
శ్రీ భరతమాత కంఠాన సిరులు విసరు
ఆణి ముత్యాల కల్యాణి హారమనగ
తేజరిల్లు - .... గంగామ తల్లి. (P287)

కృష్ణకమల అలల కోనేటి నడుగు రాయంచ లీల
ఆ మృదూద్యానమున మందయాన యగుచు
పోయె నాకసెల్ల - - - - - - (P255)

వెన్నెలల స్పర్శపడు కల్వపిల్ల పగిది
కేతి వడరేరు పాపరాగూడు భ్రాతి
స్వాతి వాకల్లు విడు శుక్తిబాల లీల
గాలిచే శోషబాసె నాకస్నెయపుడు. (P272)

<u>తృణకంకణము</u> స్నిగ్ధ సికతాతలమ్ముల చెమ్మ తేరు
ఎండకన్నెరుగక వానసేదిరిలక
పెరిగిన కలకాపురముల బిడ్డలట్లు. (P4)

లక్షియించు కాంతిచే రమణీ రూపు
అదియె మురళీక యలత కాప్పురము యయ్యె
గ్రహణగతమైన చంద్రుని కలవిధాన. (P7)

పాలురాని ఆవుల పొడుగుట్ పడెన్ మొగులు
పూసి కానెక్ దివి. (P8)

బాధ లేక వ్యసనరుచి బాధపడకు
చీకటులు లేక దీపిక వెలగనట్లు. (P16)

<u>రమ్యాలోకము</u> ధేనువులు తిను బహువిధ తృణచయమ్ము
త్రావు నానానదీ రూప జీవనమును
కలిసి పరిణమింపవె పాలుగా ధరిత్రి
శబ్దమేళన తంత్ర నైజమ్ము నిదియె. (P9)

కలవు రసరామణీయకములు కృతులను
మాధురీ సౌరభమ్ము మధువున బలె. (P13)

ఈ పయివబడి ఇంపు ఘటిల్లె తెనుగు
భాషకు నిసర్గ శోభల భూషణముగ
మధుకణ ధురీణమైన సుమమ్మునవలెను

అంతముగ తంగు రేగులు నమరినట్లు. (P23)

పాలలో వెన్న లీనమై గ్రాలు లీల

శబ్దమందును అర్థంబు చక్కనెసగు; (P25)

ద్యుమణి తనచిత్ర రుచుల లభ్యస్వముగ

పుష్ప పత్ర ఫలాళిలో పొందు రీతి

సుకవి వాగర్థ బాంధవ స్ఫురిత శక్తి

స్వర లయాంతములైన శబ్దముల నిండు. (P29)

తెల్లమబ్బుల తరియలనెల్ల పిడికి

పయనిడిన క్షీర భాండంబు పగిలినట్లు

వరదగట్టెను బ్రహ్మాండ భాగమపుడు

పచ్చి వెన్నెల పాలచే ప్రాణులలర. (P32)

సరస కావ్యార్థము లభిధా వరణ మెఱసి

లక్షణా వ్యంజనా వీథులన్ భ్రమించు

పూర్వ వీచి వాయు తరంగముల సపార

దూరమేగెడి పరిమళ సారమట్లు. (P38)

కళలు రమ్యార్థ సౌభాగ్య కల్పనములు

సంవృతమ్ములు శాస్త్ర బీజమ్ములందు

మధుర కండర సార మాంసలములయిన

పండ్లలోపల విత్తుల భంగి నంతె. (P38)

కన్నెపాటలు

(లాతి మబ్బులు) తడిసిన కొమ్మలు తలలు వంచు కొనె

పెండ్లికుమార్తెల బిడియము లోపగ...

ప్రస్తుతుమారకము నింగి విసరిన మొగిసెల రంగు పెట్టె
బోసె వ్రాసెదు పరకల దసాల చుక్కల.
గగన నికేతనమ్ము పేయి కప్పిన తెల్లని పాలపెంకుల
ట్లగపడు శ్వేత మేఘశకలావళి........ (P19)
వనకుమారిక లంచిన పసుపుముద్ద
లో యవనగ ఆకుమయూకుల సోయగించు
పండ్లు కనబడె.... నారింజపాయల బాయలందు. (P20)
పరిచయము గులాయు మెడతిన పావురమ్ము
పగిలి నామదియను వస్త్రెవనికి మరల (P21)
అలలు రేగిన తామరకాలను మూల్రి
నెదడ త్రెకాలన సుతలంతే పెడవె నిట్లు. (P22)
..... - - .. దెసలరయ లేక
తిరుగు అనపత్య హరిణంబు కరణి నేను,
చూచుచుంటిని ఆమెకై; ...... (P25)

మాధురీ దర్శనమ్ తెరచి మసలిన పయస్సులు
మెరుగారుచు సురుగులారి మీగడ యగు మా
ధిరి స్థాయి భావ మందెడి
తరుణాంతఃకరణా నైజభర్మములు... (P22)
రమణీ యార్ద్ర తరంగిత
కమనీయంబయిన కావ్యకంఠధ్వనిలో
సుమమున మకరందము వలె
భ్రమించు రసము - - . . . . (P30)

# అనుబంధం - 2

## ప్రముఖులతో ముఖాముఖి.

కొందరు ప్రముఖులను కలిసి రాయప్రోలువారి తత్త్వచింతనను గూర్చి ప్రశ్నించి సేకరించిన విషయాలు సంగ్రహంగా ఈ అనుబంధంలో ఇవ్వబడ్డాయి. ముందుగా రూపొందించుకున్న ప్రశ్నావళి కూడా దీనిలో చేర్చబడ్డది. కలిసిన వ్యక్తులు అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పకపోవడం, చెప్పినవి ప్రశ్నావళి వరుసలో లేకపోవడం వల్ల వారి సమాధానాలకు ప్రశ్నల క్రమసంఖ్యలను చేర్చలేదు. ఆయా వ్యక్తుల అభిప్రాయాలలో కొన్ని ప్రత్యక్షంగా ప్రశ్నావళికి సంబంధించినవి కాకపోయినా రాయప్రోలువారి వ్యక్తిత్వాన్ని ప్రకటించే విషయాలు కూడా కొన్ని ఈ సారాంశాలలో ఉంచడం జరిగింది. కొందరికి ప్రశ్నావళిని అందించడం సాధ్యపడలేదు.

రాయప్రోలు సుబ్బారావుగారు ముఖాముఖి చెప్పిన విశేషాలను విషయాలను మూడవ అనుబంధంలో ఇవ్వడం జరిగింది.

# ప్రశ్నావళి

1) సగుణ నిర్గుణ బ్రహ్మలలో రాయప్రోలు వారు ఎక్కువ అభిమానించేది ఏదని మీరనుకుంటున్నారు? అది వారి కావ్యాల్లో కనిపిస్తుందా?

2) రాయప్రోలు వారు భగవంతుని ఏరూపంలో ఆరాధిస్తారని మీరు భావిస్తున్నారు?

3) తాంత్రిక విధానాన్ని గూర్చి రాయప్రోలు వారి ఉద్దేశ్యం ఏమయి ఉంటుంది? వారు లలితోపాసకులని అంటారు. ఆ ప్రభావం ఏదయినా వారి సాహిత్యం మీద ఉందని మీరనుకుంటున్నారా? ఉంటే ఏరకంగా ఉంది?

4) ప్రకృతిని వారు వర్ణించడంలో ఆధ్యాత్మిక భావన ఏదయినా ఉందా? ఉంటే ఆ ఆధ్యాత్మిక చింతన వారి కావ్యాల్లో ఏరూపంగా కనిపిస్తోందని మీరనుకుంటున్నారు?

5) ద్వైతం, అద్వైతం విశిష్టాద్వైతాల్లో రాయప్రోలు వారికేది అభిమానమనుకుంటున్నారు? ఆ భావాలేవయినా వారి రచనలో కనిపిస్తయ్యా?

6) వారి దేశభక్తికి, వారి సమకాలికుల దేశభక్తికి ఏదయినా భేదం ఉందా? అంటే వీరి దేశభక్తి కేవలం ఆనాటి రాజకీయ పరిస్థితుల కారణంగా వెలికి వచ్చిందేనా? లేక అందులో కూడా ఏదయినా ఆధ్యాత్మికత కనిపిస్తుందా?

7) వారి అమలిన శృంగార సిద్ధాంతం గూర్చి మీ అభిప్రాయం ఏమిటి? ఈ సిద్ధాంతం ఎందుకు ప్రచారానికి రాలేదని మీరనుకుంటున్నారు? దాని మీద ప్రభావం చూపిన

సిద్ధాంతాలు కాని సాహిత్యాలు గాని ఏవయినా ఉన్నాయా?

8) మధుకలశ రచన చేయడానికి వారిని ఆకర్షించిందేమిటి? ఉమరు తాత్త్వికతా? లేక ఉమరు కవిత్వ రమ్యతా? చార్వాక సిద్ధాంతానికి ఉమరు తత్త్వానికి భేదం ఏమిటి?

9) స్త్రీ సమారాధనకు పెట్టింది పేరుగా చెప్పదగ్గ రాయప్రోలువారు "రూపనవనీతం"లో 'వసుధైకమాల' శీలదానం చేసినట్లు చిత్రించడం గురించి మీ అభిప్రాయం ఏమిటి?

10) సుబ్బారావు గారు జ్ఞాన, కర్మ భక్తి మార్గాలలో దేనివైపు మొగ్గు చూపుతారు? ఆ ప్రభావం వారి రచనలలో కనిపిస్తుందా?

11) రాయప్రోలు వారి రచనల్లో వేదాల, ఉపనిషత్తుల ప్రభావం ఏ రకంగా కనిపిస్తున్నది?

12) సంస్కృత సాహిత్య ప్రభావం, సంస్కృత కవుల ప్రభావం వారిపై ఎంతవరకు ఉంది?

13) ప్రాచీన ఆంధ్ర సాహిత్య ప్రభావం, కవుల ప్రభావం వారిపై ఏ రకంగా కనిపిస్తున్నది?

14) ఆంగ్ల కవులలో ఎవరి గూర్చి అయినా సుబ్బారావు గారు ఎప్పుడయినా ఎక్కడయినా ఎక్కువగా చెప్తుంటారా? వాళ్ళ ప్రభావం రాయప్రోలు వారి సాహిత్యం మీద ఉందా?

15) రాయప్రోలు వారి రచనలలోని తాత్త్వికత గూర్చి మీరేమయినా చెప్తారా?

30-3-81

## డా॥ అమరేంద్ర గారు    3 PM

ప్రకృతిలో ఒక చైతన్యం సర్వత్రా వ్యాపించి ఉన్నది. అదే సత్య సౌందర్యం అనే భావం..... 'సచ్చిదానంద కళ్యాణ సదనమయిన ఈ మనోహర జగతికి నేగుచెంచి ప్రేమలక్ష్మి సారాధింపవేమి చెప్పుమ' అన్నప్పుడు Wordsworth ప్రకృతిని చూసిన విధానమే కనబడుతుంది.

"Lines written on Tintern Abbey" లో దృశ్యమానమయిన ఈ ప్రకృతి అంతటి వెనకాల మహత్తర మయినటువంటి చైతన్యం ఉంది.

ఈ ప్రకృతి అంతా కేవలం పైకి కనబడేది కాదు. దీని వెనకాల చైతన్యం ఉంది అనేటువంటి దృష్టి సుబ్బారావు గారి వర్ణనల్లో కూడా కనబడుతుంది. అందువల్లనే ఆ వర్ణనల్లో ప్రత్యేకత.....

ప్రకృతినొక ఉపాస్య దేవతగా వర్ణించిన మొదటి కవి Wordsworth. అది రవీంద్రుని ద్వారా సుబ్బారావు గారికి.....

భారత జాతిని భారతీయ జాతిగా నిలబెట్టి నటువంటి సంస్కృతినంతనీ కూడా పునరుద్ధరించాలి. ఆ చరిత్ర చావలేదు. దానిని మళ్ళీ హృదయాలు చీల్చి చదువుకోండి అని ప్రబోధం చేయటంలో సుబ్బారావు గారు ఆధ్యాత్మికమయినటువంటి సాంస్కృతికమయినటువంటి ప్రభావాన్ని కూడా చూపించారు..... రవీంద్రునిలో పరిచయం

నాకముందే వారు వ్రాసి ఉండొచ్చు. భావ సామ్యం ఉండి ఉండొచ్చు.... బంకిం గేయం బాగా ప్రచారం పొందింది. ఆ ప్రభావం వల్ల వారు దేశాన్ని మాతృమూర్తిగా దర్శించారు. దేశాన్ని కేవలం ఒక రూపంగానే కాకుండా ఒక మాతృమూర్తిగా ఇంత మంది సంతానాన్ని కన్నటువంటి మాతృమూర్తిగా (భావించిన) మొట్టమొదటి కవిఋషి బంకిం...ఆ భావానికి కవితా స్ఫూర్తి నిచ్చింది బంకిం..... మామూలుగా ఉండే సంకుచితమైనటువంటి రాష్ట్రాభిమానం కాకుండా సమగ్రమైనటువంటి జాతీయాభిమానం సుబ్బారావుగారిలో కనిపిస్తుంది. --Narrow imperialism కాకుండా ఒక Broad nationalism. అది చాలా విచిత్రమైనటువంటి విషయంగా నాకనిపిస్తుంది. అందువల్లనే వారి గేయాలు ఈనాడు కూడా ఆంధ్ర రాష్ట్రం వచ్చినా ఇప్పటికీ పాడుతుంటే ఒళ్ళు జలదరిస్తుంది. వాటిల్లో ఉన్న జాతీయ ప్రబోధ ప్రభావం అటువంటిది.

సుబ్బారావుగారిది సగుణోపాసనే అని నా ఉద్దేశం. మామూలుగా నా ఉద్దేశంలో కవులందరూ కూడా ఒక విధంగా ద్వైతవాదాన్నే ఎక్కువగా అభిమానించినట్లు కనబడుతుంది.

...... అసంతృప్తి సంప్రదాయ కవిత్వం మీద ప్రకటించిన వారిలో మొట్టమొదటివారు సుబ్బారావుగారు. ---- అమలిన శృంగారం నిజంగా ఆయన మనకు చేసిన గొప్ప contribution అని అనుకుంటాను.... decadence నుంచి మళ్ళీ శృంగారాన్ని ఉదాత్తమయిన స్థాయికి ఉద్ధరించినది

సుబ్బారావు గారికే అని చెప్పాలి. భావకవులకు మార్గదర్శకులయ్యారు అందులో వారు. అంటే కేవలం శరీరగతవర్ణనలు చేయకుండా ఒక పవిత్రమైనటువంటి ఆదర్శాన్ని ప్రేమలో చిత్రించడం అది సుబ్బారావు గారి దగ్గర నేర్చుకున్నారు భావకవులు. ... అసలు ఆ ఉదాత్తమయిన భావన సుబ్బారావు గారి నుంచే. ఈ అమలిన శృంగారం ద్వారానే. .... లాక్షణికమైన పద్ధతిలో కాకపోవచ్చును గాని శృంగారాన్ని ఒక ఉదాత్త స్థాయిలో treat చెయ్యడం ఉన్నదే. అది సుబ్బారావు గారి దగ్గర నేర్చుకున్నదే.

ప్రబంధ కవుల అశ్లీల శృంగారాన్ని ... దాన్ని సుబ్బారావు గారు Positive side నుంచి... కేవలం Negative గా ఎదుర్కొన్నారు రామలింగారెడ్డిగారు. Positive side నుంచి శృంగారం అంటే ఇది, ఇట్లా ఉండాలి అని నిర్దిష్టతను వ్రాసి చూపారు.

... ఉమర్ తత్త్వం వారికి నచ్చినారు. కవిత్వంలో ఉన్నటువంటి రహస్యత్వం వల్లనే ఆకర్షితులై - ఫిట్జెరాల్డు అనువాదంలో ఉన్నటువంటి అవిశిష్టత వలన ప్రభావితులయి అనువాదం చేశారేమో అని అనుకుంటాను.

--- కవిగా ఎక్కువ సుబ్బారావు గారు భక్తి మార్గాన్నే అనుసరిస్తుంటారు.

ప్రాచీన ఆంధ్ర సాహిత్య ప్రభావం కవుల ప్రభావం సుబ్బారావు గారిలో పద్యరచనలో సమాసకల్పనలో జాతిరచనల్లో కనబడుతుంది. పోతన వారికి చాలా అభిమాన కవి. .... ప్రత్యేకమైన ఆపద బంధాలూ ప్రత్యేకమైనటువంటి

ఒక లాలిత్యం చెప్పటంలో ఒక పేశలం ఒక ప్రసాదగుణం ఇవన్నీ కూడా సుబ్బారావు గారిలోనే ప్రారంభమయినయ్. ---- భావకవిత్వం అంటూ ఒకటి రాకపోతే ఇవన్నీ వచ్చి ఉండేవి కావని నా ఉద్దేశం. ఆ స్వాతంత్ర్యం కనుక వాళ్ళు అప్పుడు సాధించి ఉండకపోతే, సంప్రదాయం మీద కనుక అప్పుడు వాళ్ళు అటువంటి తిరుగుబాటు చేసి ఉండకపోతే ఈ కొత్త ఉద్యమాల మార్గాల్లో సాహిత్యం నడవడానికి అవకాశం ఉండేదికాదు.

సుబ్బారావు చెప్పదలుచుకున్నది తమ కావ్యాల్లోనే చెప్పేశారు - సూటిగా చెప్పకుండా. మానవులను ఒక సూత్రంలో ముడివేయగలది మైత్రీ సూత్రం. దాన్ని ప్రతిపాదన చేయడం, ఆ ప్రతిపాదన సుందరంగా ఉండడం, సృష్టికంతటికీ కూడా ఆధారభూతమయినది ప్రణయతత్త్వం ఉన్నది అనేటువంటి ప్రభావం - ఇవన్నీ కూడా వారి తాత్త్విక చింతనలోని భాగాలే.

ముఖ్యంగా నాకు వారిలో కనబడేది ఆ సత్య సౌందర్య సమన్వయం. ఇప్పుడు సాహిత్యం చెప్పదలుచుకున్న సత్యాన్ని సుందరంగా చెప్పటం, ఈ రెంటి సమన్వయం చాలా అపూర్వంగా మొట్టమొదటిసారిగా తెలుగు సాహిత్యంలో రాయప్రోలు రచనల్లోనే ప్రవేశించిందని నేననుకుంటాను.

---

## శ్రీమతి కొత్తపల్లి లలితగారు.

27-2-82
4 PM.

భగవదారాధనం ----- మాతృరూపంగా ఆరాధిస్తారు. దేవిని కూడా అనేరకంగా ఆరాధించారు. 'లలిత' అన్నపేరు నాకుపెట్టడంలో ఆ పేరే పెట్టారు. మా ఇంట్లో వాళ్ళకి ఆయన పెట్టినపేర్లే ఆయన అభిరుచిని తెలుపుతాయి. మా అక్క కల్యాణి, మంగళశబ్దంకోసం పెట్టుంటారు. మా అన్నయ్య అసలు పేరు చింతామణి. తరువాత 'రాజశేఖర్' చేరింది. శ్రీనివాసమార్తాండ్ ----- morning birth వల్ల ఆపేరు పెట్టిఉంటారు. తరువాత నేను. నాకు కూడా లలితాంబ అని దేవి పేరు పెట్టుకోవాలని పెట్టారు. అయితే register లో నా ఇష్టంమీద లలితగా వ్రాయించారు. తరువాతవాడు శివప్రసాద్. ఆ తరువాత తమ్ముడు చిదానందం. వాళ్ళిద్దరి పేర్లూ కలిపి శివానంద అని అనేవారు. ఇద్దరినీ కవలల లాగా చూసేవారు. మా చెల్లెలు పద్మావతి. మా తమ్ముడు ప్రభాకర్.

ఇంట్లో ఏ కార్యం చేసినా పెండ్లిళ్లో, దానిలో వేంకటేశ్వర దీపారాధన చేయడం అదీ ఉంది. విగ్రహారాధన ---. అంటే పటం లాంటిది, కాలెండర్ ఫోటో లాంటిది ---- వాటిల్లో దేవతారూపానికి పూజించడమేగాని, పంచలోహం, వెండి లాంటి విగ్రహాలూ, బొమ్మలూ పెట్టి పూజ చేయడం ఆయనకు ఇష్టం ఉండదు. లలితాసహస్రనామాల పుస్తకం ఆయన దగ్గర ఉన్న దేవీపటం వంటి వాటిని మారవడం కాని,--- శ్రేకం అయినాసరే, పుస్తకం ఎంత శిథిలం అయినాసరే---- వాటిని మారవనివ్వరు. ఆయన పూజించే బొమ్మ నందలాల్ వేసినది.

బాల, రాజేశ్వరి లాంటివి శక్తి స్వరూపాలు. వాటిని తట్టుకోవటం కష్టం అని ఆయన అంటారు. లలిత పేరులోనే సౌమ్యం ఉంది. ఆ దేవి శాంతస్వరూపిణి అని అంటుంటారు.

Tender things, feelings లాంటివి ఆయనకు అభిమానం. వికృతం, వికారం అయినవి నచ్చవు. Black లాంటి colours ఆయన వద్దనేవారు.

మహా నైవేద్యం పట్ల నమ్మకం తక్కువ. ఆ అలవాటు లేదు. తడిబట్టలతో మడి అదీ ఆయనకు నచ్చదు. అయితే ఇంట్లో పిల్లలు జుట్టు విరబోసుకున్నా, జుట్టు నీళ్ళు కారుతూ ఉంచుకున్నా బొట్టు పెట్టుకుండా ఒదిలినా కోప్పడేవారు. గుడికి ఆయన వెళ్ళేవారు కాదు. మేము పోయేవాళ్ళం కాదు. కాని పెద్దయ్యాక ఇప్పుడెప్పుడైనా మేము వెళ్ళి గుడిప్రసాదం అని ఇస్తే మాత్రం తీసుకుంటారు. కళ్ళ కద్దుకుంటారు. శుక్రవారం మాత్రం మడిగా నైవేద్యం పెట్టేవారు. తాంత్రిక విజ్ఞానం గురించి దృష్టి ఎక్కువ లేదు. ఉపాసనే బలంగా ఆయన అభిమానిస్తారు.

దేశభక్తిలో cosmic image---- కాని regional ది లేదు.

స్త్రీకి ప్రాముఖ్యం----- mother గా deal చెయ్యటం. వీటిల్లో Bengal వారి పద్ధతి ఆయనకు నచ్చింది. వాళ్ళు ఎట్లా స్త్రీని గౌరవిస్తారో, అభిమానిస్తారో---- ఆ atmosphere నచ్చింది. పిల్లల్ని Bengal పంపించి చదివిస్తాననేవారు.

---

30-3-81

శ్రీ కోగంటి సీతారామాచార్యులు గారు. 5:30 PM

అసలు కవి అయినవాళ్లు నిర్గుణబ్రహ్మన్నే చెయ్యడానికి ప్రయత్నించినా సగుణబ్రహ్మ ద్వారా గాని చెప్పడం కుదరదు. కవి అయినవాడు సగుణ స్వరూపం బాగా ఉపాసించేవాడు కావాలి. సుబ్బారావుగారు భగవంతుణ్ణి సర్వప్రకృతిగా ఆరాధిస్తాడు. ఎందుకనంటే ఒకప్పుడు ఆయన ఉపన్యాసం కూడా నేను విన్నాను బెజవాడలో. "సర్వం ఖల్విదం బ్రహ్మ, సర్వం జగదిదం బ్రహ్మ" అని. ఈ రెండూ నా చిన్నతనంలో మొట్టమొదటిసారి వారి నోట్లోంచి విన్నవే. ప్రకృతి మొత్తం బ్రహ్మవస్తువుగా ప్రకృతివర్ణనల వల్ల కవిగా ఆనందమే బ్రహ్మానందముగా భావించిన మహాకవులు చాలామంది ఉన్నారు. సుబ్బారావుగారు కూడా ఒకరు. సంస్కృతాంధ్ర పరిజ్ఞానం, దీనికి తోడు ఆంగ్ల విజ్ఞానం - ఈ మూడూ ఉండడం వల్ల నేనప్పుడప్పుడూ అనుకుంటూ ఉంటా ఆయన త్రివేణీ సంగమం వంటివాడు అని.

తాంత్రికము లంటే రెండున్నాయి. - క్షుద్రములు, మహావిద్యలు. మహావిద్యలను సుబ్బారావుగారెప్పుడూ వ్యతిరేకించేవాడు కాడు. హింసాత్మక కాండను ఆయన ఎప్పుడూ అంగీకరించినవాడు కాడు. ఆయన మనస్సు సహజకోమలమయిన మనస్సు. ఉత్తమమయిన మార్గంలో శుద్ధంగా పూజించేవారేకాని హింసాత్మకమైన తాంత్రిక పద్ధతికి సంబంధించినవారు కారని నా సిద్ధాంతం. సుబ్బారావుగారి మనస్సు ఆయన కావ్యంవలె ఉదాత్తమైనది. ఆయన కావ్యం మనస్సువలె ఉదాత్తమయినది.

ప్రకృతిని వర్ణించడంలో ఆధ్యాత్మిక చింతన ఉంది.

ఆయన ఒక తీగెను వర్ణించినా, ఒక ఆకును వర్ణించినా, ఒక ఎండు గడ్డి మోపును వర్ణించినా అహంకార మమకారములకు దూరమయిన సత్యాన్వేషణ చేశాడాయన. ఆ సత్యాన్వేషణ ఎప్పుడయితే చేస్తారో అప్పుడు వారికి ప్రకృతి - ప్రకృతిగతములయిన సర్వవస్తువులు ఆనంద మయమయిన బ్రహ్మపదార్థం వంటివి.

రాయప్రోలు గారిది పాండిత్యము మనస్సది నిర్గుణమైన బ్రహ్మవస్తువు అయినప్పటికీ అది సగుణస్వరూపం లేనిదే కనబడదు కాబట్టి వినపడదు కాబట్టి, కవిత్వం శబ్దం లేనిదే ప్రకాశించదు కాబట్టి ద్వైత సిద్ధాంతంలోనే చెప్పారు. కాని ఆయన ఒళ్ళు మరచి చెప్పినప్పుడు మాత్రం అద్వైతం కనిపిస్తూనే ఉంది. ప్రకృతిని ఒప్పుకున్నంత మాత్రాన విశిష్టాద్వైతి కాడు. ఆయనకు మూడింటిలో ఏదిష్టమూ అంటే అద్వైతమునందే ఆయనకు పర్యవసానం. కాని దాన్ని చెప్పేటప్పుడుండే ద్వైతంలోనూ చెప్పాలి విశిష్టాద్వైతంలోనూ చెప్పాలి.

దేశభక్తిలో ఆధ్యాత్మిక చింతన లేకుండా ఎట్లా పోతుంది? దేశభక్తి అక్కర లేదూ అంటే మన సంధ్యావందనాదుల్లో దేశనామ కీర్తనం చేయడం ఎందుకసలు?

సుబ్బారావు గారిది మనస్సు భవభూతికి చెందిన మనస్సు. సుబ్బారావు గారి కవిత్వం తెలియడానికి మన భగవద్గీత భారత భాగవత రామాయణాదులు ఉపకారకాలు.

ఈ ప్రపంచం అంతా సత్యం కాదు. ఈ ఆనందం నిజమైంది కాదు. ఇవుడు కేవలం మాటకేనివే అనటానికి మళ్ళీ మనకు జన్మమక్కర లేదు అనే భారతీయ తత్త్వాన్ని స్పష్టంగా

ప్రతిపాదించుకున్నవాడు నమ్మినవాడు కాబట్టి ఆ తత్త్వం నచ్చి వీరను వరించారు.

జ్ఞాన, కర్మ, భక్తి మార్గాలు మూడూ వారికి అభిమానపాత్రములే. ఆయన కర్మ సిద్ధాంతాన్ని చెప్పారు. భక్తి సిద్ధాంతాన్ని చెప్పి భక్తుడై కంఠమెత్తి భగవంతుణ్ణి ప్రకృతిస్వరూపంలో సంకీర్తనం చేశారు. ఆనంద తన్మయుడై ఆనందమయ గీతాలు పాడారు.

ఏ కావ్యము సంతతి వర్ణనచేత హేయమైనటువంటి స్త్రీ, పురుష సమ్మేళనాత్మకమైన వాంఛావిశేషం కలగకుండా ఉంటుందో, అది రసాత్మకంగా ఉంటుందో అది అమలినం. ఏదైతే ఈ రూపమైన వాంఛలు కలిగిస్తుందో అది మలినశృంగారం. అందరూ ప్రేమను ఎక్కువగా కామమోహార్థంలో వాడుతున్నారు. కామమోహములు ఉపాధి అయిన శరీరానికి సంబంధించినవి. అవి క్షణికములంటయ్యి. కాబట్టి మలినశృంగారం అంటే దైహిక వాంఛావిశేషాలు తీర్చుకొనుట. అమలినశృంగారం అంటే మనస్సుచే, ఇంద్రియములచే, స్థిరమై ఎంతసేపు భావన చేసినా వెగటు కలగని ఒకానొక మహాసిద్ధి. శృంగారం సర్వప్రాణిలోకగతం. శృంగారం శరీరధర్మం కాబట్టి శృంగారం మీద ప్రధానంగా సమన్వయం చేసి మనవాళ్ళు చెప్పారు. అయితే ధర్మమయిన శృంగారాన్ని శృంగారం అనటంకంటే అధర్మమయిన దానినే శృంగారం అనే వాడుక ఎక్కువగా కనిపిస్తోంది. అందువల్ల అమలినశృంగారం అన్నారు.

అసలు .... సాహితీసమితి కవులందరూ అమలిన శృంగారసిద్ధాంతాన్ని కొనసాగించారు. అమలినశృంగారానికి ఎందుకు బాగా ప్రచారం రాలేదంటే సంసారం లోపలికి మందిచ్చినట్లుగా

పంపడానికి వీల్లేనిది.

ఎర్రాప్రగడ పోలికలు బాగా ఉన్నయ్యి. ప్రకృతిని అత్యద్భుతంగా వర్ణించి ప్రకృతిలో తాండవం చేయించి తాను తాండవం చేసినవాడు ఎర్రాప్రగడ. తెలుగుకవులలో మళ్ళీ అట్లాంటివాడు సుబ్బారావుగారు. పద్యం యొక్క ఉపక్రమణా, ఉపసంహారాలూ అట్లాగే ఉంటాయి.... ఉపనిషత్తు ప్రభావం ఉన్నంతగా వేదప్రభావం లేదు. ఈ ప్రభావం మామిడిపండులో రుచిలా ఒక చోటు అని చెప్పడానికి వీల్లేదు. సంస్కృత, ఆంధ్ర కవుల ప్రభావం లేని ఖండకావ్యం లేదు. కాళిదాసు లేడనికాదు. భవభూతి మరీ ఎక్కువ.

తన కవిత్వం మీద తాను మాట్లాడటం సుబ్బారావుగారిలో తక్కువ.

---

12-6-81

శ్రీ గరికపాటి లక్ష్మీకాంతయ్య గారు. 4.00 PM.

రాయప్రోలు స్వతంత్రమైన భావాలున్న వ్యక్తి. Original way of thinking ఉన్నవాడు. Wordsworth లాంటి westerners' ideas ఉన్న వ్యక్తి సుబ్బారావు గారు. సుబ్బారావు గారిలో ప్రతిభ వ్యుత్పత్తులు ఒకదానిలో ఒకటి పోటీపడి, ఒక దానిని మించి ఇంకోటి ఉన్నాయి. స్త్రీని దేవతగా చూడాలని అన్నారు.... వేదభావాలు ప్రమాణం సుబ్బారావు గారికి.

ఆయన భక్తిలో ఉంటాడు కాని జ్ఞానం కూడా ఉంది ఆయనలో.---- ప్రాచీన మహర్షులు, గ్రంథాలు ఆయనకు అభిమానం. వాళ్ళ పావిత్ర్యం, మహత్వం వర్ణిస్తాడు. ... ఉన్నత ఆదర్శాలున్న వ్యక్తి.

ఆయన రచనల్లో సంస్కృత పదజాలం ఎక్కువ. వ్యవహారభాష వాడ్తాడు. అంటే సంస్కృత పదాలు ఎక్కువగా ఉన్న వ్యవహారభాష వాడ్తాడు.... ప్రజానీకానికి ఆయన హృదయాన్ని చెప్పడంలో ప్రముఖుడు. అనుకోవచ్చు. ప్రయోగం చేశాడు. తరువాత చాలామంది అనుకరించారు. మేనమామ పేరు ఎప్పుడూ చెప్తుంటారు. ఆయనచే ప్రభావితులయ్యారనుకుంటా.... ఆయన లలితోపాసకులు.

---

19-10-81

శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు. 5.30 PM.

నన్నయ నుంచి తిరుపతి వేంకటకవుల వరకు ఒకే మూసలో వస్తున్న సాహిత్యాన్ని, వెయ్యి సంవత్సరాల సంప్రదాయాన్ని పూర్తిగా మార్చేశాడు రాయప్రోలు. అప్పటిదాకా ఉన్న భావ ప్రపంచాన్ని మార్చి నూతన భావప్రపంచాన్ని తెచ్చాడు. కవులలో రొమాంటిక్ వాతావరణాన్ని శిల్పించిన ప్రధాన పురుషుడు. శబ్దాలు ఏరుకోవడంలోనే ఎవరూ తీసుకోనివి తీసుకుంటాడు రాయప్రోలు ..... అంతకు ముందు ఈ లక్షణావృత్తిని అనుసరించినవారు లేరా అంటే లేరని కాదు. అసలు లేరని కాదు. ఒకళ్లిద్దరున్నారు. కాని దానికే ప్రాధాన్యం ఇచ్చినవారు లేరు. రాయప్రోలు కవిత్వం అంతా లక్షణావృత్తే.... తెలుగు కవిత్వం రాయప్రోలుతోనే ప్రారంభం. లక్షణావృత్తిని అనుసరించే కవిత్వం, అలంకారం పుడుతుందంటున్నాను. జీవభూతమయిన కవిత్వ లక్షణం ఇదే.

28-12-81

6:30 PM

కవి సగుణబ్రహ్మోపాసకుడు. నానా రూపాలలో ఉండే సృష్టిలో తాదాత్మ్యాన్ని పొందుతాడు కవి. అందుచేత కవి ఎప్పుడూ సగుణబ్రహ్మోపాసకుడు. జగత్తు సగుణబ్రహ్మ. జగత్తుతో సంబంధం లేకుండా కవి పుట్టడు.....కవికీ, భక్తుడికి భేదం లేదు. భక్తుడే పని చేస్తాడో దేవుడి విషయంలో కవి జగత్తు విషయంలో అదే చేస్తున్నాడు అన్న మాట.

భక్తుడు లేక ఉపాసకుడు.... ఉపాస్య దైవతం వేరూ ఒకటి కావటం - ఇదే కదా భక్తుడు చేసేది. ద్వైత భావం పోయి అద్వైత స్థితి పొందడం.... సగుణ బ్రహ్మంలో ప్రారంభించి ఎప్పుడు తాదాత్మ్యం చెందుతుందో ఉపాస్య దైవతంలో - అంటే కవి విషయంలో వస్తువులో జగత్తులో ఎప్పుడు వాడు తాదాత్మ్యం పొందుతాడో వాడు వేరు. ద్వైతం లేదు. అద్వైతమే. కనక సగుణ బ్రహ్మోపాసకుడు నిర్గుణ బ్రహ్మోపాసకుడి కంటె ఒక మెట్టు తక్కువ అనుకునే భ్రాంతి రాకూడదు ఇక్కడ.... నిర్గుణ బ్రహ్మోపాసకుడు philosopher సగుణ బ్రహ్మోపాసకుడు poet. ఉభయులూ చేరే పరమబిందువు ఏదైతే ఉందో అది మాత్రం ఒకటే. మార్గాలు మాత్రమే విభిన్నంగా ఉంటయ్.... ఈ ద్వైతం కూడా అద్వైతానికే lead చేస్తుందని ఆలోచించడమేదైతే ఉన్నదో అది most fashionable method అనుకుంటా.... సర్వసాధారణంగా sophisticated sections ఎప్పుడూ ప్రతిదేశంలో ప్రతికాలంలో అద్వైతం వైపే వాళ్ళు మొగ్గుతుంటారు. మన రాయప్రోలు వారు దానికి exception కాదు. ఆయన కూడా ఇలాగా అద్వైతం వైపు మొగ్గిన thinking ఉన్నవాడే ఆయన.... అద్వైత స్థితిని ద్వైతంలోనించి వెళ్ళి తెలుసుకోవడం ఏదైతే ఉన్నదో అది ప్రతికవిలోనూ ఉంటుంది. అదే ఆ ప్రక్రియ ఇక్కడ రాయప్రోలు వారిలోనూ ఉంది అని నా భావన.

రాయప్రోలు వారి దేశభక్తికి ఆ రోజుల్లో ఆయన సమకాలికులుగా ఉన్న కవుల దేశభక్తికి ఒక విశిష్టమైన తేడా ఉంది. ఈయన నఖశిఖ పర్యంతం కవి. భావావేశం, ఈయనలో ఉన్నంత దేశంలో పొందే తాదాత్మ్యం మిగతా వాళ్ళలో

కనిపించదు. కనిపించక పోవటం అంటే వాళ్ళ అక్షరాలలో కనిపించదు అని అర్థం. వాళ్ళ లోపల ఉండొచ్చు. ఈనలో మొత్తం భావావేశం అంతా అక్షరాలు మోసుకొచ్చి మనముందు పడేస్తాయి. అందుచేత ఈన దేశభక్తికి వాళ్ళ దేశభక్తికి ఏదో అక్షరరూపంలో తేడా ఉన్నట్లు మనకు కనిపిస్తుంది.

.... కవికి ఒకదేవతలో అవసరం లేదు. ప్రతి స్వల్పమయిన వస్తువులో కూడా అతడు తాదాత్మ్యం పొందవచ్చు .... దేశభక్తి విషయంలో ఇతను చాలా ఆవేశపూరితమయిన కవిత్వం మనకు ఇచ్చాడంటే ఈన దాన్ని దేవతగా భావించాడా - ఇలాంటి విచారం చాలా అసాహిత్య విచారం. రాయప్రోలు భావావేశం దేశభక్తికి సంబంధించిన భావావేశం ఆనాటి దేశకాల పరిస్థితుల్లోంచి పుట్టినదే..... గాంధీగారెలాగ ఒక గాంలో ప్రజలకు రాయప్రోలు వారు కూడా అలాటి గాంధే.

రాయప్రోలు వారి అమలిన శృంగార సిద్ధాంతం

మనదేశానికి క్రొత్తేమీ కాదు. మన దేశపు ఉత్కృష్ట సంస్కృతికి చిహ్నము అది. మన దేశపు ఇతిహాసాల్లో ముఖ్యంగా రామాయణంలో అమలిన శృంగారమే వస్తువు. మేఘసందేశం, శాకుంతలం - ఇది అమలిన శృంగారమే..... క్షీణదశను పట్టిన సాహిత్యాన్ని మొట్ట మొదటిసారిగా రసదృష్ట్యా ఉద్ధరించి మళ్ళీ ప్రాణప్రతిష్ఠ చేసింది రాయప్రోలువారిది. అమలిన శృంగారం అనే నాగరిక లక్షణాన్ని పునరుద్ధరించడం చేత ఆయన మీను మళ్ళీ సాహిత్యంలో నాగరికతను ప్రాణప్రతిష్ఠ చేశాడు.

అమలిన శృంగారంలో దాంపత్య శృంగారం

తత్పూర్వ శృంగారం అనిష్టవిశ్వముల శృంగారం కూడా ఉంటుంది. అమలినం అంటే వికృతమైన పాశవిక అభిరుచులను అభివ్యక్తి చేసేటువంటిది. ఇవ్వనటువంటిది. వాటిని కాక దాటేటన control లో పెట్టుకున్న పద్ధతి ఏదైతే ఉందో అది అమలిన శృంగారం. సంస్కృతి నాగరికత ఉన్న దశలో ఏ దేశంలోనైనా సాహిత్యంలో అమలిన శృంగారమే సంప్రదాయంగా ఉంటుంది.

---- Platonic love కాదిది. Platonic love అన్నమాటలో ఒక విధమైన సాధించడానికి వీలుకాని అసహాయ స్థితిలో అవలంబించే పద్ధతి అనే ఒక స్ఫురణ కనిపిస్తుంది. వీడు కోరింది .... వాడికి దొరకకపోదు అనుకోండి అలాంటి స్థితిలో దాన్ని Platonic love అనొచ్చు కూడా. కాని దొరికినప్పుడు కూడా ఒక ఉదాత్తతని, ఒక నాగరికతను నిర్వహించడం మనం అమలిన శృంగారం అనాలె. శృంగారానికి కావలసినంత అవకాశం పుష్కలంగా ఉన్నప్పుడు కూడా దాన్ని పాశవిక స్వభావం చేత మలినం చెయ్యకుండా తనని తాను నిర్వహించుకోవడం ఏదైతే ఉన్నదో అది అమలిన శృంగారం. అన్ని నాగరిక సంపన్నమైన సాహిత్యాల్లోనూ మనకు దొరుకుతుంది.

అందరు contemporary poets లో రాయప్రోలు వారి అమలిన శృంగారమే ప్రభావం... నిర్వహించింది. దేవులపల్లి శృంగారం అంతా ఈయన దగ్గర నుంచి inspire అయిందే. విశ్వనాథ వారి శృంగారం రాయప్రోలు నుంచి పుట్టి కొచ్చిన స్రవంతే. భావకవితా యుగపు కవులెంతమందైతే ఉన్నారో అందరూ రాయప్రోలు భావాలకి లొంగినవాళ్ళే.

మధుకలశ రచనకి ఆయనని ఆకర్షించిన కారణం బయటి దేశాల నుంచి మన దేశంలోకి వీచిన వాయువుల ప్రభావం. నూతన చైతన్యం, నూతన జీవన అవగాహన, నూతన జీవన శైలి చాలా సునిశితమైన మనస్సులన్నిటిని ప్రభావితం చేశాయి. అందులో రాయప్రోలు వారు కూడా ప్రభావితులయ్యారు..... ఇక్కడ నాస్తికత ఉండటమే ప్రధానమైన కారణం కాదు ఆకర్షణకి...... చార్వాక సిద్ధాంతానికి ఉమర్ తత్త్వానికి చాలా తేడా ఉంది. superficial గా చూడటానికి ఉమర్ ఖయ్యాం నాస్తికుడుగా మనకు తోచవచ్చు....ఎంతో దూరంగా ఉన్న తత్త్వం ఏదైతే ఉన్నదో ఆ తత్త్వసీమను ముట్టుకోడానికి ప్రయత్నిస్తున్న ఉద్యమకర్త అనుకోవాలి. చార్వాకుడు కేవలం హేతువాద నిష్ఠితుడు.... ఉమర్‌కి చార్వాకుడికి Pacific సముద్రం అంత తేడా ఉంది.

జ్ఞాన, కర్మ, భక్తి మార్గాలనేవి జీవించేవాడికి నిజంగా అంత స్పష్టమైన విభిన్న మార్గాలుగా ఉండవు. ఈ మూడూ కలిపి ఆచరిస్తాడు మనిషి. ముఖ్యంగా కవి అయినవాడు భక్తిమార్గంలో జ్ఞానం ఉంది, కర్మ ఉంది. భక్తి చేత భక్తుడు కర్మపరుడవుతున్నాడు. భక్తి చేతనే భక్తుడు జ్ఞాని కూడా అవుతున్నాడు.......ప్రధానంగా చెప్పాలంటే కవి ఎప్పుడూ భక్తుడు.

రాయప్రోలు ఎలాంటి కవి అంటే మనదేశపు సంస్కృతి యావత్తూ తన రక్తనాళాల్లో ప్రవహిస్తూ ఉన్న సంపూర్ణమయిన సంస్కారి. ఇంత గొప్ప సంస్కారం ఉన్న కవిరక్తంలో తప్పనిసరిగా

వేదాలు, ఉపనిషత్తులు పురాణాలు తంత్రాలు కావ్యాలు అన్నీ ఉంటాయి. అన్నీ ఆయన రక్తంలో ప్రవహిస్తూనే ఉన్నాయన్నది మాట.

తెలుగు సాహిత్యాన్ని సృష్టించిన... ఒక యుగాన్ని సృష్టించిన మహాపురుషుడి మీద తత్పూర్వం ఉన్న సాహిత్య ప్రభావం లేదని ఎట్లా అంటామండి? అవన్నీ ఆయనలో ఉంటాయి. దాన్ని గురించి మనమేమీ పెద్ద పరిశోధన చెయ్యవలసిన విషయం కాదిది.

ఆనాడు ప్రపంచంలో ఒక బ్రహ్మాండమైన మార్పుగా వస్తున్నగాలి Romanticism అనేది. ప్రపంచవ్యాప్తంగా వీస్తున్నగాలి అది.... అంచేత దానిముద్ర ఆయనమీద తప్పని సరిగా ఉంటుంది.

(తిరుపతి) 14-10-81

శ్రీ చేబ్రోలు సుబ్రహ్మణ్య శాస్త్రి గారు. 7-30 PM

రాయప్రోలు కు ఉపాసనా అదీ ఉండేది. వారి మేనమామగారికి వేదోపనిషత్ ధర్మశాస్త్ర పాండిత్యం, నిత్య వైశ్వదేవమూ అదీ.. ఆయన నిత్యకర్మిష్ఠులు. సుబ్బారావు గారికి కిదంతా తరువాత. ఆయనకి ఉపాసనా విధానం. రాయప్రోలు వెంకన్న శాస్త్రి అని ఒకాయన ఉండేవారు. ఆయన సుబ్బారావు గారికి సన్నిహిత జ్ఞాతులు. మంత్ర శాస్త్రంలో ఉపనిషత్తుల్లో కృషి చేశారు. వారి దగ్గరే ఉపాసనా విధం సుబ్బారావు గారు స్వీకరించినట్లు స్వయంగా నాతో చెప్పారు. బాలాత్రిపుర సుందరి... ఆవిడే లలిత.... ఉపాసన వేకికట్టిమానం. "ఉపాసనా బలం లేనిచో విద్యలు రాబిల్లవు" అనేవారు. రాయప్రోలు వారి కవిత్వానికి శ్రీసూక్త, పురుషసూక్త, ఉపనిషత్తుల మూలం ఉంది. భగవద్గీత ఈశావాస్యోపనిషత్తు వీటన్నిటిలోని భావాలు, శబ్దాలు రాయప్రోలు కవిత్వంలో కనబడతాయి. ఆ ఎత్తుగడ అదీ మంత్రాలలో ప్రారంభిస్తారు. ఋషుల పదాలు, అర్థాలు, భావాలు... ఆ ఇతివృత్త స్వీకారం అదీ ఆయనకు బాలా ఇష్టం.... కేవల వ్యావహారికం ఆయనకు అంగీకారం కాదు. శిష్ట వ్యవహారం అంగీకరిస్తారు.-.... ఆయన నోటివెంట పరుషవాక్యాలుగాని, పదాలుగాని, శబ్దంకాని రాదు. ఇతర కవులను గూర్చిగాని పండితులు గూర్చిగాని పరుషంగా పలకడం నేనెన్నడూ వినలేదు. .......... గుళ్ళకు మేము కలిసే వెళ్ళే వాళ్ళం. మంగాపురం వెళ్ళాము. కొండ మీదికి వెళ్ళాము. కోపం అన్నది ఆయనకు నప్పదు. ---- ఇటువంటి స్వభావం మన్వేకలదా చూడలేవు. ---- సుబ్బారావు ఎవరితోనయినా

స్నేహం చేస్తే కృష్ణార్జునుల స్నేహం. అంతగా కలిసిపోయేవారు. ఎదుటివారికి మనసు నొచ్చే పలుకు గాని...శ్వాస కూడా రాదు.

కవిత్వానికి వ్యాకరణాలు అడ్డొస్తాయని అనుకో కూడదు అనేవారు. ఎన్ని తప్పులుంటే కవిత్వానికి (తెలుగు) అంత అందం అనేవారు.... వంకలు అలంకృతులు అనేవారు. వంకశబ్దంలో చంద్రవంకధ్వని ఉంది.

శృంగారం ముదిరితే... దాని పరిణామ దశే వేదాంతం. వేదాంతం శృంగారం పరస్పర సంబంధం కలవి. సాహిత్య వేదాంతాలు సన్నిహితాలని చూచినపుడు అమలిన శృంగారం అర్థం అవుతుంది లేకపోతే కాదు.

రాయప్రోలు కవిత్వం ఆంతరంగా అందరికీ అర్థం కాదు. మంత్రశాస్త్ర రహస్యాలు మామూలు వాళ్లెరుగరు. ప్రేమించడం ఉంటే పనికిరానిది ఏదీ లేదనేవారు.

---

# శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు

26-2-81
5.30 PM

ఛందోమయ కవిత్వమార్గ దర్శకుడు రాయప్రోలు. రమణీయ కవిత్వాన్ని అందించినవాడు. పద్యం శిల్పం చెక్కడం నేర్పినవాడు. సొగసుగా రాయవచ్చని మంచిమార్గం చూపి పలుకుబడి నేర్పాడు. తెలుగుకవిత్వానికి వయ్యారం నేర్పి కవితాకన్యను మనముందు నాట్యం చేయించినవాడు. దైహిక ---- భిన్నంగా నిర్మలహృదయాలతో యువతీయువకుల మధ్య అమలినప్రేమ ఒకటి ఉందని కామానికి ప్రేమకు తేడా చెప్పినవాడు.

రాయప్రోలు తెలుగుదనం --- కవిత్వంలో పలుకుల పసందుకు సమాసాల సొగసుకు పెట్టింది పేరు. రమ్యదృష్టి కవులకుండాలి, శబ్దాన్ని భావాన్ని ఎన్నుకుని ప్రకటించడంలో రమ్యత ఉండాలని చాటినవాడు. మేధ కంటే హృదయం గొప్పది. ఓజోగుణం కంటే ప్రసాదగుణం, మాధురీగుణం గొప్ప అని సోదాహరణంగా నిరూపించినవాడు. శృంగారరస పవిత్రతను స్థాపించినవాడు.

ది influences గురించి నేను ఆలోచించను. స్త్రీని గౌరవంగా చూడడం, పవిత్రమూర్తిగా, ఆరాధ్యదేవతగా చూడడం తెలుగుకవులకు నేర్పినవాడు.

రాయప్రోలులో 'య' గురువా, లఘువా అని అడిగితే మీ సౌకర్యాన్ని బట్టి సందర్భానుసారంగా వాడుకోమన్నారు.

ఆయన పద్యం మీద అభిమానం నాకెక్కువ. ఎంత ఒడుపుగా, వయ్యారంగా ---- అది కావాలి నాకు. గురజాడ పద్యం రాసినా రాయప్రోలు వచనం రాసినా ఒకటిగానే ఉంటుంది నా ఉద్దేశంలో.

జనయిత్రిలో ఒక పద్యం ఇలా రాశాను.

ఎదలల్లి ఎదకుస్ఫూర్తినిడ 'రాయప్రోలు' చె
ల్లావఝ్ఝల' కిరీటలక్ష్మి నింప
'పింగళి' 'కాటూరి' ముంగురుల్ సవరింప
'దేవులపల్లి' శ్రీతిలకముంప
'విశ్వనాథ' వినూత్నవీక్షల కిన్నెరమీట
'తుమ్మల' రాష్ట్రగానమొనర్ప
'వేదుల', 'నాయని' వింజామరలు వేయ
'బసవరాజు' 'కొడాలి' పాదము లొత్త
'అడవి', 'నండూరి' భరతనాట్యములు సలుప
'జాషువా', 'ఏటుకూరి' హెచ్చరికలిడగ
నవ్యసాహిత్య సింహాసనమున నీవు
ఆంధ్రకవితాకుమారి 'దీర్ఘాయురస్తు'.

---

30-3-81

<u>శ్రీ జమ్ములమడక మాధవరామశర్మగారు.</u> 1=30 PM

శ్రీమాన్ రాయప్రోలు సుబ్బారావుగారికి నమస్కారం చేసి ఈ మాటలు పలుకుతున్నాను.

కావ్యాల్లో గాని, నిత్యం ఇంటిదగ్గర పూజాపద్ధతిగాని చూస్తే సగుణబ్రహ్మను ఆయన ఆరాధన చేశాడా - అని అనిపిస్తుంది. శాంతినికేతనంలో విధుశేఖర భట్టాచార్య - మహాప్రముఖుడు, పండితుడు తాంత్రికుడు ఉండేవాడు. ఆయన చకలని ఉపాసకుడు. ఆ విధుశేఖర భట్టాచార్యను గురించి అప్పుడప్పుడు నాతో అంటుండేవారు. ఆ కారణం చేత వారి విశేషమేమయినా వీరిలో సంచరించిందేమో అని అనిపిస్తుంది.... లలితామూర్తిని కూడ భావన చేసేవాడు. లలితా సహస్రనామం పారాయణం చెయ్యడం - వాళ్ళింట్లో వాళ్ళ భార్య కూడా పారాయణం చెయ్యడం నాకు తెలుసు. ప్రత్యేకంగా ఆయన కూతురు లలిత - ఆ అమ్మాయికా పేరు పెట్టారంటే లలితా సహస్రనామాల్లోని విశేషాన్ని అనుసరించి ఆయనా విధంగా చేశాడూ - అని అనిపిస్తుంది. .... బాహ్యాచారం కనబడదు. అది ఒక భావదేహమునకు సంబంధించిన విశేషమనుకుంటాను. .... ప్రకృతిని పశ్చిమదేశం వాళ్ళు ఉన్నదాన్ని కంటికి గోచరించినదాన్ని వర్ణన చేయడమే తప్ప అధికం కాదు..... లలితా దేవతను ప్రకృతిగా ఆయన ఆరాధనం చేసి ఉంటాడు.... భావదేహంలో ప్రకృతిరూపంగా విద్యామయదేవతగా ఆమెను భావనచేసి ఉంటాడని నేననుకోవడం ఒకరకంగా యుక్తమే - ప్రకృతిని వర్ణించడంలో ఆధ్యాత్మిక భావనమందే ఈ విధంగానే ఉంటుంది. కేవలం ప్రకృతి - అక్షరరహితమైన ప్రకృతి వారి దృష్టిలో ఉండదు..... ఆ అవధానాలు

చెయ్యడంలో కూడా అక్కడక్కడా చేసిన ధ్యానపద్ధతులివే చూస్తే పురుషసహితమయినట్టి ప్రకృతినే ఆరాధనం చేసినట్లు కనబడుతుంది. .... చేతనాత్మకమయిన తత్త్వమనే వారు భావించినట్లు స్ఫురిస్తాయేగాని కేవలం భౌతికమయిన ప్రకృతిపరంగా వారు భావనచేశారు అని అనుకోవటంలేదు.

ద్వైతం, అద్వైతం విశిష్టాద్వైతం - వీటిల్లో ప్రత్యేకంగా ఒక ఆసక్తి ఆస్థ సుబ్బారావుకున్నట్లు కనిపించదు. అద్వైతం అను ఆమోదం వారికున్నది. ఎందువల్లనంటే అటువంటి సంప్రదాయంలోని వారు కాబట్టి.... బెంగాల్ శాక్తవాదం అన్నది ఆయన మనస్సులో నాకు కనబడదు. అది ప్రత్యేకంగా ఈ తెలుగుదేశంలో - అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి విశిష్టంగా శాక్తేయుడుగా ఉన్నాడో - అంటే అమ్మవారి జపం చేసేవారు. నాకు మాత్రం శాక్తేయత్వం శివపూజ ఉండేది. అద్వైత వాసనా ఉండేది.

సౌందర్యం అంటే ఆయన నిశ్చయంలో ఒకటుంది. అది అంగాంగభావమునకు సంబంధించినది కాదని... ఇంతకన్నా అతీతమైనదేదో ఉండి ఉంటుందని..... సౌందర్యమన్నది లలితాదేవతా సౌందర్యం అంటే కన్ను ముక్కు చెవి కాదు..... లోకంలో సుందరభావం అన్నది తనకు ఉపభోగ్యమయితేనే సుందరం కాకపోతే సుందరం కాదు. ఈ దృష్టిలో ఉంది. ఇటువంటి అల్పదృష్టి నచ్చదు సుబ్బారావుకు.

ప్రత్యేకంగా ఈయనకున్నటువంటి దేశభక్తి పేరు. మన దేశీయమైన విశేషాన్ని ప్రశంసాత్మకంగా మనం చెప్పుకోవాలి అనే అభిప్రాయం. ఆంధ్రదేశంలో కూడా ఆంధ్ర దేశాభిమానమే ప్రధానంగా భావించినప్పుడు కొంత అన్యప్రాంతాల

వాళ్ళను కొంచెం ఆక్షేపించినట్లు అనేది - అనేది అంత న్యాయం కాదు.

సుబ్బారావు చెప్పడంలో ఉపపాదన ధారావాహికంగా ఉండదు. అందువల్ల స్పష్టత కొంతవరకు గోచరించి ఉండకపోవచ్చు. అందువల్ల అమలినశృంగారం అన్నారంటే ఒకవిధమైన ఈ అభిప్రాయం ఉండి ఉండొచ్చు. ప్రతి మానవుడు కూడా అణురూపుడు. ఆణవ మలం ఇతనికుంది. ఈ కరచరణాద్యవయవాలెంత సౌష్ఠవంలో ఉన్నా ఆణవ మలంలో కూడి ఉన్నాడు కాబట్టి అజ్ఞానంలో కూడి ఉన్నాడు. దానికి సంబంధించినది మలినమైన శృంగారము. రెండు, అణురూపంలో ఆణవమలం కాక శాక్తమలం అని కొంత ఉంది. మానవునికి సంబంధించి ఒకానొక విశిష్టమైన శక్తి విజృంభణ - పరిమితమైన శక్తి. పరిమితమైన శక్తి విజృంభణలో వస్తే అవనిది శాక్తమలం. అది కూడా స్వచ్ఛమైనది కాదు - మరి ఒకటి శాంభవ మలం. కొంత ప్రజ్ఞావివేకం కలవాడవుతాడు. అయినా మలదూషితుడవుతాడు కాబట్టి శాంభవ మలంలో కూడి ఉంటాడు. ఈ ఆణవ మలం శాక్తమలం శాంభవమలం - ఈ మలత్రయం దాటిపోయి భావనం చేస్తేనే గాని ఉత్తమమయినటువంటి శృంగారం రాదు అని. ఇవి దాటిపోయి భావన చేయడానికి ఒకవిధమైన ప్రణాళిక కృష్ణభక్తి సంప్రదాయంలో ఒకటి - చైతన్య భక్తి సంప్రదాయంలో ఉంది. ..... అనేకవిధాల కృష్ణుణ్ణి ప్రేమించినవాళ్ళు - వాత్సల్యంలో ప్రేమించనీ మరో విధంగా ప్రేమించనీ - వాళ్ళంతా మలినశృంగారంలో కూడినవాళ్ళు. అమలినశృంగారమనేది ఈ భావములు దేహ వికాసంలో కలిగేది. కేవలం గోపికలకు రాధికకు సంబంధించింది.

..... కృష్ణపరమాత్మను ధ్యానం చేయుట. అదీ సఖుణ్ణిగా ధ్యానం చేయుటం చాలా ముఖ్యమయినట్టిది. దాన్లో సఖీరూపమయిన భావన చేయడం. అందువల్లనే అక్కడక్కడా సఖా! సఖీ - అనడం కద్దు సుబ్బారావు ..... రాధాదేవి, గోపికలు - వీళ్లను శక్తిరూపాలుగా భావన చేస్తే 'శక్తిమాన్' కృష్ణ - అతన్ని అందుకోడానికి వీలవుతుంది. అది కేవలం అమలినమైనటువంటి శృంగారం. ఇది కేవలం భౌతికమైనది కాదు. అంగాంగములకు సంబంధించినట్టిది కాదు. ఇది అతీతమయినటువంటిది ఏదో. రసమయ లోకంలో ఉండే అభిప్రాయాన్ని స్వీకరించడం - అది ఉత్తమమయినటువంటి అమలిన శృంగారము అని భావన. ఈ దృష్టి లోంచే - ఆయన ఎక్కడయినా ఓ పువ్వుని చూసినా, ఆ పువ్వులో పరిమళం ఉంది. అది పరమాత్మను సంబంధించిన దివ్యగంధాన్ని సమర్పించేదవుతుంది. ..... రూపరసగంధములు లోకంలో ఉన్నవానిని పరమాత్మ అభిముఖంగా మనం భావన చెయ్యాలేగాని మన ఉపభోగానికి సంబంధించినట్టుగా మనం భావన చెయ్యరాదు..... మామూలుగా అంతఃకరణ ధర్మంలో కూడినప్పుడేమో మలినమవుతుందిగాని అంతఃకరణాధర్మంలో కూడనప్పుడు అమలినంగా ఉంటుంది. అనాసక్తి భాగం చాలా ముఖ్యమైనట్టిది అది ఆ ప్రణాళికలోనిది. అయితే స్పష్టము అయినటువంటి రీతి సుబ్బారావుగారిలో కనపడక పోవచ్చు. ఎందువల్లనంటే ఆయన అటువంటి తత్త్వం విశదంగా వ్యాఖ్యానం చెయ్యడానికి అంగీకరించినవాడు కాదు కాబట్టి.

ఆయనా బైటే కర్మశ్రద్ధ గలవాడు కాదు. ఒక భావమయము మయినట్టి భక్తిమార్గం కలవాడు.... ఇక జ్ఞానమంటే

కేవలం ఉపనిషత్తులు. ఆ జ్ఞానం అటువంటిది. స్మరించినట్టు కనబడుతుంది
అక్బర్ హైదరీతో మాట్లాడుతూ ఒకసారి
"ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే ఆనందేన జాతాని
జీవంతి" అన్న వాక్యం ఉపనిషత్తుల్లోంచి పలుకుతూ వచ్చారు.
అక్బర్ హైదరీ చాలా సంతోషించారు. ఆనందం నుంచి ఉద్భవం
ఆనందంలో విలయం పొందడం చాలా బాగున్నది తత్త్వం అన్నారు.
"ఇదే మాట మా ఉపనిషత్తుల్లో కనబడుతోంది అని నేనన్నాను.
అందుకే ఆయన చాలా అభినందనం చేస్తూ వచ్చారు" అన్నారు.

వేదాలు, ఉపనిషత్తులూ ప్రభావం ఏరీతిగా కనిపిస్తున్నాయి
అంటే - అవి అనుకోకుండా వచ్చేరీతిలో ఇమిడి ఉంటాయి. అంతేకాని
నేను స్మరించి ఆ విధంగా అందించినట్టుగా భావన అనిపించదు నాకు.
.... తనదేశంలో ఏ కుటుంబ మర్యాదలో నేను పెరిగానో, ఆ
కుటుంబ మర్యాదలలో పెరిగినవాటిలో బాగా ఉపనిషత్తులూ, వేదాలూ
యీ పరిజ్ఞానం గలవాళ్ళ పండిత వంశమే కదా! ఈ పండిత వంశం
లోని సంస్కారములు ఆయనిని ఆ విధంగా చేయించి ఉంటుంది.

రామాయణం ప్రభావం బాగా ఉంటుంది. భవభూతి
ఉత్తరరామచరితం ప్రభావం బాగా ఉండి ఉంటుందేమో అనుకుం
టాను. భవభూతి ప్రేమించిన పదములను వారు అప్పుడప్పుడూ
అంటూ ఉండటం కద్దు. ఇటువంటి మాటలన్నీ ఆయనకిష్టమై
ఉంటాయి. అందువల్లే సుబ్బారావు అప్పుడప్పుడూ అనడంలో
ఆ భవభూతి అభిప్రాయములను రూపాంతరములో
అంటూ ఉన్నట్టు అనిపించుచూ ఉండేది.

ప్రాచీన ఆంధ్రకవుల ప్రభావం అట్టే

ఆయనను - ఒక కవి యొక్క ప్రభావం ఆయనలో బాగా ఉన్నట్లుగా కాదు. కాక అది మరో రూపాంతరంలో కనిపిస్తుంటుంది. భాగవతం మాత్రం బాగా భావన చేసి ఉంటాడు. . . . సామాన్యంగా ఉండే పదములు కాక సంస్కృత సమాసంలో కూర్చుకున్న పదములో ఆయన ప్రయోగంలో ఒకానొక చిత్రత కనబడుతుంది. కాన్నిమో సంప్రదాయ విచ్ఛేదం కూడా అక్కడక్కడ చేసినట్లు కనబడుతుంది. . . . . . దూతవత్తేఖంలో యతి లేదూ ప్రాస లేదు. ఆ విధంగా చేస్తే పిచ్చివాడు సందేశం పంపించడంలో ఆ విధంగా చెయ్యడమే బాగుంటుంది అన్న ఔచిత్యం తోచింది అన్నారు.

రాయప్రోలులో ఉన్న తాత్త్వికత అంటే ప్రకృతి సంబంధంలో ఉంటే ఆధ్యాత్మిక చింతన విడనాడినట్టిది కాదు.

జుగుప్సావహంగా ఉండేవి, అసభ్యంగా ఉండేవి ఆయన మనసుకు నచ్చవు. నచ్చనందువల్ల వాటిని వర్ణనచేయటం, చేసేవాళ్ళను అభినందించడం కాని ఆయనకు ఇష్టం కావు. అందువల్ల ఆయన తలచినది అమలినమయిన శృంగారం. అయితే సుబ్బారావు తలచినటువంటి అమలిన శృంగార తత్త్వం వ్యాపించాలి అంటే సుబ్బారావు యొక్క కంఠం వేయి కంఠాలుగా మారి మరల వ్యాపింపచేస్తేనే గాని అది లోకంలో వ్యాపించదేమో అన్న అభిప్రాయం నాకు ఉన్నది.

---

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు

8-2-82

10:30 AM

రాయప్రోలు సుబ్బారావుగారి పదబంధాలు, ఆ నుడికారం, దేశభక్తి అభినూతన పద్ధతిలో.. ఇదంతా ఇష్టపడుతుండేవాడిని. ఆ శైలి - ఆ పదాల కూర్పు - ఇవి బాలమందిని ఆకర్షించాయి. ఆయనకు రెండు phases ఉన్నాయి. మొదటి phase కవిగా. scholar గా రెండో phase. ఆయన ప్రభావాన్ని ఎందరో అందుకున్నారు. ఆకర్షింపబడ్డారు. రామిరెడ్డి 'కడపటి వీడ్కోలు' మీద రాయప్రోలు ప్రభావం బాగా ఉన్నట్లు నాకు అనిపిస్తుంది. నా 'పచ్చతోరణం' మీదకూడా ఆయన ప్రభావం ఉంది. ఆంధ్రోద్యమం, జాతీయోద్యమం అంతా ఆయన influence అనే చెప్పాలి. అంతకుముందు ఎవరన్నా రాసి ఉండొచ్చుకాని impact వాళ్ళది కాదు. Impact ఎవరిదో వాళ్ళ influence అనే చెప్పుకోవాలి. ఊరికే మొదట రాయడం కాదు. విశ్వనాథ పైకూడా ఈ influence పడింది.

Highly sanskritised భాష ఇష్టపడేవాడు కాదు. తెలుగుదనం.. తెలుగు సమాజం ప్రతిబింబించిన కావ్యం... [illegible] కవులు, కావ్యాలు ఆధునికులలో అంతవరకూ... మరెవరూ లేరనే చెప్పవచ్చు.

ఆయన మీద కొమర్రాజు లక్ష్మణరావు influence ఉంది. దుగ్గిరాల influence ఉందని ఆయనే చెప్పాడు. ఆయనకు Wordsworth మీద అభిమానం ఉండేది. మన జానపదసాహిత్యాన్ని అభిమానించేవాడు. వేదాలు, ఉపనిషత్తులు, ఆర్షసంప్రదాయం ఋషి వాటికలు - వీటిని అభిమానించేవాడు. Shelley, Wordsworth [illegible] కవిత్వం రాయవలెననే ఉద్దేశ్యంతో కవిగా వచ్చినవాడు కాదు.

1-2-82

శ్రీ మరుపూరు కోదండరామరెడ్డిగారు. 5-15 PM

రాయప్రోలు సగుణమూర్తినే ఆరాధిస్తారు. వీరిది సౌమ్యమూర్తి ఆరాధన.... మానవుడు ఒక leisure గా కూర్చుని సోమరిపోతుగా ఉంటే ఆయన ఇష్టపడడు.

రాయప్రోలు అద్వైతి. విశిష్టాద్వైతి కాదు.

.... దేశభక్తికి మాకు మొదటి వైతాళికుడు. ఆంధ్రదేశంలో ఆయన. మా ఊళ్ళో రాశాడు "అమరావతీ పట్టణమున'.... ఆయన కాక 18-20 years లోపల ఉంటాయి........ Town Hall దగ్గరకొచ్చి **Pandal** లో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆ పద్యాలు చదివాడు-.... తెలుగుదనంలో ఆయన, తరువాత దువ్వూరి రామిరెడ్డి, జాషువా దగ్గరికే వచ్చింది తెలుగుదనం.

...... ఆనాడు దేశభక్తికి రాయప్రోలు సుబ్బారావును అనుసరించే పోయినారు.... గ్రంథాలయ సర్వస్వం (లో) ప్రతి month ఏదో ఒక పద్యం ఉండేది.

"చాలని దుర్దినాలు మన జాతికి దాపురమయ్యె అంతగా
కేవలకత్తై మనం గలరె ఈ ధవళాంగులు పేరమేడ భూ
పాలన మేడ భారత కృపా విసర్జన మేడ............
జ్వాలలు వేసి నిప్పుగతి ప్రాక్తములన్ భరియించు మకటా!"

'అకటా' అని 'సోదరీ' అని మా సోదరి పొణకా కనకమ్మ పేరిట రాశాడు. ఎప్పటిదో 50 ఏళ్ళ నాటిది. యిపుడు గడాలు పోయుంటాయి. మూడు కావాలి. ఇది unpublished poem.

ఉమర్ ఖయ్యాంలో మంచి phrase ఇచ్చారు. Nativity, తెలుగుదనం విచిత్రంగా వచ్చింది.... దాన్లో చాలా తెలుగుదనం. ... మా కా రాయప్రోలు books... అవే తెలుగుదనానికి...

అమలిన శృంగారం - ఎందుకంటే కామం కాదు. అది మధురభక్తి మీదే base అయి definitely దానిమీదే develop అయింది.... Platonic love కాదు. Platonic love మళ్ళీ... దానికి అనుభవ బ్యాయు లేనిది abstract అయిపోతుంది..... గోదాదేవి, ఆండాళ్ భక్తి ఏమిటంటూన్న? శబరి తిని..... రామికి ఎంగిలిచ్చింది. దానికంటే కొంచెం higher standard కు పోయింది.

మధుకలశంలో (philosophy, poetic beauty) రెండూ వచ్చినయి.... రాయప్రోలు సుబ్రావ్ కి వచ్చింది ఆ poem... ఆ expression వచ్చింది. ఆ fatalism ఉన్నదే అదే వచ్చింది. ఇది చార్వాక సిద్ధాంతము కాదు. ...దేవుడనే వాడు న్నాడు అనే ఆస్తికత్వం ఉన్నది ఉమర్లో. చార్వాకుడు నాస్తికుడు. దేవుడు విధి అంటాడు ఉమర్....

కర్మవాదం అంటే చెయ్యాలనే వాదం.... 'కంకణ విసర్జనలకిది కాలమగునే'... అనప్పుడు కర్మవాదమే కదా....

'ఉపనిషత్తుల మధువాతికె నిప్పు', 'బాదరాయణ పరమ ఋషులను వాదు సుమిత్రడి తుమెదా".... వైదిక ధర్మం సనాతన ధర్మం లోని internal truth ను ఎరుగక మురిసి పోయేవాడు. తన వేదములాన్ని గురించి చాలా గర్వం. రాసింది కూడా అట్లానే రాశాడు.

ఈయన మీద ఇంగ్లీషు ప్రభావం definite గా ఎక్కువ. Wordsworth, Shelley ఆయన quote చేస్తూండేవాడు. ఆయనను English ప్రభావితం చేసింది. ఎందుకంటే అందులో కొత్తదనం ఉంది. Almost Shelley బాణీలో వచ్చాడు..... ఆ picturisation అదంతా ఆకలనలో వచ్చేది. శ్రీనాథునిలో ద్వార..... Ethical brain ఆయనది. ..... ఆయన మాటల్లో కూడా తెలుగుదనం.

---

శ్రీ మిన్నికంటి గురునాథశర్మగారు     29-3-81

6 PM.

'తెనుగుతోట'... అబ్బా... 1926లో శారదానికేతనంలో teach చేశాను. అప్పుడు ప్రత్యేకంగా 1,2,3 క్లాసులుండేవి. అప్పటికింకా భాషాప్రవీణ...ఇవి లేవు. ఆ క్లాసులు సంస్కృతం క్లాసులు. సంస్కృతం తెలుగు రెంటికే చెప్పటమే - కానీ పుస్తకాలు ఏర్పాటు చేసి. రఘువంశం వంటి పెద్ద పెద్ద కావ్యాలుండేవి. ఒక క్లాసుకు ఒక యేడు తెనుగుతోట ఉండేది. ఇంకో క్లాసుకు విశ్వనాథ సత్యనారాయణగారిది నర్తనశాల...... రెంటికే లక్ష్మీనారాయణ గారి కిష్టమయిన పుస్తకాలు పెట్టడమే. సుబ్బారావు గారితో నాకు పరిచయం లేదు.

---

10-7-81

రాయప్రోలు వరలక్ష్మమ్మగారు. 6:00 PM

వారి పినతల్లి గాదేపల్లి సరసమ్మగారు. సొంత పినతల్లి కాదు. ఊళ్ళో అందరితో పాటు పిన్ని పిన్ని అనేవారు. మొదట్లో బాపట్లలో ఉన్నప్పుడు లలితోపాసన లేదు. శాంతినికేతనం నుంచి వచ్చిన తరువాతే చేసినట్లు జ్ఞాపకం.

వారి తల్లి ఆదెమ్మ, తండ్రి వెంకటప్పయ్య. అవ్వారివారు ఆయన స్వంత మేనమామ కాదు. ప్రతి శుక్రవారం లలితాసహస్రనామం చదువుతారు. ప్రతిరోజు మాత్రం లలిత పంచరత్నాకరం. గాయత్రి జపం ఎక్కువ. ఆయన గుడికి వెళ్ళడం చూడలేదు. కాశీలో చదివారు. గంగాస్నానం అయితే చేశారు కాని గుడికి వెళ్ళినట్టు వినలేదు. తిరుపతిలో బ్రహ్మోత్సవం రెండు మూడుసార్లు చేయించారు. వెంకటేశ్వర అష్టోత్తరం చదువుతారు. అదికూడా మొదట్లో లేదు. అప్పుడంతా లలితే. అన్నీ లలితే అనేవారు. ఇప్పుడు అంతా వెంకటేశ్వరుడే అంటున్నారు. చాలా కార్యాలు తిరుపతిలో చేశాం కూడా. రోజూ పూజాదికాలన్నీ లలితకే చేసేవారు.

ఎన్నో వ్రతాలు, నోములు పట్టాను. దానాలు, ధర్మాలు చేశాను. వీటికన్నిటికీ ఆయన బాగానే ప్రోత్సహించేవారు. ఆయన ప్రతి శుక్రవారం మాత్రం ఒకపూట భోజనం చేస్తారు. పూజాదికాల పట్టుదల ఎక్కువేకాని మడి తడి నియమాలు నిష్ఠలు ఎక్కువ లేవు. యాత్రలకీ చేయాలనే ఉత్సాహం తక్కువ. గుళ్ళకు పోతేనేనా? అక్కడే ముక్తి అనిలేదే అనేవారు.

30-3-81

శ్రీ పావిలాల సోమయాజులు గారు. 10-30 AM.

రాయప్రోలు నవకావ్య ప్రక్రియను తెలిసినవాడేనని చెప్పాలి. ఆయనకు తంత్రం తెలుసునా అనే అభిప్రాయాన్ని కొద్దిగానో గొప్పగానో కురుగంటి సీతారామయ్య కొంత చెప్పినట్లు గుర్తు .... ప్రకృతిని వర్ణించేటప్పుడు మనదేశపు యొక్క లక్షణం తప్పకుండా ఉండితీరుతుంది. అందే ఆయన చూసిన ప్రకృతి అది వసంతంలో సంబంధించిందనుకో వసంతదేవి స్వరూపం దాన్లో తప్పక ఉంటుంది.... సామాన్యంగా ప్రకృతి పరమేశ్వర స్వరూపాన్ని గురించి ఏవి భావాలయితే వారి ఆధ్యాత్మిక జీవితంలో వర్తితమవుతుంటయో అట్టి వర్తనకూడా కనబడుతుంది.

-------ఇట్లాంటిది కాకుండా ముందికి రావాలె అనేటువంటి.. ---- అనే ఉద్దేశం కలవాడే కాని మిగతావాళ్ళు కొందరు బ్రిటిష్ గవర్నమెంటు పోవాలి అని అనేటువంటి దేశభక్తి ఆయనకు లేదు. ఆయన దేశంయొక్క అభ్యుదయం కోరి ...ప్రశంసించాడు. 'ఆంధ్రావళి'లో దేశాన్ని గూర్చి చెప్తూనే "నమస్తే త్రివేణీ ఖరక్షీర ధారా అలం దీప్యతే ...కేనా పతాకా" ఇట్లాంటివే బాల దేవతగా భావించాడనటానికి.

సంస్కారం సంస్కృత కవులదే నన్నూ కేవలం పాశ్చాత్య కవులదని చెప్పటానికి వీలులేదు. ఆయన మేనమామ వేదం వేదార్థం ఈయనకు చెప్పాడు. ఈయన తెలియనివాడు కాదు. రవీంద్రుని దగ్గరకు వెళ్ళాడమనేది తరువాత ఆయనకు గొప్పతనం ఇచ్చి ఉండవచ్చు. ఏ సంస్కారమిచ్చినా. అంతకు క్రితం ఉన్న సంస్కారం

సర్వం కూడా సంస్కృత సాహిత్య ప్రభావితమే.

కనెన్నటికి... ఒడ్డూ కన్య... కాళిదాసు వాల్మీకి దగ్గర తాకట్టేసినట్టు కల్పించవచ్చు. ఆ పదప్రయోగం మీద అభిమానం వాళ్ళను సంస్కరించుకోవడం వల్ల వచ్చిన సంస్కారం అనాది..... ప్రసవించిన ఎలతీగెల పసిపాపల అంటా కాళిదాసే. Metaphorical expression అంటే ఉపమ కాకుండా రూపకభాష అంటే రూపకమయిన అన్వయం ఎక్కువ వాల్మీకి, కాళిదాసు, ఠాగూర్ వాళ్ళ నవలను, పాశ్చాత్య కవుల్లో Keats లాగా ఇది రాయప్రోలులో ఎక్కువ. మధుకలశం సుబ్బారావు సుఖలాలస దృష్టితో వ్రాసినవాడు కాడు. ఉమరు తత్త్వం ధన్యాత్మకమయింది అని ఒక అభిప్రాయం. ఏ పద్యానికి శృంగారం అని మనవాళ్ళు భ్రాంతి పడుతున్నారో ఆ పద్యానికి అక్కడనే సుబ్బారావుగారిది కూడా చూస్తే ఈ శృంగారభావం కంటే original గా ఉన్న మూలభావమే కనబడుతుంది. సంకేతార్థం సంకేతంగానే ఉంటాయి కాని వీళ్ళు అనుకున్న భావాలు కావు. సుఖలాలసత్వం కాదు. రాయప్రోలు మూలార్థంలోనే వ్రాశారు. సుబ్బారావుగారు అటువంటి మనస్తత్త్వం కలవారు కాదు. నేనీ పుస్తకం ఈ కారణంగా వ్రాశానని చెప్పడం ఆయన స్వభావం కాదు.

## శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు గారు (శ్రీశ్రీ)

28-2-82
9.30 AM

ఒకవిధంగా రాయప్రోలువారి శైవారాధన రవీంద్రనాథ్ ఠాగూర్ ఆరాధనకి చాలా సన్నిహితమైనటువంటిది... అనగా తను అన్న భగవంతుడు పరమాత్మ అని...

రాయప్రోలువారితో నాకు వ్యక్తిగతంగా పరిచయం కాలేదు.

ప్లేటోనిక్ లవ్ అని ఇంగ్లీషులో అంటామే అటువంటి ప్రేమనే వారు ప్రతిపాదించారు. మొట్టమొదటిసారి ఆంధ్రత్వాన్ని, ఆంధ్రదేశభక్తిని ప్రతిపాదించినవారు ఆయన. ఆ తరువాత విశ్వనాథ సత్యనారాయణ గారి ఆంధ్రపౌరుషం గాని తుమ్మలవారి రాష్ట్రగానం --- ఇవన్నీ చూశాను. ఈ ఆంధ్రాభిమానం అనేటువంటి దానికి termination --- మూలశక్తి, మూలాధారం రాయప్రోలువారి కవిత్వమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఉమర్ ఖయ్యాం philosophy ని రాయప్రోలు అంగీకరించి, ఆస్వాదించి రాశారని నేననుకోను... చార్వాక సిద్ధాంతానికి ఉమర్ తత్త్వానికి చాలా సన్నిహితమైన పోలిక ఉంటుంది. ఉమర్ ఖయ్యాం పూర్తిగా నాస్తికుడనటానికి వీల్లేదు. చార్వాకుడు పూర్తిగా నాస్తికుడు. ఇదొకటే భేదం.

మన ప్రాచ్యవేదాంతమనీ, దార్శనికత అనీ ఏదైతే అంటామో అది పూర్తిగా రాయప్రోలువారిలో కూడా ఉన్నది. వారు ఎక్కువ ఈ సంస్కృత ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేశారు. ఆ తరువాత కొంత పాశ్చాత్యప్రభావం వల్లనైతేనేమిటి ఆంగ్లేయ

పరిపాలన వల్లనైతేనేమిటి ఇంగ్లీషు పుస్తకాలు చదవటం వల్లనైతేనేమిటి .... ఈ భావకవిత్వానికి ఆద్యులయ్యారు. ఒకవిధంగా రాయప్రోలు సుబ్బారావుగారు chronological గాను గురజాడ అప్పారావు గారి కంటేగూడా ముందు రాశారన్నా కూడా నాకభ్యంతరం లేదు. అయితే గురజాడ వారిది వాస్తవిక దృక్పథం. వీరిది ఆధ్యాత్మిక దృక్పథం.

భావకవిత్వం ఒక leading literary movement. --- సూర్యకాంతి రాయప్రోలనుకుంటే నేను ఈ భావకవిత్వపు చంద్రకాంతిలా పెరిగినవాడిని. విశ్వనాథ సత్యనారాయణగారు ఆంధ్ర ప్రశస్తి, ఆంధ్ర పౌరుషం రాసున్నారంటే దానికి మళ్ళీ ప్రారంభాలు రాయప్రోలు వారిలోనే ఉన్నాయి. కృష్ణశాస్త్రి, విశ్వనాథ వేదుల, నాయని - వీళ్ళమీద direct గా రాయప్రోలు influence ఉంది. రాయప్రోలు వారిచే influence అయినవారందరూ నన్ను influence చేశారు.

# అనుబంధం - 3

11-6-81

శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు 4-00 PM

రాయప్రోలు కవిత్వం చూస్తే వ్యాకరణం చూడొద్దు. చూస్తే ఇది సర్దుంచుతాం. సంధి వివక్ష సమాసవిధులు నిత్యములు కావు....నేరాసేటప్పుడు ఆ పాత్రలు నాప్రాణమా అని రాసాను..... 'ఆశా ఖండికలు' పద్యం కట్టుమంచికి వచ్చింది.

వాచ్యార్థం ఒకటే కాదు. శబ్దానికున్నది. కనుక కావ్యం ఉన్నది ఉన్నట్లు అర్థం చేసుకోకూడదు. లక్షణా వ్యంజనల వల్ల వేరే అర్థాన్ని భావాన్ని కూడా అవసరాన్నిబట్టి గ్రహించాలి.... సమాసం నా ఇష్టం వచ్చినట్లు మారుస్తా. ఔచిత్యము - ఇష్టార్థము - మధురం, మనసును తోపివేయడం కావాలి. తప్పు సమాసమేమిటి? ప్రతిదీ మనిషి అనుభవానికి దగ్గరగా చేరాలి. ఇందులో ఇంగ్లీషు కవులు చాలా జాగ్రత్త పడతారు. ఊరికే abstract గా ఉంటే లాభం లేదు.

ఉపనిషత్కాలం నాటి free love society నా మనసులో ఉంది. ఆ కాలంలో వివాహబంధం లేదని, స్వేచ్ఛా ప్రణయం ఉండేదని తాత్పర్యం నాకు తోస్తుంది. వ్యభిచార దోషాల్లా ఇవి తరువాత వచ్చాయని నా నమ్మకం. కేవలం రసాత్మక కావ్యంలో దాన్ని తేవద్దు అని రూపనవనీతం conclusion. జీనియస్లు వాళ్ళకు తోచిన విధంగా నియమాలు ఏర్పరచి వివాహాదికాలు, నియమాలు, వ్యభిచార దోషాలు అంటగట్టారు. సత్వరజస్తమో గుణాలు మూడూ స్త్రీలుగా పురుషులుగా పెట్టి వ్రాయాలనుకున్నా. రూపనవనీతం వ్రాశా. రూపనవనీతం conclusion సరిగా రాలేదు. 'నే నేత్రద్వయ సంగమించిన'.. సౌందర్యలహరి పద్యం రూపనవనీతంకు background.

ఏ స్త్రీ పురుష సంబంధంలో - మిథునానురాగంలో అయితే మలినమవ
దానికి అవకాశం లేనిదో అది అమలిన శృంగారం. స్త్రీ పురుష
కార్యం వేరే. 'స్త్రీ పురుష యోగాకర్షణ' అని రాశాను. ఏకరూపా సంభోగం
అనే పదం రాశాను. ఎవరెవరికి ఆకర్షణ ఉందో అక్కడ మోహం
ఉంది. అదంతా శృంగారమే. మోహం యొక్క భావం ముఖ్యం - తన్మయ
మవడం. ఆ కాలంనాటి కవులే శృంగారమయంది.

నా రచనల్లో philosophy సిద్ధాంతం. నాయికా నాయకుల ప్రసక్తిలో
మిథునానురాగం ఉన్నా అన్యోన్య ప్రీతే ఉన్నది కాని మిగిలిన కార్య
రూపం లేదు. "ప్రీతిరేవ రసః" అన్నారు భోజుడు. అట్లాంటి
సమాజం రావాలి. ప్రీతి ఉంది, సిద్ధాంతంలో ఉంది, కార్యరూపంగా లేదు.

8-7-81

5:15 PM.

నేను అద్వైతిని కాను. Darwin theory చూశాను. స్త్రీ పురుష
జంతువులు రెండూ ఒకదాన్లోనే ఉన్నాయి. కాని ఆ రెంటిలో ఏ
జంతువు పైనుంది ఏ జంతువు లోపల ఉంది అంటే స్త్రీలో
పురుషుడా, పురుషునిలో స్త్రీయా? అని నా ప్రశ్న. స్త్రీ గర్భంలో
పురుషుడు సర్వసాధారణం. లలితా సహస్రనామాల్లో 'పూర్వజా
త్రిపురాంబికా' అని నామం. అంటే ఈశ్వరుడి కన్నా లలిత
ముందు పుట్టింది అని నేను తీసుకున్నా. క్షేత్రానికే ప్రాముఖ్యం.
క్షేత్రం లేనిదే విత్తులవల్ల ఫలమేమిటి?.

ఈశావాస్యోపనిషత్తు గొప్పది. ఈశుడు పూర్ణంగా
ఉండవలసినవాడు - ఈ జగత్తు అని అర్థం. ఈశుడు - జగత్తు వేరు
కాదే ఆ మాటలో. ఒకడు ఉన్నాడు. ఉండడం లేదు. ఉన్నవాడు

వేరు అని అర్థం రాదే. కనుక ద్వైతం అయిపోయింది.
నాకు దేవుడు ఇష్టం కాదు. దేవత ఇష్టం. లలితా సహస్రనామం ప్రతి శుక్రవారం పారాయణ చేస్తా. లలిత శాంతమూర్తి. బలం అంతా స్త్రీది — అని ఒక సిద్ధాంతం ఉంది. బిడ్డని మోసేది స్త్రీ అని అంటుండేవాడు విశ్వేశ్వర భట్టాచార్య. కనుక మాతృగర్భానికి మాతృమూర్తికి గౌరవం ఎక్కువ ఉంటాయి.

నేను పిన్నిని గుర్తు పెట్టుకునే 'పిన్నీ పిట్టను పట్టరాదనుకు' అని వ్రాశాను.

తల్లిని వర్ణించేటప్పుడు అసభ్యంగా వర్ణించము కదా! 'బింబాక్షరం' అని నా భావ కవిత్వంలో వాడితే అది తప్పంటారు. తల్లి బిడ్డను ముద్దుపెట్టుకుంటుంది... బింబాలవంటి అధరాలతోనే. కనుక మాతృప్రాయంగా చెప్తా.

కొత్తిమీర పెంచుతారు. సువాసనతో లేతగా నిగనిగలాడుతూ ఉంటుంది. కాని అది నలిపితే చండాలం వాసన. కవిత ఇట్లాంటిది. దాన్ని చక్కగా handle చేయాలి. అర్థం చేసుకోవాలి. ఉత్తరరామచరిత్ర పాఠం మామయ్య బాగాచెప్పేవాడు. తిరుపతి వేంకటకవుల ప్రభావం ప్రకాశిస్తున్న రోజులవి. మామయ్య వాళ్ళ శిష్యుడు. ఆయన కూడా ఆశుకవిత్వం చెప్పేవాడు. నన్ను చెప్పమనేవాడు. వాళ్ళు సంస్థానాలన్నీ తిరిగినట్లు మామయ్య కూడా గురువుల లాగానే సంస్థానాలకు బయలుదేరాడు. నేనూ కూడా వెళ్ళా.

10-7-81
4 PM

కలశం ఆరాధనకు పెట్టేది. పవిత్రత ఉంది కలశ శబ్దంలో.

ఆ శబ్ద సంగతంలో మధు శబ్దానికి సుర అని అర్థం తీసుకో కూడదు. అమృతం అని భావించాలని.. ఆ పవిత్రార్థం పండితులు గ్రహిస్తారని- ఆ పేరు పెట్టా.

నాకు లలిత అనుగ్రహం వల్ల గొప్ప గురువులు దొరికారు- ఠాగూరూ, విధుశేఖర భట్టాచార్య.

కర్మ చెయ్యాలని ఈశావాస్యోపనిషత్తులో ఉంది. కుర్వన్నేవేహ కర్మాణి అని. కర్మ చెయ్యకపోతే ఎట్లా? మానవుడికి కర్మ అవసరం. జీవనార్థం కర్మ- అని వస్తుంది. Purity itself is జ్ఞానం. Purity అంటే ఎన్నిటినో అర్థం చేసుకోవాల్సి వస్తుంది. మనోవాక్కాయ కర్మల యందు ఏ కల్మషం అంటని శుద్ధ మార్గం ఏదో అది జ్ఞానమార్గం. అది అసంభవమైన విషయం. మనసు మనసే నిలవదే. శంకరుడే ఇన్ని చదివిన వాడే 'భక్తిరేవ గరీయసీ' అన్నాడు. భక్తి మార్గం కంటే ఇంకో మార్గం లేదు. అదే నా ఉద్దేశ్యం. భక్తి అంటే లక్ష్యం.... ఒకదాని మీదనే... రెండోది లేదు. ఇవన్నీ ఏవీ లేని శూన్యమార్గం జ్ఞానమార్గం.

ఏది భక్తియో అది మధురం. ఎక్కడ భక్తి ఉంటుందో..... అక్కడ మధురం ఉండితీరుతుంది. మధురభక్తి ఏమిటి? భక్తే మధురం అని నా ఉద్దేశ్యం.

వేదం చదివేవాళ్ళు ముందు చదువుతారు.

పూర్ణమదః పూర్ణమిదమ్ పూర్ణాత్ పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.

నే తెలుగు చేశా దీన్ని.

నేననుకున్న ప్రేమ శబ్దానికి సరిపోయింది పూర్ణ శబ్దం.

ప్రేమంబధి ప్రేమంబిధి

ప్రేమయందె దీపించెను ప్రేమము

ప్రేమము నుండియె ప్రేమ తెల్పితిమి.

తరుగదు విరుగదు తత్ప్రేమార్థము.

ప్రేమంబధి - భగవంతుని ప్రేమ. ప్రేమంబిధి - ఇది మానవుల ప్రేమ. అని తెలుగుచేసి పిల్లకి వినిపించాను. ప్రేమే భక్తిరా - అని నేననుకున్నాను. పాలసముద్రంలాంటి తెల్పింది. పాలే అవుతాయి. పూర్ణమూ ప్రేమ ఒకటనే నేను భావించాను.

కృష్ణుడు వ్యభిచరించాడా అని అందరికీ సందేహమే ఉంది. అందుకే రూపసనాతనం గ్రాశా. [బ్రహ్మం] .... నిరుపాధికం, నిర్వికల్పం, నిరంజనం అని వాళ్లంతా అనవే.... సత్యం బ్రహ్మం అనవే... నేను ప్రేమంటాను. ప్రియమయినది. ప్రియతమమయినది..... అన్నీ తీపే. తేనె, చక్కెర, పళ్లరసం ఇవన్నింట్లో మాధుర్యానికి తారతమ్యం చెప్పొచ్చు. తీపుంది. తర్కించవచ్చు. ప్రేమను తర్కించడానికి వీలులేదు. ప్రేమను భక్తి, భర్త, గురువు లాంటి విశేషణాలు చేర్చొచ్చు. ప్రేమ మాధుర్యం మారదు. ప్రేమమే నిలుస్తుంది. 'ప్రేమమేవావశిష్యతే'. పిల్ల కన్న ప్రేమ కన్న పెంచిన ప్రేమ... .... కన్నుల కన్న ప్రేమ గొప్పదే అనేది.

ఉపదేశం చేసిన గురువును 'సుందరకాండ'లో చెప్పా 'ధ్యానించును బ్రహ్మ సంతతియుతిని' అని.

నేను ఎక్కడా ఎవరినీ తప్పులు పట్టలేదు. దూషించలేదు. మనకు తెలియనిది ఉండవచ్చునని అనుకున్నాను. నేను ఏ విమర్శకూ సమాధానం చెప్పను.

<u>రాయప్రోలు వారు చెప్పిన కొన్ని అముద్రిత పద్యాలు.</u>

కన్నె కామ్య లతికలు పుష్పించె ర
సీభవించె శుచి శృంగారమై చరా
చరములు రాగిలెను తరుణా
పేక్షలు పులకించెను ప్రేముడి కుమ్మరాలు కాన.

--శుచి రుజ్జ్వలః' అని అమరం.

'తామరసములయ్యె భువిని తామరసంబుల్' అని సమస్య ఇచ్చారు. ఒకసారి. ఇది నేను అవధానాలు చేసినప్పటి పద్యం ఇది. ఇప్పుడు గుర్తొస్తుంది.

సోముని షోడశ కళలును
కాముని పుష్పాస్త్ర పంచకము నవకమ్ముల్
భామల ముఖ నేత్రములంగని
తామరసములయ్యె భువిని తామరసంబుల్.

తల్లీ బిడ్డల లోన లీనమగు వాత్సల్యంబు మైత్రీ నరల్
మల్లీ పుష్ప సుగంధమో సఖుల జన్మ స్నేహ సారంబు యా
వల్లీకప్రియ ధర్మమైన నర దాంపత్య ప్రమేయంబు వ
ర్తిల్లన్ ప్రేమ రసామృతార్ణవము పూరింపంగ రేలుంబవల్.

చెలియా ఎన్నడొ చేరదీసె మనలం స్నేహ ప్రవేశంబు ను
త్కలమై యుండు ఎరుంగవైతిమపుడే ఘోషన్ రవంతేని కం
దళితంబైన వయో వసంతమున చిత్తం బిప్పుడుల్లాడెడిన్
చల కల్లోల చపేట భిన్నమగు కింజల్కంబు చందంబునన్.

ఇది original version. అప్పుడు చిన్నవాడిని. మార్చమంటే భయంతో మార్చాను.

ప్రేమంబది ప్రేమంబిది
ప్రేమయందె దీపించెను ప్రేమము
ప్రేమము నుండియె ప్రేమ తెల్పుతిమి
తరుగదు విరుగదు తత్ప్రేమమార్గము.

---- ఆ ---- మామూలుగా చెప్పే ఆ ప్రేమ- అదే అమలిన శృంగారం. మలినమగుటను అవకాశం లేని ప్రేమను అమలిన ప్రేమ. ----ఎప్పుడూ మలినం కాదు. ఇది దాని ఆకాంక్షితం.

---

పరిశోధనకు గ్రహించిన రాయప్రోలువారి రచనలు.

1. లలిత
2. తృణకంకణము
3. కష్టకమల
4. స్నేహలత
5. తెనుగుతోట
6. అనుమతి (1910)
7. స్వప్నకుమారం (1956) Sixth Edition
8. ఆంధ్రావళి (1972) M. శేషాచలం అండ్ కో
9. జడకుచ్చులు (1972) M. శేషాచలం అండ్ కో
10. రమ్యాలోకం
11. వనమాల
12. మాధురీదర్శనం (1956) ద్వితీయ ముద్రణం
13. కన్నెపాటలు
14. రూపనవనీతం (1953)
15. మిశ్రమంజరి (1963)

## ఉపకరించిన గ్రంథాలు, పత్రికలు

**తెలుగు:**

1 ఆంధ్రసాహిత్య చరిత్ర - గోపరాజు సాంబశివరావు; నవజీవన్ బుక్ లింక్స్, విజయవాడ; 1968

2 ఆంధ్ర ఛందస్సాలోకము - వేదాల తిరువెంగళాచార్యులు ఆంధ్రసాహిత్యపరిషత్తు - హైదరాబాదు, 1950

3 ఆంధ్ర పౌరుషము - విశ్వనాథ సత్యనారాయణ కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్ - రాజమండ్రి - 1952

4 ఆంధ్ర ప్రతాపరుద్రీయము - జమ్ములమడక మాధవరామశర్మ నవ్యసాహిత్యపరిషత్తు - గుంటూరు, 1946

5 ఆంధ్రప్రదేశ్ దర్శిని, సంపాదకులు: Y. V. కృష్ణారావు, ఏటుకూరి బలరామమూర్తి, 1976

6 ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యుల ప్రశంస దివాకర్ల వేంకటావధాని - A.P సాహిత్య అకాడమీ 1972

7 ఆంధ్ర మహాభారతము - సంశోధిత ముద్రణము ఉస్మానియా విశ్వవిద్యాలయము - తెలుగుశాఖ.

8 ఆంధ్ర రచయితలు - మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి అద్దేపల్లి & కో, రాజమహేంద్రవరము, రెండవ ముద్రణ, 1973.

9 ఆంధ్ర సారస్వత పరిషత్తు రజతోత్సవ సంచిక - 1976

10 ఆంధ్ర సారస్వత వ్యాసావళి - ఆంధ్ర శేషగిరి రావు ప్రథమ ముద్రణ - 1952

11 ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి - ఖండవల్లి లక్ష్మీరంజనం, ఖండవల్లి బాలేందుశేఖరం.

బాలసరస్వతీ బుక్ డిపో, మద్రాసు, నాల్గవ ముద్రణ, 1974.

12 ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి

13 ఆధునిక కవిత అభిప్రాయవేదిక - కిన్నెర పబ్లికేషన్స్, హైదరాబాదు
1981

14 ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ - సాంప్రదాయిక రీతి
డా॥ కోవెల సంపత్కుమారాచార్య, ఫిబ్రవరి 1981

15 ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు, ప్రయోగములు
డా॥ సి. నారాయణరెడ్డి, రెండవ ముద్రణ, 1977

16 ఆణిముత్యాలు - వేటూరి రాధాకృష్ణమూర్తి
M. శేషాచలం & కో 1963

17 ఉషఃకిరణాలు - యండమూరి సత్యనారాయణరావు
ఉత్తమ సాహితి, విజయవాడ, ఆగష్టు 1960

18 ఉస్మానియా విశ్వవిద్యాలయం వజ్రోత్సవ సంచిక
తెలుగు విభాగము, 1918 - 78

19 కర్మయోగము; శ్రీ వివేకానంద ప్రవచనము
అనువాదకులు: శ్రీ చిరంతనానంద స్వామి
శ్రీ రామకృష్ణ మఠము, మద్రాసు

20 కవికోకిల దువ్వూరి రామిరెడ్డి జీవితమూ - సాహిత్యమూ
K.V. రమణారెడ్డి 1965

21 కవికోకిల దువ్వూరి రామిరెడ్డి డైరీ - ఉత్తరాలు
K.V. రమణారెడ్డి 1961

22 కవికోకిల గ్రంథావళి - 4 వ్యాసములు
దువ్వూరి రామిరెడ్డి, కవికోకిల గ్రంథమాల, 5వ ముద్రణ - 1959

23 కవిత్వతత్త్వవిచారము : కట్టమంచి రామలింగారెడ్డి, 1947.

24 కవిసేన మేనిఫెస్టో : గుంటూరు శేషేంద్రశర్మ
ఇండియన్ లాంగ్వేజస్ ఫోరమ్, 1977

25. కాళిదాస హృదయము : ఘంటవిల్లి సూర్యనారాయణ శాస్త్రి
జూన్ 1966.

26 కావ్యకుసుమావళి - వేంకట పార్వతీశ్వర కవులు
ఆంధ్ర ప్రచారిణీ లిమిటెడ్, కాకినాడ.

27 కావ్యానందము - విశ్వనాథ సత్యనారాయణ
అరవింద ప్రచురణలు - విజయవాడ, మార్చి, 1972

28 కావ్యాలంకార సంగ్రహము - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి
M. శేషాచలం అండ్ కంపెనీ, 5వ ముద్రణ 1976

29 కృష్ణపక్షము ; కృష్ణశాస్త్రి - దేవులపల్లి సన్మాన సంఘం, మద్రాసు
Golden Jubilee Edition, జనవరి 1975

30 కోలవెన్ను వారి జీవితానుభవాలు - అక్కిరాజు రమాపతిరావు
సాహితీ ప్రచురణలు

31 గుంటూరు సీమ - ఉత్తర భాగము - తిరుపతి వేంకటకవులు
మొదటి కూర్పు - 1914.

32 చైతన్యలహరి - ఉపన్యాస మంజరి.
యువభారతి - సికింద్రాబాదు, ఆగష్టు - 6, 1972

33 జగద్గురు బోధలు, 1-9 సంపుటాలు
సాధన గ్రంథమండలి - తెనాలి.

34 జాతీయగీతాలు - సంపాదకుడు : గురజాడ రాఘవశర్మ
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1978

జేగంటలు - G.V. కృష్ణారావు

ప్రజా ప్రచురణలు - ఏలూరు, ఫిబ్రవరి 1968

36 తత్త్వశాస్త్రము సామాన్య విశేచనము : Dr నారాయణ్ కరణ్ కర్

రెడ్డి & N. ఇన్నయ్య

తెలుగు అకాడమి, హైదరాబాదు, 1971

37 తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు

డా॥ వేటూరి ఆనందమూర్తి.

38 తాళ్ళపాక కవుల పదకవితలు - భాషా విశేషాలు

డా॥ వేటూరి ఆనందమూర్తి

39 తిక్కన భారత దర్శనము : నండూరి రామకృష్ణమాచార్య

ప్రచురణ - వేదవ్యాస చక్రవర్తి, రెండవ ముద్రణ 1977

40 తిక్కన పారిహారసాక్ష్య తత్త్వము - డా॥ కేతవరపు వేంకటరామకోటి

శాస్త్రి - గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ - 2

ప్రథమ ముద్రణ. డిసెంబరు, 1976.

41 తిరుప్పావై, తిరువెంబావై : ఆంధ్రానువాదములు - శ్రీ సుదర్శనాచార్య

శిరోమణి - తిరుపతి తిరుమల దేవస్థానములు, తిరుపతి - 1957

42 తెలుగు కవిత - సాంఘిక సిద్ధాంతాలు - ముదిగొండ వీరభద్రయ్య

ప్రచురణ - శ్రీ అరవింద సొసైటీ, హన్మకొండ శాఖ, 1980

43 తెలుగు వ్యాసదర్శనము : ఆంగ్లకర్త - అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి

44 తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము

డా॥ K. గోపాలకృష్ణరావు, జనవరి, 1968

45 తెలుగులో కవితా విప్లవాల స్వరూపం

డా॥ వెల్చేరు నారాయణరావు, 1978

46 తెలుగు వాణి - (వ్యాస సంకలనం) - ప్రపంచ తెలుగు మహాసభల

ప్రత్యేక సంచిక, ఉగాది, 1975.

47 తెలుగు వెలుగు - పెనుమాకు వేంకట శేషయ్య, నవంబరు, 1965

48 తెలుగు వైతాళికులు - ఉపన్యాసాల సంపుటి.

A.P. సాహిత్య అకాడమీ, 1977.

49 తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము

డా॥ కొత్తపల్లి వీరభద్రరావు, 1960.

50 తెలుగు సాహిత్య వికాసం (1900 - 1947 సంవత్సరాల మధ్య)

సంపాదకుడు: K.K. రంగనాథాచార్యులు

ఆంధ్ర సారస్వత పరిషత్తు - హైదరాబాదు, 1979.

51 తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము

దేవులపల్లి రామానుజరావు, 1972.

52. దక్షిణ దేశ భాషా సారస్వతములు - దేశి

కోరాడ రామకృష్ణయ్య - కోరాడ ప్రచురణాలయము - మద్రాసు

1954.

53 దీపావళి - వేదుల సత్యనారాయణ శాస్త్రి.

M. శేషాచలం అండ్ కో, ఆగష్టు 1974.

54 నన్నయ కవిత్వము, అక్షరరమ్యత; డా॥ V.V.L. నరసింహారావు

అక్టోబరు, 1977.

55 నవరసగంగాధరము: జమ్ములమడక మాధవరామశర్మ

నవ్యసాహిత్య పరిషత్తు - గుంటూరు. జులై - 1942.

56 నవోదయ లహరి: (వ్యాస సంకలనం) యువభారతి

సికింద్రాబాదు, 1977.

57 నవ్యాంధ్ర సాహిత్య వీథులు : కురుగంటి సీతారామయ్య, పిల్లలమర్రి హనుమంతరావు, 1942.

58 నాట్యవేదము : జమ్ములమడక మాధవరామశర్మ
శాలివాహన శకము, 1879.

59 నానారాజ సందర్శనము : తిరుపతి వేంకట కవులు
ద్వితీయ ముద్రణ, 1957.

60 నాయని సుబ్బారావు కృతులు - అజంతా ప్రింటర్స్, సికింద్రాబాదు
ప్రథమ ముద్రణము, 1958

61 నారదభక్తి సూత్రములు : అనువాదకులు - డాక్టర్ వేంకటరామరెడ్డి
శ్రీరామకృష్ణమఠము, మైలాపూరు, మద్రాసు.
ద్వితీయ ముద్రణము, 1971.

62 నా స్మృతిపథంలో : ఆచంట జానకిరామ్
దేశి కవితామండలి - విజయవాడ, శార్వరి, 1960

63 నిగూఢవేదరహస్యము - శ్రీ అరవింద దర్శనము
అనువాదకులు : శ్రీ వఝల వేంకట రామశాస్త్రి, శ్రీ శ్రీరామ కవచం
వేంకటేశ్వర శాస్త్రి.
ప్రేమ్ చంద్ పబ్లికేషన్స్, విజయవాడ, 1968.

64 నేటికాలపు కవిత్వము : అక్కిరాజు ఉమాకాన్త పండితులు, 1928

65 పచ్చతోరణము - దేవులపల్లి రామానుజరావు.

66 పానశాల : దువ్వూరి రామిరెడ్డి
కవికోకిల గ్రంథావళి - పెమ్మారెడ్డి పాళెం, ఆరవ ముద్రణ
జనవరి, 1958.

67 పోతనకృత శ్రీమదాంధ్రమహాభాగవతానుశీలనము,

డా॥ ధూళిపాళ శ్రీరామమూర్తి.

68 ప్రజాకవి వేమన. డా॥ ఎన్. గోపి, చైతన్యప్రచురణలు, 1980.

69 ప్రబంధములలో ప్రకృతివర్ణనలు, డా॥ ఉంతటి నరసింహం

డిసెంబరు, 1979.

70 ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్ర చరిత్ర: (ప్రథమ, ద్వితీయ సంపుటములు)

అనువాదము: పరిపెల్లి విశ్వనాథశాస్త్రి, ఆంధ్రసారస్వతపరిషత్తు

1961, 1962.

71 ప్రాక్పశ్చిమ పవిత్రాంగనలు: (శ్రీ శారదాదేవి శతవార్షిక జయంతి

స్మృతి గ్రంథము) - స్వామి ఘనానంద & సర్ జాన్ స్టీవర్టు వాలేస్;

అక్షేపల్లి అండ్ కో, (నేషనల్ బుక్ ట్రస్ట్ గ్రంథము), ఫిబ్రవరి 1969.

72 బసవపురాణము - మహాకవి శ్రీ పాలకురికి సోమనాథకవి ప్రణీతము

శ్రీ బండారు తమ్మయ్యగారిచే పరిష్కృతము;

వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ 1966

73 బాలవితంతు విలాపము - మంగిపూడి వెంకటశర్మ, 1929.

74 భారతీ నిరుక్తి (వేదస్వరూప వర్ణనము), హరి సోదరులు

సాధన గ్రంథమండలి, తెనాలి; శుక్రవారము, 6 ఆగష్టు, 1971

75 భారతీయ పునరుజ్జీవనము: వి. రామలింగము

యువభారతి, సికింద్రాబాదు, 17th మార్చి, 1980.

76 భావప్రకాశనము: శారదాతనయ, జమ్ములమడక మాధవరామశర్మ

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి, ఏప్రిల్, 1973

77 మందారమకరందాలు: యువభారతి, సికింద్రాబాదు.

78 మహతి - వ్యాససంపుటి - యువభారతి, సికింద్రాబాదు, 1976.

79 మహాభారతము - మహిళ; జకాలు వెంకట రమణారావు, ఫిబ్రవరి, 1979.

80 మహోదయం: K.V. రమణారెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజయవాడ, మే, 1969.

81 మీరాబాయి: ఉషా. ఎస్. నిల్సన్ (ఆంగ్లమూలం)
ఆంధ్రీకరణం: డా॥ C. నారాయణరెడ్డి
సాహిత్య అకాడమీ - న్యూఢిల్లీ, 1972.

82 యోగసమన్వయము: అరవిందులు, సంపుటి I
అనువాదము: కమలాకర వేంకటరావు, కృష్ణా పబ్లికేషన్స్
పాండిచ్చేరి Feb 21, 1978.

83 రవీంద్ర వ్యాసావళి, అనువాదం: రాయప్రోలు సుబ్బారావు
సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ, 1962.

84 రాయప్రోలు సాహిత్య సందర్శనము (వ్యాస సంపుటి)
వంశీ ఆర్ట్సు థియేటర్స్, హైదరాబాదు, 1980.

85 లక్షణ శిరోమణి: పొత్తపి వేంకటరమణకవి ప్రణీతము
రావూరి దొరసామి శర్మ; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
ప్రథమ ముద్రణ, 1979.

86 లక్ష్మీరంజన వ్యాసావళి: ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం
రెండవ ముద్రణ, 1970.

87 లోవెలుగులు: ముట్నూరి కృష్ణారావు, ఆర్యశ్రీ ప్రచురణాలయం.
మద్రాసు - 14.

88 వంగసాహిత్య చరిత్ర: సుకుమార్ సేన్ (ఆంగ్లమూలం)
అనువాదం: కొత్తపల్లి వీరభద్రరావు, సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ
ప్రథమ ముద్రణ, 1972.

89 వాఙ్మయ వ్యాసమంజరి : వేలటూరి వేంకట రమణయ్య
ఆంధ్ర సారస్వత పరిషత్తు, ప్రథమ ముద్రణ, 1967.

90 విజ్ఞానసర్వస్వము : తెలుగు భాషా సమితి 1959-1961

91 విమర్శిని; పరిశోధన పత్రికలు 1; 4
కాకతీయ విశ్వవిద్యాలయము, వరంగల్లు, 1976, 1979.

92 వీరేశలింగం పంతులు - సమగ్ర పరిశీలన
డా॥ అక్కిరాజు రమాపతిరావు, విశాలాంధ్ర ప్రచురణాలయం
జూన్, 1972.

93 వైతాళికులు : సంపాదకుడు, ముద్దుకృష్ణ
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 9వ ముద్రణ, 1978.

94 వైదికమత చరిత్ర : గోపరాజు వైకుంఠరావు. మొదటి కూర్పు.
1936.

95 వ్యాసక్రీడలు : శ్రీశ్రీ. నవోదయ పబ్లిషర్స్, విజయవాడ
ప్రథమ ముద్రణ, జనవరి, 1973.

96 వ్యాసమంజూష : దేవులపల్లి రామానుజరావు, 1956.

97 వ్యాసవింశతి : కృత్తివాస తీర్థులు
సంపాదకుడు : తల్లావజ్ఝల పతంజలి, 1970.

98 వ్యాసావళి : ఆవంత్స వేంకట రంగారావు, 1968.

99 శారదా విపంచి : (మన సంస్కృతి - మన సాహితి) వ్యాససంపుటి
సంపాదకుడు : ఆచార్య ఎస్.వి. జోగారావు
రచయితల సహకార సంఘము, గుంటూరు, 1973.

100 శివతత్త్వసారము : మల్లికార్జున పండిత ప్రణీతము
కృష్ణా పత్రికా కార్యాలయము. హైదరాబాదు, 1968.

101 శ్రీ అరవిందుని పురుషోత్తమ తత్త్వము : శ్రీ వేటూరి శివరామశాస్త్రి
సాధన గ్రంథమండలి, తెనాలి, నవంబరు 24, 1967.

102 శ్రీ అరవిందుల సందేశము - వారి ఆశ్రమము
అనువాదకులు: శ్రీ గరియారం వేంకట శేషశాస్త్రిగారు
పాండ్రుటూరు శ్రీ అరవిందాశ్రమ తెలుగు ప్రచురణశాఖ, 21-2-1954.

103 శ్రీ అరవిందులు అతిమానసిక అవతారమూర్తి
సంపాదకులు : V. మన్ మోహన్ రెడ్డి, శ్రీ అరవింద శతజయంతి
సంపుటము, ఆగష్టు, 15, 1972.
Institute of Human studies, Hyderabad-7

104 శ్రీ పండితారాధ్య చరిత్ర : పాల్కురికి సోమనాథకవి ప్రణీతము
పరిష్కర్త: డా|| చిలుకూరి నారాయణరావు
ఆంధ్ర గ్రంథమాల - 1939.

105 శ్రీమద్భాగవత ప్రకాశము : ఎక్కిరాల కృష్ణమాచార్య
World teacher trust, 1977.

106 శ్రీ మహాభాగవతము : బమ్మెర పోతన
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, జనవరి, 1977.

107 శ్రీమాత. శతజయంతి సంపుటము; సంపాదకులు V. మన్మోహన్
రెడ్డి & G. సత్యనారాయణ
Institute of Human Studies 21-2-1978.

108 శ్రీ లలితారహస్యనామ సహస్ర గూఢార్థదీపిక
రాచకొండ వేంకట నాగేశ్వరరావు: ప్రకాశకులు : గ్రంథకర్త; 1972.

109 శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సంపూర్ణ చరిత్ర - జవంగుల నాగ
భూషణ శర్మ, ప్రకాశకులు : జవంగుల నాగభూషణదాసు సన్స్.

సత్తెనపల్లి, గుంటూరు జిల్లా, 1979.

110 శ్రీ వీరేశలింగయుగము (19వ శతాబ్ది ఆంధ్రవాఙ్మయ చరిత్రము)
కల్లూరు వేంకట నారాయణరావు 1965.

111 శ్రీశ్రీ సాహిత్యం: కూర్పరి - K.V. రమణారెడ్డి
శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సంఘం, 2, జనవరి, 1970.

112 సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము - సంగ్రహ ఆంధ్ర విజ్ఞానకోశ సమితి
హైదరాబాదు, 1970.

113 సరస్వతీ సామ్రాజ్యమ్ - అయ్యంకి వేంకటరమణయ్య సన్మాన
సంచిక, ప్రకాశకులు: టేకుమళ్ళ రామచంద్రరావు.

114 సర్పయాగం: రెంటాల గోపాలకృష్ణ
నవోదయ పబ్లిషర్సు, విజయవాడ, ఫిబ్రవరి, 1957.

115 సాగుతున్న యాత్ర: ఆచంట జానకిరామ్, ఆదర్శగ్రంథమండలి
విజయవాడ, 1963

116 సారస్వత నవనీతమ్: దేవులపల్లి రామానుజరావు
ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, నాల్గవ ముద్రణ, 1955.

117 సారస్వత మూర్తులు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1969.

118 సారస్వతవ్యాసముక్తావళి: డా|| బూర్గుల రామకృష్ణరావు
ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, దుర్ముఖి నామ సంవత్సరం.

119 సారస్వత వ్యాసములు: సంపుటములు 1-4
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1969-71

120 సాహితీసమితి రజతోత్సవ సంచిక, డిసెంబరు, 1946

121 సాహిత్యంలో దృక్పథాలు: R.S. సుదర్శనం - జనవరి 1968

122 సాహిత్యదర్శనము : K.V.R నరసింహం. క్వాలిటీ పబ్లిషర్స్ విజయవాడ.

123 సాహిత్యపరిచయం (1875-1975); ఇంద్రగంటి శ్రీకాంతశర్మ నవోదయ పబ్లిషర్స్, విజయవాడ-2, 1978.

124 సాహిత్యవివేచన : మద్దూరి సుబ్బారెడ్డి, ఏప్రిల్ 1974

125 సాహిత్య శిల్పసమీక్ష : పింగళి లక్ష్మీకాంతం, 1976 మాధవి బుక్ సెంటర్, హైదరాబాదు.

126. సాహిత్యసంపద : ప్రథమభాగము - పిల్లలమర్రి హనుమంతరావు శారదాపీఠము, గుంటూరు. మే, 1949.

పత్రికలు:

1. అభ్యుదయ.

2 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు.

3. ఆంధ్రప్రభ, దినపత్రికలు.

4 ఆంధ్రభూమి (మాసపత్రిక).

5 కిన్నెర.

6 కృష్ణాపత్రిక.

7 జయంతి.

8 తెలుగు..

9 నందిని.

10 నవభారతి.

11 ప్రతిభ.

12 భారతి.

13 సాహితి.

<u>సంస్కృతం</u>

1 అభిజ్ఞాన శాకుంతలం - కాళిదాసు

2 అమరకోశం - అమరసింహుడు

3 ఈశావాస్యోపనిషత్తు

4 ఉత్తరరామచరిత - భవభూతి

5 ఋగ్వేదం

6 కుమారసంభవం - కాళిదాసు

7 కేనోపనిషత్తు

8 గీతగోవిందం - జయదేవుడు

9 ఛాందోగ్యోపనిషత్తు

10 తైత్తిరీయోపనిషత్తు

11 బృహదారణ్యకోపనిషత్తు

12 భగవద్గీత

13 మనుసంహిత

14 మాళవికాగ్నిమిత్రము - కాళిదాసు

15 మేఘసందేశం - కాళిదాసు

16 రఘువంశం - కాళిదాసు

17 శంకరగ్రంథరత్నావళి - శంకరాచార్యులు

18 శ్రీమహాభారతం - వ్యాస మహర్షి

English.

1 A critical survey of Indian Philosophy. Dr Chandradhar Sharma. Pub Motilal Banarsidass, 1976.

2 A source book in Indian Philosophy. S. Radhakrishnan and Charles A. Moore Princeton - New Jersey - 1973.

3 Current scene of Telugu literature Kavisena - Narasaraopet.

4 Early history of the Vaisnava Faith and Movement in Bengal - S.K. De Pub K.L. Mukhopadhyay, Calcutta, Second Edition, Dec - 1961.

5 East and West in Religion - S. Radhakrishnan George Allen & Unwin Ltd London, Fourth impression, 1958.

6 Eastern Religions and Western thought. S. Radhakrishnan. Oxford University Press Third Impression, 1977.

7 Encyclopaedia of Philosophy Vol 5 & 6 Collier MacMillan Publishers. London Reprint edition - 1972.

8 English critical Essays - Nineteenth century. Jones, Edmund.D, Oxford University Press. London, 1971.

9 English Romantic Poets. Edited by M.H. Abrams Edition 1974.

10 Essays in criticism and Comparative Poetics - K. Viswanatham. Andhra University Press, Waltair, 1977.

11 John Keats - The complete Poems. Edited by John Barnard. Penguin Education 1973.

12 Literature and Philosophy, Richard Kuhns, Routledge & Kegan Paul. London 1971

13 Sanskrit Poetics - S.K. De: Firma K.L. Mukhopadhyay - calcutta, Second Edition 1960

14 Some Problems of Sanskrit Poetics, S.K.De Firma K.L. Mukhopadhyay, calcutta, 1959.

15 Sri Aurobindo - Navajata, National book trust of India, Revised Edition, Dec 1976

16 Starlit Dome. (studies in the Poetry of Vision). Wilson Knight. Methuen & Co Ltd 1968

17 The Abhijnana Sakuntalam of Kalidasa

Edited By M.R. Kale. Motilal Banarsidass. Delhi, Tenth Edition 1977

18 The New Encyclopaedia Britania 15th Edition, Chicago, Helen Hemingway Benton 1977.

19. The Number of Rasas By V. Raghavan 1940

20 The Mother: By Aurobindo Sri Aurobindo birth centenary, Library Vol 25, Sri Aurobindo Ashram, Pondicherry 1972

21 The Romantic Agony; Mario Praz, Translated By Angus Davidson, Oxford University Press 1933.

22 The Romantic Imagination, C.M. Bowra. Oxford University Press, London 8th Edition 1978.

23 The Symposium, Plato - Walter Hamilton (translator), Penguin Books, 1975

24 Twentieth century literary criticism; a reader. Edited By David Lodge Second Edition - Longman - London 1975.

25 Wordsworth - Walter Raleigh Edward Arnold & Co - London; Twelfth Impression 1939.